TIGHT BINDING BOOK

UNIVERSAL
LIBRARY

OU_204040

UNIVERSAL
LIBRARY

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T927/L19S Accession No. T444

Author చక్రవర్తుల వేంకటేశ్వరరావు.

Title శివాజీ చరిత్ర 1944

This book should be returned on or before the date last marked

స్వీయ చరిత్రము

కళాప్రపూర్ణ
చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు

●

సంపాదకులు
ఆంధ్ర రాష్ట్ర
అభ్యుదయ రచయితల సంఘం

●

ప్రజాశక్తి కార్యాలయం
::బెజవాడ::

ప్రచురణ నెం. 94

Checked 1965

మూడు రూపాయలు

ప్రకాశ శక్తి ప్రెస్, బెజవాడ.

పరిచయం

"కళాప్రపూర్ణ" చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు తెలుగుసాహిత్యానికి, సంఘ సంస్కరణోద్యమానికి, నాట్యరంగానికి చేసినసేవ అపారం. ఆంధ్రప్రజల అభ్యుదయానికి తోడ్పడే అనేక గ్రంథాలను వారు రచించారు. "కళాప్రపూర్ణ"నిచే వ్రాయబడిన 'గయోపాఖ్యాన' నాటకం ప్రజారంజకమై మరియేయితర తెలుగుగ్రంథం ఖర్చుకానన్ని యెక్కువప్రతులు — సుమారు లక్షదాకా — ఖర్చుపడింది. వారు రచించిన 'రాజస్థానకథావళి', 'మహాపురుషుల జీవితాలు' వంటి గ్రంథాలు తెలుగునాటి యువకులలో దేశభక్తి, ఉత్సాహాలను రేకెత్తించి, జాతీయోద్యమానికి విశేషంగా దోహదం చేశాయి. కీర్తిశేషులైన కందుకూరి వీరేశలింగంగారు ప్రారంభించిన సంఘసంస్కరణోద్యమానికి, లక్ష్మీనరసింహంగారు సహాయంగా నిలబడి, హితకారిణీ సమాజ అధ్యక్షులుగా ఎంతోకాలం సేవచేశారు. గాంధీజీ భారత రాజకీయరంగంలోకి రాకముందే "కళాప్రపూర్ణుడు" హరిజన బాలురకు చదువు చెప్పేందుకు 'రామమోహనపాఠశాలను' నడిపారంటే, వారి సంస్కారాభిమానం ఎంత గాఢమయిందో మనకు విదితమవుతుంది.

ఒకమాటలో చెప్పాలంటే, లక్ష్మీనరసింహంగారు ఆంధ్ర ప్రజాభ్యుదయానికి కృషిచేసిన మహాపురుషులలో ఒకరు. వారి స్వీయచరిత్రమును ప్రకటించడానికి తోడ్పడగలిగినందులకు "ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘము" ఎంతో గర్వపడుతూంది.

కళాప్రపూర్ణుని జీవితగాథ చదువుతూంటే, యీనాడు ప్రజాసేవకు పూనుకొని పనిచేస్తున్నవారందరికి ఉద్వేగం కలుగుతుంది. అర్ధశతాబ్దానికి పూర్వం ఆ రోజులలో, తెలుగుభూమిలో ప్రజల విజ్ఞానాభివృద్ధికి విత్తులు నాటిన మహనీయులు ఎన్నికష్టాల నెదుర్కొవలసి వచ్చిందో మనకు బోధపడుతుంది. వారు ఏర్పరచిన సత్సాంప్రదాయాలను జీర్ణంచేసికొని, తెలుగుసాహిత్య ఉద్యానవనాన్ని పెంపొందించవలసిన బాధ్యత సాహిత్య

సేవకులందరిపైనవుంది. లక్ష్మీనరసింహంగారి 'స్వీయచరిత్రము' గత 50 యేండ్ల ఆంధ్రప్రజావుద్యమాన్ని ప్రతిబింబించుతూంది చదువుతూంటే, ఆ రోజులలోని సమాజ పరిస్థితులు బోధపడతాయి. మనం నేర్చుకోవలసిన గుణపాఠాలు, అనుభవాలు ఎన్నో కన్పించుతాయి.

ఈ సందర్భంలో మే మొక విషయం స్పష్టపరచవలసివుంది. అభ్యుదయ రచయితల సంఘము వ్యవహారికభాషలో గ్రంథరచన జరగాలని నమ్ముతూంది. ప్రజాసామాన్యానికి విద్య సులభంగా నేర్పడానికి వ్యవ హారికభాష అవుసరమని చెప్పిన స్వర్గీయ గిడుగు రామమూ ర్తిపంతులు గారి ఆశయాన్ని బలపరుస్తూంది. ఆంధ్రాభ్యుదయానికి పునాదివేసిన స్వర్గీయ కందుకూరి వీరేశలింగం పంతులుగారు, శ్రీ చిలకమ ర్తి లక్ష్మీ నరసింహంగారు సులభమైనశైలిలో గ్రంథాలువ్రాసి ప్రజలకెంతో సేవ చేశారు. కాని వారు గ్రాంథికభాషా వాదాన్ని బలపరచారు. ఆంధ్రవాఙ్మయ నిర్మాతలుగా వారికున్న పలుకుబడివల్లనే, విశ్వవిద్యాలయాలలో, పాఠశాల లలో గ్రాంథికభాషనే ఉపయోగించాలనే నిర్ణయానికి రావడానికి కారణ మయింది. కాని క్రమంగా వ్యవహారికభాషకే వ్యా ప్తిజరిగింది. దాదాపు పత్రికలన్నీ వ్యవహారికభాషనే విశేషంగా వాడుతున్నాయి. తరవాత వీరేశలింగంగారు వ్యవహారికభాషా వుద్యమానికి సానుభూతిచూపారు.

ఈపు స్తకంలోకూడ శ్రీ లక్ష్మీనరసింహంగారు గ్రాంథికభాషావాదనను సమర్థించుతూ వ్రాశారు. శ్రీ లక్ష్మీనరసింహంగారికి వినమ్రులవుతూ, మేము వ్యవహారిక భాషావాదులమనీ, వారి గ్రాంథికవాదానితో ఏకీభవించలేమనీ, విన్నవించుకుంటున్నాము. వీరేశలింగంగారి, లక్ష్మీనరసింహంగారి సులభ శైలి ప్రజాభ్యుదయానికి ఎలా తోడ్పడిందో గ్రహించుతూ, యింకో అడుగు ముందంజవేసి, ప్రజాసామాన్యానికి సులభంగా విజ్ఞానాభివృద్ధి చేకూర్చడా నికి వ్యవహారిక భాషా వాదాన్ని బలపరుచుతున్నామని స్పష్టపరుస్తున్నాము.

చిలకమ ర్తి లక్ష్మీనరసింహంగారు స్వీయచరిత్రను పూ ర్తిగా వ్రాశారని, అచ్చు వేయవలసివుందని మాకు తెలియగానే అందుకు

కృషిచేయ ప్రాసుకొన్నాము. ఈయుద్ధపురోజులలో కాగితపుకరువు పుస్తక ప్రకటనకు ఎంత ఆటంకంగా ఉన్నదో అందరు ఎరిగిన విషయమే. మేము కోరినంతనే "ప్రజాశక్తి ప్రచురణాలయం" వారు ఈ గ్రంథప్రచురణకు తమ సంసిద్ధత తెలిపారు. తమకున్న కాగితం 'కోటా'లో కొంతభాగం యిందుకు వినియోగించడానికి అంగీకరించారు. వారి సహాయంవలన వెంటనే ప్రకటించడం సాధ్యపడింది. అంతేగాదు, ఆంధ్రరాష్ట్ర అభ్యుదయ రచయితల మహాసభనాటికి ఈ పుస్తకాన్ని అందచేయ గలిగారు. ఇలా సాయపడినందులకు ప్రజాశక్తి ప్రచురణాలయం వారికి మా అభివందనాలు.

"స్వీయచరిత్రము" ప్రకటించడానికి మాకు అవకాశమిచ్చిన చిలకమర్తి లక్ష్మీనరసింహంగారికి మరొకసారి మా నమస్కృతులు.

బెజవాడ,
28-12-1944.

చదలవాడ పిచ్చయ్య,
కార్యదర్శి,
ఆంధ్రరాష్ట్ర అభ్యుదయరచయితల సంఘం.

అపతారిక

చరిత్రలు దేశాభ్యుదయమునకు తోడుపడును. కావున దేశచరిత్రలు మిక్కిలి యవశ్యములు. బహుపురుషుల చరిత్రలుగలసి దేశచరిత్రలగును. కాబట్టి జీవితచరిత్రలు మిక్కిలి యవశ్యములు. మహాపురుషుల చరిత్రములు శ్రద్ధతో వ్రాసినవారున్నపక్షమున యవి యువజనులకు నాదర్శములుగా నుండును. ఒకరి చరిత్రము మరియొకరు వ్రాసినపక్షమున వ్రాయవలసిన విషయములు సమగ్రముగా లభింపవు. అందుచేత నెవరి చరితము వారే వ్రాసుకొన్నపక్షమున విషయములన్నియు సంపూర్ణముగా నుదాహరింపుట కవకాశముండును.

కాని స్వీయచరిత్రములలో నొక లోపముండవచ్చును. పురుషుడు తన చరిత్రము వ్రాసుకొన్నపుడు తన యుత్తమగుణములనేగాని దుర్గుణములను వెల్లడింపడు. ఒకచరిత్ర మరియొకరు నిష్పక్షపాతముగా వ్రాయుట తటస్థించెనేని కథానాయకుని సుగుణములతోపాటు దుర్గుణములనుగూడ జిత్రింపును. స్వీయచరిత్రములు వ్రాసుకొన్నవారిలోగూడ కొందరు స్వీయలోపములను నిశ్శంకముగా వెల్లడింతురు. అట్టి మహనీయులు జగంబున నపుడుగ నుందురు. అట్టి మహనీయుడు గాంధి మహాత్ముడొక్కడే.

ఘనకార్యములుచేసిన మహాపురుషులు పరులకు మార్గదర్శకములుగా నుండుటకై తమ చరిత్రలు తప్పక వ్రాయవలయును. మహాత్మ గాంధిగారు, జవహరలాలు నెహ్రూగారు మొదలగువా రుత్తమ జీవితములు జీవించి స్వార్థత్యాగులై లోకోపకార పరాయణులగుటచే నట్టివారి జీవితము లమూల్యములు. మన యాంధ్రదేశమున మొట్టమొదట స్వీయచరిత్రము వ్రాసుకొన్నవారు మహనీయులైన రావుబహదూరు కందుకూరి వీరేశలింగము పంతులుగారు. ఆ మహాపురుషుని చరిత్రమంతయు స్వార్థత్యాగముతోడను, లోకోపకారకమైన ఘనకార్యములతోడనునిండియున్నది. కావున వారి స్వీయచరిత్రము నిశ్చయముగా నాంధ్ర సారస్వతమున కలంకారమై యాంధ్రజనులకు మార్గదర్శకమై యున్నది.

శ్రీ వల్లూరి సూర్యనారాయణరావుగారుగూడ స్వీయచరిత్రము వ్రాసుకొనిరి. ఆయన తన యార్జించిన విత్తమంతయు విద్యాసంస్థ కిచ్చి యుండుటచే నాయన చరితముకూడ ప్రశంసనీయమే.

నామిత్రులైన రాయసము వేంకటశివుడుగారు చిన్ననాటనుండియు బుద్ధిమంతులై సత్ప్రవర్తనము గలిగి నుపాధ్యాయపదవిలో నుండి, కట

కడపట నెల్లూరులోని వెంటగిరిమహారాజాగారి కళాశాలకు ప్రధానాచార్యులై, "జనానా" పత్రిక మొదలగు కొన్ని పత్రికలు నడిపి, స్త్రీలకుపయోగించు గ్రంథములనేకములు రచియించి, గుంటూరులో కొన్నివేల రూపాయలు ఖర్చుపెట్టి, ధర్మార్థముగా నొక మందిరము గట్టించి, ప్రజలకు నప్పగించిన యుదారపురుషుడగుటచే, వారి "యాత్మకథ"గూడ శ్లాఘనీయమై యున్నది.

ఆ స్వీయచరిత్రముల ముందట నావంటివాని స్వీయచరిత్రము దివిటీ ముందర దీపమువలె నుండునని నే నెరుగుదును. అయినను నేల వ్రాయ వలసివచ్చినదన్న, నేతద్వృత్తాంతము వినిపించెద వినుడు.

1928 వ సంవత్సరము మార్చినెలలో నా షష్ఠి పూర్త్యుత్సవమునకు రాజమహేంద్రవరము దయచేసినపుడు, మునగాల రాజాగారగు శ్రీ రాజా నాయనివెంకటరంగారావు బహదూరువారు, నాస్వీయచరిత్రము వ్రాయవలసిన దనినాతో నొక్కి చెప్పిరి. పిమ్మట పీఠికలింగోన్నత పాఠశాలలో సహాయోపాధ్యాయులును నాకుమిత్రులునైన యడవిశంకరరావుగారు నాస్వీయచరిత్రమువ్రాయవలసినదని నామేనల్లునిచేత పలుమారులు వర్తమానమంపుటయే గాక, వారునన్నుగలసికొన్నప్పుడెల్లను జెప్పుచువచ్చిరి. ఏవిధమైనఘనకార్యములు చేసియెరుగని నా వంటి సామాన్యుని చరిత్రము లోకమున కేమి యుపకరించునని, నే నా ప్రయత్నముచేయక చిరకాల మూరకొంటిని. కాని యైదారు మాసముల క్రిందట నాకు బాల్యమిత్రులైన రాయసము వెంకటశివుడుగారును, చిరకాల మిత్రులైన విస్సా అప్పారావుగారును నడుమనడుమ మా యింటికివచ్చి నా స్వీయచరిత్ర వ్రాయుమని హెచ్చరించుచు వచ్చిరి. వారుభయులు నన్ను పలుమారులు గ్రంథమెంతవరకు వ్రాసినారని యడుగుచు వచ్చిరి. నే నారంభించలేదని నాలో నేను సిగ్గుపడుచు పలుమారులు వారికి చెప్పితిని. ఆరంభించకపోవుటకు గారణమేమని వెంకటశివుడుగారు నన్ను నొక్కియడిగిరి. వెంకటశివుడుగారు నాకు సహాధ్యాయులును బాల్యమిత్రులు నగుటచే సందేహము విడిచి యిట్లు చెప్పితిని. "అయ్యా నాకు శ్రీ పిఠాపురము మహారాజావారు పరమదయాళులై నెలకు ముప్పదిరూపాయలు జీతమిచ్చుచున్నారు. నా మీద ననేకు లాధారపడి యుండుటచే నా కా సొమ్ము చాలక యెన్నోచిక్కులు పడుచుంటిని. నే నంధుడను; నితర శరీర దౌర్బల్యము గలవాడనగుటచే నా కన్నపానాదులు సమకూర్చుటకును నన్నావలకు నీవలకు దీసికొనివెళ్లుటకును మనుష్యులు కావలెనుగదా? వారిని నేను పోషింపక తప్పదుగదా?

నాకు రాజమహేంద్రవరములో స్వంతయిల్లు లేకపోవుటచే గాపురమున్న యింటికి నద్దె నీయవలెనుగదా ? అందుచేత నాకు సొమ్ము చాలక మనస్థిమితము లేదు. నిర్విచారముగా నిర్మలమైన మనస్సుతో వ్రాయవలసిన గ్రంథము చిక్కులలోబడి మనస్థిమితములేని నేనెట్లు వ్రాయగలను? నాకు నెల కరువదిరూపాయ లుండినగాని నెల గడువదు. అందుచేతనే వ్రాయ జాలను క్షమింపుడు." ఆ పలుకులు విని శ్రీ వేంకటశివుడుగారు "తక్కిన ముప్పది రూపాయలు మీకు వచ్చునట్లు మే మేర్పాటు చేసెదము. గ్రంథ మారంభింపుడు" అని చెప్పి వెడలిరి. నేను సంవత్సరాదివెళ్ళిన మరునాడనగా చిత్రభాను సంవత్సర చైత్రశుద్ధ విదియనాడు (18—3—1942) ఉదయమున నా స్వీయచరిత్రమును నా గుమాస్తాచేత వ్రాయింప నారంభించితిని. వెంకటశివుడుగారును, అప్పారావుగారును నా కప్పటినుండియు నెలకు ముప్పది రూపాయలచొప్పున యిచ్చుచున్నారు.

ఆహాహా! వారి దేశాభిమానము నే నేమనివర్ణింతును. వారికి నామీద గల దయయెంతని చెప్పుదును ? వారి స్వార్థత్యాగమేమనికొనియాడుదును? నావంటివాని స్వీయచరిత్రలేనిచో లోకమునకేమి లోపమువచ్చును ? ఈ యుదారచిత్తులిరువురుగూడ నంత పట్టుపట్టి కష్టార్జితమైన స్వంతసొమ్ము ఖర్చుపెట్టి, నాకు వ్రాయుటకు గావలసిన కాగితమునైతమునిచ్చి, నాచే నీ గ్రంథమేల వ్రాయింపవలెను? మహారాజుగారిచ్చునట్టి ముప్పదిరూపాయలకు తోడుగ నీ పరమాప్తులు బంపినట్టి ముప్పదిరూపాయలతో మనస్థిమితముగలిగి నీ గ్రంథము వ్రాసి పూర్తిచేయగలిగితిని.

నేనయిదవ యేప్రియలువరకు రాజమహేంద్రవరములోనుంటిని. జపానువారిదాడివలన విశాఖపట్టణమునకును, కాకినాడకును బట్టినగతియే, రాజమహేంద్రవరమునకును బట్టుననుభయమున, 8—4—1942 నాడుదయమున రాజమహేంద్రవరము విడిచి పడమటిగోదావరిజిల్లాలో తణుకు తాలూకాలోని కాకరపర్రుగ్రామము వెళ్ళితిని. అక్కడ నాముఖ్యబంధువులు నాకుబసయిచ్చి,నన్ను నాకుటుంబమును నాదరించుచున్నారు. రాజమహేంద్ర వరములోనుండగా నాగుమాస్తాయైన ఐనపర్తిసత్యనారాయణగారిచేత నూట తొంబదియైదు పుటలువ్రాయించితిని. కాకరపర్రు వెళ్ళిన తరువాత మిగిలిన గ్రంథమంతయు నామేనల్లుడైన పురాణపండ వెంకటదీక్షితులువ్రాసిపెట్టెను. మొత్తముమీద గ్రంథము వ్రాతప్రతిలో రమారమియెనిమిది వందల పుటలైనది. నాచరిత్ర యింతపెద్దదిగ నుండునని నేనారంభమున ననుకొనలేదు.

స్వీయచరిత్రలు వ్రాయువారికి వారివారి దినచర్యా గ్రంథములు (Diary) నితర సహాయములు నుండును. నే నంధుడనగుటచే నట్టి దినచర్యాగ్రంథములు వ్రాయలేకపోతిని. కాబట్టి యీ గ్రంథమువ్రాయుటకు పూర్తిగ పరమేశ్వరుడు నాకిచ్చిన జ్ఞాపకశక్తి యొక్కచే నాధారముగాని, లిఖితపూర్వకమైన యాధారముగాని మరి యే యితర సహాయముగానిలేదు. జ్ఞాపకశక్తినిబట్టి దెబ్బదిసంవత్సరముల చరిత్ర వ్రాయవలసివచ్చుటచే సచ్చటచ్చట ప్రమాదములుండిన నుండవచ్చును. కొన్నివిషయములు మరచియుండవచ్చును. తేదీలు నెలలు పొరపాటుగ తప్పులుపడియుండ వచ్చును. బుద్ధిపూర్వకముగా నేనేమియు నసత్యములు వ్రాయలేదు. పొర పాటులున్నపక్షమున పాఠకమహాశయులు క్షమింతురుగాక !

ఇంతపెద్దగ్రంథమచ్చుపడునని ధైర్యమునాకులేదు. ఈశ్వరునేనమ్మి గ్రంథమువ్రాసి పూర్తిచేసితిని. ఈ గ్రంథము 18—3—1942 వ తేదీన ప్రారంభించి 12—7—1942 వ తేదీన ముగించితిని. మొత్తముమీద నీ గ్రంథమువ్రాయుటకు రమారమి నాలుగుమాసముల యిరువదినాలుగు దినములుపట్టెను. నాకిపుడు దెబ్బదియైదవసంవత్సరము జరుగుచున్నది. ఇంత వార్ధక్యములో నాకు పూర్తియైన జ్ఞాపకశక్తిని, నోపిక, నారోగ్యము నిచ్చి నాచే నీగ్రంథము రచియింపజేసిన పరమేశ్వరునకు నేను శతసహస్ర వందనము లాచరించుచున్నాను.

నా స్వీయచరిత్రము వ్రాయుమని నన్ను నిర్బంధించిన నేరమునకు నేను శ్రీ రాయసము వెంకటశివుడుగారికిని, శ్రీ విస్సా అప్పారావుగారికిని ధనదండనము విధించినాను. ఆ జరిమానా వారు నాకు వాయిదాలమీద నెల నెలకు జెల్లించుచున్నారు. గ్రంథము వ్రాయుట ముగిసినను వారు నాకు 1943 వ సం॥ అక్టోబరు వరకు యీ సహాయము జేసిరి. నేరము జేసిన వారికి శిక్ష ననుభవింపక దప్పునా ? ఆయుదార పురుషుల కిరువురకు నా కృతజ్ఞతాపూర్వ కాశీర్వచనములుచేసి గ్రంథము ముగించుచున్నాను. పరమేశ్వరుడు వారికి, వారి కుటుంబములకు దీర్ఘాయురారోగ్యైశ్వర్యముల నిచ్చుగాక.

కాకరపల్లు, 12—7—1942
చిత్రభాను సం॥ నిజజ్యేష్ఠ
బహుళ అమావాస్య భానువారం.

ఇట్లు
చిలకమర్తి లక్ష్మీనరసింహం

మరొకమాట

ఈ స్వీయచరిత్రము వ్రాయుట ముగిసిన పిదప నిదియెట్లు ముద్రింప బడునాయని నేను విచారించుచుంటిని. కాగితము ధర చాల హెచ్చినది. ఆ ధర చూడగ నీ గ్రంథ మింతలో ముద్రింపబడునని తోచదు. నాచే గ్రంథము వ్రాయించిన శ్రీ విస్సా అప్పారావుగారును, శ్రీ రాయసం వెంకట శివుడుగారును దీని ముద్రణమును గురించి యాలోచించుచునే యుండిరి.

ఇట్లుండగ కొన్నిమాసములక్రిందట, దీని ముద్రణమునకై యొక దారి పొడగట్టినది. అది కేవల మీశ్వరప్రేరితమేయని నా విశ్వాసము. అది యేదన, ఆంధ్రదేశమున నిటీవల "నాంధ్రాభ్యుదయ రచయితల సంఘము"ను పేర నొక యపూర్వసంఘము నెలకొలుపబడినది. దాని కేంద్రస్థానము బెజవాడ. దాని కాంధ్రదేశమున బెక్కు మండలములలో శాఖలున్నవి. ఈ సంఘములో వందలకొలది సభ్యులున్నారు. ఈ సంఘము యొక్క ముఖ్యోద్దేశమేమనగ, నాంధ్రాభ్యుదయమునకై పాటుపడినవారి జయంతులు జరుపుట, వారిగ్రంథము లచ్చువేయించి, ఆయాగ్రంథములను, వారి వారి జీవితములను ప్రజలకు పరిచయముజేసి, ప్రజలయొక్క దృక్ప థము నాకర్షించి, దేశాభ్యుదయమునకు పాటుపడునట్లు చేయుట. ఈ సంక ల్పముతో శ్రీ రావుబహదూరు కందుకూరి వీరేశలింగముగారియొక్కయు, శ్రీ గురజాడ అప్పారావుగారి యొక్కయు, శ్రీ కొమర్రాజు లక్ష్మణరావు గారి యొక్కయు జయంతులను బలుతావులయందు జరిపి, సంచికల నిచ్చు వేయించి, చారు జేసిన దేశసేవను, భాషాసేవను జగద్విదితము జేసిరి.

ఈ సంఘము మహోన్నతాశయములతోడను, నుదారభావముల తోడను, స్వార్థత్యాగులైన యధికులచే స్థాపింపబడి జరుపబడుచున్నది. ఇందులో సనేక గ్రంథరచయితలు, భాషాభిమానులు గలరు. దీని యాశయ ములు పరిశుద్ధములు, ప్రశంసనీయములు సగుటచే లోకమున వీరికి పలు విధముల సహాయము గలుగుచున్నది. బెజవాడలోనున్న రాష్ట్రీయ సంఘ కార్యదర్శి ప్రస్తుతము చదలవాడ పిచ్చయ్యగారను యువకుడు.

ఒకనాడు కాకరపట్లులో నా బసలో నే నుండగ ఈ సంఘ సభ్యు డైన నాగభైరవ శివరామకృష్ణయ్యగారను యువకుడు నావద్దకు వచ్చి యీ సంఘమును గురించి నాకుఁజెప్పి, యీ సంఘమువారు నాకు గుంటూరులో సన్మానముచేయ దలచినారనియు, నా దేహారోగ్యమెట్లున్నదో చూచి, నాతో ప్రసంగించి నా స్థితిని తెలుసుకొని రమ్మని తన్ను తమ రాష్ట్రీయ సంఘ కార్యదర్శి శ్రీ చదలవాడ పిచ్చయ్యగారు పంపినారనియు నాతో చెప్పిరి.

అప్పుడు ప్రసంగవశమున శివరామకృష్ణయ్యగారు "మీరు వ్రాసిన క్రొత్తగ్రంథము లేవైనగలవా" యని ప్రశ్నించిరి. అప్పుడు నా స్వీయ చరిత్రను గురించిన వృత్తాంతము చెప్పితిని. అంతట తమ సంఘమువారా స్వీయచరిత్ర నచ్చువేయించు సంకల్పము గలదనియు, నాసంగతి కార్యదర్శి యైన శ్రీ పిచ్చయ్యగారితో మాటలాడి నాకు తెలియజేయుదుమనియు, జెప్పి వెడలిపోయిరి. ఆ తరువాత స్వీయచరిత్ర మచ్చువేయించుటకు నిశ్చయించుకొని, శుద్ధప్రతి నిమ్మనికోరిరి. ఈ సంఘముయొక్క పూర్వాపరములు మాకు తెలియకపోవుటచే నేనును, నా మిత్రులును దీనిని గురించి యాలోచించుటలో గొన్నిదినము లాలస్యమైనది. ఈ గ్రంథము నచ్చువేయించి ముద్రణమునకగు ఖర్చులు మొదలగునవి పోను. మిగిలినలాభము నాకిచ్చి వేయుచుమని వాగ్దానముజేసి, యంచనప్రకారము ముందుగనే రాబోవు లాభముక్రింద రు. 750 లు నాకు వారి కార్యదర్శి శ్రీ చదలవాడ పిచ్చయ్యగారు స్వయముగ దెచ్చి యిచ్చిరి.

ఇదిగాక, నా కీ సంఘమువారు గుంటూరులో సన్మానము చేయ దలచిరి కాగితము దొరకని యీ దుర్దినములలో వ్రాతలో సుమారెనిమిది వందల పుటలుగల పెద్దగ్రంథమును కొన్నివేల రూకలు ఖర్చుపెట్టి యీ సంఘమువా రచ్చువేయించుటకు కారణమేమన, వారికిగల గాఢమైన దేశాభిమానము, భాషాభిమానము, సారస్వతమునందుగల తీపియునని చెప్పవలెను. అదియుంగాక, నే నీ గ్రంథమును వారి కిచ్చుటలో నాలస్యము జేసినప్పటికిని లెక్కచేయక, వారికిగలతక్కువ వ్యవధిలో నీగ్రంథము నచ్చువేయించి సమ్మానమునాటికి సిద్ధముచేయుటలో యీ సంఘమువారికి గల కార్యదీక్ష, స్వార్థత్యాగము, ప్రజాసేవయందుగల యాసక్తి, వర్ణనాతీతమని చెప్పకతప్పదు.

లోకములో నెట్టిఘనకార్యములైనను యువకులే సాధింపగలరనియు, దేశాభ్యుదయమును గూర్చిగాని, సారస్వతమును గూర్చిగాని ప్రజలను గురించిన యే కార్యముగాని, కాలానుసారముగ బయలుదేరిన యువకుల వల్లనే సాధింపబడుననియు, దేశమును, సారస్వతమును మరి యే యితర సంస్థనుగాని యువకులే ముందుకునడిపింతురనియు, మొట్టమొదటినుండియు నా యాశయము. నా జీవితమంతయు నెట్టి యాటంకములతోను, యెట్టి స్వతంత్రేచ్ఛతోను గడిపితినో యట్టి యాశయములు గలిగిన యువక సంఘమువల్ల నీకార్యము సాధింపబడి, నా స్వీయచరిత్ర మచ్చుపడినందుకు సంతసించుచున్నాను. ఈ సంఘమువారియొక్క సహాయములేని పక్షమున నా స్వీయచరిత్ర మింతలో నచ్చుపడక యుండెడిది. కాబట్టి యీ సంఘ సభ్యులకును, వారి కార్యదర్శిగారైన చదలవాడ పిచ్చయ్యగారికిని, వారికి దోడుపడిన యింక ననేక మహనీయులకును, నేను కృతజ్ఞతాపూర్వ కాశీర్వచనములు చేయుచున్నాను. ఇట్టి పరిశుద్ధాశయములు, స్వార్థత్యాగులు గల సంఘములు పెక్కులు బయలుదేరి, దేశాభ్యుదయమునకు దోడుపడు గాక ! పరమేశ్వరుడు వారి ప్రయత్నములు సఫలము చేయుగాక !

కాకరపల్లు,
22—12—44.

ఇట్లు,
ఆంధ్ర ప్రజాసేవకుడు,
చిలకమర్తి లక్ష్మీనరసింహం

స్వీయ చరిత్రము

మొదటి ప్రకరణము

బాల్యదశ

నేను జన్మముచేత వైదిక బ్రాహ్మణుడను. వైదికులలో మాశాఖ యారామ ద్రావిడశాఖ. వైదికులలో ద్రావిడశాఖ లనేకములుగలవు. పేరూరు ద్రావిళ్లు, దివిలిద్రావిళ్లు, పుదూరి ద్రావిళ్లు, యిప్పగుంట ద్రావిళ్లు, ఆరామద్రావిళ్లు. వీరు నివసించు గ్రామమునుబట్టి కొందరి కా పేళ్లు గలిగినవి. పేరూరు ద్రావిళ్లు మొట్టమొదట పేరూరులో నివసించుటచేతను, కొందరు ద్రావిళ్లు దివిలిలో నివసించుటచేతను, కొందరు పుదూరులో నివసించుటచేతను, మరికొంద రిప్పగుంటలో నివసించుటచేతను, గ్రామముల పేళ్ళనుబట్టి వారివారి కాయా గ్రామములపేళ్లు గలిగినవి. ఈ ద్రావిళ్ళందరు పూర్వకాలమున ద్రవిడదేశ నివాసులు. కొన్ని వందల సంవత్సరముల క్రిందట నేదో కారణమున, నేరాజు ప్రోత్సాహముచేతనో, యాంధ్రదేశము నకు వచ్చి యుందురు. ఐనను వారి ద్రావిడ శబ్దము పోలేదు. కాని వా రాంధ్రులనియే నేటి కాలమున వ్యవహరింపబడుచున్నారు. అరవభాష మాని వారు తెలుగే మాటాడుచున్నారు. కాని కొన్ని యరవయాచారములు మాత్రము నిలుపుకొని యున్నారు. వెలనాటులు, వేగినాటులు, తెలగాణ్యులు, కాసలనాటులు, ములికినాటులు మొదలగు తెలుగుదేశ బ్రాహ్మణుల స్త్రీలవలె గాక, పేరూరు ద్రావిడ స్త్రీలు కుడిపైట వేయుదురు. ఇవిగాక మరికొన్ని ద్రావిడాచారము లున్నవని చెప్పుదురు. పేరి నారాయణమూర్తిగారు, గంటి లక్ష్మన్నగారు పేరూరు ద్రావిళ్లు. అల్లాడి కృష్ణస్వామయ్యగారు, వేదము వేంకట్రాయశాస్త్రిగారు, వావిళ్ళ రామస్వామిశాస్త్రిగారు, పుదూరు ద్రావిళ్లు. బ్రహ్మశ్రీ చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు, పురాణపండ మల్లయ్య శాస్త్రిగారు, ఆకొండి వ్యాసమూర్తిశాస్త్రిగారు, చర్ల బ్రహ్మయ్యశాస్త్రిగారు మొదలగువారు, మా యారామద్రావిళ్లు. ఆరామద్రావిళ్లకు తోటయరవలని

యింకొక పేరుగలదు. దక్షిణదేశమునుండి మొట్టమొదట వీరు వచ్చినప్పుడు తోటలలో నెక్కుడనో నివసించియుందురు. ఆకారణముచేతనే తోటయరవలని వారు వ్యవహరింపబడుచుండిరని తోచుచున్నది. ఈ శాఖవారు విశేషముగ నిప్పటి పడమటి గోదావరిమండలములోని కాకరపర్తి గ్రామములో నెక్కువగనున్నారు. వారిలో ననేకులు గొప్ప పండితులుగలరు. అగ్రహారీకులును గలరు. కూచిమంచి జగ్గకవి వ్రాసిన చంద్రరేఖావిలాపములో, జగ్గకవిచేత నెన్నో తిట్లు దిన్న యానిమళ్ల వెంకటసోమయాజులుగారు, సుప్రసిద్ధ పండితుడై సంస్కృతకవియై ముక్కురాలపాడు, బోదుగల్లునను నగ్రహారములను సంపాదించెను. ఆయన సంతతివారిప్పటికి నా యగ్రహారముల ననుభవించుచున్నారు.

మా యింటిపేరు చిలకమర్తివారు. చిలకమఱ్ఱును పేరుగల గ్రామము తెలుగుదేశమున నెచ్చటనో యుండి యుండును. ఆ గ్రామమును బట్టి మా పూర్వులకాగ్రామనామ మింటిపేరుగ వచ్చియుండును. ఆ చిలకమఱ్ఱు గ్రామము నిజాముఱాజ్యములో నున్నదని కొందరు చెప్పుదురు. కాని మా తాతగారి నివాసము ప్రస్తుతము గుంటూరు మండలములో వంగవోలు సమీపమున నున్న మద్దిపాడు. మా తాతగారిపేరు చిలకమర్తి పేరయ్య. ఆయన భార్యపేరు లక్ష్మీదేవమ్మ. ఏ కారణముచేతనో యచ్చమ్మ యని యామెకు రెండవపేరు గలదు. ఆమె పుట్టినయూరద్దంకి. మా నాయనమ్మ మిక్కిలి సాహసురాలు, నల్లగ, పొడవుగ నుండెడిది.

ఆమె చిన్నతనములో ననగ 1816 సంవత్సర ప్రాంతమునందు, నుత్తరసర్కారులను దోచుకొనుటకై పిండారిదండు వచ్చియుండెను. అప్పుడద్దంకిలో జనులు దండునకు జడిసి గ్రామమువిడిచి, వలసబోయి, తొన్న చేలలో దాగుకొనిరట. మాముసలమ్మ యున్న చేనులోకి పిండారిదండులో జేరిన యొక సైనికుడు వచ్చెనట. అప్పుడామె రోకలిదీసుకొని యాదురాత్ముని పొడవబోయెనట. అంత వాడు పారిపోయెనట. ఆమెకెన్నోపాటలు వచ్చును. శ్రావ్యముగ పాడుచుండెడిది. నేనామెను బాగుగ నెరుంగుదును. నాకు పండ్రెండు వత్సరములు వచ్చువరకు నామె బ్రతికెను.

ఆదంపతులకు నిరువురు బిడ్డలుపుట్టిరి. ప్రథమసంతతి కూతురు. ఆమెపేరు సుబ్బమ్మ. రెండవసంతతి కుమారుడు. ఆయనపేరు వెంకన్న. చిలకమర్తివారు కాశ్యపసగోత్రులు. ఆశ్వలాయనసూత్రులు. ఋగ్వేదులు.

చిలకమర్తివారు వైష్ణవులలోగూడా గలరు. వారు మొట్టమొదట నారామ ద్రావిడశాఖలలో చేరిన వైదికులేయైయుందురు. కొంతకాలము క్రిందట విశిష్టాద్వైతమతముమీద వారికభిమానము గలుగుటచే చిలకమర్తివారు శ్రీవైష్ణవులైయుందురు. వారుగూడా కాశ్యపసగోత్రులే. మాకును వారికిని గల భేదమొకటి గలదు. మా యింటిపేరు చిలకమర్తివారు, వారియింటి పేరు చిలకమర్తివారు.

1832వ సంవత్సరమున నాంధ్రదేశమున గొప్ప కరువు సంభవించినది. అది మిక్కిలి భయంకరమైన కాటకము. అదే నందన సంవత్సరపు కరవని మన పెద్దలు చెప్పుదురు. ఆ కాటకములో వేలకొలది మనుష్యులన్నములేక మృతినొందిరి. గుంటూరునుండి రాజమహేంద్రవరమువరకు గల బాటలు శవములతో నిండియుండెనని చరిత్రకారులు వ్రాసిరి. ఆ కాటకమునకు మడిమాన్యములులేని పేరయ్యగారు, సకుటుంబముగా గోదావరి మండలమునకు వచ్చిరి. వారు మొట్టమొదట, ప్రస్తుతము పడమటి గోదావరి జిల్లాలోనున్న మొగలితుర్రు గ్రామములో ప్రవేశించిరి. ఆ కాలమున తహసీల్దారు కచేరీ మున్నగునవి, నేటివలె నరసాపురములోగాక మొగలితుర్రు గ్రామములోనే యుండెనట. పేరయ్యగారి కుమార్తెయు నా మేన త్తయునైన సుబ్బమ్మగారిని, కొందరు బంధువుల కుట్రచేత, మాశాఖలో చేరిన చామర్తివారు దొంగతనముగ నెత్తుకొనిపోయి, తమ కుమారుడైన రాజన్నయను నతనికిచ్చి వివాహము చేసికొనిరట. వెంటనే మహాకోపము చేత మా పితామహి తన కూతురు మంగళసూత్రము త్రెంపివైచినది. కాని హిందూ ధర్మశాస్త్రప్రకారము వివాహము దొంగతనముగనైనను రద్దుపడ గూడదు గావున, వివాహము స్థిరమైనది. ఆ కారణముచేత, మా పితామహుడు మొగలితుర్రు గ్రామము విడిచి, యక్కడికి సమీపముననున్న వీరవాసరము గ్రామము చేరెను. వీరవాసరమునకు వీరాసనమనిగూడా పేరుగలదు. ఆ గ్రామమున వీరభద్రస్వామి యాలయముగలదు. అందు చేత నా గ్రామమునకు వీరవాసరమనిపేరు వచ్చియుండునేమో: వీరాసనము క్రమముగ వీరాసరమై, తరువాత వీరవాసరమైయుండును.

వీరవాసరము సుప్రసిద్ధమైన గ్రామము. పెద్దాడ నాగరాజుగారను మహాకవీశ్వరుడా గ్రామవాసి. ఈయన శకుంతలా పరిణయమను ప్రబంధము నాంధ్రమున రచించెను. ఈ కావ్యము ప్రౌఢమై సరసమైయున్నది. ఈ గ్రంథమును నాగరాజుగారి మునిమనుమడును, శ్రీ పోలవరము జమీం

దారుగారునైన, శ్రీ రాజా కొచ్చర్లకోట రామచంద్ర వెంకట కృష్ణారావుగా రచ్చువేయించి ప్రచురించిరి. నాగరాజుగారు పూర్వకాలమున మచిలీపట్ట ణమున (బందరు) నుండిన ప్రొవిన్‌షియల్ కోర్టులో వకీలుగా నుండి, చాలమంది జమీందారుల పక్షమున న్యాయవాదిగ నుండి చాల ధనము సార్జించిరి. గ్రామమున కొన్ని చెఱువులు త్రవ్వించిరి. ఆయన కుమారుడు పెద్దాడ మల్లిఖార్జునుడుగారు. ఆయన కుమారుడు పెద్దాడ నాగరాజుగారు. ఆ నాగరాజుగారి ప్రథమ భార్యయు, పోలవరము సంస్థానాధిపతియైన జగన్నాధరాయణంగారి భార్య కామాయమ్మగారు, నప్పజెల్లెండ్రు. నాగరాజుగారి ప్రథమ కళత్రము ప్రసవించి యొక కుమా రుని గని వెంటనే చనిపోయెను. మాతృహీనుడైన యా బాలకుని పెద తల్లియైన శ్రీ కామాయమ్మగారు, సంతానము లేకపోవుటచే పెంచుకొని, బాలకునికి రామచంద్ర వెంకట కృష్ణారావని పేరుపెట్టెను. పెద్దాడ నాగ రాజ కవిగారికిని రామచంద్ర వెంకట కృష్ణారావుగారికినిగల సంబంధమిది.

వీరవాసరము చారిత్రక గ్రామము. తూర్పు ఇండియా కంపెనీ వారు, నరసాపురముదగ్గర మాధవాయి పాలెములో వ్యాపారస్థానము స్థాపించి, బట్టలు మొదలైనవి నేయించి, వాణిజ్యము జరుపుచున్న కాలమున ననగా 18 వ శతాబ్దమున, వీరవాసరము, కంపెనీవారి వాణిజ్యస్థానమునకు శాఖగానుండెను. కాలక్రమమున భీమవరము తాలూకాకు వీరవాసరము కొన్ని సంవత్సరములు ముఖ్యస్థానమయ్యెను. భీమవరము తాలూకా కచ్చేరీ, పూర్వము భీమవరమునకు సమీపముననున్న "ఉండి" గ్రామములో నుండెనట. 1815 సంవత్సరమున రామరాజను నొకక్షత్రియుడు, కొందరు రాజులను వెంటబెట్టుకొని, తహసీల్‌దారుగారి గృహమునకుపోయి, యతనిమీదనున్న కసి తీర్చుకొనుటకై యతనిని చంపెనట. చంపి యం తతోబోక, చిన్న సేన చేరదీసి, పాలకొలను మొదలైన కొన్ని గ్రామము లను దోచుకొనెనట. తరువాత గవర్నమెంటువారు వారిని బట్టుకొని శిక్షించి, భీమవరము తాలూకాకచ్చేరీ వీరవాసరమునకు మార్చిరట. నాడు మొదలుకొని వీరవాసరము తాలూకాకు మధ్యగ లేకపోయినను, 72 సంవ త్సరములు ముఖ్యస్థానమై యుండెను. వీరవాసరము తాలూకాకు నడుమ నుండకపోవుటచేతను, భీమవరముతాలూకాకు నడుమ నుండుటచేతను, గవర్నమెంటువారు భీమవరములో కచ్చేరీకట్టించి, 1887 సంవత్సరములో కచ్చేరీ భీమవరము మార్చిరి.

పూర్వము వీరవాసరములో కచ్చేరీయుండెడి భవనము, తూర్పు ఇండియా కంపెనీవారు సరుకులు నిలువజేయు భవనమేమో యని నాయభిప్రాయము. ఏలయన, నా భవనముయొక్క చుట్టు గోడలకు నాలుగు వైపుల నాలుగు బురుజులుండెడివి. విశేషముగ దొంగలుండెడి యా కాలమున, కంపెనీవారి సరకులు దొంగలు బండెపోటులు మొదలగువారి పాల బడకుండ, సేవకులు బురుజులమీద నిలుచుండి కాపాడుట కేర్పడినవేమో యని నాయూహ. ఆ భవనమున్నది గాని యా బురుజులిప్పుడు లేవు. మట్టిక్రింద త్రవ్వుకొనిపోయి పొలములలో బోసుకొనుటకు సర్కారువారాజ్ఞ యిచ్చిరి. ఆ భవనముయొక్క వీధితలుపులు కోటతలుపులవలె మిక్కిలి పెద్దవి. వీధియరుగులుగూడ చాల విశాలములైనవి. వీరవాసరము గ్రామమే గాని పెద్దగ్రామము. రహీరమి పదివేల జనసంఖ్యగలది. ప్రతి సోమవారమునాడు సంత జరుగును. ఇది నివాసయోగ్యమైన గ్రామము. ఎంత వానకురిసినను బురద యుండదు. నీటివసతి మిక్కిలి యెక్కువగనున్నది. దక్షిణమున పీర్లకోడని చిన్న కాలువగలదు. తక్కిన మూడుదిక్కులను చెఱువులుగలవు. తృణకాష్ఠజలసమృద్ధిగల గ్రామము. 1855 వ సంవత్సరమున దొరతనమువారొక యింగ్లీషు పాఠశాల స్థాపించిరి.

ఆకాలమున వీరవాసరములో రహిముద్దీన్ సాహేబుగారని మహమ్మదీయులొకరు తహసీల్దారుగ నుండిరి. ఈయనను గురించి యొక చిత్రకథ కలదు.

వేదవేత్తయైన యొక బ్రాహ్మణుడు శిష్యులకు వేదము జెప్పుచు వీధివెంట నడిచి పోవుచుండెనట. తహసీలుదారుగారా బ్రాహ్మణుని బిలిచి, యీ వేదము చెప్పుకొని మీ శిష్యులేమి చేయుదురని యడిగిరట. ఎక్కడనో బిచ్చమెత్తుకొని బ్రతుకుదురని యా బ్రాహ్మణుడు త్తరము చెప్పెనట, "మేమిక్కడ పాఠశాలబెట్టి నాముగదా, బాలుర నా పాఠశాలకు బంపక పాడు చేయుచున్నావు. ఇకముందీపని చేయవద్దు. జాగ్రత్త!" యని తహసీల్దారు గారు బెదిరించిరట. నాటనుండియు నా బ్రాహ్మణుడు శిష్యులకు వేదమింటనే జెప్పుచు బైట జెప్పుట మానెనట. ఈ కథ నా చిన్నతనములో గొందరు పెద్దలు జెప్పగ వింటిని. ఆ పాఠశాల బోర్డుపాఠశాలయై నేటికిని వర్ధిల్లుచున్నది. గవర్నమెంటువారు పట్టణమైన నరసాపురములో పెట్టక వీరవాసరములోనేల పాఠశాల పెట్టిరో తెలియదు. దొరతనమువారు 1853 సంవత్సరములో రాజమహేంద్రవరమున కళాశాలస్థాపించి, 1855 సంవత్స

రమున వీరవాసరములో పాఠశాల స్థాపించిరి, 1885 వ సంవత్సరము వరకు నీ పాఠశాల గవర్నమెంటు పాఠశాలయై, 1886 వ సంవత్సరమున బోర్డు పాఠశాలయయ్యెను. నేను జదువుకొన్నది పాఠశాలలోనే.

మాతాతగారు వీరవాసరములో వైదికవృత్తివల్ల జీవించిరట. మాతండ్రి చిన్నవయసులో నుండగనే యాయనతండ్రి చనిపోయెనట. గృహముగాని మడిమాన్యములుగాని లేకపోవుటచే, మా పితామహి యాకాలమునన్నున్న తెలుగు చదువు తనకుమారునకు చెప్పించి, యా గ్రామమున నున్న నియోగుల నాశ్రయించి, కుమారుని గడు గారాబముగబెంచి వృద్ధిలోనికి దెచ్చెను. మా తండ్రిగారిదస్తూరి మిక్కిలి చక్కనిది. ముత్యాల కోవవలె నుండునని చెప్పుట యతిశయోక్తిగాదు. చిన్నతనమునుండి నియోగుల సహవాసమగుటచేత, మాతండ్రి వైదికవృత్తిమాని, లౌక్యవృత్తిచే యావజ్జీవము కాలక్షేపముజేసెను. ఆగ్రామములో ద్రోణంరాజువారు పెద్దవారు నను నియోగులుగలరు. వీరిలో జాలమందిని మాతండ్రి స్నేహముచేత "నేమిరా" యని పిలుచుచుండెను. ఈ నియోగులుతప్ప తక్కినజనులు మమ్ము నియోగులని భావించెడివారుగాని, వైదికులని యెంచెడివారుగారు. మా తండ్రి వీరవాసరములో గృహము సంపాదించెను.

తణుకు తాలూకాలోని ఖండవల్లి గ్రామములో నాకాలమున నొక పండితుడుండెను. ఆయనపేరు పురాణపండ భద్రయ్యశాస్త్రిగారు. ఆయన సంస్కృతాంధ్రములలో నిరుపమానమైన పాండిత్యముగలిగి, పురాణము చెప్పుటలో మంచి నేర్పుగలిగి, గొప్ప పౌరాణికుడని పేరుగాంచి, పురాణము చెప్పియు, రాజుల గృహములలో పురోహితుడయ్యు, కుటుంబ సంరక్షణము చేసికొనుచుండెను. ఆయన గ్రుడ్డివాడు. జాత్యంధుడుకాడు. కొంతకాలము జరిగిన తరువాతనే యంధత్వము వచ్చినదట. ఆయన కైదుగురు కూతులు, నొక కుమారుడు గలిగిరి. ఆ కుమారుడే పురాణ పండ మల్లయ్యశాస్త్రిగారు. భద్రయ్యశాస్త్రిగారి ప్రథమ పుత్రికను, మా తండ్రికి సన్నిహిత జ్ఞాతియైన చిలకమర్తి వెంకటశాస్త్రిగారు, వివాహమాడిరి. ఆ వెంకటశాస్త్రిగారు గొప్ప సంస్కృత పండితుడు. గొప్ప తర్కవేత్త. తన పాండిత్య ప్రభావముచేత ననేక స్థలములలో సన్మానము పొంది కుండలములు శాలువలు సంపాదించెను. భద్రయ్యశాస్త్రిగారికి రెండవ కుమార్తెయగు వెంకటరత్నమ్మగారి కొరకై, బంధువులు సంబంధముకొరకు వెదకుచుండగ, చిలకమర్తి వెంకటశాస్త్రిగారు మామగారికి

నచ్చజెప్పి, తన మరదలైన వెంకటరత్నమ్మగారిని, తనకు దగ్గరదాయాది యైన మా తండ్రిగారి కిప్పించి వివాహము చేయించిరి. గృహము కట్టుట చేతనేగాక వివాహము చేసికొనుటచేతగూడ మా తండ్రిగారు నిజముగ గృహస్థులైరి.

మా తల్లికి మొట్టమొదట నొక కుమార్తెగలిగెను. తరువాతగూడ కుమార్తెయే గలిగెను. పిమ్మట నేను పుట్టితిని. మాతల్లి సంతానములో నేను మూడవబిడ్డను. నా చిన్నతనమందే మా పెద్దప్పగారైన లచ్చమ్మ మృతినొందెను. నేను ప్రభవ సంవత్సర భాద్రపద బహుళ చతుర్దశినాటి రాత్రి మొదటిభాగమున జన్మించితినని, నా మేనమామగారు చెప్పుచుండెడి వారు. ఇంగ్లీషు తారీఖులప్రకారము 1867వ సంవత్సరమున సెప్టెంబరునెల 26 వ తారీఖున, ఖండవల్లి గ్రామములో మా మేనమామగారియింట జన్మించితిని. నాది పుబ్బ నక్షత్రము. నాకొక మేనత్త చామర్తి సుబ్బమ్మ గారనునామె యుండెనని చెప్పితిని. ఆమెకొక కుమార్తెయు నొక కుమారుడునుండిరి. భర్తపోయినతరువాత బిడ్డలు నామె యుండగానే మృతినొందిరి. ఆమె కూతురుపేరు పున్నమ్మ. ఆ పున్నమ్మ ప్రసవించి మృతినొందెను. నేను పుట్టినదినములలో నామె మాతల్లికి స్వప్నమందు గనబడి తనపేరుపెట్టుమని కోరెనట. అందుచేత మా మాతామహియు మొదలగు బంధువులు పున్నయ్యయని నాకు నామధేయముజేసిరి. ఊరకయట్లు పిలిచిరి గాని నాకు నామకరణ జాతకరణోత్సవములు జరుగలేదు. మూడునెలలు వయసు వచ్చినతరువాత నన్ను నా మాతామహి మా తల్లితో పీరవాసరము పంపించెను. మా మేనత్త సంతానము పోయినతరువాత మాయింటనే యుండెను. తనకూతురు స్వప్నములో మా తల్లికి గనపడి పేరుపెట్టమని కోరినదన్నమాట, మా మేనత్త కిష్టములేకపోయెను. అందుచేత మాతండ్రియు, మా మేనత్తయు మా పితామహియు నాలోచించి, పున్నయ్య యను పేరు దీసివైచి, మాకు సమీపమందున్న యంతర్వేదిలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామివారిపేరు నాకుపెట్టిరి. నాటనుండియు నేను కొంతకాలము లక్ష్మీనరసయ్యయనియు, నిటీవల లక్ష్మీనరసింహమనియు, నామధేయములతో వ్యవహరింపబడుచుంటిని. ఇప్పుడు లక్ష్మీనరసింహమనియే నన్ను లోకులుపిలుచుచుందురు. కాని నాచిన్నతనములో మా మాతామహుని బంధువులందరు పున్నయ్యయనియే పిలుచుచువచ్చిరి. మా మాతామహుడైన భద్రయ్యశాస్త్రిగారు, 1866 వ సంవత్సరమునకు సరియైన యుగాది

సంవత్సరములో మృతినొందిరి. నేను గర్భములోనున్నప్పుడు మాతల్లి తన తండ్రిని నిరంతరము తలచుకొనుటచేతనో, మరెందుచేతనో నేను మా మాతామహుని యాకారముతోనే పుట్టితినని మా పెద్దలు చెప్పుచు వచ్చిరి. నా బక్కపలుచని శరీరము, నా కంఠస్వరము, నామేనిపొడవు, సరిగ మా మాతామహుని పోలియుండెనని, మాతల్లియు బినతల్లులు చెప్పుచు వచ్చిరి. నాకు నా మాతామహుని పాండిత్యమంత గొప్పపాండిత్యము లేకపోయినను, రవ్వంత కవిత్వధోరణియు నంధత్వమును సిద్ధించినవి. భద్రయ్యశాస్త్రిగారు చక్కని తెలుగుకవిత్వము చెప్పగలవారు. నా యంధత్వము మిక్కిలి చిన్నతనమందెట్లుండెనో నేనెరుగను గాని, నాకు జ్ఞానమువచ్చినతరువాత రాత్రులు స్వయముగ నడచుటకుగాని చదువుటకుగాని వీలులేకపోయినదని యెరుగుదును. పగలుగూడ చీకటిలోనున్న వస్తువులు చప్పున కనబడెడివికావు. పాఠశాలలో నల్లబల్లమీద వేసిన యంకెలు సులభముగ కనబడెడివికాపు. దేశపటములలో పట్టణములు మొదలైనవి చూపుమని యడిగినప్పుడు, నాకవి సులభముగ గనబడెడివి కావు. మిత్రులతో గలిసి బంతియాట యాడుకొన్నపుడు నేను బంతి బట్టుకొనలేక పోయెడివాడను. ఇట్లు నేను నలువదిసంవత్సరములు వచ్చువరకు పగలు స్వేచ్ఛగ సంచారము చేసితిని. పాఠములు పగలే చదువుకొనుచుంటిని. రాత్రులెన్నడు చదువుకొనుటలేదు. పాఠములు చదువవలసినప్పుడు మిత్రులచే జదివించుకొని వినుచుండెడివాడను. పగలు గ్రామంలో సంచరించుటకును, బడికి వెళ్లుటకును, పగలు వ్రాసుకొనుటకును చదువుకొనుటకును, వీలుండెనుగాని, రాత్రులుమాత్రము పరసహాయము కావలసివచ్చెను. ఈవిధముగ 1909 వ సంవత్సరమువరకు జరిగెను. ఆ సంవత్సరమున నే నొకనాడు నా మనోరమా ముద్రాక్షరశాలకు బోపుచుండగ నొక యాపుమీద బడితిని, అప్పటినుండియు నేను స్వయముగ ప్రయాణములు చేయగూడదని నిశ్చయించుకొని, పగలుకూడ పరసహాయముచేతనే తిరుగుచుంటిని. 1909 సంవత్సరమువరకు రాత్రులు దీపము, చంద్రబింబము, పెద్దపెద్ద నక్షత్రములు, పగలు సూర్యబింబము నాకు కనబడెడివి. కొన్నాళ్లు వెన్నెలలో రాత్రులు నడవగలిగి యుంటిని. చీకటిరాత్రులలో ముందు దీపము పోవుచున్నయెడల దానివెనుక నేను వెళ్ళగలిగియుంటిని. 1910 వ సంవత్సరము నుండి యీ లక్షణములు గూడ పోయినవి.

నా చిన్నతనమందు మా యింట, మాతండ్రిగారికి పినతల్లి కుమారుడైన వరదా కుటుంబము గారను నొక యువకుడు వచ్చియుండెను. ఆయన నివాసస్థాన మద్దంకిదగ్గరనున్న కాకానిపాలెము. అది కుగ్రామము. ఆయన కక్కడ మడిమాన్యము లేమియులేవు. ఆకారణమున దన తల్లిని వెంట బెట్టుకొని యాయన మాయింటజేరెను. మాతండ్రిగారు సంపాదించిన భూముల నతడు సేద్యము చేయించుచుండెను. ఆ కుటుంబముగారి కప్పటికి వివాహముకాలేదు. ఆయన ఘోటకబ్రహ్మచారియై యుండుటచేత, నాయన తల్లియు, మా పితామహియు, మా మేనత్తయు నెటులైన వివాహము చేయింపుమని మాతండ్రిని ప్రోత్సాహపరచిరి. కుటుంబముగారు నిర్ధనులు. అడిదము సూరకవిగారు చెప్పినట్లు, "మాన్యములు సామాన్యములు, భూములు రుద్రభూములు" గల కుటుంబముగారికి రమ్మని పిలిచి పిల్ల నెవరిత్తురు? ఆయన నల్లగ నుండెడివాడు. శరీరముమీద దట్టమైన తామర యుండెడిది. మాపితామహియు, మా మేనత్తయు, కుటుంబముగారి వివాహము నిమిత్తమై యొక పస్నుగడ పన్నిరి. నాకంటె పెద్ద పిల్ల యొక్తె యుండెనని చెప్పితిని. ఆమెపేరు సుబ్బమ్మ. ఆమె కప్పుడు రమారమి తొమ్మిది లేక పదిసంవత్సరములు వయసుండెను. ఆమె నెవరికైన నిచ్చి ఫిరాయింపుమీద కుటుంబముగారికి వివాహము చేయుమని, మాతండ్రిగారిని, మా పితామహియు నా మేనత్తయు బలవంతముజేసి యొడంబరచిరి.

ఆకాలమున తణుకు తాలూకాలోని మంచిలి గ్రామములో నొక గృహస్థుడుండెను. ఆయనపేరు పొదిలి రాయప్పగారు. ఆయనను రాయప్పావధానులుగారని లోకులు వ్యవహరించుచుండెడివారు. ఆయన మొదటి భార్య మృతినొందెను. ఆమె మృతినొందునప్పటి కామెకు ముగ్గురు కొమార్తెలు నొక కుమారుడును గలరు. ప్రథమ పుత్రిక కప్పటికే వివాహయయ్యెను. ద్వితీయ పుత్రిక పేరు పల్లాలమ్మ. ఆమెకు వివాహము కాలేదు. ఆ రాయప్పావధానులుగారు తన రెండవ వివాహమునకై ప్రయత్నము చేయఁజొచ్చిరి. మనదేశములో ముఖ్యముగ, కోమటి బ్రాహ్మణులలో మొదటి కళత్రము పోయినప్పుడు, రెండవ పెండ్లి చేసికొనుటకు నెంత వయస్సుగలవారైన సందేహింపరుగదా! పిల్లనిచ్చుటకు గృహస్థుడు గూడ సందేహింపక, సిగ్గుపడక ధనమున కాసపడియో, ఫిరాయింపు పెండ్లికో, బంధువుల ప్రేరణకో, లొంగి తమకూతును ముసలిదయ్యములఁ

కిచ్చి పెండ్లి చేసి బలియిత్తురుగదా ! రాయప్పగా రప్పటికి నలుబది సంవత్స రము దాటి యేబదియవ పడిలో ప్రవేశించిరి. ఆయన లావుగనుండెడి వారు. శుద్ధవైదికుడు. స్మార్తము బాగుగ జదువుకొని షోడశకర్మలు నవర్గళముగ జేయింపగల ప్రజ్ఞగలవారు. ఆయన పునహా సతారాలు గూడ వెళ్ళి ధనమార్జించిరని జెప్పుకొనిరి. మా పెద్దయప్ప లచ్చమ్మ యంతకుముందే మృతినొందుటచేత, మాచిన్నప్ప సుబ్బమ్మను రాయప్ప గారి కిచ్చి వివాహముచేయునట్లును, రాయప్పగారి రెండవ కుమా రైతైన పళ్ళాలమ్మను మా కుటుంబము బాబుగారికిచ్చి వివాహము చేయునట్లును, వివాహము తిరుపతిలో చేయునట్లును మాపెద్దలు నిశ్చయించిరి. కుటుంబముగారి తల్లి మాతండ్రికి బినతల్లి యగుటచే నామె పోరుచేతను, నా పితామహి యొక్కయు నా మేనత్త యొక్కయు ప్రోత్సాహముచేతను, నెట్లయిన దిక్కులేనివాని నొకనిని గృహస్థునిజేయుట పుణ్యమని తలం చుట చేతను, మా తండ్రి యీ యనుచిత కార్యమున కొప్పుకొనెను. ఈ విచిత్రవివాహము, వెనుకటి యాంగీరస సంవత్సరములో ననగా 1872 వ సంవత్సరమున జరిగెను. నే నప్పటి కైదుసంవత్సరముల వయస్సువాడను. పనిలో పనియని యా పెండ్లితోపాటు మా తండ్రి నాకుపనయనముకూడ తిరుపతిలో చేయ నిశ్చయించెను. ఈ తరువాత నాలుగేండ్లకు నాతమ్ముడు కృష్ణమూర్తి జన్మించెను. ఈ వివాహమువిషయమున మా తండ్రి మా మేనమామతోగాని, మా మాతామహితోగాని, తక్కిన బంధుగులతోగాని యాలోచింపలేదు. వారికీవివాహమిష్టములేకపోవుటచేతనో, మాతండ్రివారితో నాలోచింపక పోవుటచేతనో, మా తల్లివంకచుట్టములెవ్వరును యీ వివా హమునకు రాలేదు. ఆ వివాహములును నా యుపనయనమును ద్వారకా తిరుమలయను పేరుగల చిన్న తిరుపతిలో జరిగెను. వీరవాసరము నుండి బండ్లమీద తాడేపల్లిగూడెము వెళ్ళి, యక్కడనుండి పెదతాడేపల్లి వెళ్ళి, క్రమముగ భీమడోలువెళ్ళి, మేము తిరుపతి జేరితిమి. మా తల్లికి మాపెద తల్లికి మా పినతల్లులకు బండియెక్కినపక్షమున వికారము పుట్టి దోకులు వెళ్ళునట్టి రోగముకలదు. ఆరోగము మా తల్లికి విశేషముగ కలదు. బండెక్కి బాధపడుట కిష్టములేక, పాప మా యిల్లాలు, వీరవాసరమునుండి తిరుపతి వరకు మేమందరము బండ్లెక్కినను, నామె మాత్రము బహుకష్ట పడి నడచియే వచ్చెను. ఆ వివాహకాలమున తన కూతురును ముసలివానికి గట్టపెట్టుటచేతనో, మరెందుచేతనో, మాతల్లి కంటతడిబెట్టెనట, అందుచేత

మా మేన త్తయు మాపితామహియు మాతల్లిపైన నలిగిరట. తన చుట్టము లెవ్వరు వివాహమునకు రారేదని విచారపడితినని మాతల్లి వారికి ప్రత్యు త్తరమిచ్చెనట. అప్పుడు నాకేగాక నా యీడువాడైన రాయప్పావధానిగారి కుమారుడు లక్ష్మయ్యకుగూడ నుపనయనమయ్యెను. రాయప్పావధానిగారు మా యిరుపురకును సంధ్యావందనము జెప్పిరి. స్మార్తములో రాయప్పగారు గొప్ప ప్రజ్ఞగల వారగుటచే, మాకు ఋగ్వేద సంధ్యావందనము గూడ చెప్ప గలిగిరి. కాని మా యప్ప సుబ్బమ్మ మిక్కిలి యదృష్టవంతురాలని చెప్ప వచ్చును. ముసలి మగనిని గట్టుకొని సవతిబిడ్డలతో గాపురము జేయ నక్కరలేకుండ, బాల్యమున వైధవ్యదుఃఖ మనుభవింప నక్కరలేకుండ, నామె త్వరలోనే మృతినొంది సవతిని జేరుకొనెను. వివాహమయిన నెల దినములో, రెండునెలలో గడచిన తరువాత, యాకస్మికముగ జ్వరము తగిలి, తగితిన యైదుదినములలోనే యామె మృతినొందెను.

మా యింటిప్రక్క నొక నియోగి స్త్రీ యుండెను. ఆమె పేరు పెద్దాడ నరసమ్మ. ఆమె బాలవితంతువు. ఆమె దొడ్డిలో నేవియో మొక్కలు వేసి వాటికి నీరుపోయమని మా యప్పను బలవంతపెట్టెను. మా మేన త్తకునూ, నరసమ్మకును మిక్కిలి స్నేహము. అందుచేత నామెయు మావాండ్రును నొక కుటుంబములోని వారుగనే యుండెడివారు. ఆ గాఢ మైత్రిచేతనే, యామె మా యింటి వివాహోపనయనములకు మాతో తిరుపతి గూడ వచ్చెను. ఆమె బొందిలీలనుండి యా యిల్లు క్రయమునకు దీసు కొనెను. ఆమె కొనకముం దాయింటిలో నొక పుణ్య స్త్రీ మృతినొందెను. మా యప్ప మొక్కలకు నీరుబోయుచు నా దొడ్డిలో జడుసుకొనెనట! వెంటనే జ్వరమువచ్చినదట! ఆమెకు జ్వరము తగిరిన మూడవనాడు సంధించెను. పేలాపన హెచ్చిపోయెను. ఆసన్నిపాతములో, చనిపోయిన బొందిలీ స్త్రీ స్థంభముమీద గూర్చిండి, నిమ్మపండు చేతపట్టుకొని, తన్ను పిలుచుచున్నదని పలవరించుచుండెడిది. ఐదవనాటిరాత్రి కాబోలు నామె మృతినొందినది. పాపము రాయప్పావధానులుగారికి వివాహ సుఖములేదు సరిగదా, త్వరలోనే ద్వితీయకళత్రమునకు శ్రాద్ధకర్మ చేసుకొన వలసిన యోగముపట్టెను. ఈ వివాహమున కాబ్దికమే యాయనకు ఫలమయ్యెను. ఆయనకేగాదు, ఆయనకుమారుడు లక్ష్మయ్యకూడ, తనతల్లి యాబ్దికముతో పాటు సవతి తల్లి యాబ్దికముగూడ, ప్రతి సంవత్సరము పెట్టవలసిన

వాడయ్యేను. రాయప్పావధానిగారు తరువాత కొన్ని సంవత్సరములకు మృతినొందిరి.

మా తండ్రి నన్ను గొప్ప కర్మిష్ఠిని చేయవలెనని సంకల్పము కలిగి యుండెను. ఆ కోరికతో నాయన నాకు గట్టిగా సంధ్యావందనము జెప్పింప దలచుకొనిరి. మా తండ్రికి సంధ్యావందనము వచ్చును. కాని నాకు జెప్పుటకాయన కెంతమాత్రము తీరుబడిలేదు. ఆయన సంవత్సరమున కారుమాసములు తాలూకాకచ్చేరీలో నమీనాయుద్యోగము జేయుచుండెడి వారు. తక్కినకాలములో లౌక్యవృత్తి నవలంబించుటచే కవుళ్లు, కదపాలు, దస్తావేజులు, గ్రామవాసులకు వ్రాసిపెట్టుచుండెడివారు. దస్తూరి మంచిదగు టచే తరుచుగా రైతులు మొదలయినవారాయననే వ్రాతకు బిలుచుచుండెడి వారు. ఆయన వ్రాసిన కాగితము లిప్పటికిని మా తమ్మునివద్ద గొన్ని కలవు. ఆయన తాటియాకులమీద గూడ బాగుగ వ్రాయగలవారు. నాకు గాని, మా తమ్మునకుగాని, తాటియాకుమీద వ్రాత యలవడినదిగాదు. నేను ప్రతిదినము త్రికాలములయందు యథావిధిగా సంధ్యావందనముచేసి, నిష్టతో నుండవలెనని మాతండ్రి యభిప్రాయము. అందుకు సంధ్యావందనము నేర్చుకొనుటకై నన్ను మా మాతామహిస్థలమైన ఖండవల్లి గ్రామమునకు మా తండ్రిగారు పంపిరి. అప్పుడు మా మేనమామగారు ఖండవల్లిలో లేరు. ఆ దినములలో నాయన విజయనగరములో సంస్కృత విద్యాభ్యా సము చేయుచుండిరి.

నేను ఖండవల్లిలో గొంతకాలముంటిని. సవితాల సుబ్బారాయుడు గారని యొక బ్రాహ్మణోత్తముడు నాకు సంధ్యావందనము చెప్పెను. చిన్నవాడనగుటచే నేనంత శ్రద్ధగా నేర్చుకొనలేదు. కాని నేనప్పుడొక తప్పుజేసితిని. ఆయూరిలోనే నొక మంగలికుర్రవానితో నాడుకొనుచుం టిని. అప్పుడప్పుడు నే నతనికి గాయత్రిమంత్రము చెప్పుచువచ్చితిని. ఒక నాడు నేను మంగలికుర్రవానికి గాయత్రిమంత్రము చెప్పుచుండగా సవితాల సుబ్బారాయుడుగారాదారిని వెళ్లుచు వినిరి. ఆయనకు వెంటనే కోపము వచ్చెను. ఆయన తరువాత మా మాతామహికడకు బోయి జరిగినసంగతి జెప్పి "కొంచము పెద్దవాడయినప్పుడు గాని మీ పిల్లవానికి సంధ్యావంద నము జెప్పగూడదు. ప్రస్తుతము వీరవాసరము పంపించవలసిన"దనిచెప్పిరి.

తరువాత నేను ఖండవల్లి గ్రామమువదలి సంధ్యావందనము నేర్చుకొనుటకై మా పెదతల్లిగారి గ్రామమైన వెలగదుఱ్ఱు వెళ్ళితిని. ఆయూ

రిలోనుండి, యచటికి సమీప గ్రామమైన తాడిపత్రిలో ఋగ్వేద సంధ్యావందనము చెప్పగలవారుండుటచేత ప్రతిదినము నేను తాడిపత్రి వెళ్లుచుంటిని. ఇది చిరకాలము పోసగినదిగాదు.

పిమ్మట నేను మంచిలి గ్రామము వెళ్ళవలసివచ్చెను. అక్కడ మా పినతల్లియు, నామె పెనిమిటియు నుండిరి. మా పినతండ్రికి యజుర్వేద సంధ్యావందనముగాని, ఋగ్వేద సంధ్యావందనముగాని రాదు. మంచిలిలోనున్నప్పుడు నేనొక వీధి పాఠశాలకు వెళ్లుచుంటిని. ఆ పాఠశాల కరణముగారి సావడిలో నుండెను. సోమంచి సుబ్బరాయుడుగారని యొక పంతులుండెను. ఆయన నాకు తాటియాకులమీద వరవడిపెట్టి నాచేత వ్రాయింప ప్రయత్నించెను. ఆయన యెంత యత్నముజేసినను, నేనెంత కష్టపడినను, నాకు గంటము పట్టుకొనుటయే చేతనైనదిగాదు. అక్కడ నేనుండుట యన్నివిధముల వ్యర్థమయినది. తరువాత నేను వీరవాసరము వెళ్ళితిని. ఆయూరి సమీపమున మత్స్యపురియను నొక గ్రామముకలదు. అది నరసాపురము తాలూకా లోనిది. ఆయూరిలో చిలకమర్తి కుటుంబములు మూడుగలవు. వారు మువ్వురు మాకు దగ్గరజ్ఞాతులే. అందొకరు చిలకమర్తి నరసింహశాస్త్రిగారు. ఆయన సంస్కృత కావ్యములు బదువు కొనిరి. ఆయన తెనుగులోను సంస్కృతములోను కవిత్వముకూడ చెప్పగలిగి యుండిరి.

ఆయన స్మార్తకర్మలుగూడ చేయింపగలరు. సంధ్యావందనము నిమిత్తము మాతండ్రి నన్నాగ్రామములో వారి యింట విడిచెను. నేను వారియింట కొన్నిమాసములుండి త్రికాల సంధ్యావందనములు పూర్ణముగ నేర్చికొంటిని. పిమ్మట నేను మరల వీరవాసరము వెళ్ళితిని. సంధ్యావందనము చక్కగా వచ్చినందున నేను సంపూర్ణముగ నుత్సాహముగలిగి, యుదయమున మొగముమీదను చేతులమీదను కడుపుమీదను విభూతి పిండికట్లు పెట్టుకొని, బహుశ్రద్ధతో మూడుపూటల సంధ్యావందనము చేయుచుంటిని. అప్పుడు మా యూరిలోనున్న వెలిచేటివారిబడిలో బదువు కొనుచుంటిని. వెలిచేటి రాయప్పగారు, భద్రాచలముగారు నను నిద్ద రన్నదమ్ములు బడివెట్టిరి. ఆబడిలో నేను జేరితిని. వారు నాకు ప్రథమ గురువులు. తరువాత నేను సోమంచి సరవయ్యగారి బడిలోజేరితిని. అక్కడ నున్నప్పుడు నేను గిలకలు బట్టితిని. గిలకల పద్యములు గంభీరమైన కంఠముతో శ్రావ్యముగ బదువనేర్చితినని మా పంతులుగారు నన్ను చాల

మెచ్చుచుండిరి. ఆకాలమున మా మేనమామగారు మల్లయ్యశాస్త్రిగారు విజయనిగరములో విద్యాభ్యాసముచేసి స్వదేశమువచ్చిరి. ఆయన యుద్యోగమునకై ప్రయత్నముచేసి బెజవాడలో నొక బంధుపుడుండుటచే వానిని జూడబోయిరి. అప్పుడు బెజవాడలో చేవెండ్ర వెంకటాచలంపంతులుగారు తహసీల్‌దారుగ నుండిరి. మల్లయ్యశాస్త్రిగారి కాయన పరిచయమాయెను. వెంకటాచలము పంతులుగారు విద్యాభిమానముగలవారు. పండితపక్షపాతి. ఆదినములలో బెజవాడలో హారిసన్‌గారను క్రైస్తవ మతబోధకుడుండెను. వెంకటాచలము పంతులుగారును క్రైస్తవుడే. ఏదేని యొక యుద్యోగమును శాస్త్రిగారి కిప్పింపుమని పంతులుగారు, దొరగారికి సిఫారసు జేసిరి.

బెజవాడకు సమీపమందున్న కొండపల్లి గ్రామములో మిషనువారి పాఠశాల యొకటి యుండెను. దానిమీది పెత్తనమంతయు దొరగారిది. దొరగారు శాస్త్రిగారికా పాఠశాలలో తెనుగుపండితుని పనియిచ్చెను. ఆ పాఠశాలలో ముగ్గురే యుపాధ్యాయులు. ఒకరింగ్లీషు చెప్పుటకును, మరి యొక రుర్దూభాషచెప్పుటకును, శాస్త్రిగారు తెనుగుచెప్పుటకును నిర్ణయింప బడిరి. శాస్త్రిగారు కొండపల్లి వెళ్ళినప్పు డేడెనిమిది సంవత్సరములు వయస్సుగల నన్నుగూడ దీసికొనిపోయిరి. కొండపల్లిలో నేను కొంత కాలముంటిని. ఊరి చివర నొక కొండమీద నా పాఠశాలయుండెను. పాఠశాలకు నేనును మా మేనమామగారును నడచి పోవుచుంటిమి. ఆ యూరిలో బ్రహ్మమేడిదొంకలు మెండు. అదిగాక పాముల సంచార మెక్కువగనుండెను. ఒకనాడు మా మాతామహి నిద్రపోవుచుండగ నామె శరీరముమీదనుండి యొక త్రాచుపాము ప్రాకి వెళ్లెను. మెలకువ వచ్చినను సర్పము కరచునేమో యను భయమున కదలక మెదలక యూరకుండెను. అక్కడ మహమ్మదీయులు మెండుగనుండిరి. పట్టణము నందు వలెనే యచ్చట బజారును కొట్లును గలవు. నేను మొట్టమొదట నౌటాకు, చటాకు, సవాసేరు మొదలగు శబ్దములచ్చటనే వింటిని. కొండ పల్లి వెళ్ళకమునుపు మేము బెజవాడలో కొన్నాళ్లుంటిమి. అప్పుడే నేను మొట్టమొదట పర్వతములు జూచితిని. కృష్ణానదిగూడ నేనప్పుడే మొట్ట మొదటిసారి జూచితిని. కొండపల్లినీరు నాకుగాని మా మేనమామగారికి గాని సరిపడలేదు. ఆయన వ్యాధిగ్రస్తుడయ్యెను. నేనును జబ్బుపడితిని. మా మేనమామగారికి విభవ సంవత్సరమునందు మత్స్యపురిలోనున్న మా చిలకమర్తివారి యాడుపడుచునే యిచ్చి వివాహముజేసిరి. మేము

కొండపల్లిలోనుండగా యాయనభార్య కాపురమునకు రాలేదు. కావున మా మేనమామయు మా మాతామహియు నేనును ముగ్గురము మాత్రమే యక్కడనుంటిమి. మహమ్మదీయుడగు పంతులుగారి సహవాసమున మా మేనమామగారు హిందూస్థానీగూడ మాటాడగలిగిరి. అసమానమైన పాండిత్యము మంచిబోధనశక్తియు నుండుటచే మా మేనమామగారు గ్రామస్తుల యొక్కయు, విద్యార్థులయొక్కయు మెప్పుబడసిరి. అయినను రోగపీడితులగుటచేత శాస్త్రిగారా యూరు విడువవలసి వచ్చెను. కొండపల్లి లక్కబొమ్మలకు చాల ప్రసిద్ధి. అక్కడనుండి మేము బయలుదేరునప్పుడు కొందరు ముచ్చివారు శాస్త్రిగారి కొక లక్కపెట్టెయు, లక్క దానిమ్మ చెట్టును చేసి బహూమానమిచ్చిరి. శాస్త్రిగారు ఖండవల్లి వెళ్ళిరి. నేను వీరవాసరము వెళ్ళితిని.

జబ్బు నెమ్మదించిన తరువాత శాస్త్రిగారు మరల తణుకు తాలూకా లోని మొయ్యేరు గ్రామములో నుపాధ్యాయపదవి సంపాదించిరి. అక్కడ నాలుగేండ్లుండిరి. ఆకాలమున సంజీవరావు పంతులుగారని యొకమాధ్వుడు పాఠశాలా పరీక్షకుడుగా (Dy. Inspector of Schools) నుండెను. ఆయనకు సంస్కృతములో గొంత పాండిత్యముగలదు. అందుచేత శాస్త్రి గారిమీద నభిమానము గలిగి యాపదవి నిప్పించిరి.

అప్పటి పాఠశాలా పరీక్షకుల సంగతి కొంచెము వ్రాయుట యవసరము. ఇప్పటివలె జిల్లాకొక యధికారిలేడు. నాలుగుజిల్లాలకొక పరీక్షాధికారి (Inspector of Schools) యుండెడివాడు. ఆయన మకాము విశాఖపట్టణము. ఆయనాంగ్లేయుడు. జిల్లాకు నిద్దరు ముగ్గురు డిప్యూటీ యిన్స్పెక్టరులు మాత్రముండిరి. తూర్పుగోదావరిజిల్లాయు, పడమటి గోదావరి జిల్లాయు గలిసి యప్పుడొకటే జిల్లాగానుండెను. జిల్లాకంతకు నిద్దరే డిప్యూటీ యిన్స్పెక్టర్లు. రాజమహేంద్రవరము తాలూకా, అమలాపురము పెద్దాపురము రామచంద్రపురము కాకినాడ తాలూకాలు, పిఠాపురము తుని దివిజనులు కలసి, యొక డిప్యూటీ యిన్స్పెక్టరుగారి యధికారమందుండెను. ఆఖండమునకా కాలమున క్రోవి దక్షిణామూర్తిశాస్త్రిగారు పాఠశాలా పరీక్షాధికారిగ Dy. Inspector of Schools నుండిరి. రెండవ ఖండమున కనగా ఏలూరు, ఎర్రగూడెము, తణుకు, నరసాపురము, భీమవరము తాలూకాలకు నొక డిప్యూటీ ఇన్స్పెక్టరుగారుండిరి. ఆయనే కవినిధి సంజీవరావు పంతులుగారు. ఆకాలమున పాఠశాలలు విశేషముగ

లేకపోవుటచేతను, విద్యావాప్తి తక్కువగ నుండుటచేతను, పరీక్షాధికారులు గూడా తక్కువగనుండిరి.

1874 వ సంవత్సరములో ననగా శ్రీ ముఖసంవత్సరమున, హార్గశిర మాసమునలో పుష్యమాసమునలో, నా మేనత్త చామర్తి సుబ్బమ్మ మృతినొందెను. ఆమెకు కొన్నియేడ్లక్రిందట నెలుక కఱచినందున నా జంతువు విషము జీర్ణించి చనిపోవువరకు నామెను బాధపెట్టెను. పున్నమికి నమావాశ్యకు బాధకలుగుచుండెను. ఆ కారణమున నామె యకాలముననే తల్లియుండగ మృతినొందెను. ఆమెకు సంతానము లేకపోవుటచే మృతినొందకమునుపు మరణశాసనము వ్రాయించి దన యాస్తినంతయు మా తండ్రిగారికిచ్చివేసెను. వివాదములు లేకుండుటకై యా మరణశాసనము రిజిష్టరు చేయించెను. అప్పుడు రిజిష్టారులులేరు. తాలూకా తహసీల్దారో సిరస్తదారో కాగితములు రిజిష్టరు చేయుచు వచ్చిరి. మా మేనత్తకు మొగలితుర్రులో విశాలమైన స్థలము పెంకుటిల్లు నుండెను. అదిగాక యిత్తడి సామానులు కొయ్యసామానులు విశేషముగ నుండెను. ఆ యాస్తి మాకు సంక్రమించినందున మా యిల్లు సామానులతో నిండిపోయెను. మా తండ్రిగారు బందుగులకు మిత్రులకు నెన్నో మంచములు మొదలైన సామానులు యిచ్చివేసిరి. మా మేనత్తగారియిల్లు మా తండ్రిగారు తరువాత కొంతకాలమునకు విక్రయించిరి.

నేను కొండపల్లినుండి వచ్చినతరువాత సోమంచి సరవయ్యగారి పాఠశాలలోనే మరల జదివితిని. అక్కడ చదువు ముగియగానే 1878 వ సంవత్సరములో నేను వీరవాసరములోని దొరతనమువారి పాఠశాలలో మొదటితరగతిలో జేరితిని. అది యూరిచివర పడమరదిక్కుగ నుండెడిది. అది గడ్డియిల్లు, మట్టిగోడలు. నేనక్కడ జేరునప్పటి కాగృహము శిథిలమై యుండెను. ఆ పాఠశాలకు ప్రధానోపాధ్యాయులప్పుడు చెన్నాప్రగడ లక్ష్మీనరసయ్యగారు. ఈయన యింగ్లీషులో బ్రవేశపరీక్షయందు గృతార్థులగుటయే గాక సంస్కృతాంధ్రములలో గూడ మంచి పాండిత్యము గలిగియుండిరి. తెనుగులో జక్కని కవిత్వము జెప్పగలరు. గవర్నమెంటు వారికి మొన్నమొన్నటివరకు ట్రాన్స్లేటరుగ నుండిన చెన్నాప్రగడ భానుమూర్తిగారికి ఈయన సాక్షాత్తు పెదతండ్రి కుమారుడు.

లక్ష్మీనరసయ్యగారు చదువుచెప్పించుటకై తనతోగూడ భానుమూర్తిగారిని వీరవాసరము దీసుకొనివచ్చిరి. భానుమూర్తిగారును నేనును ఒకపాఠ

శాలలోనే జదువుకొనుటచేత మా కిరువురకును స్నేహభావ మేర్పడెను. తరువాత మేమిరువురము చెరియొక యూరులోనున్నను భానుమూర్తి గారికిప్పటికి నాయెడ నత్యంతస్నేహము, ప్రేమయు గలవు. భాను మూర్తిగా రుభయభాషలయందు బ్రవీణులు. ఇంగ్లీషునందు బి. ఏ. పరీక్ష యందు తీర్ణులైనవారు. విశేషించి బ్రహ్మజ్ఞానసంపన్నులు. భూతదయా ళువు, నుదారశీలుడు, సుగుణపుంజమై యాంధ్రదేశమున కొకయలంకార మయ్యెనని జెప్పవచ్చును. అదృష్టవశమున నీయ నిప్పటికి నారోగ్యముగ నున్నారు. ఈయన కవిత్వము ధారాళమైనది. ఈయనకుమారుడు సుబ్బా రావుగారిప్పుడు రాజమహేంద్రవరములో వైద్యులైయుండి, పితృ మిత్రు డైన నాకు, నా కుటుంబమునకు, వైద్యసహాయముచేయుచున్నారు.

దొరతనమువారి పాఠశాలలో బాలురు గిలకలుపట్టరు. అక్కడ చదువుచున్నను మా తొల్లిటి యుపాధ్యాయుడైన సోమంచి సరవయ్యగారి ప్రేరణముచేత గిలకలు పట్టవలసినవాడనైతిని. నేను గిలకల పద్యములు శ్రావ్యముగ జదువగలుగుటచే, నన్ను దీసుకొని వెళ్ళినయడల నెక్కువ ధబ్బు తనకు వచ్చునను నాసచే, మా తండ్రిగారిని బ్రతిమాలి ననొ్నడం బరచి, సరవయ్యగారు, దొరతనమువారి పాఠశాలలో విద్యార్థినైన నన్ను గూడ వెంటబెట్టుకొని, భాగ్యవంతులగు గృహస్థుల యిండ్లకు దీసుకొని పోయి పద్యములు చదివించుచుండిరి.

మా మేనత్త మరణానంతరమున మాకొక చెల్లెలు పుట్టెను. నేను పుట్టినపుడు స్వప్నములో గనబడినట్లే మాతల్లికి పురిటిలో మా మేన కూతురు పున్నమ్మ కలలోకనబడి పేరుపెట్టమని కోరెనట. అప్పటికి మా మేనత్త లేదుగనుక మా తండ్రిగూడ మాచెల్లెలికి పున్నమ్మగారిపేరు పెట్టుట కొప్పుకొనెను. అందుచేత నామె యున్నపూర్ణమ్మయనియు పున్నమ్మయనియు వ్యవహరింపబడుచున్నది. ఈమె వివాహవిషయమై యిచ్చట గొంత చెప్పవలసియున్నది. మా తల్లిదండ్రులకు మొదటిబిడ్డ యైన లచ్చమ్మయనుపిల్ల వివాహము కాకుండగనే చనిపోయినది. రెండవ పిల్లయైన సుబ్బమ్మ పొదిలి రాయప్పావధానులుగారిని వివాహమాడి కొలదికాలముననే మృతినొందెనని యీవరకే చెప్పితినిగదా! కాబట్టి యాఱుపిల్ల పున్నమ్మయొక్కటెయే యుండెను. ఏమారము పది సంవత్స రములు పెంచి పెండ్లిచేసిన పిల్ల పెండ్లికాగానే పోవుటచేతను, పెద్దపిల్ల పెండ్లి కాకుండగనే మృతినొందుటచేతను, పున్నమ్మకు చిన్నతనమందే

పెండ్లిచేసినపక్షమున చిరకాలము జీవించునని మా పితామహికిని, మా తండ్రికిని నమ్మిక గలిగెను. మొగలితుఱ్ఱు గ్రామములో మాకు సన్నిహిత జ్ఞాతులైన చిలకమర్తి పుల్లయ్యగారుండిరి. ఆయన జీవించియుండగనే పెద్దకుమార్తె ప్రసవించి యొక కుమారునిగని మృతినొందెను. ఆ దౌహిత్రుడు పుల్లయ్యగారి యింటనే పెరుగుచుండెను. ఆతనికి రమారమీ పదునెనిమిది సంవత్సరములు వచ్చినతరువాత వివాహముచేయ నిశ్చయించిరి. అతని యింటిపేరద్దంకివారు, అతనిపేరు వేంకట రామయ్యగారు. ఆయన తండ్రిపేరు కృష్ణమ్మగారు. పుల్లయ్యగారికి నరసాపురముకోర్టులో స్టాంపువెండరుపని యుండెడిది. తల్లిలేని పిల్లవాడుగదాయని పుల్లయ్యగారు వేంకట రామయ్యగారికి యీపని వేయించిరి. వేంకట రామయ్యగారు నరసాపురములోనుండి యీపని జూచుచుండిరి. పుల్లయ్యగారు మా చెల్లెలు పున్నమ్మను వేంకటరామయ్యగారికిచ్చి వివాహముచేయుమని మా తండ్రిగారికి వర్తమానమంపిరి. బాల్యముననే కూతునకు వివాహము చేయవలెనన్న మా తండ్రిగారికా రాయబారము సంతోషదాయక మయ్యెను. ధాతసంవత్సరములో ననగా 1877 వ సం॥రములో, మా చెల్లెలు పున్నమ్మకు మూడుసంవత్సరముల వయస్సులో మా స్వగృహమున వివాహముజరిగెను. కాని మిక్కిలి చిన్నపిల్లయగుటచే మాచెల్లెలు పెండ్లిపల్లకిలో గూర్చుండక మారముజేసెను. అందుచేత మాతండ్రిగారు పల్లకిలో పెండ్లికుమారుని కెదురుగ నన్ను గూర్చుండబెట్టి, మా చెల్లెలిని నా యొడిలో గూర్చుండబెట్టుచు వచ్చిరి. మా చెల్లెలితోబాటు నేనుగూడ నైదు దినములు నూరేగితిని. అతి బాల్యవివాహములలో నిటువంటి వైచిత్ర్యములు తరుచుగా జరుగుచుండునుగదా। అప్పటికి నాకు పది సంవత్సరముల వయస్సు. వంకాయల పాటినుండి వేంకటరామయ్యగారి సవతితల్లియు మొదలయినవారనేక బంధువులు మా పున్నమ్మ పెండ్లికి మాయింటికి వచ్చిరి. ఆసంవత్సరము గొప్పకరవైనను మా పొలములు బాగుగపండుటచే నేకొరతయు లేకుండ వివాహము బాగుగజరిగెను. చిలకమర్తి పుల్లయ్యగారు దౌహిత్రునకు నుద్యోగమిప్పించుటయే గాక మొగలితుఱ్ఱు సివారు గ్రామమైన సేరిగపాలెములో గొంతభూమిగూడ నిచ్చిరి. పుల్లయ్యగారు ధనము, భూమియు సంపాదించిరి. పుల్లయ్యగారు జీవించియుండగానే యాయన యేక పుత్రుడు చనిపోయెను. ఆకుమారునకొక కుమారుడుండెను. పుల్లయ్యగారు కొంత భూమి దౌహిత్రునకిచ్చి తక్కిన భూమియు రెండు పెంకుటి యిండ్లును

తన పౌత్రుడైన లింగమూర్తిగారి కిచ్చిరి. లింగమూర్తిగారు నాకంటె కొంచము పెద్దవారు. దైవానుగ్రహమున నాతడిప్పటికిని జీవించియున్నాడు.

పున్నమ్మ వివాహములో బాల్య చాపల్యముచేత నేనును లింగమూర్తిగారును, మా జ్ఞాతియైన మరొకపిల్లవాడును, నొక తెలివితక్కువ పని జేసితిమి. మాయూరికి పడమటివైపున ఎల్లమ్మ చెరువని యొక తటాకము గలదు. మేము ముగ్గురము వస్త్రములు విసర్జించి వాటిని గట్టు మీదబెట్టి చెరువులో జలక్రీడ లారంభించితిమి. మేమా గొడవలోనుండగా వస్త్రము లెవ్వడో దొంగిలించుకొనిపోయెను. కట్టుకొనుటకు గుడ్డలులేక దెసమొలలతో సిగ్గుపడుచు సందుల గొందులదారిబట్టి యింటికివచ్చి పెద్దలచే దిట్టముగ జీవాట్లుదింటిమి.

మా పాఠశాల మట్టిగోడలతో గట్టబడి యావురు గడ్డికప్పుగలిగి కొన్నిచోట్ల పెద్దపెద్ద రంధ్రములుపడి జీర్ణస్థితిలో నుండుటచే, నచ్చట పాఠశాలనుంచుట యుచితముగాదని పై యధికారుల శలవుపొంది, గ్రామమధ్యమున నొకయిల్లు నద్దెకుపుచ్చుకొని, ప్రధానోపాధ్యాయులైన లక్ష్మీనరసయ్యగారు బడి నచ్చోటికి మార్చిరి. బాలురూరిచివరకు బోనక్కరలేక యూరి నడుమనేయున్న పాఠశాలకుబోయి సుఖించిరి. ఆకాలమున మాపాఠశాలలో రెండవ యుపాధ్యాయుడు బ్రహ్మశ్రీ ఆదిభట్ల సాంబమూర్తిగారు. మూడవ ఉపాధ్యాడు నేను బడిలో జేరునప్పటికి చిలకలపూడి రామస్వామిగారు. నేను వెళ్ళినకొలదికాలమునకే యాయన మరొకచోటికి మార్చబడిరి. ఆయన స్థానమందు మూడవయుపాధ్యాయుడుగ ఆచంట వెంకటాచలపతిగారు నియమింపబడిరి. ఈయన డాక్టరు ఆచంట లక్ష్మీపతిగారి పినతండ్రిగారు. ఈయన యొకటిరెండు తరగతులకు బాఠము చెప్పుచుండెడివారు. నేను 1879 వ సంవత్సరములో రెండవతరగతి జదివితిని. నేను పాఠములు జక్కగ చదువుకొని యుపాధ్యాయుల మెప్పుబడయుచుంటినిగాని గణితమునందు నా కభిరుచిలేదు. 1880 వ సంవత్సరమున మూడవతరగతిలో జేరితిని. అది యిప్పటి మొదటిఫారముకు సరియైన తరగతి. ఈ తరగతికి మోరల్ క్లాసుబుక్కను పేరుగల నింగ్లీషు పాఠపుస్తకముండెను. అది మిక్కిలి మంచిపుస్తకము. అందులో రమారమి యాబదిపుటలు మూడవ తరగతికిని నూరుపుటలవరకు పై తరగతికిని పాఠ్యములుగ నేర్పరచిరి. అటువంటి పుస్తక మిటీవల క్రిందితరగతులకు నియమింప బడనేలేదు. ఆకాలమున మొదటితరగతికి దొరతనమువా రచ్చువేయించిన తెలుగు

పుస్తకమును, వారిచేతనే ప్రకటింపబడిన "Madras Reader" (మెడ్రాస్ రీడర్) అను నింగ్లీషుపుస్తకమును చెన్నపురిరాజధాని భూగోళమును, శేషయ్య వ్యాకరణమును, హిందూదేశచరిత్రములో నారధ్యాయములును, పఠనీయములైయుండెను. రాజమహేంద్రవరములోకొంతకాలము మండల న్యాయాధిపతిగా (District Judje) నున్న మారిసుదొరగారింగ్లీషులో నొక హిందూదేశచరిత్రము వ్రాసిరి. ఆ చరిత్రమునకు దొరతనమువారు తెలుగు వ్రాయించి పండ్రెండధ్యాయములుగల గ్రంథముగ ప్రకటించిరి. అది నాలుగవ మైసూరు యుద్ధముతో ననగా టిప్పుసుల్తాను మరణముతో సమాప్తమయ్యెను. అందు మొదటి యారధ్యాయములు మొదటితరగతికిని, దక్కిన యారధ్యాయములు, రెండవతరగతికిని బఠనీయములుగ నేర్పడినవి. రెండవ తరగతికిగూడ గవర్నమెంటువారే తెలుగువాచకమును, రెండవ మెడ్రాసు రీడరును ప్రకటించిరి. అవే మేము జదువుచుంటిమి. అప్పుడు జిమ్నాస్టిక్సు, డ్రిల్లు మొదలైనవి లేవు. మేము రెండవతరగతి జదువుచుండగనే దొరతనమువారు ప్రయిమరీపరీక్ష స్థాపించిరి. అదే తరువాత అప్పర్ ప్రైమరీ పరీక్షగ మారెను. అందు కృతార్థులైనవారు నార్మలు స్కూలులో ననగా ట్రయినింగుస్కూలులో జేరుట కధికారముండెను. ఆ కాలమున నరసాపురమున నొక నార్మలు స్కూలును, రాజమహేంద్రవరములో నొక నార్మలుస్కూలు నుండెను. అప్పుడు హయ్యరెలిమెంటరీ గ్రేడనియు, లోయరుగ్రేడనియు భేదములులేవు. తరువాతనే యీ మార్పులు వచ్చెను. రెండవతరగతి పరీక్షలో నేను కృతార్థుడనై మూడవతరగతిలో 1880 వ సంవత్సరమున జేరితిని. ఈ తరగతిలో మారిసుదొరగారు చేసిన యింగ్లీషు వ్యాకరణముగూడ మేము జదువవలసివచ్చెను.

ఆ 1879 సంవత్సరములోనే మా పితామహి మృతినొందెను. ఆమె మరణమునకు ముందు నాలుగుమాసములో మూడుమాసములో మంచ మెక్కెను. మా తండ్రిగారు మొదటినుండియు మాతృభక్తి విశేషముగ గలవారు. ఆమె యేదికోరిన నది చేసెడివారు. వరదాకుటుంబముగారి వివాహము గూడ నామె ప్రోత్సాహముచేతనే జేయబడినది. మా తండ్రిగారామెకు చేసిన యుపచారము వర్ణనాతీతము. చిన్నతనమున తనతండ్రి మృతినొందిన నాటనుండి బంధుసహాయము లేకపోయినను, నిల్లు వాకిలి మడిమాన్యములు లేకపోయినను, మిక్కిలి శ్రమపడి పెంచి విద్యాబుద్ధులు చెప్పించి తన్నొకయింటివానిని తనతల్లియే జేసినదని, మా తండ్రిగారు

మిక్కిలి కృతజ్ఞుడై, యామె నఖండగౌరవముతోను ప్రేమతోను జూచి ముప్పుగడపిరి. ఆమె నవసానస్థితిలో క్రిందపడవై చిరి. ప్రాణము చాల సేపు వరకు పోలేదు. అప్పుడు మా తండ్రిగారు నీళ్ళలో కొన్ని తులసి దళములు వేసి యుద్ధరిణెతో నాతులసితీర్థము నాచేత నామెనోటిలో బోయించిరి. ఆమె బహుధాన్యసంవత్సర కార్తికపూర్ణిమనాటి యుదయమున మృతి నొందెను. ఆదినముననే మా గురువైన సోమంచి సరవయ్యగారు కూడ మృతినొందిరి. ఆయన తండ్రికొక్కడేపుత్రుడు. వివాహముకూడ నయ్యెను. మాయూరిలో సోమంచివారి కుటుంబములైదారు గలవు. మాపితామహి శ్రార్థ్దమునకు మా తండ్రిగారు సోమంచివారి పిల్లలను భోక్తలుగ బిలిచిరి. "మీ సరవయ్యగారి శ్రాద్ధమునకు మీ పెద్దపిల్ల వానిని భోక్తగ బంపితివేని మా పిల్లలను మీయింటికి బంపెదమని," సోమంచివారు కొందరు మాతండ్రి గారితో జెప్పిరి. మేము వైదికవృత్తిలో లేకపోయినను, తల్లి శ్రాద్ధమునకు భోక్తలు దొరకరేమో యను భయమున, మా తండ్రిగారు నన్ను బలవంత పెట్టి షోడశ బ్రాహ్మణార్థమునకు బంపిరి. విధిలేక నేను వెళ్ళవలసి వచ్చినది.

ధాత సంవత్సరపు జ్యేష్ఠమునకు, నెల్లూరు మండలమునుండి మా బంధువులు రెండు కుటుంబముల వారక్కడ యన్న వస్త్రములు జరుగక వీరవాసరమువచ్చి యచ్చట కాపురముండిరి. అందొక కుటుంబమువారు అక్కాపంతుల నరసయ్యగారు. వారద్దంకి సీమలోని సోమవరపుపాడునుండి వచ్చిరి. ఆయనభార్య మాతండ్రిగారికి పినతల్లికూతురు. అనగా వరదా కుటుంబముగారి యప్పగారు. రెండవ కుటుంబము వారు మధునాపంతుల కాలభైరవశాస్త్రిగారు. ఆయనయు నద్దంకిసీమలోని మేదరమెట్టనుండివచ్చిరి. ఆయన భార్య, మత్స్యపురి గ్రామములో నుండి నాకు మున్ను సంధ్యావంద నము నేర్పిన చిలకమర్తి నరసింహశాస్త్రిగారి యప్పగారు. నరసయ్య గారును కాలభైరవశాస్త్రిగారునుబహుకుటుంబీకులు. నరసయ్యగారు యాయా వరముజేసి కుటుంబపోషణము జేసుకొనుచుండెడివారు. కాలభైరవశాస్త్రి గారు మిక్కిలి వృద్ధులై సంచారముజేయుటకు సమర్థులు గాకపోవుటచే జ్యేష్ఠకుమార్తుడు చుట్టుప్రక్కల గ్రామములలో యాయావరము జేసి తలిదండ్రులను తమ్ములను చెల్లెండ్రను బోషించుచుండెను. వారి యింట మరణములు వచ్చినప్పుడుగూడ మా తలిదండ్రుల బలవంతము చేత నేను వారి యిండ్లకు శ్రాద్ధభోక్తగా వెళ్ళవలసివచ్చెడిది.

1880 వ సంవత్సరమున నేను మూడవతరగతిలో (ననగా నిప్పటి ఫస్టుఫారములో) చేరగానే, మా తల్లిదండ్రులు నరసాపురమునకు సమీప మందున్న, యంతర్వేదియాత్రకు బోదలచిరి. మాబడికి బ్రధానోపాధ్యాయు లైన చెన్నాప్రగడ లక్ష్మీనరసయ్యగారు, నేను మా జననీజనకులతో వెళ్లుట కెంత కుతూహలపడినను నాకు శలవిచ్చినారుగారు. అందుచేత మా తలి దండ్రులు, భోజనమునకై నన్నొక వేదబ్రాహ్మణులయింట నప్పగించి కావల సిన సరకులు వారికిచ్చి యాత్రకుబోయిరి. అంతర్వేదిక్షేత్రము నే నంతకు మున్నొకటి రెండుసారులును, తరువాత నొకసారియు జూచితిని. అచ్చట లక్ష్మీనరసింహస్వామివారు ప్రధానదేవత, నీలకంఠేశ్వరస్వామి యను శివుడు క్షేత్రపాలకుడు, గుఱ్ఱాలక్క- గ్రామదేవత. నరసాపురమునుండియు, యితరస్థలములనుండియు, వేలకొలది యాత్రికులు మాఘశుద్ధ దశమినాటి కిచ్చటికి జేరుదురు. ఆరాత్రియే నరసింహస్వామివారి కళ్యాణము. ఆ తిరు నాళ్లు నాలుగుదినములు జరుగును. తీర్థవాసులు గోదావరిస్నానము, సాగరసంగస్నానముజేసి, స్వామిని సేవించి పోవుచుందురు. గౌతమి యంతర్వేది దగ్గరనే సముద్రములో గలియును.

నేను మూడవతరగతి జదువుచున్నప్పుడు గణితములో మిక్కిలి వెనుకబడియుంటిని. తెలుగులోను నింగ్లీషులోను దేశచరిత్రములోను భూగో శములోను ప్రజ్ఞావంతుడనేగాని గణితములో సమర్థత తక్కువ. దీనికి రెండుకారణములు. నాకు గణితములో సహజముగ నభిరుచి లేకపోవుట యొకటి. నా దృష్టిదోషము రెండవ కారణము. ఉపాధ్యాయులు నల్లబల్ల మీద వేసిన యంకెలు నాకు గనబడెడివిగావు, ఈ రెండు కారణములచేత నేను గణితములో మిక్కిలి వెనకబడియుండెడివాడను. ఆచంట వెంకటా చలపతిగారు మూడవతరగతికి గణితము నేర్పుచుండిరి. ఆయన మిక్కిలి కోపస్వభావులు. లెక్కలు తప్పినప్పుడెల్ల నన్నాయన బెత్తముతో దండించుచుండెను. ఒకసారి యా పంతులుగారు కోపించి, లెక్క తప్పి నందుకు రెండు చేతులమీద నన్ను యిరువది దెబ్బలకంటె నెక్కువగా కొట్టిరని, నాకుజ్ఞాపకము. అప్పుడు నాకు పదమూడేండ్ల వయసు. ఎలాగో యొకలాగు సంవత్సరాంతమున మూడవతరగతి పరీక్షయందు కృతార్థుడనై నాలుగవతరగతికి వెళ్ళితిని. మూడవతరగతివరకు దేశచరిత్రము భూగో శము గణితము తెనుగుతో నేర్పుచుండిరిగాని, నాలుగవ తరగతినుండి తెలుగు వాచకములుతప్ప తక్కిన వింగ్లీషు భాషలోనే నేర్పుచుండిరి.

నాలుగవతరగతి యిప్పటి రెండవ ఫారమునకు (II nd form) సమానము. అప్పుడు దానికి (Lower fourth class) లోవరు ఫోర్తు తరగతియని పేరు. దానికి మోరలుక్లాసు పుస్తకములో నూరు పుటలును, మాన్యూలు గ్రామరను పేరుగల యింగ్లీషు వ్యాకరణమును, మారిసు దొరగారింగ్లీషులో వ్రాసిన హిందూదేశ చరిత్రలో కొన్ని యధ్యాయములును, యింగ్లాండు దేశచరిత్రములో కొంతభాగమును, క్లయిడ్ దొరగారుచేసిన ప్రపంచభూగోళములో నాసియాఖండమును, డంకన్‌దొరగారు వ్రాసిన హిందూదేశ భూగోళములో గొంతభాగమును, యూక్లిడుచేసిన రేఖాగణితములో పదునారు ప్రాపోజిషనులును, నాలుగవతరగతి బాలురు జదువవలసియుండెను. అవియన్నియు నింగ్లీషులోనే జదువవలసియుండెను. తెలుగులో భారతమందలి నలోపాఖ్యానమున నేబది పద్యములవరకు మూడవ తరగతిలోను, నూరు పద్యములవరకు నాలుగవ తరగతిలోను, జదివి యప్పగింపవలెను.

నేను మూడవతరగతిలో నుండగనే చెన్నాప్రగడ లక్ష్మీనరసయ్య గారికి వీరవాసరమునుండి బదిలీయయ్యెను. ఆయన స్థానమందనకాపల్లినుండి పూడిపెద్ది మహాదేవము పంతులుగారు వచ్చియుండిరి. ఆయన రమారమి పాతిక సంవత్సరములు వయసుగలవారు. మిక్కిలి చురుకుగలవారు. చెన్నాప్రగడ లక్ష్మీనరసయ్యగారు వీరవాసరమునుండి వెళ్ళిన తరువాత, నమలాపురము హైస్కూలులో సహాయోపాధ్యాలుగ నుండి, పెద్ద తరగతులకుగూడ భాషాంతరీకరణము మున్నగునవి నేర్పుచు, విద్యార్థుల చేతను పురజనులచేతను గౌరవింపబడుచు, జాలకాలము బనిజేసి యుపకార వేతనముపొంది, పిమ్మట కొంతకాలమునకు మృతినొందిరి. ఈయన నాకు మిక్కిలి పూజ్యులు, చిరస్మరణీయులు. లక్ష్మీనరసయ్యగారి స్థానమున వచ్చిన క్రొత్త ప్రధానోపాధ్యాయులు మహాదేవముగారు మిక్కిలి చాక చక్యముగలవారు. గట్టి బోధనశక్తిగలవారు. లోవరుఫోర్తు తరగతిలో మాకీయన యన్నిపాఠములు జెప్పుచుండెడివారు. ఇంగ్లీషు మిక్కిలి శ్రద్ధతోను నిపుణతతోను జెప్పిరి. ఆయన వేసినపునాది నాకు ప్రవేశపరీక్ష యందు కృతార్థుడనైనదాక నుపకరించెను.

ఆ దినములలో నుత్తరసర్కారులకు పాఠశాలాపరీక్షకులుగా నలెగ్జాండరు మన్రోదొరగారుండిరి. వారేఁటి వచ్చి మా పాఠశాలను పరీక్షించుచుండిరి. 1881 వ సంవత్సరమున దొరగారు వచ్చునప్పటికి నేను తర

గతిలో మొదటివాడనై మానేటరుగ నుంటిని. ఆయన నన్ను పరీక్షించి నాకొక పుస్తకమును బహుమతిగ నిచ్చిరి. అదియొక యింగ్లీషు నిఘంటువు. పూర్వకాలము పరీక్షాధికారులు బహుమానమిచ్చుటకై దొరతనము వారు ప్రత్యేకముగ గొన్ని పుస్తకముల సిద్ధముచేయుచుండిరి. అవి దట్టమైన కాలికోఅట్టగలిగి, యట్టలమీద బంగారపుటక్షరములు గలిగి, మిక్కిలి మనోహరముగ నుండెడివి. నాకిచ్చిన పుస్తకము గూడ నట్టిదే ఆ బహుమానముతో నేను మిక్కిలి తెలివిగలవాడనని యూరంత జెప్పుకొన నారంభించిరి. మా తల్లిదండ్రుల యానందమునకు మితియేలేదు. మా పాఠశాలలో మూడవయుపాధ్యాయుడుగ నుండిన యాచంట వేంకటాచలపతిగారి స్థానమున ఉచ్చ శ్రీరాములుగారనువారు వచ్చిరి. ఆయన కొన్ని మాసములుండిరి. ఈ శ్రీరాములుగారు పిమ్మట రాజమహేంద్రవరములో ట్రయినింగుస్కూలులో చిరకాలము పనిచేసి పింఛను పుచ్చుకొని యిటీవలనే మృతినొందిరి. ఆయన స్థానమునందు దువ్వూరి సుబ్బరాయుడుగారు వచ్చిరి. ఈయన కొంతకాలము పనిజేసి, తరువాత కోర్టులో గుమాస్తాగా జేరి యీ పట్టణమందలి కోర్టులో గూడ పనిజేసి, యిటీవలనే మృతినొందిరి. ఇంగ్లీషుపాఠము మొదలైనవి నా కుపాధ్యాయులు చెప్పగానే వచ్చెడివి. నాకు జ్ఞాపకశక్తి మెండు. ఇప్పుడు నాకు డెబ్బదియేడు సంవత్సరములున్నను శరీరశక్తులు చాల తగ్గినవిగాని జ్ఞాపకశక్తి తగ్గలేదు. ఇది దైవానుగ్రహము. నా కైదవయేడు వచ్చినది మొదలుకొని జరిగిన సంగతులు చాలవరకు నాకిప్పటికిని జ్ఞాపకమున్నవి. ఆ కారణమున నాకన్న మందమతులైన బాలురు నాకడకు వచ్చి యింగ్లీషుపాఠములు మొదలైనవి నేర్చుకొనుచుండిరి. విసుగుకొనక నేను వారికి జెప్పుచుండెడివాడను. అందుకు వారు కృతజ్ఞులై నాకు కానీ, రెండుకానులు బహుమానమిచ్చుచుండిరి. ఆ డబ్బులు నేను సొంతముగ వాడుకొనక నాకు మిక్కిలి ప్రేమాస్పదురాలైన మా తల్లికిచ్చుచుండెడివాడను. మా తండ్రివలెనే నాకును మాతృభక్తి విశేషమని జెప్పుట యతిశయోక్తిగాదు.

ఇచ్చట మా తల్లిని గురించి కొంతచెప్పవలసియున్నది. ఆమె కోడరికపుబాధ మిక్కిలిపడెను. మా పితామహి మిక్కిలి కోపస్వభావురాలు. ఆమెచేత మాయమ్మ పడినబాధలనేకములు. మాతండ్రిగూడ మాయమ్మయెడ కఠినముగనే ప్రవర్తించెను. అప్పుడప్పుడు మాయమ్మను మాతండ్రి గొట్టుటజూచి నే నేడ్చెడివాడను. మాయమ్మ గర్భవతియై చుట్టు ప్రక్కల

మాతులకుబోయి నీళ్లుదెచ్చి, చెరువునకుబోయి యంట్లుదోముకొని, మంచి నీళ్లుదెచ్చి, ధాన్యముగూడ దంపుకొనవలసినదయ్యెను. ఆమె కష్టములు మా తండ్రిగాని, మా పితామహిగాని కనిపెట్టెడివారుగారు. మా మేనత్త మాత్రము మాతల్లియెడ నింపుక దయగ నుండెడిది. మా తండ్రి బిడ్డల యెడల మిక్కిలి దయగనుండెడివాడు గాని కఠినముగనుండెడివాడు గాడు. కొందరు తండ్రులవలె జీటికిమాటికి బిడ్డలగొట్టుటలేదు. ఒకటి రెండు సారులు మాత్రము నన్నాయన స్వల్పముగ శిక్షించెను. ఒకసారి పాఠశాలలో నెవడోయొక బాలుడు నాపుస్తకమొకటి దొంగిలించెను. వానిపేరు దెలియలేదు. వాడు పట్టుబడలేదు. కోడిగుడ్డుదెచ్చి భూమిలో పాతిపెట్టిన యెడల దొంగిలించినవాని కడుపుబ్బునని నాకెవరో జెప్పిరి. బాలుడనైన నాకామాటలు నచ్చినందున, నాతరగతిలో చదువుచున్న యొక చాకలికుర్ర వాని యింటికి, నేను గ్రుడ్డునిమిత్తము వెళ్ళితిని. అది నాకప్పుడు లభింపలేదు గాని, తిరిగి నేనింటికి వచ్చుచుండగా నాతండ్రిగనపడి చాకలిగూడెములోనికి ఎందుకువెళ్ళితివని, నన్ను నిర్బంధించి యడిగెను. నేను నిజము చెప్పితిని. వెంటనే యాయనకోపించి "నీవు బ్రాహ్మణుడవు, కోడిగ్రుడ్డు నిమిత్తము చాకలివాని యింటికి వెళ్ళితివా! గాడిదా!" యని చిన్న బెత్తముతో నన్ను దండించెను,

ఇచ్చట మా తండ్రినిగురించి కొన్ని మాటలు చెప్పవలెను. ఆయన మొత్తముమీద సాధుశీలుడు. సంగీతము గూడ పాడగలరు. దేవుడూరేగునప్పుడు పల్లకితోగూడ నడచివెళ్ళి భజనలు చేసెడివారు. ఆయన మావీధి నొక రామమందిరము నెలకొల్పి, చుట్టుప్రక్కల కాపులచేత ప్రతిరాత్రి భజనలు చేయించుచుండెడివారు. వీరవాసరములో నొక సత్రము గట్టించవలెనని యాయన ప్రయత్నించిరిగాని యది సాగలేదు. ఆయన యిల్లు వాకిలి సంపాదించుటయేగాక, నాలుగెకరముల ఈ నాము భూమియు, నాలుగెకరముల జిరాయితీభూమియు, మా యింటికిరమారమి రెండువందల గజముల దూరమున దక్షిణపువైపున గొంతస్థలముతో గూడిన యిల్లును, సంపాదించి యా యింటి కాళీస్థలములో నొక గాదెగూడ గట్టిరి. మా పొలములో బండిన ధాన్యమా గాదెలో బోసెడివారు. నా చిన్నతనములో మాకు జాల పశువులుండెడివి. ఆ పశువులన్నియు నా గాదె దొడ్డిలోనే యుండెడివి. ఈ పశువుల పేడయంతయు మా యమ్మయే జేసి పిడకలు

తయారుజేయవలెను. మా తండ్రిగారి ప్రయోజకత్వమున మాకు నా చిన్న తనమున కావలసినంత పాడియు, పంటయు గలిగియుండెడిది.

మా తండ్రికి జాలమంది తహసీల్‌దారులు స్నేహముగ నుండెడి వారు. అందు ముఖ్యులు పత్రి సుబ్బారావు పంతులుగారు. ఆయన మా యింటి యెదుటనే కాపురముండెడివారు. ఆయన చాలమంచివారని ప్రజలు చెప్పుకొనుచుండెడివారు. ఆయన మనుమలిప్పుడు రాజమహేంద్రవరములో నున్నారు. ఆయన న్యాపతి సుబ్బారావు పంతులుగారితల్లికి మేనమామ. ఆయన ప్రోత్సాముచేతనే, న్యాపతి సుబ్బారావుపంతులుగారు, రాజమహేంద్రవరములో 1879 వ సంవత్సరమున న్యాయవాదిగ ప్రవేశించిరి. మా తండ్రిగారి స్నేహితులలో రెండవవారు బెన్నూరి నారాయణరావు పంతులుగారు. ఈయన కరణకమ్మ వ్యాపారులు. మూడవ తహసీల్‌దారుగారు కొక్కొండ వెంకటనరసన్న పంతులుగారు. వీరిలో శ్రీ పత్రి సుబ్బారావు పంతులుగారు మా తండ్రిని మిక్కిలి యాదరించి పని చెప్పించిరి. వెంకట నారాయణరావు పంతులుగారి దగ్గర మా తండ్రికి మిక్కిలి చనువు. ఆయన తన యింటి పెత్తనమంతయు మా తండ్రిమీదనే వదలి పెట్టెను. శ్రీ గురజాడ పట్టాభిరామయ్యగారుకూడ మా తండ్రికి మిత్రులు గానేయుండిరి. వీరవాసరములో పనిజేసిన తహసీల్‌దారులలో శ్రీ పట్టాభి రామయ్యగారే కట్టకడపటివారు. ఈయన కాలములోనే తాలూకాకచేరీ వీరవాసరమునుండి భీమవరమునకు మార్చబడెను.

మా తండ్రి బంధుప్రియుడు. పరోపకార పరాయణుడు. ఇందు కొక్క యుదాహరణము జెప్పెదను. శ్రీ పత్రి సుబ్బారావు పంతులుగారు పింఛను పుచ్చుకొని వెళ్ళిపోయినతరువాత, వారి రెండవయల్లుడు మధ్వపతి పురుషోత్తము పంతులుగారు, విఱూచి జాడ్యముతగిలి మా యింటిప్రక్క నున్న యింటిలో మృతినొందిరి. ఆయన కాపురమున్న యింటివారు మాధ్వులైనను శవదహనము విషయమై వారేమియు ప్రయత్నము చేయ లేదు. గ్రామములోని యితర మాధ్వులుగాని, స్మార్తులుగాని, విఱూచి యంటురోగమని భయపడి శవముదగ్గరకు రాలేదు. ఆయన మామగారు పత్రి సుబ్బారావుగారా యూరిలోనున్న పక్షమున శవమును మోయుట కెందరో వచ్చియుందురు. పురుషోత్తము పంతులుగారు పోయిన మూడవ రోజున మా తండ్రియు, మా పురోహితులైన చిలుకూరి వెంకయ్యగారును నిర్భయముగ శవమునుమోసి దహనముచేసిరి. ఈ విధముగ మా తండ్రి

బంధుమిత్రుల గృహములలో ననేక శవములు మోసెను. అనాథప్రేత సంస్కారమాయనకు మిక్కిలి యిష్టమైన కార్యము. నెల్లూరునుండివచ్చి మాయూర కాపురమున్న మా చుట్టముల గృహములలో నేకష్టసుఖములు వచ్చినను మా తల్లిదండ్రులు నడుముకట్టుకొని పనిచేసెడివారు.

నేను చదువుచున్న తరగతికి 1880–1881 సంవత్సరములలో దొరతనమువారు క్రొత్తగా నొకపరీక్షపెట్టిరి. దానిపేరు కంపేరిటివ్ ఎగ్జామినేషన్ (Comparative Examination). అది యుపాధ్యాయులు జేయునట్టి పరీక్షకాదు. పెద్దపరీక్షలకువలెనే యచ్చు కాగితములు చెన్న పురినుండి, సంచులలోపెట్టి సీళ్ళువేసి ప్రధానోపాధ్యాయునికడకు వచ్చెడివి. ఆప్రశ్నముల కాగితములు మాకిచ్చెడివారు. వాటికి మేము త్తరములు వ్రాసియిచ్చెడి వారము. అవి పైకి పంపబడుచుండెడిని. ఇది 1881 సంవత్సరమున డిశంబరులో మాపాఠశాలలో జరిగినది. పరీక్షాఫలితములు 1882 వ సంవత్సరము జనవరిలో వచ్చినవి. ఈ పరీక్షకు మా పాఠశాల నుండి యేడుగురు బాలురము వెళ్ళితిమి. అందారుగురు కృతార్థులైరి. నేనును వేమూరి నాగయ్యయు మొదటి తరగతిలో కృతార్థులమైతిమి. మా యిద్దరిలో వేమూరి నాగయ్య మొదటివాడయ్యెను. ఎక్కువ గౌరవముతో నేను కృతార్థుడనగుటచేత, నరసాపురము హైస్కూలులో నాకు జీతములేకుండ చదువు చెప్పుదురేమోయని యూహగలిగెను. నాకంటె మొదటివాడుగ కృతార్థుడైన వేమూరి నాగయ్య కది లభించెను.

మా పున్నమ్మ జన్మించిన తరువాత మాకు మరియొక తమ్ముడు పుట్టెను. వానిపేరు సుబ్బారాయుడు. మా పినతల్లి ముల్లంగి వెంకయ్యగారి భార్య సూరమ్మగారు, తనకు సంతానము లేనందున యీ పిల్లవానిని బెంచుకొనెను. అతడు మొదటినుండియు జబ్బువాడు. కాని పెంపకమిచ్చిన తరువాత మంచిలిగ్రామములో కొంతకాలము దేహారోగ్యము గలిగియుండి, మంచిలిలోనే తరువాత మళూచిజాడ్యమువల్ల మరణమొందెను. వాని తరువాత మాకు మరియొక చెల్లెలు పుట్టెను. ఆబిడ్డ పుట్టిన రెండుమాసము లకే మళూచకమువచ్చి మృతినొందెను. పిమ్మట మరియొక చెల్లెలు పుట్టెను. అచ్చమ్మ యామె పేరు.

వీరవాసరములో నాలుగవ తరగతిలో జదువుచున్నపుడు, నా సహాధ్యాయులలో ముఖ్యులు పెద్దాడ సాంబశివరావుగారు, రెండవవారు పెమ్మరాజు సీతారామయ్యగారు. సాంబశివరావుగారు దురదృష్టమున బాల్యము

నుండియు కుంటివాడయ్యెను. కుంటియయ్యు నాంగ్లేయ విద్య నభ్యసించి రాజమహేంద్రవరములో జదివి పట్టపరీక్షా సిద్ధుడై, పిమ్మట చెన్నపురివెళ్ళి బి. యల్. పరీక్షయందుగూడ కృతార్థుడై, కొంతకాలము రాజమహేంద్ర వరములోను, పిమ్మట గోదావరికావలనున్న ఖండము దొరతనమువారు కృష్ణాజిల్లాలో కలిపినప్పుడు రాజమహేంద్రవరమువిడిచి యేలూరులోను, న్యాయవాదిగనుండి, పేరుప్రతిష్ఠలను ధనమునార్జించి, 1920 సంవత్సరములో మృతినొందిరి. పెమ్మరాజు సీతారామయ్యగారు కూడ రాజమహేంద్రవర మున జదివి బి. ఏ. పరీక్షయందు కృతార్థుడై, కొంతకాలము ఉపాధ్యాయు డుగ పనిచేసి పిమ్మట న్యాయవాదియై తణుకులోనుండి, యిటీవలనే మృతి నొందిరి. వీరుగాక మరికొందరు సహాధ్యాయులుండిరి గాని వారు వృద్ధి లోనికి వచ్చినవారుగారు.

నా స్వభావము చిన్ననాటనుండియు గంభీరమైనదని చెప్పుట యాత్మస్తుతిగాదు. ఏకారణముచేతనైన నాకాగ్రహము వచ్చినప్పుడు నే నన్నమునినుట మాని యెవ్వరితో మాటాడక మూకీభావము వహించి యుండుట నా స్వభావము. ఒకప్పుడు జననీజనకులు చీవాట్లుపెట్టినను నేను మారుమాటాడెడువాడనుగాను. ఆ తిట్లు చీవాట్లు మిన్నక పడుటయే నా స్వభావము. బాల్యమున నున్న గుణములు వయస్సు ముదిరిననుపోవు. నా కిప్పటికైనను కోపమువచ్చెనా, యన్నము మానివేయుదును. ఎవరి మీద కోపమువచ్చెనో వారిని దూషించుట మొదలైనవి నా కిష్టములేదు. చిన్నతనమున నేజేసిన తప్పొకటి యిచ్చట చెప్పవలెను.

పెద్దాడ సాంబశివరావుగారు మొదటినుండియు భాగ్యవంతుడు. ఆయన, తల్లి యెరుగకుండ నాలుగైదురూపాయలామె పెట్టెలోనుండి దీసుకొని, ఒక యంగడికి బోయి, కలములు పెనిసిళ్లు నొకరీము కాగితము కొని మిత్రులకు బంచిపెట్టెను. నాకుగూడ గొన్ని కాగితములిచ్చెను. ఆసంగతి బైటపడగ నతనితల్లి చెన్నాప్రగడ లక్ష్మీనరసయ్యగారికి వర్త మానమంపించెను. లక్ష్మీనరసయ్యగారు విచారణజేసి సత్యము గ్రహించి మాదగ్గరనున్న కాగితములు మొదలైనవి వానికి తిరిగి యిప్పించిరి.

చిన్ననాడు నేను చీట్లపేక యాటలో కొంచెము కుతూహలము గలవాడను. ఆ విషయమై చెన్నాప్రగడ లక్ష్మీనరసయ్యగారు విన్నప్పుడు నన్ను నామిత్రులను శిక్షించిరి. చీట్లపేకనుగురించి నాకు రెండుసార్లు శిక్షజరిగెను. నేను నామిత్రులు యెంతరహస్యముగనాడినను నదియొ

బైటపడుచువచ్చెను. మాయింటిప్రక్కనే పెద్దాడ నరసమ్మగారని యొక నియోగిస్త్రీ యున్నదనిచెప్పితిని. ఆమె బాలవితంతువగుటచే జిన్నతనమం దెన్నోపాటలు నేర్చుకొనెను. ఆమెకురానిపాటలు లేవనిజెప్పవచ్చును. చుట్టుప్రక్కల స్త్రీలందరూ నామెచుట్టునుజేరి పాటలుపాడించి విని సంతో షించుచుండిరి. జ్ఞానము వచ్చినప్పటినుండియు నాకాపాటలు వినుటయందు మిక్కిలి కుతూహలము. ఆమెపాడినపాటలన్నియు నేను మిక్కిలి యాస క్తితో వినుచుండెడివాడను. ఆమెకు గోవిందనామములు, కుశలవకథ, ధర్మ రాజుజూదము, లక్ష్మణదేవరనవ్వు, శాంతాకళ్యాణము మొదలయినపాటలు వచ్చియుండుటచే, నవి నేవిని భారతరామాయణములలోని ముఖ్యవిషయ ములను నేర్చుకొంటిని. ఆమెకు విచిత్రమైన కథలెన్నోకూడవచ్చును. అందుచేత నేనును నామిత్రుడొకడును నామెనుబ్రతిమాలి కథలుచెప్పించు కొని పాటలుగూడపాడించి వినుచుంటిమి. పాటలనాసక్తిచేత నేనప్పు డప్పుడు బడిగూడమానుచుంటిని. ఇప్పటికిని నాకాపాటల వరుసలన్నియు దెలియును. ఇప్పటికైన నాకాపాటలువినుటకు కుతూహలమున్నది. భారత రామాయణములలోలేని కొన్ని క్రొత్తకథలు యీపాటలలోగలవు. అవి మిక్కిలి మనోహరములుగనుండును. లక్ష్మణస్వామినవ్వు రామాయణ మందెచ్చటనులేదు. అదిమిక్కిలి విచిత్రమైనకల్పనము. ధర్మరాజులవారి జూదముపాటములో.లక్ష్మీదేవికిని, నామెయక్కయైనపెద్దమ్మకును జరిగిన సంభాషణముగూడ మిక్కిలివిచిత్రము. కుశలవపాటలోగూడ నుత్తర రామాయణములోలేని విచిత్ర కల్పనలు గొన్నిగలవు.

ఆ నరసమ్మగారి నెందుచేతనో యూరివారందరు "అప్పాయి" యని పిలుచుచుండెడివారు. నేనును నా మిత్రులును నట్లే పిలుచుచుంటిమి. ఆమె యనుగ్రహము సంపాదించి పాటలు కథలు వినుటకై, యామె యావునిమి త్తము తుమ్మకాయలుకొట్టి తట్టలకొలది మోసితెచ్చి, యామెకు కానుకగా సమర్పించుచుంటిమి. ఆమె సంతోషించి, విసుగుకొనక బద్ధకింపక మే మడిగినప్పుడు కథలుచెప్పి పాటలుపాడుచుండెడిది. ఆమె దయ సంపా దించుటకై నేను తదాజ్ఞ శిరసావహించి యేపనిచెప్పిన నాపని జేయుచుం

డెడివాడను. గ్రామ మునసబుగారియింటిలోని స్త్రీలకు నామెకు మైత్రి గలదు. అప్పాయి యప్పుడప్పుడు మంచిమంచి కూరలు పచ్చళ్లుజేసి వారికిచ్చి రమ్మని నాచేత బంపుచుండెడిది. ఆమె పాటలమీద నాసక్తిచేత నేనది సీచమైనపనియని యనుకొనక చెప్పగానే చేసెడివాడను.

మా తమ్మునిగురించి యొకమాట వ్రాయవలెను. మాయింటిప్రక్కనే దేవరకొండశేషాచార్యులుగారని యొక మాధ్వబ్రాహ్మణుడు కాపురము చేయుచుండెను. ఆయనకు ముగ్గురు కొమార్తెలు నిద్దరు కుమార్తులునుండిరి. ఇరుగుపొరుగువారమగుటచే మేమును వారును నొకకుటుంబమువలె నుండెడివారము. ఆయనభార్యను మేము దొడ్డమ్మయనియు, కుమార్తెలను నక్కయ్యలనియు, కుమార్తు నన్నయ్యలనియు బిలుచుచుంటిమి. ఆయన పెద్దకుమార్తె పాపమ్మగారు లింగంపర్రు గ్రామనివాసియైన జమ్మిహను మంతాచార్యులుగారి భార్య. లింగంపర్రు పెద్దాపురం తాలూకాలో ఏలేశ్వరం వద్దనున్నది. పాపమ్మగారికి మాతమ్ముడు కృష్ణమూర్తిమీద నెంతో ప్రేమకుదిరినది. తరుచుగనతడు శేషాచార్యులుగారి యింటనేయుండి యక్కడనే భోజనముచేయుచుండెడివాడు. పాపమ్మగారొకసారి పుట్టినింటికి వచ్చి, కొంతకాలముండి మాతమ్ముని మిక్కిలి చనువుజేసుకొని, తనతో గూడ వానిని లింగంపర్రు దీసికొనిపోవుటకై సెలవిమ్మని మాతల్లిదండ్రుల నడిగిరి. మా తమ్ముడుగూడ వారితో వెళ్ళుటకు గుతూహలపడెను. మొగమోటమిచేత మాతల్లిదండ్రులొప్పుకొనిరి. పాపమ్మగారు మాతమ్ముని వెంటబెట్టుకొని భర్తతోగలిసి లింగంపర్రువెళ్లెను. అక్కడ మావాడు రమారమి మూడు సంవత్సరములుండెను. వీరవాసరమునుండి వెళ్లునప్పుడు వానికేడెనిమిది సంవత్సరములు వయస్సు. అతడు నేను నరసాపురములో జదువుకొనున్నప్పుడు తిరిగి మాయొద్దకువచ్చెను. లింగంపర్రు మన్యప్రదేశమగుటచే వానిదేహారోగ్యము కొంతజెడెను.

స్వీయ చరిత్రము

రెండవ ప్రకరణము

నరసాపురములోని విద్యాభ్యాసము

1881 సంవత్సరం డిశంబరుతో వీరవాసరములో నా చదువు ముగిసెను. వీరవాసరములో, లోవరుఫోర్తుకంటె నెక్కువతరగతిలేదు. పై తరగతి జదువుటకై నరసాపురము వెళ్ళవలసివచ్చెను. నరసాపురము మా యూరికి నడ్డదారిని తొమ్మిదిమైళ్లు. రోడ్డుదారిని వెళ్ళినపక్షమున పండ్రెండుమైళ్ళుండును. నరసాపురమునకు పాలకొల్లు మూడుక్రోసులు. పాలకొల్లునుండి వీరవాసరమున కెనిమిదిమైళ్లు; మా తండ్రిగారు నాచదువు నిమిత్తమై నన్ను నరసాపురము తీసికొనివెళ్ళిరి. తటవర్తి శేషమ్మగారి పూటకూళ్ళయింట బ్రవేశపెట్టిరి. నాకు రోజుకు మూడుపూటలు భోజనము పెట్టుటకు మూడురూపాయలు నెలకు పుచ్చుకొనుట కామె సమ్మతించెను. నాకేగాదు, నాయీడువారికందరకు నట్లే. నార్మల్‌స్కూలులోను, పై తరగతులలోను జదువు విద్యార్థులకు నామె నెలకుమూడురూపాయలకే, దినమునకు రెండుసారులు భోజనము పెట్టుచుండెను. అంత చౌకభోజనము పెట్టుచున్నదన్న నీనాటివారు నమ్మకపోవచ్చును. ఆనాడు రూపాయకు నారు కుంచముల బియ్యము నిచ్చెడివారు. నేయి వీశె మూడుపావులాలు. అన్ని వస్తువులు మిక్కిలిచౌక. ఆ కారణముననే పూటకూళ్లు పెట్టువారికి మూడు రూపాయలవల్ల నే కొంత లాభమువచ్చుచుండెను. అప్పుడునరసాపురములో రెండు పాఠశాలలు గలవు. సెంట్రల్‌స్కూలను నామాంతరముగల యెయిలరు హైస్కూలొకటి, మిషనువారి యున్నతపాఠశాల యొకటి. యెయిలరు దొరగారు నరసాపురములో సబ్‌కలెక్టరు పనిజేసినందున వారిపేర యెయిలరుపేట కట్టబడెను. అక్కడ నొక పాఠశాలగూడ వారిపేరనే స్థాపింప బడెను. నేను వెళ్లునప్పటికా పాఠశాలకు మహారాజశ్రీ "అణుచ్చిదంబర ప్రణుతార్తిహర్తయ్యరుగారు" ప్రధానోపాధ్యాయులు. ఈయన పట్టపరీక్ష సిద్ధులు. చాల గొప్పయుపాధ్యాయులు. వరదరాజులు మొదలియారుగారు

రెండవయుపాధ్యాయులు. పెయిలరు హైస్కూలులో విద్యార్థులిచ్చుకొన వలసినజీతము లెక్కువ. నేను జేరవలసిన తరగతి యప్పరుషోర్తుతరగతి. ఈ తరగతిలో జేరినవారందరు సంవత్సరాంతమున మిడిలుస్కూలు పరీక్షకు వెళ్ళవలెను. పూర్వము దొరతనమువారి యుద్యోగములకు బోవదలచువారికి జనరలు పెస్టని 'General test' యొకపరీక్ష యుండెడిది. దాని స్థానమందు మిడిలుస్కూలు పరీక్షను దొరతనము వారు స్తాపించిరి. పెయిలరు హైస్కూలులో నీతరగతిలో జదువు బాలుడు నెలకొక రూపాయి జీతమునియ్యవలెను. మిషనువారి పాఠశాలలో జీతములు తక్కువ. ఆకాలమున మిషనువారి పాఠశాలకు రివరెండు జాను విలియము బీరుగారనువారు ప్రధానోపాధ్యాయులుగ నుండిరి. ఆయన తమ్ముడు ఛార్లెసు బీరుగారు రెండవ యుపాధ్యాయులుగ నుండిరి. వలివేటి భాస్కర లక్ష్మీనరసింహశాస్త్రిగారు మూడవ యుపాధ్యాయులుగ నుండిరి. వెలివెల నరసరాజుగారును, జంప వేంకటాచలము గారను క్రైస్తవుడును దక్కినవుపాధ్యాయులు. ఏలేశ్వరపు వెంకటప్పయ్య శాస్త్రిగారు దెనుగు పండితులు. ఏలేశ్వరపువారి వంశము బండితవంశము. వీరి యన్నగారైన ఏలేశ్వరపు లక్ష్మణశాస్త్రిగారు మొగలితుఱ్ఱు సంస్థానములో విద్వాంసులుగ నుండిరి. మత్స్యపురిలో నాకు సంధ్యావందనము నేర్పిన చిలకమర్తి నరసింహశాస్త్రిగారు, లక్ష్మణశాస్త్రిగారివద్దనే కావ్యములు జదువుకొనిరి. ఏలేశ్వరమువారి వంశము మా చిలకమర్తివారి వంశమునకు గురువంశమని చెప్పవచ్చును. ఈ వెంకటప్పయ్యశాస్త్రిగారు నా మిత్రుడు బ్రహ్మసమాజ దీక్షాపరుడునైన పాలావఝుల లక్ష్మీనారాయణ గారికి మామగారు. పాండిత్యము గొప్ప పాండిత్యము. బోధనాశక్తిగూడ మంచిది.

నేను భాగ్యవంతుడనుగాకపోవుటచే మిషనువారి పాఠశాలలోజేరితిని. అక్కడ మాతరగతికి జీతము నెలకు పదియణాలే, కాని చదువులో తక్కువలేదు. 1882 వ సంవత్సరమున జనవరిలో నేనా పాఠశాలలోజేరితిని. కొంతకాలము పూటకూటియింటనిని కాలక్షేపముజేసితిని. తరువాత మా తల్లియు, మా పెదచెల్లెలైన పున్నమ్మయు, చిన్న చెల్లెలైన యచ్చమ్మయు నచ్చటికివచ్చిరి. పొగాకు వేణురావుపంతులుగారని పూర్వమొకగొప్పవారు నరసాపురములో నుండెడివారు. ఆయనకిద్దరు కుమార్లు. మొదటివారు శివరావుపంతులుగారు. రెండవవారు రామారావుపంతులు

గారు. వేణురాపుపంతులుగారు నెలకు రు. 300 లు జీతముగల యుద్యో గము సెటిల్‌మెంటు డిపార్టుమెంటులోజేసి, రు. 150 లు నెలకు పింఛను పుచ్చుకొని చిరకాలముజీవించి మృతినొందిరి. వారు కరణకమ్మవ్యాపా రులు పీలుకానావారు, సబ్బునీసువారు, బెన్నూరువారు, మద్దిరాలవారు, గజవల్లివారు మొదలగువారు వీరిచుట్టములు. కరణకమ్మవ్యాపారులు మతమునందద్వైతులేగాని బట్టకట్టు మొదలైన విషయములలో మాధ్వు లను బోలియుందురు. మగవారిపేళ్ళకు పంతులనియు, నాడువారిపేళ్ళకు బాయమ్మయనియు మాధ్వులకువలెనే నామాంతములయందు వీరికుండును. వీరి గురువులు స్మార్తగురువులైన శంకరాచార్యులవారే. వీరిలోగూడ వైదికులు నియోగులుగలరు. లౌక్యులు పంతులవారనబడుదురు. మంతపూడి వారు మొదలైనవారు కరణకమ్మ వైదికులు. వీరు శ్రాద్ధాదులయందు భోక్తలుగ వైదికులనే బిలుతురు. ఈ పొగాకువారికి మాతండ్రిగారికి మొదటినుండియు స్నేహము. వేణురాపుపంతులుగారి యన్నగారైన బుచ్చికృష్ణమ్మపంతులుగారు మొగలితుఱ్ఱులో సిరస్తదారు పనిజేసిరి. అప్పటినుండియు మాతండ్రిగారికి వారికుటుంబముతో పరిచయముగలదు. అందుచేతనే శివరావుపంతులుగారికిని రామారావుపంతులుగారికిని మాతండ్రి గారియడ నభిమానముగలదు.

నాసంరక్షణమునకై మాతల్లి నరసాపురమువచ్చినప్పుడు కాపురము నకు మాకిల్లు కావలసివచ్చెను. పొగాకువారియిల్లు మిక్కిలిపెద్దది. ముందరను వెనుకను ప్రక్కలను విశాలముగుదొడ్లుగలవు. 1885 వ సంవత్సరములో నరసాపురమువచ్చి నాటకములాడిన ధారవాడ నాటకసమాజమువారు, వేణు రావు పంతులుగారి ముందరవాకిటనే నాటకశాలనిర్మించి నాటకములాడిరని జెప్పినపక్షమున, వారిస్థలమెంత విశాలమైనదో చెప్పనక్కరలేదు.

శివరావుపంతులుగారు వారియింటిలో నొకగది మాకాపురమునిమిత్త ముద్దలేకుండనిచ్చిరి. ఆగదిలోమేము వంటజేసుకొని, విశాలమైన సావడిలో బండుకొనుచుంటిమి. నేనును, మాచెల్లెండ్రిద్దరును మాతల్లియు మాత్రమే యచ్చటనుంటిమి. మాతండ్రిగారు వీరవాసరములోనే యుండిరిగాని, మాతో రాలేదు. మా తండ్రిగారికప్పటికి ఉద్యోగములేదు. తాలూకాకచ్చేరీలో నుండెడి యమీనాపనులు తగ్గిపోయెను. భూములు ఋణగ్రస్తములయ్యెను. ఆపుకారీయిజాదారులవద్ద గుమాస్తాగనుండియు, రైతులుమొదలయినవారికి కవుళ్లు, కదపాలు, దస్తావేజులువ్రాసియు, గొంతధనమార్జించి మాతండ్రి

గారు తనపొట్టపోసికొని, కొంతసొమ్ము మాకు నరసాపురము పంపెడివారు. మా మేనమామగారప్పుడు తణుకులోస్థాపింపబడిన పాఠశాలకు నాంధ్రో పాధ్యాయుడుగ మొయ్యేరు నుండివచ్చిచేరిరి. ఆయనకు మొదటనుండియు మాకుటుంబముమీద మిక్కిలిప్రేమ. ఏలయన, యాయననోదరీజనములో పుత్రసంతానముగలది మాతల్లియొకర్తెయే. మల్లయ్యశాస్త్రిగారి పెద్ద యప్పగారైన చిలకమర్తి వెంకటశాస్త్రిగారి భార్యకు నొకకుమార్తెమాత్రమే యుండెను. మల్లయ్యశాస్త్రిగారికి చెల్లెండ్రిద్దరుండిరిగాని వారికిసంతానము లేదు. మాతల్లి మల్లయ్యశాస్త్రిగారికి రెండవయప్పగారు. అదిగాక కోడరికపు బాధ మా తల్లి మిక్కిలిపడినదని, మా మేనమామగాగికి నెక్కువ జాలి యుండెడిది. ఆయన నాజీతమునిమిత్తము, పుస్తకముల నిమిత్తము నరసా పురములో నేనున్నప్పుడు, నెలకు నాకు రెండురూపాయిలు పంపుచుండెడి వారు. నేను నరసాపురములో జదివిన రెండుసంవత్సరములు యీవిధము గనే సాయముజేసెడివారు. మల్లయ్యశాస్త్రిగారి కప్పజెల్లెండ్రమీద మిక్కిలి ప్రేమ. ఏచేట వారిని దీసుకొనిపోయి వారికి చీరలుసారెలుపెట్టి పంపు చుండెడివారు.

నరసాపురములో స్టాంపువెండరుగ మా బావమరది యద్దంకి వేంకటరామయ్యగా రుండిరి. ఆయన భార్య మాచెల్లెలు పున్నమ్మ చిన్న దగుటచే, నతడు సంసారమేమియులేక యొక్కడే వంటపూటింటదిని, యుద్యోగము జేసికొనుచుండెను. కాని యాయనవల్ల మాకే సాయమును లేదు. పిలిచినను మాయింటి కతడేపండుగకును భోజనమునకేని వచ్చెడి వాడుగాడు. మామీద నతనికా దినములలో నభిమానములేదు. దానికొక కారణముగలదు. మా తండ్రిగారు వేంకటరామయ్యగారివద్ద రెండువందల రూపాయిలు ఋణముచేసిరి. అదిగాక మరియొకరివద్ద మరి రెండువందల రూపాయలు ఋణముచేసిరి. వేంకటరామయ్యగారు తన సొమ్ము నిమిత్తము మా తండ్రిగారిమీద నరసాపురము కోర్టులో వ్యాజ్యమువేసి, డిక్రీపొంది, స్థిరాస్తి వేలము నిమిత్తము దరఖాస్తుపెట్టి, మా గాదెదొడ్డి రు. 75/-ల కమ్మించి, తన బాకీక్రింద జమ కట్టుకొనెను. అంతతో నాతని ఋణమంతయు దీరలేదు. ఆకారణమున మా తండ్రిగారికిని నాతనికిని మనస్పర్ధలు గలిగెను వారు రాకపోకలు, మాటలు మానుకొనిరి. ఇదిగాక మరియొకరికిగూడ మాతండ్రిగారు 200 రూపాయిలు నీయవలసియున్నదని వ్రాసితినిగదా! అతనుగూడ సొమ్ముకై మాతండ్రిని తొందరపెట్టజొచ్చెను.

అప్పుడు మా మేనమామగారు తణుకునుండివచ్చి, వేంకటరామయ్యగారిని మాయింటికి దీసికొనివచ్చి, మా తండ్రికిని మా బావకును రాజీజేసిరి. మా తండ్రిగారు మరొకరి కియ్యవలసిన రెండువందల రూపాయిలుగూడ వేంకటరామయ్యగారే తీర్చునట్లును, వేంకటరామయ్యగారి కియ్యవలసిన మిగతాబాకీకిని, యీ పైవారికి తీర్చిన సొమ్మునకును, మా తండ్రిగారు తన స్వార్జితమైన యీనాముభూమి నాలుగెకరములును, దానిప్రక్క జీరాయితీభూమి యొక యెకరమును, వెరసి యైదెకరములు వేంకటరామయ్యగారికి స్వాధీనపు తణఖా యిచ్చునట్లును, భూమిమీదవచ్చు ఫలసాయము వేంకటరామయ్యగారు వడ్డిక్రింద ననుభవించునట్లును, నిర్ణయింపబడి, యట్లు పత్రములు వ్రాసుకొనబడెను. వేంకట్రామయ్యగారు మా తండ్రికొక యుత్తరము వ్రాసియిచ్చి యణాబిళ్ళ యంటించి సంతకముజేసి యిచ్చిరి. ఆ యుత్తరములో నేమున్నదనగా: "చిలకమర్తి వేంకన్నగారుగాని, యాయన కుమార్తెమైన మేముగాని, యెప్పుడు వెంకట్రామయ్యగారికి నాలుగువందల రూపాయిలు నిచ్చివేయుదుమో యప్పుడు మా భూమి సూకతడుగాని యతని వారసులుగాని వదలివేయవలయును" అనియున్నది.

ఈవిధముగ రాజీపడినను మాతండ్రిగారియొక్కయు, వెంకటరామయ్యగారియొక్కయు మనసులు చక్కబడలేదు. మాతండ్రిగారియొద్ద వేంకటరామయ్యగారు స్వాధీనపుతనఖా పుచ్చుకొన్న భూమికి సర్కారు పన్ను చెల్లించుటకై యేటేట వీరవాసరము వచ్చుచుండిరిగాని, మా యింట నెన్నడు బసచేయలేదు. నరసాపురములో మేమున్నను మాకు రాకపోకలులేవు; భోజనాదులులేవు. నేనుమాత్ర మాయనకడకప్పుడప్పుడు బోవుచుండెడివాడను. మిడిలుస్కూలు పరీక్షకు మూడు రూపాయిలు దరఖాస్తుసొమ్ము కట్టవలెను. దానికి సొమ్ము నావద్ద లేకపోయెను. మా తండ్రిగారు సమయమునకు బంపలేకపోయిరి. నా మేనమామగారివద్దనుండి సొమ్ముతెప్పించి మరల నిచ్చెదనని నేను గట్టిగచెప్పి యడిగినమీదట, నాబావగారు నాకు మూడు రూపాయిలప్పునిచ్చిరి. దానితో నేను పరీక్షకు దరకాస్తుకట్టి శ్రద్ధగ చదివితిని. మిడిలుస్కూలు తరగతనగా నిప్పటి మూడవఫారముకు సమానము. అప్పుడుమేము చదువవలసిన పాఠములివి. ఇంగ్లీషులో బ్రాడ్‌షాదొరగారి యైదవవాచకము, మాన్యుయలు గ్రామరను నింగ్లీషు వ్యాకరణము, లెత్తుబ్రిడ్జిగా రింగ్లీషులో వ్రాసిన హిందూదేశచరిత్ర, కాలియరుసు వ్రాసిన యింగ్లాండుదేశచరిత్ర.

మాన్యులు భూగోళము, అంకగణితము (Arithmetic) బీజగణితము (Algebra), రేఖాగణితము (Geometry) మొదటిపు స్తకము, పఠనీయ గ్రంధములు కఠినముగను, మెండుగను నుండెను. మాతరగతి రెండుభాగములుగనుండెను. ఎ. డివిజను, బి. డివిజను. నేను ఎ. డివిజనులోనే యుంటిని. మూడివిజనుకు భాస్కరశాస్త్రిగారింగ్లీషు చెప్పుచుండిరి వెలివెల నరసరాజుగారు గణితము మొదలయినవి చెప్పుచుండిరి. దేశచరిత్రము, భూగోళము చిన్నదొరగారైన ఛార్లెసుబీరు దొరగారు చెప్పుచుండిరి. వెంకటప్పయ్యశాస్త్రిగారు తెలుగు బోధించుచుండిరని వేరెచెప్పనక్కరలేదు. జంప వెంకటచలముగా రింగ్లీషులో గొప్పసమర్థులని వాడుక. వారు బి. డివిజనుకు నింగ్లీషు చెప్పుచుండిరి.

ప్రతిదినము పదిగంటలకా పాఠశాలలోనున్న బాలకులందరు భవనముయొక్క మధ్యభాగమున బల్లలమీద కూర్చుండవలెను. అప్పుడు, చిన్నదొరగారో, పెద్దదొరగారో, వారికి వీలులేనపుడు జంప వెంకటచలముగారో వచ్చి, బైబిలుగ్రంథముతెచ్చి, యేదోభాగముచదివి, దానికి వారు వ్యాఖ్యానముచేసి, క్రైస్తవమతము బోధించుట యాచారమైయుండెను. ఇదిగాక, వారమునకొకసారి ప్రతితరగతిలోను బైబిలు పాఠముండెడిది. ఆదినమున పెద్దతరగతులలోని, బాలకులింగ్లీషు బైబిలులో నుండియు, చిన్నతరగతులలోనిబాలురు తెనుగుబైబిలులోనుండియు, కొన్నిపంక్తులు దొరగారికప్పగించవలెను. మిడిల్‌స్కూలుపరీక్ష సాధారణముగ డిశంబరు నెల మొదటివారములో జరిగెడిది. చెన్నపురినుండి యచ్చువేసిన ప్రశ్నపత్రములువచ్చెడివి. నరసాపురములో రెయిలరు హైస్కూలు బాలకులకును, మిషనుపాఠశాల బాలకులకును, మిడిలుస్కూలుపరీక్ష టయిలరుహైస్కూలులోనే జరిగెడిది. ఆపరీక్షకు సూపరింటెండెంటుగ ప్రణుతార్తిహరయ్యరుగారే యుండెడివారు.

ఆ సంవత్సరము (1882) మిడిలుస్కూలు పరీక్షలో నొక చిత్రము జరిగినది. పగలు పదిగంటలు మొదలొంటిగంటపరకు యివ్వవలసిన ప్రశ్నపత్రములు సకాలమునకే వచ్చినవి. ఆపూట యింగ్లీషుభాషావిషయము. మధ్యాహ్నము గణితము. ఆ ప్రశ్నపత్రములు సకాలమునకు రాలేదు. అవి మధ్యాహ్నమెప్పుడో వచ్చినవి. పరీక్ష నిలుపుచేయుటకు వీలులేకయ్యరుగారు గణితపరీక్ష రాత్రి పెట్టిరి. సాయంకాలమారుగంటలకు ప్రశ్నపత్రములు బాలురకియ్యబడెను. " అసలే కోతి, యామీద దయ్యముపట్టెను.

అదిగాక యాతకల్లు త్రాగెను, యామీద తేలుకుట్టెను" అన్న సామెతగా నాకసలే గణితమందభిరుచి తక్కువ. అందులో రాత్రి కన్నులు కనపడని వాడను. అప్పుడు నాయవస్థ యెట్లుండునో మీరే యూహించుకొనుడు. అప్పుడప్పుడు రాత్రులు నేను దీపముముందర తలపెట్టుకొని, కన్నులకు పుస్తకము మిక్కిలి దగ్గరగపెట్టుకొని యైదారుపంక్తులు చదువ ప్రయత్నించు చుండెడివాడను. అప్పుడు చదువుటకంతగ వీలులేకపోవుటయే గాక దీపపు వేడితగిలి తలమీద ముందరివెండ్రుకలు కాలిపోవుచుండెడివి. ఒక్కొక్క పిల్లవాని కొక్కొక్క కొవ్వువత్తిముక్క నిచ్చి యా వెలుతురున ప్రశ్న పత్రములకు ఉత్తరములు వ్రాయుమనిరి. నేనెట్లో కచ్చాపచ్చాగా వ్రాసితిని. పరీక్షలో నేను కృతార్థుడనౌదునని నాకు ధైర్యము లేకపోయెను. తెలుగు దేశచరిత్రములు మొదలైనవాటిలో నిచ్చిన ప్రశ్నపత్రములన్నింటికి సరిగనే యుత్తరముల వ్రాసితిని. మిడిలుస్కూలు పరీక్ష మూడుదినములు జరిగెడిది. పరీక్ష ముగిసినతరువాత రమారమి రెండుమాసములు లోపుగ దాని ఫలితములు తెలిసెడివి.

నా మేనమామగారు సీతకాలపు శలపులకు తణుకు రమ్మని నాకు జాబువ్రాసిరి. అందుచేత నేను తణుకు వెళ్ళితిని. అక్కడ నుండగానే పరీక్షాఫలితములు తెలిసెను. అక్కడ జిల్లామునసబుగనున్న నల్లమురెడ్డి రాఘవులు నాయుడుగారి యింటికి బోయి, పోర్టుసెంటుజార్జి గెజిటు తెచ్చుకొని చూచుకొనగ, నాపేరు కృతార్థులైన బాలకులలో మూడవతరగతి జాబితాలో నుండెను. ఆ పరీక్ష మొదటితరగతిలో కృతార్థులైనవారికి గవర్న మెంటువారి కొలువులో నేదైన నుద్యోగ మీయవచ్చుననియు, రెండవతర గతిలో కృతార్థులైనవారికి బోర్డులో నుద్యోగ మీయవచ్చుననియు, మూడవ తరగతిలో కృతార్థులైనవారిని పైతరగతిలో వేయవచ్చుననియు, నప్పటి నిబంధనలుండెను. ఈ మూడురకములు గాక పైతరగతిలో వేయుటకు తగినవాడని (Fit for promotion) యింకొకరకము గూడ నుండెడిది. ఈ పరీక్ష 1878 మొదలుకొని 1890 వరకు నుండెడిది. 1891 వ సంవత్స రము నుండి దాని స్థానమందు లోవరుసెకండరీ పరీక్ష నెలకొల్పబడినది. ఇందు కృతార్థులైనవారు మీదితరగతికి బోవుటయే గాని యుద్యోగములు లేవు. నేను గణితములో నసమర్థుడనగుటచేతను, పరీక్ష రాత్రి జరుగుట చేతను, గణితములో నాకు మిక్కిలి తక్కువమార్కులు వచ్చియుండును.

ఆకారణమున నేను మూడవతరగతివాడుగ గృతార్థుడనైతిని గాని, లేనిచో నధమపక్షము రెండవతరగతి వాడుగనైన వచ్చియుందును.

1883 వ సంవత్సరము జనవరిలో తణుకునుండి మరల నరసాపురమువచ్చి పై తరగతియైన యైదవతరగతిలో జేరితిని. అది మెట్రిక్యులేషను తరగతికంటె క్రిందిది. దానికి మెట్రిక్యులేషను పరీక్షకు జెప్పనట్టి పాఠములన్నియు జెప్పుచుండిరి. ఆ ప్రవేశపరీక్షకు నిర్ణయింపబడిన యింగ్లీషు పాఠపుస్తకమే యీతరగతిలోగూడ జెప్పెడివారు. నేను మిడిలు స్కూలు క్లాసులో జదువుచుండగ వేసవికాలపు శలవుల యనంతరమున భాస్కరశాస్త్రిగారు పనిమానుకొని న్యాయవాదివృత్తిలో జేరిరి. ఆయన స్థానమందు పూర్వము మా వీరవాసర గ్రామవాసియు, పిమ్మట రాజమహేంద్రవరములో బి. యే. తరగతిలో జేరినట్టియు, ప్రగళ్భపాటి జోగిలింగముగారను లింగధారి కోమటి మా కుపాధ్యాయుడుగ వచ్చెను. భాస్కరశాస్త్రిగారు తక్కువ పరీక్షయందు కృతార్థులైనను జోగిలింగము గారికంటె నింగ్లీషు పాఠములు బాగుగ చెప్పుచుండెడివారు. భాస్కరశాస్త్రిగారు సంస్కృతముగూడ జదివినవారు. బ్రహ్మజ్ఞానసంపన్నులు. అందుచేత న్యాయవాదివృత్తిలో నధర్మముజేయక, ధనమే ప్రధానముగ జేసుకొనక, న్యాయముగ కాలక్షేపము చేయుటచే న్యాయవాదిగ గొప్ప పేరు సంపాదింపలేదు.

నేను నరసాపురములోనున్నప్పుడు పారుపల్లి పుండరీకాక్షుడుగారు డిప్యూటీకలెక్టరుగాను, కురుపుద్దాలి వేంకటచలముగారు జిల్లామునసబుగాను, నాధమని మొదలియారుగారు తహసీలుదారుగనునుండిరి. ప్రజలకు తెలియక యీయనపేరు నారదమని మొదలియారుగారని బిలిచెడివారు. ఇంగ్లీషు పాఠములు మాకు పెద్దదొరగారు చెప్పుచుండెడివారు. ఆయన పాఠబోధయు మతబోధయుగూడ మిక్కిలి తృప్తికరముగ నుండెడివి. ఆయన కాంధ్రభాషలోగూడ గొంత ప్రవేశముగలదు. చిన్నయసూరి నీతిచంద్రికకర్థము చెప్పెడివారని ప్రతీతిగలదు. పై తరగతులకుగూడ చిన్నదొరగారు దేశచరిత్రము, భూగోళము, ప్రకృతిశాస్త్రము చెప్పుచుండెడివారు. కాని పరీక్షఫలితములు మిషనుపాఠశాలలోకంటె, ఇయిలరు హైస్కూలులోనే బాగుండెడివి.

1883వ సం॥మున రెండవభాగమున నాకు గొన్ని చిక్కులు సంభవించినవి. మాతల్లికి మొదటినుండియు గుండెలలో నొప్పివచ్చుచుండెడిది. ఆమె

యందువల్ల మిక్కిలి బాధపడుచుండెడిది. ఆబాధ నేను చూడలేక నామెకు నొప్పివచ్చినప్పుడు వీధిలోగూర్చుండెడివాడను. ఇప్పటికీ నాస్వభావమదే. ఎవరై నబాధపడుచున్న నే చూడజాలను. మందులుతెచ్చియు, తెప్పించియు చికిత్సలుచేయించగలనుగాని బాధమాత్రము చూడజాలను. మాయమ్మకు జబ్బుగనున్నదని మామేనమామగారికి తెలిసి మాయమ్మను తణుకుపంపించ వలెనని వారు నాకువ్రాసిరి. నేనామెను, మాచెల్లెండ్రను నచటికిబంపితిని. అప్పుడు నాకన్నముదొరుకుటయే కష్టమయ్యెను. నేనొక నార్మలుస్కూలు విద్యార్థితోగలసి వంటబెట్టితిని. పాకములో నకృతపరిచయుడ నగుటచేత గొన్నినాళ్ళయినపిమ్మట నది మానవలసివచ్చెను అప్పుడు నేను పూట కూళ్ళయింటికిబోవలసివచ్చెను. దానికి నెలకు మూడురూపాయలేఖర్చు. కాని నాదగ్గర రూపాయిన్నరకంటె నెక్కువ యుండెడిదిగాదు అందుచే నేను పూటకూళ్ళయింటివానితో బేరమాడి, నేనిచ్చెడు రూపాయిన్నరకు నాకొక్క పూట మాత్రమే యన్నముపెట్టవలసినదని కోరితిని ఆపూటకూళ్ళయింటి యజమాని నవుడూరి కామయ్యయను బ్రాహ్మణుడు అతడు నాకోరికనంగీకరించెను. దినమునకొక్కపూటమాత్రమేతిని పాఠశాలకుబోయి చదువుకొనుచుంటిని రెండవపూట తరుచుగా నొకడబ్బుపెట్టి, యొక కోమటిదుకాణము మీద రెండు మినుపగారెలుకొని, యవితిని, కాలువకుబోయి మంచినీళ్లత్రాగి, రాత్రి పొగాకువారియిల్లుజేరి యచ్చట బండుకొనుచుంటిని. ఇట్లు సరియైన భోజనములేకపోవుటచే శరీరము కృశించెను. అప్పుడప్పుడు కొంచము జ్వరముగూడ తగులుచుండెను. అయినను నేను బడిమానలేదు. ఆసంవత్సరాంతమున సాంవత్సరిక పరీక్షజరిగెను. ఆపరీక్షలో నన్నిపాఠములలోను నాకుమార్కులువచ్చెను కాని గణితము, బీజగణితము వాటిలోమాత్రము మిక్కిలి తక్కువమార్కులు వచ్చెను. ఆకారణమున నన్ను పెద్దదొరగారు మెట్రిక్యులేషనుతరగతిలో వేయలేదు.

ఆ సంవత్సరమే రిప్లయికార్డులను జంటకార్డులు క్రొత్తగవచ్చెను. జంటకార్డువెల యర్డణా. ఆకార్డు తీసుకొని ప్రధానోపాధ్యాయులైన పెద్ద బీరు దొరగారికి, నన్ను పైతరగతిలో వేయుమని వేడుకొనుచు నొకజాబు వ్రాసితిని. ఆ జాబునకు రెండవ కార్డుమీద నాకు వారుత్తరము వ్రాసిరి. నీవు తగని తరగతిలో నిన్ను వేయుమని వేడుకొనుటకంటె చదువు మానుకొనుటయే యుత్తమమని వారు కఠినముగ వ్రాసిరి. ఇది 1884 వ సంవత్సర ప్రారంభమున జరిగెను. ఈసంగతి నేను తణుకువెళ్ళి మామేన

మామగారితో జెప్పితిని. ఆకాలమున తణుకుగ్రామములో నాలమూరు రామచంద్రరావుగారు సబురిజిస్ట్రారుగ నుండిరి. మల్లయ్యశాస్త్రిగారు పని చేయుచున్న పాఠశాలాపరిపాలక సంఘములో రామచంద్రరావుగారొక సభ్యులై యుండుటయేగాక, మల్లయ్యశాస్త్రిగారికి మిక్కిలి ముఖ్యమిత్రులు. రామచంద్రరావుగారు పారుపల్లి పుండరీకాక్షుడుగారికి మేనకోడలు పెని మిటి పుండరీకాక్షుడుగారు పెయిలరు హైస్కూలు పరిపాలక సంఘమున కధ్యక్షులు నేను నెల జీతమిచ్చి తిరిగి మిషనుపాఠశాలలోగాని, పెయిలరు హైస్కూలులోగాని, పెనుకటి తరగతిలో మరల జదువజాలనందున, నాకు పెయిలరు హైస్కూలులో జీతము లేకుండ చదువు చెప్పింపుమని, మా మామగారి ప్రోత్సాహముచేత రామచంద్రరావుగారు పుండరీకాక్షుడు గారి కొకజాబు వ్రాసియిచ్చిరి ఆజాబు తీసుకొనిపోయి నేను పుండరీ కాక్షుడుగారికి జూపితిని పుండరీకాక్షుడుగారు దానిపైనేదో వ్రాసి ప్రణు తా ర్తి హరయ్యరుగారికి జూపుమనిరి. నేనట్లు జేసితిని. అయ్యరుగారు నన్ను పాఠశాలకు రమ్మనిరి. కాని నాకు నాకోరిక ప్రకారము పెయిలరు హైస్కూలులో జీతములేకుండ జదువుకొను నదృష్టము లేకపోయెను. నాలుగైదు దినములా పాఠశాలకు బోయితిని అయ్యరుగారుగాని పుండరీ కాక్షుడుగారుగాని నా కుపకారము జేయలేకపోయిరి. ఆకారణమున నేను 1884 వ సంవత్సరమున జదువుమానుకొని కొన్నాళ్లు వీరవాసరములో నుంటిని.

ఆకాలమున పుప్పాల శ్రీరాములు నాయుడుగారని యొకడాక్టరుగారు తణుకులోనుండిరి. అప్పుడు డాక్టరును "ఆస్పటల్ అసిస్టెంటు" అని పిలిచెడివారు. ఇప్పుడు సబ్‌అసిస్టెంట్ సర్జన్ (Sub Assistant surgeon) అని పిలుచుచున్నారు. వీరవాసరములో నంతకుముందు పుప్పాల శ్రీరాములునాయుడుగా రాపనిలోనే యుండిరి. తరువాత వారు తణుకు గ్రామమునకు బదిలీచేయబడిరి. మామేనమామగా రాయనవద్దకుబోయి మందుదెచ్చి మాయమ్మకిచ్చిరి. మాయమ్మగుండెలలో నొప్పితగ్గెను. ఆదినములలోనే మాతమ్ముడుగూడ జబ్బుపడెను. మన్యప్రదేశమైన లింగంపర్రులో చాలాకాలముండుటచేకాబోలు నతనిశరీరమిక్కడకువచ్చిన తరువాత నీరుపట్టెను. అతనికిగూడ మామేనమామగారు మందిప్పించి బాగుచేయించిరి. ఇచ్చట మాతమ్ముని గురించి యొక్కమాటచెప్పవలెను. అతనికి చిన్నప్పటినుండియు దేహారోగ్యముసరిగలేదు. తరుచుగ జబ్బు

పడుచుండెడువాడు. 1884 వ సంవత్సరప్రాంతమున వానికొక మూర్ఛ రోగము బయలుదేరెను. మిక్కిలి శ్రమపడి మాతండ్రిగారు చికిత్సలుచేయింపగా నది యెట్టకేలకు నివారణమయ్యెను. అందుచేత వానికి సరిగ జదువంట లేదు. మా మేనమామగారు తణుకు కమిటీస్కూలులో రమారమి నాలుగు సంవత్సరములు పనిచేసిరి. ఆయన మొట్టమొదట అచ్చట జేరినప్పుడు గోటేటి వెంకటశివరాపుగారు ప్రధానోపాధ్యాయులుగనుండిరి. తరువాత వారు న్యాయవాదిపరీక్షకుచదివి న్యాయవాదియై ఏలూరులో చాలకాలము పనిచేసిరి. మల్లయ్యశాస్త్రిగారికిని వారికిని యావజ్జీవము స్నేహముండెను. అట్లే తణుకుపాఠశాల పరిపాలకసంఘములో ముఖ్యసభ్యులైన దొడ్డిపట్ల వెంకటరత్నముగారితోగూడ నత్యంతస్నేహము మల్లయ్యశాస్త్రిగారికి గలదు.

చదువు మానుకొని నేనాసంవత్సరమున గోటేటి సోమరాజుగారను వారి కుమారున కింటిపద్ద పాఠము లుచెప్ప నారంభించితిని. ఆయన నరసాపురము తాలూకాకచ్చేరిలో గుమాస్తాగ నుండిరి. ఆయనకుమారు డేదో చిన్నతరగతిలో చదువుచుండెడివాడు. చదువు చెప్పినందుకు నా కాయన భోజనము పెట్టుట నిర్ణయము. 1884 వ సంవత్సరము మార్చి, ఏప్రియల్ నెలలలో, నరసాపురములో వారియింటనుండగ సోమరాజుగారు తన కుమారుని, నన్నును శివకోడు బంపిరి. శివకోడులో సోమరాజుగారి తమ్ముడు బాపిరాజుగారుండిరి. సోమరాజుగారి కుమారునకును, బాపిరాజుగారి కుమారునకును నేను శివకోడులో నుండి, బాపిరాజుగారింటనే భోజనముచేయుచు, బాలురకిద్దరకు జదువుచెప్పునట్లేర్పాటుచేసిరి. ఆపనిజేయుచు నేను శివకోడులో కొన్ని దినములుంటిని.

ఇప్పటిపలె నప్పుడు రాజవోలు తాలూకాలేదు. శివకోడునరసాపురము తాలూకాలో నొకభాగము. అచ్చట డిప్యూటీతహసీలుదారు కచేరీయు, సబు రిజిస్ట్రారు కచేరీయు మరికొన్ని కచేరీలునుండెను. అక్కడకు రాజవోలు మిక్కిలి సమీపమున నుండెను. రాజవోలులో నొక గొప్ప కొబ్బరితోట యుండెను. అందులో వేలకొలది చెట్లుగలవు. అది రండలుదొరగారిది. పొగాకు వేణురావుపంతులుగారి రెండవకుమారుడైన రామారావుపంతులు గారికిని, రండలుదొరగారికిని, వేణురావుపంతులుగారి నాటనుండియు పరిచయముగలదు. ఆ తోటవ్యవహారములు సరిగలేనందున చెట్లకు మరమ్మతు చేయించుటకు, శిస్తువసూలుచేసిపంపుటకు దగినమనుష్యుడుగావలసియుండు

టచే రండలుదొరగారు తమతోటమీద రామారావుపంతులుగారిని గుమా స్తాగా నియమించిరి. రామారావుగారు భార్యాసమేతులై నరసాపురము నుండి రాజవోలువెళ్ళి, తోటలో నొక బంగాళాలో బసచేసియుండిరి. పూర్వము వారింట నేను కాపురముండుటచేతను, వారికి నామీద మిక్కిలి దయయుండుటచేతను, నేను వారినొకసారి జూచుటకై శివకోడునుండి రాజ వోలువెళ్ళితిని. అక్కడ కొన్నిదినములుండమని రామారావుపంతులుగారు నన్ను బలవంతపెట్టుటచేత రాజవోలులో కొన్నిదినములుంటిని. వేసవి కాలపుసెలవలు ముగిసినతరువాత, నేను శివకోడునుండి వీరవాసరమువెళ్ళి, యచటనుండి తణుకువెళ్ళితిని.

ఆ దినములలో రాజమహేంద్రవరములో "ఆర్టుమను" దొరగారు మిషను పాఠశాల నొకదానిని స్థాపించిరి. దానికి నిడమ ర్తి దుర్గయ్య గారను వాడుకపేరుగల జలదుర్గి ప్రసాదరాయుడుగారు ప్రధానోపాధ్యాయు లైరి. అంతకుముందు ఇన్నీసుపేట స్కూలులో జిరకాలమునుండి తెలుగు పండితులుగనున్న, బ్రహ్మశ్రీ వడ్డాది సుబ్బరాయుడుగారుకూడ, మిషనువారి పాఠశాలకు నాంధ్రోపాధ్యాయులుగ వెళ్ళిరి. అందుచేత ఇన్నీసుపేట స్కూలులో నాపదవి కాలీయయ్యెను. బ్రహ్మశ్రీ ఆకొండి వ్యాసమూ ర్తిశాస్త్రి గారు చిరకాలమునుండి ఇన్నీసుపేట స్కూలులో సంస్కృతపండితులుగ నుండిరి. వ్యాసమూ ర్తిశాస్త్రిగారును, మల్లయ్యశాస్త్రిగారును మిత్రులై, బంధు వులై యుండిరి. అందుచేత మల్లయ్యశాస్త్రిగారు వ్యాసమూ ర్తిశాస్త్రిగారిద్వారా యాపనికి ప్రయత్నముచేసిరి. రాజమహేంద్రవరములో కళాశాలకు ప్రిన్సి పాలుగనున్న మెట్కాఫ్ దొరగారి అధ్యక్షతక్రింద నొక పాఠశాలాపరిపాలక సంఘమేర్పడెను. ఆసంఘము పరిపాలనక్రింద రెండు పాఠశాలలుండెడివి. ఒకటి యిన్నీసుపేట స్కూలు; రెండు టవునుస్కూలు. టవునుస్కూలు ప్రాతయూరిలో మెరకవీధి నుండెడిది. ఇప్పుడు టవునుహాలుకు నెదురుగ నున్న స్కూలుమందిరమదే. అది సంఘమువారి సొంత భవనము. ఇన్నీసుపేట స్కూలు ప్రస్తుతము వరదరావుగారు మేడ గట్టినచోట నుండెడిది. ఆ పరిపాలక సంఘములో పట్టణములోని పెద్దమనుష్యులు కొందరు కళాశాలలోని యుపాధ్యాయులు కొందరు సభ్యులుగ నుండిరి. ఆ పరిపాలక సంఘమునకు కార్యదర్శిగ నప్పుడు శ్రీ పార్థి శ్రీనివాసరావు పంతులుగారుండిరి. ఆయనప్పుడు కళాశాలలో నొక యుపాధ్యాయుడుగ నుండిరి. ఆ పంతులుగారు మల్లయ్యశాస్త్రిగారికి ఇన్నీసుపేట స్కూలు

లోని ఆంధ్రోపాధ్యాయ పదవినిచ్చిరి. అందుచేత మల్లయ్యశాస్త్రిగారు సకుటుంబముగ రాజమహేంద్రవరము వచ్చిరి. ఆయనయు, తల్లియు, భార్యయు, నేనును, శాస్త్రిగారి పెద్దకుమారుడైన భద్రయ్యశాస్త్రి మూడు సంవత్సరములవాడును, రాజమహేంద్రవరము వచ్చితిమి. నేను ధనహీనతచే మరల జదువుకొనకయుండుటచేత, శాస్త్రిగారు మా కుటుంబము మీదను, నామీదనుగల యభిమానముచే, నాకు రాజమహేంద్రవరములో జదువు చెప్పించవలెనని వెంటబెట్టుకొనిపోయిరి.

●

స్వీయచరిత్రము

మూడవ ప్రకరణము

రాజమహేంద్రవరములోని విద్యాభ్యాసము

నే నదివరకెన్నడును రాజమహేంద్రవరము జూచినవాడనుగాను. చూడవలెనని మాత్రము కుతూహలముండెడిది. అది యీ రూపమున సిద్ధించినది. రాజమహేంద్రవరమునం దానాడు గల పాఠశాలల గురించి కొంత చెప్పుట యనవసరముగాదు. ఇన్నీసుపేట స్కూలు, టౌనుస్కూలు, ఈ రెండును పురపాలకసంఘమువారి పరిపాలనక్రింద నుండెడివి. మూడవది మిషనువారి పాఠశాల. ఇది స్థాపించిన "ఆర్టుమను" దొరగారు, 1884 వ సంవత్సర మాగస్టులోనో సెప్టెంబరులోనో మృతినొందిరి. కాని యాయన మరణముతో నా పాఠశాల నిలుపుచేయబడలేదు. అందలి ప్రధానోపాధ్యాయుడైన నిడమర్తి దుర్గయ్యగారును, సహాయోపాధ్యాయులును, నేదోవిధముగ పాఠశాల నిర్వహింపజొచ్చిరి. అందు దుర్గయ్యగారు గాక, కృష్ణస్వామినాయుడుగారు, జిల్లేళ్ళ కృష్ణారావుపంతులుగారు, ప్రగళ్ళపాటి జోగిలింగముగారు, వడ్డాది సుబ్బారాయుడుగారు, చావలి సోమనాధశాస్త్రిగారు మొదలగువారుపాధ్యాయులుగ నుండిరి. నాలుగవది యాస్థికపాఠశాల (Theistic School). 1881 వ సంవత్సరమున కలకత్తానగరమునుండి

పండిత శివనాథశాస్త్రిగారిక్కడకువచ్చి, యేకేశ్వరారాధనమునుగూర్చి మహోపన్యాసములుజేసిరి. ఆయుద్రేకములో ననేకుల కేకేశ్వరోపాసనము మీదను, బ్రహ్మసమాజముమీదను, నభిమానముగలిగెను. అట్లురలిగిన వారిలో మహారాజశ్రీ యేలూరి లక్ష్మీనరసింహముగారొకరు. వారు కులమున సృష్టికరణములు, పట్టపరీక్షయందు కృతార్థులైనవారు. ఆంగ్లేయ భాషలో మంచి పండితులు. మంచి స్ఫురద్రూపి, యువకుడు. ఆయన యాస్థికపాఠశాల స్థాపించెను. అప్పటికాయన కళాశాలలో నొకయుపాధ్యాయుడుగనుండెను. ఐనను నేకేశ్వరారాధనము దాయరకు బోధించుటకై యాపాఠశాల స్థాపించి నడపిరి. నేను రాజమహేంద్రవరము వచ్చునప్పటి కాపాఠశాలకు, టి. శివకుమారశాస్త్రిగారు ప్రధానోపాధ్యాయులుగనుండిరి. ఆయనగాక వైద్యనాథయ్యరుగారు, ముత్తుస్వామిశాస్త్రిగారుగూడ నుపాధ్యాయులుగనుండిరి. దుర్భా లక్ష్మీనరసింహశాస్త్రిగారు తెలుగుపండితులుగను, పుల్లంపల్లి వేంకయ్యశాస్త్రిగారు సంస్కృత పండితులుగను నుండిరి. ఐదవది "పేట్రియాటిక్" స్కూలు. దేశాభిమానపాఠశాలయని దీనియర్థము. ఈ పాఠశాలను ద్రోణంరాజు కృష్ణారావుగారు స్థాపించిరి. ఇది ప్రస్తుతము విఘ్నేశ్వరదేవాలయమున్న ప్రాంతమూర నొకవీధిలో నడ్డెయింటనుండెను. ద్రోణంరాజు కృష్ణారావుగారు గోలకొండ వ్యాపారులు. ఆయన శ్రీ గుమ్ములూరి వెంకటరంగారావుగారి బావమరది. ఈ పాఠశాలలన్నిం టిలో మెట్రిక్యులేషనుతరగతియుండెను. ఇప్పటివలె పాఠశాలాసంస్థాపన ములసకుగాని, నిర్వహణములసకుగాని, కఠినమైన నిబంధనలప్పుడులేవు. సర్టిఫికెట్టులులేకుండ విద్యార్థులొకపాఠశాలనుండి మరియొకపాఠశాలకు, యథేచ్ఛముగ మారపచ్చును. విద్యార్థులిచ్చుకొనవలసిన జీతములుగూడ నంతకఠినముగలేవు. నేనిక్కడకువచ్చినది తారణసంవత్సరము, అనగా 1884 వ సంవత్సరము. ఆసంవత్సరము గోదావరిపుష్కరము. మేము రాజమహేంద్రవరముగానే చెరుకువాడ లక్ష్మీనరసయ్యగారి యింటిలో బసచేసితిమి. ఆయింటిలో నొకభాగమున వ్యాసమూర్తిశాస్త్రిగారుకూడ బసచేసియుండిరి. అక్కడ రహస్యమి యొకనెలదినములుండి మేము బసమార్చితిమి. అప్పుడు పుష్కరము సంపూర్ణముగ జరుగుచుండెను. ఉత్కలదేశమునుండియు, నిజామురాజ్యమునుండియు, దక్కిన యాంధ్ర మండలములనుండియు, వేనవేలు యాత్రికులువచ్చిరి. నేను పుష్కరము జూచుటకదే ప్రారంభము. అప్పటికి నాకు పదునేడుసంవత్సరముల

వయస్సు. ఆంగీరససంవత్సరములో (1872) నొకపుష్కరము జరిగినది గాని నేనప్పుడు బిన్నవాడనగుటచే, నాకాగొడవ దెలియదు. మాతండ్రి మొదలగు పెద్దలు, చేరుపనున్న నరసాపురముచెళ్ళి, గోదావరిస్నానము చేసిరనిమాత్రము తరువాతవింటిని.

ఇన్నిసుపేటస్కూలుకు శ్రీ దామరాజుబసవరాజుగారు ప్రధానోపాధ్యాయులుగను, సోమంచి భీమశంకరముగారు రెండవ యుపాధ్యాయులుగను, శ్రీ సత్యవోలు లక్ష్మీపతిగారు మూడవ యుపాధ్యాయులుగను నుండిరి. టపునుస్కూలుకు యేలేశ్వరపు వేరయ్యశాస్త్రిగారు ప్రధానోపాధ్యాయులు, బ్రహ్మశ్రీ కల్లూరివెంకటరామశాస్త్రిగారు సంస్కృతపండితులు, మండపల్లి కనకయ్యశాస్త్రిగారు తెలుగుపండితులు, వీరు ముఖ్యులు. పూర్వకాలమున రాజమహేంద్రవరమునందలి గవర్నమెంటువారి కళాశాలలో యఫ్. ఎ., బి ఎ. తరగతులేగాక, మిడిలుస్కూలు మెట్రిక్యులేషను మొదలగు క్రిందితరగతులుకూడ నుండెడివి. ఆ తరగతులకు బసవరాజు గవరరాజుగారు, బుర్రాజలింగశాస్త్రిగారు, ఏలూరి లక్ష్మీనరసింహముగారు మొదలగువారుపాధ్యాయులుగ నుండెడివారు. క్రమక్రమముగ, గవర్నమెంటువారు చిన్నతరగతులను తీసివేయుచువచ్చిరి. 1885 వ సంవత్సరముపరకు నిట్లుజరిగెను. ఆ సంవత్సరమున కాలేజీతరగతులతోపాటు మెట్రిక్యులేషను తరగతిగూడ నుండెను. ఆసంవత్సరాంతమున నాతరగతి గూడ దీసివేసిరి 1886 వ సంవత్సరము జనవరి మొదలుకొని యఫ్.ఏ., బి ఏ తరగతులుమాత్రమే కళాశాలలో నుండెడివి

1884 వ సంవత్సరము డిశంబరులో మేము చల్లపల్లివారి చిన్న యింట నివసింపబోయితిమి. అది యిప్పుడు హింసాసమాజమున్నవీధిలో నుండెడిది. ఆ యిల్లిప్పుడులేదు, అందొక భాగములో, గడ్డమశంభు శాస్త్రిగారను నొక కాలేజీవిద్యార్థి సకుటుంబముగ నుండెను. రెండవ భాగములో పుల్లయ్యశాస్త్రిగారు ప్రవేశించిరి 1885 వ సంవత్సరమున నన్ను మెట్రిక్యులేషను తరగతిలో ప్రవేశపెట్టుటకు మా మేనమామగారు ప్రయత్నించిరి. 1885 వ సంవత్సరమున కాలేజీలో మెట్రిక్యులేషను తరగతి యుండినది. కాలేజీలోనే చదువుట నాకు మిక్కిలి కుతూహలముగ నుండెను. విద్యార్థులను జేర్చుకొనుటకు మెట్రిక్ పరీక్ష పెట్టిరి. ఇంగ్లీషులోను, గణితములోను మాత్రమే పరీక్ష జరిగెను. గణితములో నాకు మార్కులు తక్కువ

వచ్చియుండునుగాని, యింగ్లీషులో మార్కులు బాగుగ వచ్చియుండును. పరీక్షించిన యుపాధ్యాయులు నా గణితపుమార్కుల సరకుగొనక, యింగ్లీషు మార్కులతో మాత్రమే సంతసించి, నన్ను మెట్రిక్యులేషను తరగతిలోజేర్చుకొనిరి. ఆ తరగతి కాలమున సంవత్సరమునకు రు. 36/-లు మాత్రమే జీతముక్రింద విద్యార్థి కట్టవలెను. ఏచిక్కులుపడియో మాతండ్రిగారా జీతము నిచ్చిరి. అప్పుడు కళాశాలలో మా తరగతికి పాఠములు చెప్పువారెవరనిన, బ్రహ్మశ్రీ వావిలాల వాసుదేవశాస్త్రిగారు. వీరు పట్ట పరీక్షోత్తీర్ణులు. ఈయన గణితమును, భూగోళశాస్త్రమును బోధించుచుండెడి వారు. విశ్వనాధయ్యరుగారని మరొకద్రావిడి యుండెను. ఆయన మా కింగ్లీషును, హిందూదేశ చరిత్రమును, నింగ్లాండుదేశ చరిత్రమును జెప్పుచు వచ్చిరి. కందుకూరి వీరేశలింగము పంతులుగారప్పుడు సహాయాంధ్రోపాధ్యాయునిగ నుండి, మాకు తెలుగు జెప్పుచుండిరి. విశేషకాలము వారివద్ద సంఘ సంస్కరణము మొదలయిన విషయములే యెక్కువగ వచ్చుచుండెను. దీనినిబట్టి పాఠములు చెప్పుచుండుటలేదని యభిప్రాయపడగూడదు. ఆయన పాఠములు సరిగ చెప్పుచుండెడివారు. ఆ సంవత్సరము, మాకు భారతములోని సభాపర్వమందలి ద్వితీయాశ్వాసము, పద్యకావ్యముగ నియమింపబడెను. శ్రీమాన్ కొమాండూరి యనంతాచార్యులుగారు రచియించిన యుక్తర హరిశ్చంద్ర చరిత్రమును, బ్రహ్మశ్రీ కొక్కొండ వెంకటరత్నముపంతులుగారు రచించిన యువరాజ హిందూస్తాన సందర్శనమను వచనకావ్యమును, పాఠ్యగ్రంథములుగ నిర్ణయింపబడెను. ఈ కడపటి గ్రంథమును గురించి కొంత చెప్పవలెను. శ్రీ విక్టోరియారాజ్ఞీగారి జ్యేష్ఠపుత్రుడైన యెడ్వర్డుప్రభుపుగారు యువరాజుగ (Prince of Wales) నున్నప్పుడు, 1875 వ సంవత్సరమున హిందూదేశమును సందర్శింప వచ్చిరి, ఆ సందర్శనమును గూర్చి, యన్నిభాషలలోను గ్రంథములు రచియింపబడెను. చెన్నపురివారు లాసందర్శనమును గూర్చి, తెలుగులో నొక గ్రంథమును వ్రాయుచుని, శ్రీ కొక్కొండ వెంకట రత్నము పంతుగారిని కోరినందున వారా గ్రంథమును రచించిరి. అందులో కొంతభాగము మాకు పఠనీయ గ్రంథముగ నియమింప బడెను. అప్పుడు కళాశాలలో నలుగురు పండితులుండిరి. కాలేజీ తరగతులకు తెలుగు చెప్పుటకు, లొల్ల రామశాస్త్రిగారుండిరి. ఈయన మిక్కిలి గట్టివారని వారి శిష్యులిప్పటికి చెప్పుచుందురు. కాలేజీ తరగతులకు

సంస్కృతము చెప్పుటకు, వేదం వెంకటరమణశాస్త్రిగా రుండిరి. ఈయన వేదం వేంకటరాయశాస్త్రిగారి తండ్రిగారు. ఈయన మిక్కిలి సమర్థులు. క్రింది తరగతులకు సంస్కృతము చెప్పుటకు కస్తూరి శివశంకరశాస్త్రి గారును, తెలుగుచెప్పుటకు కందుకూరి వీరేశలింగముగారు నుండిరి. ఆ సంవత్సరమే రాజమహేంద్రవరము కళాశాలలో ప్రకృతిశాస్త్ర శాఖ గూడ క్రొత్తగబెట్టిరి. ఆశాస్త్రము బోధించుటకై, చెన్నపురినుండి మాలూరి రంగాచార్యులుగారు, కళాశాలకు వచ్చిరి. శాస్త్రసారముల నాసంవత్సర మాయనే చెప్పిరి. ఆయన నామీద చాల దయగలవారై నా కన్నులకు సులోచనములజోడు చెన్నపురినుండి దెప్పించుకోమని, చాలసార్లు సలహా నిచ్చిరి. అప్పుడు తాయి సూర్యప్రకాశరావు నాయుడుగారు బి. ఏ. తర గతిలో చదువుచుండిరి. ఆయనకుగూడ నేత్రములలో గొంత లోపముం డెను. ఆయన నిరంతరము కంటిజోడు ధరించుచుండిరి. ఆయన నాకు మిత్రులై చెన్నపురికిబ్రాసి కొన్ని సులోచనపుజోళ్లు తెప్పించిరి. అవి యేవియు నాకంటికి సరిపడలేదు. కాపున జోళ్లు వెంటనే పంపించిచేసిరి. ఇంగ్లీషులోను, దేశచరిత్రములలోను, నాంధ్రభాషలోను, నేను తరగతిలో నగ్రగణ్యుడనై యుంటిని. కాని, గణితములో మాత్రము లోపమెప్పటి వలెనే యుండెను. అప్పుడు కాలేజిలో ప్రధాన సహాయోధ్యాపాయులుగ (First Assistant) సి. నాగోజీరావు పంతులుగారుండిరి. అంతకుముందే కొన్నాళ్ళ క్రిందట, గవర్నరుజనరలుగారైన "రిప్పను" దొరగారివల్ల, స్థానిక స్వపరిపాలనము మనకు వచ్చినది. పూర్వము సబ్‌కలెక్టరే మునిసి పలు చైరుమనుగ నుండెను. 1884 వ సంవత్సరము మొదలుకొని మునిసిపలు కౌన్సిలరులను, నధ్యక్షుని, ప్రజలే యెన్నుకొనుట కధికారము వచ్చెను. అప్పటి నిబంధనలప్రకారము గవర్నమెంటువారి యుద్యోగస్తులు గూడ, మునిసిపలు చైరుమనుగను, కౌన్సిలరుగను యుండవచ్చును. అందుచేత నాగోజీరావు పంతులుగారు, రాజమహేంద్రవరమునకు మొట్ట మొదట ప్రజలచే నెన్నుకోబడిన మునిసిపలు సంఘాధ్యక్షులైరి. వీరేశ లింగముగారుకూడ మునిసిపలు సభ్యులుగ నుండిరి మెట్రిక్యులేషను పరీక్షకు విద్యార్థులను బంపుటకు ముందుగ నుపాధ్యాయులొక చిన్నపరీక్ష చేసిరి. అందు కృతార్థులైనవారినే పరీక్షకు పంపవలెనని వారు నిశ్చయించు కొనిరి. ఆ పరీక్షలో గణితమున నాకు తక్కువమార్కులు వచ్చెను. మొదటవారు నన్ను పరీక్షకు బంపదలుచుకోలేదుగాని, ఇంగ్లీషులోను, దేశ

చరిత్రముతోను, మార్కులు బాగుగ వచ్చియుండుటచే గాబోలు, వారు నన్ను పరీక్షకుపంపిరి. పంపినను నేను గణితములో నంతగ కృషి చేయలేదు.

ఆరవగతిలో ప్రవేశించినది మొదలుకొని, నాకు తల్లాప్రగడ చలపతి రావుగారు మిత్రులై రి. మా మైత్రియంతకంతకు హెచ్చెను. చలపతిరావు గారు శ్రీ పారుపల్లి పుండరీకాక్షుడుగారి యల్లుడు. ఆసంపత్సరము నరసాపురమునుండి, పుండరీకాక్షుడుగారి కుమారుడచ్యుతరామయ్యయు, వారి యింటనేయుండి జదువుకొనుచున్నవారి మేనమామకుమారుడు చిలకలపూడి సీతారామయ్యయు, వారియింటనే భోజనముచేసి చదువుకొనుచున్న ద్విభాష్యం కనకమనుసతిడును, వీరు మువ్వురు, టయిలరుహైస్కూలు విద్యార్థులై చదివి, మెట్రిక్యులేషను పరీక్షనిమిత్తమై రాజమహేంద్రవర మొకనెలముందుగవచ్చి, చలపతిరావుగారియింట బసచేసిరి. ఆకాలమున మెట్రిక్యులేషనుపరీక్ష ప్రాతగోదావరి జిల్లాకింతకుగూడ నొక్క రాజమహేంద్రవరములోనే జరుగుచుండెను. కాకినాడ, యమలాపురము, నరసాపురము, యేలూరు ననుచోట్లనే యున్నతపాఠశాల లుండెను. మెట్రిక్యులేషనుపరీక్ష ప్రతి సంవత్సరము డిశంబరు పదునైదవతేదీ మొదలుకొని యైదుదినములు జరుగుచుండెను. ఇతర స్థలములనుండి వచ్చిన విద్యార్థులతో రాజమహేంద్రవరపు విద్యార్థులతోను పట్టణము నిండియుండెడిది. పరీక్షకు కూర్చుండెడి విద్యార్థులు రమారమి యైదారు వందలమంది యుండెడివారు. ప్రథమశాస్త్ర (యఫ్. ఏ.) పరీక్షగూడ నాదినములలోనే, కళాశాలలో జెరిగెడిది. స్థలముచాలనందున కళాశాలా భవనమునుట్టును తాటియాకులపందిళ్ళు వేయబడుచుండెవి. పుండరీ కాక్షుడుగారి కుమారుడును, వారి బంధుమిత్రులును, తెనుగుపాఠములు చక్కగ చదువుకోనందునను, నేను తెనుగులో మిక్కిలి యభిరుచిగలవాడ నగుటచేతను, యచ్యుతరామయ్యయు వానిబంధుమిత్రులును ముందుగవచ్చి, నాచేత తెలుగు చెప్పించుకొనిరి. మెట్రిక్యులేషను తరగతిలో మేము నలుబదిమంది చదువుకొంటిమి. అందరిపేళ్లు నాకిప్పుడించుమించుగ జ్ఞాపకమున్నవి. వారిలో యిప్పుడు బ్రతికియున్నవారము దుప్పూరి వీర ద్రయ్యగారును, దుగ్గిరాల దేవళరాజుగారును, నేనును. మరియెవరైన బ్రతికియున్నారేమో నాకుదెలియదు. అప్పటి నా సహాధ్యాయులలో గొప్ప యుద్యోగముచేసినవారొక్కరు మాత్రమే యుండిరి. ఈ పట్టణమందు

గొప్పవైద్యుడని ప్రసిద్ధికెక్కిన, యేలూరి సాహేబుగారి తమ్ముని కుమారుడు సయ్యద్ ఉద్దీన్ సాహేబుగారు, కాకినాడలో జిల్లారిజిస్ట్రారుపనిచేసి యీమధ్యనే కీర్తిశేషులైరి. నాసహాధ్యాయులలో తల్లాప్రగడ చలపతిరావు గారు, సూరి సుందరరామశాస్త్రిగారు, న్యాయవాదులై కొన్నాళ్ళక్రిందట కీర్తిశేషులైరి. పరీక్షకు నన్ను బంపిరేగాని గణితవిద్యలో, నేను మిక్కిలి పేదవాడనగుటచే నాసంవత్సరము నేను పరీక్షలోదప్పితిని. ఆపరీక్ష యిప్పటి స్కూలుఫయినలుపరీక్షకు సమానమందురుగాని, కొంతభేదము గలదు. ఇంగ్లీషులో నూటికి ముప్పదిమూడుమార్కులు తెలుగులో నూటికి ముప్పదిమూడుమార్కులు రావలెను. గణితము, బీజగణిత, రేఖాగణితము నను, మూడువిషయములలో వచ్చు మార్కులు కలుపుదురు. అందులో నాలుగవవంతుమార్కులు రావలెను. దేశచరిత్రములోను భూగోళములోను ప్రకృతిశాస్త్రములోను వచ్చు మార్కులు కలిపివేయుదురు. అందులోగూడ నాలుగవవంతుమార్కులు రావలెను. కాని మొత్తముమీద నన్నిమార్కులలోను మూడవవంతు రావలెను.

1885 వ సంవత్సరము జనవరినెలలో, ననగా తారణ సంవత్సర పుష్యమాసములో, నాకు మూడవచెల్లెలు పుట్టినది ఆమెపేరు వెంకట రమణమ్మ. ఈమె పుట్టినదిమొదలు నాలుగు సంవత్సరములవరకు రోగ పీడితయై, తలమీద కురుపులు మొదలగువాటితో బాధపడుచుండెను. ఈమె జీవించునని మా తలిదండ్రులుగాని, బంధువులుగాని, యనుకొనలేదు. ఈమె బ్రతికినచో, నీమెపెండ్లి చిన్నతిరుపతిలో చేయుదుమని, మా తలిదండ్రులు మ్రొక్కుకొనిరి. అదృష్టవశమున నెట్లో గండములుగడచి మా చెల్లెలు బ్రతికెను. మా తండ్రిగారికి నాడుపిల్లలమీద మిక్కిలి ప్రేమ. రమణమ్మ పుట్టినవెంటనే మాతల్లికి గుండెలలో నొప్పి మరల బయలు పడెను. వీరవాసరములో మంచి వైద్యులులేరు. అందుచేత మా తల్లి రాజమహేంద్రవరములోనున్న మా మేనమామకడకు వచ్చెను. అదృష్ట వశమున నాదినములలో, వెనుక మందిచ్చిన పుప్పాల శ్రీరాములునాయుడు గారు, కార్యాంతరముమీద రాజమహేంద్రవరము వచ్చిరి. నేను వారిబసకు వెళ్ళి మా తల్లి రోగమునకు మందిమ్మని యడిగితిని. ఆయన కాగితము మీద మందులపేళ్లు వ్రాసియిచ్చి, యవికొని నేలవేము కషాయముతో పుచ్చుకొనుమని చెప్పెను. ఆ దినములలో మందుల విక్రయించెడి యంగళ్లులేవు. ఆల్‌కాటుతోటలో డాక్టరు హేడెనను నొక దొరగారుండిరి.

ఆయన వైద్యులు. వారమునకు మూడు రూపాయలు పుచ్చుకొని టంజాము మీద నెక్కి-వెళ్ళి, గృహస్థుల యిండ్లలో వైద్యము చేయుచుండెడివారు. ఆయనవద్ద మందులు విక్రయమునకుగూడ దొరుకుచుండెడివి. మా మేన మామగారు దొరగారియింటికివెళ్ళి, యా మందులుకొని, యేమందు నెన్ని పాళ్ళు కలుపవలెనో దొరగారివలన తెలిసికొని, యాప్రకారము మందివ్వ జొచ్చిరి. ఆమందుతో మాతల్లికి నొప్పి నివారణమయ్యెను. ఆరోగ్యము సంపూర్ణముగ గలిగిన పిదప, మాతల్లి నన్ను దక్కి-నబిడ్డలను దీసికొని, వీరవాసరము వెడలిపోయెను.

1885 సంవత్సరము వేసవిసెలవుల యనంతరము కాలేజీలో నొక మార్పు జరిగెను. వేసవికాలపు శలవులలో, లొల్ల రామశాస్త్రిగారు స్వర్గస్థు లైనందున, శ్రీ వీరేశలింగం పంతులుగారిని వారి స్థానమందు ప్రధానాంధ్రో పాధ్యాయునిగ దొరతనమువారు నియమించిరి, రెండవ తెలుగుపండిత పదవి తీసివేయబడెను. ఆ సంవత్సరము నేను పరీక్షలో తప్పిపోతిని గావున, మఱుసటిసంవత్సరము మరల చదువపలసివచ్చెను. 1886సంవత్స రమునుండి కాలేజీలో మెట్రిక్యులేషను తరగతి తీసివేసిరి. కాబట్టి నేను మరియొక పాఠశాలలో చదువవలసివచ్చెను. అంతలో పురియొకమార్పు జరిగెను. ఇన్నీసుపేటస్కూలు, టపునుస్కూలు నను రెండు పాఠశాలలు మెట్కాఫ్ దొరగారి యధ్యక్షతక్రింద నేర్పడిన యొక పరిపాలకసంఘము క్రింద యుండెనని యిదివరకే చెప్పితిని. ఆ రెండుపాఠశాలలలోనున్న హైస్కూలు తరగతులు తీసివై చి, పరిపాలకసంఘమువారు టౌన్ అండ్ ఇన్నీస్‌పేట్ హైస్కూల్ (Town and Innispet Highschool) అను నొక క్రొత్త యున్నతపాఠశాలను పెట్టిరి. తగిన చోటులేనందున, కాలేజీ యాపరణమున దక్షిణపువైపున నొక తాటియాకులపాక వై చి, దానిలో నా పాఠశాలను నెలకొల్పిరి. దానికి వేదం వెంకటరమణశాస్త్రిగారి రెండవ కుమారుడును, మునుపు రాజమహేంద్రవర కళాశాల విద్యార్థియు పట్టపరీక్షసిద్ధుడు నైన, శ్రీ వేదము వేంకటాచలముగారిని, ప్రధానోపాధ్యా యులుగ నేర్పరచిరి. ఏలేశ్వరపు పేరయ్యశాస్త్రిగారను వారిని, ద్వితీయోపా ధ్యాయులుగ నేర్పరచిరి. ఇందు మెట్రిక్యులేషను తరగతియు, దానిక్రింది తరగతియు మాత్రమే యుండెను. తక్కి-నతరగతులు లేవు. రెండే తర గతులు. ఆకొండి వ్యాసమూర్తిశాస్త్రిగారును, పురాణపండ మల్లయ్య శాస్త్రిగారును, సుదయమున నిన్నీసుపేట స్కూలులో సంస్కృతాంధ్ర

ములు జెప్పునట్లును, మధ్యాహ్న మీ క్రొత్తపాఠశాలలో పనిచేయునట్లును, నధికారులు నిర్ణయించిరి. మొత్తముమీద నీ పాఠశాలలో తరగతులు రెండు, పనిచేయునట్టి యుపాధ్యాయులు నలుగురు. వేదము వేంకటాచలము గారు మిక్కిలి సమర్థులు. ఆ పాఠశాలాపరిపాలకసంఘమున కప్పుడు కళాశాలలో ప్రకృతిశాస్త్ర పండితుడుగ నుండిన యమ్. రంగాచార్యులు గారు, కార్యదర్శిగ నుండిరి.

1886 వ సంవత్సరమున మొదటగాక జూలైనెలలో నేనీ క్రొత్త పాఠశాలలో జేరితిని. అప్పటి నిబంధనలప్రకారమాలాగున చేరవచ్చును. ఆసంవత్సరము మాతరగతిలో గొంచెమించుమించుగ నరువది యిద్దరిమంది విద్యార్థులుండిరి. అప్పటి నాసహాధ్యాయులలో శ్రీ రాయసం వెంకటశివుడు గారు, శ్రీ చెదలవాడ గోపీనాథముగారు, శ్రీ ధరణీప్రగడ శివరావుగారు, శ్రీ సారంగ భీమశంకరముగారు మాత్రము, దైవానుగ్రహమున నిప్పటికి జీవించియుండబట్టి కలుసుకొనెడిభాగ్య మప్పుడప్పుడు నాకుకలుగుచున్నది. ఆతెళ్ళ ప్రకాశముగారిటీవల స్వర్గస్థులైరి. ఆ సంవత్సరమైనను నేను గణిత ములో గట్టి కృషిచేయలేదు. ఆ యేడుగూడ నేను పరీక్షకు దరకాస్తు చేసితిని. గణితమున మంచి ప్రజ్ఞలేనందున నేనా యేటగూడ తప్పిపోతిని. ఆ సంవత్సరము పరీక్షముందర నాకొక చిక్కుగూడ సంభవించెను.

పరీక్షముందర నా కజీర్ణమువల్ల భేదిగలిగినది. నేను ధర్మాసు పత్రికిబోయి మందు తెచ్చుకొంటిని. ఆ వైద్యుడు నా తత్వమెరుగక మందులో నల్లమందుకూడ కొంతగలిపెను. చిన్ననాటనుండియు నాకు నల్ల మందు బొత్తిగపడదు. అది వాసనజూచినంతమాత్రముననే నాకు వమన ములు వెళ్ళును. ఈ వైద్యముచేత నాకు దోకులు వెళ్ళనారంభించెను. ఇంటివద్దనుండి పరీక్షకు కాలేజీకి వెళ్ళుచుండగా త్రోవలో నెన్నో వమన ములు వెళ్లెను. పరీక్షకు గూరుచుంటినిగాని వికారముచేత నాతల దిరుగ జొచ్చెను. అక్కడగూడ రెండుమూడు దోకులు వెళ్లెను. ఈ విధముగ ప్రథమదిన మెట్టెబ్బో గడిచెను. మరునాడు వికారము, వమనములు లేవు. ఏ కారణముచేతనైననేమి నేను పరీక్షలో దప్పిపోతిని. ఆ సంవత్సరమున నాకు శ్రీ పారుపల్లి పుండరీకాక్షుడుగారి కుమారు డచ్యుతరామయ్య, తనకు గతసంవత్సరమున నేను తెనుగు చెప్పినందుకు కృతజ్ఞుడై, పదిరూపాయలు నాకు బహుమానమిచ్చెను. నేను పరీక్షలో దప్పిపోతినని దెలియగానే, రెండుసార్లు దప్పిపోతినని విచారించి, కొంచెము విరక్తిగలిగి, నావద్ద

నున్న పదిరూపాయలు చేరబుచ్చుకొని, కాకినాడకో మరెక్కడికో బోవలె నని, ధవళేశ్వరముదాక నడచి వెళ్ళితిని. 1886వ సంవత్సరమున గోదావరికి గొప్ప పరదమువచ్చుటచే, ధవళేశ్వరపులాకు బ్రద్దరై కొట్టుకొని పోయెను. అందుచేత గవర్న్మెంటువారు దాని దగ్గరనే మరియొక క్రొత్త లాకు కట్టింప నారంభించిరి నేను ధవళేశ్వరము వెళ్లునప్పటికది తయారగుచుండెను. నాకప్పుడు దారితెలియక కంగారుపడి, ప్రయాణముమాని, యించికివచ్చితిని. నా మేనమామగారు నేను పరీక్షలో దప్పిపోతినని విని, కొంచము విచారించి, "మరల చదువుకొందువుగాని విచారింపకుమని" నాకు ధైర్యముచెప్పి, చీవాట్లుపెట్టి తిట్టక యూరకుండిరి.

1887వ సంవత్సరమున యేప్రియల్ నెలలో నా రెండవ చెల్లెలైన యచ్చమ్మకు వివాహమయ్యెను. వరుడు మధునాపంతుల కాలభైరవశాస్త్రి గారి మూడవ కుమారుడైన రామస్వామి. అతడు వీరవాసరము స్కూలులో మిడిలుస్కూలు పరీక్షయందు గృతార్థుడైనవాడు. అతడు నాకంటె రెండు సంవత్సరములు చిన్నవాడు. ఈపిల్ల సతనికిచ్చి వివాహముచేయుట మా బంధువులలో చాలమంది కిష్టములేదు. ఏలయన మధునాపంతులవారు, ధాత సంవత్సరము కరువునకు నిలువరేక యద్దంకి సీమనుండి వచ్చి యేలాగో కాలక్షేపము చేయుచున్నవారు వారి కిల్లువాకిలిగాని, మడిమాన్యములుగానిలేవు. చదువు చిన్నచదువు. కాని వరుడు రూపసి. తెలివిగల వాడు. వినయము, వివేకముగలవాడు. అందుచేత మాతండ్రిగారు పిల్లను వానికే యిచ్చుటకు నిశ్చయించిరి. అతనికిచ్చుట నాకు నిష్టమే. ఆ వివాహములో నా తమ్మునకు కృష్ణమూర్తి కుపనయనముజేసిరి. అతని కప్పటికి పదియారేండ్ల వయస్సు. అతడు మొదటినుండియు జబ్బువాడగుటచే నంత యాలస్యముగ నుపనయనమయినది. ఆ వివాహదినములలోనే నా పెదచెల్లెలయిన పున్నమ్మకు పునస్సంధానముజేసి యత్తవారింటికి బంపిరి. ఈ వివాహమైన రెండునెలలకు మాకొక తమ్ముడు పుట్టెను. ఆ శిశువు పురిటిలోనే సంధిగొట్టి మృతినొందెను. మొత్తముమీద మా తలి దండ్రులకు పదిమంది పుట్టితిమి. మా జననీజనకులు మృతినొందునప్పటికి మే మయిదుగురము మాత్రము బ్రతికియుంటిమి. నేనును, మాతమ్ముడు కృష్ణమూర్తియు, మా పెదచెల్లెలు పున్నమ్మయు, మా రెండవచెల్లెలయిన యచ్చమ్మయు, మూడవ చెల్లెలయిన రమణమ్మయు మా మాతాపితరుల కంత్యమువరకు సేవచేయగలిగితిమి.

1887 వ సంవత్సరమున శ్రీ విక్టోరియారాణిగారప్పటి కేబదియేండ్లు పరిపాలనముచేసినందున సువర్ణోత్సవము (Golden Jubilee) జరిగెను. ఇది సామ్రాజ్యమందంతట జరిగెను, హిందూదేశమందలి పట్టణముల యందేగాక పల్లెలయందుగూడ నీయుత్సవములు జరిగెను. రాజమహేంద్ర వరమునందుగూడ నీయుత్సవము వైభవముగ జరిగెను. మెట్కాఫ్ దొర గారు, కళాశాలా విద్యార్థులను సుపాధ్యాయులను వెంటబెట్టుకొని, జయ పతాకములతోను మంగళవాయిద్యములతోను నూరేగుచు, మ్యూజియము చేరిరి. పురప్రముఖులనేకు లాయుత్సవములో పాల్గొనిరి. రాజమహేంద్ర వరమందలి కవులు కందుకూరి వీరేశలింగముగారు, వడ్డాది సుబ్బారాయుడు గారు, వావిలాల వాసుదేవశాస్త్రిగారు, సుసర్ల అనంతరావుగారు, చిళంబి యాదినారాయణప్పనాయుడుగారు మున్నగువారు పద్యములు చెప్పిరి. రాజమహేంద్రపరమున నీయుత్సవము రెండుసారులు జరిగెను. రెండు సారులు పద్యములు జదువబడెను. నేను మొదటిసారి కొన్ని పద్యములు రచియించితినిగాని యవి నామిత్రులువిని సంతోషించిరేగాని సభలో చదువ బడలేదు. రెండవసారి యుత్సవము జరుగునప్పటికొక చిత్రకథజరిగెను. నాపరిచితుడొకడు రాజీగారిమీద పద్యములు చెప్పవలెనని గుతూహల పడెను. కాని యతనికి లక్షణజ్ఞానములేదు. ఐనను తనకుతూహలము నెర వేర్చుకొనుటకై, యెవరిచేతనైన పద్యములు చెప్పించి తనకిప్పింపుమని, తనకును నాకును మిత్రుడైన దామెర్ల వెంకటరమణారావుగారి నడిగెను. ఆయన వానిని గురించి నాకు సిఫారుచేసిరి. నేను వారిమాటనుబట్టి తొమ్మిది పద్యములువ్రాసి వానికిచ్చితిని. ఆయన యాపద్యములక్రింద తన పేరు వేసుకొని, యచ్చువేయించి, సభలో దక్కినవారి పద్యములతోపాటు శ్రీ వడ్డాది సుబ్బారాయుడుగారిచే చదివించుకొన్నెను. పేరులేకపోయినను యవి నాపద్యములేగదాయని నేను సభలోగూర్చుండి, విని సంతోషించితిని. తాను వ్రాయకపోయినను తనపేరు పదిమందిలోను వెల్లడియయ్యెనని యతడు సంతోషించెను. సభాసదులాపద్యములాలకించి, రచియించిన వారెవరో దెలిసికొనలేకపోయిరిగాని, పేరువేసికొనిన నామిత్రుమహాత్రము రచియించలేదని నిశ్చయించిరి.

1887 వ సంవత్సరములోనే, మెట్కాఫ్‌దొరగారు సెలవుదీసికొని సీమవెళ్ళిరి. వారిస్థానమందు దొరతనమువారు మానుదొరగారిని యేర్పర చిరి. నాగోజీరావుపంతులుగా రంతకుముందే కళాశాలలోని ప్రథమ సహా

యోపాధ్యాయత్వముమాని, యుత్తరమండలముల పాఠశాలాపరీక్షాధికారిగ వెళ్ళిపోవుటచే, వారిస్థానమున ప్రధాన సహాయోపాధ్యాయుడుగవచ్చిన క్షీరసాగరము సుందరరావుపంతులుగారు, మెట్కాఫ్‌గారి సెలవుదినము లలో తన కాపదవి నిత్తురని యాసపడి, యది యన్యధాజరుగుటచే బెంగ గొనియో, మరియేకారణముననో, పక్షవాతము జబ్బుపడగిలి యేప్రియల్ నెలలో నకస్మాత్తుగ మృతినొందిరి. ఈయన నాగోజీరావుపంతులుగారి తరువాత మ్యునిసిపలు సంఘాధ్యక్షులుగూడ నయ్యెను. మాసుదొరగారు ప్రథమ శాస్త్రపరీక్షకు చదువు విద్యార్థులచే, నా సంవత్సరము పాఠ్యపుస్తక మయిన "వెనీసు వర్తకుడు" (Merchant of Venice) అను నింగ్లీషు నాటకము నాడించిరి. అది షేక్సుపియరు మహాకవి చేసిన నాటకము. దొరగారు విద్యార్థులకు రెండుమూడు మాసములుచ్చారణయు, నభినయన మును నేర్పి యాడించిరి. నాటకపాత్రధారులలో నాప్రియమిత్రులయిన పారుపల్లి యచ్యుతరామయ్య, చిలకలపూడి సీతారామయ్య, తల్లాప్రగడ చలపతిరావు, సత్యరాజు మృత్యుంజయరావు మొదలగువారుండుటచే, నేనా నాటకమునకుపోయి చూచి మహానందమును పొందితిని. అందు షయిలాకు వేషమువేసిన వానిని సభాసదులు మెచ్చుకొనిరి. ఆనాడు నాటకశాలలుగాని పురమందిరములుగాని లేకపోవుటచే, నాటకము నవాబుదేవిడీలో నాడబడెను. ఇది సెప్టెంబరులో జరిగెను. రాజమహేంద్రవరములో నింగ్లీషునాటకమాడుట కదియే మొదలు

ఈ 1887 వ సంవత్సరమున కడపటిభాగమున, నాకు గొప్ప మన స్తాపము కలిగెను. పారుపల్లి పుండరీకాక్షులుగారి కుమారుడైన యచ్యుత రామయ్యకును, నాకును దృఢమైన స్నేహబంధమేర్పడెను. అతనికి మిత్రు డును, నాకు బంధువును నైన ద్విభాష్యం కనకము చనిపోయెను. అచ్యుత రామయ్యకు నవంబరునెల 26 వ తేదీని జ్వరముతగిలెను. అది క్రమక్రమ ముగ హెచ్చెను. సెంట్రలుజెయిలులో డాక్టరయిన రటవర్తి రంగనాయ కులు నాయుకుగారు వైద్యముచేసిరి. కాని జ్వరము తగ్గలేదు. రోగికి రెండవవారము సంధించెను. నివరవారములో పుండరీకాక్షులుగారు కూడ నరసాపురమునుండి వచ్చిరి. కళాశాలావిద్యార్థులైన చెన్నాప్రగడ భాను మూర్తిగారు, వెన్నేటి రామచంద్రరావుగారు మున్నగువారును మరి కొందరు దగ్గరబందుగులును, రోగి కెన్నో మందులిచ్చి యుపచారములు చేసిరి. అయినను రోగము తగ్గలేదు. కాలేజీలో ప్రకృతిశాస్త్ర పండితు

లైన రంగాచార్యులుగారు కూడ వచ్చి రోగిని పలుమారులు చూచి పెదవి విరచిరి. కాని మూడువారములు మంచముమీదనుండి, బాధపడి, యచ్యుత రామయ్య 1887వ సంవత్సరము నవంబరునెల 18వ తారీకున శుక్రవారము నాడుదయమున, మృతినొందెను. అతని కంతకుముందే వివాహమయ్యెను. పుండరీకాక్షుడుగారి కంతకుముందు పదమూడేండ్లక్రిందట భార్యావియోగ మయ్యెను. ఆయనకీ బాలుడొక్కడే కుమారుడు. ఈ పుత్రుని నమ్ముకొని యాయన పరల వివాహము మానుకొనెను. బాలుడు బుద్ధిమంతుడు. రూపవంతుడు, దృఢశరీరము గలవాడు. అట్టివారేగదా మృత్యుదేవతకు గావలసినవారు! అతని మరణము నాకు మిక్కిలి దుఃఖమును గలిగించెను. అతడు నాయెడల మిక్కిలి ప్రేమగలిగి యుండెడివాడు. ఏకపుత్రుడగుటచే శ్రీ పుండరీకాక్షుడుగారు మిక్కిలి గారాబముతో పెంచి యాతడేమి గోరిన నవి యిచ్చెడివారు. కుమారుడింగ్లీషుకపుల గ్రంథములన్నియు తెప్పింపుమని కోరగ, తండ్రిగారు డెబ్బదియైదురూపాయ లందునిమిత్తమిచ్చిరి. అచ్యుతరామయ్య యా సొమ్ముతో నాంగ్లేయకవుల గ్రంథములు దెప్పించెనేగాని, యవి చదువుకొనుభాగ్యమాతనికి పట్టలేదు. అతనికప్పటికి పదునెనిమిది సంవత్సరములు వయస్సు. తండ్రి వృద్ధుడు. భార్య పండ్రెండు సంవత్సరముల వయస్సుగల బాలిక. అతని మరణముచే బంధువర్గమును మిత్రమండలియును, దుఃఖసముద్రమున మునిగిరి. పుండరీకాక్షుడుగారే స్వహస్తములతో నగ్నిహోత్రము పుచ్చుకొని కుమారుని దహనము చేయ వలసివచ్చెను. కుమారుడు చనిపోయిన మూడవదినమున పుండరీకాక్షుడుగారు, శ్రమపడి మందిచ్చిన రంగనాయకులునాయుడుగారికి డెబ్బదిరూపాయ లిచ్చి, కుమారుని గ్రంథభాండారములో నున్న యింగ్లీషు గ్రంథములను వాని మిత్రులకు పంచిపెట్టిరి. ధామ్సనుమహాకవి యింగ్లీషులో వ్రాసిన పద్యకావ్యముగల యొక చిన్నసంపుటమును నాకుగూడ వారిచ్చిరి.

మా పెదచెల్లెలు కాపురమునకు వెళ్ళినతరువాత, మా తండ్రిగారు పుత్రికనుజూచుట కప్పుడప్పుడు నరసాపురము వెళ్లుటచేత, మామగారికి నల్లనకు మునుపటి స్పర్ధలుపోయి మాటలువచ్చెను. రాకపోకలుకూడ కలిగెను. మా తండ్రిగారు జామాతృగృహమున భోజనముగూడ చేయ నారంభించిరి.

శీతకాలపు సెలవులకు, నేను వీరవాసరముపెళ్ళి. యొకనాడు మా చెల్లెలిని జూచుటకు నరసాపురము నడచివెళ్ళితిని. భోజనముచేయుచుండగ

మా బావగారు, మా తండ్రిగారిపైనేవో లోపములనెంచి, నిరసనగ మాట లాడెను. నాకు వెంటనే కోపమువచ్చెను. భోజనము చేయగానే నేను వీరవాసరమునకు బయనమైతిని. బావగారు నన్నాపూట వెళ్ళవద్దని నొక్కి వక్కాణించెను. కోపావేశమున నేనాయనమాటవినక బయలుదేరి తిరిగినడచియే వీరవాసరము వెళ్ళితిని రాను పదమూడుమైళ్లు, పోను పదమూడుమైళ్లు నడచుటచే పాదములు బొక్కలెక్కి నెత్తురుగ్రమ్మెను. నా సాహసమునకు మా తండ్రిగారు నన్ను చీవాట్లుపెట్టిరి. మాతల్లి మిక్కిలి విచారించి వేడినీళ్ళతో పాదములు గడిగించి బాధతగ్గించెను. అభిమానగ్రస్థుడనై నేనట్లు చేసితిని. మాటపడుట నాకెంతమాత్ర మిష్టములేకపోయెను.

1887 వ సంవత్సరములో నేను గణితములో ముఖ్యముగ నంకగణితములో గొంత పరిశ్రమజేసితిని. రేఖాగణితములోనున్న పాఠములన్నియు కంఠపారముగ పల్లించితిని బీజగణితములోమాత్రము నాకెంతమాత్రము పాండిత్యము కుదురలేదు. ఆసంవత్సరమున మెట్రిక్యులేషను పరీక్షకు ప్రథమశాస్త్రపరీక్షకును విద్యార్థులెక్కువగ వచ్చిరి. అందుచేత మెట్కాఫ్ దొరగారు ప్రథమశాస్త్రపరీక్షను మ్యూజియములోపెట్టి, యచట ప్రధాన సహాయోపాధ్యాయుడైన హెన్సుమనుగారి నుపద్రష్టగ నియమించెను. మెట్రిక్యులేషను విద్యార్థులకు కొందరికి పరీక్ష యిన్నీసు పేట పాఠశాలాభవనములోపెట్టి, యచట ప్రధాన శ్రీనివాసరాపుపంతులు గారి నుపద్రష్టగ నియమించి, దామరాజు బసవరాజుగారిని మరియొకరిని వారికి సహాయులుగనిచ్చిరి. ఇన్నీసుపేట పాఠశాలలోనే, నా స్థానము పడెను. అన్నిపాఠములలోనిప్రశ్నములకు నేను త్వరముగ సరిగ వ్రాసితిని గాని, యాల్జీబ్రా నాకు రాదుగనుక నేవోకొన్ని కొంకిరిగీతలుగీసి జవాబుల కాగితములు బసవరాజు గవరాజుగారికందించితిని. అందులోనాకు సున్న వచ్చియుండును. అంకగణితమున రేఖాగణితమున నాకు మార్కులా సంవత్సరమెక్కువగ వచ్చియుండును. అందుచే నేనాసంవత్సరము పరీక్షలో కృతార్థుడనైతిని. ఆసంవత్సరము నాతరగతిలో చదివినవారిప్పుడు కొంత మంది నాకు జ్ఞప్తిలోనున్నారు. పోలవరముజమీందారుగారైన శ్రీ కొచ్చర్ల కోట రామచంద్ర వెంకటకృష్ణారావుగారు, ఆచంట సూర్యనారాయణరాజుగారు, బుద్ధిరాజు వీరభద్రరావుగారు, ప్రక్కి జగ్గయ్యగారు, గుడిపాటి లక్ష్మీనర సింహముగారు, మున్నగువారు. ఆసంవత్సరము మేము పండ్రెండుగురము పరీక్షలో కృతార్థులమైతిమి. ఈపైన పేర్కొనినవారును నేనును నాయేడు

ప్రరీక్షలో కృతార్థులైనవారిలోనివారమే. నేను వీరవాసరములోనుండగ పరీక్షలో దేలినట్లు నాకు పోలవరము జమీందారుగారు జాబునువ్రాసిరి. పిమ్మట నేను రాజమహేంద్రవరముపెళ్ళి ప్రథమశాస్త్రతరగతిలో చేరయత్నించితిని గాని, గణితశాస్త్రములో గట్టి ప్రజ్ఞలేకపోవుటచేతను, దృష్టిదోషమెక్కువగుటను భయముచేతను, తగినధనములేకపోవుటచేతను, నేను చదువు మానుకొని రాజమహేంద్రవరములోనే యుంటిని

నా స్నేహితుడైన తల్లాప్రగడ చలపతిరావుగారు, 1885 వ సంవత్సరములోనే మెట్రిక్యులేషను పరీక్షయందు కృతార్థుడై, 1886, 1887 సంవత్సరములలో ప్రథమశాస్త్ర (F A) పరీక్షకు జదువుచుండెను. 1887 వ సంవత్సరాంతమువరకు నత డిన్నీసుపేటలో నొక యద్దెయింటిలో గాపుర ముండెను. ఆ సంవత్సరాంతమున నతడు పేటలో బసమాని, ప్రాత యూరిలో నతని బావమరదియైన రాయవరపు శ్రీరామ అప్పారావుగారి యింట నివసింపబోయెను. ఇన్నీసుపేటలో నున్నప్పుడు వారియిల్లు మాబసకు దగ్గరగ నుండెను. అందుచేత నేను ప్రతిదినము భోజనముజేసి చలపతిరావుగారి యింటనే చదువుకొనుచు, నచ్చటనే పండుకొనుచుంటిని. మా మేనమామగారిబస చల్లపల్లివారివీధిని దామరాజు బసవరాజుగారి యింటియెదుటనున్న పోతరాజువారియింటిలో. ఆగృహమిప్పుడు దేవరాజు వారు కొన్నారు. చలపతిరావుగారి యింట నేను నిరంతరముండుటచే వారికి నాకు మైత్రి యధికమయ్యెను. ఆకారణమున నేను ప్రతిదినము రెండుసార్లు భోజనముజేసి, చలపతిరావుగారి సహవాసముకొరకు పేట నుండి నడచి ప్రాతయూరికి బోవుచుంటిని. మధ్యాహ్నము పండిన యన్నము సాయంకాలముతిని చీకటి పడకుండగనే, నేను ప్రాతయూరికి బోవుచుండెడివాడను. వేయేల, నేను చలపతిరావుగారి యింటను రాయవరపువారి యింటను మిక్కిలి చనువుగలిగి వారి యింటిమనుష్యులవలె నుంటిని. చలపతిరావుగారికి మేనల్లుడును శ్రీరాయవరపు అప్పారావుగారి కుమారుడునైన రామమూర్తి మిడిలుస్కూలు తరగతిలో చదువుచుండెను. నేనా సంవత్సరము పనిలేనివాడనుగనుక, తెలుగు, నింగ్లీషు, దేశచరిత్రము మొదలయిన పాఠములు చెప్పుచుంటిని. గణితము మేనమామయైన చలపతిరావుగారు చెప్పుచుండిరి. రామమూర్తితోగూడ కొచ్చర్లకోట నరసింహారావు నాదగ్గర చదువుచుండెను.

రాయవరపు శ్రీరామఅప్పారావుగారిని గురించి కొన్ని పంక్తులు వ్రాయుట యనవసరముగాదు. ఆయన తండ్రిగారిపేరు రామన్నగారు. ఆయన జిల్లాకోర్టులో న్యాయవాదిగనుండి కొంతకాలము గవర్న్మెంటు న్యాయవాదిగగూడ నుండెను. ఆరామన్నగా రన్నప్రదాతయని ప్రజలు చెప్పుచుండెడివారు. అప్పారావుగారు మెట్రిక్యులేషను వరకు జదువుకొని, రాజమహేంద్రవరము సెంట్రలుజెయిలులో నొకగుమాస్తాగ నుండెడివారు. ఆయుద్యోగము 1886 వ సంవత్సరమున పోయెను. పిమ్మట కొంతకాల మాయన యుద్యోగములేకయుండి, మనదేశమున కాదినములలో నూతన ముగ వచ్చిన రైలుసంబంధములో కంట్రాక్టరుగ పనిజేసిరి. ఆయనభార్య చిన్నతనమునందే చనిపోయెను. ఒక కుమారుడు, నిద్దరు కుమార్తెలు నుండిరి ఆయన మరల వివాహముజేసికొనక యొక వేశ్యాంగనను భార్యగా స్వీకరించి, విష్ణుభక్తుడై జీవితముగడపిరి. ఆయన మిక్కిలి మంచి వారు ఆసంవత్సరమున (1888) మేనెలలో చలపతిరావుగారు "పెద్ద దేవము" అనుగ్రామమున వారిబంధుపులయింట జరుగు వివాహమునకు వెళ్ళవలసివచ్చి, బలవంతపెట్టి నన్నుగూడ వారివెంటదీసుకొనిపోయిరి. పెద్దదేవమనుగ్రామము కొవ్వూరుతాలూకాలోనున్నది. జనసామాన్యము "పెద్దేహాము"అని వాడుదురు. మరల మేము రాజమహేంద్రవరము వచ్చు సరికి వారమురోజులయినది

ఆదినములలోనే, రాజమహేంద్రవరమున తహసీలుదారుగనుండిన నందివాడ పేర్రాజుగారు, మృతినొందిరి. ఆసంవత్సరము జూలై 16వ తేదీని శ్రీ బసవరాజు గవరరాజుగారు మృతినొందిరి వీరు వీరేశలింగముగారికి ప్రాణమిత్రులు. వీరేశలింగముగారు చేయు సమస్త కార్యములకు గవరరాజు గారు సాయపడుచుండిరి. గవరరాజుగారు వీరేశలింగముగారితోపాటువెలిలో నుండుటచేత వారి దహనమునకు సభపతులు కొన్ని చిక్కులుపెట్టిరి. నాకప్పటికి గవరరాజుగారితో బరిచయములేకపోయినను, వారియందలి గౌరవముచేత, జూలై 17 వ తారీఖున, వారిశవముతోగూడ శ్మశానమునకు బోతిని. శవమును గరికపాటి సుబ్బరాయుడుగారు, దామెర్ల రమణరావు గారు, గాడేపల్లి సుబ్బయ్యగారు మరియొకరు మోసిరి. గవరరాజుగారి జ్ఞాతియైన బసవరాజు సేతూరావుగారగ్నిహోత్రము పట్టుకొనిరి. మంత్రపు బ్రాహ్మణుడు దొరకకపోవుటచే, కందుకూరి వీరేశలింగముపంతులుగారు, పుస్తకముజూచి మంత్రముచదివి, కర్మజేయించిరి. శవమువెంట

శ్రీ నాగోజీరావుపంతులుగారు, న్యాపతి సుబ్బరావుపంతులుగారు, మొదలగు పురప్రముఖులందరు వచ్చిరి. ఆ సంవత్సరమే యనగా సర్వధారి సంవత్సర మందు భాద్రపద బహుళామావాశ్యనాడు, పోలవరము జమీందారిణీ రైన శ్రీ కొచ్చర్లకోట కామాయమ్మగారు, మృతినొందిరి. ఈమె మహాపతివ్రత, మిక్కిలి ధర్మాత్మురాలు, ఇంటనన్నముబెట్టి జీతములిచ్చి చాలమంది విద్యార్థులకు జదువుజెప్పించెను. ఆమె దత్తపుత్రుడైన శ్రీ రామచంద్ర వెంకటకృష్ణారావుపంతులుగారు నాకుమిత్రుడును సహాధ్యాయుడును నగుట చేత, నేనాశవముతోగూడ వెళ్ళితిని ఆసంవత్సరమే రాజమహేంద్రవరము సబుకలెక్టరుగారి కచేరీలో సిరస్తదారుగనుండిన తాయి శేషగిరిరావునాయుడు గారు మృతినొందిరి.

ఆ సంవత్సరమే (1888) రాజమహేంద్రవరమున కేలూరు కంపెనీ యని యొక నాటకసమాజము వచ్చెను. ధారవాడ నాటకసమాజమువారు మొట్టమొదట తెనుగుదేశమునకు 1881 సంవత్సరమున వచ్చి, 1885 వ సంవత్సరమున మరల వచ్చిరి ఆసమాజమునకు నాయకుడైన వామనభట్ట బోషికిని, దక్కిన సభ్యులకును మనస్పర్ధలు గలిగినందున, నేలూరుపట్టణ మున నతడు తన సమాజమునుండి విడిపోయి, సమాజముమీద కోపము చేత మరియొక సమాజము దానికి పోటీగా లేపదీయదలచి, మన యాంధ్ర యువకుల కొందరను జేర్చుకొని, యొక నాటకసమాజమును లేవదీసెను. దానికే యేలూరు కంపెనీయని పేరు. ధారవాడ నాటకసమాజమువారివలెనే వీరును హిందీలో నాటకము లాడెదువారు. వీరి నాటకములు రమ్యముగ నుండెడివిగాని, సామాజికుల నడతలు మంచివికావని జనులు చెప్పుకొను చుండెడివారు. వీరి నాటకశాల రాజమహేంద్రవరములో టౌనుహాలు ప్రక్క, తూర్పుగ నప్పుడు కాళీగానున్న దొడ్డిలోవేసిరి. ధారవాడవారు గూడ 1881 సంవత్సరమున రాజమహేంద్రవరము వచ్చినప్పుడక్కడనే నాటకశాల నిర్మించిరి. ఆ నాటకసమాజములో నా మిత్రులైన తల్లాప్రగడ చలపతిరావుగారికి బంధువులు కొందరుండినందున, నాటకములకు సాధార ణముగ మా చలపతిరావుగారు వెళ్లుచు, నన్నుగూడ దీసికొనిపోవుచుండిరి. చలపతిరావుగారు టికెట్టు కొననక్కరలేదు ఆయనతోటిపాటు నేను గొన నక్కరలేకపోయెను. కాని పలుమారులు సొమ్ముచెల్లించకుండ నాటకము నకు వెళ్లుట నా కిష్టములేక, చలపతిరావుగారు పిలిచినను నేనొకనాడు రానని చెప్పితిని. రాయవరపువారి సావడిలో వెదురుపేళ్ళ చాపయొకటి

యుండెను. రానని నేనా చాపమీద పండుకొంటిని. చలపతిరావుగారు నన్ను పిలిచిపిలిచి విసిగి, యెట్టకేలకు నాపైనలిగి, నా రెండుకాళ్లు పట్టుకొని యెందుకురావని నన్ను బరబర యీడ్చెను. నా వీపు కొట్టుకొని పోయినను నా మొండిపట్టువిడువక నేను పండుకొంటిని. అతడు ప్రాణము విసిగి తానొక్కడే నాటకమునకు వెళ్లెను.

నా పట్టుదలవిషయమై రెండు మూడు చిన్న విషయములు వ్రాసెదను. పెద్దేవముపెండ్లికి నేను వెళ్ళినప్పుడొకనాడు నాకు మంచినీళ్లు త్రాగుటకు చలపతిరావుగారి యప్పగారు వెండిపాత్రయిచ్చెను. నాకు వెండిపాత్ర వద్దని రెండుమూడుసారులామెతో జెప్పితిని. కాని యామె యా పాత్రయిచ్చి వెళ్ళిపోయెను. వెండిపాత్ర వద్దన్నను యిచ్చినదన్న కోపము చేత దాహమెంతో యైనను మంచినీళ్లు త్రాగకయే, భోజనముజేసితిని. మరి యొక సంగతికూడ చెప్పెదను. పొగచుట్ట నాకలవాటులేదు, నా మిత్రులందరు చుట్టకాల్చెడివారే. "మేమందరము కాల్చుచుండగ నీవేల కాల్చక పోవలెను? నీకుకూడ చుట్ట యలవాటుచేసెదమని" నా మిత్రులు పారుపల్లి యచ్యుతరామయ్య, చిలకలపూడి సీతారామయ్య, ద్విభాష్యము కనకము, తల్లాప్రగడ చలపతిరావు నా చుట్టును గూర్చుండి, చుట్ట నా కలవాటుచేయ వలెనని చుట్టలుకాల్చి యాపొగ నా ముక్కులలోను నోటిలోను నూదిరి. నేనుక్కిరిబిక్కిరియై చుట్టయలవాటు జేసుకొనసని గట్టిగ జెప్పితిని. నానడతను గురించి కొన్నిమాటలు యిక్కడ చెప్పవలెను. చలపతిరావుగారును నేనును జదువుకొనుచున్న కాలమున నొకనాటి సాయంకాలము మేమిరువురము షికారు వెళ్ళితిమి. అతడు చుట్టలు దిట్టముగకాల్చెను. రమారమి యేడుగంటల కిద్దరము చలపతిరావుగారింటికి వెళ్ళితిమి. అతని తల్లియు నప్పగార్లు నతనిని బయికరింపగా నతడేదో జవాబుచెప్పెను. చుట్టకంపు గుప్పున వారికి గొట్టెను. అప్పుడు వారుమువ్వురు వానిని దూషించి "నీ సహవాసములు మండిపోను, దుస్సహవాసములు చేసి చెడిపోవు చున్నావు." అని వానిని మందలించి నన్నుగూడ తూలనాడిరి. అది వెన్నెలరాత్రి యగుటచే నేను మిక్కిలి దగ్గరగానున్న మాయింటికి నడచి పోయితిని ఆ మఱునాటినుండి చలపతిరావుగారింటికి వెళ్లుట మానితిని. చలపతిరావు తల్లి నన్నుగురించి కొందరు స్నేహితులనడిగెను. వారామెతో "లక్ష్మీనరసింహము చాల మంచివాడు, చుట్ట త్రాగడు, వానిసహవాసము చేత మీ పిల్లవాడు బాగుపడునుగాని చెడిపోడు. వానిని రావద్దనుట పొర

పాటు" అని చెప్పిరట. నేను పదునైదు దినములవరకు చలపతిరావుగారింటికి వెళ్ళలేదు. అప్పుడు చలపతిరావు తల్లియు నప్పగారును తమయింటికి రమ్మని నాకు పత్రమానమంపిరి. రమారమి మాసముదినములకు నేను వారియింటికి వెళ్ళ నారంభించితిని. ఒకప్పుడు మధ్యాహ్నము వండిన యన్నము మాయింట లేనియడల, సాయంకాలపు వంటయైనతరువాత వేడి యన్నము తిని జీకటిలో నేను ప్రాతయూరికి బోపుట కష్టమని, భోజనము చేయకయే చలపతిరావుగారింటికి బోవుచుండెడివాడను. అతడును వాని యింటిలోనివారును భోజనముచేసితివా యని నన్నడిగినప్పుడు, చేయలేదని చెప్పినపక్షమున వారియింట భుజియింపమందురేమో యని, మోమోటము పడి, భోజనము చేసితినని యబద్ధము పలుమారు చెప్పుచు వచ్చితిని.

ఆ సంవత్సరమున మా మేనమామగారికి శరీరములో నజీర్ణవ్యాధి గలిగినందున, వారికి బదిలీగానేను వారిపాఠశాలలో దెనుగుపాఠములు జెప్పుచువచ్చితిని. వ్యాధి రాజమహేంద్రవరములో నివారణగానందున, నేనును వారును గలసి మా వీరవాసరగ్రామము వెళ్ళితిమి. అక్కడ నీళ్లు మంచివగుటచేతను, తగినమందుతీసుకొనుటచేతను, వారివ్యాధి నివారణమై మరల బనిలో జేరిరి. ఆ సంవత్సరమున నవంబరు డిశంబరునెలలో నేను హిందూస్తానీభాష నేర్చుకొనవలెనని యభిలాషగలిగి, నాకాభాష నేర్పుమని నవాబు ఖాజాఅహమ్మదుల్లాఖాన్ సాహెబుగారినడిగితిని. వారునామీద దయగలిగి గొంచెము నేర్పనారంభించిరి. అక్షరములువ్రాయుట జదువుట వచ్చినవిగాని గుణితములు నేర్చుకొనుచుండగా నశ్రద్ధచే మానితిని.

మా గురువుగారైన వేదము వెంకటాచలముగారు, రాజమహేంద్రవరమునుండి, బి. యల్. పరీక్షకు జదువుకొనుటకు నిశ్చయించుకొని, చెన్నపురివెళ్ళ బయనమైరి. ఆ వార్త పాతవిద్యార్థులమైన మేమెరిగి యొక సన్మానముగావించి వారిని గౌరవించితిమి. శ్రీ పోలవరముజమీందారుగారు వారి శిష్యులేయగుటచే, వారొక జేబుగడియారము గురుపుగారికి బహుమానము జేసిరి. ధనములేనివాడనగుటచే నేను భక్తితో నైదుపద్య

ములు రచించి వారికర్పించితిని. పూర్వకాలము పురమందిరములేదుగనుక సభలన్నియు సాధారణముగ శ్రీ విజయనగరము మహారాజావారి బాలికా పాఠశాలలో జరుగుచుండెను. మా సభగూడ నచ్చటనే జరిగెను. ఆసభకు శ్రీ న్యాపతి సుబ్బారాపుపంతులుగా రధ్యక్షతవహించిరి. పద్యములుచ్చాని సభలో జదువుటకు నా కదియే ప్రారంభము. సభాసదులలో ననేకులు నా పద్యములు బాగున్నవని చాల మెచ్చుకొనిరి.

నా కవిత్వమునుగూర్చి యొక్కమాట నిచ్చట జెప్పవలెను. చిన్న నాడు నేను వీరవాసరములో జదువుకొనుచున్నప్పుడు, నా మిత్రుడు చెన్నా ప్రగడ భానుమూర్తిగారు నాకంటె పైతరగతిలో జదువుచు, నప్పుడే కవిత్వము చెప్పనారంభించెను. పులినిజూచి నక్క వాతబెట్టుకొన్నదన్న సామెతగ, శబ్దజ్ఞానము లేకపోయినను, లక్షణము రాకపోయినను, నేను గూడ పద్యములు చెప్పవలెనని కుతూహలపడి, గణములు లేకుండ యతి ప్రాసలు లేకుండ నేవో వెర్రిమొర్రి పద్యములు కొన్ని యల్లుచుండెడి వాడను. నేను నరసాపురములో మిషనుస్కూలులో జదువుచున్న కాల మున, నేలేశ్వరపు వెంకటప్పయ్య శాస్త్రిగారివద్ద, ఛందోవిషయసారసంగ్ర హమను లక్షణ గ్రంధమును జదివితిని. అందుచేత నేను గొంత లక్షణ మును నేర్చితిని. రాజమహేంద్రవరము వచ్చినతరువాత, దానిని కొంత పృద్ధిచేసుకొంటిని. 1887 వ సంవత్సరమున జరిగిన విక్టోరియా జూబిలీ సందర్భమున నాపేర గొన్నిపద్యములు రచియించి, వానిని మిత్రులకు వినిపించి, నాపేరు లేకుండ గొన్నిపద్యము లొకమిత్రునిపేర రచియించితి నని యీవరకే చెప్పితినిగదా! ఈవిధముగ నేను గవిత్వములో వ్రేలు బెట్టితిని. మా గురుపుగారిమీద నేను రచియించిన పద్యములతో నాపేరు బైటపడెను నేను కవిననియు నాంధ్రభాషా పరిచితుడననియు గొందరి కప్పుడు తెలిసెను.

స్వీయ చరిత్రము

నాలుగవ ప్రకరణము

ఉద్యోగము - గ్రంథరచనము

1889 వ సంవత్సరము జనవరినెలలో నొకనాడు శ్రీ యిమానేని హనుమంతరావునాయుడుగారు నానిమిత్తమువచ్చి, "మేమొకనాటకసమాజమును స్థాపించినాము. శ్రీ తోలేటి వెంకటసుబ్బారావుగారు హరిశ్చంద్ర నాటకమును ఆడుకొనుటకై మాకు వ్రాసియిచ్చిరి మీరు కీచకవధ నాటకముగవ్రాసి మాకియ్యవలెను." అని కోరిరి. నేను వెంటనే "శ్రీ సుసర్ల అనంతరావుగారు పాండవాజ్ఞాతవాసమును నాటకముగవ్రాసిరి. అది మిక్కిలి బాగున్నది. దానిలో కీచకవధయున్నది. అదియుండగ నేను వ్రాయుట యెందుకు ? దానినిమీరు ప్రయోగింపవచ్చునని" బదులుచెప్పితిని. అదివిని నాయుడుగారిట్లనిరి. "అజ్ఞాతవాస చరిత్రమున్నదిగాని యందులో నెన్నో పద్యము లున్నవి. మా సమాజసభ్యులు పద్యములుచదువలేరు. మాకు వచన నాటకమే కావలెను. తోలేటిసుబ్బరావుగారు వచనముగనే మాకు హరిశ్చంద్రనాటకము వ్రాసియిచ్చిరి. కావున మీరుకూడనట్లే వచనముగ నాటకము వ్రాసియిండ"ని యడిగిరి. నేను వేదము వేంకటాచలముగారిమీద వ్రాసినపద్యములు బాగున్నవని నాయుడుగారభిప్రాయపడి, నేను తెనుగులో గ్రంథములు రచింపగలనని భావించి, వారు నాకడకువచ్చిరి. నేను కొంచె మాలోచించి "సరేయట్లేచేయుదు"నని చెప్పి వారినిబంపితిని. వారు వెళ్ళిన తరువాత, భారతములోని విరాటపర్వమును కీచకవధవరకునేను జదివించుకొనివిని, యజ్ఞాతవాసచరిత్రగూడ కొంత జదివించుకొనివిని, నాటకము వ్రాయనారంభించితిని. అప్పుడు నాదృష్టి బాగుండుటచే నాటకము నాస్వహస్తమున వ్రాసితిని. నాదస్తూరిమట్టుకు బాగుండెడిదిగాదు. అయిననను గ్రంథమంతయు నేనే వ్రాసితిని.

ఇంతలో నాజీవితములో గొంతమార్పు వచ్చినది. రాజమహేంద్రవరములో నామిత్రులు గొందరు పాఠశాల నొకటి స్థాపించవలెనని సంక

ల్పించిరి. అందు ముఖ్యులు, దువ్వూరి వీరభద్రయ్యగారు, వక్కలంక కామేశ్వరరావుగారు, నందివాడ సుబ్రహ్మణ్యముగారు, ఓరుగంటి కాంతయ్యగారు, కుందూరి వేంకటరత్నముగారు మున్నగువారు. ఆ సంకల్పము కార్యరూపము వహించినది. ఆర్యన్ హైస్కూలని యొకయున్నత పాఠశాల స్థాపించబడెను ప్రాతయూరిలో ఉప్పలూరి గంగరాజుగారి మేడలో నది నెలకొలుపబడెను. దానికి యువకుడు, పట్టపరీక్షసిద్ధుడునైన ఓరుగంటి కాంతయ్యగారు, ప్రధానోపాధ్యాయుడుగ నియమింపబడిరి. కొల్లా నరసయ్యగారు బి. ఏ., గణితము నేర్పుచుండిరి. ద్రోణంరాజు రామకృష్ణారావుగారు బి. ఏ., ప్రకృతిశాస్త్రము నేర్పుచుండిరి. వక్కలంక కామేశ్వరరావుగారు, దువ్వూరి వీరభద్రయ్యగారు, కుందూరి వేంకట రత్నముగారు, క్రింది తరగతులకు నుపాధ్యాయులుగ నేర్పడిరి. తెలుగు పండితునిగ, నన్నేర్పరచిరి. నేనును కొల్లా నరసయ్యగారును తప్ప తక్కిన వారందరు జీతములు తీసుకొనకుండ పనిజేయసాగిరి. ఆపాఠశాలలో, మెట్రిక్యులేషనుతరగతి మొదలుకొని, ప్రస్తుతపు మొదటిఫారమునకు సరియైన మూడవతరగతివరకు, నన్నితరగతులు నేర్పడినవి. పిల్లలు చాలమంది చేరిరి సర్కారువారి యంగీకారము (Recognition) మాత్రము దొరకలేదు. కారణమేమన, రాజమహేంద్రవరములో బాఠశాలలు బెక్కులుగ నుండుటచే, విద్య కట్టుదిట్టముగ విద్యార్థులకు వచ్చుటలేదని తలంచి, కాలేజి ప్రిన్సిపాలుగారైన మెట్కాఫ్‌దొరగారును, పాఠశాలా పరీక్షాధికారి యైన నాగోజీరావు పంతులుగారును, మరికొందరు పురప్రముఖులును, సమావేశమై యాలోచించి, పట్టణములోనున్న పాఠశాలలన్నియు గలిపి యొకమహాపాఠశాలగజేయుట మంచిదని యాలోచించిరి. అనేక పాఠశాలలుండుటచే, బాలకులు నీతిలేక కట్టుబాటులేక యొకనాడొక పాఠశాలలోను, మరియొకనాడు మరియొక పాఠశాలలోను, జదువుచు, యిక్కడ జీతములెగబెట్టి యక్కడికి, యక్కడ జీతములెగపెట్టి యిక్కడికి పోవుచుండిరి. ఇది బాలకులకు మిక్కిలి యనర్థకముగనుండెను. అది కనిపెట్టి విద్యార్థుల క్షేమముగోరిన మెట్కాఫ్‌దొరగారు మొదలైనవారు, సకలపాఠశాలాసమ్మేళనము ప్రారంభించిరి. అప్పుడు పట్టములోనున్న పాఠశాలలివి. వేదము వేంకటాచలముగారు ప్రధానోపాధ్యాలుగనున్న పాఠశాలయొకటి, మిషనుస్కూలొకటి, యేలూరి లక్ష్మీనరసింహముగారి యాస్తిక పాఠశాల యొకటి. దేశీయాభిమాన పాఠశాల యంతకుముందే యంతరించినది.

అందుచేత మెట్కాఫ్ దొరగారును, నాగోజీరావు పంతులుగారును, మిషను పాఠశాల ప్రధానోపాధ్యాయులైన దుర్గయ్యగారిని, యా స్తిక పాఠశాలాధికారియైన యేలూరి లక్ష్మీనరసింహముగారిని గలసి, మాటలాడి, సమ్మేళనము గురించి వారి నొడంబరచి, యూరిలోనున్న పాఠశాలలన్నియు గలిపి యొక పాఠశాలజేసిరి. ఆ మహాపాఠశాలకొక పరిపాలకసంఘ మేర్పడెను. ఆ సంఘమునకు మెట్కాఫ్‌గారే యధ్యక్షులుగ నుండిరి. కళాశాలలోని యుపాధ్యాయులు గొందరు, పురప్రముఖులు గొందరు దానిలో సభ్యులుగ నుండిరి. ఆ పాఠశాలపేరు రాజమహేంద్రవరోన్నత పాఠశాల. (Rajahmandry High school) ఆ పాఠశాలలో మెట్రిక్యులేషను తరగతియు, దాని క్రిందితరగతియు మాత్రమే యుండెను. ఆ పాఠశాలకు ప్రధానోపాధ్యాయులుగ శ్రీ యేలూరి లక్ష్మీనరసింహముగారి నేర్పరిచిరి. చరిత్రము చెప్పుటకు శ్రీ వేదము వేంకటాచలముగారిని, గణితము చెప్పుటకు శ్రీ యేరేశ్వరపు వేరయ్యశాస్త్రిగారిని, ప్రకృతిశాస్త్రము నేర్పుటకు ముడుంబై రామానుజాచార్యులవారిని, సంస్కృతము నేర్పుటకాకొండి వ్యాసమూర్తిశాస్త్రిగారిని, నాంధ్రోపాధ్యాయులుగ వద్దాది సుబ్బరాయుడు గారిని నియమించిరి. ఈ పాఠశాల చిత్రపు నరసింహారావుగారి గృహమున స్థాపింపబడెను. దీనికి మూడు శాఖాపాఠశాలలుండెను. ఒకటి మునుపటి టపునుస్కూలు. రెండవది మునుపటి యిన్నిసుపేట స్కూలు. మూడవది యా స్తికమధ్యమపాఠశాల. ఈమూడు పాఠశాలలలోను మిడిలు స్కూలు పరీక్షవరకు మాత్రమే చదువు చెప్పబడుచుండెను అక్కడ చదువు ముగిసినతరువాత బాలకులు, పై చదువుకొరకు నూతనముగ స్థాపింపబడిన హైస్కూలునకు, పోవుచుండిరి. పాఠశాలలలో తమలో తమకు పోటీలేకుండ నిట్టియేర్పాటు చేయబడినందున, మరియొక క్రొత్త పాఠశాలయేదైన స్థాపింపబడినయెడల, నది దొరతనమువారిచేత నంగీకరింపబడకుండునట్లు మెట్కాఫ్‌దొరగారును, నాగోజీరావుపంతులుగారును దగిన యేర్పాటులు జేసిరి. ఈ క్రొత్తపాఠశాల 1888 వ సంవత్సరమున స్థాపింపబడినది. దీనితో వెనుకటి పాఠశాలలన్నియు విరమించినవి. పోటీలేకుండ విద్యార్థులకు విద్య కట్టుదిట్టముగ నేర్పబడుచుండెను. మరియొక పాఠశాల యేదియు దొరతనమువారి యంగీకారము బడయకుండునట్లధికారులు నిశ్చయించుకొన్నందున, 1889 వ సంవత్సరములో స్థాపింపబడిన యీ పాఠశాల పై యధికారుల యంగీకారము బడయుటకు వీలులేకపోయెను.

ఆసంగతి తెలిసియే, యా పాఠశాలాస్థాపకులు గూడ దొరతనమువారి యంగీకారము కొరకు ప్రయత్నము చేయలేదు అట్టి యంగీకారమును బడయని స్కూలులో జదివినపిల్లలు మెట్రిక్యులేషను పరీక్షకు దరఖాస్తు చేయవచ్చును. కాని, మిడిలుస్కూలు పరీక్షకు దరఖాస్తుచేయగూడదు. మా పాఠశాలలో మెట్రిక్యులేషను తరగతిలో నిద్దరుబాలురు మాత్రమే యుండిరి. దొరతనమువారి యంగీకారము బడయని పాఠశాలలో బాలురు చదువరు. అందుచేత నేప్రియులు మాసాంతమునకు, బాలకులు చాలమంది మా పాఠశాలను విడిచిపెట్టిరి. పాఠశాలలో పండితులెక్కువగ నుండుటచే పరిపాలకసంఘమువారు సభచేసి యొక పండితుని దీసివేయ నిశ్చయించిరి. ఆపండితుడెవ్వరాయని మీమాంస పెచ్చెను. రాజమహేంద్రపురములోనున్న పాఠశాలలన్నిటిలో పనిచేయుచున్న పండితులలో, శ్రీపురాణపండమల్లయ్య శాస్త్రిగారి సర్వీసు తక్కువగనున్నదని నిశ్చయించి, సంఘమువారాయనను దీసివేసిరి. కాబట్టి మల్లయ్యశాస్త్రిగారికి రాజమహేంద్రపురములో నుద్యోగము పోయెను. ఆకాలమున నమలాపురము బోర్డుహైస్కూలులో నొక పండితపదవి కాళీపడ్డది. అప్పుడు బోర్డుకు, రాజమహేంద్రవరములో సబుకలెక్టరుగ నున్న మోబర్లెదొరగారధ్యక్షులుగా నుండిరి. ఎర్రమిల్లి వెంకట్రావుగారు సిరస్తదారుగారు. ఆయన మల్లయ్యశాస్త్రిగారి పాండిత్యము ప్రజ్ఞ మొదలైనవి బాగుగ నెరుగుదురు. శాస్త్రిగారి ప్రజ్ఞావిషయమై స్తుతిజేయుచు, నమలాపురములోని పదవి శాస్త్రిగారి కిప్పింపవలసినదని, మెట్కాఫ్‌దొరగారు మోబర్లిగారికి జాబువ్రాసిరి. ఇదిగాక శ్రీ కందుకూరి వీరేశలింగముగారును, మల్లయ్యశాస్త్రిగారినుగ్గడించుచు యోగ్యతాపత్రములనిచ్చిరి. ఆపని మల్లయ్యశాస్త్రిగారి కయ్యెను. మల్లయ్యశాస్త్రిగారు సకుటుంబముగ ప్రయాణమై యమలాపురమువెళ్ళిరి.

నేను వారితో వెళ్ళలేదు. కారణమేమన నాకీ క్రొత్తపాఠశాలలో నొక చిన్నయుద్యోగము దొరకినదిగదా! అదిగాక రాజమహేంద్రవరము విడిచిపెట్టుట నాకిష్టములేదు. మరియును మా మేనమామగారు ప్రయాణమైన దినములలో, శ్రీ రాయవరపు అప్పారావుగారి రెండవ కుమార్తెకు వివాహము నిశ్చయింపబడినది. ఆమెను వక్కలంక కామరాజుగారి రెండవ కుమారుడును, కామేశ్వరరావుగారి తమ్ముడునైన గవరరాజుగారి కిచ్చి పెండ్లిచేయుటకు నిశ్చయించిరి. ఈ సంబంధము నాచేత కుదుర్పబడినది. వక్కలంక కామేశ్వరరావుగారి యింటికి నేను పలుమారులు

పోయి యీ సంబంధము విషయమై మిక్కిలి ప్రయత్నము జేసితిని. నా ప్రయత్నము సఫలమైనది. ఆబాలిక నా ప్రియమిత్రుడైన తల్లాప్రగడ చలపతిరావునకు మేనగోడలు. నా శిష్యుడైన రామమూర్తికి జెల్లెలు. ఆ వివాహమునకు నన్నక్కడ నుండవలసినదని చలపతిరావు బలవంత పెట్టెను. ఈసంగతి మా మేనమామగారితోజెప్పి, యంగీకారముబడసి, నే నమలాపురము వెళ్ళక యుండిపోతిని. మా మేనమామగారు వెళ్ళినది మొదలుకొని నాకు భోజనసౌఖ్యముతగ్గెను. పాఠశాలలో నేదో కొంచెము జీతము వచ్చుచున్నదిగనుక, నేను పూటకూళ్ళయింట బ్రవేశించి యొక పూటదిని యొకపూట దినక కాలక్షేపము జేయజొచ్చితిని. తిన్నగ తినక పోవుటకు కారణమిది పగలు నేను స్వయముగబోయి భోజనముచేయ గలిగి యుంటిని, గాని రాత్రులు పరసహాయములేక వెళ్ళజాలను. అందు చేత గొన్నిరాత్రులు మానియు, గొన్నిరాత్రులు రామమూర్తిని సాయము తీసుకొనివెళ్ళియు నెట్టెటో కాలము గడపుచుంటిని.

1889 వ సంవత్సర మేప్రియలులో, నామిత్రుడైన తల్లాప్రగడ చలపతిరావునకు గొప్ప కష్టము సంభవించెను. 1888 వ సంవత్సరము చివరభాగము మొదలుకొని, చలపతిరావుభార్య యనగా పాదుపల్లి పుండరీ కాక్షుడుగారి మూడవ కుమార్తె, జబ్బుగనుండెను. ఆమె క్రమక్రమముగ కృశించుచుండెను. చలపతిరావు జిల్లా సర్జనుగారైన డాక్టరు కరూధర్సు గారిని వైద్యమునకై పెట్టెను. నేను తరుచుగ ముందులకై పోపుచుంటిని. ఎంత శ్రమపడినను వ్యాధి కుదురలేదు. ఆమె యేప్రియలు 30 తారీఖున రాత్రి మృతినొందెను. ఆమె కప్పటికి మూడుసంవత్సరముల వయసుగల కుమారుడుండెను. అతడే తల్లాప్రగడ నరసింహారావు. పిమ్మట నతడు పెద్దవాడై చదివి, బి. యల్, లో తేరి, కొన్నాళ్లు రాజమహేంద్రవరము లోను, కొన్నా ళ్ళేలూరులోను న్యాయవాదిగనుండి. 1936 వ సంవత్స రమున నేలూరులో మృతినొందెను. ఆ కష్టదినములలో చలపతిరావు నోదార్చుచు కొన్నిదినములు కాలము గడపితిని.

ఆసంవత్సరము ఫిబ్రవరినెలనాటికి, నేను కీచకవధా నాటకములో రెండంకములు వ్రాసి హనుమంతరాయనాయుడుగారి కిచ్చితిని. తక్కిన భాగ మేప్రియలునాటి కిచ్చితిని. గ్రంథరచనకారంభము గనుక మొదటి యంకములలో కఠినపదములు కఠిన సమాసములు ప్రయోగించితిని. ద్రౌపదీ కీచకుల సంభాషణములు వచ్చినపు డాభాగము శృంగారరసప్రధాన

మైనదిగనుక, సమాసములు మొదలయినవి ప్రయోగింపక సులభశైలితో వ్రాసితిని. ఇది నాటకసమాజము వేరుగ భావించిరి. కతిపయసమాస మున్న భాగమునేను మా మేనమామగారిచేత వ్రాయించితి ననియు, వారమలాపురము వెళ్ళిన తరువాత నీ చివరిభాగము నేను స్వయముగ వ్రాసితిననియు, నందుచేత నీ సులభశైలిని బడినదనియు, నాటక సమాజమువారు తప్పుగ నభిప్రాయపడిరి. తోలేటి సుబ్బారావుగారు వ్రాసి యిచ్చిన హరిశ్చంద్రనాటకమును నా నాటకమును వారుజదివి, హనుమంత రావునాయుడుగారు, వారి బంధుపులై న స్త్రీలు ముందుగ జూచుటకై యీ రెండు నాటకములును, సామినేని బుచ్చిలబ్బాయినాయుడుగారను రెండవ పేరుగల "యశహసింగరరావునాయుడుగారి" విశాలమైన సావడిలో, మొట్టమొదట ప్రయోగించిరి. ఇది వేసవికాలపు శలపులలో జరిగెను. తరువాత టౌనుహాలుప్రక్కనున్న యొకదొడ్డిలో గట్టితాటియాకులపాకవై చి నాటకములాడజొచ్చిరి. ఈ సమాజముపేరు "రాజమహేంద్రవర హిందూ నాటకసమాజము."

హనుమంతరావునాయుడుగా రాదివెలమకులస్థులు, మాదిరెడ్డి వేంకటరత్నమునాయుడుగారు మొదలగువారికి బంధుపులు. ఈయన స్వగ్రామము గుంటూరుజిల్లాలోని క్రొత్తపట్టణము, ఆయన పూర్వము మెట్రిక్యులేషనుస్కూలులో జాలకాలముపనిజేసి, యక్కడ నొక నాటక సమాజము స్థాపించెను. ఆ మిషనుపాఠశాలలోనే, టంగుటూరి ప్రకాశము గారుకూడ జదువుకొనుచుండిరి. నాయుడుగారు స్థాపించిన నాటక సమాజ ములో వంగవోలుపురమున ప్రకాశముగారుకూడ పాత్రధరించుచుండిరి. రాజమహేంద్రవరములో హుకర్ల సుబ్బారావునాయుడుగారని యొక గొప్ప న్యాయవాదియుండెను. ఆయన శ్రీ మాదిరెడ్డి వెంకటరత్నమునాయుడు గారి తోడియల్లుడు. సుబ్బారావునాయుడుగారును, హనుమంతరావునాయుడు గారును బంధుపులగుటయేగాక, మిత్రులు, సహాధ్యాయులును. ఆకారణ మున సుబ్బారావునాయుడుగారి యొక్కయు, దక్కిన బంధుపుల యొక్కయు, ప్రేరణముచేత, హనుమంతరావునాయుడుగారు 1887 వ సంవత్సరమున కుటుంబముతో రాజమహేంద్రవరమువచ్చిరి. ఆయనకు రాగానే యేలూరి లక్ష్మీనరసింహముగారు తమ యాస్థికపాఠశాలలో నొక యుపాధ్యాయపదవినిచ్చిరి. నాయుడుగారు వచ్చునప్పుడు, తమకు ప్రియ శిష్యుడును దమ నాటక సమాజములో సభ్యుడునైన ప్రకాశముగారిని,

రాజమహేంద్రవరము దీసుకొనివచ్చి, పారశాలలో జేర్పించిరి. ప్రకాశము గారు పూటకూళ్ళయింట కొన్నాళ్లుదిని, కొంతకాలము మాతామహిని దీసు కొనివచ్చి, వేరే కాపురముండి చదువుకొనుచుపచ్చిరి హనుమంతరావు నాయుడుగారే ప్రకాశముగారికి చదువుచెప్పించుచువచ్చిరి నాయుడుగారి కతనిమీద పుత్రప్రేమయని చెప్పుటతిశయోక్తిగాదు. ప్రకాశముగారు బాలుడు. తెలివిగలవాడు. స్ఫురద్రూపి, హనుమంతరావునాయుడుగారికి నాటకములయిది కుతూహలము వంగవోలుతో నాగిపోక, రాజమహేంద్ర వరమునకుగూడ వచ్చెను. హనుమంతరావునాయుడుగారికి రాజమహేంద్ర వరములో స్థిరమైన యుపాధ్యాయ పదవిలభించెను.

అప్పుడాయన నాటకసమాజము స్థాపించెను. తానే యానాటక సమాజమునకు మేనేజరుగ నుండుటనలన గొన్ని బాధలున్నవని, రాజ మహేంద్రవరము సెంట్రలుజెయిలులో నొక గుమాస్తాగనున్న పిళ్ళారిసెట్టి త్రియంబకరావు నాయుడుగారిని, మేనేజరుగ నేర్పరచెను. ఆ సంవత్స రము జూనునెలలో 8 వ తారీకున, నూతనముగ నిర్మించిన తాటియాకుల పాకలో, మొట్టమొదట, సమాజమువారు తోలేటి సుబ్బారావుగారు వ్రాసి యిచ్చిన "హరిశ్చంద్ర" నాటకమును ప్రయోగించిరి. మఱునటి నివారము నాడనగా జూనునెల 15 తేదీని నేను వ్రాసియిచ్చిన "కీచకవధ" నాటక మును ప్రయోగించిరి. నన్నుగూడ నాహ్వానించిరి నేనా నాటకమునకు బోయి జూచితిని. ప్రేక్షకులు నాటకము బాగున్నదని సంతోషించిరి. హనుమంతరావు నాయుడుగారు భీమపాత్ర ధరించిరి. ప్రకాశముగారు ద్రౌపదీపాత్ర ధరించిరి. ఈ నాటక సమాజములో గొందరు ప్రసిద్ధులు పాత్రలు ధరించిరి. వారెవరనిన; హనుమంతరావు నాయుడుగారు, ప్రకా శముగారు, జిల్లాజడ్జి పనిజేసి పింఛను పుచ్చుకొని, 1939 వ సంవత్సర ములో చెన్నపురిలో మృతినొందిన పిళ్ళారిసెట్టి నారాయణరావునాయుడు గారు, సబుజెడ్జిపనిజేసి పింఛను పుచ్చుకొని ప్రస్తుతము చెన్నపురిలో సుఖ ముగనున్న కోకా సాంబశివరావు నాయుడుగారు, పోస్టలు డిపార్టుమెంటులో పనిజేసి పింఛను పుచ్చుకొని సుఖముగనున్న కోకా వెంకటరెడ్డి నాయుడు గారు. ప్రకాశముగారు నాటకములో నే రసము సభినయించినను మిక్కిలి సొగసుగ నభినయించెడివారు. కరుణరసమునకును వీరరసమునకును వీరు పెట్టినదిపేరు. ఆ సమాజమునకు దక్షిణదేశస్థుడు సాతానియైన రామాను జయ్యయను నతడు సూత్రధారిగ వచ్చెను. ఇతడు చక్కగ గానము

చేసెడివాడు. అతని గానము వినుటకే కొందరు వచ్చెడివారనిన యతిశ యో క్తిగాదు. కొంతకాలము బందరులో పోలీసు యినస్పెక్టరుపనిజేసి తరువాత మృతినొందిన వల్లూరి సూర్యప్రకాశరావుగారు తత్కాలమున రాజమహేంద్రవరములో ప్రథమశాస్త్ర పరీక్షకు జదువుకొనుచుండి యీ సమాజములోజేరి హాస్యము జెప్పుచుండెను ఇతను హాస్యములో మిగుల గట్టివాడు. ఇతని హాస్యము జనరంజకముగ నుండెను. ఈ యిద్దరు ప్రకాశములపల్ల నాటకసమాజము ప్రకాశించెను. నేను రచించిన కీచక వధ నాటకము మొదటిసారి ప్రయోగింపబడినప్పుడు న్యాపతి సుబ్బరావు పంతులుగారు, నెల్లిమిల్లి వేంకట్రావు పంతులుగారు మొదలగు పురప్రముఖులు చాలమంది విచ్చేసి సంతోషించిరి.

ఈ నాటకము రెండవసారి మరికొన్నిదినములకు ప్రయోగించిరి. అప్పుడు ప్రేక్షకులతోడిపాటు నేనుగూడ నొక బుర్చీలో గూర్చుంటిని. బయ్యపునీడి జోగయ్యగారు మొదలగుపురప్రముఖులానాటకమునకువచ్చిరి. జోగయ్యగారు మెరకవీధి తెలగాలు. తెలుగులో సభిరుచిగలవారు. కొంత కాలము రాజమహేంద్రవరములోను, పిమ్మట విశాఖపట్టణములోను జిల్లా కోర్టులో సిరస్థదారుగనుండినవారు. ఆనాటకమున కాయనవచ్చి హనుమంత రావునాయుడుగారు భీమ పాత్రనభినయించుచున్నప్పుడు సంతోషించిచప్పట్లు గొట్టిరి. సభాసదులుగూడ సంతోషముచే చప్పట్లుకొట్టిరి. జోగయ్యగారు కొన్ని పుష్పములు నాతలమీదజల్లిరి. ఈ గౌరవముచేత నేను మిక్కిలి సంతసించితిని. హనుమంతరావునాయుడుగారుకూడ మిక్కిలి సంతో షించి మరి మొకనాటకము వ్రాయుటకు నన్ను ప్రోత్సాహపరచిరి. నేనప్పుడు ద్రౌపదీ పరిణయనాటకమును వ్రాయనారంభించితిని. అది యైదంకముల నాటకము. అక్కడక్కడగొన్నిపద్యములున్నను మొత్తముమీద నదిగూడ వచన నాటకమే. ముఖ్యపాత్రలుధరించునట్టి హనుమంతరావునాయుడుగారు గాని, ప్రకాశముగారుగాని, పద్యములు జదువలేరు. ఒకరిద్దరు పద్యములు జదువగలవారుండిరి. వారు ధరించుపాత్రలకే పద్యములు పెట్టుచూపచ్చితిని. ఈ నాటకముగూడ జాలవరకు స్వహస్తమున వ్రాసితిని. నాటకరచనము త్వరగ ముగింపవలెనను కుతూహలముతో హనుమంతరావునాయుడుగా రొకప్పుడును, దుర్గి గోపాలకృష్ణారావను సామాజికుడొకప్పుడును రాత్రులువచ్చి, నేజెప్పగా నాటకము వ్రాయుచుండిరి.

1889 వ సంవత్సరము జూలై నెలలో మామిత్రులు స్థాపించిన యార్యను హైస్కూలు క్రమక్రమముగ క్షీణించిపోయినందున, యిప్పటి మొదటిఫారమునకు రెండవఫారముకు సరియైన నాలుగవ తరగతియు, మూడవతరగతియు మాత్రమే నిలిచియుండెను. తక్కిన యుపాధ్యాయు లందరు పాఠశాలనుండి మానివేసిరి. కుందూరు వేంకటరత్నముగారు, నేనుమాత్రమే పాఠశాలను బట్టుకొని వ్రేలాడితిమి. మేమిద్దరము పాఠశాల నుప్పలూరివారి మేడలోనుండి దీసివేసి, ధర్మానుపత్రి వెనుక నుండిన తవ్వలవారి బంగాళాలో బెట్టితిమి. పాఠశాలవల్ల వచ్చు నాదాయము నుండి కొంతభాగము వెంకటరత్నముగారును, కొంతభాగము నేనును బుచ్చుకొని కాలక్షేపము చేయుచుంటిమి. అప్పుడు నేను తవ్వలవారి యింట చాలురకు నెలకు రు 6/- లు చొప్పున జీతముమీద నింటిపద్ద పాఠములు చెప్పు చుంటిని. వీరవాసరములో మా తండ్రిగారి సంపాదనము తగ్గిపోయినం దున కుటుంబభారము నాపై నప్పగించిరి. కుటుంబమనగా మా తల్లి, మా తమ్ముడు, చిన్నచెల్లెండ్రయిన యచ్చమ్మ, రమణమ్మ, నేను మేమిన్నీసుపేటలో నాళమువారి కొట్లలో నెలకు మూడురూపాయలు బాడుగ నిచ్చి కాపురముంటిమి. సాయంకాలము పాఠశాల పదలిపెట్టినతరువాత మేము, నాయుడుగారు మొదలగువారు గలసి నాటకశాలలో నిష్ఠాగోష్ఠి జెప్పుకొనుచు రాత్రి యెనిమిదిగంటలవరకు కాలక్షేపము జేసి యింటికి బోవుచుండెడివారము. నా సంపాదన జాలక, నాకు గొంతఋణమయ్యెను. ద్రౌపదీపరిణయ నాటక మా సంవత్సరము సెప్టెంబరు నెలలోనో, యక్టోబరు నెలలోనో, మొదటిసారి ప్రయోగింపబడెను. హనుమంతరావు నాయుడుగారు భీముపాత్ర ధరించిరి. ప్రకాశముగారర్జునపాత్ర ధరించిరి. వీరరసమభినయించుటలో ప్రకాశముగారద్వితీయులు. ఆ నాటకమున నాలు గవ యంకములో వీరరసమభినయించుటకు మిక్కిలి యవకాశముండెను. అది ప్రకాశముగారు మిక్కిలి యద్భుతముగ ప్రదర్శించిరి.

మద్దూరి నాగభూషణముగారప్పుడు విద్యార్థిగనుండి, నాటకసమాజ ములోజేరి ద్రౌపదీ పరిణయములో ద్రుపదపాత్ర ధరించిరి. ఈయన పద్య ములు మిక్కిలి శ్రావ్యముగ జదువగలవారు. ఈయన పద్యములువిని ప్రేక్షకులు మిక్కిలి యానందించుచుండెడివారు. దుర్గి గోపాలకృష్ణరావు దుర్యోధనపాత్ర ధరించెడివాడు. ద్రౌపదీపాత్ర నెప్పల్లి బుల్లికృష్ణయ్య యను నొక యువకుడు ధరించెడివాడు. హిడింబాసుర, బకాసుర పాత్రలు

శ్రీ మాదిరెడ్డి వెంకటరత్నము నాయుడుగారి తమ్ముడు చలపతిరావు ధరించుచుండెడివాడు, అతడు మిక్కిలి దృఢకాయుడు. హనుమంతరావు నాయుడుగారు మొదలయినవారు నన్ను సామాజిక గ్రంథకర్తగ నెంచుకొని, నే నేపాత్ర ధరింపకపోయినను నన్నుగూడ నొక సామాజికునిగ భావించెడివారు. "ద్రౌపదీ పరిణయ" నాటకముగూడ ప్రేక్షకుల నానందింపజేసినది.

తరువాత హనుమంతరావు నాయుడుగారు నన్ను "గయోపాఖ్యాన" నాటకమువ్రాయుమని పురిగొల్పిరి. అందుకు నేనిష్టపడి, "గయోపాఖ్యాన" నాటకమును 1889 వ సంవత్సర మధ్యభాగములో రచియింప నారంభించితిని. రామకవి యనునరడు "గయోపాఖ్యాన" కథను దెనుగులో బద్య కావ్యముగ రచియించెను. అది యచ్చుపడి బజారులో విక్రయింపబడుచుండెను. ఆ పుస్తకమును నేను సంపాదించి. చదివించుకొని విని, యాకథనుబట్టియే నేను "గయోపాఖ్యాన" నాటకమును రచించితిని. "చిత్రభారత"మను తెనుగు ప్రబంధములోగూడ నిటువంటికథ యొకటి యున్నది. ఈకథలో జెప్పబడినట్లు గయుడు శ్రీకృష్ణుని చేతిలోనాక, గాలవమునీ యర్ఘ్యమిచ్చుచుండగ నతనిచేతిలో నుమిసినట్లు, నతడు తన పరాభవమును శ్రీకృష్ణున కెరింగింపగ, మహర్షిని పరాభవించినందుకు శ్రీకృష్ణుడు గయుని దండింప నెంచినట్లును, నందువలన శ్రీకృష్ణార్జునులకు యుద్ధము జరిగినట్లును, నున్నది. అయినను నేను కథాసంవిధానములో రామకవి పుస్తకమునే యనుసరించితిని. శ్రీకృష్ణుని పాత్రము ధరించుటకై యుద్దేశింపబడిన వారు పద్యములు జదువగలవారగుటచే నేనా పాత్రమునకు బద్యములు వ్రాసితిని.

1889 వ సంవత్సరము డిశంబరు 20 వ తేదీనాటికి నేను "గయోపాఖ్యానము"లో నాలుగంకములువ్రాసి, నాటకసమాజమువారికిచ్చితిని. అప్పుడొక యంతరాయము కలిగెను. నాటకసమాజమువారికి "శ్రీరామజనన"మను నాటకము మొదట నెవరో వ్రాసియిచ్చిరి. అది చాలసారులు ప్రయోగించిరి. అది యెక్కువ రసవంతముగ నుండకపోవుటచే "శ్రీరామజనన" నాటకము మరియొకటి క్రొత్తగ వ్రాసియిమ్మని హనుమంతరావు నాయుడుగారు నన్ను గోరిరి. ఆకోరిక ననుసరించి నేను సంపూర్ణదీక్ష వహించి, యహోరాత్రములు కష్టపడివ్రాసి, డిశంబరు ముప్పదియొకటవ తారీకునాటికి "రామజనన" నాటకమును బూర్తిచేసి యిచ్చితిని. పగలు

నేను వ్రాయుచుంటిని; రాత్రులు హనుమంతరావునాయుడుగారు మొదలగు సామాజికులే నేనుచెప్పగ వ్రాయుచుండిరి. "శ్రీరామజనన" మైదంకముల నాటకము ఇందు నాలుగవయంకములో నచ్చరలు ఋష్యశృంగ మహా మునిని దపపలలో వై చుకొని, యాశ్రమమునుండి దీసుకొనివచ్చిన కథలో వారి సంభాషణలు చమత్కారముగను, రసవంతముగను, ప్రాయ బడినపని ప్రేక్షకులును, సామాజికులును నన్ను ప్రశంసించిరి. ఈ "రామ జననము" గూడ పద్యనాటకమే. ఈ నాటకము ముగించిన తరువాత నేను 1890 వ సంవత్సరము జనవరి నెలలో నా స్వగ్రామమైన వీరవాస రమువెళ్ళి, "గయోపాఖ్యానము"లోని యైదవయంకము నచటవ్రాసి, టపాలో దానిని హనుమంతరావునాయుడుగారికి రాజమహేంద్రనగరము బంపితిని.

"శ్రీరామజనన" నాటకమును సామాజికులు జనవరినెలలో కడ పటి భాగమున ప్రయోగించిరి. అందు దశరథపాత్ర టంగుటూరి ప్రకాశము గారు ధరించిరి. రావణాసురపాత్రను హనుమంతరావు నాయుడుగారు ధరించిరి. పది తలలుగల లక్కకిరీటము చేయించి, రెండుప్రక్కల పలు చని యినుపబద్దెలు దానికమర్చి, నాయుడుగారు ధరించెడివారు. ఆ కిరీట మును ధరించి నాయుడుగారు రంగస్థలముమీదికి వచ్చినప్పుడు విగ్రహ మతిభయంకరముగ నుండెడిది. అది చూచి కొందరు పిల్లలు "బాబో" యని "యమ్మో" యని జడుసుకొనెడివారు. "రామజనన" నాటక ములో గర్భవతియైన కౌసల్య యాపేశమని యొక భాగముగలదు. గర్భ ములో నున్న శ్రీరాముడు రావణుని దుర్జయములు రోసి, తన యాగ్రహ మును కౌసల్య నోటనుండి పెడలగ్రక్కినట్లా కథలో నుండును. అది కొంత భయంకరముగ నుండును. ప్రేక్షకులా రంగమును గూడ మిక్కిలి మెచ్చుచుండెడివారు. ప్రకాశముగారు మొదటిసారి "రామజననము" ప్రయోగించినపుడు దశరథపాత్ర ధరించిరను, రెండవసారి కౌసల్యపాత్ర ధరించి యాపేశరంగమును మిక్కిలి యొప్పించిరి.

"గయోపాఖ్యాన" రచన మారంభించునప్పటికి నా కిరువదిరెండు సంవత్సరములు వయస్సు. నేను నాటకరచయితనని రాజమహేంద్రవర ములో నాకు కొంతపేరు వచ్చినది. వల్లూరి సూర్యప్రకాశముగారు హాస్యముచెప్పుచు, నాటక మెవరు రచియించిరని సూత్రధారునిచేత నడిగించుకొని, చమత్కారముగ దాని నింగ్లీషులో నిట్లు చెప్పుచుండెడి

వాడు. "Parrot Baniyan Tree Riches Manly Lion" ఈమాటలకు మొత్తముమీద నర్థము "చిలకమ ర్తి లక్ష్మీనరసింహ"మని, "గయోపా ఖ్యాన" నాటకమును మా నాటకసమాజమువారు మొట్టమొదట 1890 వ సంవత్సర మేప్రియు నెలలో ప్రయోగించిరి. గయునిపాత్రను నాయుడు గారే ధరించిరి. చిత్రరేఖ పాత్రను టంగుటూరి ప్రకాశముగారు ధరించిరి. రెండవ యంకములో స్త్రీపాత్రను ధరించి మిక్కిలి యొప్పించి, మూడవ యంకమున, నయిదవ యంకమున ప్రకాశముగా రర్జునపాత్రను ధరించి కన్నుల పైకుంటిముగ ప్రదర్శించెడివారు. కౌశికపాత్రను వోలు తాతయ్య నాయుడు ధరించెడివాడు. అతనికి హాస్యరస మొప్పించుటలో మిక్కిలి ప్రజ్ఞగలదు. ప్రకాశముగారు రంగస్థలముమీద మూర్తీభవించిన వీరరసము వలె నుండెడివాడు.

"గయోపాఖ్యానము"లో నిప్పటి యైదవయంకములోని వచన భాగము దాదాపుగ మునుపటిదేగాని, పద్యభాగమంతయు నూరనముగ జేర్పబడినదే సమాజములోని సభ్యులనుబట్టియే నాచేత నాటకములు వ్రాయబడుచుండెడివి. ఈనాటకముతో మునుపటికంటెనా పేరు యెక్కువ ప్రసిద్ధికెక్కినది. "గయోపాఖ్యాన" మైనతరువాత నాయుడుగారు "పారిజాతా పహరణ" నాటకము వ్రాయమని నన్ను గోరిరి. 1890 వ సంవత్సర మున వేసవికాలములో నేను వీరవాసరము వెళ్ళక, "పారిజాతాపహరణ" నాటకము వ్రాసితిని. ఇదియు నైదంకములనాటకమే. దీనిలో సత్యభామ పాత్ర ప్రకాశము గారే ధరించెడివారు. ఆయా రసములనుబట్టి యాయన ముఖపై ఖరి, కంఠస్వరము మార్చుటజూచి, ప్రేక్షకులు మహానందమును బొంది చప్పట్లు గొట్టుచుండెడివారు, అందులోని క్రైరవపాత్ర తాతయ్య నాయుడు ధరించెడివాడు. అప్పుడు శ్రీకృష్ణపాత్ర ధరించినట్టి పిళ్ళారిసెట్టి రామకృష్ణమ్మనాయుడుగారు పద్యములు చదువలేనివారు గనుక శ్రీకృష్ణు నకు నేను మొదట పద్యములు పెట్టలేదు. ఇప్పుడచ్చుపడియున్న నా "పారిజాతాపహరణ" నాటకములో జాలపద్యములు పెట్టితిని. నెప్పలి బుల్లికృష్ణయ్య యనునతడు చిన్న చిన్న స్త్రీ పాత్రలను ధరించుటయేగాక, మనోహరముగ నాట్యముగూడ జేసెడివాడు. ఈ సమాజమువారికి వచన నాటకములే యాడవలెనను సంకల్పముగలుగుటకు నొకటి రెండు కారణ ములు గలవు. సంగీతజ్ఞానములేకపోవుట యొకటి. చక్కగా భాగములు

చదివి ప్రయోగించిన పక్షమున పద్యనాటకములకంటె వచననాటకములే యెక్కువ మనోహరముగనుండునను నభిప్రాయమొకటి.

ఈ యభిప్రాయము గలుగుటకు గుంటూరు మొదటి నాటక సమాజము కారణము. చెన్నపట్టణమందలి పచ్చయప్ప కళాశాలలో నాంధ్రోపాధ్యాయులై బ్రహ్మశ్రీ కొండుభట్ల సుబ్రహ్మణ్యశాస్త్రిగారు, గుంటూరు నాటకసమాజమునకెన్నో వచననాటకములు వ్రాసియిచ్చిరి. ఆ సమాజము వారు గుంటూరునందును, మరి యితరస్థలములందును వాటిని మిక్కిలి నేర్పుతో ప్రయోగించి పెద్దపేరును గాంచిరి. ఆసమాజమువారు 1884 వ సంవత్సరమున డిశంబరు నెలవులలో రాజమహేంద్రవరమువచ్చి, వారు నాటకములను ప్రయోగించిరి. వచననాటకములై నను, నవియెంతో మనోహరములుగనుండెను. ఆనాటకసమాజ సభ్యులలో మహారాజశ్రీ దేశభక్త కొండా వెంకటప్పయ్యగారుకూడ నుండిరి. వారినాటకములలో "యుగంధర విజయ" మనునది మిక్కిలి చక్కగనుండెను. వారి "హరిశ్చంద్ర" నాటకముగూడ మిక్కిలి రసవంతముగనుండెను పలుమాటలేల, వారి నాటకములన్నియు జనాకర్షకముగనే యుండెను. నాటకములలైలిగూడ సులభమై, ప్రేక్షకులకు సుబోధకముగనుండెను. ఆకారణమున రాజమహేంద్రవరపు "హిందూనాటకసమాజము" వారుగూడ మొదట వచన నాటకములే ప్రయోగింపదలచి, యట్టివే వ్రాయించిరి. హనుమంతరావు నాయుడుగారు, ప్రకాశముగారు మొదలగు నటుల కౌశలముచేత నాటకములలో పద్యములు లేవన్నచెలితి కనబడలేదు.

ఈ 1890 వ సంవత్సరము మేనెలలో సమాజమున కొక నష్టము సంభవించినది, సమాజములో సూత్రధారుడై యుండిన రామానుజయ్య యను సాతానివైష్ణవుడు త్రాగుచుండెడివాడు. ఆతడింటిదగ్గరనే యాపని జేయుచుండెను గాని రంగస్థలములో నట్టిపని జేసెడివాడుగాడు. హనుమంతరాపునాయుడుగారు రంగస్థలమును మిక్కిలి పవిత్రముగ నుంచవలెనను తలంపుగలవారు. రామానుజయ్య యొకనాడు, నాయుడుగారి స్వభావమెరుగక, త్రాగి రంగస్థలమునకు వచ్చెను. అది చూచి హనుమంతరావు నాయుడుగారు కోపించి, చీవాట్లుపెట్టి, రామానుజయ్యను రంగస్థలము నుండి యావూట వెడలగొట్టిరి. రామానుజయ్య పశ్చాత్తాపముపొంది, సమాజములో నున్నంతకాలము నట్టిపని మరియెన్నడు జేయలేదు. నాయుడుగారు జేసినపనికి నేను మిక్కిలి సంతసించితిని. నాయుడుగారి

యెడల సామాజికులకు మిక్కిలి భయభక్తులుండెడివి. ఈ రామానుజయ్య వేసవికాలపు సెలవులలో నేదోపనిమీద కిర్లంపూడి వెళ్లెను. అక్కడ కొన్నాళ్లుండి పిమ్మట పిఠాపురము వెళ్ళదలచి, దిట్టముగ త్రాగి, పిఠాపురమునకు బండి మాట్లాడుకొని, యాబండిలో నెక్కి తనవెంట మరిరెండు సారాబుడ్లు తెచ్చుకొని, రాత్రియంతయు మిక్కిలి త్రాగిత్రాగి పండుకొనెను. తెల్లవారునప్పటికి బండి పిఠాపురమువెళ్లెను. బండివాడు తన బాడుగనిమ్మని రామానుజయ్యను లేపబోగా, నతడు నిద్రనుండి మేలుకొనలేదు. ఆనిద్దుర పెద్ద నిద్దురయ్యెను.

రామానుజయ్య చనిపోయినవార్త మాకుదెలిసెను. అతడుపోయిన తరువాత నంతచక్కగా గానముచేసెడు సూత్రధారుడు చిరకాలమువరకు దొరకలేదు. వల్లూరి సూర్యప్రకాశముగారికి తోడుగ హాస్యమునకు రాయవరపు హనుమంతరావుగారినియొకరుగూడ వచ్చుచుండెడివారు. వీరుగాక కంచియానందరావుగారనియొకపురుషుడొకసారి కాకినాడనుండి వచ్చి మా సమాజమున నొకనాటకములో హాస్యముజెప్పిరి. ఆయన నివాసస్థానము కాకినాడ. కాకినాడలో 1885 వ సంవత్సరమునందే దినపహి హనుమంతరావుగారను సంపన్నగృహస్థులొకరు మిత్రుల ప్రోత్సాహముచేత నొక నాటకసమాజము స్థాపించిరి. దానితెరలకు నలంకారములకు నైదువేల రూపాయలు వ్యయపరచిరి. ఆ సమాజములో వైజర్సు అప్పారావుగారని యొక పట్టపరీక్షసిద్ధుడు, జయంతి భావనారాయణగారనునొక యాంధ్ర కవియు మరియు ననేకులు పాత్రలను ధరించుచుండెడివారు. దానికి సింగితపు అబ్బాయిగారను మాధ్వబ్రాహ్మణుడు మేనేజరుగ నుండెడివాడు. ఆ సమాజములో ఆనేసాలు భీమసేనరావుగారు కంచి యానందరావుగారు వల్లూరి సూర్యప్రకాశముగారు కోపల్లె రమణారావుగారు రాయవరపు హనుమంతరావుగారు మొదలగువారుగూడ పాత్రలు ధరించియు, హాస్యములు జెప్పియు ప్రేక్షకులను రంజింపజేసెడివారు. ఆ కారణముననే మాసాంబాజికులు కంచి యానందరావుగారు మొదలగువారిని బ్రతిమాలి తమ నాటకములలోగూడ హాస్యముజెప్పించిరి.

"పారిజాతాపహరణ" నాటకమును 1890 వ సంవత్సరము రెండవ భాగములో మా సామాజికులాడిరి. అదియు జనరంజకముగ నున్నదనియే చెప్పుకొనిరి. ఆయేడు జూలై, యాగస్టునెలలలో నేను "నల" నాటకమును వ్రాసితిని. అది వ్రాయుచుండగా, సమాజములో రాజు వేషము

తరుచుగా ధరించుచుండెడు పిళ్ళారిసెట్టి రామకృష్ణమ్మ నాయుడుగారు నాయొద్దకువచ్చి. నలునిపాత్ర తనకిమ్మని యడిగి, పద్యములు పెట్టపద్ద నియు, నొకవేళ పెట్టినను వాటికి సరియైనవచనము, క్రిందవ్రాయుమనియు నన్ను గోరుచుండెను. అందుకు నాకు పట్టరాని యాగ్రహముగలిగి, నాట కము వ్రాసిన పుస్తకమును చింపితిని. చింపుట యనగా ముక్కలు ముక్కలు జేయలేదు. వ్రాసిన కాగితముల పుస్తకము నిలువుగ జింపితిని. అక్షరములు మాత్రము జెడిపోలేదు. తరువాత సామాన్యులలా పుస్తకమును జూచి, మరియొక ప్రతి వ్రాసుకొని దగ్గర నుంచుకొని పలుమారు ప్రయో గించిరి.

ఇందు నలపాత్ర నాకొకవిధముగ శిష్యుడు, మిత్రుడునైన దుర్గి గోపాలకృష్ణారావు ధరించెడివాడు. అతడు పద్యములు జక్కగా చదివెడి వాడు. దమయంతిపాత్ర ప్రకాశము రు ధరించెడివారు. నాటక మచ్చు పడలేదు. కారణమేమన, బళ్ళారిలోనుండిన బ్రహ్మశ్రీ ధర్మవరము కృష్ణమాచార్యులవారు "చిత్రనళీయ" మనుపేర "నల" నాటకమొకటి వ్రాసిరి. ఆయన "నటసవినోదినీ" యను నొక నాటకసమాజము స్థాపించి యా సమాజము నప్పుడప్పుడు చెన్నపురి దీసికొనిపోయి, తానే నలుని పాత్ర ధరించి. దానిని, మరికొన్ని నాటకములను చెన్నపురిలో నాడి యా నగరమందలి యాంధ్రమహాజనుల సద్భుతానంద రసములలో దేర్చెడి వారు. వారి "చిత్రనళీయ" నాటకమును నేను జదివించుకొని, విని. యది యన్నివిధముల నా "నల" నాటకముకంటె మిన్నగ నుండుటచేత నా నాట కము దానిముందర బనికిరాదని భావించి, యచ్చువేయలేదు. వ్రాత ప్రతి గూడ నాకిప్పుడు దొరకుట దుర్లభముగనున్నది. నాదగ్గర నేను వ్రాసిన నాటకములకు రెండవప్రతి నుంచుకొనకయే, సమాజమువారి కిచ్చుచుండెడి వాడను. 1890 వ సంవత్సరము మార్చినెలలో నేను "సీతాకల్యాణ" మను నాటకము వ్రాసితిని. అది యాసంవత్సరము శ్రీరామనవమి దినము లలోనే నాడవలెనని నాయుడుగారు నిశ్చయించి, నన్ను త్వరపెట్టినందున దానిని మిక్కిలి వేగముగ వ్రాసితిని. అది శ్రీరామనవమి రోజులలోనే యాడబడెను.

1890 వ సంవత్సరము జూలైనెలలో మా కుటుంబము మరల రాజమహేంద్రవరము వచ్చెను. మాతల్లియు, నిద్దరు చెల్లెండ్రును, మా

తమ్ముడు నుంటిమి. చిర్రపు నరసింహారావుగారి యిన్నీసుపేట యింటిలో నప్పుడు కాపురముంటిమి.

ఆర్యను పాఠశాలను గురించి యొకమాట జెప్పవలెను. పాఠశాల యంతయు క్షీణింపగ, మూడు నాలుగు తరగతులను దీసికొనిపోయి నేనును కుందూరు వెంకటరత్నముగారును తవ్వలవారి బంగాళాలో బెట్టి జరుపు చుంటిమని చెప్పితినిగదా ! 1890 వ సంవత్సరప్రారంభమున నా పాఠశాల నక్క-డనుండి మార్చి పెద్దబజారులో శ్రీ వాడ్రేపువారి "గాదేఖాన" యను పేరుగల యింట నెలకొల్పి, జరుపుచుంటిమి. క్రిందితరగతులు గూడ బెట్టి మానాప్రగడ పార్వతీశముగారిని మూడవ యుపాధ్యాయునిగ దీసికొని, నడపుచుంటిమి. పిల్లలసంఖ్య యధికమగుటచే శ్రీపాద పుందయ్యశాస్త్రి గారి నాంధ్రోపాధ్యాయులుగ నియమించితిమి. ఆ సంవత్సరము జూలైలో పైతరగతులలో బాలురులసంఖ్య యెక్కు-వగుటచే, వెంపరాల భీమశంకరం గారను వారినిగూడ మరియొక యుపాధ్యాయునిగ నియమించితిమి. శ్రీభీమ శంకరముగారు మెట్రిక్యులేషను తరగతి యందు కృతార్థుడైనవాడు. వారు సహాధ్యాయుడు. చక్క-ని తెలుగు కవిత్వముగూడ జెప్పగలవాడు. పాప మితడు తరువాత స్వల్పకాలముననే మృతినొందెను.

1890 వ సంవత్సరమున నవంబరునెలలో కలకత్తానగరమునుండి సాధారణ బ్రహ్మసమాజ మతబోధకుడైన శ్రీ పండితశివనాథశాస్త్రిగారు రాజమహేంద్రవరమువచ్చి, యింగ్లీషు భాషలో సమ్మోహ నాస్త్రములవలె బరవశముజేసెను. ఆయనయీద నే నప్పుడైదుపద్యములు జెప్పితిని. నాపద్యములువిని సభాసదులు సంతోషించిరి. అనేకులు నన్ను మెచ్చి. కొనియాడిరి. శివనాథశాస్త్రిగారు మొట్టమొదటిసారి రాజమహేంద్ర వరమునకు 1881 వ సంవత్సరమున వచ్చిరని నేనిదివరకే జెప్పియుంటిని, వారు వచ్చుటకిది రెండవసారి. వారువచ్చి వీరేశలింగముగారియింటనే బస చేసిరి. నేను వీరేశలింగముగారి మేడమీదికిబోయి, వారిని సందర్శించి, మాటలాడితిని. వారు దయాపూర్వకముగ నన్నాదరించి మాటలాడి, నాసంగతివిని Local Shakespere (స్థానిక షేక్స్‌పియర్) అని నన్ను బ్రశంసించిరి. ఆబిరుదునకు తగినవాడనుగానని నేనెరుగుదును. నేను బహునాటకములు రచియించితినన్నమాటవిని, వారావిధముగ బ్రసంశించిరి.

శివనాధశాస్త్రిగారిమీద నేనువ్రాసిన పద్యములు "సునీతి"యను తెలుగు పత్రికలో ప్రకటింపబడెను. ఇప్పుడవి నాదగ్గరలేవు.

నేను రచియించిననాటకములేగాక, ముమ్ముంబై రామానుజాచార్యులు గారిచే రచింపబడిన "సిరియాళరాజుచరిత్ర"మను నాటకమును, "పాండవాశ్వమేధ"మను నాటకమును మురియెవ్వరో రచియించిన "సారంగధర" నాటకమును, వీరేశలింగముగారిచే రచియింపబడిన "చమత్కారరత్నావళి" యును నీసమాజమువారు ప్రయోగించుచుండెడివారు. స్త్రీ పాత్రను ధరించుటకు టంగుటూరి ప్రకాశముగారేగాక, యరగర్ల సత్యరాజుగారని యొకరుగూడ నుండెడివారు. అప్పుడాయన విద్యార్థిగనుండెడివారు. ఆయన విగ్రహముగూడ సుందరముగనుండెడిది. ఆయన యాకారముగూడ స్త్రీ వేషమునకు మిక్కిలి యొప్పియుండెడిది. "సారంగధర" నాటకములో ప్రకాశముగారు రత్నాంగిపాత్రయు, సత్యరాజుగారు చిత్రాంగిపాత్రయు ధరించెడివారు. ఇతరులు ధరించిన నాటకములు మా సామాజికులాడినప్పుడు వానిలోని లోపములు పూర్తిచేయుమని నాయుడుగారు నన్ను ప్రోత్సాహపరచుచుండెడివారు. అవి నేను పూర్తిజేసియిచ్చుచుంటిని. ఈవిధముగ "సశ్వమేధ" నాటకములోను, "సారంగధర" నాటకములోను కొన్నిభాగములు క్రొత్తగ వ్రాసియిచ్చితిని.

ఆ సంవత్సరమున ప్రకాశముగారు ప్రథమశాస్త్ర పరీక్షతరగతిలోజేరి చదువుచుండిరి. 1889 వ సంవత్సరము డిశంబరులో జరిగిన మెట్రిక్యులేషను పరీక్షలో ప్రకాశముగారు కృతార్థులైరి. అప్పటికాయనకు పదిహారమీ పదియారో, పదియేడో సంవత్సరముల వయస్సుండవచ్చును. ఆ సంవత్సరము వేసవికాలపు సెలవులలో ప్రకాశముగారికి వివాహమయ్యెను. ఆ సంవత్సరము డిశంబరునెలలో రాజమహేంద్రపర హిందూనాటకసమాజము పైగ్రామములలో తమనాటకముల ప్రదర్శింపదలచి, యమలాపురమువెళ్లిరి. హనుమంతరావునాయుడుగారి బలవంతముమీద యమలాపురము నేనుగూడ వెళ్ళితిని. కాని యమలాపురములో మా నాయుడుగారనుకొన్నట్లు ధనలాభము విశేషముగ గలుగలేదు. నాటకములకు గావలసిన తాటియాకులపాకలు మాచిరాజు నరసింహముగారు గుత్తకుదీసుకొని వేయించిరి. అప్పుడు హనుమంతరావునాయుడుగారి రిన్నీసుపేట మిడిలుస్కూలులో ప్రధమసహాయోపాధ్యాయుడుగనుండిరి. అప్పుడు మిడిలుస్కూళ్లకు శనివార ముదయముగూడ బనిచేయుచుండెడివి. ఒక శనివారమునాడమలాపుర

ములో "గయోపాఖ్యానము" ప్రయోగించుటకు నిర్ణయింపబడినది. హాను మంతరావునాయుడుగారు గయునిపాత్ర ధరింపవలసినవారుగనుక వారు శని వారమునాడు ప్రారఁభాలమున బడికిపోయి పనిజేసి, బడికట్టివేసినతరువాత బయలుదేరి రాజమహేంద్రవరమునుండి యమలాపురము నలుబదిమైళ్లు నడచివచ్చి, యా రాత్రి యా పాత్రధరించి, యభినయించి, తిరుగునాడు బయలుదేరివెళ్ళిరి. హానుమంతరావునాయుడుగారికి నాటకములయందుగల కుతూహలమునుగూర్చి యింతకంటె నెక్కువ జెప్పనక్కరలేదుగదా! ఎక్కడ నున్నను నాటకశాలయే వారిగృహము. సామాజికులే వారికాప్తులు. అదియే వారికానందప్రదము.

ఉపాధ్యాయులుగ గూడ హానుమంతరావునాయుడుగారు మిక్కిలి ప్రతిష్ఠవహించినవారే. ఇంగ్లీషు గణితశాస్త్రముగూడ వారు మిక్కిలి సమర్థతతో బోధించెడివారు. ఆయన మెట్రిక్యులేషను పరీక్షయందే కృతార్థుడై నను, హైస్కూలు తరగతులకు గూడ నవలీలగ, గణితము నింగ్లీషు చెప్పగలవారు. బాలకులుగాక యుపాధ్యాయులు గూడ వారిబోధనమునుండి గొన్ని సంగతులు నేర్చుకొనవలసి యుండెడివి. ఆయనబుగ్గమీసములతో భయంకరాకారము గలిగియుండెడివాడు. కాని హృదయము చాలమంచిది. హైస్కూలులోని యుపాధ్యాయులు సెలవు దీసికొన్నప్పుడు వారి స్థానము లందు మెట్రిక్ దొరగారు నాయుడుగారినే పంపుచుండెడివారు. ఈయన చేతిక్రింద నే నైదుసంవత్సరములు పనిజేసితిని అందుచేత వారిసామర్థ్యము నేనెరుగుదును. నాటకపాత్రలు ధరించినప్పుడు వీరి యభినయము, వీరి యుచ్చారణము, శ్లాఘాపాత్రములుగ నుండెడివి. ఈయనది మిక్కిలి జాలి గు డె. ఎప్పుడైన కోపమువచ్చి కుమారుని కొట్టినప్పుడు, తానుగూడ కన్నీరుపెట్టుకొని యేడ్చుచుండెడివాడు. నాటకసమాజ ములాపురములో నున్నప్పుడు మేము చిలుకూరి లక్ష్మీనరసింహారావుగారి యింటనుంటిమి. వీరు మాధ్వులు. చిలుకూరి లక్ష్మీనరసింహారావుగారు రాజమహేంద్రవరములో బ్రథమశాస్త్రపరీక్షకు చదువుచున్నప్పుడే మానాటకసమాజములో జేరిరి ఈయన రాజమహేంద్రవరము సమాజములోని సభ్యులకు పది రూపాయలు ఖర్చుపెట్టి బొబ్బట్లతో విందుచేసెను, అప్పటినుండియు సామాజికులు వీరిని వినోదార్థమై "బొబ్బట్లమేనేజ" రని పిలుచుచుండెడి వారు ఆయన కవిత్వముకూడ జెప్పగలరు. "ద్రౌపదీవస్త్రాపహరణ"మను నాటకమును, "సౌగంధికాహరణ"మను నాటకమును వీరు రచించిరి.

అందు మొదటిది మా సమాజమువారు ప్రయోగించిరి. ఆయన సామాజికులయెడల స్నేహముచేత సమాజమువారి కమలాపురములో దన యింటిలోని పెనుకభాగము బసగ నిచ్చెను. అదియొక సందులోనున్నది. కాని మాకు సౌఖ్యముగానే యుండెను. అప్పుడొక విపరీతబ్రాహ్మణుడు మాకు వంటకు గుదిరెను. వాడు కోపస్వభావుడు. పైగా నల్లపందు వేసెడివాడు. పెద్దవాడు. వానిగోళ్లు పుప్పిగోళ్లు వాడు ప్రతిదినము ప్రాతఃకాలమున మజ్జిగలోన నటుకులు నానవేసుకొని, యుపాహారము దినుచుండెడివాడు. ఏది కొరతయైనను సహింపక కోపించుచుండెడివాడు. "నాపుప్పిగోళ్లు మంటచెట్టును. నేను పచ్చడిచేయలేను మహాప్రభో!" యని యరచుచుండెడివాడు. "పుల్లలు తడిగానున్నవి, మండుటలేదు" అని కేకలువేయుచుండెడివాడు. "అటుకులలో వేసుకొనుటకు పెరుగులేదు. వెళ్ళిపోయెదను మహాప్రభో!" యని మాటమాటకు బెదరించుచుండెడివాడు. సామాజికులతో తరుచుగా జగడమాడుచుండెడివాడు. ఎట్టెటో మేము కాలక్షేపము చేయుచుండగా, 1891 వ సంవత్సరము సంక్రాంతినాడా దురహంకారుడు మిక్కిలి కోపపడి యేదో వంకబెట్టి వంటచేయకుండ లేచిపోయెను. ఆదినము పందుగ యయ్యెను, పిండివంటలు లేవు సరిగదా, పట్టెడన్నమైనను దొరకుట దుర్లభమయ్యెను. సామాజికులలో నొకరిద్దరు మడికట్టుకొని, పగలు మూడుగంటలగునప్పటికి మాకింత చారుం గూడు పెట్టిరి.

అమలాపురములో మంత్రిప్రగడ కపులట్లయ్యగారను యొకయువకుడుండెను. ఆయన మా నాటకములుజూచి, నాలుగైదుసారులు మాబసకు వచ్చెను. వారికీ, నాకూ కొంత మైత్రియయ్యెను. ఆయన యష్టావధానము చేయుమని నన్నుగోరగా, నేను మాబసలోనే యొకనాటిరాత్రి మా సామాజికులయెదుట నొక యష్టావధానముజేసితిని. అప్పుడు నేనెనమండుగురికి వారుకోరిన విషయములనుబట్టి వారుకోరిన వృత్తములతో కవిత్వము చెప్పితిని, పుష్పగణనము, పురాణముచెప్పుట, చిట్లపేక, మొదలైన యంగములు లేవు. 1891 వ సంవత్సరమున మా సామాజికులు "హరిశ్చంద్ర" నాటకము ప్రయోగించిరి. ఆనాటకమున కారాత్రి ధవళేశ్వరములో నింజనీయర్లుగనున్న ముగ్గురు దొరలువచ్చిరి. హౌలీ, రాములీసు మరియొకరును హిందుపుల నాటకము లెట్లుండునో చూడవలెనను కుతూహలముతో వచ్చిరి. నాటకమైనతరువాత మరునాటి యుదయమున వారు హనుమంతరావునాయుడుగారిని గలుసుకొని "మీ సామాజికులు రాత్రివేసిన వేషములు

మరల నీపూటవేసి కూర్చుండవలెనని మా కోరిక. ఎందుకనగా మేము ఫొటోగ్రాపులు తీసుకొని వాటిని సీమకు బంపెదము, హిందుపుల వేషము లెట్లుండునో చూడవలెనని మాదేశస్థులకు మిక్కిలి కుతూహలముండును" అని కోరిరి. తనమాట కడ్డుచెప్పువారెవరు లేరనుకొని, నాయుడుగారు సమ్మతించిరి. కాని యొక యాటంకమువచ్చెను. తనకు మిక్కిలి ప్రియ శిష్యుడును, ప్రేమాస్పదుడును, దనకు పుత్రప్రాయుడునునైన ప్రకాశము గారే దాని కంగీకరింపరైరి "పీర్ల పండుగలో వచ్చెడి నాడవేషములవలె నేను పట్టపగలు వేషము వేయుదునా? నేనొప్పుకొన"నని తిరస్కరించిరి. తనమాట బోటుపోవునని ప్రకాశముగారిని నాయుడుగారు మిక్కిలి బ్రతి మాలిరి. కాని ప్రయోజనము లేకపోయెను. ప్రకాశముగారు చిన్ననాట నుండియు నన్నివిషయములలోను స్వతంత్రుడు. తనకు యుక్తమని తోచినపనినేగాని చేయరు ఆయన యిట్లు ప్రవర్తింతురని యెవ్వరనుకొన లేదు. నాయుడుగారు కొంచెము విచారించిరి. సామాజికులాశ్చర్యపడిరి. నాయుడుగారికి దొరలదగ్గర పరాభవము జరుగునేమోయని యెరగర్ల సత్యరాజుగారును, నెప్పలి బుల్లికృష్ణయ్యయు స్త్రీ వేషములు ధరించివచ్చిరి. నాయుడుగారును వారి సన్నిహిత జ్ఞాతియైన యిమానేని కాంతారావు నాయుడుగారును, అయినవోలు తాతయ్యనాయుడును పురుషవేషములు ధరించివచ్చి కూర్చుండిరి. దొరలు ఫొటోగ్రాపులు తీసుకొని నాటకము బాగున్నదని యోగ్యతాపత్రిక నిచ్చిపోయిరి. అమలాపురములోనుండగ సామాజికులలో గొందరు స్వల్పకారణమున గోపించి, నాటకములో వేషము వేయమని బెట్టుసరిజేసిరి. ఆనాడు వేయవలసిననాటకము "గయో పాఖ్యానము". అందులో శ్రీకృష్ణ పాత్ర ధరించునతడును బలరామపాత్ర ధరించునతడును కోపించిరి. వెంటనే శ్రీకృష్ణపాత్ర చదివి దుర్గి గోపాల కృష్ణారావు నటించెను. తరువాత నతడు శ్రీకృష్ణ పాత్రధారణములో మిక్కిలి పేరు సంపాదించెను. బలరామపాత్ర ధరించుటకు మరియెవ్వరు లేకపోయిరి. అందుచేత నాటకము జెడిపోవునేమోయని నేనాపాత్ర ధరించుటకు సిద్ధమైతిని. కాని సాయంకాలమగునప్పటికి బలరామపాత్ర ధరించునతడే స్వయముగవచ్చి, తానే యా వేషమువేసెను. నాకు దృష్టిలేకపోయినను యెట్లో కాలక్షేపము జేయగలనని ధైర్యముగలిగి, నేనట్టిపని కొప్పుకొంటిని.

అమలాపురములోనుండగ నాయూరి పెద్దకోమటియింట వివాహము జరిగెను. నాలుగవనాడు మిక్కిలి వైభవముతో నూరేగింపుజరిగెను. హనుమంతరావునాయుడుగారును, మరికొందరు సామాజికులు నూరేగింపు జూచుటకై వెళ్ళిరి. నిద్రాభంగమగునని, నేనుమాత్రము వెళ్ళలేదు. ఆయూరేగింపులో పెండ్లివారిపక్షమువారికిని, మరియొకపక్షమువారికిని వివాదము జరిగెను. ఆవివాదము క్రమముగముదిరి కొట్లాటలోనికిదిగెను. ఆవివాదమునెట్లో పరిష్కరింపదలచి, హనుమంతరావు నాయుడుగారు వారిమధ్యకు వెళ్ళినిలిచిరి. కలహకారులు కర్రలతో కొట్టుకొనిరి. అందులో నొకదెబ్బ నిరపరాధియైన నాయుడుగారి నెత్తిపైదగిలెను. తలపగిలి, క్రొన్నెత్తురు బొటబొట గారదొడగెను. నాయుడుగారు వెంటనే యింటికివచ్చి కట్టుగట్టించుకొని పండుకొనిరి. మానాటకసమాజమునకు "నాయుడుల కంపెనీ"యని పేరు. రాజమహేంద్రవరములో వెలమనాయుడులు మిక్కిలి పలుకుబడిగలవారని లోకములో నొకవాడుకయుండెను. అందుకు దోడుగ మా సామాజికులలో నొకడైన యిమ్మానేని కాంతారావునాయుడు గారు, లక్ష్మీనారాయణనాయుడుగారును రాజమహేంద్రవరములో జిల్లా మునసబులుగనుండిరి. తనయింటి వివాహములో హనుమంతరావునాయుడు గారికి దెబ్బతగులుటచేనాయుడులవల్ల తనకేదో యపకారము జరుగునని భయపడి, సంపన్నుడైన యావైశ్యశిఖామణి మాసామాజికుల కొకనాడు తనతోటలో విందుచేసెను. ఈవిందువలన తనమీదికోపము సామాజికులకు పోవుననితలచెను. సామాజికుల కాతనిమీద నెట్టికోపములేదు. ఆవిందులో నావైశ్యశిఖామణి నన్ను మిక్కిలి గౌరవించెను. అమలాపురమునుండి నేను నడుమనడుమ రాజమహేంద్రవరము వచ్చుచుంటిని. 1891 వ సంవత్సరము జనవరి నెలలోనో, ఫిబ్రవరినెలలోనో, పూర్వము నాసహాధ్యాయుడు నాకు మిత్రుడు సజ్జనుడునైన బంధకవి వేంకరావనువాడు మిక్కిలి జబ్బుగనున్నాడని తెలిసి, నే నమలాపురమునుండి రాజమహేంద్రవరము వానిని జూడవెళ్ళితిని. అతడు మాటలాడలేకయుండెను. తరువాత రెండు దినములకతడు మృతినొందెను. అతనిమృతి నాకు కొంతమనస్తాపము

కలిగించెను. అప్పటి కతనితండ్రి జీవించియుండెను. అతడు మెట్రిక్యులేషను పరీక్షయందు కృతార్థుడు. అంతకుముందే యతనికి వివాహమయ్యెను నేను నాటకములమీద సరదాచేతను, వారము వారము నమలాపురముపెళ్ళి సోమవారమునాటికి బడికి రాలేకపోవుచుంటిని. కుందూరి వేంకటరత్నముగారును, నామిత్రులైన చెరుకుమిల్లి వేంకటరామయ్యగారును, నేనునుగలసి మా యార్యను పాఠశాలనే "న్యూమిడిల్‌స్కూలు" అను పేరుతో నడుపనిశ్చయించుకొంటిమి. నేను సరిగ బడికిపోలేకపోవుటచేత బడిలో పనిజేయుట కశ్రద్ధచేయుచున్నానని పాఠశాలయొక్క కాలపట్టిక (Time Table) లో నుండి నాపేరు దొలగించిరి దీనియర్థము వారిద్దరు నాయుద్యోగమును దీసివేసినట్లేగద? నేనమలాపురమునుండివచ్చిన తరువాత నాకావార్త వెంకటరత్నముగారు తెలియజేసిరి. అంతట నేనాబడినుండి తప్పుకొంటిని. ఇందుపలన నేను 1891 వ సంవత్సరమున నుద్యోగములేకయుంటిని డి. జగన్నాధరాపుగారియింటను, నాదినములలో రాజమహేంద్రవరము తహసీలుదారుగనుండిన శ్రీవాడ్రేపు విజయరామయ్యగారియింటను, నేను బాలురకు పాఠములు చెప్పుచు స్వల్పధనమార్జించి కాలక్షేపముచేయుచుంటిని. అదిగాక, రాజమహేంద్రవరము కళాశాలలో, సాము కసరతుల యుపాధ్యాయుడైన యేలూరి రామచంద్రరావుగారు, సాము కసరతులమీద నొకపుస్తకము వ్రాయబూని, శరీరపరిశ్రమయవసరమనియు నారోగ్యము ముఖ్యమనియు బోధించునట్టి పద్యములు గొన్ని యాగ్రంథములో వేసుకొనుటకు, వ్రాయుపని నన్ను గోరిరి. నేను చాల పద్యములు వ్రాసియిచ్చితిని. అందుకు ప్రతిఫలముగ, నాకు వారు నెలకు నాలుగైదు రూపాయలు యిచ్చుచుండిరి. ఈవిధముగ నేను చిక్కుపడుచు నెట్లో కాలక్షేపము చేయుచుంటిని.

స్వీయ చరిత్రము

ఐదవ ప్రకరణము

నాటకసమాజము

ఇట్లుండగ నాకు శరీరారోగ్యము చెడెను. జ్వరముతగులజొచ్చెను. రాజమహేంద్రపరములో నా బంధుగులెవ్వరును లేరు. పూటకూళ్ళయింట భోజనముచేయుచుంటిని. పూటకూళ్ళమ్మకు కొంతడబ్బిచ్చి కొంత యరుపు పెట్టుచుంటిని. నాకు దామెర్ల రమణరావుగారు మందిచ్చి కుదిర్చిరి. నా మిత్రుడు. శిష్యుడునైన రాయవరపు రామమూర్తి. నామీద దయాభిమానములుగలిగి, నన్ను దనయింటికి దీసికొనిపోయి నాకు సకలోపచారములు జేసెను. క్రమక్రమముగ నాజబ్బు తగ్గెను. నా జబ్బుసంగతి మా తండ్రిగారికి తెలిసి, రాజమహేంద్రపరమువచ్చి, నెమ్మదించినతరువాత నన్ను వీరవాసరము దీసికొనిపోయిరి. అచ్చట కొన్నిదినములుండి, యక్టోబరు నెలలో రాజమహేంద్రపరమువచ్చితిని. అప్పుడు రాయవరపు రామమూర్తి మెట్రిక్యులేషను తరగతిలో చదువుచుండెను. అతనికి గణితము నేను చెప్పలేకపోయినను, దేశచరిత్రము, తెలుగు చెప్పగలిగినందున నన్ను రామమూర్తియు, నతని తండ్రిగారును పూటకూళ్ళయింటికి వెళ్ళవద్దనియు తమయింటనే యుండవలసినదనియు, బలపంతపెట్టి నన్ను నిలిపిరి. నేనందుకంగీకరించి వారియింటనుంటిని.

ఆసంవత్సరమున, మా సమాజ నాటకమొకటి చూడవలెనని, కిర్లంపూడి జమీందారులైన యినుగంటి బుచ్చితమ్మయ్య-రును. వారితమ్ములైన చిన్నారాయణంగారును,రాజమహేంద్రపరమేదో పనిమీదవచ్చి, తమ మిత్రులైన చెరుకుమిల్లి వెంకట్రామయ్యగారిద్వారా తమ కుతూహలము మాకు తెలియజేసిరి. పూర్వముండిన తాటాకు నాటకశాల తీసివేయబడెను. మునుపటివలె వారమువారము సమాజమువారు నాటకములాడుట మానిరి. అప్పుడు పట్టణములో నాటకశాలలు లేనందున, వీరేశలింగముపంతులుగారు గట్టించిన టౌనుహాలులోనే, నాటకములు జరుగుచుండెడివి. కిర్లంపూడి

జమీందారుల నిమిత్తము, మా సమాజమువారు, నేను రచియించిన "ద్రౌపదీపరిణయ నాటకమును" టౌనుహాలులో ప్రయోగించిరి. జమీందారు లిద్దరును నాటకముజూచి సంతోషించిరి. సామాజికులు చక్కగ నటనము జేసిరి.

ఆ సంవత్సరము సమాజమును కాకినాడ తీసికొనిపోవలెనని నాయుడుగారు సంకల్పించి, యాయన కాకినాడవెళ్ళి, యుప్పుచేటియొడ్డున నొక పాకవేయించిరి. ఇందుకు "సింగితపు అబ్బాయి"గారు సాయము జేసిరి. ఇచ్చట సింగితపు అబ్బాయిగారిని గురించి కొన్నిమాటలు వ్రాయవలెను. అబ్బాయిగారు మాధ్వులు. బ్రాహ్మణులు. గొప్పవస్తాదు. అప్పటికి యేబది సంవత్సరములు వయసుదాటియుండును. వస్తాదగుటచేత, పట్టణములోనున్న యువకులు, స్వేచ్ఛావిహారులు, పెంకివాండ్రు మొదలగువారు వీరిమట్టూ జేరుచుండిరి ఇందన్ని వర్ణములవారు నుండిరి. ఈయన వైద్యముగూడ జేయుచుండెడివాడు. అందుచేత పట్టణములో మిక్కిలి పలుకుబడి యుండెను, వైద్యమువల్ల కొంతధనముగూడ వచ్చుచుండెను. ఎవరిమీదనైన నాగ్రహము వచ్చినప్పుడు, తన శిష్యులను వెంటబెట్టుకొని యబ్బాయిగారు, విరోధుల బుర్రలు కట్టలతో బగులగొట్టి, తనకోపము దీర్చుకొనుచుండెడివాడు. మేజస్ట్రీటులు, పోలీసువారు, వైశ్యశిఖామణులు వీరిచే వైద్యము చేయించుకొనుచుండుటచే, నబ్బాయిగారికి వారివలన నేవిధమైన భయములేదు. ఈ బాహుబలశాలి యొకసారి యొకదొరనుగూడ గొట్టెనని, వాడుకగలదు. అప్పుడుగూడ వారికేవిధమైన నష్టము గలుగ లేదు. కాకినాడలో స్థాపింపబడిన నాటకసమాజమున కీయన మేనేజరుగ నుండిరి. వీరును, వీరి శిష్యులను పగులగొట్టిన బుర్రలు లెక్కలేదని చెప్పుదురు. వీరి శిష్యులలో బ్రాహ్మణులుగూడ పెక్కండ్రు గలరు. వారి పేరుజెప్పిన, కాకినాడలో నెల్లవారికి, భయముకలిగెడిది. వారు బహిరంగముగ రాచబాటలలో తలలు పగులగొట్టినను, వారికి వ్యతిరేకముగ నొక్కడైనను సాక్ష్యము వచ్చెడివాడుగాడు. తమ నాటకములు నిరాటంకముగ జరుగుటకు హనుమంతరావు నాయుడుగారు, కాకినాడవెళ్ళి యబ్బాయిగారి దర్శనముచేసి, వారిదయ సంపాదించి, పాకవేయించిరి. పాక సిద్ధమైనను నాటకములు 1892 వ సంవత్సరము జనవరిలోగాని ప్రారంభముగాలేదు. మొట్టమొదట సీమాజికులు పారిజాతాపహరణ నాటకము ప్రయోగించిరి. కాకినాడకు నేనుగూడ వెళ్ళితిని. ప్రకాశముగారి యభినయ కౌశలముచేత

పారిజాతాపహరణ నాటకము మిక్కిలి రక్తిగట్టెను పట్టణములో సామాజికులకు మంచిపేరు వచ్చెను. ప్రకాశముగారెక్కడ నాటకము ప్రదర్శించినను వారికి మంచిపేరు వచ్చుచుండెను. రాజమహేంద్రవరములో నాటకము ప్రయోగించినప్పుడు, పర్లాకిమిడి నివాసియైన శ్యామసుందర రాజగురువను నొక యోధ్రయువకుడు, తత్కాలమున బి. ఏ. తరగతి జదువుచుండెను. ఆయన పలుమారు మా నాటకములకు వచ్చి చూచి మెచ్చి ప్రకాశమునకు "రంగనక్షత్ర"మని (Star of the Stage బిరుదునిచ్చెను. రాజగురువుగారు మిక్కిలి తెలివిగలవారు. సజ్జనుడు. విద్య ముగించిన తరువాత నతడు స్వస్థలమునకువెళ్ళి యచట మునిసిపలుసభ కధ్యక్షుడయ్యెను. విద్యార్థిగనున్నప్పుడే యాత డింగ్లీషులో జక్కగ మాట్లాడుచు వ్యాసములు వ్రాయుచు వచ్చెను. దేశస్థుల దురదృష్టముచేత, నితడు వయసు ముదరకముందే మృత్యుదేవత నోటబడెను.

ఇంక మాసమాజమువారు కాకినాడలో నెట్లుమెలగిరో చెప్పవలయు. సింగితపు అబ్బాయిగారికిని, నాయుడుగారికిని, జరిగినస్నేహము చిరకాలము నడచినదిగాదు. అబ్బాయిగారు మిక్కిలి యమాయకులేగాని, శిష్యులు చెప్పెడి కొండెములపల్ల, నాయనమనస్సు జెడిపోవుచుండెడిది. మాసామాజికులు నాటకములు ప్రయోగించినప్పుడు అబ్బాయిగారి శిష్యులు గొందరు వచ్చి యుచితముగ టిక్కెట్లనిమ్మని బాధించుచుండెడివారు. అట్లు ప్రతి నాటకమునకు యిచ్చుటకు వీలులేకపోయినది. ఆ శిష్యులలో గొందరు దుండగులు, పాకకడకుపోయి యొకరాత్రి కావలియున్నవానిని బెదరించి, మాసామాజికులలో కోపల్లె శేషగిరిరావను నాతనిని గట్టిగ కర్రతో శిరస్సుపై గొట్టిరి అతడు పడిపోయెను. నెత్తురు గారజొచ్చెను. వెంటనే యతనిని బసలోనికి దీసికొనివచ్చి కట్టుగట్టజొచ్చిరి. ఆరాత్రి అబ్బాయిగారును, వారి శిష్యులను మాబసముందు జేసినయల్లరి వర్ణింపనలవిగాదు. తలుపులుమూసుకొని మా సామాజికులు లోపల గూర్చుండ, అబ్బాయిగారు పెద్దపెద్ద కేకలు వేయుచుండిరి. శిష్యులు తలుపులమీద రాళ్లు విసరుచుండిరి. ఆరాత్రి నేను పారుపల్లి లక్ష్మీనారాయణగారి యింట నుంటిని. బసలోనున్న సామాజికులకును, మాకును, సంబంధము లేకపోయినది. అంతగొడవ జరుగుచున్నను నిరుగు పొరుగుననున్న పెద్దమనుష్యులు, వీధిలోవెళ్లెడి పెద్దమనుష్యులుగాని, యిది యేమని వారిని మందలింపలేకపోయిరి. అబ్బాయిగారి పేరు చెప్పిన జనులకంతభయము. ఆరాత్రి యెట్టెటో తెల్లవారెను. మా

సామాజికులు తరువాత జాగ్రత్తగనే యుండిరి. అంతటనుండి అబ్బాయి గారిశిష్యులు నాటకమున కుచితముగ టిక్కెట్లనిమ్మని యడుగుట మానిరి.

రామానుజయ్య చనిపోయినతరువాత, మాసమాజమునకు, బందరు నుండి, రాజగోపాలమని యొక గాయకుడు, సూత్రధారిగ వచ్చెను. ఇతని పాట జనరంజకముగ నుండినందున, సమాజమునకు రామానుజయ్య లేని వెలితి దీరెను. అంత హనుమంతరావునాయుడుగారు, పాఠశాలలో నుపాధ్యాయుడగుటచే, రాజమహేంద్రవరము వెళ్ళిరి. మా నాటకములు బాగున్నవని పేరువచ్చుటచే డబ్బు బాగుగవచ్చుచుండెను. గతసంవత్సరము మా కమలాపురములో వచ్చిననష్టము దీనిలో గూడివచ్చునని మాకు ధైర్యము గలిగెను. అంతట సంక్రాంతిపండగ వచ్చెను. ఆ పండుగలో నానగరమున రాత్రులు గొప్ప యుత్సవములు జరుగును. ఆ యుత్సవములను జూడవరె నని మాసామాజికులలో గొందరికి గుతూహలముదయించెను. అబ్బాయి గారి పక్షమువారేమైన హానిజేయుదురేమోయని సందేహముగలిగెను. పెత్తనమంతయు నామీదవిడచి నాయుడుగారు వెళ్ళినందున, యారాత్రి యుత్సవముజూచుటకు వెళ్ళవద్దని, నేను మా సామాజికులతో జెప్పితిని. పట్టణములో నబ్బాయిగారికి విరోధులైన గొందరు మనుష్యులుండిరి. వారు గూడ సమయమువచ్చినప్పుడు బుర్రలుపగులగొట్టగలవారే. అప్పుడప్పుడబ్బాయిగారికిని వారికిని యుద్ధములు జరుగుచుండెడివి. తలలు పగులుచుండెడివి. అబ్బాయిగారి విరోధులలో నొకడు మాకడకువచ్చి, యుత్సవము జూడదలచినపక్షమున, మేము మిమ్ము వెంటబెట్టుకొనిపోయి, సురక్షితముగ దీసుకొనివత్తుమని జెప్పిరి. అయినను వారిసలహానే నంగీకరింపలేదు. కాని మా సామాజికులు పడుచుదనపు గర్వముచేతను, వారి సహాయముగలదను ధైర్యముచేతను నుత్సవముచూడవలెనను కుతూహలముచేతను, రాత్రి భోజనానంతరమున వెళ్ళదలచిరి. పిళ్ళారిసెట్టి రామకృష్ణమ్మనాయుడుగారు తాతయ్యనాయుడు, గోపాలకృష్ణరావు, టంగుటూరి ప్రకాశమునను వారు నలుగురును, అబ్బాయిగారి విరోధులతోగలసి యుత్సవములోనికి వెళ్ళిరి. తమకు వ్యతిరేకముగనున్నవారు గట్టిగ నభయమిచ్చి మావాండ్రనుత్సవమునకు దీసికొనిపోపుచున్నసంగతి యబ్బాయిగారికి దెలిసెను. రాత్రి రమారమీ పదిగంటల కబ్బాయిగారు వారి శిష్యులను, దుడ్డుకర్రలను బుచ్చుకొని, తమకు వ్యతిరేకముగనున్న ప్రాతవిరోధులను, నాటకసామాజికులనుగూడ శిక్షింపదలచి, బయలుదేరిరి. మా సామాజికులు

దేవాలయముపద్ద నున్న మా బసనుండి మసీదువద్దకు వెళ్లునప్పటికే, యబ్బాయిగారి మూక వారివెనుకవచ్చి వారిం దాకిరి. గోపాలకృష్ణా రావునకు వెంటనే బుర్ర పగిలిపోయెను. ఇల్లు వెడలిన యరగంట లోనే, యతడు రక్తధారతో నింటికి మరలివచ్చెను. నాగుండె జెదరి పోయెను. ప్రకాశము, రామకృష్ణమ్మ, తాతయ్యనాయుడు, నేమైరో తెలియ లేదు. నేను పోలీసువారికి వర్తమానముజేసితిని. ఒకరిద్దరు పోలీసు జవానులు వచ్చిరి. అందులో నొకడు యూరపియను సార్జెంటు. ఆయన నావలన వాఙ్మూలముతీసికొనివెళ్ళిరి. మా తక్కిన సామాజికులను కొట్టి చంపిరో, యేమైరోయని, నాకు బెంగగలిగెను. ఇంటనున్న సామాజికులు ఖిన్నులై యుండిరి. రాత్రియంతయు మాకు నిద్రలేదు, ఆరాత్రి నేనును, నాచుట్టునున్నవారును, పడిన చిత్తక్షోభమింతయని చెప్పవీలులేదు. నాలుగు గంటలైన తరువాత, ప్రకాశము, తాతయ్యనాయుడు, రామకృష్ణమ్మవచ్చి వారివారి కథలు చెప్పిరి. తాతయ్యనాయుడు తలకొక కుచ్చు పాగజుట్టుకొని, యబ్బాయిగారి గుంపులోగలసిపోయెనట. అతడు తమవాడేయనుకొని వారాతనిజోలికిపోలేదట, రామకృష్ణమ్మ యెట్టెటొదెబ్బలుతినకుండ నిల్లు జేరెను. ప్రకాశమును దుండగీడైన యనమండ్ర కొండయ్యయను నతడు తరుముకొనివెళ్లెను ప్రకాశమొక మార్వాడీకొట్టులో దూరబోయెనట. అర్ధరాత్రివేళ వీడెవడో దొంగవాడు కొట్టులో దూరుచున్నాడనుకొని, కొట్టులోనికి రానీయకపోవుటకు మార్వాడీ ప్రయత్నముజేసెనట. ప్రకాశ మతి సాహసుడగుటచే, తలుపుగెంటుకొని లోపలికిపోయి తలుపుబిగించి కిటికీదగ్గర నిలిచియుండెనట. కొండయ్య పొడుగుపాటి కర్రదీసికొని, కిటికిలోనుండి పొడిచెనట అందుచేత ప్రకాశమునకు కొండయ్యమొగము పరిచితమయ్యెను. ఈ ఘోరకృత్యమైన తరువాతగూడ మేము నాటకములు వేసితిమి. ప్రొద్దుపోయి నాటకశాలకుపోయినపక్షమున శత్రుభయముండు నని దీపాలుపెట్టగనే భోజనములుపెట్టించి నాటకమున్ననాడు సామాజికు లను నాటకశాలకు నేను పంపుచుంటిని. వారిని సాయంకాలము షికారుకు వెళ్ళనీయకుంటిని, మునుపటివలె నాటకములకు మాకు సొమ్ము వచ్చుట మానెను. అబ్బాయిగారిజట్టు నాటకసామాజికులను కొట్టవత్తురనియు, నాసమయమున ప్రేక్షకులకుగూడ దెబ్బలుతగులవచ్చుననియు, నూరిలో నొకచెడ్డవాడుకపడెను. అందుచేత జనులు విశేషముగ నాటకముజూచుటకు మునుపటివలె వచ్చుటమానిరి. దానితో రాబడితగ్గెను. రాబడి మందగించ

గానే, యుత్సాహము పుందగించెను. ఎట్టెటో కొన్ని నాటకములు 1892 వ సంవత్సరము ఫిబ్రవరి మొదటివారమువరకు ప్రయోగించి, మరల రాజమహేంద్రవరము ప్రయాణముగట్టితిమి.

ఫిబ్రవరి 15 వ తారీకున మేము రాజమహేంద్రవరము జేరితిమి. నాకప్పు డుద్యోగములేదు గనుక, నేను తీరికగలిగి కాకినాడలో నుండ గలిగితిని. నాయుడుగా రుద్యోగములో నుండుటచే, వారక్కడనుండక నడుమనడుమ నాటకములకు కాకినాడ పచ్చుచుండిరి. నాటక సమాజము నకు మేనేజరుగారైన త్రియంబకరావు నాయుడుగారు గత సంవత్సరమం దమలాపురముగాని, యీయేడు కాకినాడగాని, రాలేదు. ఈవిధముగ నెన్నో చిక్కులు పడినను, కాకినాడలో మొత్తముమీద సమాజమునకు నష్టము రాలేదు

కాకినాడలోజరిగిన యీయల్లరియొక్క ప్రతిఫలము రాజమహేంద్ర వరములో కనబడెను. ప్రకాశమునకు కాకినాడలో జరిగిన చిక్కులు త్వరగ మరపురాలేదు. సమయము వచ్చినప్పుడు కాకినాడవారిమీద పగ దీర్చుకొనవలెనని యతని మనసులో నుండెను. మా నాటకసమాజము వారు తీరికయున్నప్పుడు కంభమువారి వీధి నొక యరుగుమీద కలసికొని మాటలాడుకొనుచుండెడివారు. 1892 సంవత్సరము జూనునెలలో నొక నాడు మేమందరము నా యరుగుమీద గూరుచుండి మాటలాడుచుంటిమి. కాకినాడనుండి కొండయ్య యేదో పనిమీద రాజమహేంద్రవరమువచ్చి పెద్దబజారువీధికి వెళ్ళుచుండెను. అరుగుమీదనున్న ప్రకాశమున కతడు కనబడెను. వెంటనే ప్రకాశము "కొండయ్య వచ్చినాడు, కొండయ్య వచ్చినాడ"ని కేకవేసి కట్టదీసికొని బయలుదేరెను. అరుగుమీదనున్న మిత్రులు కొందరు ప్రకాశము వెంటవెళ్ళి కొండయ్య, వీరు వెళ్లినప్పటి కిన్నీసుపేటవెళ్ళి వీరిని జూచి యొక యింటిలో దాగుకొనెను. అతని చేష్టలు గనిపెట్టుట కొక కుర్రవాని నచట ప్రకాశము నియమించెను. ప్రకాశము వెంట మాదిరెడ్డి చలపతిరావుండెను. మా యార్యను పాఠశాలలో చలపతిరావు గొంతకాలము జదువుకొనెను. చదువుకొను నప్పు డుపాధ్యాయుల యెడ దుర్వినయమెన్నడు జూపలేదు. తోడి బాలురతో వివాదములునులేవు. మిక్కిలి యడకువగలిగి యుండెడివాడు.

ఆనాడు సాయంకాల మారుగంటలకు కాకినాడ నివాసియైన బోడా రాజుగారను, వైశ్యశిఖామణియు, నాతని గుమాస్తాయైన యనమండ్ర

కొండయ్యయు, కాకినాడ బోపుటకై యొక యొంటెద్దుబండి నెక్కి ధవళే శ్వరము వెళ్లుచుండిరి, అప్పుడు రైలుదారి లేదుగనుక కాకినాడ వెళ్లువారు ధవళేశ్వరము బోయి, యక్కడ పడవ నెక్కవలెను. అట్లు వారు వెళ్లుదు రను సంగతి ప్రకాశమునకు తనచే నియమింపబడిన బాలుడు చెప్పెను. వెంటనే యతడు చలపతిరావును వెంటబెట్టుకొని యిన్నీసుపేట బోయెను. వీరు వెళ్లునప్పటికి వారిబండి కాలేజివద్ద కరిగెను. ప్రకాశము, చలపతి రావు బండియొద్దకు బోయిరి. చలపతిరావు బండికడ్డముగ నిలచి, బండి యెద్దును విప్పి, బండివానిని దింపి, బండి వెనుకప్రక్కకు నెత్తివేసెను. ముందుగ రాజుగారిపెట్టెయు, పెట్టెమీద రాజుగారును, రాజుగారిమీద కొండయ్యయు, బడిరట. ప్రకాశమేమిసాహసము జేయునోయని వానిని వారించుటకు యొకవైపునుండి హనుమంతరావునాయుడుగారును, మరి యొక వైపునుండి నేనును వెళ్ళితిమి. అప్పటికి చీకటిపడినందున నావెంట న్యాపతి బిందుమాధవరావను నామిత్రుని దీసికొనిపోతిని. మేము పోత గట్టుమీదుగ కాలేజివెనుకకు బోవునప్పటికి "చచ్చిపోయినానుబాబో!" యని కొండయ్యకేకలు వినబడెను. క్రిందబడిన కొండయ్యజుట్టుబట్టుకొని చలపతిరావో, ప్రకాశమో, కర్రతో బుర్రపగులగొట్టిరి. నెత్తురు గారు చుండెను. ఆనాడు శనివారము ఇన్నీసుపేటలో సంత, చుట్టుప్రక్కల గ్రామములనుండి సంతకువచ్చిన జనులు వేలకొలది మరల వారివారి గ్రామములకు బోవుచుండిరి. కాకినాడ యేదోపనిమీద వచ్చిన కొరళ్ళ సుబ్బా రాయుడుగారును, నరసాపురమునుండి వచ్చిన యాత్మూరి రామయ్యగారను వైశ్య శిఖామణియు, కాకినాడ వెళ్లుచుండిరి. రాజమహేంద్రవర నివాసియైన దుగ్గిరాల కాశీవిశ్వనాధముగారను వైశ్యశిఖామణి యాలకట్టుతోటలో నున్న తన యాముదాలఫాక్టరీ నుండి వచ్చుచు, గుర్రపుబండి దిగి యీగొడవ జూచుట కాగెను. ఈ గొడవయొక్క క్షణములో జరిగిపోయెను. ప్రకా శము బోడారాజుగారిజోలికి బోలేదు,

వేలకొలది జనులున్నను, ప్రకాశముగారి నెవ్వరు నాప సాహసింప రైరి. వెంటనే ప్రకాశము, చలపతిరావు కాలేజికడనున్న తీగలుదాటి, కాలేజి యావరణమునబడి, తరువాత రెండవవైపునున్న తీగలుదాటి, గోదా వరికి బోయి, కాలుచేతులు గడుగుకొని, యింటికిబోయిరి. నా ప్రయత్న మేమియు సాగుటకు వీలులేకపోవుటచే నేను నామిత్రుని వెంటబెట్టుకొని జరిగినవనికి విచారించుచు రాయవరపువారియింటికి వచ్చితిని. కొండయ్య

మృతినొందినాడని గ్రామములో వాడుకలుపడెను. మా నాటకసామాజిక శత్రువులు గోరంతలు కొండంతలుజేసి చెప్పుకొన నారంభించిరి. హను మంతరావునాయుడుగారా వార్తవిని, పుత్రప్రాయుడైన ప్రకాశమునకేమి కీడుమూడునో యని భీతిల్లి, బెంగగొని పరుగుపరుగున మాయింటికివచ్చి "కొండయ్య చనిపోయినాడట, ప్రకాశమున కేమి ప్రమాదమువచ్చునో!" యని పలికి, కన్నులనీరుపెట్టుకొనిరి. ప్రకాశమునకు విరోధులైన కొందరు రాజమహేంద్రపర వాసులు గొండయ్య మొగమెన్నడెరుగకపోయినను, వానియెడల నత్యంతాభిమానము గలిగి యాసుపత్రిలో జేర్చిరి. డాక్టరులు వానికి మరణభయము లేదని జెప్పి, చికిత్సజేయనారంభించిరి. పదియేను దినములనాటికి కొండయ్య గాయము మానగా నారోగ్యవంతుడై, కొందరి సలహామీద మేజస్ట్రీటుకచేరీలో, నున్నవారిని లేనివారిని గలపి ఛార్జి యిచ్చెను. ఎనమండుగురిని ముద్దాయిలుగ చేర్చెను. 1. ప్రకాశము. 2. చలపతిరావు, 3. హనుమంతరాపునాయుడుగారు, 4. తాతయ్యనాయుడు 5. ఉచయ నారాయణరావునాయుడు, 6. వాలి వేంకటరత్నము, 7. దుర్గి గోపాలకృష్ణారావు, 8. న్యాపతి బిందుమాధవరావు. ఇందులో మొదటి యిద్దరుతప్ప తక్కినవారెవ్వరు నాటిగొడవలో జోక్యము గలుగజేసుకొన్న వారుకారు. వాలి వెంకటరత్నము మా సామాజికుడైనగాడు. అతడు రాజ మహేంద్రవరము పోలీసుస్టేషనులో కానిస్టేబులు. అతడు నాటకసామాజి కులలో గొందరికి మిత్రుడు. కొండయ్య తన ఛార్జీ దాఖలుచేయుటకు, నడుపుటకు, వార్డుదొరగారిని డెబ్బదిరూపాయలిచ్చి న్యాయవాదిగ బెట్టు కొనెను. వార్డుదొరగారాంగ్లేయుడు. రాజమహేంద్రవరములో ప్లీడరుగ నుండెడివాడు. అప్పుడు తహసీలుదారుగారికి మేజస్ట్రీటు యొక్క యధి కారముండెను. కాని యాయన గ్రామాంతరము వెళ్ళుటచే కొండయ్య తన ఛార్జీని సిరస్తాదారు మేజస్ట్రీటయిన తాడూరి లక్ష్మీనరసింహారావుగారివద్ద దాఖలుచేసెను. మానాటకసమాజములో దుండగులు, పొగరుబోతులు నున్నారని కొందరి కభిప్రాయముండెను. ఆ వాడుక నిజమని నమ్మి సిరస్త దారుగారికి ముద్దాయిలకు శిక్షవేయవలెనని యుండెనని వాడుక పుట్టెను. కొండయ్య తనకు సాక్షులుగ నాత్కూరి రామయ్యగారిని, కొరళ్ళ సుబ్బా రాయుడుగారిని, దుగ్గిరాల కాశీవిశ్వనాధముగారిని, కాకినాడ వాసులైన మరియిద్దరు విశ్వబ్రాహ్మణులను, వేసెను. ఆత్కూరి రామయ్యగారు వైశ్య శిఖామణులు, లక్షాధిపతులు. నరసాపురవాసులు కొరళ్ళ సుబ్బారాయుడుగారు

వైళ్యులే ; ఆయన చిరకాలము డెప్యూటికలెక్టరుపని జేసి యంతకుముందే పనిచాలించుకొన్నవారు. దుగ్గిరాల కాశీవిశ్వనాధముగారు రాజమహేంద్రవర వాసులైనగొప్ప గృహస్థులు, వర్తకులు.

ఒకనాడా యభియోగము విచారణకు వచ్చెను, విచారణము ప్రారంభము గాకమునుపు, క్రొందరు పెద్దమనుష్యులు కొండయ్యకును ముద్దాయిలకును రాజీనామా మాట్లాడిరి. షరతులేమనగ, కాకినాడనుండి యబ్బాయిగారి శిష్యులెవరు రాజమహేంద్రవరము వచ్చినను రాజమహేంద్రవర హిందూనాటక సమాజమువారు వారిజోలికి పోగూడదు — రాజమహేంద్ర వరపు వారెవరు కాకినాడవెళ్ళినను వారు వీరిజోలికి రాగూడదు. ఈషరతులు కొండయ్య కిష్టములేకపోయెను. కాని ముద్దాయిపక్షమువా రచ్చట జేరి కొంత సాక్ష్యము దిగదీసిరి. మేజస్ట్రీటుగారు విచారణకు గూర్చుండిరి. ఆదినమున శ్రీ కొరళ్ళ సుబ్బార్యాయుడుగారు రాలేదు. ఆత్మూరి రామయ్యగారు రాలేదు. కాకినాడనుండి సమనులు పుచ్చుకొని విశ్వబ్రాహ్మణులు యిరువురు వచ్చిరి. ఈ పట్టణమువారే యగుటచే శ్రీ కాశీ విశ్వనాధముగారు వచ్చిరి. ముందుగ మేజస్ట్రీటుగారు కొండయ్య వాజ్మూలము పుచ్చుకొనిరి. అతడు తన ఫిర్యాదు స్థిరపరచుకొనుటకు తన్ను కొట్టిన వారిని, కొట్టనివారినిగూడ కలిపి చెప్పెను. కాశీ విశ్వనాధముగారిని బోనెక్కింపగ, నాయన చెప్పినమాటల సారాంశమిది : "నేను నా యాము దాల ఫ్యాక్టరీనుండి వచ్చుచుంటిని. కాలేజివద్ద గొడవ జరుగుచుండెను. చాల జనులుండిరి. ఎవరో యెవరినో కొట్టుచుండిరి." "ప్రకాశముగారు, చలపతిరావుగారు కొట్టిరా?"యని యడుగగ, "చీకటిపడినది నేను పెద్ద వాడను. కన్నులు గనబడలేదు. ఎవరు కొట్టినారో చెప్పలేను." అని చెప్పెను. కాకినాడనుండి వచ్చిన విశ్వబ్రాహ్మణులుగూడ, "చీకటిపడినది గనుక కొట్టినవారెవరో గుర్తుపట్టలేను," అనిచెప్పిరి. అంతట కొండయ్య సాక్ష్యము పోపుచున్నదని భయపడి నా ఫిర్యాదును వదలుకొనుచున్నానని మేజస్ట్రీటువద్ద శలవుపొంది తాను దాఖలుచేసిన యభియోగమును వదలు కొనెను. అంతట మేజస్ట్రీటుగారు ముద్దాయిలనువిడుదలజేసిరి. ప్రకాశము గారి నాటకకళా కౌశలము, పట్టుదల, బుద్ధివిశేషము. సాహసము మొదలైన లక్షణములు వెన్నుకనే విపరింపబడినవి.

ఇటీవల మంత్రిగ నున్నప్పుడుగూడ వారి పట్టుదల యసాధారణముగ నుండెను. పువ్వుపుట్టగనే వాసన తెలియునన్నమాట నిజముగదా!

1891 వ సంవత్సరము డిశంబరులో జరిగిన ప్రథమశాస్త్ర పరీక్షలో మన ప్రకాశముగారు కృతార్థులైరి. ఈ క్రిందివారు వారి సహాధ్యాయులు. ఈనడుమ గవర్నరుపనిజేసిన, సర్ కూర్మా వెంకటరెడ్డి నాయుడుగారు, చెన్నపురి హైకోర్టులో గొప్ప న్యాయవాదిగ పనిజేసి మంచిపేరు గణించి కీర్తిశేషులైన పేరి నారాయణమూర్తిగారు, కొంతకాలము జిల్లా కలెక్టరు జేసిన బజురుల్లా సాహేబుగారు, చాలకాలము డెప్యూటి కలెక్టరుగ పనిజేసి ప్రస్తుతము పించను పుచ్చుకొనుచున్న వింజమూరి వెంకన్న పంతులుగారు యింక ననేకులు గలరు. ప్రకాశముగారు, బి యె. తరగతిలో జేరలేదు.

మెట్రిక్యులేషను పరీక్షయందు కృతార్థుడనై నదిమొదలుకొని ప్రథమ శాస్త్రపరీక్షకు ప్రయివేటుగ జదువవలెనని నాకు సంకల్పముగలిగినది. ప్రవేశపరీక్షయందు కృతార్థుడనైన నాలుగేళ్ళకు, విద్యార్థి ప్రథమ శాస్త్రపరీక్షకు ప్రయివేటుగ రావచ్చునని యప్పటి నిబంధనలలోనుండెను అందు చేత నేను 1891 వ సంవత్సరమున ప్రథమ శాస్త్రపరీక్షకు జదువవలెనని ప్రకాశముగారితోగలసి కొన్నిపారములు జదివితిని కాని ఆసంవత్సరమున సెప్టెంబరునెలలో నన్ను పరీక్షకు రానిమ్మని నేను దరఖాస్తుపెట్టగా, చెన్నపురి విశ్వవిద్యాలయాధికారులు "నీవీసంవత్సరమురాగూడదు. కావలసిన పశ్నమున ముందు సంవత్సరము రావచ్చు" నని నాకు లేఖపంపిరి. అప్పటికి నేనూరకుండి, మరుసటిసంవత్సరము వెళ్ళవచ్చునని యువ్విళ్ళూరుచుంటిని.

1892 వ సంవత్సరప్రారంభమున నా "నలచరిత్ర" నాటకమున నైదవయంకమువ్రాసి పూర్తిజేసితిని. అంతకుముందు నాలుగంకములు మాత్రమే వ్రాసితిని. ఆసంవత్సరము రెండవభాగమున, "నల" నాటకము టౌనుహాలులో ప్రయోగింపబడెను. దుర్గి గోపాలకృష్ణారావుగారు నల పాత్రము, ప్రకాశము దమయంతి పాత్రము ధరించిరి. ఆసంవత్సరము ప్రకాశము మొదటితరగతి (Ist Grade) న్యాయవాదిపరీక్షకు దరఖాస్తు చేసెను. కాని వయసుతక్కువగనున్నదని దరఖాస్తు నిరాకరింపబడెను. నేనుద్యోగములేకయే 1892 వ సంవత్సరము జూనుపరకు నుంటిని. ఆసంవత్సర మిన్నీసుపేట మిడిలుస్కూలుకు ప్రధానోపాధ్యాయులైన శ్రీ సత్యవోలు లక్ష్మీపతిగారు పనిమానుకొనిరి. ఆపని శ్రీ హనుమంతరావు నాయుడుగారికీయబడెను. అందుచేత నిన్నీసుపేట మిడిలుస్కూలులో నొకపని ఖాళీయయ్యెను. పాఠశాలా పరిపాలకసంఘమునకప్పుడు కాలేజిలో

నుపాధ్యాయులైన శ్రీ స్కాటుదొరగారు కార్యదర్శిగనుండిరి. హనుమంత రావునాయుఁగారి ప్రేరణముచేత నేనాపనికి దరఖాస్తుపెట్టి స్కాటుదొర గారిని దర్శించితిని. ఆయన కూరగాయలబేరమువలె బేరమాడి, నెలకు పండ్రెండురూపాయలు జీతమేర్పరచి,నన్నాపాఠశాలలో మూడవయుపాధ్యాయుఁగ నియమించిరి. మరేదియు గతిలేదుగనుక మిక్కిలి తక్కువ జీతమైనను నేను దానికొడంబడి పనిచేయసాగితిని. ప్రధానోపాధ్యాయులైన నాయుడుగారు నాకు మిత్రులేగనుక నాకు దినములు సుఖముగనే వెళ్ళినవి. కాని నాకు ప్రథమ శాస్త్రపరీక్షకు జదువవలెనన్నపిచ్చి పోలేదు. తలలో నాకేదైన తలంపుపుట్టినపక్షమున నది నెరవేరినదాక తోచదు. నాసామర్థ్యమేమో నేనెరుగక, నేనాపరీక్షకు జదువనారంభించితిని గణిత భాగములో ట్రిగ్నామెటరీగానీ, యాల్జిబ్రాగాని నాకురాదు. రేఖాగణితములో గొంతజదివితినని మొండిధైర్యముతో దరఖాస్తుచేసితిని. ఇంగ్లీషు. తెలుగు, గ్రీసుదేశచరిత్రము. రోముచరిత్రము, నింగ్లాండు దేశచరిత్రము, శరీర శాస్త్రము, తర్కము, (Logic) గణితశాస్త్రమునప్పుడు చదువవలసిన పాఠములు. గణితశాస్త్రములోదప్ప తక్కినవాటిలో కొంత ప్రజ్ఞ సంపాదించితిని. కాని నాపరీక్ష బ్రహ్మాండముగ భగ్నమయిపోయెను. ఆసంవత్సరము శ్రీ న్యాపతి సుబ్బారావు పంతులుగారు తెలుగులో పరీక్షాధికారులైరి. తెలుగులో నాకు చాల మార్కులు వచ్చెనని తరువాత వారు నాతో చెప్పిరి. ప్రయోజనమేమి ? దరఖాస్తుపెట్టిన సొమ్ముదండుగ. నాశ్రమవ్యర్థము. కాని మరల జదువవలెనని కోరికమాత్రము నాకు గలుగలేదు. అది నాకు తగదని నేనప్పుడు తెలిసికొంటిని.

1891 సంవత్సరమున నేనొకసారి నా మిత్రుడైన నెప్పలి శేషగిరి రావుగారి కోరికమీద ధవళేశ్వరములో నతనిబసలో నష్టావధానముజేసితిని. ఆసభకు ధవళేశ్వర పురప్రముఖులలో ననేకులు వచ్చిరి. ఆకాలమున ధవళేశ్వరములో నొక సంస్కృతపాఠశాలబెట్టి విద్యార్థులకు నన్నదానము, విద్యాదానముగూడ జేయుచున్న శ్రీ చర్ల బ్రహ్మయ్యశాస్త్రిగారివద్ద విద్యార్థులైయుండిన తిరుపతి వేంకటేశ్వర కవులుగూడ నాసభకువచ్చిరి. గంటలు లెక్కపెట్టుట, పుష్పగణనము, మొదలైనవిగూడ జరిగెను అష్టావధానము జయప్రదముగ జరిగినదని చెప్పవచ్చును ఆసంవత్సరమే రాజమహేంద్ర వరము కాలేజీలో నా మిత్రులైన కొందరు విద్యార్థుల ప్రేరణముచేత నొక యష్టావధానము జేసితిని. ఎనమండుగురికి గవిత్వముమాత్రమే జెప్పితిని.

తక్కినపనులు జరుగలేదు. నా మిత్రుడైన వక్కలంక కామేశ్వరరావుగారి మేడమీద మరియొకమా రష్టావధానము జేసితిని ఇది యైనతరువాత నేనట్లు చేయుచున్నానని విని, నా మిత్రులైన యాచంట సుందరరామయ్యగారు నన్ను బిలిచి, యష్టావధానముజేయుటవలన మెదడు పాడవుననియు, దానివలన దేహారోగ్యముగూడ చెడుననియు, నంతకంటె గ్రంథరచనము మేలనియుచెప్పి యష్టావధానములు విరమింపుమని సలహానిచ్చిరి. ఆసలహా నామనస్సునకు నచ్చుటచేత నాటనుండి యష్టావధాన ప్రయత్నము మానుకొంటిని.

నా శిష్యుడైన రాయవరపు రామమూర్తియొక్క మామగారు పారుపల్లి లక్ష్మీనారాయణగారు తన రెండవయల్లుడైన నిమిషకవి భాస్కరరావు మరణముచేత దుఃఖసాగర నిమగ్నులైరి. కాబట్టి యాయనకు నేను యిరువదియైదు పద్యములుగల యొక పరామర్శలేఖ వ్రాసి పంపితిని. ఆ పద్యములిప్పుడు దొరకవు.

నాటకసమాజము రాజమహేంద్రవరమునుండి యమలాపురము వెళ్ళువరకు నేనును, ప్రకాశముగారును "ఏమండి?" యనుకొనుచుంటిమి. ప్రకాశముగారి రూప, బుద్ధి విశేషము మొదలయినవి నాకు మిక్కిలి సంతోషప్రదములుగ నుండినందున నాతనియడల నాకు మిక్కిలి యిష్టము గుదిరెను. ఆయన మెట్రిక్యులేషను పరీక్షలో కృతార్థుడైన దినమున నేను రెండు రూపాయిలు ఖర్చుపెట్టి చీనా మిఠాయి దెప్పించి, మిత్రులకు పంచిపెట్టించితిని. మేమిరువురము నమలాపురము వెళ్ళినతరువాత స్నేహమధికమగుటచే "ఏమండి?" యని పిలుచుకొనుటమాని, "ఏమిరా?"యని పిలుచుకొనుట కారంభించితిమి. ఒకనాడు హనుమంతరాపు నాయుడుగారు ప్రకాశముగారు తక్కిన సాహాజికులందరు కలసి జనార్దనస్వామి తిరునాళ్ళకు గడచి ధవళేశ్వరము వెళ్ళితిమి. ఆనాడు ప్రకాశముమీద నేనొక పద్యము జెప్పితిని. ఆనాటి నాకవిత్వ మెట్లుండెనో చదువరులు గ్రహించుటకై యాపద్యము నిందుదహరించుచున్నాను.

సీ॥ ఈగవ్రాలినగాని వేగజారెడునట్లు
మవ్వంపు కురులను దువ్వినాడు
వరలలాటమునందు తిరుచూర్ణరేఖను
ముద్దుగారెడుభంగి దిద్దినాడు

అరుణపల్లవమట్లు కరమురంజిల్లు చెం
గావి వస్త్రంబును గట్టినాడు
చార లంగరఖాను జక్కఁగా ధరియించి
వలెవాటు కండువ వైచినాడు
గీ॥ చెవులసందున గిరజాలు చిందులాడ
మొగముమీదను జిరునవ్వు మొలకలెత్త
టంగుటూరి ప్రకాశము రంగుమెరయ
ధవళగిరి తీర్థమునకును దరలివచ్చె.

ప్రకాశమునకును, నాకును మైత్రి క్రమక్రమముగ హెచ్చెను. ఇప్పటికిని మేము మిత్రులమే. అతడు చెన్నపురిలోనున్నను, నేను రాజమహేంద్రవరములోనున్నను మా హృదయములు సమీపముననే యున్నవి. ఆయన మంత్రిగానుండి రాజమహేంద్రవరము వచ్చినప్పుడు నన్నుజూచుటకాయన మా బసకు వచ్చిరి. అప్పుడు వారిని గౌరవించుటకు జరిగిన మహాసభకు పౌరులు నన్నధ్యక్షునిగ నేర్పరచిరి.

పూర్వము 1890వ సంవత్సర ప్రాంతమున మా నాటకసమాజ సభ్యులందరముజేరి యొకనాడు సాయంకాలము ముచ్చటలాడుచుంటిమి. అప్పుడు హనుమంతరావునాయుడుగారు పకోడీలు తెప్పించి మా కందరకు పంచిపెట్టిరి. అవి తినుచుండగ ప్రకాశమో, మరి యెవ్వరో నన్నుజూచి "మీరు పకోడీలమీద పద్యములు చెప్పండి. పద్యమున కొక పకోడీబహుమాన మిచ్చెదము" అని బలికిరి. ఆ మాటలువిని నేను "కవుల కక్షర లక్షలిచ్చెడి కాలము గతించినది। పద్యమునకు పకోడీ నిచ్చెడు దుర్దినములు వచ్చిన" వని ప్రత్యుత్తరమిచ్చి, వెంటనే యీకవిత్వముగ గొన్ని పద్యములు జెప్పితిని. జ్ఞాపకమున్నంతవరకు వాని నిచట వ్రాసెదను.

క॥ వనితల పలుకులయందున
ననిమిషలోకమున నున్న దమృత మటంచున్
జనులనుచెగాని లేదట
కనుగొన నీయం డమృతము గలదు పకోడీ। 1

క॥ ఆ కమ్మదనము నా రుచి
యా కరకర యా ఘుమఘుమ యా పొంకములా
రాకలు పోకలు వడుపులు
నీకే దగు నెందులేవు నిజము పకోడీ। 2

క॥ నీ కరకర నాదంబులు
మా కర్ణామృతములు నీదు మహితాకృతియే
మా కనుల చందమామగ
నే కొనియాడెదను సుమ్ము నిన్ను పకోడీ। 3

క॥ ఎందుకు పరమాన్నంబులు
ఎందుకు పలుపిండివంట లెల్లను హా। నీ
ముందర దిగదుడుపున కని
యందును సందియము గలుగదరయ పకోడీ। 4

క॥ ఆరామానుజు డా గతి
పోరున మూర్ఛిల్ల దెచ్చెమును సంజీవిన్
మారుతి యెరుగడు గాక య
య్యారె నిను గొనిన బ్రతుకడటవె పకోడీ। 5

క॥ పురహరుడు నిన్ను దిను నెడ
గరుగదె యొక వన్నె నలుపు గళమున మరిచం
దురుడున్ దినిన కళంకము
గరుగక యిన్నాళ్లు నుండగలదె పకోడీ। 6

క॥ కోడిని దినుటకు సెలవున్
వేడిరి మున్ను బ్రాహ్మణులు వేధ నతండున్
కోడి వలదా బదులు ప
కోడిం దిను మనుచు బెప్పె కూర్మి పకోడీ। 7

మరియుం గొన్ని గలవు గాని, యవి జ్ఞాపకము లేవు. ఈ విధముగ సావాజికులు నా చుట్టుజేరి వినోదించుచుండెడివారు.

1893 సంవత్సర ప్రారంభమున మా గురుపాదులగు వీరేశలింగముగారికి దొరతనమువారు, వారు చేసిన ఘనకార్యములకు వారికి రావు బహాదూర్ బిరుదము నిచ్చిరి. శ్రీ న్యాపతి సుబ్బారావు పంతులుగారు

మున్నగు ప్రముఖులు దొరతనమువారిచే బిరుదు పొందినందులకు వీరేశలింగముగారిని జనవరి నెలలోనే సన్మానింపదలచి, మహాసభ టౌను హాలులో జేసిరి. ఆ సభలో ననేకులు వీరేశలింగముగారిని గురించి ప్రశంసించుచు నాంగ్లేయ భాషలోను, తెలుగు భాషలోను నుపన్యసించిరి. వీరేశలింగముగారియెడ నాకు మొదటినుండియు మిక్కిలి భక్తిగలదు. అందుచేత నే నా సమయమున "నవరత్నము" లని పేరుబెట్టి తొమ్మిది పద్యములు రచించి సభలో జదివితిని. సభాసదులు మిక్కిలి సంతసించిరి. ఆ పద్యములు "చింతామణి" పత్రికలో ప్రకటింపబడినవి. కాని నా దగ్గర లేవు. 1893వ సంవత్సరముననే వీరేశలింగము పంతులుగారికిని, యేలూరి లక్ష్మీనరసింహముగారికిని జరుగుచుండిన యభియోగములు తుదముట్టినవి. ఏలూరు లక్ష్మీనరసింహముగారు "వివేకవర్ధని" పత్రికలో వీరేశలింగముగారు దమమీద నేదో నిందాస్పదముగ వ్రాసిరని జాయింటు మేజస్ట్రీటు వద్ద నొక ఛార్జి యిచ్చి, తమకు పరువునష్టము జరిగినదని మూడువేల రూపాయలు పరిహారముగ నిప్పింపుమని జిల్లాకోర్టులో లక్ష్మీనరసింహము గారు వ్యాజ్యము గూడ వేసిరి జాయింటు మేజస్ట్రీటుగారు విచారణజేసి, యా రెండు క్రిమినలు ఛార్జీలు కొట్టివేసిరి. వాటి విచారణ కాలమున నే నుత్సాహ పూరితుడనై మేజస్ట్రీటుగారి కచేరీకి వెళ్లుచుండెడివాడను. అప్పటి జిల్లాజడ్జిగారైన రాసుదొరగారు విచారణజేసి పరువునష్టముక్రింద యేలూరి లక్ష్మీనరసింహముగారికి నొక యణా నిప్పించిరి ఈ తీర్పు 1893వ సంవత్సరములో జరిగెను. ఆ తీర్పు జరిగిననాడు నేను జిల్లా కోర్టుకువెళ్లి స్వయముగ తీర్పుమాట కనుగొని వచ్చితిని. ఏలూరి లక్ష్మీనరసింహముగారి పక్షమున మహారాజశ్రీ నిడమర్రి జలదుర్గప్రసాద రాయుడుగారు వాదించిరి వీరేశలింగముగారి పక్షమున మహారాజశ్రీ న్యాపతి సుబ్బారావు పంతులుగారు గట్టిగపట్టుబట్టి పనిజేసిరి. రాజమహేంద్రవరములో నున్నవారేగాక, జిల్లాలోనున్న పెద్దమనుష్యులనేకులు వచ్చి యా పక్షముననో, యీ పక్షముననో సాక్ష్యములిచ్చిరి.

ఆ దినములలో మా పట్టణమున రెండుపక్షము లేర్పడినవి. వీరేశలింగముగారి పక్షము కొందరు, లక్ష్మీనరసింహముగారి పక్షము కొందరు. మా నాటకసమాజములోనున్న యనేకులు లక్ష్మీనరసింహముగారి పక్షమే. నేనే వీరేశలింగపక్షముగ నుండెడివాడను. కాని మాలోమాకు వివాదములు లేవు. హనుమంతరావునాయుడుగారు వీరేశలింగముగారికి వ్యతిరేకముగ

లక్ష్మీనరసింహముగారి పక్షమున సాక్ష్యమిచ్చిరి. నేను మనసులో నిరంతరము వీరేశలింగముగారికే విజయమును కోరుచుంటిని. కాని నాకు లక్ష్మీనరసింహముగారితోను పరిచయముగలదు. అప్పుడప్పుడు నేను వారి యింటికిగూడ హనుమంతరావునాయుడుగారితోగలసి పోవుచుండెడివాడను. లక్ష్మీనరసింహముగారియందును గొన్ని ప్రశంసనీయమైన గుణములుండెడివి. ఆయన యాపద్బాంధవుడనియు, సర్వజనమిత్రుడనియు, సులభుడనియు చెప్పుకొనుచుండెడివారు.

ఆ సంవత్సరమున చెన్నపుర శాసన నిర్మాణసభ విపులము చేయబడెను. పూర్వము శాసన నిర్మాణసభలో దొంతనమువారిచేత బేర్కొనబడినవారే సభ్యులుగ నుండెడివారు. శాసన నిర్మాణసభలలో జనులచేత నెన్నుకొనబడిన సభ్యులే యెక్కువగ నుండవలెనని పార్లమెంటు మహాసభలో క్రాసు ప్రభువుగారు (Lord Cross) బిల్లు ప్రవేశపెట్టి పార్లమెంటువారి యంగీకారము బడసిరి. హిందూదేశములోనున్న శాసన నిర్మాణసభలన్నియు దానింబట్టి పెద్దవి చేయబడెను. చెన్నపురి శాసన నిర్మాణసభగూడ యట్లే పెద్దది చేయబడెను. దక్షిణమండలముల పక్షమున నేడుగురు సభ్యులు. నుత్తరమండలముల పక్షమున నేడుగురును, నెన్నుకొనబడవలయునని శాసన మేర్పడెను. ఉత్తరమండలములపక్షమున మహారాజశ్రీ న్యాయపతి సుబ్బారావుపంతులుగారు సభ్యులుగ నియమింపబడిరి. ఎవరిని సభకు నెన్నుకొనదగునని రాజమహేంద్రపురవాసులొక సభచేసిరి. ఆ విషయమై చర్చించుటకు టౌనుహాలులో నొక సభ జరిగెను. మా యూరిలో గొప్ప గృహస్థులై డిస్ట్రిక్టుమునసబు పనిజేసి పింఛను బుచ్చుకొనియున్న "బుచ్చి అబ్బాయినాయుడు" అను నామాంతరముగల సామినేని ఆళహసింగరిరావు నాయుడుగారిని శాసనసభకు బంపదగునని కొందరు వాదించిరి. న్యాపతి సుబ్బారావుపంతులుగారిని పంపవలెనిని కొందరు వాదించిరి. న్యాపతి సుబ్బారావు పంతులుగారి పక్షమున నున్న వారందరు నొక తాగితముమీద వ్రాళ్లు చేసి యీయవలసినదని తెప్పిరి. ఆలాగుననే బుచ్చబ్బాయినాయుడుగారి విషయమునగూడ వ్రాళ్లజేసిరి, సభాసదులలో నూరుమందికంటె నధికము నాయుడుగారికి వోట్లు వేసిరి. సుబ్బారావుపంతులుగారి కిరువదియొకరు వోట్లు వేసిరి. మా నాటకసామాజికులందరు సుబ్బారావుపంతులుగారికి వ్యతిరేకమైనను, నేనుమట్టుకు నిర్భయముగవెళ్ళి పంతులుగారికి వోటు చేసితిని సుబ్బారావుపంతులుగారే సర్వవిధములచేత శాసన నిర్మాణసభకు తగిన

సభ్యులని నా అభిప్రాయము. ఉత్తరమండలములోనున్న మ్యునిసిపాలిటీల పక్షమున నొక సభ్యుడును, డిస్ట్రిక్టుబోర్డుల పక్షమున నొక సభ్యుడును, శాసననిర్మాణసభకు నెన్నుకొనబడవలెనని దొరతనమువారిశాసనము. ఆఎన్ని కలు కృష్ణాజిల్లా కలెక్టరు వారి యాధిపత్యమున బెజవాడలో 1893 సంవత్సర మాగష్టులో జరిగెను. ఉత్తరమండలముల మ్యునిసిపాలిటీలపక్షమున శ్రీ న్యాపతి సుబ్బారావుపంతులుగారును, డిస్ట్రిక్టుబోర్డుల పక్షమున బళ్ళారి నివాసులైన శ్రీ సభాపతి మొదలియారుగారు నెన్నుకొనబడిరి. శ్రీ పంతులు గారు రాజమహేంద్రవర నివాసులగుటచే మొట్టమొదట శాసన నిర్మాణసభ కెన్నుకొనబడినవారు మా పురవాసులే గదా యని పుర ప్రముఖులందరు పంతులుగారిని సన్మానించుటకై టౌనుహాలులో నొక మహాసభ జేసిరి. చాలమంది పెద్దలు పంతులుగారు దేశమునకు జేసిన సేవను, వారి గుణము లను మెచ్చుచు నాంగ్లేయమునను, నాంధ్రమునను, నుపన్యసించిరి. అప్పుడు నేను కొన్ని పద్యములు వారిమీద వ్రాసి సభలో చదివితిని. అవి " చింతామణి " యను మాసపత్రికలో ప్రచురింపబడినవిగాని, యిప్పుడు నాకడలేవు.

శ్రీ పంతులుగారియెడ నాకు మిక్కిలి గౌరవము గలదు. కారణమేమన, వారి దేశసేవయు వారి సుగుణసంపదయు నా మనస్సు నాకర్షించినవి. వారి యాంధ్రభాషాభిమానము ప్రశంసనీయము. 1891 వ సంవత్సరమున వారు "చింతామణి" యను తెలుగు మాసపత్రికను దాని వ్యయమంతయు వారే భరించి, దానిలో నెన్నో ప్రాచీనకవులు వ్రాసిన ప్రబంధములు ప్రచురించుటయేగాక, నవీనకవుల గ్రంథములు గూడ ప్రకటించుచు వచ్చిరి. అపూర్వమై యమూల్యమై యతిమనోహరమై, చిరకాలమునుండి గుప్తమైయున్న "ప్రభావతిప్రద్యుమ్న"మను పింగళి సూరకవి విరచిత మహాప్రబంధము మొట్టమొదట "చింతామణి" లోనే ప్రచురింపబడినది. ఇదిగాక "మొల్ల రామాయణము" "పాండవోద్యోగవిజయము" "నిర్భయోపాఖ్యానము" "పాండవోద్యోగవిజయము" "నిర్భయోపాఖ్యానము" "చిత్రభారతము" "నారాయణకవి పంచతంత్రము" "రామాభ్యుదయము" మొదలగు ప్రశస్తకావ్యములు గూడ నీ "చింతామణి" మాసపత్రికలోనే మొట్టమొదట ప్రకటింపబడినవి ఇవిగాక, నవీనకవులు రచించినవిగూడ నిందే ప్రచురింపబడినవి. 1893 సంవత్సరమున సుబ్బారావు పంతులుగారు పాశ్చాత్య దేశపద్ధతిని మన భాషలో గూడ నాఖ్యాయికలను (నవలలు) వ్రాయింపదలచి, పోటీపరీక్షలు పెట్టి, వారి స్వధనములోనుండి బహుమానములనీయ నారంభించిరి. ఈ యుత్కృష్ట కార్యమునలననే మనదేశములో

కొ త్తనవలలెన్నో తలయె త్తినవి. 1893వ సంవత్సరమున మూడునవలలు మాత్రమే పోటీపరీక్షకు వచ్చెను. అందులో రెండింటికి మాత్రము బహు మానము లీయబడెను. మొదటనవల వ్రాసినవారికి డెబ్బదియైదు రూపాయ లును, రెండవనవల వ్రాసినవారి కేబది రూపాయలును పంతులుగారు బహుమాన మిచ్చిరి. బహుమాన ధనము స్వల్పముగ నుండుటచేత మంచి నవలలురాలేదని యభిప్రాయపడి పంతులుగారు మరుచటి సంవత్సరమునుండి ప్రథమగణ్యమైన నవలకు నూటయిరువదియైదు రూపాయలును, ద్వితీయ ముగ గణింపబడిన దానికి డెబ్బదియైదు రూపాయలు బహుమానముగ నిచ్చునట్లు ప్రకటించిరి. అందుచేత నేను 1894వ సంవత్సరమున నవలల పోటీపరీక్షకు నిలిచితిని. ఆ సంవత్సరమున నేను "రామచంద్ర విజయ" మను నవలను వ్రాసి పంపితిని, ఆ సంవత్సరమున నవలల గుణగణముల పరీక్షించుటకు శ్రీ వావిలాల వాసుదేవశాస్త్రిగారిని, శ్రీ కందుకూరి వీరేశ లింగము పంతులుగారిని, జిల్లాకోర్టు న్యాయవాదియైన యాచంట సుందర రామయ్యగారిని, నియమించిరి. ఆ సంవత్సరమున పోటీపరీక్షకు పదు నాలుగు నవలలు వచ్చినవి వాటి నెల్ల శ్రమపడి చదివి పరీక్షకులు తమ నిర్ణయముల నిచ్చిరి. గోజేటి కనకరాజుగారు "వివేకవిజయ" మని యొక నవలను వ్రాసి పంపిరి. మరియు ననేకులు బంపిరి. శ్రీ వావిలాల వాసు దేవశాస్త్రిగారును, యాచంట సుందరరామయ్యగారును, నేను వ్రాసిన "రామచంద్ర విజయము" ప్రథమగణ్యమని యభిప్రాయపడిరి. కనకరాజు గారు వ్రాసి పంపిన "వివేకవిజయము" ప్రథమగణ్యమని వీరేశలింగము గారభిప్రాయపడిరి. ఎవరి యభిప్రాయము త్రోసివేయుటకు వీలులేక, సుబ్బారావు పంతులుగారు మొదటి నవల కేర్పడిన 125/- రూపాయలును రెండవదాని కేర్పడిన 75 రూపాయలును కలిపి మొత్తము రెండువందల రూపాయలు మొదటినవల రెండవ నవల యను రెంటిని సమానముజేసి కనకరాజుగారికి నూరు రూపాయలును, నాకు నూరు రూపాయలునుయిచ్చి "తుని తగవు" మాదిరిగ చేసిరి.

"రామచంద్రవిజయ" మే నా నవలలలో మొట్టమొదటిది. అంతకుముందు నాటకములేగాని నేను నవలలు రచియింప లేదు. సుబ్బారావుపంతులుగారి ప్రోత్సాహముచేత నేను క్రొత్తపుంత త్రొక్కితిని. హనుమంతరావునాయుడుగారి ప్రోత్సాహము లేకపోయినయెడల నేను త్వరగనాటకములు వ్రాయలేకపోదును. సుబ్బారావుపంతులుగారి

ప్రోత్సాహము లేకపోయిన యెడల నేను నవలలప్పుడు వ్రాయలేక పోదును. నవలలు వ్రాయుటకు మా కప్పుడు వీరేశలింగముగారు వ్రాసిన "రాజశేఖరచరిత్ర" మను నవలయే యాదర్శకము. ఆనవలను నేనామూలాగ్రముగ జదివి, నవలలు రచియించు పద్ధతి తెలుసుకొని, "రామచంద్రవిజయము" వ్రాసితిని. పోటీ పరీక్షలో నెగ్గిన నవలలు "చింతామణి" పత్రికలోనే ప్రతి మాసము ప్రకటింపబడుచు వచ్చెను. ముద్రణము పూర్తియైన తరువాత నవలలు వ్రాసినవారికి 500 ప్రతులు సుబ్బారావుపంతులుగా రుచితముగ నిచ్చుచుండిరి. ఈ విధముగ సుబ్బా రావు పంతులుగారు భాషాసేవ విశేషముగజేసిరి. ఆంధ్రదేశమున హరి కథా చక్రవర్తియని చెప్పదగిన సంగీతసాహిత్య విశారదులగు ఆదిభట్ల నారాయణదాసుగారు రాజమహేంద్రవరము వచ్చినప్పుడు. వారిచేత హరికథలు చెప్పించుచువచ్చిరి. సంగీతశాస్త్రవేత్తలగు పండితులెవరు వచ్చి నను శ్రీ పంతులుగారే సభలుగావించి నన్మానించి వారి నాదరించుచు వచ్చిరి. మహావక్త లెవరువచ్చినను వారిచేత నానావిషయముల గురించి యుపన్యాసము లిప్పించి, పురవాసుల నానందింపజేయుటలో, సుబ్బారావు పంతులుగారు మొట్టమొదటివారని జెప్పవచ్చును.

ఈ విధముగ భాషాసేవ జేయుటగాక పంతులుగారు రాజకీయముగ గూడ విశేషదేశసేవ జేసిరి శాసననిర్మాణసభలో జేరి వారుజేసిన దేశ సేవను గురించి యప్పటి చెన్నపురి గవర్నరుగారైన వెన్‌లక్ ప్రభువు గారు పర్లాకిమిడిలో నొకసభలో మనపంతులుగారిని మిక్కిలి కొనియాడి రని చెప్పుటకంటె మరియేమియు నే వ్రాయనక్కరలేదు. ఉత్తర మండ లమున పదునొకండు జిల్లాలుగలవు. ఆ జిల్లాల కష్టనిష్ఠురములన్నియు దెలుసుకొని దొరతనమువారికి విన్నవించవలసిన భారము పంతులుగారిపై బడెను. కావున దేహశ్రమము నాలోచింపక, ధనవ్యయము గణింపక, పంతులుగా రన్నిమండలములయందు ప్రయాణముజేసిరి. సుబ్బారావు పంతులుగారు పండిత పక్షపాతి. పత్రికా ప్రకటనాదులయం దభిరుచి యెక్కువ. ఇంగ్లాండుదేశమున గొన్నిచోట్ల, మహాకవులయొక్కయు నాటకప్రణేతలయొక్కయు గ్రంథములనుండి రసవంతములయిన భాగము లను, సమర్థులైనవారు సభలలో జదివి, జనులను రంజింపజేసెడు నాచార మొకటి గలదట. అట్టివానిపేరు "పెన్నీరీడింగ్సు" (Penny Readings) పెన్నీ యనగ అణా. అందువల్ల స్వల్పముగ పోగుచేసి సత్కార్యములకై

వినియోగింతుగట. ఆంధ్రమహాకవుల గ్రంథములనుండి, రసవంతమయిన భాగములను జదివించి, జనులను రంజింపజేయపలెనని, పంతులుగారు మనదేశమునగూడ నట్టివి, టిక్కెట్టులేకుండ బెట్టించిరి. కాని యవి చిర కాలము నడచినవిగావు. నేను భాగవతములోని వామనఘట్టమునుండి కొన్నిపద్యములు యా సభలో జదివి పాలుగొంటిని.

●

స్వీ య చ రి త్ర ము

ఆ ర వ ప్ర క ర ణ ము

వి వా హ ము

1893 సంవత్సర మనగ విజయసంవత్సరమున నాకు వివాహ మయ్యెను. అప్పటికి నా కిరువదియారవయేడు. మనదేశములో జదువు కొన్న బాలురకు సాధారణముగ నిరువదియేండ్ల లోపుగనే వివాహము లగుట యాచారము. నే నింగ్లీషు లో మెట్రిక్యులేషను పరీక్షయందు గృతా ర్థుడనై యాంధ్రమున గొంత పరిశ్రమజేసి, కవిత్వము చెప్పుచుండినను, నా కిరువదియేండ్లలోపుగ వివాహము గాలేదు. కారణమేమన, నాకు కొంచెముగనో గొప్పగనో దృష్టిదోషముండుటచేత, నేనంధుడనని నాబంధు వర్గములో నొక ప్రవాదము పుట్టెను. అది కేవల మబద్ధముగాదు. పగలు చదువుటకు వ్రాయుటకు సంచరించుటకు నా కాటంకము లేకపోయినను, రాత్రులు నాకు చిన్ననాటనుండియు కన్నులు కనబడకుండెనన్నమాట నిజము. ఇది యెరిగియే, నా బంధుపులుగూడ, నా వివాహము విషయమై గట్టిప్రయత్నము జేయలేదు. ఎట్టకేలకు, నేను వివాహములేక ఘోటక బ్రహ్మచారినై యుండుట యిష్టములేక, మా తల్లిదండ్రులు శ్లాఘాపాత్రము గాని యొక వివాహము నాకు జేసిరి.

తణుకు తాలూకా కాకరపట్లు గ్రామములో, మా మేనమామగారికి సన్నిహితజ్ఞాతియైన యొక గృహస్థుండెను. ఆయన పేరు పురాణపండ వెంకటదీక్షితులుగారు, ఆయన వైదికవృత్తిచే జీవించుచుండిరి. ఆయన గట్టి స్వాధ్యాయవేత్త షోడశకర్మలు సనర్గళముగ జేయింపగల సమర్థుడు. గొప్ప కుటుంబములలో మెప్పుపొందిన పురోహితుడు. ఆయన మూడవ కుమార్తె కప్పటికి వివాహము కావలసియుండెను. ఆయన కొక్కడే కుమారుడు అతనికిగూడ వివాహము గాలేదు. అతని వివాహ విషయమునగూడ వాని తలిదండ్రులును, మా తలిదండ్రులవలెనే, బెంగగొని యుండిరి. మా యింట మా మూడవ చెల్లెలైన రమణమ్మకు వివాహము కాలేదు. కాబట్టి మా బంధువులలోకొందరు, నా వివాహ విషయమున పూనుకొని, నాచెల్లెలైన రమణమ్మకు పురాణపండ వెంకటదీక్షితులుగారి కుమారుడైన వెంకన్నకును, వెంకన్న చెల్లెలైన వెంకాయమ్మను నాకును యిచ్చి వివాహముచేయుటకు నిశ్చయించిరి, ఇటువంటి ఫిరాయింపు వివాహము చేసికొనుట నాకిష్టములేదు. వీటికే "కుండమార్పుల పెండ్లిండ్ల"ని లోకులందురు. ఇవి మనదేశములో జనులచే నంత గౌరవముగ జూడబడవు. ఏలయన, యుభయపక్షములవారు గతిలేక చేసికొను వివాహములగుటచే శ్లాఘాపాత్రములుగావు. ఈ వివాహము నాకిష్టములేదని నేను మావాండ్రకు పలుమారు నొక్కిచెప్పితిని. కాని మా తలిదండ్రులు దుఃఖపడినందున నా పట్టుదల నేనువదలి, యొడంబడవలసివచ్చెను. ఇందులో నొక షరతు గూడ గలదు. మా చెల్లెలి వివాహము చిన్నతిరుపతిలో జేయుటకు, మా తలిదండ్రులు చిన్ననాడామెకు జబ్బుజేసినప్పుడు మ్రొక్కుకొనినందున వివాహములు రెండును తిరుపతిలోనే జరుగవలసివచ్చెను. ఖర్చుపెట్టి తిరుపతి వెళ్లుటకు మా మామగా రొప్పుకొనరైరి. కాబట్టి యుభయుల ఖర్చులు మే మే భరింపవలసివచ్చెను. నా శిష్యుడైన రాయవరపు రామమూర్తి తండ్రియైన యప్పారావుగారు నే నడుగగకయే నా వివాహమునకై రు. 200/-లు ఇచ్చిరి. నేను మరొకచోట నూరురూపాయ లప్పుచేసి, మొత్తము మూడువందల రూపాయలు మా తండ్రిగారికి బంపితిని.

మేము వీరవాసరమునుండి పాలకొల్లనువచ్చి, తిరుపతివరకు నొక నావ గుత్తజేసికొని బయలుదేరి, కాకరపట్లు గ్రామమువచ్చి యాయత్తవారి నందెక్కించుకొని నడుమనడుమ గ్రామములలో దిగి వంటలుజేసి భోజనములు జేయుచు, మెలమెల్లగ భీమడోలు జేరితిమి. మా మేనమామగారైన

మల్లయ్యశాస్త్రిగారు, తమ జ్యేష్ఠకుమారుడైన భద్రయ్యశాస్త్రికి, ద్వారకా తిరుమలలో నుపనయనము జేయదలచి, సకుటుంబముగ వచ్చిరి. మేము చేబ్రోలువరకు నావమీదవెళ్లి, యచ్చట రైలెక్కి భీమడోలు వెళ్లితిమి. మొట్టమొదట మన జిల్లాలలో 1893 సంవత్సర మాగస్టులోనే రైలుబండి నడచెను. నేను రైలుబండి యెక్కుట కదియే మొదటిసారి. ఈ యినుప దారి 1890 లో ప్రారంభింపబడి 1893 లో ముగింపబడెను. దీనికి మొట్ట మొదట తూర్పు తీరపుటినుపదారి (East coast Railway) యని పేరు పెట్టబడెను. తరువాత దీనిపేరు మారెను. మొదట దొరతనమువారే దీనిని నిర్మించిరిగాని, పిదప గొన్ని కంపెనీలకు దీని నిచ్చివేసిరి.

మేము తిరుపతి వెళ్లినతరువాత, నైదురోజుల వివాహము వద్దు నాకు శలవు దొరకలేదని మా యత్తవారితో జెప్పితిని. ఒక్కనాటి వివాహము వారి కిష్టములేక "సెలవు దొరకినప్పుడే, మరల వివాహము జేసి కొనవచ్చును. పోదము పదండి" యని వారుత్తరము జెప్పిరి. ఆ పరిస్థితులలో నది యసాధ్యమగుటచే, నైదురోజుల వివాహమునకే, మాతండ్రిగారొడంబడిరి. పదవఖర్చులేగాక భోజనాదులకైన ఖర్చులు గూడ మావే. ఏదోవిధముగ నైదుదినములు వివాహము లయ్యెను. నా భార్య కప్పటికి పదిసంవత్సరముల వయస్సు. నా వివాహమునకు ముందు నా కొక చిత్ర పరీక్ష జరిగెను. నా యత్తమామ లొకనాడు, రాయవరపువారి వీధి గుమ్మము లో నిలిచియుండి, లోపలనుండి నన్ను రమ్మని వర్తమానమంపిరి. ఎందుకని నేను వీధిలోనికివచ్చి యడుగగా, మేము కార్యాంతరము మీద నీయూరు వచ్చితిమి. మాకు జాబు వ్రాసిపెట్టవలెనని, వారు నన్నడిగిరి. నేను లోపలకుబోయి, కాగితము కలము సిరాబుడ్డి తెచ్చి, వారు చెప్పినట్లు జాబువ్రాసి వారికిచ్చితిని. పగలైనను, నేను స్వేచ్ఛగాసంచరింపగలనోలేనో, వ్రాయగలనో లేనో యని పరీక్షించుటకు, వారు వచ్చిరని నేనభిప్రాయ పడితిని. నా వ్రాతతోవారు పరితుష్టులై వెడలిపోయి, ముహూర్తము పెట్టించిరి. తిరుపతినుండియే నేను మా పాఠశాలాధికారులకు సెలవు నిమిత్తము వ్రాసికొంటిని. అప్పుడు నేను తిరుపతి క్షేత్రమును గూర్చియు, వెంకటేశ్వరస్వామిని గూర్చియు, గొన్నిపద్యములు రచించితిని. జ్ఞాపకమున్న వాని నిచట నుదహరించెదను.

సీ॥ ఆలబోతులదెచ్చి యచ్చుబోసెడివారు
నిలువుదోపుల నిచ్చి నిలుచువారు
డిబ్బీలయందున డబ్బువేసెడువారు
సాష్టాంగదండముల్ సలుపువారు
వడుగులు బెండ్లిండ్లు వరుసజేసెడివారు
చెలువుగా భజనలు చేయువారు
వెంకటేశ్వర! యంచు వినుతిజేసెడివారు
తివిరి ప్రదక్షిణల్ తిరుగువారు

గీ॥ ముడుపుల సమర్పణముజేసి మ్రొక్కువారు
కొండపైనెక్కజాలక కుందువారు
ఈశ్వరప్రసాదమును భక్షించువారు
కలిగి కలకలలాడె దేవళము నేడు.

చం. పురములు మంచిగ్రామములు పుణ్యనదుల్ గలుగంగ సింహసూ
కరముఖదుష్టజంతువులు గల్గి భయంకర ఘోరపన్నగో
త్కరయుతమైన యీ విపుల కాననమందున నిల్వనేలనీ
చరణము లాశ్రయించు జన సంఘము కష్టమునొందదే యిలన్.

చం. చెలగి వరాహరూపమును సింగపురూపునుదాల్చి తొల్లి కా
నల జరియించి యుండుట పనంబులపై గడుభీతి నీమదిన్
గలుగగబోలు నయ్యదియె కారణమేమొ మహావనంబులన్
మలలను నుండువాంఛ యతిమాత్రముగా నుదయించి యుంటకున్.

చం. ముడుపుల నీయకున్న యతిమూర్ఖుల బెత్తముతోడగొట్టి నీ
ముడుపుల దెచ్చికొందువని భూజనులాడెదరట్టి నీవు నీ
గుడి నడిరేయి జొచ్చి ధనకోశము మ్రుచ్చిలు దొంగవాండ్రనీ
వడపకపోతివయ్య మహత్వమె? చెప్పుము వెంకటేశ్వరా!

తే. గీ. తొల్లి బీబినాంచారియన్ తురకపడతి
బెండ్లియాడితివని బుధుల్ జెప్పవిందు
వర్ణసంకరుడగు నీకు వందనంబు
బ్రాహ్మణాదులు చేయుట పాడియగునె.

నా వివాహము గాకమునుపు, 1893 వ సంవత్సరము జూనునెలలో, నా శిష్యుడైన రాయవరపు రామమూర్తికి బునస్సంధానమగుటచే, నేనుగూడ

వారితో కాకినాడపట్టణము బోయి పదునైదుదినములుంటిని. ఆ సమయ మున, రామమూ ర్తి మామగారైన పారుపల్లి లక్ష్మీనారాయణగారితోనేగాక, వారి చెలియలి భర్తయైన శ్రీ గురజాడ శ్రీరామమూ ర్తి పంతులుగారితో గూడ, నాకు విశేషపరిచయభాగ్యము గలిగెను. శ్రీరామమూ ర్తిపంతులు గారు మనయాంధ్రులకు జిరపరిచితులు. ఆంధ్రభాషానేవ విశేషముగ జేసిన వారు. కవి జీవితములనుపేర నాంధ్రమహాకవుల జీవితములు తెలుగున మొట్టమొదట వ్రాసిన మహనీయులు వీరే! వీరి తరువాతనే కందుకూరి వీరేశలింగం పంతులుగారు నేర్పుతో నాంధ్రకవుల చరిత్రము వ్రాసిరి. శ్రీరామమూ ర్తిపంతులుగారు గూడ కవిజీవితములను విశేషవిషయములను జేర్చి తిరిగి విపులముగ నిటీవలవ్రాసిరి. ఈయన మిక్కిలి శాంతమూ ర్తి. వీరును, వీరిభావగారైన పారుపల్లి లక్ష్మీనారాయణగారును గలసి తెలుగులో "రాజయోగి" యను నొక వారపత్రిక నడపిరి. వారి యిరువురి పరిచయము గలిగినందుకు నేను మిక్కిలి సంతసించితిని. నాటనుండి నేను, శ్రీరామమూ ర్తిగారి కుటుంబమునకును, పారుపల్లివారి కుటుంబమునకును, మిక్కిలి యాప్తమిత్రుడనైతిని.

1893వ సంవత్సరముననే శ్రీ రఘుపతి వేంకటరత్నమునాయుడు గారు, రాజమహేంద్రవరము దయచేసి, సంఘ పారిశుధ్యమునుగూర్చి, యాంగ్లేయభాషలో నొక మహోపన్యాసవర్షము గురిపించిరి. వేశ్యాంగనలను, మనవారు కులటలుగజేసి సంఘము నపవిత్రముజేసిరనియు, వారికి గూడ వివాహములుజేసి, సంసారులను చేయుట యుక్తమనియు, వివాహదులయందును, దేవతోత్సవములయందును వేశ్యలను బిలిచి నృత్యగానములు జేయించుట యనుచితమనియు, వారియుపన్యాసములలో నొక్కిచెప్పిరి. ఆ భావగాంభీర్యమేమని కొనియాడుదును! ఆ శబ్దసౌష్ఠవ మేమని వర్ణింతును! ఆ వాగ్వేగమేమని సన్నుతింతును. ఆ యుపన్యాసము వినునప్పుడు సభాసదులు సమ్మోహితులవలె బరవశులైరి. నే నానందసముద్రమున నోలలాడితిని. రాజమహేంద్రవర కళాశాలా ప్రధానాచార్యులును, గురువులకు గురువునైన పూజ్యపాదులు మెట్కాఫ్‌దొరగారు, నాడాసభ కధ్యక్షతవహించి, నాయుడుగారి యుపన్యాసమును మిక్కిలి మెచ్చుకొనిరి.

ఆ సంవత్సరాంతమున నా యుద్యోగము పోయెను. ఏమన, రాజమహేంద్రవరములో నదివరకున్న పాఠశాలలన్నియు గలిపి, యేక పాఠశాలగ 1888వ సంవత్సరమున చేసియుండిరని నే నిదివరకు వ్రాసియుంటిని.

అయినను, నవాబు దేవిడీలో మహారాష్ట్రోన్నత పాఠశాల యని యొకబడి బయలుదేరెను. పూర్వము శ్రీ యేలూరి లక్ష్మీనరసింహముగారిచేత స్థాపింపబడిన యాస్థికపాఠశాలలో, గొంతకాలము సహాయోపాధ్యాయుడుగ పనిజేసిన, ముత్తుస్వామిశాస్త్రిగారు మహారాష్ట్ర పాఠశాల స్థాపించిరి. అది గాక బి. యే. పరీక్షలో గృతార్థుడైన ద్రోణంరాజు రామకృష్ణారావను నొక యువకుడు, మరియొక పాఠశాలను స్థాపించెను. మహారాష్ట్ర పాఠశాల యొకటియున్నది గనుక, జనులు పరిహాసమునకు దీనిని, పిండారి పాఠశాల యనుచు వచ్చిరి. ఈ పాఠశాలలు విద్యాశాఖవారి యనుమతిని బొందినవి గావు. ఐనను గొందరు బాలకు లీ పాఠశాలకు బోవుచునేయుండిరి. పోటీ పాఠశాలలు రాజమహేంద్రవరములో లేకుండ జేయవలెనని, మెట్కాఫ్ దొరగారు చేసిన ప్రయత్నము విఫలమగుచుండెను. ఈ స్థితిగనిపెట్టి, మెట్కాఫ్ గారొక క్రొత్తపుంత త్రొక్కిరి. చెన్నపురి రాజధానిలోనున్న యిరువదిరెండు జిల్లాలకు, బోధనాభ్యసన కళాశాల, చెన్నపురిదగ్గిరనున్న సైదాపేటలోమాత్రమే యుండెను. దానిపే రుపాధ్యాయకళాశాల (Teacher's College) బోధనాభ్యసనముచేయదలచువా రుత్తరమున గంజాము నుండియైన, దక్షిణమున తిరునల్వేలినుండియైన, సైదాపేట బోవలసినదే. రాజమహేంద్రవరమునుండి రాయసం వెంకటశివుడుగారును, సత్యరాజు మృత్యుంజయరావుగారును, బి. యే. పరీక్షయందుదేరి, బోధనాభ్యసనము కొరకు సైదాపేటబోయిరి. వీ రిద్దరు నా సహాధ్యాయులే. గంజాము విశాఖ పట్టణ జిల్లాలనుండి సైదాపేటకుపోవుట మిక్కిలి కష్టసాధ్యమయినపని. విశేషించి యా కాలమున రైలుబండి సౌకర్యములులేవు ఈ కష్టముల నివారించుటకును, నున్నతపాఠశాలా విద్య సరిగ జరుపుటకును, దొరతనము వారే సమర్థులని యాలోచించి, మెట్కాఫ్‌దొరగారు రాజమహేంద్రవరములో నొక త్రయినింగు కళాశాల స్థాపింపవలసినదనియు, నందులో నొక నున్నత పాఠశాలగూడ స్థాపింపవలసినదనియు, నా కాలపు విద్యాశాఖాధికారియైన "డంకన్" దొరగారికి వ్రాసిరి. ఆ సలహా బాగున్నదని డంకన్ దొరగారు దొరతనమువారికి వ్రాసిరి. ఆ సలహా దొరతనమువా రంగీకరించి 1894 సంవత్సరము జవవరిలో రాజమహేంద్రవరమున దొరతనము వారొక త్రయినింగు కళాశాలను స్థాపించిరి. బి. యే. లకు యల్. టి. తరగతియు ప్రథమశాస్త్రపరీక్షయందు తేరినవారికొక తరగతియు మెట్రిక్యులేషన్‌యందు తేరినవారికొక తరగతియు, బోధనాభ్యసన కళాశాలలో నెలకొల్పబడెను.

అంతకుమున్ను చిరకాలమునుండి పనిచేయుచున్న నార్మల్ స్కూలుగూడ, నీ కళాశాలతో జేర్పబడెను. ఇందు ప్లైమరీ పరీక్షయందు దేరిన వారికిని, లోవర్ సెకండరీలో దేరిన వారికిని, బోధనాభ్యసనము నేర్పబడుచుం డెను. మొత్తముమీద నీ క్రొత్తకళాశాలలో, యల్. టి. మొదలుకొని ప్లైమరీవరకు, బోధనాభ్యసనము నిమిత్తమై యైదుతరగతు లేర్పరుప బడినవి. అదివరకు రాజమహేంద్రవరములో బనిచేయుచున్న రాజ మహేంద్ర పురోన్నతపాఠశాలయు, దాని శాఖలుగనున్న యిన్నీసుపేట మధ్యమ పాఠశాలయు. నగరమధ్యమ పాఠశాలయు (Town Middle School) పరిపాలక సంఘమువారు తీసివేసి బోధనాభ్యసన కళాశాల కిచ్చివేసిరి. రాజమహేంద్రవర పాఠశాలా పరిపాలకసంఘమువారు, కష్టపడి సంపాదించి యారువేలరూపాయలు రొక్కమును, నగరమధ్యమ పాఠశాలాభవనమును, (Town Middle School Building) నగరమధ్య మున నున్నతపాఠశాల కట్టుటకై సంపాదించిన విశాలస్థలమునుగూడ దొరతనమువారి కిచ్చివేసిరి.

నేను పనిచేయుచున్న యిన్నీసుపేట పాఠశాల దొరతనమువారికిచ్చి వేసినందున నాయుద్యోగము పోయెను. కాబట్టి 1894 వ సంవత్సరము జనవరి మొదలుకొని నే నుద్యోగములేక నిరర్థకముగ కాలము జరుపవలసి వచ్చెను. అట్లు జూన్ నెలవరకు ధనసంపాదనములేక నిరుద్యోగినై నేనుం టిని. 1893 వ సంవత్సరము డిశంబరులో జరిగిన మెట్రిక్యులేషను పరీ క్షలో, రాయవరపు రామమూర్తి గృతార్థుడై 1894 వ సంవత్సము జనవ రిలో ప్రథమశాస్త్ర పరీక్ష తరగతిలో జేరెను. తెలుగు, దేశచరిత్రము మొద లయిన పాఠములలో నేను వారి యింటనుండి, యతనికి సాయము జేయు టచే, నతడు నా యెడల మిక్కిలి భక్తిగలవాడై నా కుద్యోగమున్నప్పుడు లేనప్పుడుగూడ నన్ను వేరొకచోటికి బోనీయక, మిక్కిలి దయతో నాద రించుచుండెను. నిరుద్యోగినై యుండుట నాకిష్టములేక, నేనా సంవత్సర మున బోధనాభ్యసనము బొందుట మంచిదని తలచితిని. బోధనాభ్యసన కళాశాలలో, నా మిత్రుడైన మరంగంటి కృష్ణమాచార్యులుగారు లేఖకుడుగా నుండి, నాకు తగిన సహాయము జేసెను. ఏదోవిధముగ నేను సెకండరీ ట్రెయినింగు తరగతిలో జేరితిని. ఇప్పుడున్న ట్రయినింగు కళాశాలా భవన మప్పటికి నిర్మింపబడలేదు. కాబట్టి యల్. టి. తరగతియు దాని తరువాత తరగతియు, దొరతనమువారి కళాశాలలోనే పెట్టిరి. అవిగాక యున్నత

పాఠశాల తరగతులు గూడ కొన్ని యచ్చటనే యుండెను. ప్రస్తుతము న్యాపతి సుబ్బారావుగారి భవనమున్నచోట, గొన్ని తరగతులుండెను. కొన్ని తరగతు లద్దెయింటిలో నుండెను. మెట్కాఫ్ దొరగారే మునుపటి కళాశాలకును. యీ బోధనాభ్యసన కళాశాలకును గూడ, ప్రధానాచార్యులైరి. విద్యాశాఖలో జిరకాల ముపాధ్యాయులై యెంతో యనుభవము గలిగి, "నడచుచున్న నిఘంటువు" (walking Encyclopaedia) యను బిరుదము నొందిన, శ్రీతంజావూరు సుబ్బారావు పంతులుగారు, వైసు ప్రిన్సిపాలుగ నియమింపబడిరి. మొదటి సంవత్సరము యల్. టి. తరగతిలో శ్రీ వల్లూరి నరసింహారాయుడుగారు చేరిరి. ఈ క్రొత్తకళాశాల నిర్మింపబడినతరువాత సెకండరీగ్రేడ్‌తరగతిలో పదిమందిచేరిరి. అందునేనొకడను. మాతరగతులపై బూర్వము నా సహాధ్యాయుడు నా మిత్రుడునైన సత్యరాజు మృత్యుంజయరావు గారధికారిగ నుండుటనే, నేను కొంత సుఖపడితిని.

ఇన్నీసుపేటపాఠశాలలో నే నుపాధ్యాయుడుగ నున్నకాలమున, నా యొద్ద జదువుకున్న శిష్యులలో కొందరిపేళ్లుచెప్పెదను. నిడమర్తి వెంకట్రామయ్యగారు, పెద్దాడ సుందరశివరావుగారు, ఓరుగంటి సుబ్బారావుగారు, వీరు న్యాయవాదులై సుప్రసిద్ధులైరి. నేను బోధనాభ్యసన కళాశాలలో నున్నప్పుడు న్యాపతి కామేశ్వరరావుగారు నా యొద్ద జదివిరి. ఆ సంవత్సరమున జిల్లాకోర్టులో శ్రీ పిఠాపుర సంస్థానపు టభియోగము విచారణచేయబడుచుండెను పిఠాపురపు రాజుగారి దత్తుడుగారు, శ్రీ గంగాధరరామారావుగారి యౌరసపుత్రులైన యిప్పటి పిఠాపురము మహారాజాగారు బాలురై యుండగ సంస్థానము తనకే రావలయునని యభియోగము దెచ్చిరి. దత్తుడుగారి పక్షమున రాయబహుమూర్ పునప్పాక మానందా చార్యులవారు, చెన్నపురి నుండి న్యాయవాదిగ వచ్చిరి. మహారాజావారి తరపున సుబ్రహ్మణ్యమయ్యరుగారును, భాష్యమయ్యంగారును వకీళ్లుగ వచ్చిరి.

మా నాటకసమాజమువారు ష॥రా॥రా॥శ్రీ ఆనందాచార్యులవారి గౌరవార్థ మొకనాటకము ప్రదర్శింపదలచి, వారి నాహ్వానముజేసిరి. ఆహ్వానము నిరాకరింపక యానందాచార్యులవారు మా సమాజమువారి కోరిక దీర్చిరి. అప్పుడు నా గయోపాఖ్యాననాటకమే పురమందిరమున (Town Hall) ప్రదర్శింపబడెను. దుర్గి గోపాలకృష్ణారావు కృష్ణపాత్రయు, హనుమంతరావు నాయుడుగారు గయునిపాత్రయు, ప్రకాశముగారు చిత్రరేఖార్జునపాత్రలు, ధరించి చక్కగ నభినయించిరి. ఆనందాచార్యులవారును సభాసదులును

మిక్కిలి సంతసించిరి. ఆచార్యులవారు నాటకాంతమున నటుల యభినయ మును మెచ్చుకొనుచు, నింగ్లీషులో చిన్నయుపన్యాసము జేసిరి. ఆనందా చార్యులవారు సరసులు. ఆంధ్రగీర్వాణ భాషాభిమానులు. నవద్వీప పండి తులు, వీరికి "విద్యావినోది" యని బిరుదమిచ్చిరి. "వైజయంతి" యను తెలుగు మాసపత్రికను వీరు ప్రకటించుచుండిరి. ఈయన మిక్కిలి బండిత పక్షపాతి. బళ్ళారిలో ధర్మవరము కృష్ణమాచార్యులవారు స్థాపించిన నాటక సమాజమువారు, చెన్నపురివెళ్ళి నాటకములాడినప్పు డాచార్యులవారు బహు విధముల వారికి బ్రోత్సాహము గలిగించిరి. వచననాటకములే యెక్కువగ ప్రయోగించెడు మా సమాజము చెన్నపురి వచ్చిన జనులు మెచ్చుకొందురా యని, మా నాయుడుగా రాచార్యులవారి నడిగిరి. నాటకమున కభినయము హావభావములు ప్రధానములుగాని. సంగీతముకాదని వారు స్పష్టముగ జెప్పిరి. నాటకసమాజమున కాచార్యులుగా రప్పుడు రు 116 లు బహుమాన మిచ్చిరి. నాటకమైన తరువాత నే నానందాచార్యులవారి దర్శనముజేసి, వారి పరిచయభాగ్యము సంపాదించితిని. నా నాటకరచనము వారు మెచ్చుకొనిరి. వారి కుమారుడైన శ్రీనివాసాచార్యులవారుగూడ మా నాటకసమాజప్రదర్శన మొకటి చూడగోరగా, సామాజికులు, నవాబుదేవిడీలో నేను రచియించిన "నల" నాటకము ప్రదర్శించిరి. శ్రీనివాసాచార్యులుగారు కూడ నాంధ్ర భాషాభిమానులే. తెలుగున వారు రెండో మూడో గ్రంథములుగూడ రచిం చిరి. వారుకూడ నాటకమును మెచ్చుకొనిరి. అప్పుడు దుర్గి గోపాలకృష్ణా రావు "నల" పాత్రమును, ప్రకాశముగారు "దమయంతి" పాత్రమును ధరించిరి.

ఆ సంవత్సరము శ్రావణమాసములో వీరవాసరములో నున్న మాయిల్లు పరశురామప్రీతి యయ్యెను. మా తల్లిదండ్రులు ప్రక్కనున్న మరియొకరియింటికి చేరిరి. మాయిల్లు మా తండ్రిగారు కట్టి యప్పటికి నలువది సంవత్సరము లయినవి. ఈ గృహదహనముచేత మా తండ్రి గారు బెంగపెట్టుకొనిరి. ఆ సమయముననే, మా రెండవబావమరిది యైన రామస్వామిగారి యన్నగారు వెంకటప్పయ్యగారు,కాలధర్మమొందిరి. వారిని పరామర్శచేయుటకును, మా తల్లిదండ్రుల చూచివచ్చుటకును, నేను వీరవాస రము బోయితిని. అక్కడనుండి నరసాపురము బోయి మా చెలియలు పున్నమ్మను, బావగారిని జూచి, రాజమహేంద్రవరము వచ్చితిని.

ఆ సంవత్సరమున జాతీయమహాసభ (All India National Congress) చెన్నపట్టణములో జరుపనిశ్చయింపబడెను. నా కన్నులొక సారి చెన్నపురిలోని నేత్రవైద్యులచేత పరీక్షచేయించుకొనవలెనని, చిర కాలమునుండి నాకొక కోరిక యుండెను. "ఏకక్రియాద్వ్యర్థకరీ" యను సామెతనుబట్టి, నేనాసంవత్సరమున చెన్నపురిబోయినపక్షమున, నేత్రపరీక్ష జేయించుకొనుటయే గాక, కాంగ్రెసుమహాసభ గూడ జూడవచ్చునని, నేను చెన్నపురిబోవ నిశ్చయించుకొంటిని. నా మిత్రులైన తల్లాప్రగడ చలపతి రావుగారును, చేబియ్యపు వేంకట్రామయ్యగారును, బి. యే. పరీక్షనిమిత్తమై చెన్నపురి బోవుచుండగా, వారితోగలసి 1894వ సంవత్సరము డిశంబరులో నేనుగూడ చెన్నపురి బోయితిని. అప్పుడచ్చట నా మిత్రుడైన శ్రీ పోల వరము జమీందారుగారు కొచ్చర్లకోట రామచంద్రవెంకటకృష్ణారావుగారు, పరశురామను పేటలో కాపురముండిరి. నేను వారిని జూడబోవగా, వారు దయతో నన్ను వారియింటనే యుండమని బలవంతపెట్టి, నా నేత్ర పరీక్ష గూడ చేయింతుమని సెలవిచ్చిరి. అందుచేత నేను వారియింటనే బసచేసియుంటిని. ఆదినములలో నామిత్రుడైన రెబ్బాప్రగడ పాపయ్యగారు కూడ నచ్చటనే యుండి, నాకు సహాయముజేయుచుండిరి జమీందారుగారు నన్ను మిక్కిలి దయతో నాదరించిరి. వారు జనవరినెలలో నొకనాడు నన్ను వెంటబెట్టుకొని నేత్రవైద్యశాలకు గొనిపోయి యచ్చటివైద్యులలో ప్రధానులై సుప్రసిద్ధులైన "పోపు" దొరగారికి, నన్ను జూపిరి. ఆయన యొక గదిలోనికి నన్ను దీసికొనిపోయి కన్నులు పరీక్షించి యెన్నో సులోచనములు నాకన్నులకు దగిలించిరి. సులోచనములేవియు నాకు సరిపడ లేదు. నా నేత్రరోగ మంతకంటె వృద్ధికాదనియు, నది నివారణకాదనియు, వారు జెప్పిరి.

నేను కాంగ్రెసుమహాసభకువెళ్ళితిని. అప్పుడే మహావక్తయైన సురేంద్రనాథబెనర్జీగారి యొక్కయు, దేశాభరణమైన మదనమోహన మాలవ్యగారియొక్కయు, నితర వక్తలయొక్కయు, మహోపన్యాసములు విని ధన్యుడనైతిని. ఆదినములలో నిచ్చటనుండి నరాసరి చెన్నపురికి రైలు దారిలేదు. అది తయారగుచుండెను. కాబట్టి మేము బెజవాడవెళ్ళి, దక్షిణ మహారాష్ట్ర ధూమశకటము (S. M. R) మీద, నందియాలగుంతకల్లు ప్రదేశముల మీదుగ, చెన్నపురి జేరితిమి. చెన్నపురినుండి తిరిగివచ్చునప్పుడుగూడ నదేమార్గము. అది చుట్టుదారి బండి మెల్లగ నడచును.

కాబట్టి ప్రయాణికులకు విసుగుగలుగును. ఈ బండికూడ లేనప్పుడు, ప్రాతగోదావరి మండలవాసులు, చెన్నపురి వెళ్ళవలసివచ్చినప్పుడు, కాకినాడ వెళ్ళి, పొగయోడనెక్కి మూడవనాడు చెన్నపురిలో దిగుచుండిరి. మొత్తముమీద నేను చెన్నపురిలో నెలపదియేను దినములుండి, శ్రీ పోల వరము జమీందారుగారి గుఱ్ఱపుబండిమీద, దర్శనీయములైన స్థలములు జూచి, తిరిగి రాజమహేంద్రవరమువచ్చితిని. శీతాకాలపు సెలవులతరువాత మా కళాశాల తెరచిననాడు నేను రాలేక, సెలవునిమిత్తము చెన్నపురినుండి దరఖాస్తుపంపితిని. నామిత్రుడైన మరంగంటి కృష్ణమాచార్యులవారి సహాయముచేత, నాకు సెలవుదొరకుటయేగాక సెలవుదినములలో జీతము గూడ దొరికినది. అప్పుడు బోధనాభ్యసనము చేయువారికి, నెలకు పది రూపాయలు చొప్పున, దొరతనమువా రిచ్చెడివారు. పట్టపరీక్షసిద్ధులకు నెలకు పదునైదు రూపాయలును, ప్రథమ శాస్త్రపరీక్షసిద్ధులకు నెలకు పండ్రెండు రూపాయలు నిచ్చుచుండెడివారు. ఇప్పటివలె, బోధనాభ్యసనము పొందువారు, స్వగృహమునుండి సొమ్ము దెచ్చుకొనవలసిన యవసర ముండెడిదిగాదు. ఎట్లైతో నాబోధనాభ్యసనము 1895 వ సంవత్సరము మార్చినెలతో ముగిసినది.

ఆకాలమున రాజమహేంద్రవరమున కంతకు బోధనాభ్యసన కళాశాల యొక్కటే పాఠశాలగ నుండెను. మొదటిఫారము జదువుకొనుబాలుడు మొదలుకొని, బి. యే. జదువుకొనువాడు వరకు, నిన్నీసుపేటకే వెళ్ళవలసివచ్చెను. ఆర్యాపురమునుండియు, జాంపేటనుండియు, ప్రాతయూరినుండియు, జిన్న తరగతులలో జదువు బిడ్డలు నడువలేక జాల శ్రమపడుచుండిరి.

అందుచేత రెండవ పాఠశాలయొకటి యుండుట యవసరమని పుర వాసులకు దోచెను. అప్పుడు రాజమహేంద్రవరపు మ్యునిసిపలు సభాధ్యక్షులుగ, శ్రీ నిడమర్తి జలదుర్గ ప్రసాదరాయుడుగారుండిరి. వారు పుర జనుల మనవుల నాలకించి, బాలురకష్టములు గుర్తించి, ప్రాతయూరిలో నొక మ్యునిసిపల్ లోవర్ సెకండరీ పాఠశాల స్థాపించుట యవసరమని తలంచి, మ్యునిసిపల్‌సభలో బెట్టి, యా విషయ మంగీకరింపజేసి, 1895 సంవత్సర మేప్రియల్ యొకటవ తారీఖునుండి, మ్యునిసిపల్ మిడిలు స్కూలొకటి స్థాపించిరి. ఇప్పుడు టౌనుహాలు కెదురుగనున్న భవనము, దొరతనమువారికి జెందియుండినందున, వారి యనుజ్ఞబొంది పాఠశాల

యందు స్థాపింపబడెను. అప్పుడు దుర్గయ్యగారి మ్యూనిసిపల్ సంఘా ధ్యక్ష పదవి తాత్కాలికముగ నాగిపోయినందున, మరల నెన్నిక జరుగు వరకు, యేలూరి లక్ష్మీనరసింహముగా రధ్యక్షపదవిలో నుండిరి. ఈపాఠ శాలకు గావలసిన యుపాధ్యాయుల యుద్యోగము లన్నియు నాయనయే యిచ్చిరి. వల్లూరి నరసింహరాయుడుగారు మొట్టమొదట ప్రధానోపాధ్యా యులుగ నేర్పరుపబడిరి. రెండవ యుపాధ్యాయుడుగ హనుమంతరావు నాయుడుగారేర్పరుపబడిరి. మూడవయుపాధ్యాయుడుగనే నేర్పరుపబడితిని. నాకు నెల కప్పుడు రు. 20/- లు జీతము. పండితులుగ శ్రీ మల్లంపల్లి పేరయ్యశాస్త్రిగారును, కల్లూరి వేంకటరామశాస్త్రిగారును, చావలి సోమనాధ శాస్త్రిగారునుగూడ నియమింపబడిరి.

మా తండ్రిగారు వీరవాసరములో నొక పెంకుటిల్లు మిక్కిలి శ్రమ పడి కట్టిరి. నేనుకూడ వారికి కొంత ధననహాయము జేసితిని. కాని గృహప్రవేశమునకు నేను వెళ్ళజాలనైతిని, కారణమేమన గృహప్రవేశము మేనెలలో జరిగెను. అప్పుడు కాలువలు కట్టివేయబడియుండును. పడవ లుండవు. నడచియో బండ్లమీదనో మా గ్రామము పోవలెను. అట్లు చేయలేక నేను గృహప్రవేశమునకు పోజాలనైతిని. కాని జూన్ నెలలో నొకసారి మా తలిదండ్రుల దర్శనము చేసివచ్చితిని. ఆ నెలలోనే మొట్ట మొదటి గోదావరీ మండలసభ కాకినాడలో జరిగెను. అప్పుడు గోదావరి జిల్లా విభజింపబడలేదు. ఆసభకు శ్రీ న్యాపతి సుబ్బారావు పంతులుగా రధ్యక్షత వహించిరి. మొదటినుండియు నాకు సభలకుబోపుట యలవాటు, అది రాజకీయ సభయైనను, నాకు రాజకీయ విషయములలో నప్పటి కేవిధ మయిన ప్రవేశము లేకపోయినను, నేనాసభకు బోయితిని. మూడవనాడు నేను పదునాలుగు పద్యములు రచించి సభలో జదివితిని. పద్యము చదివినప్పుడెల్ల సభాసదులు చప్పట్లుగొట్టి యానందించుచుండిరి. ఆపద్య ములతో నాపేరు గోదావరీమండల మందంతట వెల్లడియయ్యెను నాపద్య ములు చాల బాగున్నవని, సాధారణముగ నెవరి కవిత్వమును మెచ్చని, వీరేశలింగము పంతులుగారుగూడ మెచ్చిరి. ఆపద్యము లివి.

సీ॥ తుహినాద్రిమొదలు సేతువుదాక రాజ్యంబు
జరిపె నీ యాంగ్లేయ దొరతనంబె
జాతిమతాచార సర్వస్వతంత్రముల్
నెరపె నీయాంగ్లేయ దొరతనంబె

పిండారిదండుల పేరై నలేకుండ
దోలె నీయాంగ్లేయ దొరతనంబె
నేర్పుతో చట్టముల్ నిర్మించి క్లేశముల్
తొలచె నీయాంగ్లేయ దొరతనంబె
తే॥ గీ॥ ప్రజలు లోపముల్ జూప నాగ్రహములేక
కరుణజూపు నీయాంగ్లేయ దొరతనంబె
ఇట్టి యాంగ్లేయ దొరతనంబేలుగాక
ధర్మమతితోడ నాచంద్రతారకంబు. 1

సీ॥ దీప్తిమంతంబైన దీపంబుతోడ గ్రీ
నీడ యొక్కింత గన్పించునట్లు
కమ్మకమ్మనితావి గుమ్మున వెదజల్లు
నల గులాబికి ముండులలమినట్లు
సర్వజనానంద సంధానకరుడైన
చందమామను గందు జెందునట్లు
జీవనాధారమైచెలగు చల్ల నివాన
బెడిదంపు పిడుగుల నడరినట్టు
తే॥ గీ॥ లుత్తమంబగునట్టి యీ హూణరాజ్య
మందు గనుపించు లోపంబు లరసిజూడ
తన్నివారణార్థముగాదె ధన్యులార
గౌతమీమండలసభ సంకల్పమయ్యె. 2

సీ॥ హిందూమహాజన హృదయసీమలయందు
ప్రబలియుండెడు రాజభక్తి యొకటి
ద్రవ్యంబు ప్రాణంబు ధారబోయించు న
మానుష దేశాభిమానమొకటి
నిష్కారణంబుగ నిరపరాధులు చెందు
శ్రమలజూడగ బుట్టు జాలియొకటి
ప్రతిమనుష్యుడుధాత్రి భగవంతుడంచు వి
విధభూత సహాయ్యవిధియు నొకటి

తే॥ గీ॥ యనెడు నాలుగు మూలంబు లగుచునుండ
గౌతమీ మండలసభ సంకల్పమయ్యె
నఖిలజన సౌఖ్యదాయకమగుచు నిదియె
ధరణీవర్థిల్లు నాచంద్రతారకంబు. 3

సీ॥ పాలింపబడువారి బాలించువారల
సూటిగల్పెడు సంధిసూత్రమనగ
ప్రభువులపాల గన్పడు లోపముల జూ
పదగినట్టి నిలువు టద్దంబనంగ
మాయశాసనముల న్మత్స్యంబులనుబొంచి
యలయించిపట్టెడు వలయనంగ
బ్రాభవమ్మునుదాల్చి ప్రార్థించుటకు మూ ర్తి
వంతమౌ వర రాజభ క్తియనగ

తే॥ గీ॥ బ్రజలకెల్లను గన్నుల పండువగుచు
జగతి దేశీయసభ కొక్క శాఖయగుచు
బ్రబలు రగువారల ప్రయత్నఫలమునగుచు
నలరు నిమ్మహాజనసభ ఖ్యాతిమీఱు. 4

సీ॥ పన్నుగట్టుటయందు బ్రభువులౌ హూణుల
కేనాటికైనను దృప్తిలేదు
ఉద్యోగములు చేయు నున్మత్తులకు గార్య
నిర్వాహమందున నియతిలేదు
బహుపరీక్షల దేరి ప్రజ్ఞాఢ్యులగు మీకు
రవ్వంతయేని ధై ర్యంబులేదు
మితిలేని తమ చెడ్డగతినెల్ల దగ విన్న
వింపఁగ రయితుకు విద్యలేదు

తే॥ గీ॥ తెలుఁగు తెలియంగ దొరలకుఁ దెలివిలేదు
దీనదశఁ బాపగలయట్టి దిక్కులేదు
కటకటా ! యెట్టులున్నదో కాపులదశ
సుగుణధనులార జనులార చూడరయ్య. 5

సీ॥ నేల దున్నుదమన్న జాలతరముపన్ను
నీరు గావలెనన్న నీటిపన్ను
వాణిజ్యమొనరింప వచ్చుబడికి పన్ను
సరకులమ్ముదమన్న సంతపన్ను
కర్రలమ్ముదమన్న గలప కింకొకపన్ను
పట్టణంబుల మున్సిపాలుపన్ను
పారిపోవుదమన్న బండిహాసీల్ పన్ను
కొంపమ్మకొన్నచో స్టాంపుపన్ను
తే॥ గీ॥ ఉన్నమట్టుకు తినకుండ నుప్పపన్ను
ననెడు పన్నులె దిగదీసె జనులనెల్ల
కటకటా! యెట్టులున్నదో కాపులదశ
సుగుణధనులార జనులార చూడరయ్య. 6

సీ॥ అధికారభూతంబు లడుగు లంచములిచ్చి
పరిపరి విధములౌ పన్నులిచ్చి
మునసబు కరణాల ముడుపులన్నియు నిచ్చి
కోసి నూర్చినవారి కూలినిచ్చి
కచ్చేరి బంట్రోతు గముల కీనామిచ్చి
పాలేళ్ళకును గొంత పంటనిచ్చి
యజమానునకు బంట నర్ధభాగంబిచ్చి
పైకమిచ్చినవాని వడ్డినిచ్చి
తే॥ గీ॥ గడ్డిమాత్రమె మిగిలింప గాపువాడు
సేద్యమున దాను పశువు భక్షింపకొరకు
కటకటా! యెట్టులున్నదో గాపులదశ
సుగుణధనులార జనులార చూడరయ్య. 7

సీ॥ గృహములయందు దరిద్రదేవతనిల్చె
గొప్పసంసారముల్ గుల్లలయ్యె
జక్కని భూములు సారహీనములయ్యె
వివిధవస్తుధరలు వృద్ధిఁబొందె

మునుపటివెల్ల మొదలఁట నడుగంఁబె
మానాభి మానముల్ మాయమయ్యె
లక్షాధిపతులెల్ల భిక్షాధిపతులైరి
కనుపించు నేఁటి కాటకములు
తే॥ గీ॥ అంతకంతకు ఋణబాధ లధికమయ్యె
దొరలకు ప్రజలమీదను గరుణదప్పె
కటకటా ! యెట్టులున్నదో కాపులదశ
సుగుణధనులార జనులార జూడరయ్య. 8

సీ॥ అధికారులకు దైన్యమంత వెల్లడిసేయు
దేశస్థులకు మైత్రి దిట్టపరచు
నఖిలజాతులవారి కైకమత్యముగొల్పు
రాజ్యాంగ విషయవార్తలనుదెల్పు
జనులలోనుండు నజ్ఞానమంతయుబాపు
వినయాదిగుణముల విధముజూపు
ప్రభువులపైగల్గు భక్తిని ప్రకటించు
సాహస ధైర్యముల్ సంఘటించు
తే॥ గీ॥ గౌతమీమండల సభ నిక్కముగ మనకు
గాన జనులార యుక్తమౌ కాలమందె
ధరణి నిమ్మహాజనసభ స్థిరముగాగ
బాటుపడరయ్య వినరయ్య పలుకరయ్య.... 9

సీ॥ వ్యవసాయ మొనరించి వివిధనష్టములొంది
కడగండ్ల బడు పంటకాపులార
త్రాణ లేకున్నను వాణిజ్యమొనరించి
పన్నులిచ్చుకొనునో వైశ్యులార
యభిమానధనులంచు నఖిలదేశములందు
బ్రఖ్యాతిగన్న యో రాజులార
విద్యలన్నియు నేర్చి యుద్యోగములులేక
విసికి వేసారునో విప్రులార

తే॥ గీ॥ ప్రాతపగలున్న నవిమాని బ్రీతిబూని
తగుధనములిచ్చి సభల కందరును వచ్చి
పాటుపడరయ్య వినరయ్య పలుకరయ్య
శ్రద్ధగనరయ్య సభలను జరుపరయ్య. 10

సీ॥ మొగమోటయనుమాట దెగగోసి దొరలతో
జనులకై వాదించు సాహసుండ
యతి కార్యదీక్షచే నల గవర్నరుచేత
మెప్పుగైకొన్న యమేయగుణుడ
కార్యవాదమెకాని ఖడ్గవాదములేక
సఫలకార్యుడవైన శాంతిధనుడ
ప్రజల కష్టములనెల్ల బాపినంగాని ని
ద్రయినబోవని యో దయార్ద్రిహృదయ

తే॥ గీ॥ చెలిమినీసభ దొరలకు దెలుపవయ్య
కినుకలేకుండ గరుణ గల్గింపవయ్య
యోసభాగ్రాసనాధీశ మో సుశీల
సుగుణ సముదాయ న్యాపతి సుబ్బరాయ. 11

సీ॥ చలువపందిళ్ళ గౌశలముతో నిర్మించి,
భోజన సదుపాయముల నొనర్చి
రవి రశ్మి సొరనట్టి రమ్యహర్మ్యములిచ్చి
సభయెంతొ తీవితో జరుగఁజేయు
విబుధుడౌ బాదము వేంకటరత్నాఖ్య
తద్బంధుగణముల స్తవమొనర్చి
వరమండల సభా ప్రపంచనిర్మాత కా
రణులగుచు బహుజన ప్రణతులగుచు

తే॥ గీ॥ ప్రబలు గంజాము వెంకటరత్న విభుని
ప్రవిమలుని శేషగిరిరావు పద్మనాభు
పేరరాజు ముఖ్యులనెల్ల వినుతిజేసి
వందనంబులజేతు మీ కందరకును. 12

ఉ॥ భూజనవందితంబు పరిపూర్ణ మనోరథ దాయకంబునై
రాజిలు నిమ్మహాసభ కరంబనుకూలత గాకినాడ నీ
యోజను మన్మధాబ్దమున నొప్పెగదా యిక సభ్యులార! మా
రాజమహేంద్రపట్టణము రండు ముదంబున ముందఁజేటికిన్. 13

తే॥ గీ॥ గౌతమీసుండల సభకు ఖ్యాతిమెరయ
పూర్ణభక్తి సమర్పించె పుష్పమాల
వసుధ వీరవాసర పురవాసియైన
చిలకమర్తి లక్ష్మీనరసింహమూర్తి. 14

మూడవనాడురాత్రి భోజనసమయమందు న్యాపతి సుబ్బారావు పంతులుగారు, కృత్తివెంటి పేర్రాజుపంతులుగారు, గంజాము వేంకట రత్నముగారు, బాదం వెంకటరత్నంగారు, మొదలగువారు నాచేత నాపద్యములు మరల మరల జదివించి, యానందించిరి. నాలుగవనాడు నేను రాజమహేంద్రవరము వెళ్లుచుండగా, కాకినాడ వీధులలో గొందరు మనుష్యులు నన్ను వ్రేలితో చూపి, "నిన్న పద్యములు జదివినవారు వీరే" యని, యొండొరులతో చెప్పుకొనిరి. ఆపద్యములు హరికథలలోగూడ హరిదాసులు పాడఁజొచ్చిరి. అవి జనరంజకముగ నున్నవనుట కదియే తార్కాణము. నాపద్యములు విని, నా మిత్రులైన పిళ్ళారిసెట్టి నారాయణ రావునాయుడుగారు, నాతో నిట్లనిరి. "ఇటువంటి పద్యములు, మీరు దొరతనమువారిని శ్లాఘించుచు చెప్పినపక్షమున, మీకు రావుబహదూరు బిరుదము తప్పక నిచ్చియుందురు." ఈ నారాయణరావునాయుడుగారు బి. యల్. పరీక్షయందు కృతార్థులై కొంతకాలము న్యాయవాదియై, పిదప డిస్ట్రిక్టుమునసబుగాను, సబుజడ్జిగాను పనిజేసి, నెల్లూరులో జిల్లాజడ్జిగ పని చేసి, పింఛను పుచ్చుకొని, కొలదిసంవత్సరములక్రిందట కాలధర్మమొందిరి.

ఈ పద్యములు మిక్కిలి మనోహరముగ నున్నవని తోచినందున, శ్రీ న్యాపతి సుబ్బారావుపంతులుగారు, వీటిని విజయనగరము పంపి నచ్చటి కళాశాలలో నాంగ్లేయభాషా పండితులయిన, శ్రీ గురజాడ అప్పారావు పంతులుగారిచేత నింగ్లీషుపద్యములుగ వ్రాయించిరి. తెలుగు పద్యములు నింగ్లీషుపద్యములు గూడ, మండలసభావృత్తాంతముల తెలియజేయు రిపోర్టులో (Godavary District conference Report)నచ్చువేయబడినవి. ఈ పద్యములు జూచి మాతండ్రిగారు పరమానందమునొంది, తనకు బరిచితులైన మాయూరి కాపులను జేర్చి, యివి జదివి వినిపించుచుండెడివారు.

స్వీయ చరిత్రము

ఏడవ ప్రకరణము

పితృమరణము

అయినను క్రొత్తయిల్లు కట్టుకొన్న సంతోషమును మేము చిరకాల మనుభవింపలేదు నిద్రాహారములులేక మా తండ్రిగారు స్వగృహ నిర్మాణమునకు మండువేసంగిలో దిరిగి శ్రమపడుటచేత, దేహములో జబ్బు చేసినది. ఆ సంవత్సరముననే యాయనకు గ్రహణి ప్రవేశించెను. ఆయన మొదటినుండియు మిక్కిలి సుకుమారి. ప్రతిదినము పగలు పదిగంటలకును, రాత్రి యెనిమిదిగంటలకును, భోజనముచేసెడివారు. గృహనిర్మాణ సందర్భములో వేళపట్టుకు భోజనముచేయుటకు వీలులేకపోయెను. ఎండలో దిరుగ వలసివచ్చెను. క్రమక్రమముగ రోగమెక్కువయ్యెను. నేను రాజమహేంద్రవరములో నుంటిని. మా తండ్రిగారు, నాకు తన దేహస్థితిని గురించి జాబువ్రాసి, సెలవుపుచ్చుకొని నన్ను రమ్మని వ్రాసిరి. ఆయన కోరిక ననుసరించి నేను సెలవుపెట్టి యింటికి పోతిని. మా తండ్రిగారికి రక్తగ్రహణి క్రమక్రమముగా హెచ్చెను. నీరసమెక్కువయ్యెను. అన్నద్వేషము గలిగెను ఆ యూరిలోనే వైద్యము చేయించితిని. అది గచ్చాకు పుచ్చాకు వైద్యమేగాని, శాస్త్రబద్ధమైన వైద్యముకాదు. ఎట్టకేలకు మా తండ్రిగారు మన్మధసంవత్సర భాద్రపదశుద్ధ మందు, ఏకాదశీ శుక్రవారమునాటి యుదయమున స్వగృహములో మృతినొందిరి. అనగా, 30–8–1895 తేదీని మా నాయనగారు మరణించిరి. మా తండ్రిగారు మరణించుసరికి మా బంధువు లెవరునులేరు. శ్మశానమునుండి వచ్చి మేమే వండుకొన నక్కరలేకుండ, మా కుటుంబమునకు చిరకాలమిత్రులైన నియోగుల కుటుంబమునుండి యొక వృద్ధవితంతువువచ్చి, మాకు వంటచేసిపెట్టి, సహాయము చేసెను. ఆమె సహాయము మే మెన్నడును మరువజాలము. క్రమక్రమముగ మా బంధువులందరును వచ్చిరి. ఆ సంవత్సరము, మా తండ్రిగారు పోయిన పదిదినములలోనే, గొప్ప గాలివాన పట్టెను. మా మేనమామగారు మా

జనకుని మరణవార్తనువిని, యా చానలోనే తడియుచు, రెండుగోదావరులు దాటి, యమలాపురమునుండి తొమ్మిదవనాటికి బహు శ్రమలుపడి మా వీరవాసరము వచ్చిరి. మేము ఋగ్వేదులమగుటచే, నాశ్వలాయనసూత్ర ప్రకారము మా తండ్రిగారికి నుత్తరక్రియలు జరుపవలసియుండెను. కాని ఋగ్వేదమంత్రము చెప్పునట్టి బ్రాహ్మణుడు చుట్టుప్రక్కల నెక్కడను దొరకనందున, యజుర్వేదమంత్రముచేతనే, తొమ్మిదవనాడు కర్మ ప్రారంభించి చేయవలసివచ్చెను. ద్వాదశాహస్సులు పూర్తియైన తరువాత, నేను పదమూడవనాడు రాజమహేంద్రవరమువెళ్ళి, తిరిగి పాఠశాలలో పనిచేయ నారంభించితిని.

మా పాఠశాలాధికారులు జీతము నష్టముమీద నాకు సెలవిచ్చిరి. నేనును, మా తమ్ముడును కలసి మాసికము పెట్టవలసి యుండిననూ, నేను రాజమహేంద్రవరములోను, నా సోదరుడు వీరవాసరములోను నుండుట చేత, ప్రతిమాసికము కలసిపెట్టుటకు వీలులేకపోయెను. మాసికముల నిమిత్త మొకప్పుడు మా తమ్ముడు రాజమహేంద్రవరము వచ్చుచుండెను. సెలవు దొరకినప్పుడు నేను వీరవాసరము వెళ్లుచుంటిని ఒకప్పుడు నెవరినో బ్రతిమాలి, వంటచేయించుకొని. రాజమహేంద్రవరములో నేను మాసికము పెట్టుచుంటిని. కర్మలమీద నా కంత నమ్మకము లేదు. గాని మా తల్లికిని, మేనమామగారికిని, బంధువులకును, నా మీద నాగ్రహము వచ్చునేమోయని యథావిధిగా జరిపితిని. అప్పటికే నా యభిప్రాయములలో గొంత మార్పు గలిగెను.

వీరేశలింగముగారిమీద నాకు గౌరవమెక్కువయ్యెను. 1893వ సంవత్సరము మొదలుకొని, రాజమహేంద్రవర ప్రార్థనసమాజ వార్షికోత్సవములయందు, నా కభిరుచి మెండుగ గలిగెను. ఆ దినములలో బ్రతిసంవత్సరము సంవత్సరాదినాడు, ప్రార్థనసమాజ వార్షికోత్సవముల సందర్భమున, వీరేశలింగము పంతులుగారు టవును హాలులో నొక సభచేసి, యమూల్యమైన యొక ధర్మోపన్యాసము చదువుచుండిరి. ఆ సభకు నేను పోయి, యుపన్యాసము శ్రద్ధగ వినుచుంటిని. ఏటేట సంవత్సరాది వెళ్ళిన తరువాత, మూడవదినమునకో, నాలుగవ దినమునకో, వీరేశలింగముగారు సాయంకాలమున, సారంగధర మెట్టమీదికివెళ్లి ప్రార్థనము చేయుచుండెడివారు. వారి వెంట ప్రార్థన సామాజికులు, కళాశాలా విద్యార్థులుగలసి రమారమి యేబది యరువదిమంది మెట్టమీదికి వెళ్లుచుండెడివారు. వీరేశలింగము

గారు కాలినడకమీదనే వెళ్లెడివారు. శిష్యులు నడ్డి నడచివెళ్ళెడువారు. నేను కూడ నాయుత్సవములకు నడచిపోయెడివాడను. రాత్రి యెనిమిదిగంట లైనతరువాత మెట్టదిగి. వీరేశలింగముగారును, శిష్యులును నడచియే ప్రార్థన గీతములు పాడుకొనుచు,పట్టణముచేరిస్వగృహములకు పోవుచుండెడివారు. సారంగధరుని మెట్టమీద ప్రార్థనమైనతరువాత, మిఠాయి, పకోడీలు మొద లగు నుపాహారములు పంచిపెట్టెడివారు.

ఈ సందర్భమున నా ప్రియమిత్రులైన రెబ్బాప్రగడ పాపయ్యగారిని స్మరింపవలయును. పాపయ్యగారు, పోలవరం జమీందారుగారి సంస్థాన ములో నుద్యోగముచేయుచు, ప్రార్థనసమాజ వార్షికోత్సవమునకు తప్పక వచ్చుచుండెడివారు. వచ్చి, వీరేశలింగముగారికి శ్రమలేకుండ, కార్యభారము పైవైచుకొని, పురమందిరమున చక్కని తోరణములు, పూలమాలలు కట్టించి, సభల కేర్పాటుచేసెడివారు. సంవత్సరాదినాడు ప్రార్థనసమాజ పక్షమున పేదలకు జరుగు సంతర్పణలో పాల్గొని వంటలుచేయించి, పేద లకు తాను స్వయముగ వడ్డించి, యా కార్యము జయప్రదముగ జరిపి, ప్రార్థనసమయములలో స్వయముగ తంబుర చేతపట్టుకొని, శ్రుతివేసి, తక్కిన సామాజికులతోపాటు తాముకూడ గీతములు పాడుచుండెడివారు. అదిగాకుండ, సారంగధర మెట్టమీదికి గావలసిన మిఠాయి మొదలగు భక్ష్య ములను, రెండుబిందెల నీళ్ళను, నీళ్ల త్రాగుటకు కొన్నిపాత్రలను, రెండు మూడు దీపములను, బండిమీద వేయించుకొని మెట్టమీదకు వచ్చి, ప్రార్థనా నంతరమున భక్ష్యములను వచ్చినవారికి స్వయముగ పంచిపెట్టి, మా కంద రకు సంతోషము కలుగజేయుచుండెడివారు. పాపయ్యగారు మొదటి నుండియు ప్రార్థనసమాజమున సభ్యులు. ఆ సమాజమన్న వారికి మిక్కిలి ప్రీతి. వీరేశలింగముగారు తలపెట్టిన సత్కార్యములన్నిటిలోను, పాపయ్య గారు తోడ్పడుచుండెడివారు. పాపయ్యగారు వీరేశలింగముగారిని దైవము వలె చూచుచుండెడివారు. పాపయ్యగారు విద్యార్థియైననాటనుండియు వీరేశ లింగముగారిమీద మిక్కిలి భక్తి. పాపయ్యగారు పరోపకారమన్న ముందంజ వేసెడివారు. ఒకరికి మేలుచేయుట వారికి మిక్కిలి యిష్టము.

1894 వ సంవత్సరమున సారంగధర మెట్టమీదికి వల్లూరి నరసింహ రాయుడుగారు కూడ వచ్చి, బ్రహ్మమతమునుగూర్చి, యింగ్లీషులో గంభీర మైన యుపన్యాసమిచ్చిరి. నేనును, నచ్చటనున్న సభాసదులును, వారి భావ ములను, వాగ్ధోరణిని విని, చాలసంతోషించి, బ్రహ్మమత వ్యాప్తికాయన

జీవితము ధారవోయుదురని భావించితిమి. కాని, కాలక్రమమున వారు గొప్పపదవులలోనికి వెళ్ళినకొలది, వారి యభిప్రాయములు మారజొచ్చెను. వారు బందరులో కృష్ణామండల విద్యాధికారిగ పనిచేసి, యుపకారవేతనము పుచ్చుకొని, రాజమహేంద్రవరమునకు వచ్చి, స్థిరముగ నచ్చట నివాస మేర్పరచుకొన్న తరువాత, మున్ను విగ్రహారాధనముమీ ద నెంతమాత్రము నిష్ఠములేని నరసింహారాయుడుగారు, పర్వతిదినము సాయంకాలమున, నిన్నీసుపేటనుండి నడచి మూర్ఖండేయస్వామివారి యాలయమునకుబోయి, ప్రదోషకాలమున నీశ్వ రసందర్శనము చేయునంతటి పూర్వాచారపరాయణు లుగ మారిరి. వారు 1941 వ సంవత్సరముననే కాలధర్మమునొందిరి. పర మేశ్వరుడు వారి యాత్మకు శాంతి బ్రసాదించుగాక.

1895 వ సంవత్సరమున జరిగిన బ్రార్థనసమాజ వార్షికోత్సములో, నేనును కొంత పాల్గొంటిని. పరిశుద్ధ జీవనమను విషయమును గూర్చి నే నొక ధర్మోపన్యాసమును వ్రాసి, దానిని సారంగధరుని మెట్టమీద, నా శిష్యుడైన దుర్గి గోపాలకృష్ణారావుచేత జదివించితిని. శ్రోతలు నాయుప న్యాసము మిక్కిలి బాగున్నదని మెచ్చిరి. ఆ యుపన్యాసము కాకినాడలో ప్రకటింపబడుచున్న "రాజయోగి" యను వారపత్రికలో ప్రకటింపబడెను. దాని ప్రతి నా యొద్ద లేకపోవుటచే, నిప్పుడది దుర్లభము. నా యొద్ద నొక చెడ్డయలవాటు గలదు. నేను వ్రాసిన పద్యముల నొక పుస్తకముమీదవ్రాసి దాచియుండెడు నభ్యాసము నాకు లేదు. అది యొక దురభ్యాసమేగాని, శ్లాఘ్యమైన పనిగాదు. ఇట్టి యశ్రద్ధచేతనే, నేను వ్రాసిన పద్యములెన్నో యుండినను, నా దగ్గర వాటి ప్రతులు లేకపోవుట తటస్థించెను. నా మిత్రు డైన వడ్డాది సుబ్బారాయుడుగారికి, స్వరచిత పద్యములన్నిటి నొక పుస్త కము మీద వ్రాసి, జాగ్రత్తపెట్టెడు మంచి యలవాటు గలదు. అందుచేతనే వారు తాము రచియించిన చాటుపద్యముల నన్నిటిని "చాటుపద్య మణిమం జరి"యని పేరుపెట్టి, యొకసంపుటముగ ప్రకటింపగలిగిరి. అట్టి యలవాటు నాకు లేనందుకు నేడు నేను విచారించుచున్నాను. విచారించిన ప్రయో జనమేమి?

ఆ సంవత్సరము గూడ న్యాపతి సుబ్బారావు పంతులుగారు, నవలలు వ్రాసిన వారికి బహుమానము లిచ్చెదమని ప్రకటించిరిగాని, నే నా యేడు నవల వ్రాయలేదు.

మ్యునిసిపల్ స్కూలులో నే నుపాధ్యాయుడనని వ్రాసితినిగదా: నెలకు నా కిరువదిరూపాయలు జీతము. మా తండ్రిగారున్నప్పుడు నాజీతము వారికి నెలనెలకు పంపుచుంటిని. మా తండ్రిగారు పోయిన తరువాత, వీర వాసరములోనున్న మా కుటుంబ వ్యయమునకై మా తమ్ముని పేర నెల నెలకు సొమ్ము పంపుచుంటిని. 1895 వ సంవత్సరము డిశంబరు నెలలో, శీతకాలపు సెలవులకు, వీరవాసరము వెళ్ళదలచితిని. అప్పుడు నా మిత్రు డైన చిత్రపు వెంకటనరసింహారావుగారియొద్ద, వీరవాసరములో మా తండ్రి గారు చేసిన యొకయప్పు తీర్చుకొనుటకై రెండువందల యేబదిరూపాయలు ఋణముచేసితిని. ఈ ఋణమునుగూర్చి యొకమాట వ్రాయవలయును. వీరవాసరములో తాడేపల్లివారని యొక నియోగికుటుంబముండెను. ఆకుటుం బమున జ్యేష్ఠుడు తాడేపల్లి రామయ్యగారు. ఆయన లోకలుఫండులో నోవరుసీరు ఆయన మకాము తాడేపల్లిగూడెమువద్దనున్న యనంతపల్లి. ఆయనయొద్ద మా తండ్రిగారు కొంత ఋణముచేసిరి. 1886 వ సంవత్సర ప్రారంభమున మా తండ్రిగారు నూటయేబదిరూపాయలు తీసికొని యనంతపల్లి వెళ్ళి రామయ్యగారి కిచ్చిరి. ఆయన యేదో పనితొందరమీద నుండుటచేతను, వారికి మా తండ్రిగారికి మిక్కిలి స్నేహమగుటచేతను, మా తండ్రిగారు దస్తావేజుమీద చెల్లు వ్రాయించలేదు. తరువాత నొక సంవ త్సరమునకు రామయ్యగారు గుఱ్ఱముమీదనుండి పడి యకస్మాత్తుగ మృతి నొందిరి. వారి కుటుంబము వీరవాసరమువచ్చి స్వగృహమున కాపుర ముండెను. కొన్ని వ్యవహార సందర్భములచేత, వారికిని మా కుటుంబము నకును విరోధము సంభవించెను. అందుచేత రామయ్యగారి భార్య వెనుక మా తండ్రిగారిచ్చిన వసూలు మినహాయించకుండ, యావత్తు సొమ్మునకు మా తండ్రిగారిమీద నరసాపురము కోర్టులో దావా చేసెను. మేము వసూలు యిచ్చినట్లు లిఖితపూర్వమైన సాక్ష్యము లేనందున, మునసబుగారు యావత్తు సొమ్మునకు మా తండ్రిగారిమీద డిక్రీ యిచ్చిరి. ఆ ఋణము తీర్చుటకై మా తండ్రిగారు మా బంధుపునియొద్ద మాభూమి యొకటి తనఖాపెట్టి బదులు తెచ్చిరి. అది 1895 సంవత్సరము డిశంబరు నాటికి వడ్డీతో రెండువందల యేబదిరూపాయలయ్యెను. ఆఋణము తీర్చుటకే నేను చిత్రపునరసింహారావు వద్ద బదులుపుచ్చుకొంటిని. ఆ యప్పు నేను మెలమెల్లగా తీర్చుకొంటిని. నరసింహారావుగారియొద్ద తెచ్చిన సొమ్ముతో భూమితనఖా వదలించి భూమి మా తమ్ముని స్వాధీనము చేసితిని.

ఆ సంవత్సర ప్రారంభమున మా రెండవచెల్లెలైన యచ్చమ్మ కావు రమునకు వెళ్లెను. డిశంబరునాటికామె గర్భవతియయ్యెను. మా బావమరది రామస్వామిగారు గత సంవత్సరము నాతోనే ట్రయినింగై, యప్పుడు కొత్తపేట బోర్డుస్కూలులో నుపాధ్యాయుడుగనుండి శీతకాలపు సెలవులకు మా యింటికి వచ్చెను. ఆ సెలవుదినములలో, దేవుని యూరేగింపులో భోగముమేళములనుపెట్టి యూరేగించుట గర్హించుచు, నేను కొన్నిపద్యము లను వ్రాసితిని. తక్కిన నా చాటుధారాపద్యములవలెనే, యివికూడ మృగ్య ములు. అవి కొన్నిపత్రికలలో పడినవిగాని యా పత్రికలు నేను జాగ్రత్త పెట్టలేదు. శీతకాలపు సెలవుల తరువాత, నేను రాజమహేంద్రవరము వెళ్ళితిని. 1896 వ సంవత్సరము ఫిబ్రవరి తొమ్మిదవతేదీని పీరవాసర ములో మా రెండవచెల్లెలు ప్రసవించినది ఆడపిల్లపుట్టెను. ప్రస్తుతము రాజమహేంద్రవరములో దొరతనమువారి బాలికాపాఠశాలలో నాంధ్రపండితు రాలుగానున్న, రావూరి వెంకటసుబ్బమ్మయే యా ప్రథమపుత్రిక.

ఆ సంవత్సరమున (1896) న్యాపతి సుబ్బారావు పంతులుగారు, నవలలకు బహుమాన మిచ్చెదమని తిరిగి ప్రకటించినందున నేనా సంవత్సర మున "హేమ్లెత" యను నవల వ్రాసి పంపితిని. ఇది చరిత్రాత్మకమైన నవల. పూర్వము తెలుగు నవలలకు వీరేశలింగముగారి "రాజశేఖర చరి త్రయే" మార్గదర్శకముగ నుండెను. అది చరిత్రాత్మకమైన నవల కాదు. అది సాంఘికమైన నవల. దానిని చదివియే నేను రామచంద్ర విజయమును వ్రాసితిని. చరిత్రాత్మకమైన నవల వ్రాయవలెనని సంకల్పము నాకు గలు గగా, నప్పుడు పూర్వము "మెడోసు టెయిలర్"ను దొరగారు వ్రాసిన నవల లలో టిప్పుసుల్తాను, తార, చాందుబీబి యను నవలలను నా మిత్రుడైన యొక యువకునిచే జదివించుకొని వింటిని. అవి విన్నతరువాత చరిత్రా త్మకమైన నవల వ్రాయువిధము నాకు దెలిసినది. ఆనంతరమున నేను "హేమలత" వ్రాసితిని. ఆ సంవత్సరమునగూడ పోటీకి పది నవలలు వచ్చెను. వీరేశలింగముగారు, వడ్డాది సుబ్బారాయుడుగారు, ఆచంట సుందరరామయ్యగారు నను మువ్వురు, నవలల గుణాగుణముల నెన్ను టకు పరీక్షకులుగా నియమింపబడిరి. అభిప్రాయభేదంబులు లేకుండ నీసారి పరీక్షకులు మువ్వురు నా "హేమలత" ప్రథమగణ్యమని తీర్పుచెప్పిరి. ఆ కారణమున సుబ్బారావుపంతులుగారు మొదటి బహుమానమునకు నియ

మింపబడిన నూట యిరువదియైదురూపాయలు నాకిచ్చిరి. దీనితో నేను మంచి నవలలు వ్రాయగలనని కొంత పేరు వచ్చెను.

ఆ సంవత్సరమున రెండవ గోదావరీ మండల సభ రాజమహేంద్ర వరమున జరిగెను. టవునుహాలుకు తూర్పుదిక్కున నున్న రెండుదొడ్లు కలిపి సభనిమిత్తము పెద్ద పాకవేసిరి. సభ యా పాకలో సమావేశ మైనది. కడపలో న్యాయవాదియు, చెన్నపురిశాసననిర్మాణసభలో సభ్యుడు నైన, శ్రీ జంబులింగము మొదలియారుగారు, సభ కధ్యక్షతవహించిరి. టవునుహాలులో తూర్పుప్రక్కనున్న గది, మహారాజశ్రీ నాళం కామరాజు గారివద్ద కొంతస్థలము, వీరేశలింగముగారు పుచ్చుకొని యా సంవత్సరమే కట్టించిరి. కట్టినది మొద లిప్పటివరకు బిలియర్డ్సు బల్ల యా గదిలోనే యున్నది. అప్పుడే కట్టుటచేత సభకు వచ్చిన ప్రతినిధుల కందుపాహార ములు మొదలగునవి యీయబడెను. సభ మూడుదినములు చక్కగా జరుపబడెను. ప్రాతగోదావరి జిల్లానుండి ప్రతినిధులు విశేషముగ వచ్చిరి. వెనుకటి సంవత్సరపు సభలో వలెనే, నేనీ సంవత్సరపు సభలోగూడ, కొన్నిపద్యములు వ్రాసి జదివితిని. ఈ పద్యములు ప్రస్తుతము నావద్దలేవు గాని, యివి గతసంవత్సర పద్యములంత చక్కగలేవని, నామిత్రులు కొంద రభిప్రాయపడిరి. ఆ దినములలో రాజకీయసభతోపాటు, మండల సంఘ సంస్కరణసభకూడ, జరుగుచుండెడిది. ఈ సంఘసంస్కరణసభకు మహారాజశ్రీ దురిశేటి శేషగిరిరావు పంతులుగా రధ్యక్షతవహించిరి. ఈ సంఘసంస్కరణ సభలో నేనుకూడ పాలుగొంటిని. మహారాజశ్రీ దాసు శ్రీరాములుపండితులు స్త్రీవిద్యనుగురించి, యా సభలో గంభీరమైన యుపన్యాసమిచ్చిరి.

ఆ సంవత్సరమున దుర్ముఖి సంవత్సర పుష్కరము జరిగెను. యాత్రికులకొరకు దొరతనమువారు, కోటిలింగాలవద్ద తాటియాకులపందెళ్లు, పాకలు వేయించి, వసతులేర్పరచిరి. ధర్మవరసంస్థానపు ప్రొప్రయిటరులు, మిక్కిలి యుదారశీలురు నయిన శ్రీ కంచుమర్తి సీతారామచంద్రరావు జమీందారుగారు, యాత్రికుల సౌకర్యముల నిమిత్తము, నూతినీళ్లు కుళాయి గొట్టములద్వారా తెప్పించు నేర్పాటుచేసిరి. పుష్కరనగరములో, మంచి మంచి బాటలు వేయించుటలో, వీరు దొరతనమువారికి మిక్కిలి తోడ్పడిరి. ఆ పుష్కరములో వారు మిక్కిలి శ్రమపడిరనుట యతిశయోక్తికాదు. ఇంతియేకాదు. జనోపయోగమైన ప్రతికార్యమునందును, శ్రీ రామచంద్ర

రావుగారు మేసు దాచుకొనక, బహుశ్రమపడి పనిచేసి, రాజమహేంద్ర వరమునకు మంచి యశస్సు సంపాదించెడివారు. వీరు సంఘసంస్కరణ ప్రియులు. వీరేశలింగముగారియెడల మిక్కిలి భయభక్తులుగలిగి యుండెడి వారు. ఆకారణముచేతనే, వీరేశలింగముగారు టవునుహాలుకు ధర్మకర్తల నేర్పరచునప్పుడు, శ్రీ కందుకూరి రామచంద్రరావుగారిని యావజ్జీవ ధర్మకర్తగ నేర్పరచిరి. ఆ పుష్కరమునకుగూడ నానాదేశములనుండి యాత్రికులు వేలకొలది వచ్చిరి. ఆకాలమున రాజమహేంద్రవరములో, "ఎల్‌ఫిన్‌స్టన్" దొరగారు సబుకలెక్టరుగ నుండిరి. ఈయన తక్కిన యుద్యోగస్థుల వంటివారుకారు. మానవసేవా పరాయణులు, పరోపకార తత్పరులు. ఈయన, గోదావరి రేవులలో జనులు పడిపోకుండ, కర్ర దూలములతో మెట్లుకట్టించి, జారిపడకుండ రేవులలో దూలములుపాతించి, బహు సౌకర్యములు గావించిరి. పుష్కరములో విభూచి జాడ్యములుకూడ బయలుదేరెను. ఈదొరగారు పాయకానదొడ్లకు స్వయముగపోయి పరిశ్రమ చేయించి, విభూచిజాడ్య పీడితులకు మందులిప్పించి, యెన్ని విధములచేతనో ప్రజల కృతజ్ఞతకు పాత్రులైరి.

ఆ సంవత్సరమున మా పురప్రముఖులలో నొకరైన శ్రీ చల్లపల్లి రంగయ్య పంతులుగారు, మ్యునిసిపల్ సభ్యులుగనుండి, దొరగారు ప్రజా క్షేమముకొరకు చేసినపనియెల్ల గుర్తించి, వారిని గౌరవించుటకొక సభ గావించి, వారిమీద కొన్ని పద్యములు రచింపుమని నన్నుగోరి, నాచేత గొన్ని పద్యములు చేయించి, యాసభలో నెవరిచేతనో చదివించి సంతసించిరి. విన్నవారందరు పద్యములు చాల చక్కగా నున్నవని నన్ను శ్లాఘించిరి. రంగయ్య పంతులుగారా పద్యముల నచ్చువేయించి జనులకు పంచిపెట్టించిరి. రంగయ్య పంతులుగారు, డిస్ట్రిక్టు మునసబుపనిచేసి, పించను పుచ్చుకొని, కొంతకాలము మ్యునిసిపల్ సభ్యులుగాను, కొంత కాలము తాలూకాబోర్డున కుపాధ్యక్షులుగను, పనిచేసిరి. మునసబుగనున్న కాలమున, వీరు లంచమన్న దెరుగక, మిక్కిలి న్యాయముగ ప్రవర్తించి ఖ్యాతి గడించిరి. ఈయన 1906 వ సంవత్సరమున స్వగృహములో కాల ధర్మము నొందిరి. ఈయన మోడేకుర్రులో వేదసంస్కృత పాఠశాల నొకటి స్థాపించి, పండితులకు జీతములిచ్చి, చనిపోవువరకు పాఠశాల నడపిరి. ఆకారణమున వీరు వందనీయులు.

1896 వ సంవత్సరమున నేప్రియల్ నెలలో రాజమహేంద్రవర మున నొక గొప్పమార్పు జరిగెను. దొరతనమువారి కళాశాలలో ప్రధానా చార్యులుగ నుండిన మెట్కాఫ్ దొరగారు పింఛను పుచ్చుకొని సీమకు వెళ్ళిరి. ఆయన 1876వ సంవత్సరము డిశంబరు నెలలో రాజమహేంద్ర వరము వచ్చిరి, వారు వచ్చునప్పటికి రాజమహేంద్రవర విద్యాశాల యున్నత పాఠశాలగ నుండెను. అప్పుడు దానికి శ్రీ చంగల్వల కుప్పు స్వామి శాస్త్రిగారు ప్రధానోపాధ్యాయులుగ నుండిరి. మెట్కాఫ్‌గారు మొట్టమొదట ప్రధానోపాధ్యాయులుగ వచ్చి క్రమక్రమముగ దానినే పెద్ద కళాశాల చేసిరి. బోధనాభ్యసన కళాశాల కూడ స్థాపించిరి. ఆంధ్ర మండలమునకు ముఖ్యముగ ను త్తరసర్కారులకు, మెట్కాఫ్ దొరగారు విద్యావిషయమున చేసిన మహోపకారము తరతరములవరకు మరువదగినది కాదు. పేదవిద్యార్థులకు విద్యాభ్యసనము నిమి త్తము గొప్పనిధి ప్రోగుచేసి, యా నిధినుండి విద్యార్థులకు సొమ్మిచ్చి, యెందరో పేదవిద్యార్థులను పట్ట పరీక్ష సిద్ధుల జేసెను. ఆయన రాజమహేంద్రవరమున నిరువది సంవ త్సరములు (అనగా 1876 - 1896) వరకు కళాశాలా ప్రధానాచార్యులుగ పనిచేసిరి. అక్కడనుండి యొక్కసారియైన బదిలీకాలేదు. గోదావరి యన్నను రాజమహేంద్రవర మన్నను నాయనకు మిక్కిలి ప్రీతి. వారు పింఛనుపుచ్చుకొని, సీమ వెళ్ళినతరువాత, లండను నగరమున నొక భవ నము నిర్మించుకొని, దానికి "గోదావరీ భవనము" (Godavari House) అని పేరుపెట్టిరి. వారికి రాజమహేంద్రవర మీదగల ప్రీతికిదే గొప్ప యుదా హరణము. 1896వ సంవత్సరము యేప్రియలు నెలలో, వీరు రాజమహేంద్ర వరమువిడిచి వెళ్లునప్పుడు, వారి గౌరవార్థము వారి ప్రాతశిష్యులు, క్రొ త్త శిష్యులు, పురప్రముఖులుగలసి గొప్ప యుత్సవము చేసిరి. కళాశాలా భవనము మొదలు మ్యూజియమువరకు నెన్నో పందిళ్లు వేయబడెను. తోరణములు కట్టబడెను. కాగితపు బుట్టలు వ్రేలాడదీయబడెను. శిష్యు లును, పురప్రముఖులును మెట్కాఫ్ దంపతులను, గుర్రపుబండినీద గూర్చుండబెట్టి, జేజేధ్వనులతో మంగళవాద్యములతో నూరేగించిరి. ఆ మహోత్సవము గవర్నరులకు గూడ జరుగదనుట యతిశయో క్తిగాదు. అది హృదయమునుండి వచ్చిన కృతజ్ఞతాపూర్వక ప్రేమ. సాయంకాలము మ్యూజియమావరణలో గొప్పసభ జరిగెను. ఆ సభ కప్పుడు జిల్లాజడ్జిగ నుండిన మెకంజీ దొరగారధ్యతక్షవహించిరి. పురప్రముఖు లనేకులు, దొర

గారి యోగ్యతను గూర్చియు, సామర్థ్యమును గూర్చియు వారాంధ్రదేశమునకు చేసిన మహోపకారమును గూర్చియు, బహువిధముల ప్రశంసించిరి. అప్పుడు శ్రీ వడ్డాది సుబ్బారాయుడుగారు కొన్ని పద్యములు రచించి చదివిరి. దొరగారియెడల నాకుగల భక్తి తెలియజేయుటకై నేనును గొన్ని పద్యములు రచియించి సభలో చదివితిని. నా పద్యములకన్నను సుబ్బరాయుడుగారి పద్యములెక్కువ మనోహరములుగ నుండెను.

ఆసంవత్సరము జూనునెలలో, మామునిసిపల్ స్కూలుకు ప్రధానోపాధ్యాయులైన వల్లూరి నరసింహరాయుడుగారు, పనిమానుకొని, యెక్కువ జీతముమీద శ్రీకాకుళమువెళ్ళిరి. ఆయనస్థానమందప్పటి మ్యునిసిపల్ సభాధ్యక్షులైన నిడమర్తి జలదుర్గప్రసాదరాయుడుగారు, పట్టపరీక్షసిద్ధులైన చేబియ్యము వేంకటరామయ్యగారిని, ప్రధానోపాధ్యాయులుగ నియమించిరి. ఆయన బోధనాభ్యసనమునొందినవారుగారు. ఈ వేంకటరామయ్యగారు పూర్వము హనుమంతరావునాయుడుగారివద్ద చదువుకొన్న శిష్యుడు. నాకు మిక్కిలి మిత్రుడు. నాకేగాదు, వేంకటరామయ్యగారు సర్వజనమిత్రుడు. ఎంతోమంచివాడు. ఆయనగూడ శ్రీ రాయవరపు అప్పారావుగారి యింటనే గాపురముండెను. నేనును రాయవరపువారి యింటనే యుండుటచేత మా యిరువురకును మైత్రి హెచ్చెను.

ఈ సంవత్సరమున (1896) మాకుటుంబమున కొక కష్టము గలిగెను. మాతండ్రిగారి సంవత్సరీకమునకు నేను పీరవాసరము వెళ్ళితిని. ఆ సంవత్సరీకములో మూడవరోజున జాబుపట్టుకొని యొకమనుష్యుడు వచ్చెను. నా పెదచెల్లెలి పెనిమిటియైన యద్దంకి వేంకటరామయ్యగారికి జబ్బుగనున్నదనియు, వెంటనే యందరు బయలుదేరి రావలసినదనియు, మా చెల్లెలు వ్రాయించిన జాబది. జాబులోని విషయములు తెలిసిన వెంటనే మా కందరకు గుండెలలో రాయిపడెను. త్వరగ భోజనములు ముగించి, యానాటి మధ్యాహ్నమే బయలుదేరి, విచారపూరితములైన హృదయములతో నెట్టెటో సాయంకాలమునకు, నరసాపురము జేరితిమి. మా చెల్లెలు పూర్ణమ్మ మిక్కిలి బెంగపెట్టుకొని యుండెను. కీడులో మేలన్నట్లు మా పినతల్లియు, నామె పెనిమిటియైన ముల్లంగి వెంకయ్యగారును సంవత్సరీకముల నిమిత్త మాలమూరునుండి పీరవాసరము వచ్చినందున, వారుగూడ మాతో నరసాపురమువచ్చిరి. మా బావగారిస్థితి మేము వెళ్లినప్పటి కెంతమాత్రము బాగుగలేదు. జ్వరము తీవ్రముగ గాయుచుండెను.

రాత్రులు నిద్రలేదు. లేచినప్పుడు కన్నులు దిరుగుచుండెను. ఆజబ్బుజూచి నేను భయపడి, యింగ్లీషుమందు నిప్పించవలెనని, నాకు రాజమహేంద్ర వరములో మిక్కిలి పరిచితులై యప్పుడు నరసాపురములో డాక్టరుగ నుండిన బజాక్ సాహేబుగారినిజూచి, మాబావగారికి మందిమ్మని కోరితిని ఆ సాహేబుగారు మిక్కిలి మంచివారగుటచే, మా బసకువచ్చి రోగినిజూచి, మందిచ్చెదనని చెప్పిరి. కాని యామందు మా బావగారి నోటబడలేదు. మాపినతండ్రి కాయుర్వేదవైద్యముమీదనేగాని యింగ్లీషువైద్యముమీద విశ్వాసములేనందున, నామాట సాగనియ్యక, యతడు రుస్తుంబాదానుండి మాటలునేర్చిన యొక తెనుగువైద్యుని బిలిచి మందిప్పింపసాగెను. కాని మందుదారి మందుదేయయ్యెను. రోగముదారి రోగముదేయయ్యెను. మా పినతండ్రి మాకు ధైర్యము చెప్పసాగెను. రోగము నానాటికిహెచ్చెను. మాబావగారికి సంధించెను. మొదట రాత్రియే ప్రేలజొచ్చెను. కాని పిదప పగలుకూడ ప్రేలజొచ్చెను. వైద్యులు లంఘనముగట్టుటచే నీరసము హెచ్చెను. జ్వరాతిసారముబుట్టెను నేను భయపడి నా మేనమామగారికి జాబువ్రాసితిని. ఆయన అమలాపురమునుండి, కష్టపడి నరసాపురము వచ్చిరి. ఆయనరాకతో మాకు కొంత ధైర్యముగలిగెను. ఆదినములలో నామనసు విచారాక్రాంతమైనపుడు, పూర్వము నాగురువులై యప్పుడచ్చట న్యాయవాదులుగనుండిన, వలివేటి భాస్కరశాస్త్రిగారింటికి నేను తరుచుగ బోయి, వారిసలహాను బుచ్చుకొనుచుంటిని. అప్పుడు నామిత్రులైన కూచి నరసింహముగారు, పెయిలరు పాఠశాలకు ప్రధానోపాధ్యాయులుగనుండి నందున, వారికడకుగూడ నప్పుడప్పుడు బోవుచుంటిని. అప్పుడు వారు రామకృష్ణపరమహంసగారి ధర్మోపదేశములను పద్యములుగ రచియించు చుండి, నాకు వాటిని వినిపించుచుండెడివారు. మరియు నామిత్రులైన కొప్పలి వేంకటశివరావుగారికడకును, అద్దంకి ముఖ్యప్రాణరావుగారి యింటి కినిబోయి మనశ్శాంతినొందుచుంటిని. మా దురదృష్టము ఘండినందున, మాబావగారు, దుర్ముఖిసంవత్సర భాద్రపద బహుళ చతుర్థి శనివారము నాటి యుదయమున, లోకాంతర్గతులైరి. మాబావగారికి సంతానములేనందున, మా చెల్లెలిమీద కర్తవ్యముబెట్టి, మాతమ్ముడు కృష్ణమూర్తియే కర్మచేసెను. ఆదినము 1896 వ సంవత్సరము సెప్టెంబరు, 24 తేదీయని నాకు జ్ఞాపకము. మాబావగారు కాపురమున్నది యద్దెయిల్లగుటచే, మాబందుగులందరు కర్మ, వీరవాసరములో చేయింపనిశ్చయముజేసిరి. ఈవిధముగ మాతండ్రి

గారి వియోగముచేత గలిగిన దుఃఖవ్రణము మనసున మానకమునుపే, సంవత్సరమునకే పిడుగువలె ఘోరదుఃఖము మాకుటుంబముపై బడెను. సంవత్సరమునుండి వైధవ్యదుఃఖమనుభవించుచున్న తల్లికి, మరింత దుఃఖహేతువైన, వైధవ్యభారముచే గ్రుంగిన కూతురు తోడయ్యెను. మావాండ్రనందర వీరవాసరము బొమ్మని యేర్పాట్లుజేసి, నాకు సెలవు లేనందున, నేనొకటవ యక్టోబరునాటికి, రాజమహేంద్రవరమువెళ్ళి పనిలోజేరితిని. కాని నామనసు కొన్నాళ్ళవరకు దుఃఖపూరితమైయుండెను. ఆసంవత్సరము నవలలలో నాకు మొదటి బహుమానమువచ్చినదన్న సంతోషము లేకపోయెను. నాకువచ్చిన "హేమలతా" బహుమానము నుండి, కొంతసొమ్ముతో చిత్రపు నరసింహారావుగారియొద్ద నేజేసిన ఋణములో గొంత దీర్చితిని. మాబావగారు చాలభూమి సంపాదించిరిగాని వానిలో జిరాయితీలెక్కువ, చెల్లించవలసినవన్నులుగూడ నెక్కువే. ఆయన చనిపోవునప్పటికి కొంతఋణముకూడ నుండెను. మాపినతండ్రి గారు దుఃఖములోనున్న మాకుటుంబమునువిడిచి వెంటనేవెళ్ళక, భార్యా సమేతముగ కొంతకాలము వీరవాసరములో మాయింటనుండిరి ఆయన సాయమున, మాతమ్ముడు మాబావగారి భూములు కొన్ని విక్రయించి, ఋణములుకొన్ని తీర్చెను.

1896 వ సంవత్సరము డిశంబరునెలలో శీతకాలపు సెలవులలో నేను వీరవాసరము వెళ్ళితిని. భర్తృవియోగ దుఃఖమున మిక్కిలి గుందు చున్న మా సోదరి నోదార్చుటకే, నేను వీరవాసరము వెళ్లుటకు ముఖ్య కారణము. ఆసెలవు దినములు వ్యర్థముగ గడుపకుండ నేను "హిందూ దేశపు వీరవనితలు" (Heroines of India) అను నింగ్లీషు గ్రంధమును, నాతోగూడ రాజమహేంద్రవరమునుండి పట్టుకొనివెళ్ళి, నా చిన్న బావ మరదియైన మధునాపంతుల రామస్వామిచేత, చదివించుకొని వింటిని. అది యింగ్లీషులో మన్మధనాథ దత్తుగారిచే వ్రాయబడిన గ్రంధము. అం దనేక కథలుగలవు. వానిలో సంయుక్తాదేవి కథకూడ నుండెను. ఆకథ రసవంతమై నామనసు నాకర్షించుటచేత, దానిని నేను దెనుగులో నొక చిన్న పద్యకావ్యముగ వ్రాయవలయునని, సంకల్పించితిని. మా పాఠ శాలకు మఱునటి సంవత్సరము జనవరి 17 తేదీవరకు సెలవు లుండుటచే, నేనాదినములలో "పృథ్వీరాజీయ"మని పేరుపెట్టి సంయుక్తాదేవి కథలో రమారమి నూరు పద్యములు వ్రాసితిని. ఆదినములలో ధైరము జగన్నా

ధముగారనువారు, మా గ్రామమునకు రెవిన్యూ యినస్పెక్టరుగనుండిరి. ఆయన మిక్కిలి మంచివారు. గతసంవత్సరము మా తండ్రిగారు చని పోయినపుడు వారు మాకెంతో సాయముజేసిరి. మొక్కపాటి సుబ్బా రాయుడుగారు, ధేరము జగన్నాధముగారికి మేనల్లుడు నల్లుడు గూడను. అప్పుడు సుబ్బారాయుడుగారు, నెలవు దినములలో మేనమామగారింటికి వచ్చిరి. ప్రతిసంవత్సరమాయన మేనమామగారింటికి వచ్చుచుండుటచే, సుబ్బారాయుడుగారికిని మా తమ్మునకును స్నేహమాయెను. ఆమైత్రిచే వారు మా తమ్మునిజూచుట కప్పుడప్పుడు వచ్చుచుండుటచే, నాకుగూడ వారితో బరిచయమయ్యెను. ఆంధ్ర సారస్వతమునందు సుబ్బరాయుడు గారికి మిక్కిలి యభిరుచిగలదు. వారు శ్రీ రఘుపతి వేంకటరత్నము నాయుడుగారి శిష్యులగుటచే నాంగ్లేయభాషలోగూడ మంచి పాండిత్యము గలదు.

సుబ్బారాయుడుగారు నా "పృథ్వీరాజీయము"లోని పద్యములు, నేను వ్రాయుచున్న కాలములోనే విని సంతసించి, వ్రాయుమని నన్ను ప్రోత్సాహపరచుచు వచ్చిరి. సుబ్బారాయుడుగారు, పిఠాపురములో మహా రాజుగారియొద్ద నాంతరంగిక కార్యదర్శి (Private Secretary) గాను, పిమ్మట మంత్రిగాను, పనిచేసినప్పుడుకూడ నన్ను గలసికొన్నపుడు, ప్రేమాతిశయములు గలిగి యాదరించి, గౌరవించి, "పృథ్వీరాజీయము" మిక్కిలి బాగున్నదనియు, దానిని సమాప్తముచేసి ప్రకటింపకపోవుట తప్పనియు, నాతో నెన్నిసారులో చెప్పిరి. 1899 వ సంవత్సరమునాటికి నేను "పృథ్వీరాజీయము"లో రెండాశ్వాసములు వ్రాసితిని. ఆ పద్యములు రెండువందలయ్యెను. ఆ గ్రంథమంతయు నేనొక పుస్తకములో నెక్కించి తాళములేని యొకపెట్టెలో బెట్టితిని. అది పనికిమాలిన పుస్తకమనుకొని, నా పెద్దమేనకోడలు రావూరి వెంకటసుబ్బమ్మ చింపివేసెను. పృథ్వీరాజీయ మావిధముగ నామావశేషమయ్యెను. తిరిగి నేను దానిని వ్రాయుటకు ప్రయత్నింపలేదు. అందులోని పద్యములుకొన్ని మనోహరములుగానే యుండెను. పుస్తకము నాశనమైనను దానిమీద ప్రేమ నాకిప్పటికిని పోలేదు. మృతినొందిన బాంధవునికై విచారించుట యెట్టిదో, నాశనమైన పుస్తకమునకై విచారించుట యట్టిదేకదా?

1897 వ సంవత్సరమున గూడ న్యాపతి సుబ్బారావు పంతులుగారు, మేలైన నవలలు వ్రాసినవారికి బహుమానములను మునుపటివలెనే ఇచ్చెద

మని ప్రకటించిరి. ఆ సంవత్సరము నేనూరకుండక "అహల్యాబాయి" యను నవలను వ్రాసి పంపితిని. గ్రంథపరీక్షకులు వీరేశలింగముగారు, ఆచంట సుందరరామయ్యగారును. ఆ సంవత్సరము పోటీపరీక్షకు నవల లెన్నివచ్చినవో నాకు జ్ఞాపకములేదు, గాని, వచ్చిన నవలలన్నిటిలో నా "యహల్యాబాయి" కే మొట్టమొదటి బహుమానము వచ్చెను. లక్ష్మీ నరసింహముగారు నవల వ్రాసిపంపిన సంవత్సరము, వారికేగాని మరి యెవరికిని బహుమానము రాదని, లోకములో నొక వాడుకపడెను. నవ లల పోటీపరీక్ష యా సంవత్సరముతో సమాప్తమయ్యెను. ఈ నవలలు వ్రాయుటవలన నాకు ధన లాభమేగాక సాధారణపు నవలలు చరిత్రాత్మక మైన నవలలు వ్రాయుటకు శక్తియు నుత్సాహమును గలిగెను. పోటీపరీక్ష సమాప్తమని నేననుటకు కారణమేమన, చింతామణీ పత్రికా ప్రకటనము చేతను, నందు గద్యపద్య గ్రంథములనేకములు ప్రకటించుటచేతను, నవ లలకు బహుమానము లిచ్చుటచేతను, సుబ్బరావు పంతులుగారికి చాల ధనము వ్యయమయ్యెను. ఆ వ్యయమున కాయన విచారించలేదు. పత్రికా ప్రకటనమున నాయనకు మిక్కిలి సహాయభూతులైన వీరేశలింగముగారా సంవత్సరము జెన్నపురికి బోదలచుటచే, చింతామణీ పత్రిక యప్పటినుండి చెన్నపట్టణములోనే ప్రకటింపబడుననియు, నవలలు వ్రాసెడివారు పంప వచ్చుననియు, మేలైన నవలలకు మునుపటివలె ధనబహుమానము లీయ బడవనియు, గ్రంథకర్తలకు కొన్నిప్రతు లచ్చువేసి యివ్వబడుననియు, సుబ్బారాపుపంతులుగారు ప్రకటించిరి. అందుచేత నేనప్పటినుండియు పోటీకి నవలలు పంపుట మానితిని.

1896 వ సంవత్సరం డిశంబరులో వీరేశలింగముగారు తంజావూరు నగరమునకు నముద్రితాంధ్ర గ్రంథములను సంపాదించుటకై వెళ్ళిరి. ఆ పురమును తెనుగునాయకులు పరిపాలించినపుడు యమూల్యమైన యాంధ్ర గ్రంథ భాండారమొకటి సంపాదించియుంచిరి. మనదేశములో నెచ్చటనుదొర కని యాంధ్రగ్రంథము లనేకములచ్చట దొరకుచు వచ్చెను. నాచనసోముడు రచియించిన "యుత్తరహరివంశ"మను మహాకావ్యము, తెనుగుదేశమున నెవరెంత ప్రయత్నించినను దొరకినదిగాదు. వీరేశలింగముగారు తంజా పురీ గ్రంథభాండారములోని పుస్తకములజాబితా తెప్పించిచూడగ, నందులో నాచనసోముని యుత్తరహరివంశముయొక్క వ్రాతప్రతి యొకటి యున్నట్లు కనబడెను. ఆ గ్రంథము నశించిపోయినదని చింతించుచున్న వీరేశలింగము

గారికి, పేదకు పెన్నిధి దొరకినట్లయ్యెను. వెంటనే వారు వ్యయప్రయాసము లకు లోనై తంజావూరుపోయి, యప్పుడచ్చట మండల న్యాయాధిపతిగ నుండిన "హేమ్‌నెటు" (Hamnet) దొరగారి సహాయమున, నెవరిచేతనో "యుత్తరహరివంశము"న కొక ప్రతి వ్రాయించి, తెప్పించి, తమవివేకవర్ధనీ ముద్రాక్షరశాలలో దానిని ప్రకటింప నారంభించిరి. నాచనసోముని కవిత్వము, కవిత్రయము వారి పాకముకంటెను మిన్నగనుండునని "శబ్దరత్నాకర" నిర్మాతలైనబహుజనపల్లి సీతారామాచార్యులుగారును, వీరేశలింగముగారును వ్రాయుటచేతను, నాచనసోముడు మూడవకన్ను దాచివచ్చిన శివుడేయని పూర్వము చిన్నయసూరిగారు మెచ్చుటచేతను, సోముని కవిత్వ మెంత బాగుండునో చూడవలెనన్న కుతూహలము మిక్కుటమగుటచేతను, గ్రంథము ప్రకటింపబడినదాక వేచియుండుటకు నా కోపికలేక, నే నొక చిన్న దొంగతనము జేసితిని. చేసినపాపము చెప్పిన పోవునని మనలో నొక సామెతగలదు. దానింబట్టి నా తప్పు నే నొప్పుకొనుచున్నాను. పాఠక మహాశయులు నన్ను క్షమింత్రుగాక.

ఆ దినములలో వివేకవర్ధనీ ముద్రాక్షరశాలకు నా మిత్రుడైన కోపల్లె శేషగిరిరావు ప్రవర్తకుడు (Manager) గ నుండెను. నేనాతని నాశ్రయించి యొక్కక ఫారము (ఎనిమిదిపుటలు) యచ్చువడగనే, వీరేశలింగముగారికి తెలియకుండ, శేషగిరిరావు నడిగి తెచ్చుకుని యింటివద్ద నెవరిచేతనో చదివించుకొని విని, ముఖ్యమైన పద్యములు కొన్ని వల్లించితిని. గ్రంథ ముద్రణము సమాప్తమైన తరువాత వీరేశలింగముగారు నా కొక పుస్తక మును బహుమాన మిచ్చిరి. అప్పుడు నేను నా కదివరకే దానిలోని పద్యములు పెక్కువచ్చునని వారితో చెప్పితిని. ఎట్లు వచ్చునని నన్ను వారడిగిరి. నేను దాచక వారి కార్యస్థానమున నే జేసిన దొంగతనము వారి యెదుట నొప్పుకొని క్షమింపుమని యడిగితిని వారు కోపపడక నవ్వి యూరకుండిరి ఆ మహాత్ముని భాషాభిమానముచేతనే, ముస్సు నశియించినదని చెప్పుకొన్న యుత్తరహరివంశము, మన యాంధ్ర సార స్వతమున కలంకారమై ప్రకటింపబడెడు భాగ్యము గలిగెను. వీరేశలింగము గారు మన యాంధ్రమండలములకు జేసిన మహోపకారములలో నిది యొకటి. నా చేసిన దొంగతన మిది యొకటియేకాదు, మరియొకటికూడ గలదు. అది వడ్డాది సుబ్బారాయుడుగారి "వేణీసంహారము" విషయమున, నేను రాజమహేంద్రవరము వచ్చిన క్రొత్తలో నొకనాడు సుబ్బారాయుడు

గారి యింటికివెళ్ళి వారుచదువుచుండగ "వేణీసంహారము"లో కొంతభాగము వింటిని ఆ దినములలో సుబ్బారాయుడుగారు "హిందూ నాటకోజ్జీవక సమాజ"మని యొక నాటకసమాజమును స్థాపించి నాటకము లాడించు చుండిరి. వారొకసారి "వేణీసంహారము"ను నాడిరి. ఆనాడు కనుపర్తి శ్రీరాములు గారశ్వత్థామ పాత్రను వడ్డాది సుబ్బారాయుడుగారు ధర్మరాజు పాత్రను, సుసర్ల శ్రీనివాసరావుగారు ద్రౌపది పాత్రను, సుసర్ల అనంతరావు గారు దుర్యోధనుడు పాత్రను ధరించిరి. ఆనాడు నే నా నాటకమునకు వెళ్ళితిని. శాంతరసము కరుణరసము నుట్టిపడునట్లు సుబ్బారాయుడుగారు ధర్మరాజుపాత్ర నభినయించిరి. ఇదియేగాదు. సుబ్బారాయుడుగా రొకమారు తమ నాటకములో నశ్వత్థామపాత్రనుగూడ ధరించిరి. అశ్వత్థామ పాత్ర ధరించినపుడు వీరురౌద్రరసములను- ధర్మరాజుగ నున్నప్పుడు శాంతకరుణ రసములను, నానాటి ప్రేక్షకులు మరువరు. నేనుజూచిన "వేణీసంహార" నాటకప్రదర్శనములో నాటకాంతమున గ్రంథములోలేని యొక దండకముతో శ్రీ కృష్ణుని స్తవముచేసిరి. ఆ దండకము ముక్కు-తిమ్మన చేసిన "పారిజాతాపహరణము"లోనిది. పద్యములు చదువుటలోను, దండకములు చదువుటలోను, మిక్కి-లి నేర్పుగల సుబ్బారాయుడుగారి నోటనుండి వినినప్పుడు నా యొడలు పరవశమయినది.

మరునాటి యుదయమున నేను బజారునకు బోయి "పారిజాత" ప్రబంధమును మూడణాలిచ్చి కొని యెనుబదిపంక్తులలోనున్న యా దండకమును నే నొక్క-పూటలో పల్లించితిని. వల్లించి యేబదిసంవత్సరము లయినను నాకది యిప్పటికిని పూర్తిగ జ్ఞాపకమున్నది. నా శరీరదౌర్బల్యము లెన్నియున్నను భగవంతుడు నాకు బరిపూర్ణకటాక్షముతో జ్ఞాపకశక్తి మెండుగనిచ్చెను. సుబ్బరాయుడుగారు, తమ "వేణీసంహార" నాటకమును, వీరేశలింగముగారి వివేకవర్ధనీ ముద్రాక్షరశాలలో నచ్చొత్తించిరి. గ్రంథ మంతయు నచ్చుపడి వచ్చినదాక, కనిపెట్టుకొని యుండుటకు నా కోపికలేక, ముద్రణములో నుండగనే, యచ్చుపడినకాగితము లొకమిత్రునిచేత రహస్యముగ దెప్పించి, పద్యములు ముందే పల్లించితిని. "వేణీసంహారము"లోని పద్యములన్నియు నాకిప్పటికిని జ్ఞాపకమున్నవి. "వేణీసంహారమ"న్న నాకు మిక్కి-లి ప్రీతి. ఆ యొక్క-పుస్తకము మీదనేగాదు. సుబ్బరాయుడుగారి గ్రంథములన్నియుగూడ వాకు ప్రియములే.

నాకుగల యేకసంథాగ్రహణశక్తినిబట్టి నాకు సుబ్బరాయుడుగారు, "ఛాయాగ్రహణ యంత్రము"ని (కెమేరా) పేరుపెట్టిరి సాధారణముగ నెవరైన పద్యమొకసారి చదివిన పక్షమున, నాకది వెంటనే కంఠస్థ మయ్యెడిది 1897 వ సంవత్సరమున నే నొకనాటి మధ్యాహ్నము సుబ్బ రాయుడుగారి యింటికి బోతిని. ఆ సమయముననే, నిడమర్తి దుర్గయ్య గారును, బోడపాటి రామలింగేశ్వరప్పగారును. వేలూరి వేంకట్రామయ్య గారును, సుబ్బరాయుడుగారింటికే వచ్చిరి. అప్పుడు సుబ్బరాయుడుగారు "లక్ష్మీనరసింహముగా రేకసంథాగ్రాహి" యని వారితో చెప్పిరి పరీక్షించు టకు నేదే నొకగ్రంథముతెచ్చి, యొకపద్యము చదువుమని, వారు వసురాయ నితో చెప్పిరి, వెంటనే వసురాయుడు లోనికిబోయి కళాపూర్ణోదయము దెచ్చి యందులోని యీక్రిందిపద్యమును గంభీరముగ నొక్కసారే చదివిరి.

శా॥ గంధర్వుండవు జాతియెంచగ, శుభాకారంబు చంద్రత్రపా
సంధాన క్షమమద్వితీయుడ వికన్ సంగీతసాహిత్య ధౌ
రంధర్యంబున సజ్జనుండ వసురప్రద్వేషి భక్తుండవున్
బంధంబొక్కటిగల్గె శాపమనగ న్నాయన్న నీకున్ దుదిన్.

ఈ పద్యమును నేను వెంటనే మరల చదివితిని. సుబ్బారాయుడుగారి మాట నిజమేయని వారు ముప్పురు సంతసించి వెడలిపోయిరి. సుబ్బారాయుడు గారి నోటనుండి "వేణీసంహారము" నేను మొదట విన్నపుడు వారిమీద నీ క్రింది వెర్రిమొర్రి పద్యము నల్లితిని. చిన్ననాటి నా కవిత్వమున కిది యొక యుదాహరణము కావచ్చును.

కం॥ వేణీసంహారంబును
వాణీధవతుల్యుడైన వసురాయుడుతా
నాణెముగా తెనిగించెను
ప్రాణంబులు లేచివచ్చు పద్యము విన్నన్.

1897 వ సంవత్సరమున విక్టోరియారాజ్ఞిగారికి గొప్పయుత్సవము జరిగెను. దానిపేరు వజ్రోత్సవము (Diamond Jubilee) మహారాజ్ఞి గారు సామ్రాజ్య మరువదియేండ్లు పాలించినందుకే యుత్సవము జరుప బడినది. పాశ్చాత్యుల సాంప్రదాయమునుబట్టి, యేబదియేండ్లు పరిపాలించిన రాజునకుగాని, రాణికిగాని, సువర్ణోత్సవమని (Golden Jubilee) ప్రజలు చేయుదురు. అరువదియేండ్లు పాలించినవారికి వజ్రోత్సవము (Diamond

Jubilee) చేయుదురు. విక్టోరియారాణిగారు 1837 సంవత్సరమున సింహాసన మెక్కినందున 1897 సంవత్సరమున కరువదియేండ్లు పరిపాలనము పూర్తియైనది. కాబట్టి యింగ్లాండులోను, సామ్రాజ్యమంతటను గొప్ప యుత్సవములు జరిగెను. రాజమహేంద్రవరములోగూడ గొప్పయుత్సవములు జరిగెను. ఆ యుత్సవ సందర్భమున పురమందిరములో (Town Hall) నొక పెద్దసభ జరిగెను. ఆ సభకు గోదావరిజిల్లా కలెక్టరుగారగు "బ్రాడి" దొరగారధ్యక్షత వహించిరి. ఆ సమయమున శ్రీ న్యాపతి సుబ్బారావుపంతులుగారు, శ్రీ మాదిరెడ్డి వేంకటరత్నమునాయడుగారు, కందుకూరి వీరేశలింగముపంతులుగారు మున్నగు పెద్దలు శ్రీ విక్టోరియారాజ్ఞిగారి పరిపాలనమును గురించి ప్రశంసించుచు మాటలాడిరి అప్పుడు నేను పద్యములు రచియించి సభలో చదివితిని.

ఈ సభ ముగిసిన పిమ్మట మ్యూజియము కెనరుగనున్న స్థలములో విచిత్రమైన బాణసంచా కాల్పబడెను. నా పద్యములా సంవత్సరము జూన్ నెల 22 వ తేదీ చింతామణి పత్రికలో ప్రకటింపబడెను. కందుకూరి వీరేశలింగముపంతులుగారు, విక్టోరియారాణి చరిత్రమును వచనముగవ్రాసి "చింతామణి" పత్రికలోనే ప్రకటించిరి. నా పద్యములు చూచినతోడనే నన్ను శ్లాఘించుచు నాంధ్రదేశమున నానాభాగములనుండి బహూకరణ లేఖలు నాకువచ్చినవి. "ఆముద్రితగ్రంధచింతామణీ" పత్రికాధిపతులగు పూండ్ల రామకృష్ణయ్యగారు, నన్నును నా కవిత్వమును మెచ్చుకొనుచు నెల్లూరునుండి యొకలేఖ వ్రాసిరి. అట్లే విజయనగరమునుండి శ్రీ నిడదవోలు సుందరం పంతులుగారు జూబిలీసందర్భమున, మన యాంధ్రదేశమున రచియింపబడిన పద్యములన్నిటికంటె నాపద్యములు రసవత్తరముగ నున్నవని నాకొక లేఖవ్రాసిరి. ఈ విధముగనే యనంతపురముజిల్లాలోని పెనుగొండ యాసుపత్రిలో వైద్యులుగనున్న పార్థసారథిచెట్టిగారు ప్రశంసాపూర్వకముగ నొకజాబు నాకు వ్రాసిరి. ఆనాటి తెనుగుపత్రికలన్నియు నన్నట్లే ప్రశంసించెను.

ఆ సంవత్సరము సెప్టెంబరు నెలలో మా పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగనుండిన శ్రీ చేబ్రియ్యము వేంకటరామయ్యగారు పనిమానుకొని, జిల్లాకలెక్టరు కచేరిలో నొకగుమాస్తాపదవి సంపాదించి, కాకినాడ వెళ్ళిరి. ఆయనస్థానమందు, మొదటి సహాయోపాధ్యాయుడుగనుండిన శ్రీ ఇమానేని హనుమంతరావునాయుడుగారిని, మునిసిపల్ సభాధ్యక్షుడైన నిడమర్తి

జలదుర్గప్రసాదరాయుడుగారు నియమించిరి. నాయుడుగారి స్థానమందు నాకు చిరమిత్రుడైన ధరణీప్రగడ శివరావుగారు నియమింపబడిరి. నాయుడుగారు నాకు మొదటినుండియు పరమమిత్రుడగుటచేతను, శివరావుగారు గూడ నాకు సహాధ్యాయులును పూర్వమిత్రులు నగుటచేతను, నాకు సంతోషము కలిగెను. నా యుద్యోగము మాత్ర మెదుగుపొదుగులేక కనుబొమ్మ మీద వెండ్రుకవలె, యథాప్రకారముగ నున్నదని నా మిత్రులు గొందరు విచారించిరి. ఆ పాఠశాలలో నేను రెండవ సహాయోపాధ్యాయుడనుగదా; మొదటిసహాయోపాధ్యాయుని పదవి ఖాళీవచ్చినప్పుడు, దానికొరకు నేనెంత మాత్రము ప్రయత్నము చేయలేదు. చేసినను నాకది లభింపదని నే నెరుగుదును. ఏలయన నుపాధ్యాయ యోగ్యతాపరీక్షలో లిఖితభాగమునందు నేను మొదటి తరగతిలో గృతార్థుడనయితిని. కాని ప్రాక్టికలు పరీక్షకు బోయి సంపూర్ణయోగ్యత నేనప్పటికి సంపాదింపలేదు. అదియొక కారణము. నాకు దృష్టిదోషముగలదని యధికారులభిప్రాయపడి నాకియ్యరని యనుమానము. కాని నా దృష్టిదోషము నా యుపాధ్యాయపదవి కెంతమాత్రము నడ్డురాలేదు. ప్రతి తరగతిలోను నలువది పిల్లలుండినను, నేను పాఠము చెప్పునప్పుడుమాత్రము గోలయు నల్లరియు లేకుండ తరగతి నిశ్శబ్దముగానే యుండుచువచ్చెను. ఒకటి, రెండు, మూడు ఫారములకు నే నింగ్లీషులో దేశచరిత్రమును, భూగోళమును బోధించుటయేగాక, మొదటిఫారమునకు, రెండవఫారమునకు నింగ్లీషుగూడ జెప్పుచుంటిని. నా బోధనాశక్తి మిక్కిలి బాగుండెనని విద్యార్థులలో నాపు మంచి పేరుండెడిది ఈ విషయమై యప్పటి నా శిష్యులును నేటి పురప్రముఖులునైన శ్రీ కందుల వీరరాఘవస్వామిగారు, డాక్టరు కారుమూరి వీరభద్రస్వామిగారు, డాక్టరు పాలకోడేటి గురుమూర్తిగారు, మాదిరెడ్డి పురుషోత్తమునాయుడుగారు మొదలగువారు చెప్పగలరు. దేశచరిత్ర, భూగోళబోధనములలో నే నధికప్రజ్ఞావంతుడ ననియు; నొక్కసారి నేను బోధించెడి పక్షమున బాలురు చదువనక్కర లేకయే పాఠములు వచ్చెదివని, నాకు బ్రతిష్ఠగలదు పాఠకమహాశయులు దీని నాత్మస్తుతిగ గ్రహింపకుందురుగాక!

1897 వ సంవత్సరమున రాజమహేంద్రవరమున గొప్ప విశేష మొకటి జరిగెను. ఈ పురనివాసియు, మహాకవియు, మహాపండితుడు, సంఘసంస్కర్తయు పురమందిరప్రదాతయు, శ్రీ పునర్వివాహ సంస్థాపనాచార్యుడు, శ్రీ విద్యాభిమానియు, శతాధిక గ్రంథకర్తయు నైన రావుబహా

దూరు శ్రీ కందుకూరి వీరేశలింగముపంతులుగారు, రాజధానియైన చెన్న పట్టణములో వితంతు శరణాలయము స్థాపించి. సంఘసంస్కరణ విషయ మున విశేషకృషి సలుపవలెనను సంకల్పముతో, రాజమహేంద్రవర నివా సముమాని. డిశంబరునెలలో సకుటుంబముగ చెన్నపురికి పోయిరి. వారు రమారమి యిరువదిసంవత్సరములు రాజమహేంద్రవర కళాశాలలో నాంధ్రా ధ్యాపకులుగ నుండుటంజేసి. కళాశాలావిద్యార్థులు నుపాధ్యాయులుగలసి. కళా శాలలో నొక మహాసభజేసి, వారిని సన్మానించి వీడుకోలు నొసంగిరి. ఆ సభకు పురప్రముఖులలో నొకరును న్యాయవాదులును పూర్వము వీరేశ లింగముగారికి శిష్యులు శ్రీ ఆచంట సుందరరామయ్యగా రధ్యక్షత వహిం చిరి. ఆ సభలో నప్పుడు బి యే. తరగతిలో చదువుచున్నట్టియు, సరస కవితా విశారదుడైనట్టియు "రుక్మిణీపరిణయ" "శ్రీరామవిజయా"ది నాటక ములు రచించినట్టియు, శ్రీ కోపల్లె వెంకటరమణారావుగారు కొన్ని పద్య ములువ్రాసి చదివిరి. నేనును కొన్ని పద్యములువ్రాసి సభలో చదివితిని. మరికొందరు కొన్ని పద్యములువ్రాసి చదివిరి. ఇదియేగాక శ్రీ న్యాపతి సుబ్బారావుపంతులుగారు, మరికొందరు పురప్రముఖులను గలసి టవును హాలులో నొక గొప్ప సభజేసి, వీరేశలింగముగారిని సన్మానించిరి. మరియు శ్రీ కంచుమర్తి రామచంద్రరావుగారిచేత స్థాపింపబడిన "విద్యాభిమానినీ" సమాజమువారుగూడ సభజేసి, యాంధ్రాభ్యుదయ పితామహుడైన వీరేశ లింగముగారిని గౌరవించిరి. అప్పుడు శ్రీ కొట్టి రాఘవయ్యగారు మనో హరములైన పద్యములు వీరేశలి గముగారిమీద రచించి చదివి సభాసదు లను రంజింపజేసిరి వీరేశలింగముగారు 1889 లో తమ సొంతడబ్బుతో టవునుహాలు కట్టుట ప్రారంభించి 1890 లో ముగించిరి. అప్పుడు కళా శాలలో ప్రథమ సహాయోపాధ్యాయుడుగనుండిన. శ్రీ నాగోజీరావుపంతులు గారు, పురమందిర ప్రవేశ మహోత్సవ సందర్భముతో జరిగిన మహాసభ కధ్యక్షులైరి. నాడు కళాశాలలో ప్రకృతిశాస్త్ర పండితులైన పండిత రంగా చార్యుల వారాంగ్లభాషలో బహుజన స్తవనీయమైన యుపన్యాసమును వీరేశ లింగముగారినిగూర్చి యిచ్చిరి. నాటనుండియు మా పురమందిరము ప్రజల నిమిత్తమే యుపయోగపడుచుండినను, వీరేశలింగముగారు దానిని ధర్మ పత్రముగ్రాసి ధర్మకర్తల కప్పగింపలేదు. ఈ 1897 వ సంవత్సరము డిశంబరునెలలో చెన్నపురికి వెళ్ళకమునుపు వీరేశలింగముగారు పుర మందిర పరిపాలనము నిమిత్తము, ధర్మశాసన మొకటి వ్రాసి, పదముగ్గురు

ధర్మక ర్తల నేర్పరచి, వారికది యప్పగించిరి. ఆధర్మక ర్తల సంఘమునకు న్యాపతి సుబ్బారావుపంతులుగా రధ్యక్షులుగను, చిత్రపు వేంకటాచలము గారు కార్యదర్శిగను నియమింపబడిరి. వీరేశలింగముగారు కష్టార్జితమైన సొంతసొమ్ముతో దీనిని కట్టించిరి. ఆంధ్రదేశమున వెలసిన పురమందిరము లలో నిదియే మొదటిదియని, రాజమహేంద్రపురవాసులము సగర్వముగ సంతోషించుచున్నాము. వీరేశలింగముగారు చెన్నపురికి బోకమునుపు, నేను వారి దర్శనము చేయబోవగ. వారు రచియించిన ప్రతిపు స్తకము యొక్కయు నొక్కొక ప్రతి నాకు బహుమానముగ నిచ్చిరి. వీరేశలింగము గారి యుద్యోగము, కళాశాలలో శ్రీ వడ్డాది సుబ్బారాయుడుగారి కగునని, చాలమంది తలంచిరిగాని యట్లుగాక మరియొకరి కయ్యెను.

శ్రీ పోలవరము జమీందారుగారు, చెన్నపురిలో నివాసముండి రనియు, నేను 1894 వ సంవత్సరము డిశంబరు నెలలో చెన్నపురికి వెళ్ళినప్పుడు నన్ను వారియింటనే నిలిపి నాకన్నులకు వైద్యముచేయించి రనియు, ప్రాసితినిగదా। 1996 వ సంవత్సర ప్రాంతమున జమీందారు గారికి చెన్నపట్టణములో మిక్కిలి జబ్బుచేసెను. వారికి నోటనుండి ర క్తము పడజొచ్చెను. ఆరోగము నివారించుకై సీమకు బోవలచిరి. ఆవా ర్తవిని పూర్వము వారికి రాజమహేంద్రవరములో గురువై, మిత్రుడై యేలూరుకో నప్పుడు న్యాయవాదిగా నుండిన సోమంచి భీమశంకరముగారు, సీమకు వెళ్ళినచో జమీందారుగారు చెడిపోదురని భయపడి, వెంటనే చెన్నపురిబోయి. విదేశప్రయాణము నష్టదాయకమని వారికి బోధించి నచ్చజెప్పి. ప్రయాణము మానిపించి యేలూరు తీసుకొనివచ్చి. తమకు విశ్వాసపాత్రుడును, దమ కుటుంబవైద్యుడునైన నారాయణదాసుగారిని నొక బొండిలీవద్ద, మం ది ప్పింప జొచ్చిరి. నారాయణదాసుగారు పూర్వము మిఠాయివ ర్తకుడనియు నానాట వైద్యము నేర్చుకొని గొప్ప పేరు సంపాదించెననియు, నారోజు లలో చెప్పుగొనిరి. ఏలూరువచ్చిన తరువాత జమీందారుగారికి క్రమముగా కొంత యారోగ్యము గలుగజొచ్చెను. వారక్కడ మందుపుచ్చుకొనుచున్నా రని విని, వారినొకసారి జూచుటకు నేనేలూరు బోతిని, వారికి నామీద మొదటనుండియు మెండుగ నభిమానముండెనుగాని, యాదినములలో నా ప్రసంగములు విని తనిపిజెందక, నాపై ద్విగుణీకృతాభిమానము గలిగి, నేను పాఠశాలకు బోవలసియుండుటచే ఖర్చులిచ్చి పంపి, నన్ను ప్రతివారం రమ్మని యానతిచ్చిరి. అట్లు నేను 1898 వ సంవత్సరము మార్చి యేప్రిల్

నెలలలో ప్రతివారము నేనేలూరు బోవుచుంటిని. జమీందారుగారు నాకాకకు మిక్కిలి సంతసించుచుండిరి. ఆయన పవరుపేటలో నొకయిల్లు ప్రత్యేక ముగ నద్దెకు పుచ్చుకొని భార్యాసమేతముగా నందు నివసించుచుండిరి. వారి వెంట కొందరు మిత్రులు పరిజనులుగూడ నుండిరి. భీమశంకరము గారు జమీందారుగారికి తరుచుగ దర్శన మిచ్చుచుండిరి. అట్లు నేను యేలూరు బోయెడి దినములలో నొకనాటి సాయంకాలమున జమీందారు గారు గుర్రపుబండిమీద షికారుబయలుదేరి, నన్నుగూడ వారి ప్రక్కను గూర్చుండబెట్టుకొనిరి. బండికి వెనుకప్రక్కను వారిమిత్రులైన బ్రాహ్మణు లిద్దరు తుపాకులను చేత ధరించి గూర్చుండి మాతో షికారువచ్చిరి. అట్లు తుపాకులను ధరించి మావెంట ఎచ్చుట నాకిష్టములేకపోయెను ఏలూరులో నదివరకే జమీందారుగారిమిదను, వారి మిత్రులమీదను జెడ్డవాడుక లెన్నో యుండెను. కారణమేమన జమీందారుగారి భార్య యుండగనే, యొకదాసీ కన్యను పిలిపించి, వారిని వేరేయింట గాపురముంచి, ప్రతిదినము మధ్యాహ్నము మూడు నాలుగు గంటల నడుమ నామె యింటికిబోయి, యయిదారు గంటలకు వచ్చెడినారు అదిగాక వారి యాప్తమిత్రులలో గొందరు మద్యపానలోలు రుండిరి. అందుచే వారికప్రతిష్ఠ యెక్కువయ్యెను. ఆనాడు మేము షికారునుండి మరలి యింటికి వచ్చిన తరువాత, భోజనములు చేసిన పిదప, వారిని నేనీవిధముగ మందలించితిని, "అయ్యా! జమీందారుగారు! మీరు గొప్ప గృహస్థులు, ప్రభువులు, బి, యే. వరకు జదువుకున్నవారు. ఇవి మీకు సుప్రతిష్ఠ రావలసిన దినములు. అది లేదు సరిగదా, మీకప్రతిష్ఠ లోకములో నెక్కువగ నున్నది. దీనికి కారణము మీ యాప్తులలో గొందరు విద్యావిహీనులు, మద్యపాన ప్రియులు, సత్ప్రవర్తనము లేనివారు. గ్రామములోనికి నేను వెళ్ళినప్పుడు కొందరు పెద్ద మనుష్యులు మిమ్మునుగురించి యనేక చిత్రవిచిత్ర ప్రశ్నలు నన్నడుగుచుందురు. వాటికి నేను సమాధానము చెప్పలేకపోవుచున్నాను. ఈ మిత్రులను మీరు విడచిన గాని మీకు సుప్రతిష్ఠరాదు. నేటి సాయంకాలము మనము షికారు వెళ్ళినప్పుడు మీ మిత్రులిరువురు తుపాకులను పుచ్చుకొని

బండివెనుక గూర్చుండి యుండిరిగదా ? మీకది గనిపెట్టిరిగదా ? మన మందరము బ్రాహ్మణులముగదా ; చేతులలో మనకు తుపాకులెందుకు ? మనము వేటగాండ్రమా ? ఇటుపంటి పనులనుబట్టియే లోకములోనెన్నియో యపవాదములు మీపైబడుచున్నవి. మీరెన్నో విషయములలో లోకమున కెంతో మేలుచేయవలసియున్నారు. నేడు నేనిట్లు మీతో చెప్పినందుకు నాపై నాగ్రహింపక మీమిత్రులను పరిత్యజించి సుంచితోర్రివకు గండు" ఇట్లు నేను మనవి జేసిన తరువాత వారు గొంత పశ్చాత్తాపము నొంది నాతో నిట్లనిరి. "లక్ష్మీనరసింహముగారు ; నేనీ నిర్భాగ్యులను చేరదీయుట తప్పు. వీరివల్లనే నాకు మిక్కిలి యప్రతిష్ఠ వచ్చుచున్నది. ఈనిర్భాగ్యుల సహవాసము మానివేసి, యే మంచిపని మీరు చేయమన్నను చేసెదను." ఈ సంభాషణము మాకిరువురకు జరుగునపుడు మిత్రులెవ్వరును మాచెంత లేరు. ఇది మిక్కిలి రహస్యముగ జరిగినది.

సుబ్బారావుపంతులుగారు స్థాపించిన "చింతామణీ" మాసపత్రిక వీరేశలింగముగారితో చెన్నపురి వెళ్ళిపోయినందున, నాంధ్రదేశమున నొక మంచి మాసపత్రిక యుండవలెనని నే నభిప్రాయపడి, యొక తెలుగు మాస పత్రిక నెలకొల్పవలసినదని నేను వారికి సలహా జెప్పితిని. అది వారు మంచిదేయని యంగీకరించిరి. మేమిరువుర మాలోచించి మాసపత్రికకు "సరస్వతి" యని పేరుపెట్టితిమి. అది రాజమహేంద్రవరములోనే యచ్చు పడునట్లును, దానికి జమీందారుగారు సంపాదకులుగ నుండునట్లును, నేను సహాయసంపాదకుడుగనుండి పత్రిక నడుపునట్లును, మాలో మేము నిర్ణ యించుకుంటిమి. ఈ పత్రికా ప్రవర్తనము నాలుగుమూడు మాసములు టోయిన తరువాత చేయదలచుకొంటిమి. ఏలూరులో నుండగనే గుంటూ రులో జరుగదలచిన కృష్ణామండల సభకు రావలసినదని (ఆ రోజులలో ఇప్పటి కృష్ణా, గుంటూరుజిల్లా లొకేజిల్లాగా చ్యుండెడివి) జమీందారుగారి కాహ్వానము వచ్చెను. మరియు విజయనగరములో జరుగదలచిన విశాఖ పట్టణమండల సభకును, పసలపూడిలో జరుగనున్న నాలుగవ గోదావరీ మండల సభకునుగూడ రావలసినదని జమీందారుగారి కాహ్వానములు వచ్చెను.

స్వీయచరిత్రము

ఎనిమిదవ ప్రకరణము

మండలసభాయాత్రలు

ఈ మూడు సభలకుగూడ హాజరుకావలెనని జమీందారుగారి కుత్సాహముపుట్టి, నన్నుగూడ తమతోరమ్మని పిలిచిరి. సభలకుబోవుట నాకు మిక్కిలి యిష్టముగనుక వెంటనే నేనంగీకరించితిని. భీమశంకరము గారుగూడ లోకసేవా పరాయణులు గనుక జమీందారుగారు బిలువగనే యంగీకరించిరి. అట్లు నిశ్చయించుకొని జమీందారుగారు, భీమశంకరము గారు, నేను మండలసభా యాత్రలకు బయలుదేరితిమి. కృష్ణామండలసభ గుంటూరులో మేనెలలో జరిగెను. రాజకీయ సభకును, సంఘసంస్కరణ సభకునుగూడ నప్పుడు బందరు కళాశాలలో నుపాధ్యాయుడుగనుండి మహావక్తయైన శ్రీ రఘుపతి వేంకటరత్నము నాయుడుగారే యధ్యక్షత వహించిరి. జమీందారుగారితో కలసి శంకరముగారును, నేనును రైలులో రెండవతరగతిలోనే ప్రయాణము జేసితిమి. గుంటూరు వెళ్ళినతరువాత సన్మానసంఘమువారు మమ్ము ముగ్గురను మిక్కిలి గౌరవించిరి, సభలలో వేదికమీద నధ్యక్షుని వెనుకనే మా మువ్వురకు కూరుచుండుట కాసనములు వేసిరి. మా బసకు నూరుబయట నొక బంగాళా ప్రత్యేకముగ నిచ్చిరి. జమీందారుగారితో వంట బ్రాహ్మణులు, సేవకులు వచ్చుటచేతను, సన్మాన సంఘమువారు మాకు కొరతలేక నన్నివస్తువులను బంపుటచేతను గుంటూరులో దినములు మేము మిక్కిలి సుఖముగ గడిపితిమి. సన్మానసంఘాధ్యక్షులు శ్రీ పసుపులేటి వేంకటకృష్ణమ్మ నాయుడుగారు; వీరు వేంకటరత్నమునాయుడుగారికి చిరమిత్రులు, సహాధ్యాయులుగూడనని వింటిని. వేంకటరత్నమునాయుడుగారి వాగ్ధోరణియు, విజ్ఞానమును లోకవిదితములు గదా! ప్రథమదినమున శ్రీ వేంకటరత్నము నాయుడుగారు తమ వక్తృత్వమునకును, విజ్ఞానమునకును దగినట్లు నాంగ్లేయభాషలో గంభీరోపన్యాసమిచ్చిరి. అప్పుడు చెన్నపురిలో న్యాయవాదిగనున్న పురాణం నాగ

భూషణంగారుకూడ సభకు దయచేసిరి. వారు బందరులో సుప్రసిద్ధ న్యాయవాదులును, దొరతనమువారి వకీలునునైన పురాణం వెంకటప్పయ్య గారి తమ్ములు. ఆసభకు బాపట్ల, పల్నాడు, రేపల్లె, గురజాల మొదలగు సీమలనుండి యింగ్లీషు తెలియని రయితులు చాలమంది వచ్చియుండుటచే నాయుడుగారి యుపన్యాససారము వారికి తెలియజేయుటకై నాగభూషణము గారు స్పష్టముగ సరియైన తెలుగులో జెప్పిరి. వారి ధారణశక్తికి, నుప న్యాస ప్రౌఢిమకు సభాసదులు మిక్కిలి యాశ్చర్యము, సంతోషము నొందిరి.

సభాదినములలో రెండవనాడో, మూడవనాడో విశేషమొక్కటి జరిగెను. ఆంగ్లేయసామ్రాజ్యభారము చిరకాలమువహించిన ప్రథాన మంత్రియు, విక్టోరియా మహారాజ్ఞిగారికి మిక్కిలి గౌరవనీయుడు, సర్వ లోకమాన్యుడు, మిక్కిలి మేధావియునైన "గ్లాడ్‌స్టను" దొరగారు లండ నులో మృతినొందినట్లు మధ్యాహ్నమొక తంతివార్త వచ్చెను. మృత జీవుడు, మహామంత్రియునైన యా మహాత్ముని గౌరవార్థమై మండలసభ యొకయరగంటసేపు నిలుపుచేయబడెను. అప్పుడు జమీందారుగారు నన్ను బిలిచి, సభతిరిగి సమావేశమగులోపుగ గ్లాడుస్టనుగారిమీద గొన్ని పద్య ములు చెప్పుమని నన్నుగోరిరి. వారికోరిక నేనునిరాకరింపక, వెంటనే నామనసులోనే, నయిదోయారోపద్యములు రచించి కాగితముమీద వ్రాయక మనసులో నిలుపుకొని ధారణచేసి సభ తిరిగి సమావేశమైనప్పుడు జదివి తిని. సభాసదులు సంతోషించిరనియే నానమ్మకము. వెనుకటివాటివలెనే నివిగూడ మృగ్యములు. నాలుగవనాడు మండల సంఘసంస్కరణసభ జరి గెను. నాయుడుగారు సహజముగ సంఘసంస్కరణ ప్రియులగుటచే, నాటి సభ రాజకీయసభకంటె నెక్కుడు జయప్రదముగ జరిగెను. సభానంతర మున జమీందారుగారు, శంకరముగారు, నేనును సభాప్రముఖులయొద్ద సెలవుగైకొని గుంటూరువిడిచి మరల నేలూరు వచ్చితిమి. అక్కడనుండి విశాఖపురమండలసభనిమిత్తము విజయనగరము ప్రయాణమైవెళ్ళితిమి. ఆ విజయనగరసభకు సుప్రసిద్ధ రాజ్యాంగవేత్తయు, కాకినాడలో సుప్రసిద్ధ న్యాయవాదియు దేశసేవాపరాయణుడు, నైన శ్రీ గంజాము వేంకటరత్నము పంతులుగారధ్యక్షులైరి. సభాధ్యక్షుని, సభకు నరుదెంచిన జమీందారుగారిని, వారితోగూడనరుదెంచిన మమ్మునుసన్మానించుటకై రైలుస్టేషనునకు విజయ నగరప్రముఖులనేకు లరుదెంచిరి. మాకు బసనిమిత్తము శ్రీపూసపాటి వెంకట

పతిరాజుగారి సౌధమునిచ్చిరి. అక్కడగూడ రెండవనాడో, మూడవనాడో శ్రీ గంజాము వేంకటరత్నముగారి ప్రోత్సాహముచేత నేను గ్లాడుస్టనుగారి మీద నదివరకే రచించిన పద్యములు సభలో జదివి మెప్పువడసితిని. అప్పుడు శ్రీ గురజాడ శ్రీరామమూర్తిపంతులుగారు విజయనగరసంస్థాన ములో నేదోయుద్యోగములోనుండి, ప్రతిదినము మా జమీందారుగారిని జూడవచ్చి, యొకనాడు జమీందారుగారికిని మాకును విందుజేసిరి. వారు దేశచరిత్రమున మిక్కిలి కృషిచేసిన మహనీయులు. ఆదినములలోనే విజయనగరకళాశాలా ప్రధానాచార్యుడైన శ్రీ కిళాంబిరామానుజాచార్యులు గారితోడను, నచటనే కళాశాలలో పండితులైన శ్రీ గురజాడ అప్పారావు గారితోడను నాకు పరిచయమయ్యెను. విజయనగర ప్రభువులైన శ్రీమదానంద గజపతిమహారాజుగారు గతసంవత్సరమందే కీర్తిశేషు లగుటచే వారిదర్శనమునకై నేను ప్రయత్నింప నవసరము లేకపోయెను.

తిరిగి వచ్చునప్పుడు మేము విశాఖపట్టణములో ప్రయాణము నిలుపుచేసి "కారుమంచివారి హవేలి" యను పేరుగల కసింకోట జమీం దారుగారి మేడలో బసచేసితిమి. అప్పుడక్కడ దొరతనమువారి వకీలుగ నున్న మహారాజశ్రీ బలిజేపల్లి సూర్యనారాయణ శాస్త్రిగారి యింట భోజ నములు చేయుచుంటిమి. అప్పుడు కసింకోట జమీందారుగారు విశాఖ పట్టణములో నుండిరి. వారికి మతి చలించెను. ఈ ప్రయాణములో మా జమీందారుగారి వెంట గొంత పరివారము వచ్చెను. మతి చలించిన కసింకోట జమీందారుగారు, పోలవరము జమీందారుగారి పరివారములో నొక యువకుని "దూర్ జావ్ బాంఛో త్త" ని యొక్క చెంపకాయ కొట్టెను. దైవానుగ్రహమున నీ యపూర్వబహుమానము నాకు జరుగనందుకు సంత సించుచు, ప్రాణముల నరచేత బెట్టుకొని తక్కిన దినముల నెట్టెటో గడపితిని.

ఏలూరులో నా యుపదేశములు విన్నది మొదలుకొని శ్రీ పోల వరము జమీందారుగారు నాయెడల భయభక్తులుగలిగి ప్రవర్తించుచుండిరి. ఇందుకొక యుదాహరణ జెప్పెదను తరచుగ మేము బలిజేపల్లి సూర్య నారాయణశాస్త్రిగారి యింట భుజించుచున్నను, మా జమీందారుగా రప్పు డప్పు డక్కడకు రాక, మరికొందరు మిత్రులయిండ్ల భుజించుచుండిరి. ఆ మిత్రుల పేళ్లు మేమెరుగము. ఒకనాటిరేయి మా జమీందారుగారు మాతో భోజనమునకు రాక, మహారాజశ్రీ అంకితము జగ్గారావుగారి

యింట విందారగించుచుండిరట। రాజమహేంద్రవరమునుండి కార్యాంతరము మీద నక్కడకు వచ్చిన నా ప్రియమిత్రుడు చెరువు సోమయాజులు గారు జగ్గారావుగారి దర్శనమునకై పోయిరి. ఆ జమీందారుగారు జగ్గారావుగారి యింట విందారగించుట నా రాత్రి జూచెను. వెంటనే మా జమీందారుగారా మిత్రుని జూచి లేచి యెదురువచ్చి, "అయ్యా నే నిక్కడ భోజనము చేయుచున్నానని లక్ష్మీవరసింహముగారితో మాత్రము చెప్పవద్దు।" అని బ్రతిమాలెనట। "చిత్తము" అని నా మిత్రుడు జమీందారుగారి యొద్దను, జగ్గారావుగారి యొద్దను సెలవుగైకొని బసకుపోయి వెంటనే గాక తరువాత కొన్నాళ్ళకు నన్ను గలసికొని "మీ యెడ జమీందారుగారికి మిక్కిలి భయమే।" యనిపలికెను. నేను మిక్కిలి పేదవాడను. తక్కువ విద్యగలవాడను. వారాగర్భశ్రీమంతులు. బి. యే ప్యాసయిన విద్యావంతులు. అల్పుడనైన నాయెడ భయమెందుకుండునని నేనంటిని. తోడనే నా మిత్రుడు నాటిరేయి విశాఖపట్టణములో జగ్గారావుగారి యింట జరిగిన విషయము నాకు చెప్పెను. నే నాశ్చర్యపడితిని.

విశాఖపట్టణమునుండి మేము కసింకోటవెళ్ళితిమి. కసింకోట జమీందారుగారి బంధువుడైన వక్కలంక బోగారావుగారు, మా జమీందారుగారిని సపరివారముగ నాహ్వానించి గౌరవించి వారిమేడలే మాకు బసగ నిచ్చిరి. అప్పుడు కసింకోట జమీందారుగారు మైనరుగనుండి చెన్నపురిలో చదువుకొనుచుండిరి మూడుదినములు మెమచ్చట సుఖముగ గడపితిమి. విశాఖపట్టణములోనుండగ నాకు మా జమీందారుగారివల్ల శ్రీశ్రీశ్రీ విక్రమదేవవర్మగారి పరిచయమును, అంకితము జగ్గారావుగారి పరిచయమును విశాఖపట్టణ కళాశాలాధ్యక్షులైన, పి. టి. శ్రీనివాసయ్యంగారి పరిచయము గలిగెను. అప్పటికి మిక్కిలి వృద్ధులును, బ్రహ్మసమాజ మతాభిమానులును, మహర్షి దేవేంద్రనాథటాగూరుగారికిని, బ్రహ్మానందకేశవచంద్రసేనుగారికి మిత్రులునైన శ్రీ రాజాగోడే నారాయణగజపతిరావు బహదూరువారి దర్శనమునకు నన్ను వెంటబెట్టుకొని మా జమీందారుగారు వెళ్ళిరి. అప్పుడు నాకు వారిదర్శనముచేయు భాగ్యముగలిగెను. కసింకోటలోనున్నకాలమున నేనొకమిత్రుని సాయముదీసికొని యనకాపల్లి బోతిని. అక్కడ మునిసిపల్ మధ్యమపాఠశాలకు నామిత్రులైన బులుసు పాపయ్యశాస్త్రి ప్రధానోపాధ్యాయులుగ నుండిరి. వారిపరిచయ మదివరకులేదుగాని, పేరుమాత్రమువిని వారిని చూడబోతిని. పాపయ్యశాస్త్రిగారు మెట్రిక్యులేషను పరీక్షయందు

గృతార్థులై, యుపాధ్యాయులై, యాంధ్రభాషా పాండిత్యముగలిగి, కొన్ని గ్రంథములుకూడ రచియించిరి. వారురచించిన "భాస్కరవిలాస"మను నవల మిక్కిలి రసవంతమైయున్నది.

కసింకోటనుండి మేము బయలుదేరి, పసలపూడిలో జరుగబోవు నాలుగవ గోదావరీమండలసభకు బోతిమి. ఆ యేడా మండలసభకు శ్రీ కృత్తివెంటి వేంకరాజుపంతులుగారధ్యక్షులైరి. వేంకరాజుగారు గాకినాడలో గొప్ప న్యాయవాదులు. కొన్నిసారులచ్చటి మునిసిపల్ సభ కధ్యక్షులైరి. ఇటీవల వారు చెన్నపురి శాసనసభలో సభ్యులై ప్రజాపక్షమున వారు శ్లాఘ్యముగ పనిజేసిరి. పసలపూడిలోవారు మూడుదినములు సభకధ్యక్షతవహించి జయప్రదముగ జరిపించిరి.కడపటిదినమున నేను ఐదుపద్యములను సభమీద రచియించి చదివితిని. ఆపద్యములివి :

సీ॥ మనసులో మిము మేము మరువగోరినను మీ
మంచి యాదరణంబు మరువ నీదు
వేడ్క-తో మీ యూరు విడువగోరినను మీ
పిండివంటల రుచుల్ విడువనీవు
మా యింటిపై భ్రాంతి మాకు బారినను మీ
పచ్చని పందిళ్లు-పారనీవు
త్వరితంబ యిటనుండి దాటగోరినను మీ
తేటతెల్లని నీరు దాట నీదు

తే॥ గీ॥ అడుగులకు మడుగుల నొగ్గి యహహా మమ్ము
గారవింపరె వియ్యాలవారినట్లు
సకల సన్మానసంఘంపు సభ్యులార
అందుకొనరయ్య నేజేయు వందనములు 1

సీ॥ కనులపండువుగాగ గాకినాడపురాన
మన్మధాబ్దమున జన్మంబునొందె
రాజ్యహేంద్రమునందు బ్రబలి విద్దెముజేసి
యల్లనల్లన దప్పటడుగులిడియె

నేలూరు పురమందు బాలలీలదలిర్ప
నొక్కింతలేచి కాలూనినడచె
పసలపూడిని నేడు బసితనమ్మును బాసి
జిలిబిలి ముద్దుపల్కులను నేర్చె

తే॥ గీ॥ గౌతమీమండల సభాఖ్యకన్యయింక
పాలబేదతనము పాలబడకయుండ
జంటిబిడ్డచేష్టలు దీని నంటకుండ
కాచుకొనెడి భారముమీది కాపులార। 2

మ॥ మితభాషిత్వము కార్యసాధకత గాంభీర్యంబు సౌశీల్య ము
న్నతచిత్తంబును శాంతభావము గడున్ బాటించి శుంభద్గుణా
న్వితుడై యీసభ నిర్వహించెగద మా పేర్రాజుపంతుల్ నమ
స్కృతులన్సల్పెదగాక యీతనికి నక్షీణప్రమోదంబునన్. 3

గీ॥ అస్తమించును శ్రమలన్ని యస్తమించు
నధములగువారి యధికార మస్తమించు
నన్నిచెడుగులు ననితెల్ప నస్తమించె
జలజమిత్రుండు లెండిక సభ్యులార. 4

గీ॥ తోచు మీమీద దయయెల్ల దొరలకనగ
దోచువారల కిక తేటయోచనలన
దోచె జాబిల్లి పాండురద్యుతులతోడ
రండు నిండువేడుకతోడ రయితులార. 5

ఈసభ రామచంద్రపురం తాలూకా పసలపూడి గ్రామములో 1898 సంవత్సరము మేనెల 26, 27, 28 తేదీలలో జరిగెను. ఈసభలు ముగిసిన తరువాత జమీందారుగారు కాకినాడయును, శంకరముగారు యేలూరును, నేను రాజమహేంద్రవరమును వెళ్ళితిమి.

ఉపాధ్యాయవృత్తికి నేను సగము యోగ్యత సంపాదించితినిగాని, ప్రాక్టికల్ పరీక్షకువెళ్ళి గృతార్థుడగానందున సంపూర్ణయోగ్యత లభింప లేదని, యాకొరత దీర్చుకొమ్మని, నాచేత నట్టిపరీక్షకు దరఖాస్తు చేయింప వలసినదని, మునిసిపలు సభాధ్యక్షునకు విద్యాశాఖాధికారులు వ్రాసిరట. ఆ వ్రాతననుసరించి మునిసిపలు సభాధ్యక్షులైన నిడమర్తి జలదుర్గ ప్రసాద

రాయుడుగారు, మా పాఠశాలా ప్రధానోపాధ్యాయులైన హనుమంతరావు నాయుడుగారికి వ్రాసిరి ఆయేడు దరఖాస్తుపెట్టుమని నాకు నాయుడుగారు లిఖితపూర్వకముగ నుత్తరువుచేసిరి, ఆ పరీక్షకు దరఖాస్తుచేసిన యతడు పాఠశాలా పరీక్షాధికారియెదుట నల్లబల్లమీద యొక బొమ్మ వ్రాయవలెను. యొక లెక్క చేయవలెను పటము గీయవలెను. చక్కగ వరవడి పెట్ట వలెను. ఏదో యొకతరగతికి పాఠము చెప్పవలెను. పాఠము బోధించుట నాకు సులభమేగాని తక్కినపనులలో నాకంత ప్రవీణతలేదు ఆకారణము న నేనా పరీక్షకు కట్టదలచుకొనలేదు. కట్టనియడల విద్యాశాఖాధికారు లూరకుండరు. ఎట్లయిన నుద్యోగమునకు భంగమువచ్చునని నాకు దోచి నందున, నేనే యుద్యోగము మానుకొనుట మంచిదని విడుదలపత్రము (Resignation) దాఖలుచేసితిని. వెంటనే నన్ను పాఠశాలనుండి విడుదల చేసిరి. మొత్తముమీద నేను మ్యునిసిపల్ పాఠశాలలో మూడు సంవత్స రముల నాలుగుమాసములు పనిచేసితిని. అదివరకే శ్రీ బోలవరము జమీందారుగారు పనిమానివేసి "సరస్వతీ" మాసపత్రిక నడుపుచుండవల సినదనియు, నెలకు ముప్పదిరూపాయలు వేతనమిచ్చెదననియు, పలు మారులుచెప్పిరి. ఆ ధైర్యముచేత నేను పని మానుకొన్నపుడు నా భవిష్య జ్జీవన మెట్లు జరుగునని నాకు విచారము కలుగలేదు. నేను శ్రీ న్యాపతి సుబ్బరావు పంతులుగారి పక్షమువాడనగుటచే మ్యునిసిపల్ సభాధ్యక్షులైన శ్రీ నిడమర్తి జలదుర్గ ప్రసాదరాయుడుగారు నాపని తీసివేసిరని నిష్కార ణముగ కొందరభిప్రాయపడి నాతోగూడ నట్లుజెప్పిరి. అది నిజముకాదని నేను వాదించితిని. జలదుర్గ ప్రసాదరాయుడుగారికి నామీద కోపములేదు. కోపముండుటకు హేతువులేదు. వారటువంటి యనుచితకార్యములు చేయు వారు గారు. విద్యాశాఖాధికారులుచేసిన తొందరచేత వారు పరీక్షకు దర ఖాస్తుచేయుమని నాకు హెచ్చరిక నిచ్చిరేకాని, మరియొక కారణమేమియు లేదు. ఎన్నోసారులు నేను వారి దర్శనము చేసితిని. నన్ను వారు సగౌర వముగానే జూచుచువచ్చిరి. వారియెడల నాకు గౌరవముగలదు. ఆసంవత్సర మున నేనొకనాడొకమిత్రుని యింటికిపోవుచుండగ దారిలోనున్న కుక్క నన్ను త్రొక్కితిని. వెంటనే యొడలునొచ్చుటచేత నది నన్ను గఱచెను. కుక్క కాటన్న నాకు మిక్కిలిభయము. ఏలయన కొంతకాలముక్రిందట రాయవరపు అప్పారావుగారియింట నే కాపురమున్న గూడా చంద్రయ్యగారి రెండవ కుమారుడు కుక్కకాటువలన దారుణమైన మరణమునొందెను. కుక్కకర

చిన నెలదినముల కాబాలుడు జ్వరపీడితుడయ్యెను. అంతట జలభయరోగ మంకురించెను. నీరుముట్టలేడు, చూడలేడు, త్రాగలేడు, నీరుచూచిన భయముచే నెగిరిపడెడివాడు. నోట చొంగలు ప్రవాహముగ కారెను. వైద్యులు సహాయమేమియు చేయలేకపోయిరి. తుదకు బాలుడు మృతి నొందెను. అతనిగుడ్డలు, పండుకొన్న చాపలుగూడ వైద్యులు దహనము చేయించిరి. ఆబాలకుని ప్రస్తుత మమలాపురములో సుప్రసిద్ధ న్యాయ వాదిగనున్న గూడా హరిశ్చంద్రుడుగారి రెండవయన్నగారు. చేబియ్యము వెంకటరామయ్యగారి రెండవబావమరది. ఆబాలుని ఘోరమరణము జూచినదిమొదలు కుక్కకాటన్న నాకు మిక్కిలి భీతిగనుండెను. అప్పుడు కూనూరులోగాని, మరెక్కడనుగాని కుక్కకాటుకుమందులిచ్చెడి స్థలములు లేవు. నామిత్రులైన దామెర్ల రమణారావుగారు రాజమహేంద్రవరములో సుప్రసిద్ధ వైద్యులుగనుండిరి. ఆయన నాతో నిట్లనియెను. "పిచ్చికుక్క కాటుకుమందులేదు. అది పిచ్చికుక్కకానిపక్షమున మీకేమియు భయము లేదు. పిచ్చికుక్కయైనపక్షమున దానికి ప్రతిక్రియలేదు." అమాటలువిని నేనయిదురూపాయలు చేతపుచ్చుకొని జిల్లాసర్జనుగారిదర్శనముచేసి సలహా నడిగితిని. వారు నాకు చాలధైర్యముచెప్పిరి. అంతటితో సంతుష్టిచెందక నాస్నేహితులిరువురను వెంటబెట్టుకొని వెలుగుబందగ్రామము వెళ్ళితిని. ఆయూరి మునసబు పిచ్చికుక్కకాటుకు మందిచ్చునని వినియచ్చటకుబోతిని. ఆమునసబు నాయొద్ద నొకరూపాయపుచ్చుకొని నూనెలోకలిపి యేదోమంది చ్చెను. అదిపుచ్చుకొనుటయే చాలకష్టమయ్యెను. పుచ్చుకొన్న వెనుక తల విశేషముగదిరిగి వమనములు వెళ్లెను. ఒకబ్రాహ్మణునియింట నెట్లో చారుకూడుతిని సాయంకాలమున కింటికివచ్చితిని. రెండవ మోతాదు మందుగూడ మునసబిచ్చెను. కాని నేనామందు పుచ్చుకొనుటకంటె మరణమే మేలని దైవముమీద భారమువేసిపుచ్చుకొనుట మానితిని. దైవానుగ్రహమున నదిపిచ్చికుక్క కాకపోయెను.

1898 వ సంవత్సర మాగస్టులో నాభార్య కాపురమునకువచ్చెను. ఆదినములలోనే "సరస్వతీ" పత్రికా ప్రకటనమునుగూర్చి నేను ప్రయ త్నించితిని. కందుకూరి వీరేశలింగము పంతులుగారు చెన్నపురి వెళ్ళి నప్పుడు చిత్రపు నరసింహారావుగారికి తమ వివేకవర్ధనీ ముద్రాక్షరశాలను విక్రయించిరి. అప్పటినుండియు నరసింహారావుగారే దానిని నడుపు చుండిరి. ఆ ముద్రాక్షరశాలలోనే నేను "సరస్వతీ" పత్రికను ముద్రించి

ప్రకటింప నారంభించితిని. ఖర్చులను, నాజీతమును, జమీందారుగారే పంపుచుండిరి. పత్రికలో మొట్టమొదట శ్రీ దాసు శ్రీరాములుగారు తెనిగించిన "మాలతీ మాధవ" నాటకమును, తాడూరి లక్ష్మీనరసింహారావు గారు తెనిగించిన "యున్మత్త రాఘవము"ను, మారనకవి రచించిన "మార్కండేయ పురాణము"ను ప్రచురింప నారంభించితిని. "సౌందర్య తిలక" యను నవలను నేను వ్రాయనారంభించి, నెలనెలకు కొన్నిపుటలు వ్రాసి ప్రకటింప నారంభించితిని. పత్రిక బాగున్నదని పేరువచ్చెను. మారన రచియించిన "మార్కండేయ పురాణము" యొక్క వ్రాతప్రతిలో గొన్ని తప్పులుండుటచే బ్రహ్మశ్రీ యాకొండి వ్యాసమూర్తి శాస్త్రిగారు తప్పులు సవరించి శుద్ధప్రతివ్రాసి నెలనెలకు గొంతభాగము నాకిచ్చుచుండిరి. ఈపని చేసినందుకు జమీందారుగారు వారికి కొంత ధనసహాయము చేయుచుండిరి.

ఈ సంవత్సరమున (1898) నా రెండవచెల్లెలైన యచ్చమ్మకు రెండవ కుమార్తె కలిగెను. ఈ పురుడుగూడ వీరవాసరములోనే జరిగెను. మా తండ్రిగారియొక్కయు, బావగారియొక్కయు శ్రాద్ధ మాసికాదులకు నాకుఁ గొంత ఋణమగుటచేత నేనా విషయము జమీందారుగారితో మనవి చేసితిని. ఆఋణము దీర్చుకొనుటకు జమీందారుగారికి నామీద దయకలిగి, యారువందల రూపాయ లొక్కసారి యుచితముగ నాకిచ్చిరి. వారికి నేను మిక్కిలి కృతజ్ఞుడను, ఇదిగాక, నే నుద్యోగము మానినప్పటినుండియు నాకు వారు నెలకు ముప్పదిరూపాయల చొప్పున నిచ్చుచుండిరి. కాకినాడ వెళ్ళినప్పుడు జమీందారుగారియింట బసచేయుచు వచ్చితినిగాని నాకచ్చట నుండుట మిక్కిలి కష్టముగ దోచెను. ఏమన, వారు తమ యింపుడు కత్తెను తాము నివసించుయింటనే యొకగదిలో బెట్టిరి. అది నాకెంత మాత్రము గిట్టదు. నేను వీధిలోకి వెళ్ళినప్పుడు "మీ జమీందారుగారు తమ యింపుడుకత్తె నింటిలోనే యుంచిరట నిజమేనా?" యని నన్ను కొంతమంది యడుగజొచ్చిరి. "లే"దని నా కబద్ధమాడుట కిష్టములేదు, "ఔ"నని చెప్పిన పక్షమున జమీందారుగారి గుట్టు బయలుపెట్టినవాడ నగుదును. ఈ సందేహములో బడి నామనసు మిక్కిలి పరితపింప జొచ్చెను.

ఆ సంవత్సరమున దేశీయమహాసభ ఇండియన్ నేషనల్ కాంగ్రెసు చెన్నపట్టణములో జరుగునని ప్రకటింపబడెను. సన్మానసంఘమునకు

చెన్నపురివాసులు శ్రీ న్యాపతి సుబ్బరావుపంతులుగారి నధ్యక్షులుగ నియమించిరి. అది సుబ్బరావు పంతులుగారిని గౌరవించుటయేగాక, యాంధ్ర దేశమంతను గౌరవించినట్లుగ భావించి, నేనాసభకుబోవ నిశ్చయించుకొంటిని జమీందారుగారు నా యభిప్రాయము దెలిసికొని, నన్నుగూడ చెన్నపట్టణము రమ్మనిరి. వడ్డాది సుబ్బరాయుడుగారినిగూడ రమ్మనిరి. మునుపు సభలకు వెళ్ళినప్పుడు రెండవతరగతి టిక్కెట్టు యిప్పించిరిగాని యీపర్యాయము నాకును సుబ్బరాయుడుగారికిని యింటరు తరగతి టిక్కెట్టుల నిప్పించిరి. అప్పటికి బెజవాడనుండి చెన్నపురికి సరాసరి రైలుబండి పోవుటలేదు, బెజవాడనుండి గూడూరు రేణిగుంటలమీదుగ ప్రయాణము చేసి వెళ్ళితిమి. పూర్వము నేను వెళ్ళినపుడు జమీందారుగారు పరుసువాకములో నుండిరి. ఈపర్యాయము తిరువళ్ళిక్కేణిలో వీరరాఘవ మొదలి వీధిలో బసచేసిరి. అది పెద్దమేడ. జమీందారుగారును, వారి ప్రియురాలును మేడమీద బసచేసిరి. నాకును, వడ్డాది సుబ్బారాయుడుగారికిని క్రిందిభాగములో బసనిచ్చిరి. ఇది మాకు న్యూనతయని నేనేగాక సుబ్బారాయుడు గారుకూడ భావించిరి. ప్రారంభమున జమీందారుగారు తమ ప్రియురాలిని స్వగృహమందు బెట్టినప్పుడే నాకట్టిపని సహజముగ నసహ్యమగుటచే నాకును, జమీందారుగారికిని సఖ్యము చిరకాలము పొసగదని భావించి, సాధ్యమయినంత శీఘ్రకాలములో వారి సంబంధము వదలుకొనుట మంచిదని నేను నిశ్చయించుకొంటిని. ఈ నిశ్చయముతో నేను చెన్నపురికి వెళ్ళకమునుపే నా పోషణము నిమిత్తమొక పాఠశాల స్థాపింపవలెనని నాకు సంకల్పము గలిగెను. కలుగగనే యొకరిద్దరు మిత్రులయొద్ద రెండు వందల రూపాయలు బదులు పుచ్చుకొని పాఠశాలకు గావలసిన కూర్చుండు బల్లలు, కుర్చీలు, నల్లబల్లలు మొదలైనవి చేయించ నారంభించితిని. పాఠశాలకొరకు బజారులోనున్న, వాడ్రేవు జమీందారుగారి గాడేఖానా మాటలాడితిని. అప్పుడు పోలవరము జమీందారుగారుకూడ బావమరది గారైన వాడ్రేవు కృష్ణారావు జమీందారుగారి యింట నుండినందున నాపాఠశాల నిమిత్తము నేకోరిన గాడేఖానా నా కద్దెకిమ్మని, మా జమీందారుగారు బావగారితో సిఫారసు చేసిరి.

ఆ సంవత్సరము చెన్నపురిలో జరిగిన దేశీయమహాసభ (ఇండియన్ నేషనల్ కాంగ్రెసు) కానందమోహనబోసు గారధ్యక్షులైరి. సన్మాన సంఘాధ్యక్షులైన శ్రీ న్యాపతి సుబ్బరావుపంతులుగారి స్వాగతోపన్యాసము

శ్రవణానందముగ వింటిని. ఆనందమోహన బోసుగారి యుపన్యాసము వర్ణించుటకు వాచామగోచరముగ నుండెను. ఆ కంఠమాధుర్యము వర్ణనాతీతముగ నుండెను. ఆ భావగాంభీర్య మసాధారణము. సభ ముగిసిన తరువాత నేను రాజమహేంద్రవరమువచ్చి, యచటనుంచి వీరవాసరము వెళ్ళితిని.

●

స్వీయ చరిత్రము

తొమ్మిదవ ప్రకరణము

పాఠశాలాస్థాపనము

సంక్రాంతిపండుగ వెళ్లువరకు వీరవాసరములోనుండి 1899 జనవరి 17 వ తేదీని పాఠశాలస్థాపింపవలెనని, వీరవాసరమునుండి యానెల 15 వ తేదీని బయలుదేరి కొంతబండిమీదను, కొంతనడచియు, నెట్టెటో తాడేపల్లిగూడెమునకేరి, రైలెక్కి 16 వ తేది సాయంకాలమునకు రాజమహేంద్రవరము చేరితిని. జనవరి 17 వ తేదీని సరిగ 10 గంటలకు ప్రాథమికపాఠశాల స్థాపించితిని. ఆకొండి వ్యాసశాస్త్రిగారు దానిలో మొట్ట మొదటి యుపాధ్యాయుడు. నాలుగవతరగతివరకు బాలురు క్రమక్రమముగ, జేరనారంభించిరి. అప్పటి విద్యాశాఖాధికారియైన రఘునాథాచార్యులుగారు పాఠశాలకుదయచేసి, చూచియొప్పుకొనిరి. 1 వ ఫారము, 2 వ ఫారము, గూడ పెట్టదలచితినిగాని, తగినంతమంది బాలురుచేరలేదు. "సరస్వతీ" పత్రిక యధాప్రకారముగ రాజమహేంద్రవరములో నాచే ప్రకటింపబడుచుండెను. దృష్టిదోషముచేత నేను చక్కగ వ్రాయలేనుగనుక పత్రికనిమిత్త మొక గుమాస్తానిమ్మని జమీందారుగారిపేర వ్రాసితిని. మీయిష్టమువచ్చిన గుమాస్తాను వేసుకొమ్మని వారు నాకు జవాబువ్రాసిరి. కొత్తపల్లి సూర్యారావు గారిని నేను గుమాస్తాగ నియమించుకొంటిని. సూర్యారావుగారు వట్టి

గుమాస్తాకాడు. ఆయన కాంధ్రభాషాపరిచయముకలదు. గద్యపద్యకావ్యములు కొన్ని వారు వ్రాసినారు. ఆయన లేఖరిగనుండి నాకు మిక్కిలి సహాయముచేసినారు. అచ్చుపడినకాగితములు (ప్రూపులు) తప్పులులేకుండ దిద్దుచుండెడివాడు. నా "సౌందర్యతిలక" నేను భాగభాగములుగ వ్రాసినప్పుడు, శుద్ధప్రతి వ్రాయుచుండెడివాడు. జమాఖర్చుల లెక్కలు సరిగనుంచెడివాడు. ఇట్లు 1899 వ సంవత్సరమున నాపత్రికయు, నాపాఠశాలయు జూనునెల తుదవరకు నడుపబడెను.

1899 వ సంవత్సరము జూలై నెలలో మా జమీందారుగారికి తమ నివాసస్థానమైన కాకినాడలోనే "సరస్వతీ" పత్రికను ముద్రించి ప్రకటింపవలెనని బుద్ధిపుట్టెను వెంటనే కాగితములతోను, జమాఖర్చు లెక్కలతోను నన్ను కాకినాడరమ్మని నాకు జాబువ్రాసిరి. నేను కాకినాడవెళ్ళుటకిష్టములేక, కాగితములు, నిలువయున్నసొమ్ము, జమాఖర్చులెక్కలు మొదలయిన వన్నియు సూర్యారావుగారిచేతికిచ్చి ముందుగనాయనను కాకినాడబంపితిని. తరువాత నేను వెళ్ళితిని. అప్పుడు మాకిరుపురకును మిత్రులైన సోమంచి భీమశంకరముగారక్కడనుండిరి. నేను పాఠశాలస్థాపించితిని. కావుననేను కాకినాడ వచ్చినపక్షమున నదిచెడిపోవుననియు, నందుచేత నేను కాకినాడ రాజాలననియు, ముందుగ శంకరముగారికి నా యభిప్రాయము తెలియచేసి యా విషయమును, జమీందారుగారికి నచ్చచెప్పవలసినదని శంకరముగారిని కోరితిని. ఆయన జమీందారుగారితో చెప్పిరిగాని, నేను కాకినాడ రానందుకు నామీద జమీందారుగారికి మిక్కిలి కోపమువచ్చెను. పాఠశాల యేల స్థాపించవలెనని వారు నన్నడిగిరి. పాఠశాలపోయిననుసరే నేను వారియొద్ద నుండవలెనని వారికోరిక. పాఠశాల పెట్టుకొనుటకు జమీందారుగారు వారి బావగారితో స్థలమిమ్మని సిఫారుసుచేసిరనియు, నేను రహస్యముగ స్థాపింప లేదనియు పాఠశాలాస్థాపన వారెరిగిన విషయమేయనియు, నేనది విడువ జాలననియు చెప్పితిని. అదియుకాక, యాసంవత్సర ప్రారంభమున భీమశంకరముగారు తమకుమార్తెను, బుర్రా రాజలింగశాస్త్రిగారి రెండవ కుమారుడు తమకు మేనల్లుడునైన బుర్రా దేవేంద్రనాథునకిచ్చి వివాహము చేసిరి. ఆ వివాహమునకు జమీందారుగారును, నేనును మరికొందరు మిత్రులును వెళ్ళితిమి. "సరస్వతీ" పత్రిక కాకినాడలో ప్రకటింపవలెనని జమీందారుగారునాతో నప్పుడైనను చెప్పలేదు. ఆసంగతి నేనును జమీందారుగారికి జ్ఞాపకముచేసితిని. ఎన్నిచెప్పినను వారికి మనసు తిరుగలేదు.

నేను కాకినాడవచ్చువరకు నెలనెలకు నాకు వారిచ్చు డుప్పదిరూపాయల జీతము నిలుపుచేసితిమని శంకరముగారిద్వారా నాకు తెలియజేసిరి. అందుకు సిద్ధమై నేను కాకినాడనుండి రాజమహేంద్రవరము వచ్చితిని. దీనితో నాకును, జమీందారుగారికిని శాశ్వతవియోగము సంభవించెను.

నేనప్పటినుండియు గాలి జీవనము చేయవలసిన వాడనైతిని. జూలై నుండి నా పాఠశాలలో నొకటి రెండు ఫారములు (Ist and IInd forms) కొంచెము వృద్ధిపొందెను. పాఠశాలకువచ్చు రాబడితో నేను నేనుపాధ్యాయులకు వేతనములిచ్చి, యింటి కద్దెయిచ్చి, కొంచెము నేను వాడుకొనుచుంటిని. తాలూకాబోర్డుల ప్రెసిడెంటులు కొందరు నా గ్రంథములను వారి పాఠశాలలకు కొనుచుండిరి. బాలికాపాఠశాలా పరీక్షకులుగూడ బాలికల బహుమానముల నిమిత్తమై నా పుస్తకములను గొనుచుండిరి. ఆ సంవత్సరమున నిట్లు కొంత ప్రోత్సాహము కలుగుటచే, నేను దినములు సుఖముగ గడుపగలిగితిని. ఎట్లైతేనో 1899 వ సంవత్సరము గడచిపోయెను. 1899 వ సంవత్సరము డిశంబరులోనే, నా మూడవ చెల్లెలైన రమణమ్మ కాపురమునకు వెళ్లెను.

1900 వ సంవత్సర ప్రారంభమున మా పాఠశాలకు దగిన యుపాధ్యాయు నొక్కని ప్రధానాధ్యాపకునిగ నియమించి, మధ్యమపాఠశాలగ దానిని జేయదలపెట్టితిని. అందుకు సెంకండరీగ్రేడు ట్రయినింగయిన వారు కావలసివచ్చిరి. అట్టివారికొరకు వెదకుచుండగ, నక్కా కొండల రాయుడుగారని బ్రాహ్మణేతర యువకుడువచ్చి తన కుద్యోగమిమ్మని నన్ను డిగెను. నెలకు నిరువదియైదు రూపాయలు జీతముమీద నతనిని మాపాఠశాలకు ప్రధానోపాధ్యాయునిగ నియమించితిని. నియమించిన కొలది దినములకే నా మిత్రులైన కుందూరి వేంకటరత్నముగారు నాకడకువచ్చి "నేను మీ పాఠశాలలో పనిచేయవలెనని యున్నదయ్యా!" యని పలికిరి. ఏ సందేహమును లేక, "సరే రమ్మని" చెప్పి నెల కిరువదియైదు రూపాయలు జీతముమీద సహాయోపాధ్యాయునిగ వేంకటరత్నముగారిని నియమించితిని వేంకటరత్నముగారంతకుముందు రాజమహేంద్రవరములో క్రియాస్థవమిషను వారి పాఠశాలలో నుపాధ్యాయులుగ బనిచేయుచుండిరి. వారు బోధనాభ్యసనము నొందిరి. కాని యీ పరీక్షయందు కృతార్థుడు కాలేదు. అందుచేతనో, మరెందుచేతనో, వారా పాఠశాల వదలి మాకడకు వచ్చిరి. వేంకటరత్నముగారు మధ్యమ పాఠశాలా బాలురకు విద్య

గరపుటలో మిక్కిలి సమర్థులు. ఆర్యను పాఠశాలలో పూర్వము మే మిరు పురమకలసి పనిచేసితిమి, కావున వారిసామర్థ్యము నే నెరుగుదును అందు చేత వారి రాక నాకు మిక్కిలి సంతోష దాయకముగ నుండెను. కాని ప్రధా నోపాధ్యాయుడయిన కొండలరాయుడుగారికిని, వేంకటరత్నము గారికిని నెంతమాత్రము సరిపడలేదు. వారిరువురకును సామరస్యము కుదర్పలేక పోయినందున శ్రీ కొండలరాయుడుగారు నా పాఠశాలలో పనిమానుకొని, కాకినాడ వెళ్ళిరి. అందుచేత కొన్నిపాఠములు నేను కూడ చెప్పుచుంటిని. అజ్జరపు పార్వతీశముగారని యొకరు నా పాఠశాలలో నొక పూటయు, మరియొక పాఠశాలలో రెండవ పూటయు పనిచేయుటకు కుదిరిరి. ఆ కొండి వ్యాసశాస్త్రిగారు పండితులయ్యును, లోవరు సెకండరీ పరీక్షలో గృతార్థులగుటచే మా పాఠశాలనుండి ట్రయినింగుకు వెళ్లిరి. వారిస్థానమున కోడూరి దక్షిణామూర్తిశాస్త్రిగారిని నియమించితిని. ప్రాథమిక పాఠశాల శాఖకు నరసింహదేవర వెంకటరమణయ్యగారు ప్రధానోపాధ్యాయులుగ నుండిరి. క్రింది తరగతులకు మరియిద్దరిని సహాయులుగ నియమించితిని.

"సరస్వతీ" పత్రిక కాకినాడలోనే ప్రకటింపబడుచుండెను. ప్రతి మాసము "సౌందర్యతిలక" యను నవలలో కొంతభాగము వ్రాసి కాకినాడ బంపుచుంటిని. గోదావరినదిమీద వంతెన 1897 వ సంవత్సరమున వాల్టను దొరగారిచే ప్రారంభింపబడి, 1900 వ సంవత్సరములో పూర్తియై, యక్టోబరు నెలలో పొగబండ్లు నడచుటకు వీలుపడెను. నేనును మిత్రులతో కొవ్వూరువెళ్ళి వంతెనమీద మొట్టమొదట నడచిన రైలుబండిపై నెక్కి రాజమహేంద్రవరము వచ్చితిని, ఇది యొక గొప్ప కార్యముగాదు. కాని యట్లు వంతెనపై నడచిన మొట్టమొదటి బండి నెక్కుటకు కుతూహల పడితినని చెప్పుటకు మాత్రమే 1899 డిశంబరు నాటికి నా "సౌందర్య తిలక"లో మొదటి భాగము పూర్తియయ్యెను. 1900 వ సంవత్సరము డిశంబరునాటికి రెండవభాగము పూర్తియై గ్రంథము సమాప్తమయ్యెను.

ఈ సంవత్సరమున (1900) వేసవికాలములో నా రెండవ చెల్లెలైన యచ్చమ్మకు మూడవ కుమార్తె పుట్టెను. మా కుటుంబము వీర వాసరము నుండి రాజమహేంద్రవరము వచ్చినందున రాయపురపువారి యింటి ప్రక్కనే యొక చిన్నయిల్లదైకు పుచ్చుకొని కాపురముంటిని. 1901 వ సంవత్సరమున నా పాఠశాలలో నేను మూడవఫారము పెట్టితిని. ఇక్కడనే పెద్ద కష్టము. ఏలయన దానిని లోవరు సెకండరీ పాఠశాలగ

జేసి విద్యాశాఖవారి సమ్మతిని బడయవలయునని నా యాశయము. ప్రధానో పాధ్యాయుడు కనీసము ప్రవేశపరీక్షసిద్ధుడై బోధనాభ్యసనము నంది యా పరీక్షయందు సంపూర్ణముగ కృతార్థుడై యుండవలెను. వేంకటరత్నము గారు ప్రవేశపరీక్ష సిద్ధుడై, బోధనాభ్యసనము నందెను, గాని తత్పరీక్ష యందు కృతార్థుడు గాలేదు. కాబట్టి ప్రధానోపాధ్యాయుడుగ నుండుట కప్పటి కతని కర్హతలేదు. పాఠశాలనుండి యతనిని దీసివేసి, సంపూర్ణ యోగ్యతగల మరియొకరిని నియమించుకొమ్మని కొందరు నాకు సలహా చెప్పిరి కాని వేంకటరత్నముగారు నాకు చిరమిత్రుడగుటచేతను, సమర్థ డగుటచేతను, నా కాయనను దీసివేయుట కిష్టములేకపోయినది. ఇక నా పాఠశాల విద్యాశాఖవారి యనుమతిని బడయుటెట్లని నేనాలోచింప దొడగితిని.

ఆలోచనచేయుచు నేనొకనాడు నా మిత్రుడైన దామెర్ల రమణారావు గారి యింటికిపోయి గూర్చుండగ, నచ్చటికి నాకును, రమణారావుగారికిని మిత్రుడైన సత్యవోలు లక్ష్మీపతిగా రక్కడకువచ్చిరి. నా పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడుగ నుండదగిన వారెవ్వరును దొరకలేదని ప్రసంగ వశమున నేను వారితోచెప్పగ "నేను పనికివత్తునా?" యని లక్ష్మీపతిగారు నన్నడిగిరి. ఆయన పరిహాసమున కట్లనెనేమోయని నేను మొదట భావిం చితిని. ఏలయన, ఆయన యెక్కడ? నా పాఠశాలయెక్కడ? ఆయన జమీందారుల యల్లుడు. ఆయన పెద్దయల్లుడు జమీందారు. మిగుల భాగ్య వంతుడు. ఇంటి యద్దెలవల్లను, భూములవల్లను లక్ష్మీపతిగారికి, విశేష ముగ రాబడి వచ్చుచుండెను. ఆయన వయసున నాకన్న పెద్దవాడు, గొప్ప కుటుంబమునబుట్టిన గొప్ప గృహస్థుడు. ఆయన ప్రథమశాస్త్ర పరీక్ష యందు కృతార్థుడై కొన్నాళ్లు నరసాపురము హైయిలరు హైస్కూలులోను, పిమ్మట రాజమహేంద్రవరమునందలి పాఠశాలలలోను సహాయోపాధ్యా యుడుగను, ప్రధానోపాధ్యాయుడుగను పనిచేసి పదిసంవత్సరములక్రిందట పని మానుకొని యింటిదగ్గరనేయుండి విశ్రాంతి సుఖమనుభవించుచున్న భోగి. వారికిదగిన జీతము పుచ్చుకొన్నపక్షమున నే సీయజాలను. పుచ్చు కొనకుండ పనిచేయమనుటకు నాకు నోరాడలేదు. ప్రధానోపాధ్యాయులుగ నుండుట కాయన కన్నివిధముల యోగ్యతగలదు. "నేను పనికివత్తునా?" యని యాయన మరల నన్నడిగిరి. "ఇప్పటి నిబంధనల ప్రకారము మీరు తప్పక పనికివత్తు"రని బదులు చెప్పితిని. "అట్లయిన నేను రేపటినుండి

బడికివత్తు"నని వారు బదులుచెప్పిరి. "చిత్తము నా కింతకంటె యుప కారముగలదా?" యని పలికి నమస్కారము చేసితిని. లక్ష్మీపతిగారనగా నాడిన మాటకును, జేసెడి చేతకును భేదము జూపెడివారుగారు. ఆడిన మాటకు నిలువబడి దానిప్రకారము పని యాచరించెడివారే ఆయన మా పాఠశాల కుపాధ్యాయుఁడగ వత్తురని విన్నవారందరాశ్చర్యపడిరి. కొందరు నమ్మలేదు. లక్ష్మీపతిగారి గుణశీల మెరిగినవారు తప్పక వత్తురని నమ్మిరి. జీతమక్కరలేకుండ పనిచేయుమునని వారు నాతో నెలవిచ్చిరి. మరునాడు పదిగంటలకు భోజనముచేసి. జీతముపుచ్చుకొని పనిచేయు నుద్యోగస్తుని వలెనే కోటు దొడిగికొని, తలపాగ బెట్టుకొని మా పాఠశాలకువచ్చి తరగతులన్నియు జూచి మూడవపారమున కింగ్లీషు తాము చెప్పెదమని చెప్పిరి. ఆప్రకారము కుందూరు వెంకటరత్నముగారు కాలపట్టిక (టైం టేబుల్) వ్రాసిరి.

మూడుపారములకు ముగ్గురుపాధ్యాయులుండవలెనని మదియొకరిని సహాయోపాధ్యాయునిగ నియమించితిని. ఆ దినములలో మహమ్మద్ ఆజమ్‌సాహేబుగారు గోదావరీమండలమునకు సహాయపరీక్షాధికారిగ (అసి స్టెంట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్) నియమింపబడిరి ఆయనయు, లక్ష్మీపతిగారును పూర్వము సహాధ్యాయులు. ఆ కాలమున శ్రీ గరికపాటి సుబ్బారాయుడుగా రుత్తరసర్కారులలోని పాఠశాలలకు ప్రధాన పరీక్షాధి కారిగనుండిరి. ఆయనయు లక్ష్మీపతిగారికి మిత్రులే నేను మహమ్మద్ ఆజమ్ సాహేబుగారి దర్శనముచేసి, మా పాఠశాలను జూచి విద్యాశాఖవారి సమ్మతిని బడయునట్లు చేయుమని కోరి, దరఖాస్తును పంపితిని. మధ్యమ పాఠశాల, విద్యాశాఖవారి యనుమతి బడయుటకై సాముకసరతుల పరి కరము లారోజులలో మెండుగ గావలయును. పేరలబారు, తోలుమూసిన కర్రగుఱ్ఱము, హరిజాంటలుబారు, కొన్నిజతల డంబుల్సు, నురిస్తంభముల వలెనుండు రింగులు, ట్రిపీజు మొదలైన పరికరములు కావలెను. ప్రాథ మిక పాఠశాలకు నాకాసంవత్సరము కొంతగ్రాంటు వచ్చెను. ఆ సొమ్ము వినియోగించి యీ పరికరములు చేయించితిని. పాఠశాలలోని విద్యాబోధ మెటులున్నను, పై జెప్పిన పరికరములును, సాముకసరతులు నేర్పెడి పంతులును, నొకపాకీదొడ్డి నుండినగాని యా దినములలో పాఠశాల విద్యా శాఖవారి యనుమతిని బడసెడిదిగాదు. ఈవన వెంకట్రామయ్యయను నతనిని నేను సాముకసరతుల యుపాధ్యాయునిగ నియమించితిని.

మహమ్మదాజముసాహేబుగారు వచ్చి పాఠశాలనుజూచి యిది యంగీకృత పాఠశాలలలో చేర్పవచ్చునని పై యధికారులకు సిఫారసుచేసిరి. గరికపాటి సుబ్బారాయుడుగారు కూడ మా పాఠశాలను జూచి, డైరెక్టరుగారికి సిఫారసు చేయుదుమని చెప్పిరి. ఆ దినములలో శ్రీ గరికపాటి సుబ్బారాయుడు గారియొద్ద చెరుకూరి లక్ష్మీనరసింహముగారని యొకబ్రాహ్మణుడు ప్రధాన లేఖరిగ (హెడ్‌క్లార్క్) నుండెను. ఆయనకును నాకును కొంతకాలము నుండి మైత్రికలసెను. అందుచేత వారుగూడ నా పాఠశాల విషయమున ననుకూలముగ పనిచేసిరి. ఇక్కడ యధికారులు సిఫారసు చేసిరిగావి, యంగీకరింపబడినట్లు చెన్నపురినుండి యుత్తరువులు నాకు రాలేదు. ఇట్లు 1901 వ సంవత్సరములో మొదటి యారుమాసములు గడచెను.

ఆ సంవత్సరమున ఫిబ్రవరినెలలో, ననగా శార్వరి సంవత్సర మాఘ మాసమున, మా తమ్ముడు కృష్ణమూర్తికి వివాహమయ్యెను. నా మేనమామ గారైన పురాణపండ మల్లయ్యశాస్త్రిగారికి ముగ్గురు కుమార్తెలు, నొక కుమార్తెయు. ఆ కుమార్తె కప్పుడు పదునొకండు సంవత్సరములు వయసు. నా మేనమామగారికి మామీద మొదటినుండియు మిక్కిలి యభిమానమని యిదివరకే వ్రాసితిని. ఆ యభిమానముచేతనే వారు మా తమ్మునకు తమ బాలిక నిచ్చి వివాహము జేసిరి. అప్పుడు మా తమ్ముడు ముప్పదియేండ్ల వయసువాడు. అంతకాలమువరకు నేల పెండిలి కాలేదని సందేహము తోపవచ్చును. మొదటినుండియు నతడు రోగపీడితుడగుటచే, మా తండ్రి గారతనికి పెండ్లి చేయలేదు. అదిగాక, మేనరికము చేసికోవలెనని మా తల్లికి, పినతల్లులకు గట్టిపట్టు కలదు. తన కూతురును మా తమ్మునకే యిచ్చి వివాహము చేయవలెనని మా తల్లియు, పినతల్లులు మా మేనమామ గారిని నొక్కి యడిగిరి, దానికథ వచ్చినప్పు డాలోచింతములెండని యాయన సమాధానము చెప్పుచు వచ్చిరి. ఎట్టకేల కా బాలికకు వివాహపు వయసు వచ్చెకు. తోబుట్టువుమీదగల ప్రేమచేత మల్లయ్యశాస్త్రిగారు, మా తమ్ముడు వయసుమీరినవాడయినను, విద్యావిశేషములేనివాడయినను, మిక్కిలి భాగ్యవంతుడు గాకపోయినను, గుణవతియు విద్యావతియునైన తన కూతును, రామలక్ష్మమ్మను మా తమ్మున కిచ్చి వివాహముచేయుట ప్రశంసనీయమైన కార్యమని మా బంధువులు శాస్త్రిగారి మిత్రులును సంతోషించిరి. ఆ వివాహము వీరవాసరమునకు మిక్కిలి సమీపమందున్న మత్స్యపురి గ్రామములో మల్లయశాస్త్రిగారి బావమరదియైన చిలకమర్తి వెంకయ్యగారి

యింట జరిగెను. నేను నాలుగువందలరూపాయలు ఋణముజేసి, పిల్లకు రెండువందలరూపాయలు నగలుపెట్టి, రెండువందలరూపాయలు ఖర్చుపెట్టి, రాజమహేంద్రవరమునుండి బాణసంచ తెప్పించి, శాస్త్రిగారి దర్జాకు తగినట్లు పెండ్లి చేసితిని. అప్పటికి నా భార్యమెడలో బంగారపు పట్టెడయిననులేదు. తక్కినవాటిమాట చెప్పనేల ?

1901 వ సంవత్సర వేసవికాలపుసెలవుల యనంతరమున మాపాఠశాలను తెరచితిమి. ఎప్పటివలెనే లక్ష్మీపతిగారు పాఠశాలకువచ్చి పనిచేయసాగిరి. విద్యలోను, వయసులోను, స్థితిలోను లక్ష్మీపతిగారికంటె నేను తక్కువవాడనైనను, స్వగృహమందు హాయిగ సుఖింపక యా మహాత్ముడు "కుంజరయూథంబు దోమ కుత్తుకజొచ్చెన్." యన్నట్లు చిల్లిగవ్వయైనను నావల్ల జీతమపేక్షింపకుండ స్వార్థత్యాగముజేసి. తనకాలము నానిమిత్తముపయోగించినందుకును నేను పాఠశాలాధికారిగను, నా చేతిక్రింద లక్ష్మీపతిగారు తాబేదారుగ నున్నందుకు నాలో నేనే సిగ్గుపడుచుండెడివాడను. ప్రతిదినము లక్ష్మీపతిగారు పనిచేయు విధానమిట్లుండెను; పగలు పదిగంటల కాయన భోజనముచేసి, దుస్తులు వేసుకొని, పండ్రెండు గంటల లోపుగ పాఠశాలకు వచ్చెడివారు. అప్పటికి నేను భోజనముజేసి, బడికిపోయి, యుపాధ్యాయులు గూరుచుండుట కేర్పడిన గదిలో (కామన్ రూమ్) కూర్చుండువాడను. లక్ష్మీపతిగారును నేనును పాఠశాలా విషయముల గూర్చియు, మరి యితర విషయములగూర్చియు, ముచ్చటించుకొనుచుండెడి వారము. ఒంటిగంట మొదలు రెండు గంటలవరకు వెంకటరత్నముగారు మొదలగు తక్కిన యుపాధ్యాయులు మమ్ము కలుసుకొనుచుండెడివారు. రెండుగంటలు కాగానే, యెవరి తరగతికి వారు వెళ్లుచుండెడివారు. లక్ష్మీపతి గారుకూడ మూడవపారముకు వెళ్ళి సాయంకాల మైదుగంటల వరకు, నిమిషమైన వ్యర్థముచేయకుండ, వంచిన నడుమెత్తకుండ, మిక్కిలి శ్రద్ధతో పాఠములు చెప్పుచుండెడివారు. ఆయన యాకారము మిక్కిలి గాంభీర్యముగ నుండెడిది. దట్టమైన మీసకట్టు, మొగమునకెంతో యందము తెచ్చినది. ఆయన యాకారము విద్యార్థులకేగాక, సహాయోపాధ్యాయులకు కూడ భయంకరముగ నుండెడిది. ఆయనపేరు సింహస్వప్నము. దర్శనము సింహదర్శనము. ఇట్లనుటచే నాయన యెంతమాత్రము క్రూరుడుగాడు. ఆయన మాట కఠినముగాని, హృదయము మిక్కిలి మెత్తనిది. ఆయనది జాలిగుండె యనుటతిశయోక్తిగాదు. ఆయనయొద్ద

బదులుపుచ్చుకొన్నవారు మిక్కిలి ధన్యులు. కొందరికి వడ్డి తగ్గించియు, కొందరికి వడ్డి పూర్తిగ మానియు, గొందరి కసలులోనే తగ్గించియు, ఋణము దీసికొన్నవారికి లక్ష్మీపతిగారు మిక్కిలి యుపకారము చేయుచుం డెడివారు. ఒకవిద్యార్థి బొంబయిలో పారిశ్రామికపాఠశాలలో చదువుకొను టకై నావద్దకు వచ్చి లక్ష్మీపతిగారికి సిఫార్సుచేయమని కోరగా, నేనట్లు చేసితిని. ఆ విద్యార్థి కాయన నూటయేబదిరూపాయ లొక్కమారుచితముగ నిచ్చిరి. ఈ విద్యార్థి కొక్కనికేగాదు. ఇటువంటి విద్యార్థుల కనేకుల కాయన సహాయముచేసెను. దసరా మొదలగు సెలవు దినములలో జీతము పుచ్చుకొనునట్టి యుపాధ్యాయులు బడివంక జూడకపోయినను, లక్ష్మీపతిగారు మట్టుకు పరీక్షకుబోవు విద్యార్థుల తరగతిని మధ్యాహ్నము రమ్మని రెండుమొద లయిదుగంటలువరకు బాలురకు కావలసిన పాఠములు చెప్పుచుండెడివారు. ఇంతటి సంపన్నగృహస్థుడేమి! పాఠశాలలో నుచిత ముగ బనిచేయుట యేమి! యని సందేహముతోచి, విద్యాశాఖాధికారు లకస్మాత్తుగ నడుము నడుమ వచ్చి లక్ష్మీపతిగారు బడికి వచ్చినారో లేదో యని చూచుచుండెడివారు. వారెప్పుడు వచ్చినను లక్ష్మీపతిగారు బడిలో ప్రత్యక్షముగ గనబడుచుండుటచే, లక్ష్మీపతిగారు పేరునకుమాత్ర ముపా ధ్యాయత్వము చేయుచుండుటలేదు, మనస్ఫూర్తిగనే చేయుచున్నారని యధి కారులు నమ్మి పోవుచుండిరి.

1901 వ సంవత్సరము ప్లవసంవత్సరము. ఆ సంవత్సరమున నధికమాసము వచ్చెను. శ్రావణ మధికమా? ఆషాఢ మధికమా? యను ప్రశ్నవచ్చెను. ఆంధ్రదేశమున నానాభాగములనుండి జ్యోతిశ్శాస్త్రపండి తులు చాలమంది వచ్చి రాజమహేంద్రవరములో సభలుచేసి చర్చించిరి. నేను శ్రావణపక్షము వహించి, యా సభలలో పాలుగొంటిని.

ఈ 1901 వ సంవత్సరమున మా పాఠశాలకు దగిన ప్రధానోపాధ్యా యుడుగ లక్ష్మీపతిగారు లభించుటచే, లోవరు సెకండరీ పాఠశాలగ విద్యా శాఖవారి యనుమతి బడసెను. ఆది మిక్కిలి కష్టముమీద నయ్యెను. ఎట్లు కష్టమనగా, గోదావరీమండల విద్యాశాఖాధికారియైన మహమ్మ దాజముసాహెబుగారికిని, నాకును గొంత మనస్పర్ధ గలిగెను. కారణము మిక్కిలి చిన్నది. మా పాఠశాల స్థాపింపకమునుపు మెరకపీధి తెలగాలైన ముత్తంగి రామకృష్ణయ్యగారు పాఠశాల నొక దానిని స్థాపించిరి. దాని పేరు "టవును"స్కూలు. స్థాపింపబడిన కొలదికాలమునకే రామకృష్ణయ్య

గారు మృతినొందిరి ఆయన కుమారుడు జగ్గారావుగారు దానిని నడుపు చుండిరి. రెండుపాఠశాలలును ప్రాతయూరులోనే యుండుటచేత జగ్గారావు గారిబడియు, మా బడియు పోటీమీద పనిచేయుచుండెను. ఇట్లుండగ 1901వ సంవత్సర మధ్యమున మండల విద్యాశాఖాధికారియైన సాహేబుగారు మా పాఠశాల పరీక్షింపవలసివచ్చెను ఆ పరీక్ష సందర్భమున మా పాఠశాలపరీక్ష నిమిత్తము జగ్గారావుగారి పాఠశాలకు పంపుమని సాహేబుగారు నాకొక తాఖీదు బంపిరి. విద్యాశాఖాధికారులు నిబంధనల ప్రకారము పాఠశాల యెక్కడనున్నదో యక్కడకేబోయి పరీక్షింపవలెనుగాని మరియొక చోటునకు రమ్మనగూడదు. అట్టి నిబంధన లుండినప్పటికి సాహేబుగారు నిరంకుశాధికారముగల నవాబువలె నా పాఠశాలను మరియొక చోటునకు బంపుమని వ్రాసిరి. అది నిబంధనలకు విరుద్ధమేగాక, మాకు పోటీగ పని చేయుచున్న పాఠశాలకు బంపుట యాత్మగౌరవమునకు భంగమని నాకు దోచెను. అట్లు బంపుట నా కిష్టములేదనియు, నవసరమైన పక్షమున మరి యొక చోటునకైన బంపెదనుగాని యా "టపును" స్కూలునకు మాత్రము బంపననియు, వారి హుకుమునకు జవాబువ్రాసి బంపితిని. ఆ జవాబు చూచుకొనగానే సాహేబుగారికి నాపై ఆగ్రహమువచ్చెను, కారణమేమన, తాను గొప్ప మండలాధిపతిననియు, పాఠశాలను స్థాపించినవారు మండల విద్యాధికారుల నిగ్రహానుగ్రహములకు పాత్రులై యుండవలసిన యధమా ధములనియు, నధికారుల హుకుములకు విరుద్ధముగ వ్రాయగూడదనియు, సాహేబుగారి యభిప్రాయము. వారితో సమానాధికారులో, వారికంటె పై యధికారులో వారికి లిఖితపూర్వకమైన జాబులు వ్రాయవలెనుగాని మిక్కిలి యల్పులయిన ప్రాథమిక పాఠశాలా పరిపాలకులు లిఖితపూర్వక మైన సమాధానము పంపకూడదనియు, తెలియపరచవలసిన విషయమున్న పక్షమున ఖుద్దునవెళ్ళి మనవి చేసుకొనవలెననియు వారి యభిప్రాయము. ఖుద్దున వారితో నేను మనవిచేసికొనకపోవుట నాది తప్పట; నా వంటి యల్పుడు వారివంటి ప్రభువులకు జవాబువ్రాయుట యవమానకరమట; వ్రాసిన కాగితమునకు జవాబువ్రాయుట తప్పని నాకు తోచలేదు. అదివరకు సాహేబుగారికి నామీద యిష్టముగనుండెను. వారి యింటికి నేను తరుచుగ వెళ్లుచుండెడివాడను. వారు మిక్కిలి ప్రసన్నులై నాతో మాటలాడు చుండెడివారు. గత సంవత్సరమున వారజీర్ణవ్యాధివలన బాధపడినప్పుడు నేను వెళ్ళి తరుచుగ వారి క్షేమ మరయుచుంటిని. అరయుటయేగాక, తగిన

వైద్యుని తీసుకొనిరమ్మని వారు నన్ను కోరినపుడు, నా మిత్రుడును, ఘన వైద్యుడునైన దామెర్ల వెంకటరమణారావుగారిని దీసికొనిపోయి వారికి వైద్యము చేయించితిని. అది యుచితవైద్యముగాదు. సాహేబుగారు రమణారావుగారికి తగిన బహుమానము జేసిరి. మొత్తముమీద మేమిరువురము మిత్రులమేయని చెప్పవచ్చును. నా కాగితము వెళ్ళిన తరువాత మా మిత్రత్వము శత్రుత్వముక్రింద మారెను. వారికి నాపై నాగ్రహము కలిగినదని విని నేను వారి యింటికిబోయి వారి దర్శనము జేసితిని. వారు మునుపటివలెనే ప్రీతిపూర్వకముగ మాటలాడక, కఠినముగ మాటలాడ జొచ్చిరి. నా యభిప్రాయము ఖుద్దునవెళ్ళి వారికెందుకు మనవిచేసుకోలేదని వారు నన్నడిగిరి. అది తప్పని నే తలంపలేదనియు, మేము మాటిమాటికి యధికారుల యిండ్లకు బండ్లుచేసుకొని పోవుటకు సంపన్నులముకామనియు, వినయముగ మనవి చేసితిని. నా మాటలు వారిని శాంతిపరచుటకుమారు మరింత కోపోద్దీపితుని జేసెను. ఎట్టెటో నేను వారికడ సెలవుదీసికొని యింటికి బోతిని.

ఆ మరునాటినుండి సాహేబుగారు మితిమీరిన కక్షసాధింపజొచ్చిరి. అందు మొదటిదేమనగా నాపాఠశాలను పాడుజేయుట. నాపాఠశాలలో నేవైన తప్పులున్నవేమో కనుగొని, విద్యాశాఖాధికారులకు వ్రాసి యది యంగీకారము బడయకుండచేయవలెనని వారి సంకల్పము. ఆ సంకల్పముతో వారు ముందుగా మాకు తెలియజేయకుండా పాఠశాలకు హఠాత్తుగ నెన్నోసారులుపోయి చూచుచుండిరి, వారు పాఠశాలకు పోయినపుడెల్ల లక్ష్మీపతిగా రచ్చట నుండుటచేతను, పేర్కొనదగిన తప్పులేమియు గన పడక పోవుటచేతను, మున్నుతానుజేసిన యనుకూలమైన సిఫార్సున కెంత మాత్రము విరుద్ధముగ వ్రాయుటకు వీలులేక వారూరకుండిరి. కాని వారు దానితో సంతుష్టి జెందక తరుచుగ నామిత్రులకడకుపోయి నేను దుర్మార్గుడ ననియు, స్నేహపాత్రుడను గాననియు, యేమేమోజెప్పి వారి మనసులను కళంకితములు చేయసాగిరి. నాస్వభావమెరిగినవారు సాహేబు గారి మాటలను సరకుచేయరైరి.

నా స్నేహితులు నన్నెప్పటివలె నాదరించుటచేత తన మాటలు పని చేయలేదని సాహేబుగారికి నామీదకోపము ద్విగుణీకృతమయ్యెను. తన్ను నేవమానము జేసితినని నామీద దోషారోపణముజేసి, జేబులో నొక పిస్తోలు పెట్టుకొని నేనొంటిగ దొరికినప్పుడు దానితో కాల్చి చంపెదనన్

నామిత్రులైన దామెర్ల వెంకటరమణారావుగారితో చెప్పిరట. ఆప్రతిజ్ఞ విని నేనెంతమాత్రము భయపడలేదు. నేను పట్టణములో నెప్పటివలెనే నాపనులమీద తిరుగుచుంటిని. వేయేల ? ఆకోపావేశమున వారు మైమరచి పిచ్చివానివలె సంచరింపజొచ్చిరి. వైనుండివచ్చిన కాగితములుకాని. క్రింది వారి వద్దనుండి వచ్చెడి కాగితములుగాని. వారు జూచుట మానిరి. జాబుల నిచ్చుటమానిరి. గుమాస్తాలచే వ్రాయబడిన కాగితములమీద సంతకములు చేయుటమానిరి. కార్యస్థానము నిద్రపోవుచుండెను. ఈస్థితినిగ్రహించి దొర తనమువారు సాహేబుగారిని కొన్నిమాసములు బర్తరపు(సస్పెండ్) చేసిరి. ఆకాలమున రాజమహేంద్రవరములో నొక విశేషము జరిగెను. ప్రథమ శాస్త్రపరీక్షకు షేక్స్పియరు మహాకవి రచియించిన "జూలియస్సీజ"రను నింగ్లీషు నాటకము పఠనీయగ్రంథముగ నిర్ణయింపబడెను, అప్పటి కళాశాలా ప్రధానాచార్యులైన స్టోనుదొరగారు నాటకమును విద్యార్థులకు నేర్పి వారిచే నాడించిరి. కళాశాలయే రంగస్థలము. అప్పుడు సాహేబుగారొక పెద్దమనుష్యునియొద్ద నాటకమునకు భోగముదానిని తీసికొని రావచ్చునా యని యడిగిరట, కూడదని యాపెద్దమనిషి బదులుచెప్పగా దొరసానులు వచ్చుటలేదా? భోగముదేల రాకూడదని సాహేబుగారు మరల ప్రశ్నించి రట ; ఆవార్తలా పెద్దమనుష్యుడు పూసగ్రుచ్చినట్లు దొరగారితో చెప్పగా, దొరగారికి సాహేబుగారిమీద నెంతో నాగ్రహము గలిగెను. దానిఫలిత మేమనగా సాహేబుగారు, నాటకమునకు టిక్కెట్టు కొన్నప్పటికిని సాహేబుగారిని లోపలికి రానీయవద్దని చెప్పి కళాశాల ముఖద్వారమువద్ద పోలీసువారిని దొరగారు కావలిబెట్టిరి. శ్రీ మోచర్ల రామచంద్రరావు గారును. మహమ్మదాజము సాహేబుగారును నాటకము చూచుటకై గుఱ్ఱపు బండినెక్కి వచ్చిరి, పోలీసువారు దొరగారి యాజ్ఞను విన్నవించిరి. వెంటనే సాహేబుగారు నాగుర్రపుబండిమీదనే యింటికిపోయిరి. సాహేబు గారు దొరసానులను భోగముదానితో సమానము చేసిరని దొరగారు కోపించి యిట్లుచేసిరి. అయిదేసి రూపాయలు టిక్కెట్టు కొనుక్కొని నేమను, లక్ష్మీపతిగారును నాటకమునకు పోయి చూచితిమి, నాటకము బాగుండెను. చంగారెడ్డిగారు నాటకములో "ఆంటోనీ" పాత్రను ధరించి మిక్కిలి హృదయంగమముగ నభినయించిరి. సాహేబుగారి స్థానమందు దొరతనమువారు గోదావరి మండల విద్యాశాఖాధికారి(అసిస్టెంట్ ఇన్స్పెక్టరు ఆఫ్ స్కూల్స్) గా బరంపురం నివాసులైన ఛటర్జీగారిని బంపిరి.

వారు పరమ సాధువులు. మానసీయులు. ఆయన పనిలో ప్రవేశించిన తరు వాత మా పాఠశాలకు స్వయముగవచ్చి పరీక్షనడిపిరి ఈ విషయమున నేనాత్మగౌరవమును నిలుపుకొంటినని నామిత్రులు సంతోషించిరి.

1901 వ సంవత్సరము జూను నెలలో నాలుగవ గోదావరీమండల సభ యమలాపురములో జరిగెను. సభా ప్రతినిధులు గూడుచుండుటకు గావలసినన్ని బల్ల లమలాపురములో దొరకనందున, నాపాఠశాలలోని బల్ల లను కొన్నింటిని, నేను రహదారి పడవమీదవేసి యమలాపురము బంపి తిని. ఆ సభకు నేనుకూడ పోయి యా మూడుదినములు నా మేనమామ యైన మల్లయ్యశాస్త్రిగారి యింట బసచేసితిని. గంజాము మండలములో నున్న శ్రీకాకుళము మునిసిపాలిటీ కధ్యక్షుడైన శ్రీ తిమ్మరాజు శివరావు పంతులుగా రధ్యక్షత వహించిరి. శ్రీ గంజాము వేంకటరత్నము పంతులు గారు కూడ సభకు వచ్చియుండిరి. వారి ప్రోత్సాహముమీద నేనొక తీర్మా నముమీద మాటలాడి సభలో పాల్గొంటిని. గోదావరీమండల సభ మొట్ట మొదట కాకినాడలో న్యాపతి సుబ్బారావుపంతులుగారి యధ్యక్షతక్రింద జరి గెను. రెండవసభ 1896 వ సంవత్సరమున రాజమహేంద్రవరమున శ్రీ జంబులింగ మొదలియారుగారి యధ్యక్షతక్రింద జరిగెను. 1897 వ సంవత్సరమున నేలూరు పట్టణమున శ్రీ రెంటాల వెంకటసుబ్బారావుగారి యాధిపత్యమున మూడవసభ జరిగెను. ఆ సభకు నే బోవలేదు. 1898 వ సంవత్సరమున పసలపూడిలో శ్రీ కృత్తివెంటి పేర్రాజుగారి యధ్యక్షత క్రింద జరిగినట్లు యిదివరకే వ్రాసితిని. 1899 వ సంవత్సరమునను, 1900 వ సంవత్సరమునను మండలసభ మృగ్యమై యెక్కడను జరుగ లేదు. ఎట్టెటో యయిదవ సభ యమలాపురములో జరిగెను. ఆ సభలో నేను కొన్నిపద్యములు చదివితిని. అవి "దేశోపకారి" పత్రికలో ప్రకటింప బడెను. ఆ పత్రికను మహారాజశ్రీ సత్యరాజు సీతారామయ్యగారు యేలూ రులో నడిపిరి.

నా పాఠశాల విద్యాశాఖవారి సమ్మతిని బడయుటకై గడచిన యేప్రియలు నెలలోనే దరఖాస్తుచేసినను నధికారులు దాని నంగీకరించి నట్లు జూలైవరకు నుత్తరువు రాలేదు, లోవరుసెకండరీ పరీక్షకు దర ఖాస్తు చేయవలసిన విద్యార్థులు యాగస్టులోనే దరఖాస్తులను తప్పక పంప వలెను. ఎంతకాలమునకును నుత్తరువులు రాకపోవుటచే నేనాగస్టునెలలో మా పాఠశాలను గురించి నుత్తరువులు పంపుమని డైరక్టరుగారికి తంతి

వార్త నిచ్చితిని. పాఠశాల నంగీకరించితిమని తంతిమూలముగనే నాకు జవాబువచ్చెను. తరువాత కొన్నినాళ్ళకు డైరెక్టరుగారి కార్యస్థానమునుండి క్రమముగ లిఖితపూర్వకమైన సమాధానము వచ్చెను. ఈవిధముగ నాపాఠశాల 1901 వ సంవత్సరము విద్యాశాఖవారి యనుమతిని బడసి వర్ధిల్లెను. మా పాఠశాలను గురించి యిక్కడ నొకమాటి వ్రాసెదను. దీనిపేరు "హిందూలోవరు సెకండరీ పాఠశాల". స్థాపించిన నేను పేదవాడ నగుటచే, మాపాఠశాలగూడ పేదగనే యుండెను. చాలమంది పేదవిద్యార్థులు మా పాఠశాలలో చేరిరి. కొందరు విద్యార్థులు జీతమీయకుండను, కొందరు సగముజీత మిచ్చుకొనుచును, చదువుకొనుచుండిరి. మొత్తముమీద మా పాఠశాలలో విద్యాభ్యాసముచేయు బాలురలో నూటికేబదిమంది జీతమీయకుండ చదువుకొనువారే. "మంగలివానినిజూచి యెద్దు కాలు కుంటిన" దన్నమాట నిజము. నెలకు వేయిరూపాయిలు సంపాదించుచున్న న్యాయవాది నాకిట్లు వర్తమాన మంపెను. "మాయింట నాభార్య మేనల్లు డొకడున్నాడు. అతనికి ధర్మార్థముగ నే నన్నము బెట్టుచున్నాను మీరు జీతములేకుండ చదువుచెప్పుడు." పరమలోభియైన యీన్యాయవాదియొక్క స్థితియు, గుణము నేనెరుగుదును; కావున వారికోరిక నిరాకరించితిని, ఇదిగాక మరియొక యుదాహరణ గలదు. చిరకాలము తహసీలుదారు పని చేసి, లంచములు విశేషము పుచ్చుకొని, చాల ధనమార్జించి, యప్పుడు నెలకు నూరురూపాయలు పింఛనుదీసికొనుచున్న యొక గొప్ప గృహస్థుడు లక్ష్మీపతిగారికడకుబోయి తన భార్య తమ్ముడు మిక్కిలి పేదవాడనియు, వానికి జననీ జనకులు లేరనియు, వానికి తానుచితముగ నన్నము బెట్టుచున్నాననియు, కావున వానికి నుచితముగ చదువు చెప్పవలసినదనియు కోరెను. లక్ష్మీపతిగారు "నాపెత్తనమేమియులేదు. జీతమువిషయమున నంతయు లక్ష్మీనరసింహముగారిదే" యని చెప్పి తప్పుకొనిరి ఆగృహస్థుడు నాకడకు వచ్చి నన్ను పీకుకొని దినలేదు. సత్రమున్నపక్షమున భాగ్యవంతులుగూడ, పూటకూళ్ళయింటదిన్న పక్షమున డబ్బులు ఖర్చగునని తేరగ నన్నముదొరికెడి సత్రములోనే భుజించిన ట్లుచితముగ చదువు చెప్పెదివారున్న పక్షమున సంపన్నులు సయితము తమబందుగుల కుచితముగ చదువుచెప్పమని సిఫార్సు చేయునట్టి నీచదశ మనదేశములో నింకను పోలేదు. నెలకు నూరురూపాయలు జీతముపుచ్చుకోదగిన ప్రధానోపాధ్యాయుడు మాపాఠశాలలో నుచితముగ పనిచేయుచున్నను, మిగిలిన యుపా

ధ్యాయులకు నెలనెలకు సీయవలసిన జీతము వసూలగుట కష్టముగ నుండెను. ఇక్కడ నాటకసమాజమును గురించి కొన్నిమాటలను వ్రాయ వలెను.

రాజమహేంద్రవర హిందూనాటక సమాజమును 1889వ సంవత్సర మున శ్రీ హనుమంతరావు నాయుడుగారు స్థాపించిరనియు, నాయుడుగారు టంగుటూరి ప్రకాశముగారు, మున్నగువారు ముఖ్య నటు లుగ నుండిరనియు నీవరకే వ్రాసితిని. ఆసమాజము 1894వ సంవత్సరము వరకు నాటకములాడి నాట్యకళను పోషించి పేరువడసెను. అది మొదలు కొని, 1901వ సంవత్సరము వర కాసమాజమువారు నాటకములను ప్రయో గింపలేదు. హనుమంతరావు నాయుడుగారి కోరిక ననుసరించి నేను వారికి కొన్ని నాటకములను రచియించి యిచ్చితిని. వారు పెక్కుసారులు నా నాటకములను ప్రయోగించి మెప్పువడసిరి.

●

స్వీయ చరిత్రము

పదవ ప్రకరణము

నాటకసమాజ పునరుద్ధరణము

నాటకసమాజమును మరల నుద్ధరింపవలెనని హనుమంతరావు నాయుడుగారికిని, నయినవోలు తాతయ్యనాయుడుగారికిని, నుత్సాహము పుట్టెను. హనుమంతరావునాయుడుగారి కప్పటికి రమారమి యేబదిసంవ త్సరములుండినను, వయసు హెచ్చినకొలది నాటకములమీది యుత్సా హము హెచ్చెనేగాని మందగింపలేదు. ఆ యుత్సాహాగ్ని సమిధలువేసి ప్రజ్వలింపచేసెనేగాని తాతయ్యనాయుడుగా రార్పలేదు. ఆ యుత్సాహము పురస్కరించుకొని, హనుమంతరావునాయుడుగారు, నాటకసమాజమును మరల నుద్ధరించిరి. మొట్టమొదట నా "పారిజాతాపహరణ" నాటకమును, నవాబుదేవిడీలో ప్రయోగించిరి. అప్పటికి ప్రకాశముగారు మునిసిపల్

సభ్యుడుగాను, న్యాయవాదిగను నుండుటచే నాటకములలో పాల్గొనుట మానిరి. కృత్తివెంటి నాగేశ్వరరావు, గాడిచర్ల రామమూర్తి, స్త్రీ పాత్రలు ధరింప నారంభించిరి. రాజమహేంద్రవరములోని కొందరు మహమ్మదీయ యువకులు, సమాజముగచేరి, హిందూస్తానీ నాటకము లాడదలచి, యిస్నీసుపేటలోని కుమ్మరిగుంటయొద్ద నొక పాకవేసి, కొన్నినాటకములు మాత్రమే ప్రయోగించి, మానివేసి, తమ పర్ణశాల నమ్మజూపిరి. అప్పుడు హనుమంతరావునాయుడుగారు, నూరురూపాయల కాపాక క్రయమునకు దీసికొని, తాతయ్యనాయుడుగారి సహాయముచేత, నేడెనిమిది సంవత్సర ములనుండి గాఢనిద్రపోవుచున్న నాటకసమాజ కుంభకర్ణుని విశ్వప్రయత్నముమీద మేలుకొలిపిరి. హనుమంతరావునాయుడుగారు, మ్యునిసిపలు పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగ నున్నందున పైయధికారు లేమందురో యని, సమాజకార్యములన్నియు తానే చక్కబెట్టుచున్నను, బహిరంగ ముగ తానే మేనేజరుగ నుండుట కిష్టములేక, తన ప్రియమిత్రుడనై, యొకరి తాబేదారుడుగాక, స్వతంత్రుడనైన, నన్ను బిలిచి సమాజమునకు ప్రెసిడెంటుగాను, మేనేజరుగాను నుండుమని కోరిరి. నాటకసమాజమన్న నాకు మిక్కిలి కుతూహలమే గావున వారికోరిక నే నంగీకరించితిని. మునుపటి కుమ్మరిగుంట యిప్పుడులేదు. మా నాటకపుపాకయున్న స్థలము బోధనాభ్యసన కళాశాల (ట్రెయినింగ్ కాలేజీ) యావరణలో గలిపివేయ బడినది. కుళ్ళునీళ్ళ గుంటయైన కుమ్మరిగుంట పూడ్చివేయబడినది. ఆ తాటియాకుల పాకలో మా సమాజమువా రనేకనాటకములను ప్రయోగించిరి. హనుమంతరావునాయుడుగారి యుత్సాహమునకు, శ్రీ సత్యవోలు గున్నేశ్వరరావుగారును, కృత్తివెంటి నాగేశ్వరరావుగారును తోడుపడిరి సమాజమునకు నేను ప్రెసిడెంటుగాను, గున్నేశ్వరరావుగారు వైసుప్రెసిడెంటుగాను నేర్పడితిమి. సమాజమువారు వచననాటకములేగాక, పద్య నాటకములుగూడ, నభినయింప నారంభించిరి. సమాజమువారు నా నాటకములేగాక యితర నాటకములుగూడ నాడనారంభించిరి. ఇతరనాటకములివి. వీరేశలింగముగారి "శాకుంతలము", "రత్నావళి", "చమత్కార రత్నావళి", "సత్యహరిశ్చంద్ర" నాటకము; వడ్డాది సుబ్బారాయుడుగారి "వేణీసంహారము", "విక్రమోర్వశీయము"; ధర్మవరము రామకృష్ణ మాచార్యులవారి "చిత్రనళీయము" మొదలైనవి. నా నాటకములు "గయోపాఖ్యానము", "పారిజాతాపహరణము", "శ్రీరామజననము",

"ద్రౌపదీ పరిణయము", "నల నాటకము", "సీతాకళ్యాణము", మొదలైనవి. అప్పటికి "ప్రసన్నయాదవ" నాటకమును నేను వ్రాసియుండలేదు గనుక దానిపేరు చెప్పలేదు. ఈపర్యాయము పద్యములు చదువనేర్చిన యువకులనేకులు మాసమాజములో చేరుటచే, మేము సరసమైన పద్యగద్యాత్మక నాటకములుగూడ ప్రదర్శింపగలిగితిమి. వచన భాగములో బాగుగ నభినయింపగలవారు శ్రీ హనుమంతరావునాయుడుగారు నయినవోలు తాతయ్యనాయుడుగారు. పద్యభాగములో నేర్పుతో నభినయింపగలవారు, దుర్గి గోపాలకృష్ణారావుగారు. ఈయన జిల్లాకోర్టులో గుమాస్తాగా నుండెడివారు. రెండవవారు నేతి సుబ్బయ్యగారు. ఈయన మ్యునిసిపల్ పాఠశాలలో నుపాధ్యాయుడుగ నుండెడివారు. మూడవవారు పరిటాల వీరన్నగారు. ఇతనికి నుద్యోగమేమియులేదు ఈనాముదారు "రంగతిలక" మని చెప్పవచ్చును. వీరరస ప్రధానములగు పాత్రల నభినయింపవలసి వచ్చినప్పు డితనికితడే సాటి. "వేణీసంహార"ములో నశ్వత్థామపాత్రయు, "గయోపాఖ్యానము"లో నర్జునపాత్రయు, "ప్రసన్నయాదవము"లో నరకాసురునిపాత్రయు సీతడభినయించినప్పుడే చూడవలెను. దుర్గి గోపాలకృష్ణారావుగారు "వేణీసంహారము"లో ధర్మరాజుపాత్రను, "హరిశ్చంద్ర"లో హరిశ్చంద్రపాత్రయును, "ప్రసన్నయాదవ", "గయోపాఖ్యాన"ములలో శ్రీకృష్ణపాత్రయు, "చిత్రనళీయము"లో నలపాత్రయు మిక్కిలి సొగసుగ నభినయించి ప్రేక్షకులను రంజింపజేసెడివారు. నేతి సుబ్బయ్యగారు మిక్కిలి శ్రావ్యముగ పద్యములు జదివి "వేణీసంహారము"లో దుర్యోధన పాత్రయును, "గయోపాఖ్యానము"లో గయునిపాత్రను, "శాకుంతలము"లో దుష్యంతుని పాత్రను, "విక్రమోర్వశీయము"లో రాజుపాత్రను, శ్లాఘా పాత్రముగ నభినయించి సభాసదుల మెప్పుబడసెడువాడు. గయోపాఖ్యానములో పద్యములు చేర్చకమునుపు. హనుమంతరావునాయుడుగారే గయుని పాత్ర ధరించెడివారు. "వేణీసంహారము"లో సుందరకునిపాత్ర ధరించి, యా భాగము మహోద్భుతముగ నభినయించి, సభాసదులయొక్కయు, గ్రంథకర్తయైన శ్రీ వడ్డాది సుబ్బారాయుడుగారియొక్కయు, స్తోత్రములకు పాత్రులైరి. వీరుగాక తాతయ్యనాయుడుగారినిగూడ ప్రశంసింపవలెను. హనుమంతరావునాయుడుగారు పెద్దలై సుందరకునిపాత్ర ధరించుటమానిన తరువాత, తాతయ్యనాయుడుగా రా పాత్రను ధరించి, గ్రంథమంతయు నొక్క తప్పలేకుండ వల్లించి, హనుమంతరావునాయుడుగా రెంత బాగు

నొప్పించిరో యంత బాగుగ వీరును నొప్పించిరి హాస్యరసప్రధానములగు పాత్రల నటించుటలో తాతయ్యనాయుడుగా రద్వితీయుడు. ఇతడు "చిత్ర నళీయము"లో నెరుకలరాజై, "హరిశ్చంద్ర"లో వీరబాహుడై, "గయో పాఖ్యానము"లో కౌశికుడై, "పారిజాతాపహరణము"లో క్రైరవుడై చక్కగ నభినయించి సభాసదులను కడుపుబ్బ నవ్వించుచుండెడివాడు. నాటకభారమంతయు నతనిమీదనే యుండెడిదనుట సత్యమునకు దూరము గాదు. ఇతడు విద్యావంతుడుగాడు. కొంతకాలము ప్రాథమికపాఠశాలలలో నుపాధ్యాయుడు, పిమ్మట కొంతకాలము సాముకసరత్తులనేర్పెడి నుపా ధ్యాయుడు. కాని గట్టిపట్టుదలయు శ్రద్ధయు గలవాడు. సామాజికులందరకు విష్టుడై తలలో నాలుకవలె నుండెడివాడు. ఈవరకు చెప్పిన నటులుగాక, మన సమాజములో. సరిపల్లె కామేశ్వరరావుగారు, ధరణీప్రగడ వెంకట శివరావుగారు, సత్యవోలు గున్నేశ్వరరావుగారి తమ్ముడు బంగారురాజుగారు, చెరువు సోమయాజులుగారు. చంద్రపాటి సుబ్రహ్మణ్యముగారు మొదలగు వారుగూడ తమ కుచితములైన పాత్రలను ధరించెడివారు. 1902 వ సంవ త్సరములో తురుమెళ్ళ వెంకటసుబ్బారావుగారుగూడ మా సమాజములో చేరి కొన్ని స్త్రీ పాత్రలను ధరించెడివారు. ఆయన కొంతకాలము మా పాఠశాలలో నుపాధ్యాయుడుగగూడ పనిచేసెను. వీరుగాక సత్యవోలు లక్ష్మీపతిగారు, చెరుకుఫిల్లి వేంకటరామయ్యగారు, చిత్రపు వెంకట నరసింహారావుగారు, చల్లపల్లి బ్రహ్మాజీరావుగారు, మోచర్ల సుందర రామయ్యగారు, రాయవరపు రామమూర్తిగారు మొదలగువారు పాత్రలను ధరింపకయే సమాజములో సభ్యులుగనుండి, సమాజ కార్యనిర్వహణమందు నాకును గున్నేశ్వరరావుగారికిని, మిక్కిలి తోడ్పడుచుండిరి వారిమున కొక నాటకము ప్రయోగించుచుంటిమి. ఆ సంవత్సరమున వర్షాకాలములో, సురభినాటకసమాజమువారు, రాజమహేంద్రవరమువచ్చి, మెరకవీధిలో నొకదొడ్డిలో దేరావేసి, కొన్ని నాటకము లాడిరి. ఆ సమాజములో స్త్రీలు స్త్రీ పాత్రలను, నొకప్పుడు పురుషపాత్రలనుగూడ ధరించి, రూపకములను ప్రదర్శించుటచే, వారి నాటకములు జనుల నాకర్షించెను. మాపై గిట్టనివారు కొందరు సురభినాటకములను, మా నాటకములనుపోల్చి పత్రికలలో మాపై దూషణపూర్వకములైన విమర్శలను చేయజొచ్చిరి. వాటిని మేము సరకు జేయక మా దారిని మేము నాటకము లాడుచుంటిమి. మా నాటకములో

బెడదకోట రమణయ్యగారను నతడు హాస్యము చెప్పుచుండెడివాడు. ఈయన హాస్యము జనరంజకముగాను సరసముగాను నుండెడిది.

ఈయన ప్రయిమరీ పరీక్షయందు కృతార్థుడై, మాపాఠశాలనుండి బోధనాభ్యసన పాఠశాలకుబోయి, ట్రయినింగయి, మ్యునిసిపలువారి పరిపాలనలోనున్న ప్రాథమిక పాఠశాలలో నొకదాని యందుపాధ్యాయుడై, వీరభద్రపురములో నిల్లువాకిలి సంపాదించుకొని నిటీవల మృతినొందెను.

మా నాటకసమాజమువారు ప్రయోగించిన నాటకములకు ప్రేక్షకుల వలన సొమ్ము విశేషముగనే వచ్చుచుండెడిది. మొదట గున్నేశ్వరరావు గారు, తెరలు వేయించుటకును దుస్తులు, సామానులను తయారుచేయించుటకును వేయిరూపాయలు పెట్టుబడిపెట్టి నాటకములవలన వచ్చు రాబడితో వారిఋణమును క్రమక్రమముగ వాయిదాలమీద తీర్చుకొనిరి. మా సమాజమునకు సత్యవోలు గున్నేశ్వరరావుగారును, సత్యవోలు లక్ష్మీపతిగారును రెండు కల్పవృక్షములవలె నుండిరి.

సమాజము వృద్ధిలోనుండగా మేము మరియొక ప్రదేశమునకు వెళ్ళి నాటకములాడవలెనని మాకు కుతూహలము పుట్టినది. ఆ యుబలాటము చేత మేము 1901 వ సంవత్సర మక్టోబరునెలలో పయనమై నరసాపురము వెళ్ళితిమి. ఒక రహదారి పడవ రాకపోకల కిరువదియైదు రూపాయలకు గుదుర్చుకొని, రమారమి యిరువదియైదు సామాజికులను తీసికొని నేను బోయితిని, హనుమంతరావునాయుడుగారు, సత్యవోలు లక్ష్మీపతిగారును మావెంటవచ్చిరి. నరసాపురములో పెద్దకాలువయొడ్డునున్న లోకలుఫండు సత్రములో బసచేసితిమి. వంటచేయుటకై ఒక వంట బ్రాహ్మణుని గుదుర్చుకొంటిమి. యంబిరుమన్నారు కోవెలకు త్తరముగనున్న దేవిడీస్థలములోనున్న పాక మాకుదొరికెను. అక్కడ రెండు నాటకములాడితిమి, మొదటిది నా "పారిజాతాపరణ" నాటకము. రెండవది "గయోపాఖ్యానము". నాటకములు రక్తికట్టెనుగాని, మే మనుకున్నంత విశేషధనమురాలేదు. రెండునాటకములకు మొత్తంమీద నూటయేబదిరూపాయలు వచ్చెను. ఆసొమ్ము ఖర్చులకే సరిపోయెనుగాని మాకేమియుమిగులలేదు.

ఆ సంవత్సరము డిశంబరు నెలలో గుంటూరు ప్రథమ నాటకసమాజమువారు మాపురమువచ్చి, మా నాటకపాక యద్దెకుపుచ్చుకొని నాళమువారి సత్రములో బసచేసి, కొన్ని నాటకములు ప్రయోగించిరి, వారి ప్రదర్శనములు ప్రజానురంజకములై దర్శనీయములైయుండెను. వారి

"శాకుంతలము", "వేణీసంహారము", "చిత్రనళీయము", "సారంగధర" నాటకము, "సునందినీ పరిణయము" మొదలగునవి ప్రయోగించిరి. హరి ప్రసాదరావుగారు కథానాయక పాత్రను, హనుమంతరావుగారను మాధ్వ యువకుడు కథానాయిక పాత్రను ధరించి. యెల్లవారల మెప్పును వడసిరి. ఈసమాజమువారు మున్నొకసారి 1884వ సంవత్సరము డిశంబరులో వచ్చి, వచన నాటకములు ప్రయోగించి పురజనులచేత గౌరవింపబడి వెళ్ళిరి. ఈ పర్యాయము పీరు పద్యగర్భితములైన మహానాటకములను మిక్కిలి నిపుణతతో ప్రయోగించి ప్రఖ్యాతిగాంచి వెళ్ళిరి. వారిలో హరి ప్రసాదరావుగారు సుప్రసిద్ధ నటులు. గానవిశారదులు. వారిచేతనే యీ సమాజమునకు మిక్కిలి పేరువచ్చెను.

మా నాటకసమాజమువారు నాటకములాడుట వట్టి సరదాకొరకే గాదు. కొంత పరోపకారము చేయుచుండిరనుట గర్వోక్తిగాదు కొందరి విద్యార్థులకు జీతములిచ్చి మేము చదువు చెప్పించుచుంటిమి. కొందరు పాత్రధారులకు జీతములిచ్చి వారిని పోషించుచుంటిమి. ఒకరిద్దరికి వివాహములు చేసితిమి. బెడదకోట రమణయ్యగారి గృహనిర్మాణమునకు గొంత సహాయముచేసితిమి. హరికథాకాలక్షేపమునందు మిక్కిలి ప్రసిద్ధికెక్కిన అనంతరాము భాగవతారు, రాజమహేంద్రవరము రాగా వారిని, మా నాటక శాల కాహ్వానించి, యొకనాటి మధ్యాహ్నమున వారిచే హరికథ చెప్పించి వారికి నూటపదియారు రూపాయలను బహుమానముగ నిచ్చితిమి. ఆంధ్ర దేశ గాయకులలో మేటియైన, మిక్కిలి నిపుణతతో పిడేలు వాయించి, దేశ ప్రఖ్యాతిగాంచిన కోటయ్యదేవరగారిని రప్పించి, మా నాటకశాలలో నొక పాటకచేరీచేయించి, వారికి నూటపదియారురూపాయలను బహుమానమిచ్చి, గౌరవించితిమి. బిపినచంద్రపాలుగారు రాజమహేంద్రవరము వచ్చినపుడు, వారి యుపన్యాసమునకు తోడ్పడదలచి, మా నాటకశాలలో "వేణీసంహార" నాటకము ప్రయోగించి, దానివలన వచ్చిన సొమ్ము నూటయేబదిరూపాయలు నేనే స్వయముగ దీసికొని, పాలుగారి బసకుపోయి వారికాసొమ్ము సమర్పించితిని. పాలుగారు కృతజ్ఞతాపూర్వకముగ నాసొమ్ము నంగుకొని "దీనివలన నా ప్రయాణము మరికొంతదూరము సాగును" అని యింగ్లీషులో పలికిరి. ఒకసారి, నాటకశాలలో సామాజికుల యానందముకొరకు, దాసరిభాగవతులచే, భాగవతము కట్టించి, సముచితముగ వారిని సమ్మానించితిమి. నాటకశాలలో నప్పుడప్పుడు, విందులు గావించుకొని వినో

దించుచుండెడివారము. ఆత్మగౌరవముగూడ సామాజికులు కాపాడుకొను చుండెడివారు. అల్లరి జరుగకుండ జాగ్రత్త పెట్టెదమను వంకమీద, పోలీసు జవానులు టిక్కెట్లులేకుండ నాటకశాలలో ప్రవేశించి, నాటకములు చూచు చుండెడివారు. మంచినాటకము లాడినప్పుడు నాటకశాల జనముతో మిక్కిలి క్రిక్కిరిసియుండెడిది. అట్టి సమయమున పోలీసువారు కొంతస్థల మాక్రమించుటచే, టిక్కెట్లుకొని నాటకము చూడవచ్చినవారు స్థలములేక వెడలిపోవుచుండిరి. ఇందువలన మాకు కొంతనష్టము వచ్చుచుండెడిది. ఇది కనిపెట్టి, మా సభ్యులలో నొకడు, నాటకశాలలో బ్రవేశించిన పోలీసు భటుల నెంబర్లు వ్రాసుకొని, యా నెంబర్లను ప్రకటనార్థ మొకపత్రికకు పంపెను. ఆవి పత్రికలలో ప్రకటింపబడగానే పై యధికారులు వారిని గట్టిగ మందలించిరి. నాటనుండి మా నాటకశాలపీడికి మా యూరి పోలీ సుల దండయాత్రలు తగ్గెను.

తాటియాకుల పాకలో నాటకములు వేయుటచేత నెప్పుడైన నగ్ని ప్రమాదము గలుగునేమోయని, మా మనసులో భయము గలుగుచుండెను. శ్రీ సత్యవోలు లక్ష్మీపతిగారు మాకాభయమును దీర్చిరి. ఇన్నీసుపేటలో, నాగులచెరువు వీధిని, లక్ష్మీపతిగారికి రమారమి 2,000 గజములు వైశా ల్యముగల కాళీస్థలముగలదు. మా నాటకసమాజము నిమిత్తము లక్ష్మీపతిగా రాస్థలమున, పెంకుటినాటకశాల నొకదానినిగట్టించి మాకిచ్చిరి. నెలకు యిరు వదిరూపాయ లద్దెక్రింద మేము వారికిచ్చునట్లు లక్ష్మీపతిగారు నిర్ణయించిరి. మేము లక్ష్మీపతిగారి కొక్కనెల యద్దెనైన సరిగ నిచ్చినట్టి పాపమున బోలేదు. డబ్బున్నప్పు డిచ్చెడివారము. లేనప్పు డూరకుండెడివారము. ఆ భవనమునకు లక్ష్మీపతిగారు రమారమీ రెండువేలరూపాయలు ఖర్చు పెట్టిరి. వారికి మా వలన వడ్డీయైన గిట్టలేదు. అద్దె ముట్టకపోయినను లక్ష్మీపతిగారు సమాజములో నొక సభ్యుడగుటచే, దానిమీది యభిమానము చేత, మమ్ము నొక్కి యద్దె నడుగలేదు. ఈభవనము 1902వ సం॥రమున ప్రారంభింపబడి 1903వ సంవత్సరమున ముగింపబడెను. ఆ గృహప్రవేశ మహోత్సవమును జరుపుటకు రావుబహదూరు కందుకూరి వీరేశలింగము గారి నడిగితిని. ఆ పంతులుగారు వచ్చుటకు వీలులేక, యా కార్యము నెరవేర్చుటకై శ్రీ కనుపర్తి శ్రీరాములుగారిని బంపిరి. వారువచ్చి యా కార్యమును నెరవేర్చిరి. నాటనుండి మే మా భవనమును సమాజమున్నంత కాలము సొంతభవనముగానే భావించి మెలగితిమి.

నాకు మొదటినుండియు నేవో కొన్ని పాఠశాలలు పెట్టవలెనని మిక్కిలి కుతూహలముగనుండెను. ఆ కుతూహలముచేతను, నాకు కొంత లాభముండుటను నాశచేతను, హిందూ లోవరు సెకండరీ పాఠశాలను స్థాపించితిని. నా కుతూహలము పరిపూర్ణముగ నెరవేరనందున, నేనున్నత పాఠశాలగూడ స్థాపింపదలచితిని. ఇట్లు పాఠశాలలు స్థాపించుటవలన దేశమునకు రెండు లాభములు గలుగునని నా యభిప్రాయము. చిన్నవో పెద్దవో పది యుద్యోగము లుండునుగనుక, పదిమంది కుద్యోగములు దొరకిన, పునదేశములో మిక్కిలి ప్రబలముగనున్న నిరుద్యోగసమస్య కొంతవరకు సాధింపబడును. గవర్నమెంటువారి పాఠశాలలోను, బోర్డు మునిసిపల్ పాఠశాలలలోను, విద్యార్థుల కుచితముగ విద్యగరపు నాచార మాదినములలో నంతరించినందున, నిరుపేద బాలకులు మా పాఠశాలలలో జదువుకొని బాగుపడవచ్చును. గ్రాంటు మొదలగు వానివలన స్థాపకుల కే స్వల్పలాభమైన గలుగవచ్చును. ఈయుద్దేశములు మూడును మనస్సున మల్లడిగొన, నేను మధ్యమపాఠశాల స్థాపించి- దానితో సంతుష్టిజెందక యున్నత పాఠశాల స్థాపింపవలెనని 1902 వ సంవత్సర ప్రారంభమున నాల్గవఫారము (IVth Form) బెట్టితిని. ఆతరగతి నా లోవర సెకండరీ పాఠశాలా భవనమునబెట్టక, నా పాఠశాలా భవనముయొక్క దొడ్డిగుమ్మ మున కెదురుగనున్న మహమ్మదీయుల కచేరీసావిడి యద్దెకుపుచ్చుకొని, యాతరగతి నందు నెలకొల్పితిని. బాలకులు ప్రోత్సాహకరముగానే చేరిరి. గత సంవత్సరమున మా పాఠశాలనుండి లోవరు సెకండరీ పరీక్షకుబోయి గృతార్థులైనవారు కొందరు, వారుగాక పైవారు కొందరు, మా క్రొత్త తరగతిలోచేరి, నా పూనిక నెరవేర్చిరి. చాలకాలమునుండి నాకు మిత్రు డును, సంఘ సంస్కరణాది విషయములలో నాతో నేకీభవించువాడును, సజ్జనుడునునైన రామాప్రగడ వేంకట రామయ్యగారి నా తరగతి కుపాధ్యాయుడుగ, నెలకు ముప్పదిరూపాయలు జీతముమీద, నియోగించితిని. ఆయన యప్పటి ప్రథమశాస్త్ర (F. A.) పరీక్షయందు గృతార్థుడై, గత సంవత్సరమందు బోధనాభ్యసన కళాశాలలో బోధన విధానమును నేర్చు కొని, యుపాధ్యాయపదవికి యోగ్యతను సంపాదించిన యువకుడు. ప్రకృతిశాస్త్ర మైచ్ఛికముగ దీసికొని పట్టపరీక్షకు కొంతకాలము చదివిన బుద్ధిశాలి. నాల్గవతరగతి కాయన ప్రకృతిశాస్త్రమును గణితమును బోధించు చుండెడివాడు. ఆయనకన్న వయసుచేతను ననుభవముచేతను లక్ష్మీపతి

గారు పెద్దలగుటచే, నాల్గవతరగతి కింగ్లీషుపాఠము బోధింపుమని లక్ష్మీపతి గారిని గోరితిని. వారు నాకోరికను నిరాకరింపక యట్లుచేసిరి.

ఈ క్రొత్తతరగతి నెలకొల్పుటచే నాకు గొన్ని క్రొత్త చిక్కులు సంభవించినవి. ఉన్నతపాఠశాల యొకటి బట్టణమున బయలుదేరినయెడల బోధనాభ్యసన కళాశాలకు నష్టము కలుగునని, కళాశాలా ప్రధానోపాధ్యాయులకును సహాయోపాధ్యాయులకును భయము. అప్పటి కళాశాలా ధ్యక్షులు మార్కు హంటరు దొరగారు తమ యభిప్రాయమును, నా డుత్తర సర్కారులపాఠశాలల పరీక్షాధికారియైన విలియమ్సుపిళ్ల గారికి వ్రాసిరి. పిళ్లగారు దాక్షిణాత్యులు. క్రైస్తవులు. నా పాఠశాలకంటె ముందే మా పట్టణమున మిషను వారొక యున్నత పాఠశాల స్థాపించిరి. వారు నాలుగైదారు ఫారముల నొక్కసారే స్థాపించిరి. బోధనాభ్యసన కళాశాలలోని, యున్నతపాఠశాలలో గల విద్యార్థులు, చాలమంది సర్టిఫికేటులను దీసికొనకుండపోయి, మిషను పాఠశాలలో చేరిరి. అందువలన దొరతనమువారి పాఠశాలకు కొంత నష్టముకలిగెను, మా పాఠశాలలో నాల్గవతరగతి యొక్కటే స్థాపించితిని కావున, దొరతనమువారి పాఠశాలకు, మా పాఠశాలవలన నష్టముకలుగలేదు. అయినను హంటరుదొరగారు మా మీదగాని, మిషనువారిమీదగాని గట్టిగ వ్రాయకపోవుట చేతను, విలియమ్సు పిళ్ళగారికి మిషనువారిమీద భక్తి యుండుటచేతను, పిళ్ళగారు మా మీద చేసినంత ధూకుడు మిషనువారిమీద చేసినట్లు కనబడదు. వారి కోపమునకు నే నెంత మాత్రము లెక్కసేయక యెప్పటిలాగున నడుపుచుంటిని. నా పాఠశాలలోని నాలుగవ ఫారము దీసివేయవలసినదనియు, నట్లు దీసివేయనియెడల నా లోవరు సెకండరీ పాఠశాలకు మునుపిచ్చిన సమ్మతిని లాగివేయించెదననియు, బెదరించుచు మా పిళ్ళగారు నాకు వ్రాయించుచువచ్చిరి ఆ బెదరింపులను నేను లెక్కసేయక నాల్గవఫారము జరుపుమనే యుంటిని. మా పాఠశాలలో నే నా సంవత్సరము రాయవరపు రామమూర్తిగారిని, తురుమెళ్ళ వెంకట సుబ్బారావుగారిని కూడ నుపాధ్యాయులుగ నియమించితిని. కొందరు బాలురా సంవత్సర మధికముగ చేరుటచే వీరి నిద్దరిని నియోగింపవలసి వచ్చెను.

ఆసంవత్సరమున (శుభకృత్, 1902) నా మామగారు పురాణపండ వెంకటదీక్షితులుగారు తణుకుతాలూకా కాకరపర్రుగ్రామములో మృతి నొందిరి. నాభార్యను ముందుగ నక్కడకుబంపి, బంధుపరామర్శకై

పిమ్మట నే నాయూరుబోయి, పండ్రెండుదినములు ముగియగానే మరల రాజమహేంద్రవరము వెళ్ళితిని.

హిందూదేశముయొక్క రాజకీయములను, నాయకులు చర్చించి, దొరతనమువారికి విన్నవించుటకై దేశీయమహాసభ (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్) పుట్టినదిగదా: చెన్నరాష్ట్రము, బొంబాయిరాష్ట్రము, పంజాబు రాష్ట్రము, అలహాబాదురాష్ట్రము, బంగాళారాష్ట్రము మున్నగు భాగముల సమస్యలు విచారించుటకై యీయీరాష్ట్రముల సభలేర్పడెను. ప్రతిరాష్ట్ర సభయు నేడాదికొకసారి యేదోయొక ముఖ్యపట్టణములో సమావేశమగుచుండును. చెన్నరాష్ట్రమహాసభగూడ నేదోయొక పట్టణములో సమావేశమై వ్యవహరించుచుండును. 1902 వ సంవత్సరమున మన చెన్నరాష్ట్రసభ, జూనునెలలో కాకినాడ పట్టణమున సమావేశమయ్యెను. సుప్రసిద్ధ న్యాయవాదులు, దేశసేవకులునైన, కృత్తివెంటి పేర్రాజుపంతులుగారు సన్మాన సంఘాధ్యక్షులైరి. హిందూపత్రికాసంస్థాపకులును, రాజ్యాంగవ్యవహారవేత్తలునైన, జి. సుబ్రహ్మణ్యమయ్యరుగారు రాజకీయసభ కధ్యక్షులైరి. ఆసభకు రాజమహేంద్రవరమునుండి నేనును, నామిత్రుడు రాయవరపు రామమూర్తియు, వెళ్ళితిమి. ఆసభ మూడుదినములు జరిగెను. నాల్గవ దినమున రాష్ట్రీయసంఘసంస్కరణసభ జరిగెను. చెన్నపురినుండివచ్చి, రావుబహదూరు కందుకూరివీరేశలింగముపంతులుగారు, సంస్కరణసభాధ్యక్షతవహించిరి. ఈసభజరిగినపిదప మహారాజశ్రీ దుగ్గిరాల వెంకటసూర్యప్రకాశరావుగారు వీరేశలింగముగారి కొకనాటిరాత్రి విందుచేసిరి. శ్రీ ప్రకాశరావుగారు సంస్కరణప్రియులు. వీరేశలింగముగారియెడ మిక్కిలి భక్తిగలవారు. ఆయన పట్టపరీక్షసిద్ధులై జిల్లాకలెక్టరుగారి కచేరీలో నుద్యోగములోనుండిరి. ఆయన నిశ్చయముగ వీరేశలింగముగారితో భోజనము చేయుచుండెడివారు. ఈయన తమకాలమును వ్యర్థపరుపక, హిందూదేశ సంబంధమైన యార్థిక, సాంఘిక సమస్యలను నాలోచించి, వాటిలో ప్రజ్ఞ సంపాదించినవారు. మనప్రాంతములనుండి శాసననిర్మాణసభలకు సభ్యులై వెళ్ళిన మహాపురుషులకు, ప్రకాశరావుగారనేక సమస్యలలో, నమూల్యములైన సలహాలనిచ్చెడివారు. ఈయన మహావక్త. ఏసమస్యనుగూర్చియైన గంటలకొలది కంచుమ్రోగినట్లు వాగ్ధోరణిగలిగి, సుపన్యసింపగలరు. ఈయన పెందలకడ పింఛనుపుచ్చుకొని తనకాలము దేశసేవక్రింద నుపయోగపరచుచున్నారు. మండలపక్షమున ప్రకాశరావుగారు ప్రతినిధులై

శాసననిర్మాణసభకు సభ్యులై వెళ్ళిన, నెంతోబాగుండును. అట్లాకసారియైన జరుగకపోవుట మిక్కిలి శోచనీయము. వీరేశలింగముగారికి చేసినవిందునకు, ప్రకాశరావుగారు నన్నును, రాయవరపు రామమూర్తినిగూడ నాహ్వానించినందున, మేమిరువురము విందునకుబోయి వీరేశలింగముగారి పంక్తిని భోజనముచేసితిమి. వీరేశలింగముగారిపంక్తిని భోజనముచేయుటకు నాకిదియే మొదటిసారిగాదు. వీరేశలింగముగారు చెన్నపురికి వెళ్ళకమునుపే వారు రాజమహేంద్రవరములోనుండగానే, నేనును రామమూర్తియు వారి పంక్తిని భోజనముచేసితిమి. కాకినాడలో జరిగిన విందునకు బోవలదని నన్నును, రామమూర్తిని, రాజమహేంద్రవరమునుండి వచ్చిన ప్రతినిధులు కొందరు సలహాచెప్పిరిగాని, వారిసలహా నిరాకరించి మేము విందునకు బోతిమి. దీనివలననే నొకగొప్ప వీరుడనని చెప్పుటకుగాదు. సంస్కరణము నందభిమానము, మహాసంస్కర్తలయెడ గౌరవమునుగలదని చెప్పుటకే యీస్వల్పవిషయము వ్రాసితిని.

రాజమహేంద్రవరము నుండి కాకినాడకు నేను బోసందుకు శ్రీ పోలవరము జమీందారుగారికి నామీదనుదయించిన కోపమప్పటికి మూడుసంవత్సరములై నను, లేశమైన డిందుపడలేదు. 1902 వ సంవత్సరము వేసవికాలపు సెలవులలో మాసమాజమువారికి కాకినాడలో నాటకములు ప్రయోగింపవలెనని కుతూహలముకలిగెను నాకు మిత్రులును, మాసమాజసభ్యులునైన, శ్రీ చెరుకుమల్లి వేంకటరామయ్యగారికి. కాకినాడలో చాలమంది మిత్రులుగలరు. ఆకారణమున నాటక ప్రయోగములకొరకు దగుప్రయత్నముచేయవలసినదని, నేను వెంకటరామయ్యగారిని కాకినాడ పంపితిని. వెంకటరామయ్యగారు కాకినాడవెళ్ళి యొక గొప్ప గృహస్థుని కలుసుకొని, మాసమాజమువారి సంకల్పముచెప్పి, మాకు సహాయముచేయుమని కోరిరి. మహాపురుషుడైన యాగొప్ప గృహస్థుడు, శ్రీ పోలవరము జమీందారుగారిలో మాసమాజము సంకల్పము నెరింగించిరట, వెంటనే జమీందారుగారు దానికి లక్ష్మీనరసింహముగారధ్యక్షులుగనున్నారుగనుక, దానికి నేనేవిధమైన సహాయమును చేయక సోవుటయేగాక వారికపకారము చేసెదనని యామిత్రునితో పలికిరట. ఆ గృహస్థుడా వాక్యములను వెంకటరామయ్యగారి కెరింగించిరి. వెంకటరామయ్యగారు జమీందారుగారి మాటలకు మిక్కిలి విస్మయమంది, నిరుత్సాహులై రాజమహేంద్రవరమువచ్చి, మాకావార్త నెరింగించిరి. నాటక

సమాజములో సుందరులు, సుకుమారులునైన యనేకబాలకులుండగలరు. వారి కేయపాయము వచ్చునోయని కాకినాడ ప్రయాణముహూనితిని.

"సరస్వతీ" పత్రికకు నేను ప్రతిమాసము భాగములుగ "సౌందర్య తిలక" వ్రాసి పంపుచుంటిని. జమీందారుగారు గ్రంథము రెండుభాగములుగ ముద్రింపించిరి. కాని వారు నాకు కొన్ని ప్రతులైనను నియ్యలేదు. నేను నా మిత్రునియొద్ద కొంత ఋణముజేసి, జమీందారిగారియొద్ద పుస్తకములన్నియు, క్రయమునకు దీసికొంటిని. ఇంతతో వారి యాగ్రహ మడగలేదు. శ్రీ పేరి నారాయణమూర్తిగారు బి. యల్. పరీక్షలో గృతార్థులై కాకినాడలో న్యాయవాదిగ కొంతకాలము పనిచేసిరి జమీందారు గారు వారిచేత నొక రిజస్టరునోటీసు నిప్పించిరి. అందులోని విషయము లివి. 1898 వ సంవత్సరమున "సరస్వతీ" పత్రిక స్థాపించినకాలమున నా కుచితముగ వారారువందల రూపాయలనిచ్చి, ఆ రూపాయలను నాకు బదులిచ్చినట్లును, త్వరలో నాసొమ్ము తీర్చనియెడల నామీద దావా చేయ బడునట్లును, నారాయణమూర్తిగారు నోటీసులో వ్రాసిరి. ఆజాబునకు వెంటనే ప్రత్యుత్తరమిచ్చితిని. అందులోని విషయములివి, జమీందారు గారు నా కారువందల రూపాయలిచ్చినమాట నిజమే. కాని వారు నాకా సొమ్ము నుచితముగ నిచ్చిరేగాని, బదులివ్వలేదు "సరస్వతీ" పత్రిక స్థాపించి మేమిరుపురము దానిని నడుపునట్లు నియమించుకొంటిమి. నా యుద్యోగము జమీందారుగారు మానిపించి నాకున్న ఋణములు దీర్చు కొనుటకై నాకా సొమ్ము నుచితముగనిచ్చిరి బదులిచ్చినపక్షమున నోటో పత్రమో నుండియుండును. నిజస్థితియిది. తరువాత మీ చిత్తమువచ్చినట్లు చేయుడు. నాజాబు చేరినతరువాత జమీందారుగారు నారాయణమూర్తిగారు కూడ మిన్నకుండిరి. దావాచేయుటకు సాహసింపరైరి.

వీరేశలింగముగారు చెన్నపురి వెళ్ళినతరువాత రాజమహేంద్రవర ములో వితంతు వివాహములు మందగించెను. వివాహములు మిక్కిలి సకృత్తుగ జరుగుచుండెను. ఆవిషయమైన యుత్సాహము నాకును, శ్రీ కుందూరు వేంకటరత్నముగారికిని, రామాప్రగడ వేంకట రామయ్య గారికిని, గొంతవరకు నిలిచియున్నందున, మేమావిషయమై శక్యమైనంత వరకు నించుక ప్రయత్నము చేయుచుంటిమి. ఆదినములలో శ్రీ పెద్దాడ సాంబశివరావుగారును, దొరతనమువారి కళాశాలలో నుపాధ్యాయులైన అరవపల్లి సుబ్బారావుగారును, ప్రణుతార్హ హరయ్యరుగారును, రవంత

ప్రోత్సాహము గలిగించుచుండిరి. వారందరిలోను సంఘ సంస్కరణ విషయమున మా కరవపల్లి సుబ్బారావుగారే ముఖ్యులు. సుబ్బారావుగారికి సంఘ సంస్కరణముపై నంతఃకరణశుద్ధియైన యభిమానముగలదు. మేమా సంవత్సరము (1902) మూడు వితంతు వివాహములు జరిపితిమి. అందు మొదటిది నాళ్ళచెరువు కృష్ణారావుగారి వివాహము. ఈయన కృష్ణవేణమ్మయను నొక వితంతువును వివాహమాడెను. కృష్ణారావుగారంతకు మున్నొక వితంతువునే పెండ్లియాడిరి. ఆమె చనిపోవుటచేత రెండవసారికూడ వితంతువునే పెండ్లియాడిరి. రెండవవివాహము ధేరము వెంకటేశ్వర్లుగారిది. ఈయన వైదిక బ్రాహ్మణుడు. అబ్బరాజువారి యాడుపడుచైన శేషమ్మయను నియోగి వితంతువును, కుందూరు వేంకట రత్నముగారును నేను ప్రయత్నించి పెండ్లిచేసితిమి. ఈ వెంకటేశ్వర్లుగారు, చాలకాలము హార్మోనియములు తయారుచేసి విక్రయించి గౌరవముగ జీవించిరి. మూడవది భట్టిప్రోలు శరభయ్యగారిది. ఈ శరభయ్యగారు రాజేశ్వరియను వితంతువును పెండ్లియాడిరి. భార్యాభర్తలిరువురును నియోగులు. ఉన్నవ లక్ష్మీనారాయణగారు బందరునుండి యీ వధూవరులను దీసికొనివచ్చిరి. శరభయ్యగారు రహూరమి పదునెనిమిది సంవత్సరముల వయసుకలవాడు. రాజేశ్వరమ్మ పదమూడు సంవత్సరముల వయసుకల బాలిక. ఈ వివాహము మేము మా మిత్రుడైన తణుకు చలపతిరావుగారియింట చేసితిమి. ఈపెండ్లికి చాలమంది వచ్చిరి. వివాహమైన తరువాత శ్రీ అరవపల్లి సుబ్బారావుగారు వివాహమును మెచ్చుకొనుచు నింగ్లీషులో నుపన్యసించిరి. ప్రణుతార్తి హరయ్యరుగారు పెద్దాడ సాంబశివరావుగారుకూడ వచ్చిరి. పెండ్లియైన మరునాటిరాత్రి యూరేగింపుకూడ జరిగెను. కాని యీ వివాహము దంపతులకు సుఖప్రదముగాక దుఃఖప్రదమయ్యెను. భార్యాభర్తలకు మనసులు కలియలేదు. కాపురము పొత్తు చేయవలెనని వీరేశలింగముగారు మొదలగువారు బహుప్రయత్నములు చేసిరిగాని సాగలేదు. తుదకు శరభయ్యగారు భార్యను వదలివేసి దేశాంతరము వెళ్ళిరి. ఈ దంపతులకొక కుమారుడు కలిగెను. రాజేశ్వరమ్మ ప్రవేశపరీక్షయందు కృతార్థురాలై, బోధనాభ్యసనమునొంది, దొరతనము వారి బాలికాపాఠశాలలో పనిచేసి, ప్రస్తుతము విశాఖపట్టణములో నెలకు నూరురూపాయలు జీతము తెచ్చుకొనుచు తన కుమారునికి విద్య చెప్పించుకొనుచున్నది.

1902 వ సంవత్సరమున నేను, నా మిత్రుడైన తల్లాప్రగడ చలపతి రావుగారి కుమారుడైన నరసింహారావు వివాహమునకు, బాపట్ల వెళ్ళితిని. దేశరాజు కృష్ణయ్యగారి కుమార్తెను నరసింహారావున కిచ్చిరి. ఆ సమయమున నాకు దేశరాజు కృష్ణయ్యగారితోను, వారి యన్నగారైన సీతారామారావుగారితోను, పరిచయమయ్యెను. సంఘ సంస్కరణమందు మహావీరుడైన దేశరాజు పెదబాపయ్యగారితో, నా కచ్చటనే ప్రథమ పరిచయమయ్యెను. ఈ పరిచయము నాకాయనతో, నాయన జీవితాంతము వరకు మైత్రియై వర్ధిల్లెను. ఆ సంవత్సరమున నేను నా మిత్రుడైన చెరుకు మిల్లి వేంకటరామయ్యగారి తమ్ముడు అనంతరావు వివాహమునకు ర్యాలి గ్రామము వెళ్ళితిని. ఆ వివాహమునకు బోగమేళము పెట్టబడెను. వివాహమునకు వెళ్ళినను మేళమునకు నే నొక్కసారియైన వెళ్ళలేదు. తుదకు వేశ్యల పాటకచేరీ కైనను రమ్మని వేంకట్రామయ్యగారు నన్ను బ్రతిమాలిరి. కాని నేను దానికిని వెళ్ళలేదు. అంతకు ముందే నేను వేశ్యల యాటపాటలకు పోనని ప్రమాణపత్రముమీద సంతకముచేసి వీరేశలింగముగారి కిచ్చితిని. కాపున నేను నాట్యమునకుగాని, గానమునకుగాని వెళ్ళలేదు. ఆ వివాహ దినములలో నేను వెంపటి వెంకటశాస్త్రిగారను నొక పండితునితో స్నేహముచేసి వారితో కాలక్షేపము చేసితిని. ఈ నియమము నేను యావజ్జీవము పాటించుచున్నాను. ఇందుకు మరియొక యుదాహరణము చెప్పెదను. రాజా తుమ్మలపల్లి రామారావుగారి కుమారుడు, వరదారావుగారు సబుజడ్జిగ రాజమహేంద్రవరము వచ్చిరి. ఆయన సంగీతప్రియుడు. చెన్నపురమందు "ధన" మను వేశ్యాంగన గానకళయందు మిక్కిలి పేరుగాంచెను. ఆమె యేదో కారణమున రాజమహేంద్రవరము వచ్చెను. ఆమె చేత నొక పాటకచేరీ చేయింపవలెనని వరదారావుగారికి సంకల్పము కలిగెను. ఆ కచేరీ పెట్టుకొనుటకు మా నాటకశాల నిమ్మని నాకు వర్తమానమంపిరి. నే నీయజాలనని యు మా సామాజికులలో నధిక సంఖ్యాకులిచ్చిన పక్షమున నే నడ్డుపెట్టనని యు, నేను వారికి జవాబు పంపి సామాజికుల సభ పెట్టి వారి యభిప్రాయ మడిగితిని, అధికసంఖ్యాకులు శాల నిచ్చుట కొడంబడిరి. మరునాడు ధనము యొక్క పాటకచేరీ జరిగెను. నా నియమము ననుసరించి నే నా కచేరీకి బోలేదు. శ్రీ కొక్కొండ వేంకటరత్నము గారా సభకు హాజరై "ధనము" మీద నొకపద్యము రచించిరట. ఇదియేగాక మరి రెండుదాహరణలు చెప్పెదను నా మిత్రు

డైన చెరుకుమిల్లి వెంకటరామయ్యగారు, తన కడగొట్టు తమ్ముడైన వేంకటరావున కుపనయనముచేసి, యా మహోత్సవమునకు చెన్నపురినుండి "కోయంబత్తూరు తాయి" యను గానకళావిశారదయైన వేశ్యాంగనను బిలిపించి యామెచే నొక పాటకచేరీ పెట్టించి, మిత్రులతోపాటు నన్ను గూడ నాహ్వానించిరి. కాని నేనా సభకు బోలేదు. మా గ్రామమున సుప్రసిద్ధ న్యాయవాదులైన ములుకుట్ల యచ్యుతరామయ్యగారు, తన రెండవ కుమార్తె వివాహమునకు, మదరాసునుండి "యేనాదిపిల్ల" లను నిరుపురు వేశ్యాంగనలను పిలిపించి వారిచే పాటకచేరీలు పెట్టించి యూరందరిని పిలిచిరి. అచ్యుతరామయ్యగారికిని, నాకును విశేషపరిచయమున్నను, నే నొక్క కచేరీకైనను పోలేదు. వారును మరి యితరులును నానియమ ములను మన్నించి నాపై నాగ్రహము బూనలేదు.

●

స్వీయ చరిత్రము

పదునొకొండవ ప్రకరణము

ఉన్నతపాఠశాలాస్థాపనము

పాఠశాలా సంస్థాపనమీది కుతూహలము నాకింకను సడలకుండుటచే, 1903 వ సంవత్సరము జనవరిలో, నాయున్నత పాఠశాలను సంపూర్ణముచేయవలెనని, మునుపటి నాలుగవఫారముకు తోడుగ నయిదవఫారమును నారవఫారమునుగూడ స్థాపించి, పూర్ణమైన యున్నతపాఠశాలగ జేసితిని. ఇదివరకు పనిజేయుచున్న రామాప్రగడ వెంకటరామయ్యగారికి తోడుగ, నున్నతపాఠశాలనిమిత్తము, మరియిద్దరుపాధ్యాయులను నియమించితిని. అందు మొదటివారు దిగమర్తి కోదండరామస్వామిగారు; ఈయన పట్టపరీక్షసిద్ధుడు. బోధనాభ్యసనమునూడ బొందినవారు. రెండవ వారు తనికెళ్ళ పూర్ణయ్యగారు. ఈయన పట్టపరీక్షయందు సిద్ధులైరిగాని,

బోధనాభ్యసనము బడయలేదు. ఇక్కడకు మాయున్నతపాఠశాలలోని మూడుతరగతులకు ముగ్గురుపాధ్యాయులేర్పడిరి. కష్టపడి లాగుకొని వచ్చిన పక్షమున నెప్పటికైన మాయున్నతపాఠశాల దొరతనమువారి యంగీకారమును బడయకపోదనియాసించి, పైతరగతులుగూడ పెట్టితిని. నాలుగవపారమున్నచోట దక్కినతరగతులకు స్థలములేకపోవుటచే, నున్నత పాఠశాలనంతను మరియొకచోటబెట్టితిని. మ్యూజియమున కెదుటనున్న పోలీసుకవాతు భూమిలో నొకమూలగానున్న బంగాళాలో కొంతభాగ మద్దెకుపుచ్చుకొని, పాఠశాలనందు నెలకొల్పితిని. అందు మూడు పెద్ద గదులున్నందున మూడుతరగతులకు స్థలముసరిపోయెను. మామధ్యమ పాఠశాలలోని పండితులు మధ్యాహ్న మున్నతపాఠశాలలోను, నుదయ మున మధ్యమపాఠశాలలోను పనిచేయునట్లు నిర్ణయించితిని. నడుమనడుమ నేనుబోయి పాఠశాలను చూచుచుంటిని. మూడుతరగతులలోను బాలురు దిట్టముగజేరిరి. గాని మధ్యమపాఠశాలలోనున్నట్లే జీతములీయకుండ చదువువారిసంఖ్య యెక్కువపుండుటచే, నాకు ధనలాభముగలుగలేదు. దాని ఖర్చులు దానికి సరిపోవుటయే కష్టమయ్యెను. పైగా నూరురూపాయలు ఖర్చుపెట్టి ప్రకృతిశాస్త్రపు పనిముట్లను (సైన్సు ఏపరేటస్) తెప్పించితిని. పాఠశాల సర్వవిధముల చక్కగనే జరుగుచుండెనుగాని, విద్యాశాఖవారి యనుగ్రహము మాత్రము దానిమీద బడలేదు. విలియమ్సు పిళ్ళగారికి మాపాఠశాలపై నాగ్రహము క్రమక్రమముగ హెచ్చుచుండెను. నాపై వారికేమియు ద్వేషములేదు పట్టణమున మరియొక యున్నతపాఠశాలయున్నపక్షమున బోధనాభ్యసన కళాశాలకు నష్టమని హంటరు దొరగారితో నేకీభవించి పిళ్ళగారుగూడ మామీద దాడివెడలజొచ్చిరి.

ఆ సంవత్సర ప్రారంభమున (1903) సంస్కృతవిద్యాప్రవీణులైన బ్రహ్మశ్రీ ప్రయాగ వెంకటరామశాస్త్రిగారికిని, నాకును మైత్రి ప్రారంభమయ్యెను. ఆయన తెలగాణ్య బ్రాహ్మణులు. తణుకుతాలూకాలోని తామరాడ గ్రామనివాసులు. నాయొద్దకు వచ్చునప్పటికే వారు సంస్కృతకావ్యములనే గాక, వ్యాకరణశాస్త్రమును గట్టిగ బఠించిరి. వాకడకు వచ్చునప్పటికి వారికి రమారమి యిరువది సంవత్సరములుండెను. ఆయన యెదైననుద్యోగము కొరకు వచ్చిరి. వారికిదగినయుద్యోగము నాకడనప్పుడేదియులేకపోయెను. నాపాఠశాలలో నదివరకే నిరువురు పండితులుండిరి. కాని యంతచిన్న తనములో నంతనిశితమైన పాండిత్యముసంపాదించిన యాబాలపండితుని

వదలిపెట్టుటకు నాకిష్టములేకపోయెను. అందుచే నాదగ్గరనే వారినుండుమని కోరి, పూటకూళ్ళయింట ప్రవేశింపుమనిచెప్పి, నెలకారురూపాయలు చొప్పున నేను వారి కొకసంవత్సరమిచ్చితిని.

ఆ దినములలో నేను వారివల్ల భవభూతి ప్రణీతమైన "ఉత్తర రామ చరిత" నాటకమునువింటిని. ఆ సంవత్సరమున నేను పూర్వమున్న చిన్నయిల్లు వదలిపెట్టి, రాయవరపువారి యింటికి సమీపముననున్న దుర్భా సూర్యనారాయణగారి యింట గాపురముంటిని. అది పెద్దయిల్లగుటచే, నా సంసారమునకు సరిపోయెను. నా మూడవచెల్లెలైన రమణమ్మ యప్ప టికి గర్భవతియై మాయింటికి వచ్చెను. మా రెండవచెల్లెలైన యచ్చమ్మకు మూడవసారి రాజమహేంద్రవరములోనేబుట్టిన రాజేశ్వరియను పిల్ల కడు పులో బల్ల పెరిగి కొన్నిమాసములు బాధపడి యెన్నిచికిత్సలు చేయించినను నారోగ్యస్థితినిబొందక 1903 వ సంవత్సరము మేనెల 11 తేది మధ్యా హ్నము మాయింటికడ మృతినొందెను. ఆ బాలికకు మృతినొందునప్పటికి రెండు సంవత్సరములు వయసు.

1903 వ సంవత్సర ప్రారంభమున జరిగిన విషయమొకటి వ్రాయ మరచితిని. ఆ విషయమిది. గుంటూరు పట్టణమున విశ్వనాథయ్యరు గారను జిల్లా మునసబుగారుండిరి. ఆయన సంఘసంస్కరణ ప్రియుడు. వితంతువివాహ పక్షపాతి. వితంతు వివాహములనుగూర్చి లోకమున జనసమ్మతి బడయుటకై కొన్ని యుపన్యాసముల నిప్పింపదలచి, రాజ మహేంద్రవరమున అరవపల్లి సుబ్బారావుగారికిని, టంగుటూరి శ్రీరాములు గారికిని నాకును, గుంటూరుపచ్చి యుపన్యాసములిమ్మని యాహ్వానముల నంపిరి. మేము ముగ్గురము గుంటూరు వెళ్ళితిమి. అరవపల్లి సుబ్బా రావుగారును, టంగుటూరి శ్రీరాములుగారును నింగ్లీషులో నుపన్యసించిరి. నేను తెనుగులో నుపన్యసించితిని. మేము విశ్వనాథయ్యరుగారి యింటనే బసచేసితిమి. మరునాడు బయలుదేరి రాజమహేంద్రవరము వచ్చితిమి.

1903 వ సంవత్సరము జూను నెలలో నారవ గోదావరీ మండల సభ పెనుమంట్రలో గోస్తనీనది యొడ్డున జరిగెను. 1899 - 1900 సంవ త్సరములలో నీ సభ జరగనేలేదు. 1902 వ సంవత్సరమున నెక్కడను జరగలేదు. తణుకు తాలూకాలోని యాలమూరు గ్రామనివాసులును, దేశాభి మానులు నైన పెనుమెత్స సుబ్బరాజుగారు సభ నాహ్వానముజేసి, యాల మూరులో దగిన స్థలము లేవందున పెనుమంట్ర వంతెనకు, నాలమూరు

నకు నడుమనున్న గోస్తనీనది యొడ్డున పందెళ్ళు వేయించి సభలు జరిపించిరి. ఆ సభకు శ్రీ గంజాము వేంకటరత్నముగారధ్యక్షత వహించిరి. గోదావరీ మండల సభ లా సభతో నంతమొందినవనియే చెప్పవచ్చును. ఏలయన, నా సభలు చాలకాలమువరకు మరల జరగలేదు. మండల సభా దేవత తన్నే చేటపిలిచి యాదరించువారులేరని బెంగపెట్టుకొని చిక్కిశల్యమై పెనుమంట్ర పంతెనమీద నెక్కి గోస్తనీనదిలోబడి యాత్మహత్య జేసికొన్నదవి నా యభిప్రాయము. ఆ సభనిమిత్తము బల్లలు మొదలైనవి పడవమీద పంపించితిని. కాని నేను మాత్రము సభకు వెళ్ళలేదు. ఏమన, మా మూడవచెల్లెలు రమణమ్మకు నవమాసములు నిండెను, ఆమె నేనింట లేనప్పుడు ప్రసవించినచో మా వాండ్రు చిక్కుపడుదురని నేను సభకు వెళ్లుట మానితిని ఆ సంవత్సరమున మా మేనమామగారు మల్లయ్యశాస్త్రిగారు కొన్ని మాసములు నెలపుపుచ్చుకొని జూలై యాగస్టు నెలలలో, భార్యాసమేతముగ వచ్చి మాయింట నుండిరి. జూలైనెల మూడవతేదీని మా చెల్లెలు రమణమ్మ ప్రసవించి మగశిశువును గనెను. ఆ పురిటింటిలో నామెకు మిక్కిలి జబ్బుచేసెను, ఆమె జీవించునా, లేదా యని మా కంద రకు సందేహము కలిగెను, నా ప్రియమిత్రులగు దామెర్ల వెంకట రమణారావుగారు శ్రద్ధతో వైద్యముచేసి యామెను బ్రతికించిరి. ఇప్పుడే కాదు దామెర్ల వెంకటరమణరావుగారు వైద్యమారంభించినది మొదలుకొని 1921 వ సంవత్సరమున వారు మరణించువరకు మిక్కిలి ప్రేమతోను శ్రద్ధతోను మా యింట నుచితముగ వైద్యముచేసిరి. ఆయనకు నేను మిక్కిలి కృతజ్ఞుడను,

ప్రయాగ వేంకటరామశాస్త్రిగారు రాజమహేంద్రవరములోనున్న కాలమున ప్రతిదినము వారు నాకడకు వచ్చుచుండెడివారు. అటువంటి పండితుడు నాకు లభించినపుడు నేనాయనవలన లాభము పొందవలెనని బాణమహాకవిచే సంస్కృతమున రచియింపబడిన "కాదంబరి"యను వచనమహాకావ్యమును వారి సహాయమున నే నాంధ్రీకరింప నారంభించితిని. ఆ సంవత్సరము నవంబరునెలనాటికి నేను రమారమి నూరుపుటలు తెనిగించితిని. "కాదంబరీ రసజ్ఞానా దాహారోపి నరోచతే" కాదంబరి రస మెరిగినవారి కాహారముగూడ రుచింపదని దీని యర్థము. "కాదంబరి" యనగా, కాదంబరీ మహాకావ్యమేగాక, "కల్ల"నిగూడ యర్థము. ఆసంవత్సరమున దేశీయమహాసభను (ఇండియన్ నేషనల్ కాంగ్రెసు) చెన్నపట్టణ

మున లాల్ మోహనఘోషుగారి యాధిపత్యమున జరుపుటకు నిశ్చయింప బడినది. ఘోషుగారు సురేంద్రనాథ బెనర్జీవలెనే మహావక్తలు. అదివరకు నేనెప్పుడు ఘోషుగారి వాగ్ధోరణి విననందున, నేనాసభకుబోవ నిశ్చయించితిని. నేను నా మిత్రులైన చెరుకుమిల్లి వెంకటరామయ్యగారితో గలసి చెన్నపట్టణము వెళ్ళితిని. ఆ బండిలోనే రాజమహేంద్రవర గ్రామనివాసులును, మా కిరువురకు మిత్రులు, హుకుంపేట జమీందారుగారునైన శ్రీ రాజా హోతా వీరభద్రయ్యగారు గూడ సపరివారముగ చెన్నపట్టణము వచ్చిరి. మే మందరము శ్రీ కొరళ్ల సుబ్బారాయుడుగారి యింట బసచేసితిమి. కొరళ్ళ సుబ్బారాయుడుగారు వైశ్యశిఖామణులు. చిరకాలము దెప్యూటి కలెక్టరుపనిచేసి, వృద్ధులై పనిమానుకొని, చెన్నపట్టణములో విశ్రాంతి సుఖమనుభవించుచుండిరి. సుబ్బారాయుడుగారి కుమారుడు వెంకటలింగము గారు, బి. యల్, పరీక్షయందు కృతార్థులై హైకోర్టు న్యాయవాదిగనుండిరి. చెరుకుమిల్లి వెంకటరామయ్యగారికిని, వెంకటలింగముగారికిని చిరకాల మైత్రి కలదు. కొరళ్ళవారికి చెన్నపట్టణమందలి యెళంబూరు (ఎగ్మూరు) యనుపేటలో గొప్ప స్థలముగలదు. ఆ స్థలములో రెండు బంగాళాలు గలవు. ఒక బంగాళాలో కొరళ్ళవారు కాపురముండిరి. రెండవ బంగాళా శ్రీ వీరభద్రయ్యగారికి నివాసము కొరకిచ్చిరి. వీరభద్రయ్యగారు వంట బ్రాహ్మణుని, సేవకులను తీసుకొనివచ్చుటచేత మమ్ముగూడ వేరేబసచేయ నీయక వారి కందాలోనేచేర్చికొని మాయెడ మిక్కిలి గౌరవాదరణములు గలిగియుండిరి. ఆ సంవత్సరము డిశంబరునెలలో మహావర్షములు గురిసెను. ప్రతిసంవత్సరము డిశంబరునెలలోనే వానలు కురియును. కాని యా సంవత్సరము దేవేంద్రుడు పుష్కలావర్తకమేఘములను విచ్చలవిడిగ లోకముమీద విడిచినాడోయన్నట్లు, ఘోరముగ వానలు దిమ్మరించెను. లాల్ మోహనఘోషుగారి ప్రారంభోపన్యాసము వినవలెనని మిక్కిలి యుబలాటము పడితినిగాని పడిశముపట్టి వారి గొంతు చెడిపోవుటచేత వారేగాక వేలకొలది ప్రతినిధులకు, ప్రేక్షకులకు నెంతో యాశాభంగము గలిగినది. హిందూదేశ నాయకులలో నగ్రగణ్యులని చెప్పదగిన ఫిరోజిషా మెహతాగారాసభకువచ్చి. మిక్కిలి చమత్కార సంభాషణలతో లాలు మోహనఘోషుగా రధ్యక్షత వహించవలెనని తీర్మాన ముపపాదించిరి. అదివరకు నేను మెహతాగారి ప్రసంగమెప్పుడును వినలేదు. అదే మొదటి

సారి యగుటచేతనో, వారి ప్రసంగము మిక్కిలి రసవంతమగుటచేతనో, నేనెక్కువ యానందించితిని,

చెన్నపురి పోకమునుపే మేమొక వితంతువివాహముచేయించితిమి. మానాటకసమాజములో సభ్యుడును, మాపాఠశాలలో నుపాధ్యాయుడు, నైన తురుమెళ్ళ వెంకటసుబ్బారావుగారొక వైష్ణవ వితంతుబాలికను వివాహమాడిరి. ఆబాలిక తండ్రియైన వృద్ధవైష్ణవుడు వితంతువైన తన పుత్రికను వివాహనిమిత్తము రాజమహేంద్రవరము తీసుకొనివచ్చెను. ఆయనను మేము ప్రోత్సాహపరచితిమి. ఆ వితంతువును వివాహమాడుటకు సుబ్బారావుగారుగూడ నంగీకరించిరి. శ్రీ కందుకూరి వీరేశలింగము పంతులుగారు భార్యను వెంటబెట్టుకొని ఈ వివాహముజరుపుటకై చెన్నపురి నుండి రాజమహేంద్రవరమువచ్చిరి. ఆవివాహము చాల వైభవముతో జరిగెను. కళాశాలలోని యుపాధ్యాయులు, విద్యార్థులు, పురప్రముఖులు చాలమందివచ్చిరి. వివాహము తాలూకాకచేరికి వెనుకనున్న యాచంట లింగరాజుగారియింట జరిగెను. ఆరాత్రి విందుజరిగెను. ఆవిందునకు నేనును రాయవరపు రామమూర్తియుపోయి భుజించితిమి. మావంటి సంస్కరణప్రియులేగాక మమ్ము నిరంతరమాక్షేపించుచున్న వైదికశిఖామణులయొక్కయు, సభాపతులయొక్కయు కొడుకులుగూడ గొందరువచ్చి యావిందులోపాలుగొని వధూవరులపంక్తిని భుజించిరి. భోజనముచేసిన వారిపేళ్లు పత్రికలోపడెను, తమబిడ్డలే యావిందులోపాలుగొనుటచే, దొంగను తేలుగుట్టినట్లూ పూర్వాచారపరాయణులు మమ్మేమియుచేయలేక యూరకుండిరి.

చెన్నపురి పోకమునుపే నాయున్నతపాఠశాలవిషయమున నే నొక పనిచేసితిని. మాయున్నతపాఠశాల దీసివేయుమని విలియమ్సుపిళ్ళగారు మాకు మాటిమాటికి శ్రీముఖము పంపుచుండుటచే, డైరెక్టరుగారికిగూడ వారు నావిషయమై వ్రాసియుందురని నమ్మకముతో నేను డైరెక్టరుగారిపేర జాబువ్రాసితిని. నేను పాఠశాల విద్యాశాఖవారి యనుమతినిబడయునని, యున్నతపాఠశాలను నిర్వహించితినిగాని బోధనాభ్యసన కళాశాలకు నష్టము కలిగించునుద్దేశముతో గాదనియు,మంచియుద్దేశముతో పాఠశాలనిర్వహింపబడుటచే బాలకు లనేకులు చేరిరనియు, నాకారణమున మాపాఠశాల సంగీకరింపవలసినదనియు, సంగీకరింపనిపక్షమున దానిని సంవత్సరమధ్యమున దీసివేయుమని యాజ్ఞాపింపవద్దనియు, యట్లాజ్ఞాపించినచో బాలకులవిద్య

చెడిపోవుననియు, మీరంగీకరింపనిపక్షమున నేనే సంవత్సరాంతమున దీసివేయుదుననియు వినయముతో వ్రాసితిని. డై రెక్టరుగారు పాఠశాల యంగీకరింపబడదనియు సంవత్సరమధ్యమున దీసివేయనక్కరలేదనియు, సంవత్సరాంతమువరకు నవకాశమిచ్చితిమనియు, నాకు జవాబిచ్చిరి. ఐనను "యత్నముచేయుటవలన దోషములే"దను యార్యోక్తియుండుటచేత మరల నొకప్రయత్నముచేసితిని. కాంగ్రెసునిమిత్త మాసంవత్సరము సత్యవోలు లక్ష్మీపతిగారుగూడ చెన్నపురి వచ్చుటచే వారినిదోడ్కొని స్కాటుదొర గారిని జూడబోతిని. అప్పుడు స్కాటుదొరగారు డై రెక్టరుగారికి సొంత సహాయుడు (Personal Assistant) గా నుండిరి. వారితో జెప్పిన యెడల గొంతసహాయముండునేమోయని నేననుకొంటినిగాని, లాభములేక పోయెను. స్కాటుదొరగారు పూర్వము రాజమహేంద్రవర కళాశాలలో నుపాధ్యాయులుగనుండి, యచ్చటి పాఠశాలా పరిపాలకసంఘమునకు చాల కాలము కార్యదర్శిగనుండిరి. నేనును, లక్ష్మీపతిగారును వారిచేతిక్రింద నుపాధ్యాయులుగ పనిచేసితిమి. అందుచేత మమ్ము స్కాటుదొరగా రెరుగుదురు ఎరిగియుండిననేమి? వారుమాపాఠశాలకేవిధమైన యుపకారమును చేయలేకపోయిరి. తరువాత నేను వీరేశలింగముగారి దర్శనముచేసి, నాయున్నతపాఠశాల దీసికొమ్మని వారినడిగితిని. అంతకుమున్ను పది సంవత్సరములక్రిందట రాజమహేంద్రవరములో నొక యాస్థికపాఠశాల స్థాపింపవలెనని వీరేశలింగముగారు సంకల్పించిరి. అది యప్పుడు నెర వేరలేదు. నాపాఠశాలనుదీసికొని యాసంకల్పము నెరవేర్చుకోవచ్చునని నేనువారితో మనవిచేసితిని. కాని వారందుకొడంబడలేదు. పిమ్మట నేను వారితో "కాదంబరి" తెనిగించుచున్నానని చెప్పగా, నటువంటి పుస్తకములు లోకులు చదువరనియు శ్లేషలతోను, దీర్ఘసమాసములతోను, నిండిన "కాదంబరి"వంటి కఠినకావ్యములను విశ్వవిద్యాపీఠమువారు పాఠ్యపుస్తకముగ నిర్ణయింపరనియు, కాబట్టి "కాదంబరి" నాంధ్రీకరించుట మాన వలసినదనియు, నాకు వారు సలహాచెప్పిరి. ఆహితోపదేశమును నేనువిని రాజమహేంద్రవరము వచ్చినతరువాత "కాదంబరి" తెనిగించుటమానితిని.

1903 వ సంవత్సరమున కాంగ్రెసు మహాసభ జరుగలేదు. నిరంతర వర్షపాతమున సన్మానసంఘమువారు కాంగ్రెసు మహాసభ జరుపుటకు నిర్మించిన తాటియాకుల పాక కూలిపోయెను. వక్తలు ప్రసంగించుట కారంభించినపుడు ప్రతినిధులు వానదెబ్బ కాగలేక, లేచి నిలువబడిరి. పెద్ద

గోలయ్యెను. ఇనుప యూపిరితిత్తులు, కంచుకంఠము గల మహావక్తయని పేరుబడిన బాబు సురేంద్రనాధ బెనర్జీ గూడ మేఘగర్జనలవంటి గంభీరభాష ణలతో శాంతి నెలకొల్ప యత్నించినను, వ్యర్థమయ్యెను. మూడు దిన ముల సభలు నిష్ఫే భగ్నములయ్యెను. ఆ యావరణములోనున్న బంగాళా వసారాలో నాలుగవనాడు సభాధ్యక్షులు, ప్రతినిధులు సమావేశమై తీరు మానములు తొందరగ చదివి మసిబూసి మారేడుకాయ చేసినట్లు సభయైన దనిపించిరి లాల్ మోహనఘోష్‌గారి యుపన్యాసము వినుటకు మా కవ కాశమే లేకపోయెను.

దేశీయమహాసభ ముగిసినతరువాత యావద్భారతవర్ష సంఘసంస్క రణ మహాసభ జరిగెను. ఇది క్రైస్తవకళాశాలా భవనమున జరిగెను. ఆ సభకు బళ్లారినివాసులు, చెన్నపుర శాసననిర్మాణ సభాసభ్యులు నైన ఆనరబుల్ కోలాచలము వేంకటరావు పంతులుగా రధ్యక్షత వహించిరి. బొంబాయి హైకోర్టున్యాయమూర్తియు, సంఘసంస్కరణప్రియుడునైన నారా యణగణేశ చందావర్కరుగారు సంఘసంస్కరణ సభజరుపుటకు బొంబాయి నుండి ప్రత్యేకముగవచ్చి సభకు హాజరైరి. సభ కొంతవరకు ప్రశాంతము గానే జరిగెను. పాఠశాలలలో మతవిద్య నేర్పవలసినదని యెవరో యొక తీర్మానము ప్రవేశపెట్టిరి. ఈ తీర్మానముతో గోల ప్రారంభమయ్యెను కొందరు దీని కనుకూలురు, కొందరు ప్రతికూలురు. క్రైస్తవకళాశాలలో ప్రకృతిశాస్త్ర పండితుడైన లక్ష్మీనర్సునాయుడుగారు మతవిద్యకు ప్రతి కూలురైనవారికి నాయకుడు ఈయన మతమున బౌద్ధుడు. ఇంచుమించుగ నాస్తికుడని చెప్పవచ్చును గొప్ప వక్త. సుప్రసిద్ధుడు. ఆ తీర్మాన మును ప్రవేశపెట్టగానే లక్ష్మీనర్సునాయుడుగారు కోపించి, తోక త్రొక్కిన తాచువలె లేచి, తీర్మానమును ప్రతిఘటించిరి. గొప్ప గొడవ యయ్యెను. ఎట్టకేలకు చందావర్కరుగారు తీర్మానమును ప్రవేశపెట్ట నీయక శాంతి నెలకొల్పిరి. ఏదోవిధముగ సభ సమాప్తమయ్యెను. కోలా చలము వేంకట్రావుగారా సంవత్సరమున నిగ్లాండుదేశము పోయివచ్చుట చేత వారికీపదవి యొసగబడినదని ప్రజలు చెప్పుకొనిరి. ఆ నాడు గూడ వర్షము గురిసెను. బాటలన్నియు జలమయము లగుటచే జట్కాబండ్ల లోనికి నీరెక్కుటయు, నందు కూర్చున్నవారి కాళ్లు మోకాళ్ళవరకు తడసి పోవుటయు సంభవించెను.

1904 వ సంవత్సరమున యొకటవ తేదీని విక్టోరియా పురమందిర మున నొక గొప్పసభ జరిగెను. ఆ సభలో "హిందూసంఘ" మొకదానిని స్థాపింపవలెనని తీర్మానింపబడెను. ఆసభకు ప్రధాన న్యాయమూర్తిగ బని చేయుచున్న సర్ సుబ్రహ్మణ్యమయ్యరుగా రధ్యక్షత వహించిరి. అని బిసెంటమ్మగారు మాటాడిరి. రంగాచార్య పండితులు మున్నగు మహాప్రముఖులు హిందూమత ముద్ధరింపవలెనని యింగ్లీషున గంభీరో పన్యాసము లిచ్చిరి. ఈసభ సంఘసంస్కరణసభకు వ్యతిరేకముగా బెట్ట లేదని సభాధ్యక్షులును, రంగాచార్య పండితుడును స్పష్టముగ చెప్పిరిగాని, నిజముగ సంఘ సంస్కరణోద్యమము నణచివేయవలెననియే యీసభ స్థాపింపబడినదని ప్రేక్షకులు భావించిరి. అప్పటికి శ్రీ న్యాపతి సుబ్బారావు పంతులుగారి యభిప్రాయములు గొంత మార్పుచెందెను, హిందూమతో ద్ధరణముపై వారి కెక్కువ యభిమానము గలిగెను. రాజమహేంద్రవర ములో "హిందూ సమాజము"ను స్థాపించి వారు భగద్గీతా బహుమానములు పెట్టిరి. న్యాపతి సుబ్బారావు పంతులుగారికి సుబ్రహ్మణ్యమయ్యరుగారి తోను, రంగాచారిగారితోను నధికస్నేహము గలదు. వారి ప్రేరణముచేతనే చెన్నపురములోని "హిందూ సంఘము" స్థాపింపబడినదని యానాటివారు బహిరంగముగ చెప్పుకొనసాగిరి. ఆసంఘపక్షమున నింగ్లీషులో నొక వారపత్రిక నెలకొల్పి, దాని వ్యయములన్ని సుబ్బారావు పంతులుగారే భరించి, కొంతకాలము నడిపిరని లోకమున యొకవాడుక పుట్టెను. ఆ వర్షపుదినములలో శ్రీ హోతా వీరభద్రయ్యగారు చెరుకుమిల్లి వేంకట రామయ్యగారికిని, నాకును నెట్టి యిబ్బందిలేకుండ సకల సౌకర్యములుచేసి రాజమహేంద్రవరము తిరిగి వెళ్ళినప్పుడు రైలుఖర్చులుగూడ వారేభరించి మమ్మాదరించుటచే వారికి మేమెంతయు కృతజ్ఞులము,

రాజమహేంద్రవరములోని నా యున్నతపాఠశాలకు దొరతనము వారి యనుమతి బడయలేకపోతినని నేనిదివరకే వ్రాసితిని. ప్రక్కనే మిషనువారి యున్నతపాఠశాల, నిబంధనలకు వ్యతిరేకముగ బాలకులను చేర్చుకొన్నను విద్యాశాఖవారి యనుమతినిబడసి వర్థిల్లుచుండెను. మిషను పాఠశాలయొక్క పరిపాలకు లమెరికా దేశీయులైన తెల్లవారు. విశేషించి క్రైస్తవగురువులు. నేను నల్లవాడను. హిందువుడను. విద్యానిబంధనల ప్రకారము నేను పాఠశాల నడుపుచున్నను, నా పాఠశాలగతి వేరయ్యెను. చెన్నపురినుండి రాజమహేంద్రవరమువచ్చి, నేను నా యున్నతపాఠశాలను

దీసివేసి, విలియమ్సుపిళ్ళగారి కావార్త దెలిపితిని. వారు సంతసించి నాకిట్లు సలహాజెప్పిరి. నీవీ పాఠశాలవిషయమై యింతపని చేయనేల? మార్సుడను దొరగారు తెనుగువాచకములు వ్రాయించి విశేషధన మార్జించు చున్నారు. నీవు స్వయముగ వాచకములువ్రాసి ధనమేల యార్జింపగూడదని నాకు హితోపదేశముచేసిరి. కుందూరి వేంకటరత్నముగారుగూడ నప్పుడు పిళ్ళగారివద్దకు వచ్చిరి. అటమీద మా పాఠశాలలో నాలుగవఫారములోను నైదవఫారములోను జదివిన బాలకులగతి జూడవలసివచ్చెను. మాపాఠ శాలలోని యుపాధ్యాయు లాతరగతిలోని బాలకులకు సంవత్సరాంత పరీ క్షలు యథావిధిగా జరిపి కృతార్థులైన వారియొక్క-యు, కృతార్థులుగాని వారియొక్క-యు పట్టికవ్రాసి సిద్ధముగ నుంచిరి. వారిని బోధనాభ్యసన కళాపాఠశాలలోని పైతరగతులలో జేర్పింపవలెనని యుద్దేశించి నేనొక నాడు కుందూరు వేంకటరత్నముగారిని వెంటబెట్టుకొని యా కళాశాలా ప్రధానాచార్యులైన మార్కు- హంటరుదొరగారి యింటికిబోయి వారి దర్శ నముచేసి నేను పాఠశాలను దీసివేసితిననియు, మా పరీక్షలలో కృతార్థు లైన బాలకులను మీ కళాశాలలోని పైతరగతులలో చేర్చుకొనవలసిన దనియు, కోరితిని. అట్లే చేయుదుమని వారు వాగ్దానముచేసి నన్ను పంపిరి. మాబాలురు తప్పక చేర్చుకొనబడుదురను నమ్మికతో మా బాలకు లను కళాశాలలో నుపాధ్యక్షులైన తంజావూరు సుబ్బారావు పంతులుగారి యొద్దకు బంపితిని, ఆ పంతులుగారు మా పరీక్షలు సరియైనవిగావనిచెప్పి, మా బాలకులను చేర్చుకొనక కొన్నిదినములు త్రిప్పిరి. తుట్టతుదకు బాల కులువిసిగి హంటరు దొరగారియొద్దకుబోయి వారితో చెప్పుకొనిరి. వెంటనే హంటరు దొరగారు బాలకుల చదువు చెడిపోవుచున్నదని జాలిపడి నేను పంపిన పట్టికప్రకారము బాలకులందరిని చేర్చుకొనవలెనని యుత్తరువు చేసిరి. ఆ యుత్తరువు ననుసరించి తంజావూరు సుబ్బారావు పంతులుగారు మా బాలకులందరిని చేర్చుకొనిరి. ఇప్పటికి మా యున్నత పాఠశాల వృత్తాంతము ముగిసెను. ఉపాధ్యాయుల జీతములనిమిత్తము నే నజ్జరపు వీరయ్యగారివద్ద నూటయేబది రూపాయలప్పుచేసి యుపాధ్యాయుల జీతము లిచ్చివేసి, యా సంవత్సరమువచ్చిన నాలుగువందల రూపాయల గ్రాంటు నుండి యా యప్పు దీర్చితిని.

పాఠశాలా సంస్థాపన మీద వాంఛ నా కప్పటికిని బోలేదు. మొట్ట మొదట నానివాసస్థానము వీరవాసరము గదా! అది భీమవరము తాలూకాలో

జేరినది భీమవరములో బోర్డు మిడిలుస్కూ- లొకటి యుండెను. భీమవరములోగాని, యా తాలూకాలో మరియొక గ్రామములోగాని, యున్నతపాఠశాల లేదు. ఆ తాలూకాలోని విద్యార్థు లున్నతపాఠశాలలో చదువవలసి వచ్చినప్పుడు నరసాపురము వెళ్ళి జదువవలసియుండెను. ఆ తాలూకా విద్యార్థుల కా కొరతతీర్పవలసిన భాగ్యవంతులు తీర్పక మిన్న కుండిరి. కావున భీమవరములో నొక యున్నతపాఠశాల స్థాపింపవలెనని నాకు తోచినది. నా కా తలంపు గలిగినతోడనే 1904 వ సంవత్సరము జనవరిలో భీమవరమువెళ్ళి యున్నతపాఠశాలా స్థాపనమును గురించి కొంతమంది పెద్దమనుష్యులతో మాటలాడితిని. వారు ప్రోత్సాహకరము గానే మాట్లాడిరి. మాటలేగాని, సొమ్ము మూటలు వారిచ్చువారు గారు. అయినను నాలుగవ ఫారము నయిదవఫారము నను రెండు తరగతులతో నున్నతపాఠశాల స్థాపించితిని. స్థాపించి రాజమహేంద్రవరము వెళ్ళి పిల్లలు కూర్చుండు బల్లలు మొదలైన సామానులు భీమవరము పంపితిని. ఈ సామానులు పంపినపిదప ప్రకృతిశాస్త్ర పరికరములను గూడ బంపి తిని. రసాయనశాస్త్రము (కెమిస్ట్రీ) నైచ్ఛికముగ దీసికొని పట్టపరీక్ష సిద్ధుడైన వంగల వెంకటనారాయణగారిని ప్రధానోపాధ్యాయుడుగాను, శ్రీ రాయసం వెంకటశివుడుగారి తమ్ముడైన కృష్ణమూర్తిగారిని సహాయో పాధ్యాయుడుగాను, వెలగదుర్రు గ్రామవాసియైన నరసింహదేవర శేషయ్య శాస్త్రిగారిని నాంధ్రోపాధ్యాయుడుగాను, నియమించితిని. ఆ కాలమున భీమ వరములో లక్ష్మీనరసింహాచార్యులుగారని యొక జిల్లా మునసబుగారుండిరి. ఆయన కోర్టులోనున్న న్యాయవాదులకంత శ్రద్ధలేకపోయినను, మా పాఠ శాలా విషయమున మునసబుగారికి కొంత శ్రద్ధయుండెను. పాఠశాలలో జదువుకొనుటకు విశేషముగ బాలురు చేరకపోయినను రెండుతరగతులలోను తగినంత మంది విద్యార్థులుండిరి. విద్యార్థు లిచ్చెడి జీతములతో పాఠ శాలా వ్యయములు సరిపోవుచుండెను. ప్రధానోపాధ్యాయులైన వంగల వెంకట నారాయణగారు చాల తెలివి గలవారేగాని. యొక్క- యొకవిధమైన తిక్క-మనుష్యుడు. ఆయన కీయుద్యోగమిచ్చువప్పుడు నాకీ సంగతి తెలియలేదు. ఆతిక్క- క్రమక్రమముగా హెచ్చెను. వెంకటనారా యణగారు విద్యార్థులిచ్చెడి జీతములు సరిగా వసూలుచేయకపోవుటయు, వసూలుచేసిన సొమ్మునకు సరిగా లెక్క-లుంచకపోవుటయు, మొదలైన లక్షణములు కనబడెను. అక్క-డ పెద్దమనుష్యులతో వెంకటనారాయణ

గారికి సంబంధములేదు. పాఠశాల నభివృద్ధిచేయుట కాయన యేమియు ప్రయత్నముచేయలేదు. సహాయోపాధ్యాయులతో నైకమత్యములేదు. విద్యార్థులకాయనమీద భక్తిప్రపత్తులులేవు. పాఠశాల చెడిపోవునట్లు కనబడెను. ఈవిషయములన్నియు నాకెప్పటికప్పుడు దెలియుచుపచ్చెను. ఈవిధముగ పాఠశాల మూడుమాసములు జరిగెను. ఏప్రియలునెలలో నాకుపచ్చిన రిపోర్టులనుబట్టి వెంకటనారాయణగారా పాఠశాలలోనుండిన పక్షమున నదితప్పక చెడిపోవునని నాకు భయముగలిగెను. అందుచేత నేను మేనెల యొకటవతారీఖునుండి మీరు మాపాఠశాలలో పనిచేయనక్కరలేదు. మిమ్ములను తీసివేసితినని వెంకటనారాయణగారి కుత్తరమువ్రాసితిని. ఈవిషయమై లక్ష్మీనరసింహాచార్యులవారికిగూడ నేను త్తరమువ్రాసితిని. నాజాబుచేరినమీదట నాచార్యులుగారు, "వెంకటనారాయణగారు మీపాఠశాలలో మూడుమాసములు పనిచేసిరి, కావున హఠాత్తుగ వారినిదీసివేయుట ధర్మముగాదు. ఒకనెలజీతమైన నిచ్చిన బాగుండు"నని నాపేర్వ్రాసిరి. వారిసలహా బాగున్నదని నాకుతోచినందున వెంకటనారాయణగారి కొకనెల జీతమేబదిరూపాయలిచ్చి పంపించివేసితిని. మే, జూనునెలలు వేసవికాల మగుటచే నాదినములలో మరియొకయుపాధ్యాయుడవసరములేదని నియమింపలేదు. నెలపులయనంతరమున శ్రీనివాసాచార్యులుగారనెడు యొక వైష్ణవయువకుని ప్రధానోపాధ్యాయునిగ నియమించితిని. ఈయాచార్యులుగారు పూర్వము నేను రాజమహేంద్రవరములో మునిసిపలుస్కూలులో బనిచేసినకాలమున నాయొద్ద జదువుకొనిరి. జూలైనెలమొదలుకొని డిశంబరునెలవరకు మా భీమవరము పాఠశాల చక్కగనే జరిగెను. మెట్రిక్యులేషనుతరగతిగూడ ముంచుసంవత్సరము స్థాపించి విద్యాశాఖవారి యనుమతిబడయవలెనని నాకభిలాషగలదు. కాని కొంతమూలధనమో సొంత భవనమో యుండినగాని విద్యాశాఖవారు పాఠశాల సంగీకరింపరని తెలిసినందునను, భీమవరప్రముఖులకు స్వగ్రామములోని పాఠశాలను వృద్ధిపరచవలెనన్న యభిలాషలేకపోవుటచేతను 1904 వ సంవత్సరాంతమున భీమవరము పాఠశాలనెత్తివేసితిని. పాఠశాలా సంస్థాపనయందు నాకుగల కుతూహలము దీనితో కొంతవరకడగెను.

రాజమహేంద్రవరములోని మా హిందూలోవరుసెకండరీ పాఠశాల, లక్ష్మీపతిగారి యాధిపత్యమున సరిగ జరుగుచుండెను. మా పాఠశాలలో సంస్కృత పండితుడుగానున్న యాకుండి వ్యాసశాస్త్రిగారు మిషనువారి

పాఠశాలలో నొక యుద్యోగము దొరకగా నక్కడకు వెళ్ళిరి. అక్కడ జీతమెక్కువగుటచేత వారిని వెంటనే యక్కడకు బంపితిని. వారిస్థానే వేదుల సూర్యనారాయణశాస్త్రిగారిని నియమించితిని. ఈయనగూడ కాకర పర్రు గ్రామవాసియే. ఈసంవత్సరమున (1904) నేను మున్ను తెనిగించిన "పార్వతీపరిణయ" నాటకము ప్రథమశాస్త్రపరీక్షకు పాఠ్యగ్రంథముగ చెన్నపురి విశ్వవిద్యాలయమువారు నిర్ణయించిరి. ఈ గ్రంథమును నేను 1899 వ సంవత్సరము శ్రీకోడూరి దక్షిణామూర్తిశాస్త్రిగారి సహాయమున నాంధ్రీకరించితిని. నేను చెన్నపట్టణములో నున్నప్పుడు శ్రీ సమ్మర్ది రంగయ్యశెట్టిగారి దర్శనముచేసితిని. నామిత్రులైన నాళము పద్మనాభము గారు నన్ను దీసికొనివెళ్ళి శెట్టిగారి దర్శనముచేయించిరి. చెన్నపురి విశ్వ విద్యాలయములో నాంధ్రగ్రంథములు పరీక్షకుపెట్టెడి యుపసంఘమునకు రంగయ్యశెట్టిగారధ్యక్షులు. ఆంధ్రగ్రంథ నిర్ణయమునకుగల యధికార మంతయు నాయనదే. నాగ్రంథము నిర్ణయించుటలో వీరేశలింగముగారి సిఫారసుగూడ నున్నదని నా నమ్మకము.

ఈ సంవత్సరము జరిగిన విషయములలో నా స్వవిషయము గొంత వ్రాయవలెను. ఆసంవత్సర మేప్రియల్ నెలలో మా పాఠశాలలో జదువుకొనుచున్న మంత్రిప్రగడ రామచంద్రరావను బాలుడు గోదావరిలో నీదులాడి మృతినొందెను. ఈవిధముగ నేటేట చిన్నవాండ్రు ప్రాయకముగ గోదావరిలో నీదులాడి మృతినొందుచుండిరి. ఈ మంత్రిప్రగడవారి బాలుడు కుందూరి వేంకటరత్నముగారికి బంధువును, నాకు మిత్రుడు, నైన మంచిరాజు పాపారావుగారికి మేనల్లుడు, నల్లుడుగూడ. ఆవార్త మాకు దెలిసిన వెంటనే. నేనును, వెంకటరత్నముగారును నార్యపురములోని గోదావరీ రేవునకు బోతిమి, బాలకుని శవము బయటపడియుండెను, మృతినొందిన బాలకుడు పదునైదు సంవత్సరముల వయస్సుగలవాడు. పెండ్లియైనది. మంత్రిప్రగడ రామకోటిగారి భార్య కాతడు దత్తుడు. ఈతని మరణమువలన మూడు కుటుంబములకు ఘోరవిపత్తు సంభవించెను. కన్న వారి కుటుంబమొకటి, పిల్లనిచ్చినవారి కుటుంబమొకటి, పెంచుకున్నవారి కుటుంబమొకటి. మూడు కుటుంబములు దుఃఖసముద్రములో మునిగియుండగా శవవాహకులు వచ్చి మూడువరాలిమ్మని, నాలుగువరాలిమ్మని బేరమాడ జొచ్చిరి. వెంకటరత్నముగారికివి. నాకును వాహకుల కాఠిన్యము చూడగా మిక్కిలి కోపమువచ్చినది. అప్పుడు వాహకులతో మేమిట్లం

టిమి. "శవమును మీరు మోయని పక్షమున మేమే మోసుకొని పోయెదము, మేము పూనుకొంటిమా మీకొక్కదమ్మిడి ముట్టదు." ఆపలుకులు విని శవవాహకు లెనిమిది రూపాయల కంగీకరించిరి. ఏలయన మాసత్తువ వారికి దెలియును. మేము మాటలుచెప్పక నిజముగా శవమును మోయుదు మని వారెరుగుదురు. రాజమహేంద్రవరములో మిత్రులయిండ్లలో మరణ ములు వచ్చినప్పు డాశవములను, ననాథశవములను మోయవలెనని ప్రతిజ్ఞ పట్టి కుందూరు వెంకటరత్నముగారు, నేనును, చెరువు సోమయాజులు గారును, చిలుకూరి వీరభద్రరావుగారును, మరికొందరు మిత్రులును జట్టుగ నేర్పడితిమి. అందుచే మమ్ముజూచిన శవవాహకులకు భయముగ నుండె డిది, కన్నులులేనివాడుగదా ? నీతెడెట్లు శవములు మోసెనని పాఠకులకు సందేహము దోపవచ్చును. అప్పటికి నాదృష్టి బాగుండెను. సమర్థులైన వారిని ముందునిలిపి, వెనుకప్రక్క నేనుండువాడను. ఈవిధముగ నేనయి దాదు శవములు మోసితిని.

●

స్వీ య చ రి త్ర ము

పం డ్రెం డ వ ప్ర క ర ణ ము

స్వ గృ హ క ష్ట ము లు

మా రెండవ చెల్లెలైన యచ్చమ్మ గర్భవతియై పురిటి నిమిత్తము మా యింటికి 1904 వ సంవత్సర మేప్రియలు నెలలో వచ్చెను. ఆమెభర్త మధునాపంతుల రామస్వామి యా దినములలో పూళ్ళలోనిబోర్డు లోవరు నెకండరీ పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడుగ నుండెను. వేసవికాలపు సెలవుల నిమిత్తము పాఠశాల కట్టివేసి యతడు మే నెల 4 వ తేదీని మా యింటికి వచ్చెను, మా చెల్లెలు, నిద్దరుకూతుళ్లు మా యింటి కదివరకేవచ్చి యుండిరి. అతడు వచ్చినది మొదలు తలనొప్పియనియు, కన్నులు లాగు

చున్నవనియు, చెప్పుచు నలతగానుండెను. భోజనముచేయుచునేయుండెను గాని సుఖముగా నుండుటలేదు దామెర్ల వెంకటరమణారావుగారివద్ద మందిప్పించుచుంటిని. అతడే స్వయముగావెళ్ళి మందు తెచ్చుకొను చుండెను. స్వల్పముగా జ్వరము తగులుచుండెను, మే నెల 13 వ తేదీ నాటికి జ్వరమెక్కువయ్యెను. పడునైదవ తేదీనాడు సంధించెను మే నెల 16 వ తేదీనాడు రాత్రి మా బావమరది మధునాపంతుల రామస్వామి మృతి వొందెను. పుత్రసంతాన మప్పటికిలేకపోవుటచే, మా తమ్ముడు కృష్ణమూర్తి యతని కుత్తరక్రియలు చేసెను. మా చెల్లెలు యచ్చమ్మ నిండుచూలాలు. ఆమె పెద్దకుమార్తె కెనిమిదవయేడు, రెండవకుమార్తె కారవయేడు. రామస్వామివద్ద ధనమేమియులేదు. ఉద్యోగమువల్లనే జీవనము చేయు చుండెను. అతని కన్నగారొకరుండిరిగాని, యతడు వీరవాసరములో వైదికవృత్తివల్ల జీవించుచుండెను. వీరిని పోషించు సామర్థ్య మతనికి లేదు. రామస్వామి కిల్లు వాకిలిగాని, పొలముగాని లేదు. ఓరియంటల్ కంపెనీలో వేయిరూపాయలకు భీమా మాత్రముండెను. ఈ స్థితిలో వారి కుటుంబము నా పాలబడెను. దైవముమీద భారమువైచి నే నా కుటుంబ రక్షణము చేయబూనితిని. మా బావమరది చనిపోయిన యిరువదియవ దినమున మా చెల్లెలు యచ్చమ్మ మగశిశువును గనెను. మగశిశువు గలిగె నన్న సంతోషము గృహమందెవ్వరికి లేకపోయెను. మా బావమరది తన కాడుపిల్లలేగాని మగపిల్లలు లేరని విచారించుచుండెను. అతడు బ్రతికి యున్నయెడల నీపుత్రోదయమునకు మిక్కిలి సంతసించియుండును. గోరుచుట్టుమీద రోకటిపోటన్నట్లు మాబావమరది యన్నయైన శివరామయ్య గారు తమ్ముని మరణవార్తవిని. మమ్ము జూచుటకువచ్చి జ్వరముదగిలి బాధపడెను. అతడు జీవించునా, లేదా యని మాకు పెద్ద సందేహము కలిగెను. ఎట్టకేలకాతడు జ్వర విముక్తుడై వీరవాసరము చేరెను.

ఆ సంవత్సరమున (1904) తణుకులో దొడ్డిపట్ల వెంకటరత్నము గారు మొదలైన ప్రముఖులుచేరి యొక యున్నతపాఠశాల స్థాపించి, యందు నా మేనమామగారైన మల్లయ్యశాస్త్రిగారి నాంధ్రోపాధ్యాయులుగ నియమించిరి. మల్లయ్యశాస్త్రిగారివర కమలాపురము బోర్డుహైస్కూలులో బనిచేసి, కొంతకాలము సెలవుదీసికొని, తణుకులోని యున్నత పాఠశాలలో జేరిరి. ఈ సంవత్సరముననే మా తమ్ముని భార్య గాపురమునకు వచ్చెను. ఈ కార్యమునకు గావలసిన ధనమంతయు నేనే వ్యయము

చేసితిని. కార్యముయినది మొదలుకొని మా తమ్ముడు వీరవాసరములోనే భార్యతోగూడ గాపురముండెను. ఈ సంవత్సరములోనే శ్రీ కందుకూరి వీరేశలింగముగారు పింఛను పుచ్చుకొని చెన్నపురినుండి రాజమహేంద్ర వరము వచ్చిరి. వీరేశలింగముగారి యుద్యోగము విషయములో నిచ్చట నొకమాట వ్రాయవలెను. వారు 1897 వ సంవత్సరమున. రెండుసంవత్స రములు సెలవుపెట్టికొని రాజమహేంద్రవరమునుండి చెన్నపురి వెళ్ళరని యందివరకే వ్రాసియుంటిని. సెలవు సమాప్తముకాగానే డైరెక్టరుగారు, ప్రెసిడెన్సీ కళాశాలలో నాంధ్రోపాధ్యాయులుగనున్న మహామహోపాధ్యాయ కొక్కొండ వెంకటరత్నము పంతులుగారిని రాజమహేంద్రవర కళాశాలకు మార్చి వీరేశలింగముగారిని ప్రెసిడెన్సీ కళాశాలలో నాంధ్రోపాధ్యాయులుగ వేసిరి. వేంకటరత్నము పంతులుగారు చిరకాలము చెన్నపురిలో నుండుటచే, నిచ్చటకు వచ్చుటకు నిష్టములేకపోయినను తప్పినదిగాదు. వీరేశ లింగముగారు 1904 వ సంవత్సరమువరకు నచట పనిచేసి పింఛను పుచ్చు కొని వితంతుశరణాలయము స్థాపింపవలెనని రాజమహేంద్రవరము వచ్చిరి. వారి రాక వారిశిష్యులమైన మా బోంట్లకు మిక్కిలి సంతోషదాయకముగా నుండెను. వారు వచ్చి "సత్యవాదిని" యను వారపత్రికను స్థాపించి నడపింపజొచ్చిరి. దానికి రామాప్రగడ వేంకటరామయ్యగారి నధిపతిగా నేర్పరచిరి.

ఈ పత్రికలో విశేషముగ సంఘసంస్కరణ విషయములే ప్రకటింప బడుచుండెను. అప్పుడప్పుడా పత్రికకు నేనుగూడ వ్రాయుచుంటిని. 1905 వ సంవత్సరమున తణుకులో న్యాయవాదిగనున్న తల్లాప్రగడ సూర్యనారాయణగారు "సువర్ణలేఖ" యను మాసపత్రికను ప్రకటింప జొచ్చిరి, ఆపత్రికకును, "సత్యవాదిని"కిని మత సాంఘిక విషయము లలో నభిప్రాయభేదములు గలిగెను. దురదృష్టవశమున నేనా వివాదము లలో దగులుకొంటిని. అది నా బుద్ధిపూర్వకముగ చేసిన దైనను పిమ్మట విచారించితిని. అది యెట్టిదనిన, తణుకులో పెమ్మరాజు సీతా రామయ్యగారని యొకన్యాయవాది యుండెను. ఆయన సంస్కృతసారస్వత జ్ఞానముగలవారు. ఆంధ్రరచనలకు గూడ నలవాటు పడినవారు. ఆయనతో నాకు వివాదముగలిగెను. గోపేటి కనకరాజుగారని యొక న్యాయవాది నరసాపురములో నుండిరి. ఆయన భగవద్గీతావిషయమై దెనుగులో నొక వ్యాసము వ్రాసిరి. ఆ వ్యాసముక్రింద కనకరాజుగారు "కె" యని సంతకము

చేసిరి. కనకరాజను పేరున కింగ్లీషులో మొదటియక్షరము "కె." పెమ్మరాజు సీతారామయ్యగారు కనకరాజుగారి వ్యాసముమీద "సువర్ణలేఖ"లో తెనుగున విమర్శనము వ్రాయుచు ఈ కనకరాజుగా రనుటకు మారుగ "ఈకె" గారు, "ఈకె" గారని పలుమారు లుదహరించిరి. "ఈకె" యనగా "వెఱ్ఱుక" యని యర్థమున్నది గనుక, కనకరాజుగారిని "వెఱ్ఱుకగా"డని యర్థము వచ్చునట్లు శ్లేషలో దనకుగల పాండిత్యము జూపుటకై నిందాగర్భముగ వ్రాసిరి. అది జదివినప్పుడు నాకెంతో కోపము వచ్చినది సీతారామయ్యగారు నన్నేమియు దూషింపకపోయినను, మిక్కిలి యనుచితమైన యా వ్రాత నాకు గోపము తెప్పించినది. ఏలయన, శ్రీకనక రాజుగారు సజ్జనుడు. నాకు జిరపరిచితుడు. ఆంగ్లవిద్యాపారంగతుడు. సంఘసంస్కరణాభిమాని. వీరేశలింగముగారికి ముఖ్యశిష్యులలో నొకడు. రాజమహేంద్రవర కళాశాలలో జదువుకొనుచున్నప్పుడు శ్రీ వీరేశలింగము గారు స్థాపించిన "సత్యసంవర్ధనీ"పత్రికకు మహారాజశ్రీ రాయసం వెంకట శివుడుగారు, గోపేటి కనకరాజుగారు, సత్యరాజు మృత్యుంజయరావుగారు మొదలగువా రింగ్లీషున, నాంధ్రమున వ్యాసములువ్రాసి యాపత్రికానిర్వహ ణమున వీరేశలింగముగారికి మిక్కిలి తోడుపడుచుండెడివారు. సంఘ సంస్కరణమున వీరు మువ్వురు మనఃపూర్వకమైన విశ్వాసముగలవా రగుటచే, వీరేశలింగంగారి దయకు, గౌరవమునకు బాత్రులైరి. ఆ కారణ మున నాకును కనకరాజుగారియెడ గౌరవము. ఆ గౌరవనీయుని నిష్కా రణముగ సీతారామయ్యగారు తూలనాడిరని నా మనసునకు నొప్పికలిగి నందున. సీతారామయ్యగారి విమర్శనకు నుత్తరమువ్రాసి దానిని "సత్య వాదిని"లో ప్రకటించితిని. అందు పెమ్మరాజు సీతారామయ్యగా రనుటకు మారుగ సంస్కృతవ్యాకరణ సాంప్రదాయానుసారముగ వారి నామము నకు నేను ప్రత్యాహారము చేసితిని. "ప్రత్యాహార" మనగా నామము పూర్తిగా చెప్పక మొదటి యక్షరమును, జివరయక్షరమును జెప్పుట. ఆ సాంప్రదాయమునుబట్టి పెమ్మరాజు సీతారామయ్యగా రనగా మొదటి యక్షరమైన "పె" యనుదానిని, కడపట యక్షరమైన "య" యనుదానిని గలిపి "పెయ్య" యని నేను సీతారామయ్యగారి పేరు వచ్చినప్పుడెల్ల నావ్యాసములో వాడితిని. కనకరాజుగారికి "ఈకె" యని సీతారామయ్య గారు వాడుటచే, వారికిగూడ నేను హాస్యాస్పదమైన పేరు పెట్టవలెనని నేనట్లు వ్రాసితినిగాని, మరియొక కారణముగాదు. కాని యిట్లు వ్రాసినం

దుకు తరువాత నాలో నేను మిక్కిలి పశ్చాత్తాపపడితిని. ఏలయన, సీతా రామయ్యగారు నాకు బాల్యమిత్రుడు. వీరవాసరములో జదువుకొన్నప్పుడు మే మిరువుర మొక్కతరగతిలో జదివిన సహాధ్యాయులము. తరువాత మే మిరువురము చెరియొక పాఠశాలలో జదివినను మిత్రులుగనేయుంటిమి. పిమ్మట రాజమహేంద్రవరములో జదువుకొనుటకు నారును వచ్చిరి. నేనును వచ్చితిని. వారు కళాశాలలో బి. ఏ. వరకు జదువుకొనిరి. నేనంత వరకు జదువుకొనకపోయినను, మే మచ్చటగూడ పరస్పరగౌరవమును, ప్రేమయు గలిగి, తరచు కలుసుకొని ముచ్చటలాడుచుండెడివారము. వారు విద్యార్థి దశనుండియు పూర్వాచారపరాయణులు. నేను సంఘసంస్కరణ ప్రియుడను; వీరేశలింగముగారి యనుచరుడను. నాజోలికెన్నడు రానట్టియు నాకు బాలసఖుడైనట్టియు, పెద్దమనుష్యునితో నేనే కయ్యమునకు కాలు దువ్వి పోరాటము పెట్టుకొంటినని, విషాదమునొంది నా వ్యాసమునకు సీతా రామయ్యగా రేదోప్రత్యుత్తరము వ్రాసినను నేను దానికి బదులువ్రాయక, యేదోకారణమున బుట్టిన స్వల్పవివాదము ప్రజ్వలింపచేయక, యడచి యూర్పివేయుట చదువుకున్నవారికి లక్షణమని, నేనే నాకు బుద్ధి చెప్పుకొని యూరకొంటిని.

సంఘసంస్కరణమునకై ప్రత్యేకము పాటుబడుచున్న "సత్యవాదిని" కిని, శ్రీ కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రిగారిచే స్థాపింపబడి, కాకినాడలో నడుప బడుచున్న "ఆర్యమతబోధిని" యను పూర్వాచారపరాయణ పత్రికకును గూడ నభిప్రాయభేదములు గలిగెను. బ్రహ్మయ్యశాస్త్రిగారు తమ పత్రికలో వీరేశలింగముగారి యభిప్రాయములను ఖండించుచు వచ్చిరి. వీరేశలింగము గారు "సత్యవాదిని"లో బ్రహ్మయ్యశాస్త్రిగారి యభిప్రాయములను ఖండిం చుచు వచ్చిరి. విమర్శనములను పేరేగాని, యవి పరస్పరనిందలు సంఘ సంస్కరణమునువారు, పూర్వాచారమును వీరు దూషించుచుండిరి. ఇందు వీరేశలింగముగారు కొన్ని మనోహరములైన హాస్య సంజీవనులుగూడ వ్రాయుచుండిరి. వీరేశలింగముగారి హాస్యరసము మిక్కిలి రసవంతముగ నుండెడిదని వేరే చెప్పనక్కరలేదు. వీరేశలింగముగారేగాదు, నేనుగూడ "సత్యవాదిని"లో బ్రహ్మయ్యశాస్త్రిగారిమీద గొన్ని వ్రాతలు వ్రాసితిని. అందులో గొన్ని యనుచితములైన వ్రాతలుగూడ గలవు. వయఃపరిణా మమునందిన యీ కాలమున, నా నాటి వెకిలివ్రాతలు దలచుకొన్నయెడల నాలో నాకే సిగ్గగుచుండును. వీరేశలింగముపంతులుగారు చెన్నపురినుండి

వచ్చిన తరువాత వారు తమ గ్రంథములన్నింటిని సంపుటములుగ నేముద్రా క్షరశాలలో ముద్రించి ప్రకటించిరో, యా చింతామణీ ముద్రాక్షరశాలను శ్రీ సత్యవోలు గున్నేశ్వరరావుగారికి విక్రయించిరి. ఆ ముద్రా యంత్ర మునుగొని గున్నేశ్వరరావుగారు దానిలో "ఆంధ్రకేసరి" యను తెనుగు వారపత్రికను నెలకొల్పి ప్రకటింపజొచ్చిరి, ఆ పత్రికకు సమర్థులై, "ఆంధ్రుల చరిత్రము" మొదలైన మహాగ్రంథములు వ్రాసిన శ్రీ చిలు కూరి వీరభద్రరావుగారిని గున్నేశ్వరరావుగారు పత్రికా సంపాదకులుగ నియమించిరి.

1904వ సంవత్సరమున కాకినాడలోనున్న శ్రీపిఠాపురము రాజుగారి కళాశాలలో ప్రధానాచార్య పదవి కాళీయయ్యెను. ఆ పదవికి, వి. శ్రీనివాస శాస్త్రిగారును, రఘుపతి వేంకటరత్నమునాయుడుగారును దరఖాస్తు చేసిరి. వేంకటరత్నమునాయుడుగారు సంఘసంస్కరణ ప్రియులును, బ్రహ్మ సమాజ ప్రియులునగుటచే, వారికే ప్రధానాచార్య పదవి నొసగినచో బాలకు లందరును పూర్వాచారమును విడిచి బ్రహ్మమతస్థులై చెడిపోదురని దురభి ప్రాయపడి కాకినాడ పురప్రముఖులు కొందరును, కళాశాలా పరిపాలక సంఘములో కొందరును నాయుడుగారి కా పదవి నియ్యక శ్రీనివాసశాస్త్రి గారి కిచ్చుట మేలని తలంచిరి. ఈవార్త వీరేశలింగముగారు విని, రాజ మహేంద్రవరమునుండి కాకినాడవెళ్ళి, నాయుడుగారి నిమిత్తమై ప్రయ త్నము చేసిరి. మా పురప్రముఖులైన శ్రీ న్యాపతి సుబ్బారావుపంతులుగారు శ్రీనివాసశాస్త్రిగారి నిమిత్తము ప్రయత్నము చేసిరి. అదృష్టవశమున నెట్ట కేల కా పదవి నాయుడుగారికే యయ్యెను. ఆ పదవిలోచేరి పనిచేయు టకు నాయుడుగారు సికిందరాబాదునుండి బయలుదేరి కాకినాడ వెళ్లుచుండిరి. ఆవార్త దెలిసిన పిదప శ్రీ ధారవాడ కృష్ణారావుపంతులుగారును, నేనును గలసి యాలోచించి నాయుడుగారి కొక యభినందన పత్రిక సమర్పించుట సముచితమని నిశ్చయించితిమి. ఆ నిశ్చయము ననుసరించి శ్రీ ధారవాడ కృష్ణారావుగారే యింగ్లీషున నొక యభినందన పత్రమును సిద్ధపరచిరి. కృష్ణారావుగారు, నేనును రాజమహేంద్రవరము రైలుస్టేషనునకువెళ్ళి, బొగబండిలో రెండవ తరగతియందున్న నాయుడుగారిని దర్శించి, యొక సారి దిగిరమ్మని కోరి ప్లాటుఫారముమీద గుర్చీవేయించి యందు వారిని గూర్చుండబెట్టితిమి. అభినందనపత్రమును కృష్ణారావుగారే చదివి సమ

ర్పించిరి. మేమిరువురమేగాక మరికొందరు మిత్రులుగూడ నచటనుండిరి. వారి పేరులు మరచితిని.

శ్రీ వీరేశలింగము పంతులుగారు · చెన్నపురినుండివచ్చి, ప్రాత యూరిలో నున్న స్వగృహములో ప్రవేశించి, "విత్తంతుశరణ్యాలయము"ను మొట్టమొదట వారి యింటనే స్థాపించి, దాని కనుబంధముగా నొక బాలికా పాఠశాల నెలకొల్పిరి. ఇందుచేత "శరణ్యాలయము"లోని బాలికలకేగాక చుట్టుప్రక్కల బాలికలకుగూడ విద్యాభ్యాసము చేయుట కనువుబడెను. వీరేశలింగముగారియెడ భక్తిగల గృహస్థులనేకులు తమ బాలికలను మునుపువాడు చదువుచున్న దొరతనమువారి బాలికాపాఠశాలనుండి తీసివేసి నూతనముగా స్థాపింపబడిన వీరేశలింగముగారి పాఠశాలకు బంప నారంభించిరి. అందు ముఖ్యులు శ్రీ కనుపర్తి శ్రీరాములుగారు, చిత్రపు నరసింహారావుగారు, సత్యవోలు లక్ష్మీపతిగారు, దామెర్ల వెంకట రమణారావుగారు; కొట్టు రాఘవయ్యగారు మొదలగు మెరకవీధి తెలగాలుగూడ తమ బాలికలను పంపినట్లు నాకు జ్ఞాపకము. నేనును నారెండవ చెల్లెలు కూతుల నిద్దరిని పంతులుగారి పాఠశాలకే బంపితిని. రాయవరపు రామమూర్తిగారు గూడ తమ మరదండ్రను వారి పాఠశాలకే పంపిరి. వీరేశలింగము పంతులుగారు తమ బాలికాపాఠశాలకు దగిన యుపాధ్యాయుల నేర్పరచి, నింగ్లీషు తామే స్వయముగ బోధించుచుండిరి. పంతులుగారు కొన్ని తరగతులను తమ మేడమీదను, మరికొన్ని తరగతులను నడుగు భాగము నందుంచి నల్లబల్లలు, కూర్చుండు బల్లలు, దేశపటములు సమకూర్చి, యుపాధ్యాయుల జీతములు మొదలైన వ్యయములు దామేభరించి, పాఠశాలను సక్రమముగ నడుపజొచ్చిరి.

ఈ సంవత్సరమున (1905) మాకుటుంబమునకొక గొప్ప విపత్తు సంభవించెను. గత సంవత్సరమున క్రోధి (1904) నా రెండవ చెల్లెలైన యచ్చమ్మ పెనిమిటి మధునాపంతుల రామస్వామి వేసవి సెలవులలో నన్నుజూడవచ్చి జ్వరపీడితుడై మాయింటనే. మేనెల 16 వ తేదీని మృతినొందెననియు, నతడు బోవునప్పటికి యతనిభార్య నారెండవ చెల్లెలు గర్భవతియై యుండెననియు, యతను బోయిన నిరువదియవనాడు జూను నెల 4 తేదీని నామె మగశిశువును గనెననియు నిదివరకే వ్రాసితిని. మగదిక్కులేని నా చెల్లెల కాబాలుడు కన్నుల చందమామయై భర్తపోయిన దుఃఖముకొంత శమింపజేయుచుండెను. సాయంకాలము నేను నాటకశాల

నుండి యింటికి వచ్చి బాలునొకసారి యెత్తుకొని ముద్దాడునప్పటికి నాయాయాసమంతయు దీరి నా మనస్సు ప్రసన్నమై యుండెడిది తల్లి దండ్రు లిద్దరు పచ్చనివాండ్రగుటచే బాలుడు సువర్ణచ్ఛాయ గలిగి పెద్ద కన్నులు గలిగి, పున్నమచందురునివంటి మొగముగలిగి మాతల్లికి తన తల్లికి మహానందకరుడై యల్లారు ముద్దుగా బెరుగుచుండెను. వాడు బ్రతికిన బాలునని నేను వానికి సరిగా నామధేయమైనా జేయలేదు. సంతాన విహీనుడనైన నాకు జనక విహీనుడైన యాబాలుడు పెరిగి పుత్ర ప్రాయుడై యేడుగిడయై యుండునని పంచప్రాణములు వానిమీదనే బెట్టు కొని, పాలదాదులనుపెట్టి పాలిప్పించి, బాలునెల్లవిధముల సంరక్షించు చుంటిని. 1905 వ సంవత్సరము జూన్ నెల 4 వ తేదీని వానికి జన్మ దినోత్సవము జేసితిని. అంతలో నెక్కడనుండి వచ్చెనో, జూన్ నెల 10 తేదీని యాబాలునకు జ్వరము విరేచనములు పట్టుకొనెను. జూన్ నెల 11 వ తేదీని మధ్యాహ్నము విద్యాభిమానినీ సమాజపక్షమున మహామహో పాధ్యాయ శ్రీ కొక్కొండ వేంకటరత్నము పంతులుగారి యాధిపత్యమున, శ్రీకంచుమర్తి రామచంద్రరావుగారి యింటియొద్ద జరిగిన సభలో నేను "వసుచరిత్ర"ను గురించి యుపన్యాసమిచ్చి సాయంకాల మింటికి వచ్చు నప్పటికి బాలునకు రోగము కొంచెము తగ్గినట్లు కనబడినది. నా మిత్రు లైన దామెర్ల వెంకట రమణారావుగారే సానుభూతితో మందిచ్చుచుండిరి. కాని, 12 వ తేదీనుండి జ్వరము, దాహము నెక్కువయ్యెను. పదునాలు గవ తేదీన రోగము భయంకరముకాగా రాత్రియంతయు బాలునకును, మాకును నిద్రలేకపోయెను జూన్ 15 వ తేదీ మధ్యాహ్నము మూడు గంటలకు బాలుడు మృతినొందెను. పోవునప్పటికి నాబాలునకు సంవత్స రముమీద పదిదినములు వయస్సు భగవంతుని యాశయమేమో కించిజ్ఞుల మైన మనమూహింపలేము గదా? ఈ యగ్నకుదేల పుట్టవలెను? యేల యకాలమున మృతినొందవలెను? పూర్వజన్మ పాపము బాలునిదా? తల్లిదా? మాదియా? ఎవరిదో తెలియదుగదా? తల్లిదేయైన పక్షమున యామె యేపాపము జేసినందులకీ పుత్రశోకము సంభవించెనో తెలియదు. ఈ బాలుని మరణముతో నాయాశలడుగంటెను. నామనోరథములు మంటగలసెను, బాలుడు మరణించినపుడు దుఃఖవశమున నేను మైమరచి తిని. జగమందకార బంధురమయ్యెను. దుఃఖపడిన నుపయోగము లేదని నేనెరిగియు, దుఃఖము చాలకాలమువరకు నేనడచుకొనలేక పోతిని. క్రమ

క్రమముగ నీ మనోవ్రణము కాలము గతించినకొద్ది నివారణమయ్యెను. ఆనాటి దృశ్యము నేనిప్పుడు దలచుకొన్న నామనసు దుఃఖపూరితమై నా కన్నులు నీరుగ్రిమ్ముచున్నవి, దుఃఖజాడ్యముల బాపుటకు భగవంతుడొక్కడే పరమ చికిత్సకుడు గదా! ఆతనినే నమ్మి కాలక్షేపము జేయుచుంటిని.

రాజమహేంద్రవరము మ్యునిసిపల్ సభకు 1892 వ సంవత్సరము మొదలుకొని 1901 వ సంవత్సరము వరకు గల తొమ్మిది సంవత్సరములు నిడమర్తి జలదుర్గ ప్రసాదరాయుడు గారధ్యక్షులై యుండిరి. వారి తరువాత శ్రీ మోచర్ల రామచంద్రరావుగా రధ్యక్షులైరి.

●

స్వీ య చ రి త్ర ము

ప ద మూ డ వ ప్ర క ర ణ ము

ప్రకాశముగారి సీమప్రయాణము

1903 వ సంవత్సరమున టంగుటూరి ప్రకాశముగా రధ్యక్షులై యొకసంవత్సరమైన తరువాత, ననగా 1904 వ సంవత్సరము నవంబరునెలలో, బారిస్టరు పరీక్షకు జదువుటకై నింగ్లాండు వెళ్ళిరి. విదేశ ప్రయాణము నాకిష్టమే గనుక, వెళ్లమని నేనుగూడ ప్రకాశముగారిని కొంతప్రోత్సహించితిని. వారు కొంతకాలము సీమలోనుండి, 1905 వ సంవత్సరమున జూలై 16 వ తారీఖున రాజమహేంద్రవరము వచ్చిరి. సాహసించి విదేశప్రయాణము చేసినందుకు ప్రకాశముగారిని సంఘములో స్వేచ్ఛగా జేర్చుకొనుట యుక్తమని నాకు దోచినందున ప్రకాశముగారి కొక విందుచేయుమని నా ప్రియమిత్రుడైన తల్లాప్రగడ చలపతిరావుగారిని నేను మిక్కిలి ప్రోత్సాహపరచితిని. నామాట త్రోసివేయక, చలపతిరావుగారు తన మేనల్లుడైన రాయవరపు రామమూర్తిగారి యింట ప్రకాశముగారికి

విందుచేసిరి. చలపతిరావుగారును, నేనును గలసివెళ్ళి కొందరు మిత్రుల నా విందునకు బిలిచితిమి. వచ్చినవారిలో నీక్రింది పెద్దమనుష్యులుండిరి. ధారవాడ వెంకటకృష్ణారావుగారు, సారంగు భీమశంకరరావుగారు, కను పర్తి శ్రీరాములుగారు, దామెర్ల వెంకట రమణారావుగారు, సత్యవోలు గున్నేశ్వరరావుగారు, టంగుటూరి శ్రీరాములుగారు, టంగుటూరి ప్రకాశముగారు, చెరువు సోమయాజులుగారు, రాయవరపు రామమూర్తిగారు, నేను మరికొందరు మిత్రులును. విందునకు వచ్చినవారి పేళ్లు నిర్ణయముగా "సత్యవాదినీ" పత్రికలో ప్రకటించిరి. ప్రకటింపబడినతోడనే పట్టణములో గొప్పసంక్షోభము బయలుదేరెను. ఊరట్టుడికినట్లుడికెను. సీమవెళ్ళినవారితో భుజించుట మహాపాతకమని యభిప్రాయపడి సభాపతులు మొదలగు వైదికశిఖామణులు సంఘమర్యాద గాపాడుకొనుటకు మార్కండేయస్వామివారి యాలయములో గొప్పసభజేసిరి అప్పుడు గవర్నమెంటువారి న్యాయవాదిగనున్న మహారాజశ్రీ చిత్రపు వేంకటాచలముపంతులుగారా సభకధ్యక్షతవహించిరి. ప్రకాశముగారు సీమకువెళ్ళిన విషయమును, వారికి చలపతిరావుగారు చేసిన విందువిషయమును సభాపతు లభినవవిరూపాక్ష మఠాధిపతులైన శ్రీ శంకరాచార్యస్వాములవారికి దెలియపరచిరి. అప్పుడు రెడ్డిపోలవరగ్రామ నివాసియై పూర్వాశ్రమమున యనమండ్ర నరసింహశాస్త్రిగారను పండితులు పీఠాధిపతులుగానుండిరి. ఆ స్వాముల వారు వెంటనే సీమవెళ్ళినందుకు ప్రకాశముగారికిని, విందుచేసినందుకు చలపతిరావుగారికిని, వెలిబత్రికలు బంపి, విందులో పాల్గొన్న మావంటి వారికి ముందుగ నాంక్షపత్రికలు బంపక, "మీరు ప్రకాశముగారికి చలపతిరావుగారు చేసిన విందులో పాల్గొన్నారట నిజమా?" యని ప్రశ్నవేయుచు శ్రీముఖముల బంపిరి. అట్టి శ్రీముఖముల నందుకొన్నవారిలో నేనొకండను. ఆ జాబు చేరినతోడనే నేను వారికి ప్రత్యుత్తరమంపితిని. వారికి "శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్యవర్య"యను బిరుదములతో జాబులు వ్రాయవలెను. నేనా బిరుదములేమియు వ్రాయక, "అభినవవిరూపాక్ష మఠాధిపతులైన శంకరాచార్యస్వాములవారికి" నని పైనను, లోపలను వ్రాసి, "నమస్కారములు" నను మాటలుగూడ వ్రాయక, ప్రకాశముగారికి చలపతిరావుగారు చేసిన విందులో నేను ప్రకాశముగారి పంక్తిని భోజనము చేసితినని ప్రత్యుత్తరమిచ్చితిని. నా జవాబు స్వాములవారికి కొంత వెంకి తనముగానున్నట్లు కనబడెను. తరువాత నొకసారి నా మేనమామగారైన

మల్లయ్యశాస్త్రిగా రొకచోట స్వాములవారిని కలుసుకొనిరట. అప్పుడు స్వాములవారు నా మేనమామగారితో రాజమహేంద్రవర ప్రసంగములు తెచ్చి "శాస్త్రిగారూ! మీ మేనల్లుడు గురుధిక్కారము చేయుచున్నాడు! మేమేమైన చేసినపక్షమున మీకు కష్టముగా నుండునని మేమాలోచించుచున్నాము." అనిరి. ఆ మాటలు విని మల్లయ్యశాస్త్రిగారు, "నా మనసున కేమియు నొప్పియుండదు మీ యిష్టము వచ్చినట్లు చేయు"డని చెప్పిరట. స్వాములవారు నాకుగాని, గున్నేశ్వరరావుగారికిగాని, యాంక్షపత్రికలు పంపలేదు. మేము వారిమీద నభియోగము దెత్తుమని భయమున నూరకుండిరని జనులు చెప్పుకొనిరి.

పూర్వము వితంతువివాహములు ప్రారంభమైనపుడు వెనుకటి శంకరాచార్య స్వాములవారు మహారాజశ్రీ ఆత్మూరి లక్ష్మీనరసింహశ్రేష్ఠి గారికి వితంతువివాహములలో జోక్యము కలుగజేసుకొన్నందుకు నొక యాంక్షపత్రిక బంపిరి. అంతట లక్ష్మీనరసింహశ్రేష్ఠిగారు స్వాములవారి మీద నభియోగముదెచ్చి హైకోర్టుదాకపోరి, స్వాములవారికి రెండువందల రూపాయల జరిమానా వేయించిరి. మఠాధిపతుల కా దెబ్బ యిప్పటికిని జ్ఞాపకమున్నది. అందుచేతనే స్వాములవారు మా కాంక్షపత్రిక బంపుటకు సందేహించిరి. మఠాధిపతులైన స్వాములవారన్న నా కెంతమాత్రము గౌరవములేదు. పండితులు కొందరు కష్టపడి పీఠములెక్కి లోకమందరు తమ శిష్యులని విర్రవీగుచు భిక్షలని పేరుపెట్టుకుని, సోమరిపోతులై నేతి పిండివంటలతో ప్రతిదినములు భోజనముచేసి, పట్టుపాన్పులమీద పండుకొనుచు, నేనుగులు, పల్లకులు, గుర్రములు మొదలైన సిబ్బందిని వెంట బెట్టుకొని నూరూర దిరుగుచు నానాబాధలుపెట్టి యింటింటికి రూపాయ చొప్పున వసూలుచేయు ధనమంతయు దుర్వ్యయము చేయుచుందురు. వారు భిక్షానంతరమున "భగవద్గీతల"లో నొక యధ్యాయముగాని, యొక "యుపనిషత్తు"గాని యొక "బ్రహ్మసూత్రము"గాని బోధించిన పాపమున నెవ్వడుబోరు

స్వాములవారిలో గొందరీ పుస్తకముల పేరులే యెరుగరు. ఒక పీఠాధిపతి ధనము చాల ప్రోగుచేసి, కుమార్తెకు పెంకుటిల్లు గట్టించి, భూములుగొని యిచ్చిరి. మరియొక పీఠాధిపతి పీఠముకొరకు పూర్వపు పీఠాధిపతులు సంపాదించిన పీఠపు నగలను వెండి దీపస్తంభములను విక్రయించి, తన యింపుడుక త్తెయైన వేశ్యాంగన కిచ్చిరట. పీఠాధిపతుల

యొద్ద నిరంతరము గొన్ని యాంక్షపత్రికలు కొన్ని ఖద్దపత్రికలు నిలువ యుండును. ఎవరిమీదనైన గోపమువచ్చినప్పుడు స్వాములవా రొక యాంక్షపత్రికనుదీసి, వానిమీద ప్రయోగించి, తమకు వారు తగినంత లంచ మిచ్చినప్పుడు ఖద్దపత్రిక నొకదానిని ప్రసాదించుచుందురు. ఇటువంటి పీఠము లెంత త్వరలో నాశనమైన నంత త్వరలో దేశము బాగుపడునని నా యభిప్రాయము. ఇటువంటి పీఠములు జనులపై నధికారము గలిగి యుండవలెనని "మనుస్మృతి"లోగాని, కలియుగము నిమిత్తమై నుద్దేశింప బడిన "పరాశరస్మృతి"లోగాని, "యాపస్తంబసూత్రముల"లోగాని, "గౌతమ సూత్రముల"లోగాని, "భారత"ది మహాగ్రంథములలోగాని చెప్పబడలేదు. ఈ పీఠమధికార ప్రియులగు విద్యారణ్యాది మహాపురుషులచే స్థాపింపబడి, గతానుగతికముగ వచ్చుచున్నది. కొన్ని మఠములకు సంవత్సరమునకు వేలకొలది రూకలు రాబడివచ్చు నగ్రహారములు గలవు. ఈ పీఠాధిపతులు నిరంకుశాధికారులు. దేశాభివృద్ధి కరములైన కార్యములు వీరికి గిట్టవు. ప్రకాశముగారి సీమప్రయాణమునుగూర్చి యుపన్యసించుచు నేనట్లుచెప్పితిని. "ఏదేని నేరముజేసిన వానికి ధనదండనము విధించి, దారా పుత్రాదులను విడచి, కారాగృహములో నుండున ట్లధికారులు విధింతురుగదా? విద్య నిమిత్తము విదేశముల కరిగిన వాడు మూడుసంవత్సరములు విదేశములో నుండవలెనుగదా! అదే ద్వీపాంతరవాస శిక్షగా గ్రహింపుడు! ఆ మూడేం డ్లలో పదివేలరూపాయలయిన ఖర్చుబడునుగదా! ఆ పదివేలు జరిమానా విధింపబడినట్లు గ్రహింపుడు! పరదేశవాసముచేసిన పాపమున కింతకంటె నెక్కుడు శిక్ష యెందుకు? విదేశప్రయాణము చేసిన వీరుదుతనకు తానే విధించుకొన్నశిక్షయిది! స్వయంకృతాపరాధమునకీ స్వయంకృతశిక్ష చాలు. ఇది దేశోపకారకమైన కార్యము కనుకదీనికై యాగ్రహింపకుడు."

1905 వ సంవత్సరము ప్రారంభమున శ్రీకృష్ణ నరకాసురుల యుద్ధమును గురించి యొక నాటకమును వ్రాయదలచి, "ప్రసన్నయాదవ" మని దానికి పేరుపెట్టి, జనవరి నెలలో మొదటి యంకము వ్రాసితిని. ఆ సంవత్సరము నాటకము ముగించలేదు. నేను రాజమహేంద్రవరములోను, భీమవరములోను, పాఠశాలలు స్థాపించుటచేతను, నే నుపాధ్యాయుడుగ నుండక పోవుటచేతను నాకు గొంత ఋణము పెరిగినది. ఆ ఋణవిమోచ నార్థమై యొక యేర్పాటు చేయవలసివచ్చెను. సత్యవోలు గున్నేశ్వరరావు నాటకప్రియుడు. విశేషించి మానాటకసమాజమున కుపాధ్యక్షుడు. ఆ సమా

జమునకు నేనధ్యక్షుడనగుటచే మేమిరువురము సాయంకాలము కలుసు కొనుచుండువారము. నా నాటకములను హాసమాజమువారు పలుమారు రంగస్థలమున ప్రదర్శించుచుండిరి. అవి జనరంజకముగ నుండుటచే బరంపురము నుండియు, మరికొన్ని యితరస్థలములనుండియు నానాటకము లకు వ్రాతప్రతులు వ్రాసిబంపమని హనుమంతరావు నాయుడుగారికిని, తాతయ్యనాయుడు గారికిని వారి బంధుమిత్రుల వద్దనుండి జాబులువచ్చెను. వ్రాతప్రతులు వ్రాసి పంపుటకు వారు బద్ధకించి యూరకుండిరి. అందుచేత నానాటకముల నచ్చువేయించవలసినదని నామిత్రులు గొందరు నాకు సలహాచెప్పిరి. అచ్చువేయించవలెనని నాకును కోరిక యుండెనుగాని, నాయొద్ద ధనములేదు. పూర్వమెప్పుడో వ్రాసిన నాటకములను సవరింప కుండ నచ్చువేయుట బాగుండదని నాకుదోచెను సవరించుటకు దగిన యవకాశము లేకపోయెను. ఇట్లుండగ, సత్యవోలు గున్నేశ్వరరావుగారు నాకొక యుపాయము చెప్పిరి. నేను రచియించిన నాటకములలో "సీతా కళ్యాణము", "పారిజాతా పహరణము", "ద్రౌపదీ పరిణయము", "గయోపాఖ్యానము" నను నాలుగు నాటకములు తన కైదుసంవత్సరములు గుత్తకీయవలసినదనియు, నాయయిదు సంవత్సరములలో నాపుస్తకముల నచ్చువేయించుకొని లాభనష్టముల ననుభవించెదననియు, నందుకు ప్రతి ఫలముగా నాకు నాలుగు నాటకములకు నాయన వేయిరూపాయల నిచ్చెద మనియు, వర్తమాన మంపిరి. ఆయుపాయము నాకు నచ్చెను. ఈ సొమ్ముతో నా పుస్తకము లచ్చువడుటయేగాక నాఋణముగూడ దీరిపోవు నని సంతోషించి, నేను వారి సలహానంగీకరించి, వారితో నొక యొడం బడిక చేసికొని ద్రవ్యము పుచ్చుకొంటిని. నాటకములు సవరింపకుండ నచ్చువేయుట నాకిష్టములేదు. అందుచేత, నేనొక గుమాస్తాను నియమించు కొంటిని. ఆగుమాస్తా సత్యవోలు అప్పారావుగారు. అప్పారావుగారికిని, గున్నేశ్వరరావుగారికిని నింటిపేరొకటేగాని వారు జ్ఞాతులుమాత్రముగారు. సత్యవోలు అప్పారావుగారు నేను మ్యునిసిపలు స్కూలులో నుపాధ్యాయు డుగ నున్న కాలమున నా స్కూలులో చదువుకొనుచే కొంతకాలము నాకు శిష్యుడు. వీరిని గుమాస్తాగ నేర్పాటు చేసుకొన్న పిమ్మట నేను మొదట "పారిజాతా పహరణ" నాటకమును సవరింప నారంభించితిని. సవరించుట యనగా నందు పూర్వము పద్యములు లేని పాత్రలకు పద్య ములు పెట్టుటయు, చక్కవయున్న పాత్రలకు నెక్కువ పెట్టుటయు,

మునుపున్న భాగములు గొన్ని తీసివేసి కొత్తభాగములు చేర్చుటయు, నని నాయభిప్రాయము. ఈ విధముగ నేను "పారిజాతాపహరణ" నాటకమును సవరించి, 1905 వ సంవత్సరాంతమునకు ముద్రణమునకు సిద్ధముచేసి నేను గున్నేశ్వరరావుగారి కిచ్చితిని. చింతామణి ముద్రాక్షరశాల గున్నేశ్వరరావుగారి చేతిలోనుండుటచేత, వారు దానిని సాధ్యమైనంత త్వరగ ముద్రించిరి. నాలుగు నాటకములలో నేనొక నాటకమును గున్నేశ్వరరావుగారికిచ్చితిని గావున మూడు నాటకములు వారికీయవలసినభారము నామీదనుండెను. "పారిజాతాపహరణ" నాటక మచ్చుపడి ప్రచురింపబడిన వెంటనే యది జనాదరణము బడయజొచ్చెను.

ఆ నాటకమునందు శృంగారరసముతోపాటు హాస్యరసముగూడ విశేషముగానుండెను. "సీతాకళ్యాణము"ను, "ద్రౌపదీపరిణయము"ను, సవరించుటకును శుద్ధప్రతి వ్రాయించుటకును నేను కొంత జాగుచేసినందున, "సీతాకళ్యాణము" నకు బదులుగా నా రచించిన "ప్రసన్నయాదవ" నాటకమును దనకిమ్మని అడిగినందున 1906 వ సంవత్సరము జూనునెలనాటికి నేనా "ప్రసన్నయాదవ" నాటకమును సమాప్తముచేసి వారికిచ్చితిని. ఆ కారణమున "సీతాకల్యాణ" నాటకమును నేను సవరింపవలసిన యవసరము లేకపోయెను. 1909 వ సంవత్సరము వరకును "గయోపాఖ్యానము"ను సవరించుటకు నాకవకాశము లేకపోయినందున, నా సంవత్సరము సవరించి నేను దానిని వారికిచ్చితిని. "పారిజాతాపహరణము", "ప్రసన్నయాదవము", "గయోపాఖ్యానము" నను మూడు నాటకములు వారచ్చువేయించి విక్రయించినందున నాకు వారిచ్చిన సొమ్ము, అసలీఫాయిదాలతో చేరుటయేగాక, కొంతలాభము వచ్చుటచే "ద్రౌపదీపరిణయ" నాటకమును సవరించి యిమ్మని నన్ను వారు త్వరపెట్టలేదు. నాటికీ, నేటికీ నేను వారికా నాటకము నీయలేదు. పాపము గున్నేశ్వరరావుగారుగూడ 1925 వ సంవత్సరములో మృతినొందిరి, అదిగాక, గున్నేశ్వరరావుగారు స్థాపించిన "ఆంధ్రకేసరి" పత్రికకు శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారు సంపాదకులై, సమర్థముగా నడుపుచున్నను నేనుగూడ కొన్నిసంవత్సరములు గంభీరములై జనులకు రుచికరములైన వ్యాసములువ్రాసి యిచ్చుచుంటిని. అది మనస్సులో నుంచుకొని గున్నేశ్వరరావుగారు నేను నాలుగవ నాటకము నీయకపోయినను, నన్నేవిధముగను బాధింపక యూరకుండిరని నా నమ్మకము.

నాపెత్తనములోనున్న రాజమహేంద్రవర "హిందూనాటక సమాజము"ను గురించి సింహావలోకనముగా గొన్ని విషయములిచ్చట వ్రాయక తప్పదు. హనుమంతరావు నాయుడుగారు మా సమాజమునకు ముఖ్య ప్రాణమేయని చెప్పుట యతిశయోక్తిగాదు. 1902 వ సంవత్సర మేప్రియలునెలలో వారికి వాతముచేత కాళ్లు పడిపోయెను ఇంటిలో డేకుటయే గాని వారు నడుచుటలేదుగదా! నిలువబడుటకైన యోపిక లేకపోయెను. మ్యునిసిపలు పాఠశాలకు ప్రధానోపాధ్యాయులుగ పనిచేయలేక సెలవు పుచ్చుకొనిరి. ఆసంవత్సరము జూనునెలలో మా మ్యునిసిపలు సెక్రెటరీగానున్న దామరాజు బసవరాజుగారు మృతినొందిరి. ఆ యుద్యోగమును మునిసిపలు సభవారు హనుమంతరావు నాయుడుగారికిచ్చిరి. కాళ్లు పడిపోవుటచే వారా యుద్యోగములో వెంటనే చేరలేకపోయిరి. రాజమహేంద్ర వరములోని డాక్టరులును, చెన్నపురిలోని డాక్టరులును, నాయుడుగారి కెన్నడును కాళ్ళురావని నిర్ధారణచేసిరి. ఆ నిర్ధారణమునుబట్టి గవర్న్మెంటువారు నాయుడుగారికి సెక్రెటరీపదవి నీయగూడదని ఖండితముగ వ్రాసిరి. అప్పుడు టంగుటూరి ప్రకాశముగారును, పిళ్ళారిసెట్టి నారాయణరావు నాయుడుగారును హనుమంతరావు నాయుడుగారిని వడ్డూరుబంపిరి, వాతముచేత పడిపోయిన కాలుచేతులను, దెబ్బలుతగిలి విరిగిపోయన కాలుచేతులను, నావునేతితో కట్లుకట్టి కుదుర్చుటలో వడ్డూరు నివాసులైన కఠారి రామరాజుగారు సూరపురాజుగారునను క్షత్రియ ప్రముఖులు నిరుపమాన ప్రజ్ఞావంతులు. వీరిసహాయమున కాలుచేతులు విరిగినవారనేకులు యథా ప్రకారముగ కరచరణాద్యంగములు కలిగి సుఖపడుచున్నారు. మాజిల్లా జడ్జియైన ఠాకంటను దొరగారి కొకప్పుడు చేయివిరుగగా వారు కట్టుకట్టి, యాచేతిని చక్కజేసి, దొరగారి కృతజ్ఞతకు పాత్రులైరి. హనుమంతరావు నాయుడుగారు కొన్నిమాసములు వడ్డూరులోనుండి, కట్లు కట్టించుకొని, సంపూర్ణారోగ్యమునుగలిగి. 1903 వ సంవత్సరము ఫిబ్రవరి నెలలో మ్యునిసిపలు పాఠశాలలో నెప్పటియట్లు పనిచేయసాగిరి. ప్రతిదినము నాటక సామాజికులందరు నాటకశాలకుపోయి కుర్చీలమీదను, బల్లలమీదను గూర్చుండి హాయిగా గాలము గడుపుచుండెడివారు. ఆదినములలో మాకు నాటకశాలయే టపునుహాలు. నాటకశాలయే స్వర్గము. జబ్బుగానున్న దినములలో నాయుడుగారు నాటకములలో వేషములు వేయకపోవుటయే గాక, సాయంకాల మందరితోపాటు నాటకశాలకు రాకపోవుటచే మా

నాటకసమాజము వారి సహవాస సౌఖ్యము గోలుపోయి వారి ప్రసంగములు విను భాగ్యములేక "సింగములేని యడవి"వలె శోభావిహీనమై యుండెను. వారువచ్చి మరల నుద్యోగములో చేరినతరువాత నాటకములలో వేషములు వేయుట మానిరిగాని సాయంకాలమున మా నాటకశాలకువచ్చి, మాముచ్చటలలో పాల్గొని, మా కానందము కలుగచేయుచుండిరి.

నా పెత్తనములో నున్నప్పుడు నాటకశాలను నీతిమంతముగా జేయుటకై మిక్కిలి ప్రయత్నించితిని. నీతిని నిలుపుటకు, సమాజము యొక్క గౌరవమును స్వాతంత్ర్యమును గాపాడుటకు, నేను శక్యమైనంత వరకు ప్రయత్నము చేసితిని. మా సమాజములో సామర్థ్యముగల స్త్రీవేషధారులు లేకపోవుటచే నేను ముప్పిడి జగ్గరాజను నతనిని స్త్రీవేష ధారణమునకై నెల కిరువదిరూపాయలు జీతమిచ్చి పిఠాపురము నుండి బిలిపించితిని, అతను బ్రాహ్మణేతరుడు. అయిననను స్ఫురద్రూపి. స్వచ్ఛమైన యుచ్చారణ గలవాడు. అభినయించుటలో మిక్కిలి నేర్పుగలవాడు. శ్రావ్యమైన కంఠముగలిగి, హృదయంగమముగ పద్యములు పాడగలవాడు. ఈతని రాకచే మా నాటకసమాజమునకు గొప్ప పేరు గలిగెను. నాయిక పాత్రల నన్నింటిని నతడే ధరించి ప్రేక్షకుల పొగడ్తల నందెడువాడు. ఒకసారి మానాటకసమాజములో ముఖ్యపాత్రలను ధరించు యువకులిద్దరు భంగుతోగలసిన క్షీరమును ద్రాగి, యసందర్భముగాను, నప్రస్తుతముగాను నొక నాటి మధ్యాహ్నము సమాజభవనములో మాటలాడ జొచ్చిరి. వెంటనే వారిని నేను మా సమాజమునుండి తీసివేసి యావలకు బంపివేసితిని. పురి రెండు దినములతరువాత వారు పశ్చాత్తాపమునొంది నా కడకు వచ్చి, చేసినతప్పు నొప్పుకొని క్షమింపుమనికోరి, మరల సమాజములో జేర్చుకొమ్మని వేడిరి. అప్పుడు నేను వారిని క్షమించి మరల చేర్చుకొంటిని. అట్టి తెలివితక్కువ పనుల మరల నెన్నడు చేయక వారు జాగ్రత్తగా నుండిరి. మా సమాజమువారు తహసీలుదారుగారు మొదలగు నుద్యోగస్థుల కెన్నడును జడియలేదు. అధికారులకు భయపడి టిక్కెట్లు నుచితముగ నీయలేదు. ఒక యధికారి భార్య యుచితముగ టిక్కెట్లు బంపుమని వారి సేవకుని మా కడకు బంపెను. రాత్రి యెనిమిది గంటల కక్కడ దొరకునని టిక్కెట్లగదిచూపి, సత్యవోలు లక్ష్మీపతిగారు సమాధానముచెప్పి వచ్చిన వానిని బంపివేసిరి. ఒక మేజస్ట్రీటుగారు మాసమాజముకడ రాత్రి డప్పులను వాయించు మంగలవాండ్రు చుట్టు

ప్రక్క-లవాండ్రకు నిద్రాభంగము కలుగచేయుచున్నారని పోలీసువారిచేత దమకోర్టులో యభియోగము దెప్పించుకొని తామే వారికి జరిమానాల విధించిరి. అప్పుడు మేమూరకుండక జాయింటుమేజస్ట్రేటుగారియొద్ద నప్పీలుజేసితిమి. ఆదొరగారు మామీద దేబడిన యభియోగమును మరల విచారణచేయుమని తహసీలుదారుగారియొద్దకు బంపిరి. తహసీలుదారుగారు విచారణ ప్రారంభించిరి. అప్పుడు మాపక్షమున నేతి వెంకటసోమయాజులు గారు, పిళ్ళారిసెట్టి నారాయణరావునాయుడుగారు, కనుపర్తి శ్రీరాములు గారును న్యాయవాదులై, తాలూకాకచేరీకివచ్చి వాదించిరి. పోలీసువారి పక్షమున సుబ్బారెడ్డిగారను పోలీసుయినస్పెక్టరుగారు వాదించిరి. తహసీలు దారుగారు మాపైవచ్చిన యభియోగమును త్రోసివేసి, మంగలివాండ్రకు పడిన జరిమానాలు రద్దుచేసి, సొమ్ము వాపసుచేయించిరి. ఇదిచిన్నయంశ మైనను, మాసమాజమువారాత్మగౌరవమును, స్వాతంత్ర్యమును గాపాడు కొనుటకెట్లు ప్రవర్తించిరో తెలుపుటకై యీవిషయము వ్రాయవలసివచ్చెను.

1906 వ సంవత్సర ప్రారంభమున జనవరినెలలో నేను "మనోరమ"యను మాసపత్రిక ప్రకటింపనారంభించితిని. దానిని శ్రీ గున్నేశ్వర రావుగారి చింతామణీ ముద్రాక్షరశాలలో ముద్రింపించితిని. ఈపత్రికలో నేను "ప్రసన్నయాదవ" నాటకమును నెలకొకయంకముచొప్పున ప్రకటించి జూనునెలనాటి కయిదంకములు ముగించితిని. ఈ పత్రికయొక్క ప్రథమ సంచిక చేరినతోడనే నామిత్రులైన జయంతి రామయ్యపంతులుగారు "మీకవిత్వముగానముపలె నాకానందము కలిగించుచున్నది" అని జాబు వ్రాసిరి. కూచి నరసింహముగారు "తేనెవలె రుచించుచున్నది" అని నన్ను బహూకరించుమ వ్రాసిరి. ఈనాటకముగాక, "మనోరమ" పత్రికలో "రాజస్థాన కథావళి"యను గ్రంథమును, "మహాపురుషుల జీవచరిత్రము లను" గ్రంథమును, "వినోదములు"ను, "కర్పూరమంజరి"యను నవలను భాగభాగములుగ ప్రకటింపజొచ్చితిని. "రాజస్థానకథావళి" Todd's of Annals of Rajasthan యను నింగ్లీషుగ్రంథమునుండి తెనిగింపబడి నది. ఈ గ్రంథము రెండు భాగములుగలది. మొదటి భాగము 1906 లోను, రెండవభాగము 1907 లోను ప్రకటింపబడినవి. "మహాపురుషుల జీవిత చరిత్రము" మూడుభాగములుగలది. అందు మొదటిభాగము రాజా రామ మోహనరాయలు మొదలగు బంగాళాదేశపు మహాపురుషుల జీవచరిత్రలు గలది. ఇది 1906లో ప్రతిమహాపురుషుని పటముతోసహా భాగభాగములుగ

ప్రకటించితిని. రెండవభాగము బొంబాయిరాజధానిలోని మహాపురుషుల జీవచరిత్రలు కలిగియున్నది. ఇది 1907 లో వారివారి పటములతో ప్రకటింపబడెను. పటములు సంపాదించుటకై నెలకు పదిరూపాయలుచొప్పున నాకు వ్యయమగుచుండెను. మూడవభాగము చెన్నపురిలోని నాయకుల చరిత్రలతో నిండియున్నది. "కర్పూరమంజరి"లోని మొదటిభాగము 1906 లో ముగించితిని. ఈ పత్రికకు మొదటిసంవత్సరములోనే తగినంత ప్రోత్సాహముకలిగెను.

ఈ సంవత్సరము రాజమహేంద్రవరములో నొకవిశేషముజరిగెను. శ్రీ శంకరాచార్యస్వాములవారు టంగుటూరి ప్రకాశముగారితో భోజనము చేసినవారికి వెలిపత్రికలు బంపుటకై ప్రయత్నముచేయుచుండిరి. వారు రాజమహేంద్రవరమువచ్చి శంకరమఠములో బసచేసిరి. ఆంక్షపత్రిక లుప సంహరింపుమని వారిని వినయముతో వేడుకొనుటకై పురజనులొక యేకాదశినాడు మధ్యాహ్నము మార్కండేయులవారి యాలయములో నొక సభచేసిరి. ఆసభకు శ్రీస్వాములవారి నాహ్వానముచేసిరి. శ్రీస్వాములవారు దమయేనుగునెక్కి సభకువచ్చిరి. గౌరవముగా వారిని మంటపముమీద నొక కుర్చీమీద కూర్చుండబెట్టిరి. పౌరులు వారికిరుప్రక్కల పాదములకడ మంటపముమీద క్రింద గూరుచుండిరి. తక్కిన పౌరులు మంటపమునకు, గర్భాలయమునకు నడుమనున్న కాళీస్థలములోగూరుచుండిరి. అప్పుడు మాపురములో రెండవతరగతి (2nd grade) న్యాయవాదియైన గుండవరపు రామమూర్తిగారులేచి, స్వాములవారికెదురుగానిలిచి, చేతులుజోడించి యిట్లని విన్నవించిరి. "స్వామీ! సరదానిమిత్తము సీమవెళ్ళలేదు. విద్యాభ్యాసమునకు వెళ్ళిరి. వారు వర్ణసాంకర్యము చేయుటకై వెళ్ళలేదు. వారు మంచిపనిచేయుటచే మావారు కొందరాయనతో భోజనముచేసి సంఘములో జేర్చుకొనిరి. కాబట్టి ప్రకాశముగారిని, వారితో భోజనముచేసినవారిని, వెలివేయక క్షమించవలెనని నాప్రార్థన." అని గుండవరపు రామమూర్తి గారు పలుకుచుండగా నాయనమాటలు సహింపక పూర్వాచారపరాయణుడైన యొకశాస్త్రి సభలో నుచ్చరింపరాని కటినోక్తుల నుచ్చరించి, రామమూర్తి గారినధిక్షేపించెను. ఆయన దుర్భాషలు సభవారికందరకు మహాగ్రహకారణములయ్యెను. వెంటనే సభాసదులు, "ఛీ, ఛీ, ఛీ,"యని కేకలు వేసిరి. గొడవపుట్టెను. సభలోగూర్చున్న వారందరు దిగ్గునలేచిరి. కొట్టుకొందురేమోయని భయముకలిగెను. స్వాములవారాశాస్త్రిని మందలింపలేక,

సభాజనులు తమమీదబడి తన్నుకొట్టుదురేమోయని భయపడి కుర్చీమీద నుండిలేచి పాదుకలుదొడుగుకొని యాలయముయొక్క దొడ్డిగుమ్మము దారిని గోదావరియొడ్డునకు గబగబ నడచిపోయి, శంకరమఠముచేరిరి. వారి పీఠ శిష్యులు కొంతమంది వెంటనుండిరి. మొదట వారెక్కివచ్చిన యేనుగు దేవాలయముయొక్క సింహద్వారముకడనే వీధిలోనుండెను. స్వాముల వారు వెళ్ళగానే సభాసదులు చెల్లాచెదరై, నానాముఖములబోయిరి. స్వాములవారు మఠముచేరి, మహాకుపితులై గొంతెత్తి రాజమహేంద్ర పురమును, పురవాసులను శపించుచు, దన్నుకొట్టుటకే యాసభకు దన్ను రప్పించిరని యనుమానపడి దూషింపనారంభించిరి. అదివట్టిదురభిప్రాయమే గాని, యందు సత్యమేమియులేదు. సభసమావేశము చేసినవారును, సభకు వచ్చిన గుండవరపు రామమూర్తిగారు మొదలైనవారును, విదేశప్రయాణము చేసినవారిని వెలిలేకుండ సంఘములో చేర్చుకొమ్మని స్వాములవారిని వేడుకొనుటకే నిర్మల ధర్మబుద్ధితో సభకువచ్చిరి, గాని స్వాములవారిని పరాభవించుటకుగాని, కొట్టుటకుగాని, రాలేదని నేను స్పష్టముగచెప్పగలను. ఏలయన, నేనాసభలో గుండవరపు రామమూర్తిగారి ప్రక్కనేయుంటిని. పూర్వపీఠస్థులు వీరేశలింగముగారు వితంతువివాహములుచేసినప్పుడు రాజమహేంద్రవర కళాశాలావిద్యార్థులు తమశిష్యులను కొట్టినందున హుటాత్తుగ పట్టణమునుండి రాత్రివేళ వెడలిపోయిరి. అట్లే యిప్పుడుగూడ యీ స్వాములవారు భయపడి కోపోద్దీపితులైరి. కాని వారు భయపడుటకెంత మాత్రము కారణములేదు. శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారు తమ "ఆంధ్రకేసరి"లో నీవిషయమై వ్యాఖ్యానముచేయుచు, నేనుగుతలక్రిందుగా బడిపోయినట్లు బొమ్మవేయించిరి. దీనివలన స్వాములవారు గజారోహణముమాని పాదచారులై వెళ్ళిరని చెప్పుటకే!

టంగుటూరి ప్రకాశముగారు గత సంవత్సరముననే, యనగా 1905 వ సంవత్సరమునందే, రెండవసారి సీమకువెళ్ళిరి. 1906వ సంవత్సర ప్రారంభమున దేశరాజు పెదబాపయ్యగారు తమ యంతఃకరణ శుద్ధిగా నడచుకొనదలచి, బ్రాహ్మణమతము విడిచి యజ్ఞోపవీతము దీసివైచి యనుష్ఠానిక బ్రహ్మమతస్థులైరి. కందుకూరి వీరేశలింగము పంతులుగారు మొదటినుండియు మనసులో బ్రహ్మమతావలంబులేగాని, యజ్ఞోపవీతము దీసివేయలేదు. బాపయ్యగారా పనిచేసినతోడనే వీరేశలింగముగారు గూడ యజ్ఞోపవీతమును పరిత్యజించి, యనుష్ఠానిక బ్రహ్మమతస్థులైరి. ఈ పని

జరిగినతోడనే నగరములో గొప్ప సంక్షోభము బయలుదేరెను, విద్యార్థు లందరు వీరేశలింగముగారివలెనే జందెములు త్రెంచివైచి బ్రహ్మమతస్థు లగుదురని ప్రజలకు భయము గలిగెను. వీరేశలింగముగారి మార్గము ననుసరింపగూడదని చెప్పుటకై పురమందిరములో నొక పౌరమహాసభ జరిగెను. ఆ సభకు మహారాజశ్రీ గంటి లక్ష్మన్నగా రధ్యక్షులైరి. అడివి కొలను కనకరాజుగారు లేచి, సభలో వీరేశలింగముగారు తమ కరువది సంవత్సరములు వచ్చినతరువాత వృద్ధులై యజ్ఞోపవీతము పరిత్యజించిరి గనుక విద్యార్థులు చిన్నతనమునందా పని చేయగూడదనియు. చిరకాలాను భవము గలిగినమీద నవసరమైన పక్షమున నట్టుచేయవచ్చుననియు, గంభీ రముగా నుపన్యసించిరి, సభాధ్యక్షులు గూడ వీరేశలింగముగారి మత మును ఖండించిరి. అ త్తిలి సూర్యనారాయణగారును నేనును వీరేశలింగము గారు చేసిన కార్యమును సమర్థించుచు నుపన్యసించితిమి. సభ వరుసగా మూడుదినములు జరిగెను. ఆ పక్షమున గొందరు, నీ పక్షమున గొందరు మాటాడిరేగాని పర్యవసానము దేలలేదు. దేశరాజు పెదబాపయ్యగారు వయసున చిన్నవారయ్యు సంస్కరణ విషయమున వృద్ధుడై మహావీరు డయ్యెను. కళాశాలలో దన యుద్యోగమునకు భంగము వచ్చినను, నార్బుతనాటు కంపెనీలో దన సొమ్ము పోయినను, తన మామగారైన దావులూరి యుమామహేశ్వరరావుగారితోను, గొప్ప యుద్యోగస్థులైన తన పినతండ్రులతోను, వియోగము సంభవించినను, వంట కెవడు దొరకక పోయినను, తానే స్వయముగా వంటచేసి తండ్రిగారి శ్రాద్ధమును బ్రహ్మ మత ప్రకారము జరిపిరి.

ఆ సంవత్సరమున నా మేనమామగారు తణుకులో నూతనముగా స్థాపింపబడిన యున్నతపాఠశాలలో నాంధ్రోపాధ్యాయులై పనిచేయు చుండిరి. మాతల్లితనసోదరుడైన మల్లయశాస్త్రిగారిని జూచుటకు తణుకువెళ్ళి యచట జబ్బుపడెను. బ్రతుకుమీద యాస యామెకు బోయినందున, జ్యేష్ఠ కుమారుడనైన నాకడకే తన్నుబంపుమని తన సోదరునిగోరెను. మల్లయ శాస్త్రిగారు నాకడ కామెను బంపిరి. రాజమహేంద్రవరము తాలూకాబోర్డు వారు మా మేనమామగారికి నెలవీయనందున శాస్త్రిగా రమలాపురము వెళ్ళవలసివచ్చెను, అందుచేత, మాతల్లిని విడుచుట కిష్టములేకపోయినను విధిలేక 1906 వ సంవత్సరము జూనునెలలో నామెను నాకడకుబంపి శాస్త్రిగా రమలాపురము వెళ్ళిరి. మాతమ్ముడు కృష్ణమూర్తి మాతల్లిని

నాకడకు దోడ్కొనివచ్చెను. అప్పుడు నాకు మిక్కిలి జబ్బుగానుండెను. నాకు కదలుట కోపికలేక మాతల్లిని సురక్షితముగా దోడ్కొనిరమ్మని నా మిత్రులైన తాతయ్యనాయుని కందర్ప తిమ్మరాజును బయనముచేసి విజయేశ్వరము బంపితిని. మాతమ్ముడును, వారిరువురును, మాయమ్మను పడవమీద నాకడకు తోడ్కొనివచ్చిరి. నేను గుగ్గిలము సుబ్బారావుగారి చేతను, దామెర్ల వెంకటరమణారావుగారిచేతను, దగుచికిత్స చేయించితిని. గాని యది ప్రయోజనకారి గాలేదు, అంతకంత కామెకు రోగమధికమై యన్నద్వేషము గలిగెను. గ్రామ పురోహితుడైన యొక వైదిక శిఖామణి నాకడకువచ్చి ప్రకాశముగారి పంక్తిని నేను భోజనము చేసినందున నేను కర్మచేయుట కర్హుడనుగానని చెప్పి నన్ను ప్రాయశ్చిత్తము చేయించుకొమ్మని గోరిరి. నేనందుల కొప్పుకొనక, వారికోరిక నిరాకరించి బంపివేసితిని. ఎట్టకేలకు మాతల్లి పరాభవ సంవత్సరమందు నాషాడశుద్ధమున నేకాదశీ దినమున పగలు పదిగంటలకు మృతినొందెను. అదియేమి చిత్రమోగాని, మా పితామహుడును, మా తండ్రిగారును, మా రెండవ చెల్లెలైన యచ్చమ్మయు, నా మేనమామ మల్లయ్యశాస్త్రిగారును, మాతల్లి వలె యేకాదశినాడే పరమపదించిరి. అందువలన మావాండ్రందరు పుణ్యాత్ములనియు, నితర తిథులలోబోయిన వారందరు పాపాత్ములనియు, చెప్పుట నాయభిప్రాయముగాదు. నాకట్టి పిచ్చినమ్మకములేదు. ఏతిథినిబోయినను పోయినవారి సుకృతమునుబట్టి వారికి సద్గతికలుగునని నా నమ్మకము. మాయింట శునకమొకటిగూడ నేకాదశినాడేపోయెను. అదియొక యదృచ్ఛ (Accident) గాని సుకృతవిశేషముగాదు. నా మాతృమరణము నాకమిత సంతాపము కలిగించెను. ఆమె మంచియిల్లాలని వీరవాసరములో మిక్కిలి పేరుబడెను. చిన్ననాట నామె భర్తగారిచేతను, తన యత్తగారిచేతను, మిక్కిలి శ్రమపడెను. నేను నరసాపురములో జదువుకొనునప్పుడు నానిమిత్తముగూడ మిక్కిలి శ్రమపడెను. ఆమె ఋణమెన్నడును నేను దీర్చుకొనజాలను. పునర్జన్మమున్నపక్షమున నేను మరల నామె గర్భమునందే జన్మింపవలెనని నాకోరిక. అటువంటి యుత్తమమాత కడుపున బుట్టుట దుర్లభము. ఆమె ఖండవల్లిలో జన్మమొంది, వీరవాసరములో గాపురము చేసి, రాజమహేంద్రవరములో గాలధర్మమొందెను. అప్పుడు నేను జబ్బుగానుండుటచే నామెకు యథావిధిగా నంత్యక్రియలు చేయజాలనైతిని, మాతమ్ముడు కృష్ణమూర్తియే దాదాపుగా కర్మనంతను జేసెను. నేను

ప్రకాశముగారితో భోజనముచేసితినను సందేహములేక, బ్రహ్మశ్రీ వాజి పేయయాజుల రామయ్యగారను శ్రోత్రియ బ్రాహ్మణుడు మాది ఋగ్వేద మగుటచే నాశ్వలాయన సూత్రప్రకారము కర్మ యథావిధిగా జేయించెను. పండ్రెండవదినమున మాయింట జరిగిన సంతర్పణములో నేసందేహ మునులేక నూరుమంది బ్రాహ్మణులు భోజనములుచేసిరి.

మా తల్లి పోయిన పదమూడవ దినమున నేను మా దొడ్డిలో తల యంటుకొనుచుండగా కందుకూరు వీరేశలింగముగారు, కుందూరు వేంకట రత్నముగారు, రామాప్రగడ వేంకటరామయ్యగారు ముగ్గురును గలసి మా యింటికివచ్చి తమరాక నాకు దెలుపుమని మా యింటిలోని మనుష్యుని చేత లోపలకు వర్తమానమంపిరి. శరీరమునిండ రాసుకున్న నూనెతో సగము నలుచుకున్న పిండితో వారి దర్శనము చేయుటకు వీధి సావడిలోకి వచ్చి, పంతులుగారికి నమస్కరించి, యేలవచ్చితిరని యడిగి వారి సన్నిధిని గూరుచుంటిని అప్పుడు పంతులుగా రిట్లనిరి. "నేను "వితంతు శరణాలయము"ను "నిమ్నజాతుల బాలబాలికా శరణాలయము"ను, "పతిత స్త్రీ శరణాలయము"ను స్థాపించదలచుకున్నాను ఈ మూడు సంస్థలలోను పనిచేయు యువకులు నాకు కావలెను. వారికి వేరేవేరే జీతము లిచ్చుట కష్టము. అందుచే నే నొక యాస్థిక పాఠశాల స్థాపించి దానిలో పని చేయు నుపాధ్యాయులచేత నీ ధర్మసంస్థలలో పనిచేయింపవలెనని నా తలంపు. కాబట్టి మీ హిందూలోవరు నెకండరీ పాఠశాల నాకిచ్చిన పక్ష మున దాని నున్నత పాఠశాలగాజేసి యందలి యుపాధ్యాయులచేత నీధర్మ సంస్థలు నడపించెదను. మీ కీ పాఠశాలవలన కొంతలాభము వచ్చుచున్న పక్షమున మీకు నెల కేదో కొంత విరాళమెచ్చెదను" ఆ పలుకులు వినగానే క్షణకాలమైన నేనాలోచింపక వెంటనే యిట్లు ప్రత్యుత్తరమిచ్చితిని.

"అయ్యా! ఈ పాఠశాలవలన నాకు లాభమువచ్చుటలేదు. పాఠ శాలలోనున్న సమస్త పరికరములతోడను మీకు నేను పరమసంతోష ముతో నా పాఠశాల నిచ్చెదను. నెలనెలకుగాని, పరికరములకుగాని, మీరు నాకేమియు ధనమీయనక్కరలేదు." నామాటలు విని వీరేశలింగము పంతులుగారు మిక్కిలి సంతోషించి వెడలిపోయిరి. కాని వారు వెంటనే పాఠశాలను స్వాధీనము చేసుకొనలేదు. ఏలయన, వీరేశలింగముపంతులు గారా సంవత్సరమొక గొడవలోబడిరి. డి. శ్యామారావను నొక మాధ్వ యువకుడు మా నాటకసమాజములో సామాజికుడుగా నుండెను. అతడు

హనుమంతరావుగారి దయవలన మునిసిపలు పాఠశాలలో నొక చిన్న యుపాధ్యాయపదవి సంపాదించెను. తరువాత నతడా పనిమాని "హిందూ సమాజాభివర్ధని" యను తెనుగుపత్రిక నొకటి నెలకొల్పి నడుపజొచ్చెను. న్యాపతి సుబ్బరావు పంతులుగారు స్థాపించిన "హిందూ సమాజము"తో దీనికెట్టి సంబంధములేదు. శ్యామారావుగారు తమ పత్రికలో నీక్రింది విధముగా వ్రాసిరి. "ఒక పట్టణములో నొక పుణ్యజనుడు వితంతువులకు విద్యాబుద్ధులు చెప్పి వారిని బాగుచేయుటకై వితంతుశరణాలయము స్థాపించి కొందరు వితంతుపులను చేర్చి పోషించుచుండెను. నొక యరవవాడు స్త్రీవేషము వేసుకొని యా శరణాలయములో ప్రవేశించి వితంతుపులను పాడుచేయుచుండెను." ఇది శ్యామారావుగారి వ్రాతయొక్క-సారముగాని యచ్చముగా నీమాటలేగావు. ఇది పూర్వాచార పరాయణుల ప్రేరణముచేతనో, తెలివితక్కువచేతనో శ్యామారావుగారు వీరేశలింగము గారిని వారి శరణాలయమును నుద్దేశించి శరణాలయమున కప్రతిష్ఠ తెచ్చు టకు వ్రాసిన వ్రాతయని స్పష్టమగుచున్నది పుణ్యజనుడనుమాటమీద శ్లేషగలదు. పుణ్యజనుడనగా రాక్షసు డొకయర్థము సత్పురుషుడొక యర్థము. శ్యామారావుగారు వీరేశలింగముగారి విషయమై రాక్షసార్థము ప్రయోగించిరిగాని, మంచియర్థముకాదు. నే నెరిగినంతవరకు "వితంతు శరణాలయము"లో నెన్నడు సరవవాడు స్త్రీవేషముతో ప్రవేశింపలేదు. అది పట్టి యబద్ధకల్పనము. శ్యామారావుగారియొక్కయు, వారి సహకా రులయొక్కయు, నూహా ప్రపంచములోనే యట్టికార్యము జరిగియుండునుగాని ప్రపంచములో నెక్కడను జరిగియుండదు. అది దురుద్దేశముతో వ్రాయబడిన వ్రాత. అది చదివి కోపించి వీరేశలింగము పంతులుగారు మాపట్టణములో జాయింటు మేజస్ట్రీటుగానున్న బ్రేడుపుడ్డు దొరగారియొద్ద శ్యామారావుగారిమీద నొక యభియోగము (క్రిమినల్ ఛార్జి)ను దెచ్చిరి. అది విచారణకువచ్చెను. విచారణ కొన్నిమాసములుపట్టెను. వీరేశలింగము గారి పక్షమున ధారవాడ కృష్ణారావుగారును, టంగుటూరి శ్రీరాములు గారును కనుపర్తి శ్రీరాములుగారును, న్యాయవాదులుగా పనిచేసిరి. శ్యామా రావుగారి పక్షమున సారంగు భీమశంకరరావుగారును తంజావూరు రఘు

నాధరావుగారును న్యాయవాదులుగా పనిచేసిరి. వీరేశలింగముగారి పక్షమున చిత్రపు వేంకటాచలము పంతులుగారును సత్యవోలు లక్ష్మీపతిగారు మొదలగు ప్రముఖులు సాక్ష్యమిచ్చిరి. వాయిదా జరిగిన ప్రతిదినమున నేను పనికట్టుకొని దొరగారి కచేరీకిబోయి న్యాయవాదుల ప్రక్కను కూర్చుండి. వారు మరచిన సంగతులను జ్ఞాపకముచేయుచు నాకుతోచిన సలహాలను చెప్పుచుంటిని. మేజస్ట్రీటుగారు వీరేశలింగముగారి యొక్కయు, వారి పక్షమున వచ్చినవారియొక్కయు, సాక్ష్యమునమ్మి శ్యామారావుగారికి పదునెనిమిది మాసములు కారాగృహవాసశిక్ష మూడువందల రూపాయలు జరిమానాయు విధించిరి. వీరేశలింగముగారా కఠినశిక్షవిని విస్మయమును, విచారమును పొందిరి. ఏదో స్వల్పముగ జరిమానా విధింపబడునని వీరేశలింగముగారు తలంచిరిగాని, యింత కఠినముగ శిక్ష విధింపబడునని వారు తలంపలేదు. కనుక వారు మిక్కిలి జాలిపడిరి. శ్యామారావుగారప్పీలుచేసిరి. మండల న్యాయాధిపతియైన పార్థసారథి అయ్యంగారు కొంత కారాగృహవాసశిక్షను, కొంత జరిమానాను తగ్గించి శేషించినది ఖాయపరచిరి.

వీరేశలింగముగారు సంపూర్ణమైన బ్రహ్మసమాజ మతస్థులగుటచే. వారటమీద హిందూ ధర్మశాస్త్రప్రకారము వితంతువివాహములు చేయరని యంతకుమున్ను వితంతు వివాహములు చేసికొన్న వారభిప్రాయపడి వీరేశలింగము పంతులుగా రదివరకుచేసిన స్త్రీ పునర్వివాహము లుగ్గడించుటకు పంతులుగారికొక పీడోత్సవము నొసంగి గౌరవింపదలచి యిన్నీసుపేటలో నొక సభచేసిరి. ఆసభకు నన్నే, యా వితంతు వివాహములు చేసికొన్న వారధ్యక్షులుగా గోరిరి. నే నధ్యక్షుడనై వీరేశలింగము పంతులుగారును, రాజ్యలక్ష్మమ్మగారును వితంతువివాహ సంస్కరణవిషయమై యెన్నెన్ని శ్రమలుపడిరో, యెట్టి ఘనకార్యములుచేసిరో యవియెల్ల నుగ్గడించి వారి కంఠములో ప్రాణముండగ స్త్రీ పునర్వివాహ సంస్కరణమును వదలిపెట్టరని చెప్పితిని.

స్వీయ చరిత్రము

పదునాల్గవ ప్రకరణము

హితకారిణీ సమాజ స్థాపనము

1906 వ సంవత్సరముననే హితకారిణీ సమాజమును స్థాపించి యా సమాజపక్షమున నా దగ్గర పుచ్చుకొన్న పాఠశాల నున్నత పాఠశాలగాజేయదలచి, యా విషయమై డై రెక్టరుగారితో నుత్తరప్రత్యుత్తరములు జరుపుమని నన్నును సత్యవోలు లక్ష్మీపతిగారిని పాఠశాలోప సంఘమునకు కార్యసచివులుగ పంతులుగారు నియమించిరి. మేమిరువురమును మరుచటిసంవత్సరము నాలుగవఫారము పెట్టుట కనుజ్ఞ నిమ్మని, డై రెక్టరు గారికి వ్రాసితిమి. అప్పుడు బోధనాభ్యసన కళాశాలకు మల్లాది వేంకట రత్నముగారు వై సుప్రిన్సిపాలుగ నుండిరి మా పాఠశాలా విషయమై హంటరు దొరగారికేమియు నాక్షేపణ లేకుండ జేసికొనుటకై యొక నాటి సాయంకాలము వీరేశలింగముగారును, లక్ష్మీపతిగారును, నేనును హంటరు గారి యింటికి బోతిమి. మల్లాది వేంకటరత్నముగారు గూడ నప్పుడచ్చట నుండిరి. మా పాఠశాల నున్నతపాఠశాల జేసినచో, తమ కళాశాలలోని యున్నతపాఠశాలకు నష్టముకలుగునని వేంకటరత్నముగారు బహువిధములై న యాక్షేపణములు జెప్పిరి. అవి యన్నియు హంటరుగారి చెవికెక్కినవి. మా పాఠశాలా స్థాపనము దొరగారికి గూడ నిష్టములేదని వారి సంభాషణముల బట్టియే మేము గ్రహించి, రాత్రి తొమ్మిది గంటలకు దొరగారివద్ద నెలవుదీసికొని యింటికి బోయితిమి. దొరగారు మా పాఠశాలను గురించి డై రెక్టరుగారికి వ్యతిరేకముగానే వ్రాసియుందురు. అందుచేత మరుచటి సంవత్సరము నాలుగవ ఫారము పెట్టుటకు డై రెక్టరుగారంగీకరింపలేదు. ఈ విధముగ నెట్టెటో 1906 వ సంవత్సరము గడచెను.

1907వ సంవత్సర ప్రారంభమున నొకనాడు శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు వీరేశలింగముగారి యొద్దకుబోయి "వితంతు వివాహములు శాస్త్రీయములా ? అశాస్త్రీయములా ? చేయదగినవా ? చేయగూడనివా ?

యనువిషయమును గురించి చర్చచేయవలసియున్నది; అట్టి సభకు మీ రధ్యక్షులుగా నుండవలసిన" దని గోరిరి. అప్పుడు వీరేశలింగముగారు "పాతికసంవత్సరములనుండి వితంతు వివాహములు జరుగుచున్నవి;అనేకములైనవి. ఇప్పుడాచర్చ యనవసరము. నేనాసభకధ్యక్షుడుగ నుండను. కావలసిన పక్షమున చిలకమర్తి లక్ష్మీనరసింహముగారి నధ్యక్షులుగ కోరుకొను" డని చెప్పి, శాస్త్రిగారిని బంపిరట: ఇట్లు తమకు శాస్త్రిగారికి సంభాషణ జరిగినదని, వీరేశలింగముగారు నాతోచెప్పిరి. పిమ్మట కృష్ణమూర్తి శాస్త్రిగారు సభ నేర్పాటుచేసి, యా సభకు నన్నధ్యక్షులుగ నేర్పాటుచేసి, వితంతువివాహోద్యమము ఖండించుటకు బ్రహ్మశ్రీ కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రిగారినిబిలిపించిరి. సభ హిందూసమాజమందిరమున జరిగెను. హిందూసమాజమనగా నిప్పటి భవనము గాదు. న్యాపతి సుబ్బారావు పంతులుగారి ఇంటికిచేరి యుత్తరభాగమున నొక గొప్ప సావడి గలదు. హిందూసమాజము, మునుపందులో నుండెడిది. అందుచేదానిని హిందూసమాజమందిరమంటిని. ఒకనాటి సాయంకాలమున సభ ప్రారంభమయ్యెను. ప్రేక్షకులతో భవనమంతయు నిండెను. కళాశాలా విద్యార్థులు, మా నాటక సామాజికులు, చాలమంది పౌరులు, సభకు విజయము చేసిరి. సత్యవోలు గున్నేశ్వరరావుగారు, సత్యవోలు లక్ష్మీపతిగారు, చెరుకుమిల్లి వేంకటరామయ్యగారు నా చుట్టును గూర్చుండిరి. బ్రహ్మయ్య శాస్త్రిగారికిని నాకును సమావేశము గలుగుట మా పురజనులు మిక్కిలి యాశ్చర్యముగ భావించిరి. ఏలయన వారు పూర్వాచార పరాయణులలో నగ్రగణ్యులు. నేను సంఘసంస్కరణ ప్రియుడను. బ్రహ్మయ్యశాస్త్రిగారు ముందుగ వితంతు వివాహములు చేయగూడనివని యుక్తులచేత సాధింతునని, యుపన్యాస మారంభించిరి. శాస్త్రవిషయమున మరియొకనాడు ప్రసంగింతుమని సెలవిచ్చిరి, ఆ సాయంకాల మంతయు యుక్తులతోడనే వితంతువివాహములను ఖండించిరి. రమారమీ యొక గంటసేపు వారు మాటాడిరి. నడుమ నడుమ సభాసదులు వారి కడ్డుతగులుచూ వచ్చిరి. వారుపన్యసించిన పిదప వారు చెప్పిన యుక్తులకు జవాబు చెప్పుమని సభాసదులు నన్నుగోరిరి. అంతట నేను లేచి బ్రహ్మయ్యశాస్త్రిగారి యుక్తులను నాయుక్తులచేత ఖండించితిని. మరుచటివారము వచ్చి శాస్త్రవిషయమై ప్రసంగింతుమనిచెప్పి, బ్రహ్మయ్య శాస్త్రిగారు వెడలిపోయిరి. తరువాత వారెన్నడువచ్చి యా విషయమై యుపన్యసింపలేదు.

ఇన్స్పెక్టరుపేటలో నొకపోస్టాఫీసుకలదుగదా! 1907వ సంవత్సరమున, దామోజీపురపు నారాయణరావుగారక్కడ పోస్టుమాస్టరుగానుండిరి. వారు జాతముచేత మాధ్వబ్రాహ్మణులు. కాని తరువాత, ననుష్ఠానిక బ్రాహ్మమతస్థులైరి. వారితల్లిగారియొక్కయో, తండ్రిగారియొక్కయో శ్రాద్ధమునాఁగా, నారాయణరావుగారు శ్రాద్ధము బ్రాహ్మమతము ప్రకారము చేసి, యాసందర్భమున మిత్రులకొక విందుచేసిరి. ఆవిందున సర్వమతములవారు పాల్గొనిరి. నేనును, వీరేశలింగముగారును, టంగుటూరి శ్రీరాములుగారును వెళ్ళి యావిందులో భుజించితిమి. అందు వైశ్యులు గొందరు, బ్రాహ్మణేతరులు గొందరు పాల్గొనిరి. నానామతములవారితో విందారగించుట నాకదియే మొదటిసారి. వంట బ్రాహ్మణుడేచేసెను. భోజనముచేసినవారి నామములు పత్రికలో పడెను. అదిపరకు, ప్రకాశముగారి పంక్తిని భోజనముచేసినంబులకే, మాపట్టణములోని పూర్వాచార పరాయణులు మామీద మిరియాలు కారాలు నూరుచుండిరి. ఈ విందుతో వారికి మామీద నమితాగ్రహమువచ్చినది. టంగుటూరి శ్రీరాములుగారు రాయవరపు రామమూర్తిగారి తోడియల్లుడగుటచే, రామమూర్తియింటనే గాపురముండిరి. ఇంతలో రామమూర్తిగారి మూడవమరదలి వివాహము వచ్చెను. ఆమెను పాలెపు శరభరాజుగారి కిచ్చుటకు నిశ్చయింపబడెను. నేను రాయవరపువారి కుటుంబములోనివాడనేయని లోకులుతలచుటచేతను, శ్రీరాములుగారు రామమూర్తిగారికి దగ్గరబంధువగుటచేతను, మేమిరువురము వివాహములో సంబంధము కలుగచేసుకొందుమని లోకులెరిగి, పురవాసులు రామమూర్తిగారిని కొన్ని చిక్కులుపెట్టిరి. వంటబ్రాహ్మణులు నాద్వారా బయానాపుచ్చుకొని మరల గనబడలేదు. వంటబ్రాహ్మణులు దొరకుటయే దుర్లభమయ్యెను ఎట్టకేలకు నేను, మా సత్యవోలు లక్ష్మీపతిగారి యల్లుడైన శ్రీరాజా వాడరేవు వెంకటకృష్ణారావుగారి దర్శనమునకు వెళ్ళి పెండ్లికి వంటబ్రాహ్మణులు కుమరలేదని చెప్పితిని. ఆయన వంగలపూడి జమీందారుగారు. వారు వాడ్రేపువారి సత్రమునుపేక నొకసత్రమును జరుపుచుండిరి. ఆ జమీందారుగారు లక్ష్మీపతిగారిద్వారా నాకును రామమూర్తికిని మిత్రులు ఈసంగతివిని జమీందారుగారు తమ సత్రములోని వంట బ్రాహ్మణుని తీసికొనివెళ్లుమని చెప్పిరి. సత్యవోలు గున్నేశ్వరరావుగారు గూడ తమ యింటనున్న వంటబ్రాహ్మణుని మాకెరువిచ్చిరి. మరియొక బ్రాహ్మణుడు కావలసివచ్చెను. అయ్యల సోమయాజు లప్పన్నయను

బ్రాహ్మణుడనేకసంవత్సరములనుండి రామమూర్తిగారియింట వంటబ్రాహ్మణుడుగనుండి యప్పటికి మానివేసి, దుర్భావారి సత్రములో పంటపు గుదిరెను. అప్పటికాసత్రములో శ్రీ శంకరాచార్య స్వాములవారు బసచేసియుండిరి. దుమ్ము వెలివేయదలచిన స్వాములవారు మండపేటవెళ్ళి యచట విభూచిజాడ్యముదగిలి యచటనే మృతినొందిరి. ఆపీఠమున వారి స్థానమున ద్వైవజ్ఞ చక్రవర్తులని బిరుదుపొందిన శ్రీ రాణీన్యసింహచయనులుగారధిష్ఠించిరి. వారు రాజమహేంద్రవరమువచ్చి దుర్భావారి సత్రమున బసచేసి, యాసత్రపు వంటబ్రాహ్మణుడైన యప్పన్నను రాయవరపువారింటికి వెళ్ళవద్దని యాజ్ఞాపించిరి. అప్పన్న రాయవరపువారియెడ మిక్కిలి కృతజ్ఞుడగుటచే స్వాములవారియాజ్ఞ నిరాకరించి, తనయుద్యోగము పోయినను సరేయని తెగించి, రాయవరపువారింటికివచ్చి, యైదుదినములు వంటకు సాహాయముజేసెను.

1907 వ సంవత్సరము ఫిబ్రవరినెలలో శ్రీ పిఠాపురము మహారాజావారికి పిఠాపురములో పట్టాభిషేకము జరిగెను. జిల్లాలలోని పెద్ద మనుష్యులను చాలమందిని బిలిచిరి వీరేశలింగముగారికిని, నాకును, "సత్యవాదినీ" పత్రికాధిపతులగుటచే రామప్రగడ వేంకటరామయ్యగారికిని నాహ్వానములు వచ్చెను. వీరేశలింగముగారును, రాజ్యలక్ష్మమ్మగారును, వేంకటరామయ్యగారును, నేనును, మా పారశాలలో సామకసరత్తుల యుపాధ్యాయుడైన మల్లభొట్ల వెంకయ్యనుదీసికొని పిఠాపురము వెళ్ళితిమి. అప్పుడు పిఠాపురములో మహమ్మదిబ్రహీముసాహెబుగారు దివానుగాను, బుద్ధవరపు కామరాజుగారనిస్టెంటు దివానుగాను, మొక్కపాటి సుబ్బారాయుడుగారు మహారాజావారి కాంతరంగిక కార్యదర్శి (Private Secretary) గాను నుండిరి. వీరేశలింగముగారికిని, నాకును ప్రత్యేకముగ నొకబసనిచ్చి యొక వంటబ్రాహ్మణుని ఏర్పరిచిరి. పట్టాభిషేకసందర్భమునకై చేయబడిన మిఠాయి మొదలైన పిండిపంటలు మాకు ప్రతిదినము పంపబడెను. దివానుగారు, అసిస్టెంటు దివానుగారు, ఆంతరంగిక కార్యదర్శిగారుగూడవచ్చి, మాక్షేమమరయుచుండిరి. కోటలో దర్బారుజరిగెను. దేవులపల్లి సోదరు లష్టావధానముజేసిరి. పట్టాభిషేకమహోత్సవము మిక్కిలి వైభవముగా జరిగెను. మూడుదినములు మేము పిఠాపురములో నుండి పిమ్మట రాజమహేంద్రవరము వెళ్ళితిమి. నామేనమామగారైన మల్లయశాస్త్రిగారు 1906 వ సంవత్సరము చివరభాగములోనే పిఠాపుర

ములో మహారాజావారిచేత స్థాపింపబడిన యున్నతపాఠశాలలో నాంధ్ర పండితులై యుండిరి. నేనక్కడనున్నదినములలో వారిదర్శనముచేసితిని.

పిఠాపురమునుండి వచ్చినతరువాత వీరేశలింగముగారు తల్లిగారి యొక్కయు. తండ్రిగారి యొక్కయు, శ్రాద్ధములు బ్రహ్మసమాజ మత ప్రకారము జేసిరి. అంతకుముందే వీరేశలింగముగారు చల్లపల్లి రంగయ్య గారి యొద్ద నొక పెద్ద తోటకొని, ప్రాతయూరిలోనున్న తమ యిల్లు విడిచి, యా తోటలో గాపురముండిరి. వితంతు శరణాలయమును, దానికి సంబంధించిన పాఠశాలను గూడ తోటలోనికి మార్చిరి. ఆ శ్రాద్ధ సందర్భ మున వీరేశలింగము గారొక విందుచేసిరి. ఆ విందున కన్నివర్ణముల వారిని వారు పిలిచిరి. నేను కూడ వెళ్ళి భుజించితిని.

ఆ సంవత్సరము మార్చి నెలలో శ్రీ రఘుపతి వెంకటరత్నము నాయుడుగారొక సంఘసంస్కరణ సభను, మతసంస్కరణ సభను, కాకినాడలో జరిపిరి. సంఘసంస్కరణ సభకు, సబుజడ్జిగనున్న వారణాసి సుబ్రహ్మణ్యముగా రధ్యక్షత వహించిరి. బంగాళాదేశమునుండి పండిత శివనాధశాస్త్రిగారువచ్చి, మతసంస్కరణసభ కధ్యక్షతవహించిరి. సంఘ సంస్కరణ సభలో ధారవాడ కృష్ణారావుగా రింగ్లీషులోను నేను తెనుగు లోను మాటాడితిమి. శివనాధశాస్త్రిగారు మిక్కిలి గంభీరమైన యుపన్యాస మిచ్చిరి. ఆయన మాటలు నా చెవిలో, నిప్పటికిని ఖంగుమని వినబడు చున్నట్లే యున్నవి. "బడిలో భూమి గుండ్రముగ నున్నదనియు, నింటి వద్ద భూమి నలుచదరముగ నున్నదనియు చెప్పిన సిద్ధాంతము పోవలెను. అది పనికిరాదు," వారింగ్లీషున చెప్పెడి మాటలివి. "Round at School and Flat at Home theory must go away" సభలలో సంఘసంస్కర్తలమనిచెప్పి, యింటియొద్ద పూర్వాచార పరాయణులై యుండుట తగదని దీని యభిప్రాయము. ఆ సభకు పిఠాపురము మహారాజావారు దయచేసిరి. వారి బంగాళాలో మొట్టమొదటిపర్యాయము వారిదర్శనము జేసితిని,

1905 వ సంవత్సరమున బంగాళాదేశము రెండుభాగములుగా విభ జింపబడెను. అందుచేత బంగాళీలు తమకు ఘోరమైన యన్యాయము జరిగినదని దుఃఖించి భూమ్యాకాశములు పగులునట్లు దేశమున గొప్ప సంక్షోభము కలిగించిరి. హిందూదేశములో నన్నిజాతులవారు నన్నిభాగ ములవారు బంగాళీలయెడ సానుభూతిగలిగి, తమతమ దేశములలో గొప్ప సభలుచేసి దొరతనమువారి చర్యనుఖండించిరి. ఈవిషయమున నాంధ్రులు

వెనుకబడియుండలేదు. రాజమహేంద్రవరములోగూడ గొన్ని సభలు జరిగెను. ఆసభలలో నేనుగూడ పలుమారు లుపన్యసించితిని. ఈగొడవ 1905, 1906 సంవత్సరములలో జరిగెను. ఈవిషయమును పురస్కరించుకొని పూర్వము బ్రహ్మమత ప్రచారకుడుగవచ్చిన బిపినచంద్రపాలు గారు చెన్నపురి రాజధానిలో రాజకీయోపన్యాసము లీయదలచి, కలకత్తానుండి బయలుదేరి బరంపురము, విశాఖపట్టణములమీదుగ రాజమహేంద్రవరమువచ్చిరి. వారువచ్చి మొట్టమొదట యిన్నీసుపేటలో నుపన్యసించిరి. అప్పటినుండియు యా భాగమునకు "పాలు చౌక"ని పేరువచ్చెను. బిపినచంద్రపాలుగారు దొరతనమువారు హిందూదేశమును పరిపాలించుచున్న పద్ధతులను ప్రబలముగా ఖండించుచు టపునుహాలుయొక్క యావరణములో నయిదుదినములు వరుసగా ప్రతిదినమును సాయంకాలమున నింగ్లీషులో గంభీరముగా నుపన్యసించిరి. శ్రీకృష్ణుని గానమువిని, మోడులు చిగురించినట్లు రాళ్లు స్రవించినట్లు బిపినచంద్రపాలుగారి యుపన్యాసములు విని జనులుద్రేకపూరితులైరి. కొన్నిసార్లు కంచుమర్తి రామచంద్రరావు గారును కొన్నిసార్లు టంగుటూరి శ్రీరాములుగారును పాలుగారి సభలలో నధ్యక్షత వహించిరి. పాలుగారి యుపన్యాసముల కింగ్లీషురాని జనులు వేనకువేలు వచ్చుటచే, పాలుగారి యుపన్యాససారమును తమకు తెనుగులో చెప్పుడని, సభాసదులు నన్నుగోరిరి. సభలు జనులతో క్రిక్కిరిసియుండెను. జనులకోరిక ననుసరించి నేను పాలుగారి యుపన్యాసములను వారు చెప్పునప్పుడే మనసులో ధారణముచేసికొని, వారి యుపన్యాసాంతమున నొకటియు మరువకుండ సభాసదులకు తెనుగులో విన్నవించెడివాడను. కట్టకడపటిదినమున సభలో కూర్చుండి నామనసులో యూహించుకొని యీక్రిందిపద్యమును బహిరంగముగ కట్టకడపట జదివితిని.

తే॥ గీ॥ భరతఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ,
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకుచున్నారు మూతులు బిగియగట్టి.

ఈపద్యమును విని సభాసదులు సంతోషపారవశ్యమున బ్రహ్మాండము పగులునట్లు చప్పట్లుగొట్టిరి. సభాంతమున ననేకులు నాకడకువచ్చి పద్యమును మరల మరల చదివించుకొని, విని, కంఠపాఠము చేసిరి. ఈపద్య మన్నిపత్రికలలోను పడెను. ఈపద్యమెట్లు ప్రాకివెళ్ళినదోగాని

క్రిష్ణానది వంతెన గోడలమీద పెన్సిళ్ళతో వ్రాయబడెను. దానిని చదివిన వారు స్వయముగ నాతోచెప్పిరి. ఇది యాంధ్రదేశమంతట వ్యాపించెను. నా గోదావరీమండల సభాపర్వములతోపాటు, నీ పద్యముగూడ హరికథ లలో కెక్కెను. మా నాటకసమాజపక్షమున శ్రీ పాలుగారిని గౌరవింప దలచి వేణీసంహార నాటకమాడించి, దానివలన వచ్చిన నూటయేబది రూపాయలు సొమ్ము దీసికొనివెళ్ళి నేను స్వయముగా పాలుగారికి సమర్పించితిని. ఆయన సంతోషపడి నాకు వందనము లర్పించిరి.

1907 వ సంవత్సరము వేసవికాలపు సెలవులలో మా రెండవ చెల్లెలు అచ్చమ్మ తన కూతులనిద్దరిని తోడ్కొని బెజవాడవెళ్ళి, వేసవి వెళ్ళినదాక తనయాడుపడుచుగారింటనుండెను. కారణమేమన మేము గాపురమున్నయిల్లు దనకచ్చివచ్చినదిగాదని యామెయభిప్రాయపడెను. ఎట్లన మేమాయింట ప్రవేశించిన సంవత్సరమేయనగా 1903 మేనెలలో యామెకడపటికూతురు చనిపోయెను. మరుచటిసంవత్సరమనగా 1904 లో నామెభర్త రామస్వామియే చనిపోయెను. ఆమరుచటిసంవత్సరమనగా 1905 వ సంవత్సరము జూనునెలలో నామెగారాబుకొడుకు మృతినొందెను. ఆమరుచటిసంవత్సరము 1906 జూలై మాసములో మాతల్లి చనిపోయెను. పైన చెప్పబడినవారిలో గొందరు మృతినొందినప్పుడు నక్షత్రము మంచిది గాకపోవుటచే నిల్లు రెండు మూడు మాసములు విడిచిపెట్టి వేరొకచోట గాపురముండుమని మా యిరుగుపొరుగువారు సలహాజెప్పిరి. ప్రకృతిలో నున్న నక్షత్రములన్నియు మంచివేయనియు, మంచినక్షత్రములు కొన్నియు, దుష్టనక్షత్రములుకొన్నియు లేవనియు, ప్రజలు దుష్టనక్షత్రములని జెప్పెడి నక్షత్రములలో చనిపోయినందున నేకీడులేదనియు, నిల్లు మొదలైనవి వదలివేయుట తెలివితక్కువయనియు నానమ్మకము. అందుచేత, నెవరు చెప్పినను నేనాయిల్లువదలలేదు. ఇది నామౌఢ్యమని నాకుటుంబములోని వారు దలంచిరి. కడచినసంవత్సరములందువలెనే యీసంవత్సరమందు గూడ తనకో, తనబిడ్డలకో నేకీడో మూడునని తనబిడ్డలను వెంటబెట్టు కొని నాచెల్లెలు అచ్చమ్మ బెజవాడవెళ్లెను. కాని నేను మరియొకకారణ మున 1907 వ సంవత్సరము వేసవికాలములో దుర్భవారియిల్లు వదలిపెట్ట వలసివచ్చెను. ఆయింటియజమానుడైన దుర్భ సూర్యనారాయణగారు స్వగృహమున నివసింపదలచి నన్ను వెళ్ళిపొమ్మని చెప్పుటచే, నేను రాయ వరపువారియింటనద్దెకు ప్రవేసించితిని. ఆయింటిలోనేనద్దెకు ప్రవేసించినను

స్వగృహమువంటిదే. ఇందువల్ల మాచెలియలు కోరికదీరెను. ఆమె వేసవికాలమువెళ్ళినతరువాత బిడ్డలను దోడ్కొని రాజమహేంద్రవరము వచ్చెను. వీరేశలింగముగారు తమపాఠశాలను తోటలోనికి మార్చినందున నేను నామేనగోడండ్రను మునుపటియట్ల దొరతనమువారి బాలికాపాఠశాలకే బంపజొచ్చితిని.

ఆ సంవత్సరమున (1907) చెన్నరాష్ట్ర రాజకీయసభ (Madras Provincial Political Conference) విశాఖపట్టణములో జరుపుటకు నిశ్చయింపబడెను. ఆసభకు శ్రీ న్యాపతిసుబ్బారావుపంతులుగా రధ్యక్షులైరి. ఆనరుబుల్ బయ్యా నరసింహేశ్వరశర్మగారు సన్మానసంఘాధ్యక్షులైరి. రాజమహేంద్రవరము నుండి యా సభకు గంటి లక్ష్మన్నగారు, ధారవాడ కృష్ణారావుగారు మొదలైన న్యాయవాదులును, చిత్రపు నరసింహారావుగారును, నేనును చురికొందరు పురజనులును వెళ్ళితిమి. మాకు కసింకోట జమీందారు గారిదైన శ్రీ కారుమంచివారి హవేలీలో బసయిచ్చిరి. శ్రీ చిర్రావూరి యజ్ఞేశ్వరచింతామణి గారా సభా కార్యనిర్వహణమునందు సుబ్బారావు పంతులు గారికి తోడుపడిరి. అప్పుడేనాకు శ్రీ చింతామణిగారితో పరిచయమయ్యెను. అధ్యక్షులైన సుబ్బారావు పంతులుగారి ప్రారంభోపన్యాసము తక్కాలాను సారముగ మిక్కిలి తీవ్రమై యుత్సాహజనకముగ నుండెను. ఆకాలమున జనులలో నతివాదులు మితవాదులను రెండు కక్షలుండెను. స్వరాజ్యము, స్వదేశవస్తువు, స్వజాతీయవిద్య కావలెనని వాదించువారు బాలగంగాధర తిలకుగారును వారి యనుచరులును నతివాదు లనబడిరి. దొరతనమువారి పక్షమందేయుండి జాతీయవిద్య, స్వదేశవస్తువు నక్కరలేదనువారు మిత వాదులనబడిరి. న్యాపతి సుబ్బారావు పంతులుగారు మొత్తముమీద మిత వాదులేయైనను వారి యుపన్యాస తీవ్రతనుబట్టి "మదరాసు మెయిలు" పత్రిక వారి నతివాదులలో జేర్చెను. ఆ సంవత్సరము (1907) మేనెల 9 వ తేదీని పంజాబు దొరతనమువారు దేశాభిమానియు, మహాపురుషుడు నైన లాలా లజపతిరాయిగారిని బట్టుకొని, నిష్కారణముగా బర్మాకు గొంపోయి, మాండలే నగరములో ఖయిదుజేసిరి. అందుచేత భరతఖండ మున నాసేతుహిమాచల పర్యంతము సంక్షోభరంగమొకటి వ్యాపించెను. విశాఖపట్టణసభలో మొట్టమొదటితీర్మానము లజపతిరాయిగారిని దొరతనము వారక్రమనుగా బంధించినందులకు దొరతనమువారి చర్యను ఖండించుటకై యేర్పడెను. ఆ తీర్మానమును గురించి కర్నూలునుండి వచ్చిన సి. శీని

వాసరావుగారింగ్లీషులోను, నేను దెలుగులోను మాట్లాడితిమి. నా సంభాషణమును విని శ్రీనివాసరావుగారు నా చేయిపట్టుకొని, యాత్మోద్రేకకరమైన మీ యుపన్యాసమువిని నేను సంతసించితిని. అని నాంగ్లభాషలో పలికి నన్ను హెచ్చరించిరి. వారన్నమాటలివి. "I heard your soul Stirring Speach with pleasure" తరువాత పురాణం వెంకటప్పయ్యగారు గూడ నన్ను జూచి, నా యుపన్యాసము మిక్కిలి బాగున్నదని పరామర్శజేసిరి. లజపతిరాయిగారి ప్రవాసమును గురించి నే నీ క్రింది పద్యమును రాజమహేంద్రవరములో నుండగనే రచియించితిని.

మ॥ చెరశాలల్ పృథుచంద్రశాలలెయగున్ చేదోయి గీలించు న
య్యరదండల్ విరిదండలయ్యెడును హేయంబైన చోడంబలే
పరమాన్నంబగు మోట కంబళులుదాల్పన్ పట్టుపెల్లాలగున్
స్థిరుడై యే నరుడాత్మ దేశమును భక్తింగొల్చునవ్వానికిన్.

తే॥ గీ॥ భరతఖండంబె యొక గొప్ప బందెఖాన
అందులోనున్న ఖయిదీలు హిందుజనులు
ఒక్కగదినుండి మార్చి వేరొక్కగదిని
బెట్టుటేగాక చెరయంచు వేరెగలదె.

ఈ చెన్నరాష్ట్ర మహాసభ విశాఖపట్టణమందు మిక్కిలి వైభవముగాను జయప్రదముగాను జరిగెను. అది నరసింహేశ్వర శర్మగారి నిరంతరాయ కృషివల్లనే యట్లు జరిగెను. సభాంతమున సుబ్బారావు పంతులుగారు సమాప్తి వాక్యములుచెప్పుచు శ్రీ చింతామణిగారు రాత్రి పగలు నిద్రలేక సభకు సేవజేసి తమకు సహాయము జేసినందులకు మిక్కిలి యుగ్గడించిరి నాలుగవ దినమున సంఘ సంస్కరణసభ యయ్యెను. ఆ సభయొక్క సన్మానసంఘమునకు విశాఖపట్టణ కళాశాలా ప్రధానాచార్యులైన పి. టి. శ్రీనివాసయ్యంగా రధ్యక్షులైరి. అక్కడ సబుజడ్జిగనున్న వారణాసి సుబ్రహ్మణ్యం పంతులుగారు సంఘ సంస్కరణ మహాసభాధ్యక్షులైరి. పి. టి. శ్రీనివాసయ్యంగారు విద్యావంతులేగాని వారికా దినములలో సుప్రతిష్ఠలేదు. అట్టి పురుషుడు సంఘసంస్కరణ సన్మానసంఘాధ్యక్షుడగుట నా కిష్టములేదు. ఆకారణమున నేనా సభకుబోనని పట్టుపట్టి కూర్చుంటిని. చిత్రపు వేంకట నరసింహారావుగారును, ధారవాడ వెంకట కృష్ణారావుగారును నామార్గమునే యనుసరించి సభకు బోరైరి నరసింహే

శ్వరశర్మగారు మమ్ము సభకురమ్మని వర్తమానము లంపిరి. కాని మేము మ్రాపట్టు విడువలేదు. ఆసభకు హాజరుకాకయే మేము మువ్వరము మెయిలుబండిమీద నచటనుండి రాజమహేంద్రవరము వచ్చితిమి.

ఆకాలమున యేట్నుదొరగా రుత్తరమండలములకు పాఠశాలా పరీక్షాధికారులుగా నుండిరి. నేను రాజకీయసభలలో దరుచుగా మాట్లాడు చుండుటచే దొరగారా వార్తవిని తన చేతిక్రింద బనిచేయుచున్న డెప్యూటి యినస్పెక్టరుగారితో నిట్లనియెనట. "లక్ష్మీనరసింహముగారి బడికి మన మీ సంవత్సరము బరీక్షకు పోనక్కరలేదు ఆయన యతివాది యగుటచే దన పాఠశాలను మనము బరీక్షించుట కొప్పుకొనడు." ఈమాటలు డిప్యూటి యినస్పెక్టరుగారు నాతో చెప్పిరి నేనట్లు చేయువాడనుకానని వారితోచెప్పి పిమ్మట నేను యేట్ను దొరగారిని జూడబోతిని. ఆయన నన్ను సగౌరవ ముగా నాదరించిరి, పరీక్షనిమిత్తము మా పాఠశాల కెప్పుడువత్తురని దొరగారిని నేనడిగితిని ఆయన నాయందేమియు దోషారోపణచేయక కొలది దినములలో వత్తుననిచెప్పి బంపిరి పిమ్మట కొన్నాళ్ళకు వారు మా పాఠశాలకు దయచేసి యెప్పటియట్ల బరీక్షించిరి. మా పాఠశాల దమ కిమ్మని వీరేశలింగముగారు సంవత్సరముక్రిందట నన్నడిగిరి, గాని, యంతవరకు మాబడి వారు స్వాధీనము చేసికొనలేదు. మునుపటియట్ల నేనే నడుపుచు జీతములు మొదలైనవి నేనే యిచ్చుకొనుచుంటిని. 1907వ సంవత్సరము జూను మాసాంతమునకు నుపాధ్యాయుల జీతములు నేనీయ వలసియుంటిని. నాయొద్ద డబ్బులేదు. వీరేశలింగముగారు బడిని స్వాధీ నము జేసుకొనలేదు, గనుక, పాఠశాలను దీసివేయవలసినదని కొందరు మిత్రులు నాకు సలహాజెప్పిరి. ఆసలహా నాకు రుచింపకపోపుటచే నేను నూరురూపాయలు బదులుతెచ్చి యుపాధ్యాయుల జీతములిచ్చి యెప్పటి యట్ల పాఠశాల నడుపుచుంటిని. అప్పుడు శ్రీ హితకారిణీ సమాజ కార్యదర్శిగా శ్రీ కారుమూరి వీరభద్రస్వామిగారుండిరి. ఈయన వైశ్యుడు పట్టపరీక్షసిద్ధుడు. మా మునిసిపాలిటీకి సెక్రటరీగాగూడ నుండెను. 1907వ సంవత్సరము సెప్టెంబరు 16వ తేదీని వీరభద్రస్వామిగారు మా పాఠశాలకు వచ్చి వీరేశలింగముగారు హితకారిణీ సమాజపక్షమున మా పాఠశాలను తమ కప్పగించవలసినట్లు చెప్పిరని నాతో చెప్పిరి. వీరభద్రస్వామిగారికి వప్పగించవలసినదని వీరేశలింగముగారు నాకొక జాబుగూడ వ్రాసిరి. ఆజాబు ననుసరించి నేను మా పాఠశాలను వీరభద్రస్వామిగారి కప్పగించి

వారివల్ల రసీదు పుచ్చుకొంటిని. అప్పటినుండి యుపాధ్యాయుల జీతములు మొదలైనవి వీరేశలింగముగారే యిచ్చి పాఠశాలను నడుపుచుండిరి. లక్ష్మీపతిగారా సంవత్సరమే మాబడిలో పనిచేయుట మానిరి. నాకు వారికి గల మైత్రిచేత నాబడిలో జీతములేకుండ బనిచేసిరి గాని, మరియొకరి యొద్ద పనిచేయుట వారి కిష్టములేదు. అప్పటికి కుందూరు వెంకటరత్నము గారు ప్రధానోపాధ్యాయులుగా నుండుటకు దగినయర్హత సంపాదించి నందున వారే ప్రధానోపాధ్యాయులుగా నుండిరి. ముందు సంవత్సరము నాలుగవఫారముబెట్టి యున్నత పాఠశాలకు సెలవిమ్మని హితకారిణీ సమాజమువారు డైరెక్టరుగారికి వ్రాసిరి. సర్కారువారు సెలవిచ్చినందున, 1908 వ సంవత్సరము జనవరినెలలో నాలుగవఫారముబెట్టి యున్నత పాఠశాలజేసిరి. ఆ యున్నతపాఠశాలకు జయంతి గంగన్నగారు మొట్ట మొదటి ప్రధానోపాధ్యాయులైరి.

ఇక్కడ మానాటకసమాజచరిత్ర కొంచెము వ్రాయవలెను. ఈ నాటకసమాజమున సభ్యులై యుండుటకంటె తామే సమాజమును స్వాధీనము చేసికొని పెత్తనము వహించి నాటకము లాడించి తామే లాభనష్టము లనుభవించవలెనను కోరిక సత్యవోలు గున్నేశ్వరరావు గారికిని, కృత్తివెంటి నాగేశ్వరరావుగారికిని పుట్టెను. వారు తమ యభిప్రాయమును నాకును సమాజములోని ముఖ్యులకును నెరింగించిరి. సమాజమునకప్పటికి గొంతఋణముండెను. ఆఋణముదీర్చి తత్ప్రతిఫలముగా, మా తెరలు కొయ్యసామానులు తదితర పరికరములు దీసుకొని, వారు నాటకసమాజమును తమయధీనముచేసుకొని నడుపుకోవచ్చునని మేమంటిమి. ఆప్రకారముగా వారిరువురు సమాజమును స్వాధీనముజేసు కొని నాటకములాడింపజొచ్చిరి. కొంతకాలము జరుగునప్పటికి వారిరువు రకును సరిపడలేదు. అందుచేత నాగేశ్వరరావుగారు హిందూనాటకసమాజ మనుపేరుతో, నొకనాటకసమాజమును స్థాపించి, మునుపు మేమాడుచున్న లక్ష్మీపతిగారి నాటకశాలలోనే నాటకములాడింపజొచ్చిరి. గున్నేశ్వరరావు గారు చింతామణీ నాటకసమాజమనుపేర మరియొకసమాజము స్థాపించి, చిత్రపు వెంకటనరసింహారావుగారి దొడ్డియద్దెకుపుచ్చుకొని చింతామణీ నాటకశాలయను నొకభవనము గట్టించిరి. ఆభవనమునందు ప్రవేశోత్స వము నన్ను జరుపుమని, గున్నేశ్వరరావుగారు గోరగా, నేనా ప్రవేశోత్స వము జరిపితిని. గున్నేశ్వరరావుగారును, నాగేశ్వరరావుగారును విడిపో

యిన తరువాత గున్నేశ్వరరావుగారు తమనాటకసమాజమును విజయనగరము తీసుకొనిపోయి నాటకములాడించి మెప్పువడసిరి. నాగేశ్వరరావుగారు తమ సమాజమును చెన్నపురి దీసికొనిపోయి నాటకములాడించి చెన్ననగరాంధ్రులస్తోత్రములకు పాత్రులైరి. ఆనరుబుల్ బయ్యా నరసింహేశ్వరశర్మగారు చెన్నపురియాంధ్రులపక్షమున నొకయభినందనపత్రమును నాగేశ్వరరావుగారికిచ్చి గౌరవించిరి. ఆదినములలో శ్రీ జయంతి రామయ్యపంతులుగారు చెన్నపురిలో ప్రెసిడెన్సీ మేజస్ట్రీటుగానుండిరి. వారునాకుజాబు వ్రాయుచు, నందు, నా "గయోపాఖ్యాన" "ప్రసన్నయాదవ" నాటకముల ప్రయోగములను శ్లాఘించుచు కడపట నిట్లువ్రాసిరి. "You would have received a grand ovation if you had come here. I attended the darma." మీరిక్కడకువచ్చి నాటకమునకు హాజరయినపక్షమున మీకు గొప్ప సన్మానము జరిగియుండును. అని పైమాటలయభిప్రాయము. చెన్నపురినుండి వచ్చినతరువాత నాగేశ్వరరావుగారు రూకలు ఖర్చుపెట్టి, మంచి తెరలను జగన్మోహనమైన దృశ్యములను సిద్ధముచేయించి సమాజమును యేలూరుపురము దీసుకొనిపోయిరి. అక్కడ కొన్నినాటకములాడిన తరువాత నెవరో యోర్వలేక యర్ధరాత్రమున తాటియాకులపాకకు నిప్పంటించిరి. సామాజికులు ప్రాణములు దక్కించుకొని బయటబడుటే కష్టమయ్యెను. ఎన్నిసంవత్సరములో యెన్నో రూకలు ఖర్చుపెట్టి, తయారు చేసిన, యాంధ్రరంగస్థల మొక్కరాత్రిలో భస్మావశేషమయ్యెను. చింతామణీ నాటకసమాజముగూడ క్రమక్రమముగా వంతరించెను. ఇది మా నాటకసమాజమ్ముయొక్క చరిత్రము. నే స్థాపించిన పాఠశాలయొక్క చరిత్రము నిదివరకే ముగించితినిగదా!

1907 వ సంవత్సరమున హిందూదేశములో ననేక స్థలములలో స్వదేశవస్తూపయోగము, విదేశవస్తు బహిష్కారము, స్వరాజ్యసంస్థాపనము, జాతీయ విద్యావ్యాపకము, నను విషయములను గురించి గొప్ప యాందోళనము జరిగెను. అన్నిటికంటె ముఖ్యముగా జాతీయపాఠశాలా సంస్థాపనమును గురించి యెక్కువ కృషిచేయబడెను. సత్యవోలు గున్నేశ్వరరావుగారు స్థాపించిన "ఆంధ్రకేసరీ" పత్రిక వారమువారము పైవిషయములతోనిండి ప్రకటింపబడుచుండెను. శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారా పత్రికకు సంపాదకులైనను, అత్తిలి సూర్యనారాయణగారును నేనును మిక్కిలి యుత్సాహపూరితములైన వ్యాసములు మిక్కిలి శ్రద్ధతో వ్రాయు

చుంటిమి. జాతీయపాఠశాల స్థాపించుటకు రాజమహేంద్రవరములో నెన్నో సభలు జరిగెను. ప్రాతయూరులోను, యిన్నీసుపేటలోను, టవును హాలులోను బహుసభలు జరిగెను శ్రీ న్యాపతి సుబ్బారావు పంతులుగారికి గూడ జాతీయ పాఠశాలా సంస్థాపనము మీద మిక్కిలి యుత్సాహము కలిగెను. ఆనేక సభలలో వారధ్యక్షత వహించిరి. నేను బహుసభలలో మాటాడితిని. ఆ సంవత్సరము దీపావళినాడు జాతీయపాఠశాలా స్థాపనము కొరకు, విద్యార్థులు వీధివీధులు దిరిగి సొమ్ము వసూలుచేసిరి. నేనప్పుడు మూడవ వార్డులో కాపురముంటిని ఇప్పుడది మూడవవార్డు కాదు. నా వార్డులో నేను సొమ్ము ప్రోగుచేయుటకై యేర్పడితిని. తక్కిన వార్డులలో కంటె నా వార్డులో వర్తకులెక్కువ యుండుటచేతనో, మరి యేకారణముచేతనో నా వార్డులో సొమ్మధికముగా వసూలయ్యెను. నేను కాపురమున్న ప్రక్కవీధిని వేశ్యాంగనలు నివసించుచుండిరి. అందొకవేశ్య తన యింటికిదక్కిదక్కినయిండ్లకు నేను భిక్షటనమునకై బోవుట చూచి తన గుమ్మములో నిలిచియుండి, "మా లోపలకువచ్చి యడిగిన పక్షమున నేను గూడ చందా నిచ్చెదను" అని పలికెను. నే నందుకు భయపడలేదు. వెనుకంజ నిడ లేదు. వేశ్యాంగన యిండ్లకు బోవుట నా నియమములకు విరుద్ధమైనను దేశసేవ నిమిత్తమై పనిచేయుచుంటిని. గాపున వేశ్యాగృహప్రవేశము తప్పుగాదని నాకు తోచినది. ఆ సమయమున నాకు జ్ఞానవాసిష్టములోని యీ క్రింది శ్లోకము జ్ఞప్తికి వచ్చెను.

శ్లో॥ మనఃకృతం కృతంరామ
న శరీర కృతం కృతం
యేనైవా లింగితా కాంతా
తేనైవా లింగితా సుతా॥

యని వసిష్ఠుడు రాముని కుపదేశించెను. దీని భావమిది. "ఓ రామ! మనసార చేసినపనియే పనిగాని, వట్టి శరీరముతో చేసినపని పని గాదు. పురుషుడు యే శరీరముతోనైతే తన ప్రియురాలిని కౌగిలించుకొనునో యా శరీరముతోనే తన కూతును గూడ కౌగలించుకొనుచున్నాడు. పురుషుడు కాముకుడై తన ప్రియురాలిని గౌగిలించుకొనును. పుత్రప్రేమచేత గారాబు కూతును గౌగలించుకొనును. కౌగలించుకొను శరీరమొకటియే గాని, యుద్దేశ్యములు వేరు. అని తలపోసి నేనా వేశ్యాగృహమునకు నా వెంటనున్న విద్యార్థులతో వెళ్ళి యామె చేసిన స్వల్పధన సహాయము

స్వీకరించితిని. ఇట్టియనుభవము నాకు రెండుసారులు గలిగెను. మొత్తము మీద మరుచటి సంవత్సరము జాతీయ పాఠశాలా సంస్థాపనముచేయుటకై సుబ్బరావు పంతులుగారు నిశ్చయించిరి. ఆ పాఠశాలను పరిపాలించుట కొక సంఘ మేర్పడెను. దానికి శ్రీ న్యాపతి సుబ్బారావు పంతులుగారే యధ్యక్షులైరి. కలపవర్తకులైన పందిరి వీరన్నగారు. న్యాయవాదులైన గంటి లక్ష్మన్నగారు, దుప్పూరి వీరభద్రయ్యగారు, దామెర్ల వెంకట రమణారావుగారు మొదలగు నితర గృహస్థులు సంఘములో సభ్యులైరి. మొదట నేను నందులో నుంటిని. 1907 వ సంవత్సరము డిశంబరులో పాఠశాలా స్థాపనము గురించి యాలోచించుటకు యీసంఘము టపును హాలులో మేడమీద సమావేశమయ్యెను. స్థాపింపబోవు పాఠశాలలో మత విద్య యుండవలెనా? కూడదా? యను ప్రశ్న చర్చకువచ్చెను. మత విద్య యన్నిటికంటె ముఖ్యమైనదనియు, నదిలేకపోవుటచేతనే, దొరతనమువారి పాఠశాలలోని విద్యార్థులు నాస్తికులై, చెడిపోవుచున్నారనియు; గాన, మత విద్యయుండవలెననియు సుబ్బరావుపంతులుగారు వాదించిరి. జాతీయ పాఠశాలలో తురకలు చేరవచ్చును; క్రైస్తవులు చేరవచ్చును; శైవులు చదువవచ్చును; వైష్ణవులు చదువవచ్చును; నానామతస్థులుచదువవచ్చును. ఒకమతస్థునిసిద్ధాంతములు మరియొకమతస్థులకు సరిపడవు. కాబట్టి మత విద్య పరస్పర వైషమ్యములు కలిగించును, గావున, యదియుండకూడ దని, నేను వాదించితిని. నామాటలు సుబ్బరావుపంతులుగారికి నచ్చలేదు. ఇట్లు విరుద్ధాభిప్రాయములుగలవారు పరిపాలకసంఘములోనుండిన పాఠశాల యెట్లుజరుగునని సుబ్బరావుపంతులుగారనిరి. "అట్ల యిన నేనీసంఘములో నుండను మానివేయుదున"ని, వెంటనేలేచి, సభనుండి వెడలిపోతిని. సాధారణముగ నేను సుబ్బరావుపంతులుగారియెడ భక్తిగలవాడనేగాని దుర్వినయముగలవాడనుగాను. సభలోనేదేని ధర్మసమస్య వచ్చినప్పుడు ప్రతిసభ్యుడు నిర్భయముగ దనయభిప్రాయము వెలిబుచ్చుట ధర్మముగావున నేనట్లు నిస్సందేహముగ నాయభిప్రాయము వెలిబుచ్చితిని.

1908 వ సంవత్సరము జనవరిలో రాజమహేంద్రవరములో జాతీయపాఠశాల స్థాపింపబడెను. అది మొట్టమొదట న్యాపతి సుబ్బారావు పంతులుగారి యింటిప్రక్కనున్న భవనములో స్థాపింపబడెను. ఆభవనము పంతులుగారిదే. పాఠశాల స్థాపింపబడినదినమున, నాయుత్సవమును జూచుటకై రమ్మని పట్టణములోని పెద్దమనుష్యుల కనేకుల కాహ్వానములు

వచ్చెను. నాకుగూడ నాహ్వానము వచ్చెను. కాని నేనా యుత్సవమునకు వెళ్ళలేదు. పాఠశాల స్థాపింపబడెను. దక్షిణదేశస్థుడైన వెంకటరమణ సరస్వతి యనువారు ప్రధానోపాధ్యాయులుగా నియమింపబడిరి. గజవల్లి రామచంద్రరావుగారు, వెన్నేటి సత్యనారాయణగారు మొదలగువారు స్వల్ప వేతనములమీద సహాయోపాధ్యాయులుగానుండి, పనిచేయుచుండిరి. వెంకటరమణయ్యసరస్వతిగారు పట్టపరీక్షసిద్ధులు. మిక్కిలి తెలివిగలవారు. కాని స్వతంత్రశీలురు, ఒకరి యధికారమునకు లోబడియుండువారు గారు.

●

స్వీ య చ రి త్ర ము

పదునైదవ ప్రకరణము

ముద్రాయంత్ర స్థాపనము

నేను "మనోరమ" యను మాసపత్రికను 1906 వ సంవత్సరములో ప్రారంభించి, చింతామణీ ముద్రాక్షరశాలలో ముద్రింపించి నడుపుచుంటిని. ఇతరుల ముద్రాక్షరశాలలో నచ్చువేయించుట వలన కొన్ని నష్టములుగలవు. ఏలయన, వారితరుల పనులొప్పుకొని మా పనులు వెనుక బెట్టుట గలదు. అదిగాక "ఆంధ్రకేసరీ" పత్రిక చింతామణీ ముద్రాయంత్రములోనే యచ్చుపడుచుండెను. కాబట్టి పనివారికి పని యెక్కువగనుండెను. అందుచేత, నా కొకస్వంత ముద్రాయంత్రముండిన, బాగుండునని తోచినందున, నేనా విషయమై ప్రయత్నము చేయజొచ్చితిని. చిత్రపు నరసింహారావుగారు తాను వీరేశలింగముగారియొద్ద కొన్న వివేకవర్ధనీ ముద్రాక్షరశాలలో కొంతభాగము తానుంచుకొని పెద్దభాగము నమ్మివేయ దలంచుచుండెను. అది నేను కొనదలంచితిని. నాకు సొమ్ము కావలసి యుండెను. నాకు మొదటినుండియు మిత్రులైన శ్రీ కంచుమర్తి రామచంద్రరావుగారు నేను ముద్రాయంత్రము కొన్నపక్షమున ధనసహాయము

చేయుదుమని చాలకాలమునుండి చెప్పుచుండిరి. ఆయన నాయెడ మిక్కిలి ప్రేమకలిగి కొంతధనము నాకు బదులిచ్చిరి. ఆ ధనము చాలనందున వేరొకచోట నేను మరల ప్రయత్నము చేసితిని కస్తూరి రామారావుగారని యుదారశీలుడైన యొక యువకుడు రాజమహేంద్రవరములో గాపురముండెను. ఆయన శ్రీ దొడ్డమపేట జమీందారిణిగారైన శ్రీ వాడ్రేవు రంగనాయకమ్మగారికి దౌహిత్రుడు. ప్రస్తుతము దొడ్డమపేట జమీందారైన శ్రీ వాడ్రేవు విశ్వసుందరరావుగారికి జనకసోదరుడు. శ్రీ కస్తూరి నరసింహారావుగారికి రామారావుగారు జ్యేష్ఠకుమారుడు. రామారావుగారి తమ్ముడైన విశ్వసుందరరావుగారిని రంగనాయకమ్మగారు పెంచుకొనిరి. రంగనాయకమ్మగారికి రాజమహేంద్రవరములో నొకయిల్లు గలదు. ఆ గృహమం దొకభాగమున కస్తూరి రామారావుగారును, రెండవభాగమున నా గుమాస్తాయైన సత్యవోలు అప్పారావుగారును కాపురముండిరి. నేను వేయిరూపాయిలు బదులిమ్మని రామారావుగారి నడిగితిని. అప్పారావుగారుగూడ నీసంగతి రామారావుగారితో చెప్పిరి. రామారావుగారియొద్ద నప్పుడు ధనములేదు. ఎవరిచేతనైన దన కప్పనిప్పించిన యెడల నాకాధనము బదులిచ్చెదనని చెప్పిరి. అప్పుడు నేను కందుకూరి వీరేశలింగముగారి యొద్దకు బోయి, నాకు రామారావుగారు సహాయముచేయుదురు గావున రామారావుగారికి వేయిరూపాయిలు బదులిమ్మని వారిని కోరితిని. నా కోరికను త్రోసివేయక వీరేశలింగముగారు రామారావుగారికి నోటుమీద బదులిచ్చిరి. రామారావుగారును నాచేత నోటువ్రాయించుకొని నాకు బదులిచ్చిరి. నరసింహారావుగారి యొద్దగొన్న ముద్రాయంత్రముగాక, యప్పుడు, చెన్నపట్టణములోనున్న కొట్టు రాఘవయ్యగారియొక్కయు, తురిమెళ్ళ వెంకటసుబ్బారావుగారి యొక్కయు సహాయమున మరియొక చిన్నయంత్రమును గూడ తెప్పించితిని. ఈ ముద్రాక్షరశాలకు నేను "మనోరమా" ముద్రాక్షరశాలయను పేరుపెట్టి సత్యవోలు లక్ష్మీపతిగారి యల్లుడుగారైన శ్రీ రాజా వెంకట కృష్ణారావు బహదూరువారియొద్ద, బజారులో వారికున్న మేడలో కొంతభాగము నద్దెకు దీసికొని, నా ముద్రాక్షరశాల నందులో పెట్టితిని. చెన్నపురినుండి వచ్చిన యంత్రము నాకంతగా నుపయోగపడలేదు. నా మిత్రులు పొరబాటుచేత బనికిరాని ముద్రాయంత్రము గొనిరని, నేను నా మిత్రులు నభిప్రాయపడితిమి ఈ ముద్రాక్షరశాలలోనే నా "మనోరమ" యచ్చుపడి, బయలువెడలుచుండెను. చిత్రపు నరసింహారావుగారు నేనద్దెకు

పుచ్చుకొన్న మేడలోనే తన నిమి త్తమై యుంచుకున్న చిన్న ముద్రాయంత్ర మునుగూడ పెట్టి, నాకు బాడిగె నిచ్చుచుండిరి. రెండుకత్తు లొకయెరలో నిముడనట్లు రెండుముద్రాయంత్రము లొకయింటిలో నిముడుట కష్టము గదా! వారి ముద్రాయంత్రములో పనిచేయువారును, నా ముద్రాయంత్ర ములో పనిచేయువారును దరుచుగా వివాదపడుచుండిరి. ఆ వివాదములు దీర్చుట కష్టముగానుండెను. నరసింహారావుగారును నేనును మిత్రుల మగుటచే నేదో విధముగా మే మిరువురము సఖ్యపడి కాలము త్రోసివేయు చుంటిమి.

నా రెండవచెల్లెలైన యచ్చమ్మయొక్క పెద్దకూతురైన వెంకట సుబ్బమ్మకు వివాహయోగ్యమైన వయస్సు ప్రా ప్తించెను. ఆమె కప్పుడు పండ్రెండు సంవత్సరములు నిండినవి. వివాహము తప్పక చేయవలసి వచ్చెను. వరుని నిమి త్తమై వెదకితిమి. మాచెల్లెలు భ ర్తయైన రామస్వామి గారి యప్పగారికి నలుగురు కుమార్తలుండిరి. వారి యింటిపేరు రావూరివారు. వారు గుంటూరుజిల్లాలోని రేపల్లె తాలూకాలోని బల సులపాలెములో నివ సించుచు, నప్పుడప్పుడు, బెజవాడలోగూడ నివసించుచుండిరి. మాబావగారి మేనల్లురలో సర్వజ్యేష్ఠుడు రావూరి రామకృష్ణయ్య. రామస్వామిగారు తణుకులో నుద్యోగములో నున్నప్పుడు, రామకృష్ణయ్యను గొంతకాలము తనవెంట గొంపోయి చదువు చెప్పించి, తన పెద్దకూతును వానికిచ్చి వివా హము చేయవలెనని, సంకల్పము గలిగియుండెను. రామస్వామిగారి పని చేయుచోట నెక్కువ తరగతి లేనందున రామకృష్ణయ్య చదువునిమి త్తము 1902 వ సంవత్సరములో రాజమహేంద్రవరమువచ్చి మా యింటనేయుండి నే స్థాపించిన యున్నతపాఠశాలలో మొదట నాలుగవఫారము చదివి, మరుచటి సంవత్సర మయిదవఫారము చదివి, నా యున్నతపాఠశాల దీసి వేసిన తరువాత, ట్రయినింగు కాలేజీలో మెట్రిక్యులేషను తరగతిలో చేరెను. అతడు పిమ్మట బెజవాడకుబోయి, యచట మిషనువారి పాఠశాలలో జదివి, మెట్రిక్యులేషను పరీక్షలో గృతార్థుడై, 1907 వ సంవత్సరమున మరల రాజమహేంద్రవరమువచ్చి బ్రథమశాఖ్ర తరగతిలో చేరెను.

ఆ సంవత్సరమున విద్యార్థులు బిపిన్‌చంద్రపాల్‌గారి యుపన్యాస ములవలన యుద్రేకపూరితులై వందేమాతరం బిళ్ళలను మెడలలో ధరించి కళాశాలకు బోయిరి. ఆ బిళ్ళలు ధరింపరాదని ప్రధానాచార్యులైన మూర్కు హంటరుదొరగారు పట్టుపట్టినను విద్యార్థులు వినక తిరుగుబాటు చేసినందున

దొరగారు విద్యార్థులను కళాశాలనుండి దీసివేసిరి. మా రామకృష్ణయ్యగూడ ప్రధమశాస్త్ర తరగతిలోజేరి దేశాభిమాన ప్రేరితుడై కళాశాలనుండి వెడలి వచ్చెను. అతడు తరువాత పై తరగతులు చదువుకొనలేదు. అంబనను రామకృష్ణయ్య బుద్ధిమంతుడు. దృఢకాయుడు. సౌమ్యుడు. పెద్దలయందు వినయవిధేయతగలవాడు. మంచి నడతగలవాడు. తన్నెరిగినవారికందరకు దలలో నాలుకవలె నుండెడివాడు. అతని తండ్రి విశేష భాగ్యవంతుడు గాకపోయినను గొంత భూవసతిగలవాడు. ఆస్థితినిజూచి గాక రామకృష్ణయ్య సుగుణసంపత్తినిజూచి నేను నా పెద్దమేనగోడలైన వెంకటసుబ్బమ్మను రామకృష్ణయ్య కిచ్చి వివాహముచేయ నిశ్చయించుకొంటిని. నా చెల్లెండ్రు నా తమ్ముడుగూడ నీ విషయమున నాతో నేకీభవించిరి. ఈ కార్యమువలన నా బావమరది రామస్వామియొక్క సంకల్పముగూడ నెరవేరునని నేను సంతసించితిని. మా నిశ్చయమును రామకృష్ణయ్య తలిదండ్రులకు దెలియ వరచితిని. వారును సంతసించి తరలివచ్చిరి ప్లవంగ సంవత్సర ఫాల్గున మాసమున వివాహమయ్యెను. నేనిదివరలో కొంతకాలము గాపురమున్న దుర్భావారియిల్లు విడిదిగానిప్పించితిని. రాయవరపువారింట వివాహమయ్యెను. రామస్వామిగారి యన్నగారైన శివరామయ్యగారును భార్యయు పీటలమీద కూర్చుండి కన్యాప్రదానము జేసిరి వివాహ మైదుదినములు నిర్విఘ్నముగా జరిగెను. ఒకనాడొక వైణికునిచేత గానసభ చేయించితిని ఆ సభకప్పుడు మండల న్యాయాధిపతియైన పార్థసారధి అయ్యంగారును చాలమంది పుర ప్రముఖులును వచ్చిరి. కాకినాడను, నా మిత్రులైన, రఘుపతి వేంకట రత్నమునాయుడుగారును, బుర్రా సూర్యప్రకాశరావుగారునుగూడ వివాహము నకు దయచేసిరి. వివాహ వ్యయమంతయు నే నే భరించితిని. నా మేన మామగారైన మల్లయ్యశాస్త్రిగారుగూడ సకుటుంబముగ దయచేసి యైదు రోజులు నుండిరి.

1908 వ సంవత్సర మేప్రియలు నెలలో కీలకసంవత్సరఫాల్గుణ శుద్ధత్రయోదశినాడు కందుకూరి వీరేశలింగముగారు పుట్టినదినము. ఆనాటి కాయన కరువదియేండ్లు నిండెను. కాబట్టి వారానాడు షష్టిపూర్తిమహోత్సవము చేసికొని పురప్రముఖుల నాహ్వానించిరి. మండలన్యాయాధిపతి (District Judage) యైన పార్థసారధి అయ్యంగారు, శ్రీ కంచుమర్తి రామచంద్రరావుగారు, గోపిశెట్టి నారాయణస్వామినాయుడుగారు మొద

లగు ప్రముఖులు దయచేసిరి. నేనును వెళ్ళితిని. నారాయణస్వామినాయుడు గారు వీరేశలింగముగారికి శాలువలు గప్పిరి

ఆ సంవత్సరము బందరులో నొక ప్రార్థనసమాజమందిరము గట్ట బడెను. తత్ప్రవేశమహోత్సవమునకై వీరేశలింగముగారిని మమ్మును బిలిచిరి. వీరేశలింగముగారు, రాజ్యలక్ష్మమ్మగారు నేను, చిలుకూరి వీర భద్రరావుగారు, రామాప్రగడ వెంకటరామయ్యగారును వెళ్ళితిమి. గుం టూరునుండి, యున్నవ లక్ష్మీనారాయణగారును బందరు దయచేసిరి. రెండవనాడో మూడవనాడో వీరేశలింగముగారు ముందుగ నొక యుపన్యాస మిచ్చిరి. తరువాత నేనొక యుపన్యాసమిచ్చితిని. ఆ యుపన్యాసములకు శ్రీ చెన్నాప్రగడ భానుమూర్తిగారు, భోగరాజు పట్టాభిసీతారామయ్యగారు, వల్లూరి సూర్యనారాయణరావుగారు మొదలగు పెద్దలు ధయచేసిరి. నా యుప న్యాసము మిక్కిలి బాగున్నదని నా మిత్రులు నన్ను శ్లాఘించిరి. బుద్ధిరాజు పావకేశ్వరరావుగారు నాకడకు వచ్చి తమ నివాసస్థానమైన నరసాపురములో నిటువంటి యుపన్యాసమొకటి చేయవలసినదని గోరిరి. పిమ్మట గొన్ని మాసములకు నేను నరసాపురము వెళ్ళితిని. కాని పావకేశ్వరరావుగారు గ్రామములో లేకపోయిరి. ఐనను నేను వారింటనే బసచేసి పురములో నొకచోట యుపన్యాసమిచ్చి వచ్చితిని.

1908 వ సంవత్సరమున కీలకసంవత్సరము గోదావరిపుష్కరము. నానాదేశములనుండి యాత్రికులు వచ్చిరి. గవర్నమెంటువారు వచ్చిన ప్రజల సౌకర్యార్థము కోటిలింగాల వద్ద పాకలు వేయించిరి. శ్రీ కంచు మర్తి రామచంద్రరావుగారును, మునిసిపలు సంఘాధ్యక్షుడైన గంటి వేంకటరామయ్యగారును ప్రజలకొరకై పాటుపడిరి. గంటి వేంకట్రామయ్య గారికి దొరతనమువారు రావుసాహేబు బిరుదునిచ్చిరి. ఈ పుష్కరమున నా బంధువులు నన్నుబలవంతపెట్టినను తీర్థవిధి నేనుబెట్టలేదు. గోదావరిలో నొకనాడైనను స్నానముచేయలేదు ఈ పనులవలన నాకుగాని నా పితృ దేవతలకు గాని మోక్షములేదని నా నమ్మకము,

1908 వ సంవత్సరము మే నెలలో కృష్ణామండల రాజకీయసభ తెనాలిలో జరిగెను. ఆ సభకు మహారాజశ్రీ కొండా వేంకటప్పయ్యగా రధ్యక్షులైరి. ఆ సభ యైనతరువాత నాలుగవదినమున మండలసంఘ సంస్కరణసభ జరిగెను. ఈ సభయొక్క సన్మానసంఘమునకు బొప్పూడి వెంకటప్పయ్యగా రధ్యక్షులైరి. సంఘసంస్కరణమహాసభకు నధ్యక్షత

వహించవలసినదని నన్ను వాడు కోరిరి. అప్పటికి నాకు నలువదియొకటవ యేడు. నాకును, దేశమునకును, సంఘసంస్కరణమున గురుదేవులని చెప్పదగిన వీరేశలింగముగారును, రఘుపతి వేంకటరత్నమునాయుడు గారు నుండ నా విద్యచేగాని వయసుచేగాని, లోకానుభవముచేగాని వారి కెంతమాత్రము సాటిరాని నేనేమి యా మహాకార్యము నిర్వహించుటేమియని మొదట సందేహించితిని, గాని, చిట్టచివరకు నా రాజమహేంద్రవర మిత్రుల ప్రోత్సాహముచేతను తెనాలివారి బలవంతముచేతను నేనొప్పుకొంటిని. రాజకీయమండలసభ జరుగుచుండగా నేనును తెనాలి వెళ్ళితిని. బొప్పూడి వెంకటప్పయ్యగారు రైలుస్టేషనుకడకు వచ్చి, నన్ను సగౌరవముగ గుఱ్ఱపుబండిమీద నెక్కించి గ్రామములోనికి తీసుకొనివెళ్ళి యొక న్యాయవాదియింట నాకు బస నేర్పాటుచేసిరి. నేనును, నావెంట వచ్చిన శిష్యుడును, నక్కడనున్న దినములలో సుఖముగనే కాలక్షేపము జేసితిమి. సంఘసంస్కరణసభ ప్రారంభమయ్యెను. వేదికమీద కొండా వెంకటప్పయ్యగారు, వల్లూరి సూర్యనారాయణరావుగారు, ముట్నూరి కృష్ణారావుగారు, శిడింబి హనుమంతరావుపంతులుగారు మున్నగు నా మిత్రులు కృష్ణామండలప్రముఖులు గూర్చుండిరి. సభ మహాజనులతో నిండిపోయెను. సభ యుదయముననే ప్రారంభమయ్యెను. సన్మానసంఘాధ్యక్షుని యుపన్యాసమును నా యుపన్యాసమును ప్రొద్దుటనే జరిగెను. నా యుపన్యాసమును నేను వ్రాసి చదువలేదు. మొదటినుండి చివరవరకు, వాగ్ధోరణిగనే చెప్పితిని. నడుమ సభాసదులు కొట్టుచున్న చప్పట్లులచేత నా యుపన్యాసము జనాకర్షముగానున్నదని నేనభిప్రాయపడితిని. మధ్యాహ్నము వివిధవిషయముల గురించి తీర్మానములు చేయబడెను. నా చరమోపన్యాసము గూడ ప్రారంభోపన్యాసమువలెనే గంభీరముగ నున్నదని, నా మిత్రులు నన్ను బహూకరించిరి.

ఆ సంవత్సరమున నా "మనోరమ" పత్రిక విషయమున నొక విశేషము జరిగెను. విశాఖపట్టణవాసులైన పెట్టి లక్ష్మీనరసింహముగారు నా పత్రికలో విమర్శించుటకు "రసికాభిలాషము"ను నొక పద్యప్రబంధమును నాకు బంపిరి. అది యచ్చుపడిన చిన్నప్రబంధము. ఆ గ్రంథమున కుపోద్ఘాతము వ్రాయుచు తమకా గ్రంథము సింహాచలములో నొక వైష్ణవస్వామి యింట ప్రాచీనగ్రంథములు తిరుగవేయుచుండగా నీ గ్రంథము యొక్క తాటియాకుల ప్రతి దొరకినట్లును, పూర్వకాలమది శ్రీనాథ

మహాకవిచే రచియింపబడి యచ్చుపడక మూలబడియుండినట్లును సెట్టి లక్ష్మీనరసింహముగారు వ్రాసిరి. ఆ గ్రంథము నేనుచదివించుకొని వింటిని. విన్నప్పుడు దాని శైలి బట్టియు, శబ్దప్రయోగముల బట్టియు, వర్ణనలం బట్టియు నది ప్రాచీనగ్రంథముగాదనియు, దానిని శ్రీనాథుడు రచియింప లేదనియు, శృంగారరసప్రియుడైన యధునాతన రసికుడెవడో దానిని రచి యించి జనాదరణమును బడయుటకై శ్రీనాథునిపేరు పెట్టెనని యు, నే నభి ప్రాయపడితిని. ఈ యభిప్రాయమునే నేను నా "మనోరమ" పత్రికలో వెల్లడించితిని. ఆది చదువుకొని, సెట్టి లక్ష్మీనరసింహముగారు నా మీద నాగ్రహము వహించి, నా విమర్శనమున కుత్తరముగా నొక చిన్నగ్రంథ మునే వ్రాసి ప్రకటించి, నాకు బంపిరి. "రసికాభిలాషము"ను శ్రీనాథుడే వ్రాసినాడని స్థిరపరచుట కాయన యేవేవో హేతువులు చూపుటయేగాక, నేను గ్రుడ్డివాడనని యు, నందుచేత సత్యము గనిపెట్టలేకపోతిననియు, కొన్నియప్రస్తుత దూషణవాక్యముల వ్రాసిరి. నేను గ్రుడ్డివాడనన్నమాట నిజమేగాని సత్యము గనిపెట్టలేనంత గ్రుడ్డివాడనుగాను. ఈ గ్రంథ రచ నముయొక్క రహస్యము గ్రుడ్డివానికిగూడ గరతలామలకముగ దెలియు నట్లే యుండెను. సెట్టి లక్ష్మీనరసింహముగారు పట్టపరీక్షసిద్ధులు. తెలు గులో మంచిపాండిత్యముగలవారు. సరసమైన గవిత్వము చెప్పగలవారు. అట్టివారిట్టి వ్రాతలు వ్రాసినందుకు మిక్కిలి యాశ్చర్యపడితిని.

ఆ కీలక పుష్కరాంతమున, శ్రీ శ్రీ శ్రీ విక్రమదేవ వర్మగారు సకుటుంబముగా గోదావరీ స్నానము చేయుటకై విజయముచేసి, గోదావరీ రైలుస్టేషనునకు సమీపమందున్న రెడ్లమువారి బంగాళాలో బసచేసిరి. నిగర్వచూడామణియైన యా మహాపురుషుడు తనకుటుంబమును రెడ్లము వారి బంగాళాలో దింపి మా యిల్లు వాకబుచేసి యచ్చటకు సమీపమందే యున్నదని తెలుసుకొని యారాత్రి రమారమీ తొమ్మిదిగంటలప్పుడు నందు గొందులలోనున్న నా బసకు వచ్చిరి. నేను మిక్కిలి యాశ్చర్యపడితిని. కొంతసేపు మే మిరువురము బహువిషయముల గురించి ప్రసంగించితిమి. ఆ ప్రసంగములో వారు "రసికాభిలాషము" శ్రీనాథుడు వ్రాసినది గాదనియు, నది నవీనులు వ్రాసినదనియు చెప్పి సత్యము గనిపెట్టినందుకు వారాశ్చర్య పడుచు నన్ను బహూకరించిరి. వీరుగాక మరియొకరుగూడ నీ విషయ మును ధ్రువపరిచిరి. విశాఖపట్టణవాసియైన బొడ్డు రామయ్యగారను వైశ్య శిఖామణి యొకరు గలరు. ఆయన సెట్టి లక్ష్మీనరసింహముగారికి ముఖ్య

మిత్రులు. ఆయన రాజమహేంద్రవరములో నొక పుస్తకముల దుకాణము పెట్టి, వ్యాపారముచేయుచు నప్పుడప్పుడు నన్ను రాజమహేంద్రవరములో గలుసుగొనుచుండెను. ఆయన ప్రసంగవశమున నాతో నొకసారి యిట్లు చెప్పిరి. "రసికాభిలాషము శ్రీనాథుడు వ్రాసినదిగాదు. దానిని మామిత్రుడు పెట్టి లక్ష్మీనరసింహముగారు స్వయముగ మాయెదుటనే వ్రాసిరి. మీరెట్లు గనిపెట్టిరోగాని సత్యము గనిపెట్టిరి". ఈ మాటలు విన్నతరువాత నేను జేసిన విమర్శనము యథార్థముగదాయని నాకు మనశ్శాంతి గలిగినది. విక్రమదేవ వర్మగారును, బొడ్డు రామయ్యగారును, పెట్టి లక్ష్మీనరసింహము గారును మిక్కిలి మిత్రులుగాబట్టి యీ రహస్యము వారికి దెలిసియుండును.

రమేశచంద్రదత్తుగారని యొకానొక బంగాళీ మహాపురుషుడుండెనని చదువరులెరుగుదురు. ఆయన బంగాళీ భాషలోను, ఆంగ్లేయ భాషలోను నెన్నో గ్రంథములు రచియించిరి. ఆయన ఆంగ్లేయభాషలో 'Lake of Palms' అను నవలను వ్రాసిరి. "తాళ్ళచెరువ"ని దాని యర్థము. ఆ గ్రంథమును నేను చదివించుకొని వింటిని. అది చదివినవారికి బంగాళీల యాచార వ్యవహారములు దెలియును. ఆగ్రంథమును తెనిగించిన బాగుండు నని నాకు దోచినది, అది రసవంతమైన నవల. అప్పుడు దత్తుగారు బరోడా సంస్థానములో రెవిన్యూమంత్రిగా నుండిరి. ఆ గ్రంథము నాంధ్రీకరించుటకు నా కనుజ్ఞ నిమ్మని వారిపేర నేను వ్రాసితిని. వా రా మహాపదవిలోనుండియు గ్రంథము నాంధ్రీకరించుటకు సెల వొసంగుచు నాకు జవాబు వ్రాసిరి. ఆ గ్రంథమును నేను దెనుగుజేసి, "తాళ్ళచెరువ"ని పేరు పెట్టిన బాగుండదని "సుధాకరచ్ఛంద్ర"మని పేరుపెట్టి ప్రకటించితిని. అది రెండుభాగములుగ నున్నది చెన్నపురి విశ్వవిద్యాపీఠమువారు దానినొక సారి ప్రథమశాస్త్రపరీక్షకు పఠనీయగ్రంథముగ గూడ బెట్టిరి.

నా పెద్దమేనకోడలు పెనిమిటియైన రావూరి రామకృష్ణయ్య కళాశాలనుండి వెడలగొట్టబడిన తరువాత, విద్యాభ్యాసము మానివేసి. దేశాభిమాన ప్రేరితుడై, స్వదేశవస్త్రములను విక్రయించుటకై, గ్రామములవెంట దిరుగ నారంభించెను. వివాహమైనది మొదలుకొని, యతడు కొన్ని మాసము లా విధముగా దిరిగెను. సింహళద్వీపము రాజధానియైన కొలంబో నగరములో మెట్రిక్యులేషను పరీక్షయందు కృతార్థులైనవారు న్యాయవాది పరీక్షకు చదువుకొనవచ్చునని, యతనితో నెవరో చెప్పిరట. ఆ మాట నమ్మి యతడు సింహళద్వీపమునకు బోయెను. అచ్చటకు వెళ్ళిన తరువాత

యతనికి జబ్బుచేసెను. తనకు జబ్బుగానున్నట్లతడే నాకొక తంతివార్త పంపెను. ఆ తంతివార్త చూడగానే, మా యాడవాండ్రకును, నాకును గుండెలు చెదరిపోయెను. కొలంబోనగరము వెళ్లుటకు వీలులేదు. వెళ్ళక పోవుటకు వీలులేదు. ఏమిచేయుదమని నే నాలోచించుచుండగా, మూడవ నాడు రామకృష్ణయ్య యొద్దనుండియే జాబు వచ్చెను. దానితో నందరి గుండెలు కుదుటపడెను. నాలుగైదు దినముల తరువాత రామకృష్ణయ్యయే కొలంబోనుండి వచ్చి మా కానందము నొనగూర్చెను.

కందుకూరి వీరేశలింగముగారికి కనుపర్తి యోగానందముగారని, యొక మిత్రుడుండెడివారు. ఆయన కుమార్తె సుందరమ్మగారు బాల్యమున వితంతువయ్యెను. ఆమె వివాహమునిమిత్తము విద్యనిమిత్తము వీరేశలింగముగారి వితంతు శరణాలయములో చేరెను. సుందరమ్మగారు వీరేశలింగముగారికి మిత్రుని పుత్రికయగుటయేగాక, సుగుణసంపదలచేతగూడ వీరేశలింగముగారికి, రాజ్యలక్ష్మమ్మగారికి మిక్కిలి ప్రియపుత్రికవలె నుండెను. ఆదంపతుల కామెయెడ గాఢప్రేమయేగాక, గౌరవముగూడ నుండెను. ఆమెను శ్రీ కామరాజు హనుమంతరావుగారికిచ్చి వివాహము చేయవలెనని యాదంపతుల సంకల్పము. హనుమంతరావుగారు దేశరాజు పెద బాపయ్యగారి సవతితల్లికి సోదరుడు. సుగుణసంపదగల యువకుడు. విశేషించి బందరులో శ్రీ రఘుపతి వేంకటరత్నము నాయుడుగారియొద్ద చదువుకొని, యాయన సిద్ధాంతములను జీర్ణముచేసుకొన్న శిష్యుడు. చిన్న తనమునందే బంధుమిత్రులను వదలుకొని, బాపయ్యగారివలెనే, యనుష్ఠానిక బ్రహ్మమతస్థుడైన కార్యకూరుడు. ఆయన ప్రవేశపరీక్షయందు కృతార్థుడయ్యెను. సుందరమ్మగారుకూడ ప్రవేశపరీక్షయందు కృతార్థురాలైన విద్యావతి. వారికిద్దరికి బ్రాహ్మ మతప్రకారము వివాహము చేయవలెనని వీరేశలింగముగారి యాశయము. వీరేశలింగముగారు బ్రహ్మమతము పుచ్చుకొన్నతరువాత, బ్రహ్మధర్మ ప్రకారమిదియే మొదటి వివాహమగునని మేమందరము భావించితిమి. కాని యొక యంతరాయము వచ్చెను. హనుమంతరావుగారు బోధనాభ్యసన కళాశాలలోచేరి, యావిద్య పూర్తి కాకుండగనే, జాతీయోద్రేకమువల్ల చదువుమాని, కళాశాల వదలిపెట్టిరి. వీరేశలింగముగారి కాపని యిష్టములేదు. బిపినచంద్రపాలుగారి యుపన్యాసములు వీరేశలింగముగారి కసలే సరిపడలేదు. ఆయన పూర్వకాలపు వాడగుటచే నాంగ్లేయ ప్రభుత్వమునకు విరుద్ధమైన మాటలుగాని చర్యలు

గాని, వారి కిష్టములేదు. హనుమంతరావుగారు ప్రిన్సిపాలుగారి యాజ్ఞను దిరస్కరించినందున వీరేశలింగముగారి కాయనమీద నసిష్టము గలిగెను. కాబట్టి వీరేశలింగముగారు హనుమంతరావుగారి వివాహమునకు కొన్ని షరతులేర్పరచిరి. హనుమంతరావుగారు సుందరమ్మగారి యిష్టములేకుండ తన యింటి కేయతిధిని తీసుకొని రాకూడదు. వందేమాతరము గొడవ లలో జోక్యము కలుగచేసికొనకూడదు. ధనవ్యయ మామె యిష్టము ప్రకారము జరుగవలెను. ఇదిగాక మరికొన్ని షరతులుండెనని నాకు జ్ఞాపకము. ఒకనాడు హనుమంతరావుగారు మాయింటికి వచ్చినప్పుడు వివాహ మేమైనదని యడిగితిని వీరేశలింగముగారు తన వివాహము విషయమై కొన్ని షరతులుపెట్టిరని వైషరతులుచెప్పిరి. అప్పుడు నేనిట్లంటిని. "ఇదివరకు వీరేశలింగముగా రెన్నడు షరతులమీద వివాహములు చేయలేదు. షరతులతో జరిగిన వివాహమువలన సంసారము పొత్తు పడదు. కాపురము సరిగా పొసగదు. అట్టి వివాహము చేసుకొనుట కంటె మానుకొనుట మేలు." ఈపలుకులు వీరేశలింగముగారికి తెలిసెను. ఆయనకు నామీద కోపమువచ్చెను. పూర్వము మాయింటికి దరుచుగా వచ్చెడివా రప్పటినుండి తరుచుగవచ్చుట మానిరి. కాని వారికి నామీద విశ్వాసముపోలేదు. ప్రథమ బ్రహ్మవివాహము హనుమంతరావుగారికిగాక పులవర్తి సుబ్బారావుకు చేసిరి. ఈ సుబ్బారావు మొదట వీరేశలింగము గారు చేసిన వితంతు వివాహములలో, నొక వితంతువును పెండ్లియాడిన పులవర్తి శేషయ్యగారి కుమారుడు. సుబ్బారావు తలిదండ్రులు చిన్నప్పుడే మృతినొందుటచే వీరేశలింగముగారా బాలకునిదెచ్చి పెంచి పెద్దవానిని జేసిరి. అతనికి వివాహయోగ్యమైన వయసు వచ్చుటచే వీరేశలింగము గారు శరణాలయములోని యొక వితంతు బాలికనుదెచ్చి సుబ్బారావునకు బ్రహ్మమత ప్రకారము వివాహముచేసిరి. అందుచేత నదియే మొదటి బ్రాహ్మ వివాహమయ్యెను. షరతుల వివాహము విషయమై వీరేశలింగము గారికిని హనుమంతరావుగారికిని నభిప్రాయభేదము గలుగుటచే, హనుమంతరావుగారి వివాహ మప్పటికి నిలుపుచేయబడి, పిమ్మట కొంతకాలమున కయ్యెను. నామూలమున పరస్పరానురాగముగల యా దంపతుల వివాహము నిలుపుచేయబడినదని, వివాహమగువరకు నేను విచారించితిని పిమ్మట నామనసు శాంతించెను. సుందరమ్మగారిప్పుడు గవర్నమెంటు వారి బాలికా పాఠశాలలో తొంబది రూపాయిలమీద పనిచేయుచున్నారు.

ఆమెకు సిరియు, సంతతియు కొడుకులు కూతులుగలిగి, మనుమలు మనుమరాండ్రుగలిగి, భర్తతో హాయిగ గాపురముచేయుచున్నారు. సుంద రమ్మగారి సంసారము దోసపాదువలె కలకలలాడుచు, వర్ధిల్లుచున్నది.

హితకారిణీసమాజము 1906 వ సంవత్సరములో స్థాపింపబడినను, 1908 వ సంవత్సరమువరకు పంతులుగారు దానిని రిజిస్టరు చేయించలేదు. ఆంధ్ర సంస్కర్తలు, బ్రహ్మమతస్థులు, వీరేశలింగముగారిని పంతులు గారని వ్యవహరించుచుందురు. రఘుపతి వెంకటరత్నమునాయుడుగారిని నాయుడుగారని వ్యవహరించుచుందురు. నేనును నట్లే వ్యవహరించు చున్నాను. 1908 వ సంవత్సరము మార్చి నెలలో దేశరాజు పెద్దబాపయ్య గారు చెన్నపురములో మృతినొందిరి. మేమందరము మిక్కిలి దుఃఖితుల మైతిమి. బాపయ్యగారిమీద నెన్నో యాశలు పెట్టుకొన్న వీరేశలింగము గారి యాశలడుగంటినవి. ఆంధ్ర బ్రహ్మసంఘమునకు, సంఘసంస్కరణ మునకును దీరని వెలితి వాటిల్లినది. బాపయ్యగారివంటి యుత్తమపురుషుని ఛాయాపటము టవునుహాలులో నుండదగినదని, వీరేశలింగముగారు బాపయ్యగారి చిత్రపటమును సిద్ధముచేయించి, రాజమహేంద్రవరపురపుంది రములో బెట్టించిరి. దానిని బహిష్కరణ చేయించుటకై గొప్పవారి నెవరినైన బిలుపింతురని మేమనుకొనుచుండగా నన్నుబిలిచి పంతులు గారు "మీరే బాపయ్యగారి పటమును బహిర్గతము చేయు"డని చెప్పిరి. అట్టి మహాకార్యమునకు నేను దగినవాడను కానని పంతులుగారితో నేనెంత చెప్పినను, వినక, యా భారమును నా మీదనే వైచిరి. ఆపనికై పంతులుగారు రొకనాటి సాయంకాలము టవునుహాలులో సభ చేయించిరి. ఆ సభలో బాపయ్యగారి పటము బహిర్గతము చేయుమని వీరేశలింగము పంతులుగారు స్వయముగా నన్ను గోరిరి. విధిలేక నేనాపని చేసితిని. మిత్రులనేకులు బాపయ్యగారి గుణగణములను గొనియాడిరి. బాపయ్యగారి మీద నెనిమిది పద్యములను రచియించి చదివి పటము బహిర్గతము చేసితిని. ఆ పద్యములివి.

మ. అకటా! పోయితె దేశరాజు కులదీపాంకూరమా! సద్గుణ
ప్రకరా! బ్రహ్మసమాజ మందిర మహోదారోద్వహ స్తంభమా
సకలార్య స్తవనీయవర్తన! సదాచారప్రియా! ధీవరా!
యకలంకాత్మక! సత్యవాక్యరత! బాపయ్యా! సుహృద్రత్నమా! 1

కా॥ అన్నా ! యెక్కడ దాపురించెనొకొ నీ కా పాడురోగంబయో
ఎన్నో మందులు మ్రింగి చేసితివిగా యెన్నాళ్లొ పథ్యంబుల
ట్లున్నందప్పెనె మృత్యు వింత పని ముందుడన్సుఖంబెట్లగున్
బన్నంబేయగుగాని నీ కు తుద బాపయ్యా ! సుహృద్రత్నమా ! 2

కా॥ వంటన్ జేయగ సేవకుండును లభింపఁ రానివేళన్ పొయిన్
మంటంజేసి స్వహస్తపాకివయి నీమంబున్ గడున్ ముందుకున్
గెంటం జూచితిగాఖి యేదొమిషచిక్కెం జాలునంచూరకో
వంటే జాలును మాటలేటికిక బాపయ్యా ! సుహృద్రత్నమా ! 3

మ॥ నిను బై వారలు క్రిందికంపి యవమానింపం దృణప్రాయ మీ
పని నాకంచెద నాత్మగౌరవము నే పాటించి ముమ్మాటికిన్
ధనమే పావనమంచు నెంచక యవిద్యాసాగరుండట్టులా
పని మానొ్కంటివి దేశరాజు పెదబాపయ్యా ! సుహృద్రత్నమా ! 4

మ॥ పినతండ్రుల్దులదూగువారు సిరులం బెంపొందె మీ మిత్రులున్
ధనవంతుల్మరి మామగారు తహసీల్దారుండు నీ కోరు మా
త్రన సాయంబవలీల గూర్చు రయినన్ రవ్వంతయున్ గోర వె
వ్వని సాయంబును దేశరాజు పెదబాపయ్యా ! సుహృద్రత్నమా ! 5

కా॥ నీ సౌజన్యముజూచి నీదువయసున్నీ సీమముంజూచియున్
నీ సామర్థ్యము జూచి దేహగతమౌ నీ రోగముంజూచి హా !
యీ సన్మార్గుడు మాకు దక్కడని నాడే వీడుకొన్నారుగా
యీ సన్మిత్రులు దేశరాజు పెదబాపయ్యా ! సుహృద్రత్నమా ! 6

మ॥ మదికిన్నచ్చినయట్టి ధర్మమును నమ్మ్ న్నమ్ము దానిన్ మహా
పదప్రాప్తించిన నాచరింపను మనోవాక్కాయకర్మంబులం
దెది సత్యంబగు దానినే నెరప నీకే చెల్లునయ్యా గుణా
స్పద ! సద్వర్తన దేశరాజు పెదబాపయ్యా సుహృద్రత్నమా ! 7

కా॥ ఎంతో శాంతము బూడిదయ్యె చదువెంతే నేలపాలయ్యె నెం
తెంతో మంచితనంబు దగ్ధమయి పోయెం జెల్లె నెంతో గుణం
బెంతో యీశ్వరభక్తి బొగ్గులయిపోయెన్ నాడు నీతో శ్మశా
నాంతర్భూముల నెంత నష్టమిది బాపయ్యా ! సుహృద్రత్నమా ! 8

మ॥ పరమాత్ముండు గుణైకలుబ్ధుడయినన్ భవ్యాత్ములున్ సత్క్రియా
నిరతుల్సద్గతి గాంతురంట నిజమేనిన్ సార్వకాలంబు నీ
శ్వర పాదద్వయ సేవకుండవగుటం బ్రాపించు నీ యాత్మ కీ
శ్వర సాన్నిధ్యము దేశరాజు పెదబాపయ్యా! సుహృద్రత్నమా! 9

ఈ పద్యములు "సత్యవాదిని" పత్రికలో ప్రకటింపబడెను. పంతులు గారు నా మీద విశ్వాసముగలిగి యుండిరనుట కిదియొక యుదాహరణము. ఒకసారి వారు నన్ను బిలిచి తోటలోని వితంతు శరణాలయమును సరిగా నడుపుటకు నుపద్రష్ట (Manager)ను నెవరినై న నెదుకవలెనండీ యని, "మీకు దృష్టి బాగుండినయెడల నేనాపనికి మిమ్ము నియోగించియుందు"నని పలికిరి. ఇదిగాక వారు చెరువు సోమయాజులుగారికిని, రాయవరపు రామ మూర్తిగారికిని గొంత ధన మప్పీయదలచి, యా సొమ్ము నాయొద్ద నుంచి పంతులుగారు భార్యను దీసికొని, బెంగుళూరు వెళ్ళిరి. ఆ సొమ్ము మొత్తము మూడువేలరూపాయలు. పంతులుగారి యాజ్ఞప్రకారము నా యా పురుషుల కా సొమ్ము బదుళ్ళిచ్చి వారు నాతో చెప్పినప్రకారము వారి యాస్తులు తనఖాలు వ్రాయించి, దస్తావేజులు రిజిష్టరు చేయించి, పోస్టులో వీరేశలింగముగారికి బెంగుళూరు బంపితిని. పంతులుగారికి నామీద విశ్వాసము గలదని చెప్పుటకు మీది యుదాహరణములు చాలునని తలంచెదను. పంతులుగారు 1908 వ సంవత్సరము మే నెల రెండవతేదీని రమారమి యేబదివేల రూపాయిల విలువగల స్థిరచర రూపకమైన సొత్తు నంతను హితకారిణీ సమాజమున కుచిలముగ నిచ్చిచేసి, దాని పరిపాలనా నిమిత్తము ధర్మకర్తల నేర్పరచి, దానశాసనము రిజిస్టరు చేయించిరి. ఆ ధర్మకర్తలు పదునొకండుగురు. ఆ ధర్మకర్తల సభకు యావజ్జీవము పంతులుగారు తామేయధ్యక్షులుగ నుండుటకును, రఘుపతి వెంకటరత్నము నాయుడుగా రుపాధ్యక్షులుగ నుండుటకును నిర్ణయించి మరి తొమ్మండుగురు సభ్యుల నేర్పరచిరి. అందు బి. ఏ, పరీక్షలయందుకృతార్థులై న్యాయవాదులలో గొప్ప పేరునొందిన ధారవాడ వెంకట కృష్ణారావుపంతులుగారుండిరి. కనుపర్తి శ్రీరాములుగారుండిరి. అప్పుడు శ్రీ పిఠాపురము మహారాజావారి యాంతరంగిక కార్యదర్శిగ నుండిన మొక్కపాటి సుబ్బారాయుడుగారుండిరి. లక్షాధిపతియై వీరేశలింగముగారిపేర పుస్తకభాండాగార మొకటి నడుపుచున్న నాళము కృష్ణారావుగారుండిరి. రాజమహేంద్రవరములో నిల్లువాకిలిగాని, స్థిరమైన యే యితరాస్తిగానిలేని, నిర్ధనుడగు

నన్ను గూడ పంతులుగారు ధర్మకర్తలలో నొకరినిగ జేర్చుట నాలోనాకే యాశ్చర్యమైనది. అట్లు చేయుటకు పంతులుగారికి నాయెడగల దయా విశ్వాసములేగాని మరి యేయితరకారణము లేదు. సమాజ వ్యవహారము లేవి వచ్చినను పంతులుగారు నాతో గూడ నాలోచించుచుండెడివారు.

1909 వ సంవత్సర ప్రారంభమున వీరేశలింగముగారు నాయొద్ద పుచ్చుకొన్న మధ్యమ పాఠశాలలో నయిదవఫారము, నారవఫారము దెరచి, సంపూర్ణమైన యున్నత పాఠశాలజేసిరి. దానికి "హితకారిణి హైస్కూలు" అని పేరుపెట్టిరి. మునుపు మా బడియున్న వాడ్రేపువారి గాడేఖానా యిరుకుగా నుండుటచే, శ్రీ పంతులుగారీ పాఠశాల నిన్నీసు పేటలో వాడ్రేవు కొండయ్యగారి యింటబెట్టి, యదియు జాలనందున, దొడ్డిలో కొన్ని తాటియాకుల పాకలు వేయించిరి. అప్పుడు మిషనువారి పాఠశాలకు ప్రధానోపాధ్యాయులుగానుండిన ముడియము సీతారామారావు గారిని హితకారిణిపాఠశాలకు పంతులుగారు ప్రధానోపాధ్యాయులుగా నియమించిరి. గత సంవత్సరము ప్రధానోపాధ్యాయులుగా నుండిన జయంతి గంగన్న పంతులుగారు ప్రథమ సహాయోపాధ్యాయులుగ నుండిరి. మిషను స్కూలులోనే పనిచేయుచున్న రామాప్రగడ వెంకటరామయ్యగారుకూడ హితకారిణి హైస్కూలులో నొక సహాయోపాధ్యాయులైరి. మా పాఠశాలలో పనిచేసి పిమ్మట మిషనుస్కూలునకు వెళ్ళిన యాకుండి వ్యాసశాస్త్రిగారిని, నాకు మిత్రులై నాబడిలో ఖాళీలేకపోవుటచే టవునుస్కూలులో పనిచేయుచున్న ప్రయాగ వెంకటరామశాస్త్రిగారిని సంస్కృతాంధ్ర పండితులుగ తప్పక నియోగింపవలసినదని పంతులుగారిని మొట్టమొదటి నుండియు నేను గోరుచుంటిని. పంతులుగారు నామాట త్రోసివేయక హితకారిణీ పాఠశాలలో వారిద్దరినే పండితులుగ నేర్పరచిరి. మొదటి నుండియు మాబడిలో పనిచేయుచున్న కుందూరు వెంకటరత్నముగారిని కూడ సహాయోపాధ్యాయులుగ దీసికొనిరి. హితకారిణి పాఠశాలా పరిపాలక సంఘములో పంతులుగారు నన్నుగూడ నొక సభ్యుడుగ నేర్పరచిరి. కాని దానికొక యంతరాయము వచ్చెను. నేనాదినములలో సభలలో స్వరాజ్యము విదేశవస్తు బహిష్కారము స్వదేశవస్తూపయోగము కావలెనని యుపన్యాసములిచ్చుచుండుటచే నుత్తరమండలముల యందప్పుడు పాఠశాలా పరీక్షాధికారిగానుండిన "యేట్సు" దొరగారు పంతులుగారిని గలుసుకొని, లక్ష్మీనరసింహముగారు రాజకీయములయం దెక్కువ పాలుగొను

చున్నారు. కావున నతడు మీ పాఠశాలా పరిపాలక సంఘములో సభ్యుడుగ నున్నపక్షమున, మీ పాఠశాల విద్యాశాఖవారి యంగీకారమును బడయుట కష్టమని చెప్పిరట. ఆసంగతి పంతులుగారు నాకుచెప్పి, యేమి చేయుదుమనిరి. క్షణమైన నాలోచింపక నేనిట్లు ప్రత్యుత్తరమిచ్చితిని. పంతులుగారూ! పాఠశాల వృద్ధిలోనికి వచ్చుటయే ప్రధానముగాని నావంటి వాడు సభ్యుడుగనుండుట ప్రధానముగాదు. కాబట్టి నేను మానివేసెదను. నా స్థానమందు మరియొకరి నేర్పరచుకొనుడని నేను వదలివేసితిని. పిమ్మట నొకటి రెండుసారులు పాఠశాలా పరిపాలక సంఘములో భాగి వచ్చెను. అప్పుడు దానికి ప్రయత్నముచేయుమని నన్ను కొందరుమిత్రులు గోరిరి. సభ్యుడుగ నుండుమని పంతులుగారు స్వయముగ నన్ను గోరిన గాని నేనుండనని చెప్పితిని. ఈమాట రఘుపతి వెంకటరత్నమునాయుడు గారితోకూడ చెప్పితిని. నేను సభ్యుడుగానున్న పక్షమున తమపాఠశాలకు నేదో నష్టము కలుగునని పంతులుగారి మనసులో మరణపర్యంతము నభిప్రాయమున్నట్లు నాకుదోచెను. అందుచేతనే పంతులుగారు చనిపోయిన తరువాత, నాయుడుగారొక హితకారిణి సభకు వచ్చినప్పుడు, మీరికనైన మా పాఠశాలా సంఘములో నుందురా? లేదా? యని యడిగిరి. మీరుండు మన్నారు గనుక నేనుందునని బదులుచెప్పితిని. తరువాత నేను కొన్ని సంవత్సరములు పాఠశాలా సంఘములో సభ్యుడుగ నుంటిని. పంతులు గారు జీవించియుండగా నేనా సంఘములో సభ్యుడుగా నుండుటకై ప్రయత్నము చేయకపోవుట, వారిమీద కోపముచేతగాదు. నా యునికివలన విద్యాశాలకు నష్టము కలుగునని పంతులుగారికి నభిప్రాయమున్నది, కనుక వారికా యభిప్రాయము తొలగి వారే నన్ను స్వయముగా గోరినప్పుడుందు నని నిశ్చయించుకొంటిని. పంతులుగారు నన్నెప్పుడుకోరలేదు. అందుచేత నేనుండలేదు.

1909 వ సంవత్సరమున మాయింట నొక విశేషము జరిగెను. మా రెండవ చెల్లెలైన యచ్చమ్మ రెండవకూతురు వెంకటరత్నమ్మ పదునొకండు సంవత్సరములు వయసు కలదయ్యెను. ఆమె వివాహమునకై తగిన వరుని వెదకుమని మా చెల్లెండ్రు పలుమారు నాతో చెప్పుచువచ్చిరి. పిఠాపురములో కోట రామమూర్తిగారి మూడవకుమారుడు ప్రవేశ పరీక్ష యందు కృతార్థుడై, కాకినాడవెళ్ళి, పిఠాపురము రాజాగారి కళాశాలలో వెంకటరత్నము నాయుడుగారియొద్ద ప్రథమశాస్త్రపరీక్షలో కృతార్థుడైనాడని

నాకు దెలిసినది. కోట రామమూర్తిగారితో మాటలాడి, యీ సంబంధము కుదురునేమో కనుగొనుమని, మా తమ్ముడు కృష్ణమూర్తిని పిఠాపురము పంపితిని. మా తమ్ముడు కోట రామమూర్తిగారితో మాటలాడివచ్చి నాకిట్లు చెప్పెను. మన సంబంధము చేసికొనుట రామమూర్తిగారి కిష్టమే. కట్నము వారి కక్కరలేదట; పిల్లవాడు, బి. ఏ. పరీక్షలో కృతార్ధుడగు వరకు చదువు చెప్పించుమని వారు కోరిరి. కట్నముక్రింద, నయిదారు వందల రూపాయ లొక్కమారు గ్రుమ్మరింప నక్కరలేదుగదాయని నేనా షరతున కొప్పుకొంటిని. వెంటనే రామమూర్తిగారు తమ కుమారుని మాయింటికి పంపిరి. నేనతనిని 1909 వ సంవత్సరములో బి. ఏ, తర గతిలో చేర్చితిని. అతని కన్నవప్రత్రములు, పుస్తకములు నిచ్చుటయేగాక, నెలనెలకు జీతము కట్టవలసినభారము నాపైబడెను. ఈషరతున కొప్పు కొనుట మాకు తరువాత కొంత బాధకమయ్యెను. ముందది పొడకట్టక పోవుటచే తొందరపడి యొప్పుకొంటిని. అతడు ప్రకృతిశాస్త్ర మభిమాన కళగా పుచ్చుకొనెను.

●

స్వీయ చరిత్రము

పదునారవ ప్రకరణము

రామమోహనపాఠశాల

ఆ సంవత్సరము (1909) ఫిబ్రవరినెలలో నేనొక సాహస కార్యము చేసితిని. నిమ్మజాతులయెడ నాకు మొదటినుండి సానుభూతి గలదు. వారు పడు కష్టములను గన్నులారజూచియు, చెవులారవినియు, పలుమారు జాలిపడుచుండెడివాడను. జన్మమెత్తినందుకు, నటువంటి దుర్గతిలోనున్న సంఘమునకు నేదేని యుపకారము చేయగూడదా యని నా కప్పుడప్పుడు తట్టుచువచ్చెను. వారివిషయమై యేమిచేయగలనా? యని యాలోచింపగా, నాలోచింపగా, ఎట్టకేలకు, నొక్కయుపాయము తట్టినది.

వారినిమిత్తమొక్క పాఠశాలబెట్టిన బాగుండుననితోచినది. రాజమహేంద్రవరమున నిమ్నజాతుల విషయమై పాఠశాలలు లేకపోలేదు. మునిసిపాలిటీవారు పంచముల నిమిత్తమై మూడో, నాలుగో పాఠశాలలుబెట్టి నడుపుచుండిరి. అట్టియెడ నా పాఠశాలవలన నేమి యుపయోగముండునని నాలో నాకే ప్రశ్న తోచినది. ఆ పాఠశాలలకంటె భిన్నమైన పాఠశాల స్థాపించిన యెడల నుపయోగపడునని నేననుకొంటిని. ఆ పాఠశాలలలో వట్టి తెనుగే కాని యింగ్లీషు చెప్పరు. నా పాఠశాలలో నే నింగ్లీషు చెప్పించినపక్షమున హరిజనబాలురు బాగుపడుదురని గట్టినమ్మకము నాకు గలిగినది. ఆనమ్మిక ననుసరించి 1909 ఫిబ్రవరినెలలో నేను నిమ్నజాతుల కొక పాఠశాల బెట్టితిని. దానికి "రామమోహన పాఠశాల"యని పేరిడితిని. సామాన్య పాఠశాలలకే యిండ్లు దొరకవుగదా? పంచమ పాఠశాలకెట్లు దొరుకును? ఇంటినిమిత్తము నేను ప్రయత్నముచేయగా నా మిత్రులైన చెరువు సోమయాజులుగారు నాకు సాయముచేసిరి. రాజమహేంద్రవరములో నార్యపురమువైపుననున్న గోదావరిగట్టుమీద, మా చెరువు సోమయాజులుగారికి కొంత స్థలముండెను. ఆస్థలములో నొక చిన్న పెంకుటి యిల్లుండెను. ఆయిల్లు మా నిమ్నజాతుల పాఠశాల నిమిత్తముపయోగించుకోవచ్చునని సోమయాజులుగారు నాతో చెప్పిరి. ఆగృహమున కద్దె నీయనక్కరలేదని గూడ వారు చెప్పిరి. ఎట్టెటో రెండు మూడుబల్లలు, నొక కుర్చీ, సంపాదించి, యాగదిలోబెట్టి రామమోహన పాఠశాలను స్థాపించితిని. అందు మూడు నాలుగు తరగతులు మొదట బెట్టితిని. చదువుకొనుటకు బాలురు త్వరగా చేరలేదు. బహుకష్టముమీద నలుగు రైదుగురు పిల్లలు చేరిరి. పిల్లలు చేరినతరువాత, నుపాధ్యాయుడు దొరుకుట కష్టమయ్యెను. బహు ప్రయత్నములమీత అందే సుబ్బారావను యువకుడు లభించెను. ఈయన మెరకపీధి తెలగ. ఆయన స్కూలుఫయినలువరకు చదువుకొనెను. ఆయనకు నెలకు పండ్రెండు రూపాయిలు జీతమిచ్చుపద్ధతిని నుపాధ్యాయుడుగ నియమించితిని. నాలుగవ తరగతి కత డింగ్లీషు చెప్పునట్లు నే నేర్పాటు చేసితిని. సుబ్బారావుగారు బాలురకు శ్రద్ధతోను, జాగ్రతతోను పాఠములు చెప్పుచువచ్చిరి. చెరువు సోమయాజులుగా రిచ్చిన యా గృహమునందు రామమోహన పాఠశాలను రెండు సంవత్సరములు నడపితిని. సోమయాజులుగారా గృహము నీయకపోయినపక్షమున, నద్దెలేకుండ మరియొక చెవరు నాకట్టి యిల్లు నిచ్చియుండరు. కాబట్టి, సోమయాజులుగారు నాకు

మిక్కిలి వందనీయులు. మరుచటి సంవత్సరమున సుబ్బారావుగారు నా పాఠశాలను విడిచి చదువుకొనుటకు వెళ్ళిరి. ఆయన స్థానమందు మేడా రాజయ్యగారను మరియొక తెలగాను నేను నియమించితిని. ఆయనయు సుబ్బారావుగారివలెనే జాగ్రత్తగ పనిచేసిరి. రెండవ సంవత్సరమున, బాలకులసంఖ్య కొంచె మధికమయ్యెను. చాల బాలకులకు జీతములేకుండ చదువు చెప్పించుటయేగాక, పలకలను, పుస్తకములనుగూడ నా డబ్బు ఖర్చుపెట్టి వారి కుచితముగ నిచ్చుచుంటిని.

పూర్వము, గోదావరీమండలములోని పశ్చిమభాగమునంతను దొరతనమువారు 1905 వ సంవత్సరమున కృష్ణామండలములో చేర్చిరి. కాబట్టి కొప్పూరుమొదలుకొని యేలూరువరకు నయిదుతాలూకాలు కృష్ణా మండలములో చేరెను. 1909 వ సంవత్సర మేప్రియలునెలలో కృష్ణా మండల రాజకీయసభ భీమవరములో జరుపుటకేర్పాటుచేయబడెను. ఆహ్వాన సంఘమునకు కొణితివాడ జమీందారుగారైన శ్రీ తాడూరి శ్రీరామజగన్నాధ రావుగారధ్యక్షులైరి. మహాసభకు శ్రీ మోచర్ల రామచంద్రరావుగారధ్యక్షులుగ నెన్నుకొనబడిరి. భీమవరముతాలూకాలో జేరిన వీరవాసరము నాస్వగ్రామగుటచే నేనాసభకుబోవ నిశ్చయించితిని. అది వేసవికాలముగుటచే కాలువలు కట్టివేసిరి. పడవలు నడుచుటలేదు. అప్పటికి భీమవరమునకు రైలుమార్గములేదు. అందుచేత నేనును, చిలుకూరి వీరభద్రరావుగారును, నాగుమాస్తాయైన జోస్యుల వెంకటేశ్వర్లును తాడేపల్లిగూడెము వరకు రైలుమీదవెళ్ళి, యచ్చటనుండి బండిమీద కొంతదూరమువెళ్ళి, యచ్చటనుండినడచి, నానాశ్రమపడి, సాయంకాలమునకు గరగపర్రు చేరితిమి. నాప్రాతమిత్రుడైన పాలకోడేటి సుబ్బారావు మాకాతిథ్యమిచ్చి, మమ్మాదరించెను. ఆరాత్రి యచ్చట సుఖనిద్రచేసి, మరునాడుదయమున భీమవరము జేరితిమి. రాజకీయసభ మూడుదినములు జయప్రదముగ జరిగెను. నరసాపుర ప్రముఖులుగూడ గొందరాసభకు దయచేసిరి. రాజకీయసభలో నేను విద్యావిషయమైన తీర్మానముమీద మాటలాడితిని. నాలుగవనాడు సంఘసంస్కరణసభ యయ్యెను. ఆసభకు రావుబహదూరు కందుకూరి వీరేశలింగముగారధ్యక్షులుగ నెన్నుకొనబడిరి. వీరేశలింగముగారు భార్యాసమేతముగ నంతకుముందురోజుననే వచ్చిరి. సంఘసంస్కరణసభగూడ జయప్రదముగానే జరిగెను. ఆసభలో నేను వితంతువివాహ విషయమైన తీర్మానముమీద మాటలాడితిని. సంఘసంస్కరణసభ జరిగిన

తరువాత నా ప్రాతమిత్రుడైన కాళ్ళకూరి నరసింహముగారు నన్ను తమ గ్రామమైన కోపెల్లె దీసికొనివెళ్ళిరి. ఆగ్రామములో సంపన్నుడైన యొక క్షత్రియుడుండెను. ఆయన నలువదియకరములభూమిని, భీమవరములో సత్రముపెట్టి, దానికీయదలచెనట. భీమవరవాసులు గొందరు, కోపెల్లె వాసులు గొందరు రాజుగారి దర్శనముచేసి "భీమవరములో నున్నత పాఠశాలలేదు; ఈతాలూకాకట్టి పాఠశాలయొకటి యవసరముకాబట్టి, మీరు సత్రమునుమాని భీమవరములో పాఠశాలను స్థాపించి మీరీయదలచిన నలువదియకరములభూమి దానికీయవలసినది." యని బహువిధముల ప్రార్థించిరట. రాజుగారు వారి మనవి సరకుచేయలేదట. నాచేతగూడ సలహా చెప్పించినపక్షమున లాభముండునేమోయని, కాళ్ళకూరి నరసిం హముగారు నన్నుదోడుకొనిపోయిరి. భోజనానంతరమున, నరసింహము గారును, నేనును రాజుగారి దర్శనమునకు బోతిమి. అచ్చట నెంతోసేపు పాఠశాలాస్థాపన వలనగలుగు లాభములను, సత్రములవలనగలుగు నష్టము లను బహువిధములనొక్కి రాజుగారితో చెప్పితిని. రాజుగారిమనసు లేశ మైన గరుగలేదు. చిట్టచివరాయన నాకు "ఆలోచించెదనులెండి," యని సమాధానముచెప్పిరి. కాలహరణమేగాని లాభములేదని మేమిరువురము రాజుగారియొద్ద సెలవుదీసికొనిపోయితిమి. వీరేశలింగముగారు భీమవరము విడిచి సకళత్రముగ వారి పెదతండ్రిభార్యను జూచుటకై విస్సాకోడేరు వెళ్ళి యచ్చటనుండి రాజమహేంద్రవరమువెళ్ళిరి. నేను నాస్వగ్రామమైన వీరవాసరమువెళ్ళి మాతమ్మునిపిల్లలనుజూచి యటనుండి రాజమహేంద్ర వరము వెళ్ళితిని.

నేను రాజమహేంద్రవరము వెళ్లునప్పటికి నా నిమిత్తమై యొక సభ గనిపెట్టుకొని యుండెను. న్యాపతి సుబ్బారావు పంతులుగారు 1908వ సంవత్సరమున జాతీయపాఠశాల స్థాపించి, తత్పరిపాలక సంఘమునకు దానే యధ్యక్షుడై నడుపుచుండెనని యీ వరకే చెప్పితిని గదా: ఆ పాఠ శాలకు వెంకటరమణ సరస్వతిగారు ప్రధానోపాధ్యాయులైయుండి, సభాధ్య క్షుని మాట పాటిచేయుక స్వతంత్రవృత్తితో నడచుచుండిరి. ఆయనచర్య సుబ్బారావు పంతులుగారి కిష్టములేకపోయెను. సుబ్బారావు పంతులుగారు సమస్తవిధముల గౌరవనీయులై, పాఠశాల నిమిత్తము కొంత సొమ్ము ఖర్చుపెట్టినను, వెంకటరమణ సరస్వతిగారు వారి మాటయందు లక్ష్యము లేక నడచుటయు, పరిపాలక సంఘములోని సభ్యులు గొందరు సరస్వతి

గారి పక్షమే యగుటయు జూచి సుబ్బారావు పంతులుగారు పాఠశాలా సంబంధము వదలుకొని, యా పాఠశాలను నగరజనుల కప్పగించవలెనని పురమందిరము (Town hall) న నొక బహిరంగ సమావేశము చేసిరి. ఆ సభ రేపు జరుగుననగా నేను వీరవాసరమునుండి రాజమహేంద్రవరము వచ్చితిని. నాటి బహిరంగసభ కధ్యక్షుడుగ నుండుమని సుబ్బారావుపంతు గారు నన్నే కోరిరి. నేను జాతీయపాఠశాలా పరిపాలక సంఘములో సభ్యుడనైనగాను. నేను గొప్ప న్యాయవాదిని గాను. వర్తకుడను గాను. ధనికుడనుగాను. అట్టివానిని నన్ను సుబ్బారావు పంతులుగారేల సభ కధ్యక్షుడుగ నుండుమని కోరిరో స్పష్టముగ దెలియదు. నేను పట్టణ ములో గొంత పలుకుబడి గలవాడననియు నా యుపన్యాసములబట్టియు నా నడతను బట్టియు, నగరవాసులకు నా యెడ గౌరవము గలదనియు, సుబ్బారావు పంతులుగారు తలంచిరి. నేను సభాధ్యక్షుడగానున్న పక్షమున సభ నెన్నుదిగా జరుగునని తలంచి గాబోలు సుబ్బారావుపంతులుగారు నన్ను గోరియుండురు సభ జరిగెను. నే నధ్యక్షుడనైతిని. సుబ్బారావు పంతులు గారు మొట్టమొదటలేచి జాతీయపాఠశాల చరిత్ర చెప్పి దానితో సంబం ధము కలుగజేసికొనుటకు దమకిష్టములేదని వచించి వదలుకొనిరి. అప్పు డొకరిద్దరు సుబ్బారావు పంతులుగారికి విరుద్ధముగ మాటలాడి కలకలము గలిగించిరి. గాని నేనది వారించి గొడవలేకుండ సభ సమాప్తము చేసి తిని. ఆ తరువాత జాతీయపాఠశాల అజ్జరపు వీరయ్యగారి మేడకొట్లలోనికి మార్పబడి, యొక విధముగా సాగుచుండెను. మహారాజశ్రీ గంటిలక్ష్మన్న గారి యొక్కయు, దామెర్ల వెంకటరమణరావుగారి యొక్కయు, పందిరి వీరన్నగారి యొక్కయు ప్రోత్సాహముచేత జాతీయపాఠశాలా పరిపాలక సంఘములో నే నొక సభ్యుడనైతిని వీరన్నగారు వర్తకులదగ్గర పాఠ శాల నిమిత్తము కొన్ని మామూళ్ళ నేర్పరచిరి. గంటి లక్ష్మన్నగారు నెలకు నిరువది రూపాయలు చొప్పున చందానిచ్చి పాఠశాలను పోషింప సాగిరి. దామెర్ల వెంకటరమణరావుగారి బావమరదియైన గాడిచర్ల రామ మూర్తిగారు మొదట మునిసిపలు స్కూలులో నుపాధ్యాయుడయ్యు, జాతీయ విద్యాభిమానముచేత నాపని మానుకొని, జాతీయపాఠశాలలో నొక యుపాధ్యాయుడై, వర్తకుల యొద్ద నొమ్ము వసూలుచేయుచు, జాతీయ పాఠశాలాభివృద్ధికై యావజ్జీవము పాటుబడెను. అజ్జరపువారి కొట్లలో గూడ వీలుగ లేనందున, జాతీయపాఠశాల రంగిరీజుపేట మొదటనున్న

యొక మహమ్మదీయ గృహమునకు మార్చబడెను. ఆరంభములో నున్న ట్లది యున్నతపాఠశాలగాక మధ్యమపాఠశాల చేయబడెను. అపరాలకొట్లు మొదలైన కొట్లవద్ద మధ్యమధ్య సభలనుజేసి జాతీయపాఠశాల నిమిత్తమై చందాలను వసూళ్లు చేయుచుండెడివాడను దీనికి గాడిచర్ల రామమూర్తి గారు నాకు సహాయము జేయుచుండిరి. న్యాపతి సుబ్బారావు పంతులుగారు జాతీయపాఠశాలాధ్యక్షులుగా నున్నకాలముననే, వర్తకు లమావాస్యనాడు కొట్లు గట్టివేసి వ్యాపారముచేయక, విశ్రాంతి సుఖము ననుభవింపజొచ్చిరి. ఆ యాచారమే యిప్పటికి జరుగుచున్నది.

1909 వ సంవత్సరములో ద్వితీయభాగమున నాకు గొంతసొమ్ము బదులిమ్మని శ్రీ పిఠాపురము రాజుగారికి నేనొకయుత్తరము వ్రాసికొంటిని. కాని వారు నాకుబదులిచ్చుటకుమారుగా పేయిరూపాయిలు విలువగల యొక చెక్కును బ్యాంకుమీదికి నాకుచితముగనిచ్చిరి. అది నాపేర టపాలోపంప బడెను. ఆ చెక్కును మార్చుకొని సొమ్మును వాడుకొనుట, కొన్ని ఆకారణములచేత నప్పటిపరిస్థితులనుబట్టి నాకిష్టములేకపోయెను. అందు చేత నేనాచెక్కు మార్చుకొనక దిరుగుటపాలో మరల దివాణము వారికి పంపివేసితిని. ధనము కావలసిన నేను మహారాజావారు దయాపూర్వకముగ, నుచితముగ, బంపిన యాపెద్దమొత్తమును వినియోగించు కొనక త్రిప్పివేయుటకు గారణమేమని చదువరులు సంశయింపవచ్చును. అప్పటిదినములలో నాకొకపిచ్చియభిప్రాయముండెను. ఎవరియొద్ద నుచితముగా ధనము గ్రహింపకుండ జీవితముగడుపుట సర్వోత్తమమని నామనసులో నొకతలంపు పుట్టినందున నేనాచెక్కును త్రిప్పివేసితిని. అది నిశ్చయముగా వెర్రియభిప్రాయమే! ఏమన నేనా నీమమునుసరిగా బాటింపలేక పలుమారులు ధనముచితముగా శ్రీ పిఠాపురము మహారాజావారియొద్దను, ధనాఢ్యులైన మరికొందరు మిత్రులయొద్దను స్వీకరింపక తప్పినదిగాదని చెప్పుటకును, ప్రతిజ్ఞాపరిపాలనము చేయలేనందుకు లజ్జపడుచు, నామనో దౌర్బల్యమును నేనేయొప్పుకొనుచున్నాను. అప్పుడు పిఠాపురముసంస్థానమునకు నుదయగిరి రామారావుగారు దివానుగనుండిరి. ఆసంవత్సరమున రామారావుగారు శ్రీ రాజావారి జన్మదినోత్సవముచేసిరి. అప్పుడు నాకు గూడ నాహ్వానమువచ్చినందున నేనాసభకుబోయి, రాజావారి యుదార గుణాదులగురించి మాటలాడితిని.

ఆసంవత్సరమున, శ్రీ పోలవరము జమీందారుగారి ప్రథమభార్య యైన శ్రీమతి బంగారమ్మగారు మిక్కిలి జబ్బుపడి, యొక మరణశాసన మును స్వహస్తముతోవ్రాసిరి. ప్రథమభార్యయనుటకు గారణమేమన, జమీందారుగారు బంగారమ్మగారితో గొన్ని యభిప్రాయభేదములుగలిగి, యామెనువిడనాడి, 1905 వ సంవత్సరమున మరియొకపిల్లను వివాహ మాడిరి. అప్పటినుండియు శ్రీమతి బంగారమ్మగారు పుట్టినింటనే రాజమ హేంద్రవరములో శ్రీరాజా వాడ్రేపు వేంకటకృష్ణారావుబహద్దరువారి గృహ మందే గాలక్షేపముచేయుచు, రోగపడి, మంచిగాలినిమిత్తమాలకాటు తోటలో నివసించుచు, నచ్చటనే మరణశాసనమునువ్రాసెను. ఆమె యాశాసనములో తన స్త్రీ ధనము రమారమి ముప్పదివేలరూపాయిలు రాజమహేంద్రవరము దొరతనమువారి కళాశాలలో చదువుకొను నియోగి విద్యార్థుల సహాయార్థము వినియోగింపవలసినదని వ్రాసెను. ఆమె దన సొమ్ము ధర్మార్థము వినియోగింపదలచుకొన్నదనిదెలిసి, జాతీయపాఠశాలా పరిపాలకసంఘమువారు తమ పాఠశాలకుగూడ కొంతసొమ్ము నామెనడుగ దలచి యాలకాటుతోటకు బోయిరి. అట్లువెళ్ళినవారు నేనును, దామెర్ల వెంకటరమణరావుగారు, దుప్పూరి వీరభద్రయ్యగారు, పందిరి వీరన్నగారు, గంటి లక్ష్మన్నగారు మొదలైనవారు. ఆమె మాపాఠశాలకేమియు నీయక తలచుకొన్నప్రకారము నియోగివిద్యార్థుల యుపయోగార్థమే యిచ్చెను. పట్టపరీక్షసిద్ధుడై యేడాదికి లక్షరూపాయలు రాబడివచ్చు సంస్థానమున కధిపతియై, చెన్నపురి శాసననిర్మాణసభలో సభ్యుడై, దేశమందు విఖ్యాతి గాంచిన శ్రీ పోలవరము జమీందారుగారికంటె, భర్తచే బరిత్యజింపబడి పుట్టినింట గృశించుచు, వియోగదుఃఖము ననుభవించుచు, జీవితశేషము గడిపిన యీ బంగారమ్మగారే శ్లాఘాపాత్రమైనట్టియు, దేశోపకారమైనట్టియు మేలుపనిచేసి వందలకొలది నియోగివిద్యార్థుల పురోభివృద్ధికి హేతుభూతు రాలయ్యెను.

1909 వ సంవత్సరమున నేను గయోపాఖ్యానమును సవరించి, తొల్లిటి యొడంబడిక ప్రకారము సత్యశోలు గున్నేశ్వరరావుగారికిచ్చితిని. సవరించుటయనగా చాలవరకు నూతనముగా వ్రాయుటన్నమాట. వచనము మునుపటిదేగాని పద్యము లించుమించుగా నన్నియుగ్రొత్తవే. అచ్చుపడిన వెంటనే చాలప్రతులు ఖర్చుపడెను. గున్నేశ్వరరావుగా రొక్కొకకూర్పున కయిదువేల ప్రతులకుదక్కువ యచ్చు వేయించలేదు. ఈలాగే నాప్రసన్న

యాదవ, పారిజాతాపహరణ నాటకములుగూడ గున్నేశ్వరరావుగా రచ్చు వేయించి చాల ప్రతులమ్ముకొనిరి. నా నాటకము లన్నిటిలో గయోపాఖ్యా నమే జనాకర్షకమైనది. ఆ గ్రంధములు శతగపప్పువలె ఖర్చుపడినవనుట యతిశయోక్తిగాదు. ఇప్పటికి లక్షప్రతులకంటె నధికముగ ఖర్చుపడినవి. గంటి లక్ష్మన్నగారొకసారి నాతోమాటలాడుచు "Your Gayopakhyanam has record sale" అనివచించిరి. పిఠాపురము దివానుగారైన మొక్క పాటి సుబ్బారాయుడుగారు "Gayopakhyanam is a master peace" అని పలికిరి. గయోపాఖ్యానము శ్రేష్ఠమైన గ్రంధమని దీనిభావము. నా మిత్రులైన పోతుకూచి సుబ్బయ్యగారు స్వగ్రామమయిన తాడేపల్లిగూడెము తాలూకాలోని కన్నాపురమువెళ్లుచు, బండియెక్కి కాలక్షేపమునకు బండివాని నేదైన పాడుమని యడిగిరట. వెంటనే వాడు, "అల్లుడా రమ్మని యాద రమ్మనబిల్వ బంపు మామనుబట్టి జంపగలమె" యన్న పద్యము నెత్తు కొని పాడెనట. సుబ్బయ్యగారు రాజమహేంద్రవరమువచ్చి నన్నొకసారి కలుసుకొని, "అయ్యా! పంతులుగారు, మీ గయోపాఖ్యాన మాబాల గోపా లముచేత సేవింపబడుచున్నదండి" యని బహూకరించిరి. తెనుగుదేశ ములో గయోపాఖ్యానము ప్రయోగింపని రంగస్థలములేదని నానమ్మకము. గొన్ని స్థలములలో గొందరు పెద్దమనుష్యులు గయోపాఖ్యాన నాటక విషయమై పోటీపరీక్షలుపెట్టి, కృష్ణార్జునపాత్రలు పలువురచేత ధరింపచేసి, వారిలో శ్రేష్ఠముగ నభినయించినవారికి బంగారు పతకములు, మొదలైన బహూమతులిచ్చుచు, వచ్చిరి. గయోపాఖ్యాన మచ్చుపడి వచ్చినవెంటనే గున్నేశ్వరరావుగారు, నాగేశ్వరరావుగారు విడిపోకయున్నకాలమున రాజ మహేంద్రవరములో మొదటిసారి ప్రయోగించిరి. దానిని చూచుటకు పడమటి గోదావరిజిల్లాలోని చేబ్రోలు, తాడేపల్లిగూడెము ప్రాంతముల నుండిగూడ జనులు వచ్చిరట. ఆనాడు నాటక ప్రదర్శనమువల్ల పదు నాలుగు వందల రూపాయలువచ్చెను. ఆ నాటకమునందు జనులకంత యభిరుచి యేల గలిగెనో? నేనే చెప్పజాలను. జయంతి రామయ్య పంతు లుగా రాంధ్రవాఙ్మయమును గురించి యీమధ్యనే యొక వ్యాసమువ్రాసి, యందు గయోపాఖ్యాన నాటకమునుగూర్చి చక్కగ విమర్శించిరి. నా నాటక ములలో గయోపాఖ్యానము శ్రేష్ఠమని ప్రజలభిప్రాయపడుదురు. ప్రసన్న యాదవము శ్రేష్ఠమని నా యభిప్రాయము.

1909 వ సంవత్సరమున "మింటోమార్లే" రాజకీయసంస్కరణలు మన దేశమునకు వచ్చెను. అప్పుడు చెన్నరాష్ట్ర పక్షమున న్యాపతి సుబ్బారావు పంతులుగారు గవర్నరుజనరలుగారి శాసన నిర్మాణసభలో సభ్యుడుగ నెన్నుకొనబడిరి. ఆ వార్త యొకనాటి సాయంకాలము టపునుహాలులో నుండగ నాకు దెలిసెను. వెంటనే, నేను సంతోష పారవశ్యమున నా జేబులో రెండు రూపాయలుండగ దీసి మిఠాయి దెప్పించి మిత్రులకు బంచిపెట్టించితిని. రాజకీయ విషయములలో శ్రీ న్యాపతి సుబ్బారావు పంతులుగారివల్లను, సాంఘిక విషయములలో వీరేశలింగముగారివల్లను, రాజమహేంద్రవరమునకు హిందూదేశమున గొప్ప పేరు వచ్చెను. అందు చేత వారిపురియెడ నాకిప్పటికిని భక్తిగౌరవములు గలవు. ఆ మింటో మార్లే సంస్కరణములనుబట్టి శ్రీ పోలవరము జమీందారుగారు జమీందార్లపక్షమున చెన్నపురి శాసన నిర్మాణసభకు సభ్యుడుగ నుండుటకు ప్రయత్నించుచున్నట్లు నాతో తంజాపూరు రఘునాధరావుగారు చెప్పిరి. అప్పుడు నేను "జమీందారుగా రా పదవికి దగినవారు, నేను గూడ వారికై ప్రయత్నించెదను." అని ప్రత్యుత్తర మిచ్చితిని. ఆ మాటలు రఘునాధ రావుగారు జమీందారుగారితో చెప్పిరి. వారికిని నాకును చిరకాలమునుండి మాటలు చూపులు లేకపోయినను వారు పూర్వవైరమును బాటింపక, నా వేర నొక లేఖ వ్రాసిరి. అందులో వారు నా యుదార శీలమునకు నన్ను మెచ్చిరి.

1909 వ సంవత్సరములో చివరభాగమున మునుపు నడుపుచున్న "మనోరమ" యను మాసపత్రికకు దోడుగా నొక వారపత్రికను గూడ నెలకొల్పవలయునని నాకు సంకల్పము కలిగెను. సంకల్పము గలిగిన తోడనే దానికి వలయు ప్రయత్నములు చేయసాగితిని. నాళ్ళచెరువు కృష్ణారావుగారని యొక మాధ్వ బ్రాహ్మణుడు రాజమహేంద్రవరములో నప్పుడుండెను. ఆయన, నా యొక్కయు, కుందూరు వేంకటరత్నముగారి యొక్కయు సహాయమున నొక బ్రాహ్మణ వితంతువును వివాహ మాడెను. చెన్నపురినుండి వెలువడుచున్న "ఆంధ్ర ప్రకాశిక" యను వారపత్రిక నిర్వహణమున గొంతకాల మాయన బనిచేసిరి. పత్రికాసంస్థాపకులు ఫలానా ముద్రాయంత్రములో పత్రిక యచ్చుపడుచున్నదనియు, ఫలానావారు ప్రకటించుచున్నారనియు, నిద్దరుపురుషులచేత ప్రమాణ పత్రములు దాఖలుచేయించవలెను. నే స్థాపింపదలచిన పత్రిక మనోరమా ముద్రా

యంత్రములో ముద్రింపబడును. గనుక ముద్రాపకుడుగ నేను ప్రమాణ పత్రముదాఖలుచేసితిని. నాళ్ళచెరువు కృష్ణారావుగారు పత్రికానిర్వహణమందు నాకు దోడుపడుటకై నిరువదియైదు రూపాయలు జీతము నియమించి, పత్రికా ప్రకాశకుడుగా నాయనచేత సబుకలెక్టరుగారియొద్ద ప్రమాణపత్రము దాఖలు చేయించితిని. అప్పటి నిబంధనల ప్రకారము, రాజమహేంద్ర వరము సబుకలెక్టరుగారియొద్ద ప్రమాణపత్రము దాఖలుచేయుటకు వీలుం డుటచేత, సచ్చటనే దాఖలుచేసితిని. ఇప్పుడట్లుగాక జిల్లాకలెక్టరుగారి యొద్దనే దాఖలుచేయవలెను. నా వారపత్రికకు "దేశమాత" యని పేరు పెట్టితిని.

1910 వ సంవత్సరము జనరిలో ప్రమాణపత్రము దాఖలుచేసి, పత్రికా ప్రకటన మారంభించితిని. పత్రికలో ముఖ్యవ్యాసము (Editorial) వృత్తాంతములుగాక వారమునకొక చిత్రకథయు, నొక హాస్యలతయుగూడ ప్రకటింపబడజొచ్చెను. ముద్రాయంత్రములో గొన్ని యక్షరములు, మొద లైన కొన్ని సామానులు కావలసియుండుటచేతను కొంత కాగితము దెప్పించి నిలువయుంచవలసి యుండుటచేతను ద్రవ్యము కొంత కావలసి వచ్చెను. చిరకాలమునుండి నాకు పరిచితుడై, నాయెడ దయాభిమానములు గలిగి, నన్నాదరించుచున్న శ్రీ న్యాపతి సుబ్బరావు పంతులుగారికడకు బోయి పత్రికా నిర్వహణార్థము నాకు వేయిరూపాయిలు బదులిమ్మని కోరితిని. వెంటనే వారు సందేహింపక దయాపూర్వకముగ నాకాసొమ్ము బదులిచ్చిరి. కాని వారికి నేనా సొమ్ముతీర్చి ఋణవిముక్తుడను కాలేక పోతిని. వారు నాచేత మూడు సంవత్సరముల కొకసారి వడ్డి తగ్గించి, యేదో కొంతమొత్తమునకు నోటు వ్రాయించుకొని, సంతోషించిరేగాని నన్నెన్నడు తొందరపెట్టలేదు. సుబ్బారావు పంతులుగారు నావద్దనుండి సొమ్ము దీసికొనుట కవకాశమున్నను, నామీద దయచేతనో, మరెందు చేతనో, యా యవకాశమును బురస్కరించుకొని నాయొద్దనుండి సొమ్ము రాబట్టుకొనలేదు. అవకాశమెట్టిదనిన వినుడు. "ఆర్యచరిత"మని యొక గ్రంథముగలదు. అది సంస్కృతములో నున్నది అందు మన పురాణ ములనుండియెత్తి కొన్నికథలు వ్రాయబడినవి. వాల్మీకి ప్రణీతమైన రామా యణములో నిరువదినాలుగువేల శ్లోకము లున్నవిగదా! అందు వర్ణనలు దీసివేసినయెడల వట్టి కథాభాగము రమారమీ యేడువందల శ్లోకములుం డును. ఆ యేడువందల శ్లోకములు చదివిన పక్షమున రామాయణకథ

యంతయు బోధపడును. హైకోర్టు న్యాయమూర్తిపదవి నధిష్ఠించి, కీర్తి శేషులైన, వి. కృష్ణస్వామి అయ్యరుగారు సంస్కృత భాషాభిమానులై పండితులచేత రామాయణములోని కథాభాగ మేడువందల శ్లోకములనెత్తి వ్రాయించి, మార్కండేయ పురాణములోని హరిశ్చంద్రకథ, శిబిచక్రవర్తి కథ, మొదలైనవాటినిగూడ నెత్తి వ్రాయించి, "ఆర్యచరితమ"ను పేర నాగరిలిపిలో గ్రంథమును ప్రకటించిరి. సుబ్బారావు పంతులుగారా గ్రంథ ముసు సంపాదించి యందలి రామాయణకథా భాగమును చదివించుకొని విని బాగున్నదని తోచుటచే దాని నాంధ్రీకరింపుమని నన్నుగోరి యాగ్రం ధము నాకిచ్చిరి. ఆ రామాయణభాగమును నే నాంధ్రీకరించితిని. అందు నిమిత్తము నాకు వారు మూడువందల యేబదిరూపాయిలు బహుమాన మిచ్చిరి. దానికి కాపీరైటుహక్కు సుబ్బారావుపంతులుగారు తమచే స్థాపింపబడిన హిందూసమాజమునకై నాయొద్ద దీసికొనిరి. ఈ మూడు వందల యేబది రూపాయలు నాబాకీలో జమ కట్టుకొన్నపక్షమున నేను సంతోషముతో నంగీకరించి యుందును. ఆ పుస్తకమునకు వారు వాల్మీకి రామాయణ సంగ్రహమని పేరుపెట్టి ప్రకటించిరి. వారి పలుకుబడిచేత దానిని వారు హయ్యరు ఎలిమెంటరీగ్రేడు పరీక్షకు పఠనీయగ్రంథముగా బెట్టించిరి. దానివలన వచ్చిన సొమ్ము వారి సొంతమునకు దీసికొనక, హిందూ సమాజమునకే యిచ్చివేసిరి. వారి ప్రోత్సాహముచేత నేను రామాయణ గ్రంథకర్తనుగూడ నైతిని. వారాగ్రంథము రెండుసారు లచ్చు వేయించిరి. ఈలాగే సుబ్బారావు పంతులుగారు నన్ను భాగవతములోని కథలను వచనముగా వ్రాయమని కోరిరి వారికోరిక ననుసరించి నేను భాగవతములోని ముఖ్యకథలను భాగవత కథామంజరియని పేరుపెట్టి, వచనకావ్యముగ రచియించితిని. అదియు నచ్చులో రమారమీ మూడు వందల యేబది పుటలైనది. తన్నిమిత్తము నాకు పంతులుగారు మూడు వందల యేబది రూపాయలు బహుమానమిచ్చి, దాని కాపీరైటుహక్కును నాచే వారు హిందూసమాజమునకే దీసికొనిరి. ఇవిగాక, వారు నాచే ధర్మ విజయమని మరియొక గ్రంథము వ్రాయించిరి. దాని చరితము చెప్పెద వినుడు. చెన్నపురమందు రావుబహదూరు పనప్పాకము ఆనందాచార్యుల వారని గొప్ప హైకోర్టు న్యాయవాదిగారుండిరి. ఆయన విద్యావినోది. ఆయన మన భారతకథ నింగ్లీషులో సంగ్రహముగ నొకనవలగ, మిక్కిలి చమత్కారముగ వ్రాసి ప్రకటించిరి అందలి యింగ్లీషుశైలి మిక్కిలి

చులకనై, హృదయంగమముగా నుండును. ఆ గ్రంథమునకు వారు "Virtues Triumph" యని పేరుపెట్టిరి. ఆ గ్రంథమును సుబ్బారావు పంతులుగారు చదివి, మిక్కిలి మనోహరముగానున్నదని తలంచి, దాని నాంధ్రీకరింపుమని నాకిచ్చిరి. ధర్మవిజయమని దానికి పేరుపెట్టి, నేను వచనముగ నాంధ్రీకరించితిని. తన్నిమిత్తము వారు నాకు మూడుపందల రూపాయల నిచ్చిరి. మొత్తముమీద వారు నాకు మూడు గ్రంథములు ముట్టచెప్పిరి. ఈ వేయిరూపాయిలు వారు నా చాకిక్రింద జమకట్టుకున్న పక్షమున, నాకు వారు బదులిచ్చిన యసలు వేయిరూపాయిలు తీరియుండును అట్లుచేయక, వారు నాకా సొమ్ముచ్చుటచేత, వారి యౌదార్యము భాషాభిమానము హిందూ సమాజముమీద ప్రేమయు వెల్లడియగుచున్నది. ఈ ధర్మవిజయమును పుస్తకమును సుబ్బారావు పంతులుగా రచ్చువేయించి ప్రకటించనేలేదు. వ్రాతప్రతి వారింటనేయున్నది. వారి కుమారులైన న్యాపతి కామేశ్వరరావుగారైన నచ్చువేయించి, ప్రకటించి, తండ్రిగారి సంకల్పము నెరవేర్తురేమో? తెలియదు.

మారెండవ చెల్లెలైన యచ్చమ్మకిద్దరు కుమారై లుగలరనియు నందు పెద్దదియగు సుబ్బమ్మను రామస్వామి మేనల్లుడగు రావూరి రామకృష్ణయ్య కిచ్చి, 1908 వ సంవత్సరము వివాహముచేసితిననియు, నిదివరకువ్రాసితిని. మాచెల్లెలు రెండవకుమార్తెయగు వెంకటత్నమ్మ పండ్రెండు సంవత్సరముల వయసుగలదయ్యెను. కాబట్టి వివాహము చేయవలసిన యీడువచ్చినది. పిఠాపురమునుండి కోట శేషగిరిరావను పెండ్లికుమారునిదెచ్చి మాయింటబెట్టుకొని, బి. ఏ. తరగతిలోచేర్చి, చదువుచెప్పించుచుంటినని గూడ వ్రాసియుంటిని. ఆవివాహము 1910 వ సంవత్సరము జూనునెలలో చేసితిని. ఆవివాహములోనే నాపెద్దమే కోడలు సుబ్బమ్మకుపనస్సంధానము చేసి గాపురమునకు బంపితిని రామకృష్ణయ్య స్వదేశీయవస్త్రవ్యాపారము మానివేసి, చెన్నపురిలో పైద్యకశాస్త్రాలలోజేరి చదువుకొన నిశ్చయించి నందున మాచెల్లెలు అచ్చమ్మను, మేనకోడలిని, రామకృష్ణయ్యను నతని కోరికప్రకారము చెన్నపురము పంపితిని. ఆ విద్యాభ్యాసమునిమిత్తము గావలసినసొమ్ము తన మిత్రులలో నేర్పాటుచేసుకొని, తెచ్చుకొనెను, గాని, నేనతనికి సహాయముచేయలేదు. రామకృష్ణయ్య చెన్నపురిలో నైదుసంవత్సరములు జదివెను. అచట భార్యాసమేతముగా కొంతకాలము మాత్రమే

యుండెను. అతడు చెన్నపురిలో నొంటిగానున్నకాలమున మాచేనకోడలు మాయింటియొద్దనే యుండెను.

కోట శేషగిరిరావు 1909 వ సంవత్సరము జనవరి మొదలుకొని 1910 మే, యేప్రియలు నెలలవరకు జూనియరు బి. ఏ. తరగతిలో జదివెను. 1909 వ సంవత్సరము వరకు విద్యార్థులు కళాశాలలో జనవరిలో జేరుచుండిరి. డిశంబరునెలలో పరీక్ష లగుచుండెను. ఆ సంవత్సరము పూర్వపు నిబంధనలుమారి, క్రొత్తనిబంధన లమలులోనికి వచ్చెను. ఈ నూతన నిబంధనల ప్రకారము కళాశాలలు జనవరిలోగాక జూలైలో తెరువబడుటయు, విద్యార్థులనప్పుడే చేర్చుకొనుటయు, పరీక్షలు మార్చినెలలో జరుగుటయు, నేప్రియలు, మే, జూనునెలలలో కళాశాలలు మూయబడుటయు సంభవించెను. ఈ నిబంధనలమార్పువలన శేషగిరిరావు బి. ఏ. మొదటితరగతిలో 1909 వ సంవత్సరము మొదలు 1910 వ సంవత్సరము మార్చి మాసాంతమువరకు చదువవలసివచ్చెను. అతని నిమిత్తము కళాశాలలో జీతమెక్కువ కట్టవలసివచ్చెను. కష్టపడి పదిహేను మాసములు జూనియరు తరగతిలో జదివినను శేషగిరిరావాయేకు సంవత్సరాంతము పరీక్షలో తప్పిపోయెను. అందుచేత జూలైనెలలో మరల జూనియరు తరగతిలోనేచేరి యతడు చదువవలసినవాడయ్యెను. ఇందువలన నాకెక్కువచిక్కు సంభవించెను. ఏలయన, శేషగిరిరావునకు భోజనముగాక, బట్టలు, పుస్తకములు, జీతములు నీయవలసినవాడనునేను. వివాహసంబంధములలో గృహస్థుడు తనయల్లునకు ముందుగానేదో కొంత కట్నము నిశ్చయించుకొని యిచ్చుట మంచిదిగాని, చముపుచెప్పించుటకు వాగ్దానముజేసి పరుని యింటబెట్టుకొనుట మంచిదిగాదు. ఏలయన వరుడు పరీక్షలో గడతేరక తప్పిపోవుచున్నపక్షమున, వాని నిమిత్తము వందల కొలది డబ్బుపోసి, చదువు కొనసాగించుట మిక్కిలి కష్టము. అదిగాక ప్రతిగృహములో నేవోకొన్ని లోపములుండును. ఈ క్రొత్తవరుడు లోపములను గ్రహించి యత్తవారిని లోకువచేయును. అతనిస్వభావము మంచిదైనపక్షమున నత్తవారికి సుఖముగాని యతడు ధూర్తుడైనపక్షమున నత్తవారికి మిక్కిలి చిక్కుకలుగుచుండును. మాశేషగిరిరావు స్వభావముచేత మిక్కిలి కోపదారి. అందుచేత, నేనతనిపల్ల మిక్కిలి చిక్కులుపడవలసినవాడనైతిని. అతడు 1910 వ సంవత్సరము జూలై మొదలుకొని 1911 మార్చివరకు, బి. ఏ. జూనియరులో చదివెను. సంవత్సరాంత

పరీక్షలో కడతేరి సీనియరుతరగతిలోనికి వెళ్లెను. 1911 జూలై మొదలు కొని 1912 సంవత్సరము మార్చివరకు, బి. ఏ. సీనియరు తరగతిలో జదివెను. అప్పుడు పరీక్షనిమి త్తము యేబదిరూపాయిలిచ్చి చెన్నపట్టణ మతనిని బంపవలసివచ్చెను. రెండుసంవత్సరములలో సమా ప్తముగావల సిన యతని బి. ఏ. చదువు మొ త్తముమీద మూడుసంవత్సరముల యారు మాసములు పట్టెను. ఆదినములలో నేను ధనవిషయమై మిక్కిలి చిక్కులు పడితిని. నాపు స్తకముల యమ్మకములవల్ల రాబడిచేత నేనెట్టెటో కుటుంబమును పోషించుకొనుచుంటిని. నాపు స్తకములు తరుచుగా ట్రయి నింగు పరీక్షలకు విశ్వవిద్యాలయముల పరీక్షలకు బఠనీయగ్రంథములుగా నియమింపబడుచువచ్చెను. దానిపలన నాకేబేట కొంతధనము వచ్చు చుండెను. అయినను ప్రతినెలకు సరిగా జీతముగావచ్చునట్లు రాబడిలేదు. కనుక ధనమువచ్చినప్పుడు ప్రాతయప్పులు తీర్చుకొని యొకవిధముగా, గాలక్షేపము చేయుచుంటిని.

కుటుంబ భారమునకు దోడుగా, నాకు ముద్రాక్షరశాలా నిర్వ హణ భారమును, నొక మాసపత్రికను, నొక వారపత్రికను నిర్వహింప వలసిన భారము గూడ నా నె త్తిపై బడెను. అది యటుండగా నిమ్మ జాతుల నిమి త్తము నేను స్థాపించిన రామమోహన పాఠశాల గూడ నా కొక భారమయ్యెను. ఆ పాఠశాలలో మొదట బాలురు వచ్చుట కష్ట మయ్యెను. కాని పిదప బాలకు లెక్కువగ వచ్చుటచేతను, పై తరగతి గూడ నెలకొల్పుటచేతను. చెరువు సోమయాజులుగారు నాకుచితముగ నిచ్చిన గోదావరి యొడ్డుననున్న కొంప విడచి, లక్ష్మీవారపు పేటలో నప్పుడు ఖాళీగానున్న యొక తురకల యిల్లద్దెకు తీసుకొని, రామమోహన పాఠశాల నంచులోనికి 1911 వ సంవత్సరములో మార్చితిని. బాలుర సంఖ్య యెక్కువగుటచే, మరియిద్ద రుపాధ్యాయుల నేర్పరచవలసి వచ్చెను. ఈ పాఠశాలకు గావలసిన వ్యయమంతయు నేనే భరించుచుమంటిని. అప్పుడా పాఠశాలకు రమారమీ నెలకు ముప్పదిరూపాయలు ఖర్చుపడు చుండెను. పరసహాయము విశేషముగా లేకపోయెను. ఒకసారి నాళము పట్టాభిరామయ్యగారు గొన్ని పలకలు పుస్తకములుదెచ్చి బాలురకిమ్మని నా కిచ్చిరి. వాటిని నేను బాలురకు పంచిపెట్టించితిని. ఒకసారి న్యాపతి సుబ్బారావు పంతులుగారు మా పాఠశాల జూచి సంతోషించి దానికి విరాళ ముగ నూటయేబది రూపాయలు బంపిరి. ఆ సొమ్ముతో నేను బాలురు

కూర్చుండు బల్లలు, నల్ల బల్లలు, డస్కు-బల్లలు, కుర్చీలు మొదలగువాటిని చేయించితిని. ఏడాది కొకటి చొప్పున పై తరగతులుపెట్టి రామమోహన పాఠశాలను హయ్యరు ఎలిమెంటరీపాఠశాలగ జేసితిని. నాశము కృష్ణారావు గారు "మానవసేవ" యను నొక తెనుగు మాసపత్రికను స్థాపించి మొదట కొంతకాలము మా ముద్రాక్షరశాలలో దాని నచ్చువేయించి, పిదప దానిని మరియొక ముద్రాక్షరశాలలో నచ్చువేయింప సాగిరి నా "దేశమాత" పత్రిక వారమునకు రెండు రాయలుసైజు కాగితములమీద యచ్చుపడు చుండెను. ప్రతివారము హాస్యలత యుండుటచే, పత్రిక క్రమక్రమముగా జనాకర్షకమయ్యెను. చందాదారు లెక్కువగుటచేతను, కోర్టు మునసబులు గొందరు నా మీద నభిమానముచేత తమ కోర్టులలోని వేలముల పట్టికలు మా పత్రికలో ప్రకటించుటచేతను, "దేశమాత" పత్రిక కొంత లాభకరముగానే యుండెను. డబ్బు తక్కువగ నున్నప్పుడు నా "మనోరమ" మాసపత్రిక కొన్నిమాసము లాపివేయుచుంటిని. "దేశమాత" లో గూడ కృష్ణవేణి మణిమంజరి మొదలైన నవలలను ప్రకటించితిని. హాస్యలతలు సంఘ దురాచారములమీదను, రాజకీయ విషయములమీదను, మ్యునిసిపలు విషయములమీదను, జనాభా లెక్కలు మొదలైనవాటిమీదను నాచే వ్రాయబడుచుండెను. హాస్యలతలును, చిత్రకథలును, ప్రధానవ్యాసములును నేనే వ్రాయుచుండెడివాడను.

1911వ సంవత్సరమున విశాఖపట్టణ మండల రాజకీయసభ విజయనగరములో జరిగెను. ఆసభకు పార్వతీపుర నివాసులును, సుప్రసిద్ధ న్యాయవాదులునైన ఉపద్రష్ట జగన్నాధశాస్త్రిగా రధ్యక్షులుగ నెన్నుకొనబడిరి. మండల సంఘ సంస్కరణసభ కధ్యక్షులుగా నుండుమని నన్నా హ్వానించిరి. ఈ సభలతోపాటు మండల పారిశ్రామికసభగూడ జరిగెను, ఆసభకు బరంపురము నివాసులు కాంగ్రెసు నాయకులునైన వరాహగిరి జోగయ్య పంతులుగా రధ్యక్షులుగ చేయబడిరి. ఏకారణముననో నామిత్రులైన గంటి లక్ష్మన్నగారుగూడ నచటికి వచ్చిరి. సభలు జయప్రదముగ జరిగెను. నా మిత్రుడైన పిళ్ళారిసెట్టి నారాయణరావు నాయుడుగారా దినములలో సచట జిల్లా మునసబుగనుండిరి. సభలులేని సమయమునందు నేను తరచుగా నాయుడుగారితో గాలక్షేపము చేయుచుంటిని. సంఘ సంస్కరణ సభలో నే నధ్యక్షోపన్యాసము యప్పటికప్పుడే చెప్పితిని. కాని ముందుగ వ్రాసి తయారుచేసుకొనలేదు. నే నేసభలో మాటలాడినను

నాకిదియే యలవాటు. నారాయణరావు నాయుడుగారు సంఘసంస్కరణ ప్రియులగుటచేత, సంఘసంస్కరణ సభకు దయచేసి పాలుగొనుటయేగాక నధ్యక్షునకు వందనములు చారే సమర్పించిరి. విజయనగరము మహారాజా వారి కళాశాలా ప్రధానాచార్యులైన కిణాంబి రామానుజాచార్యులవారు చల్ల గాలికి భీమునిపట్టణముపెళ్ళి, యచ్చటనుండి ప్రత్యేకముగా సంఘ సంస్కరణసభకు దయచేసి, యధ్యక్షునకు వందనములు సమర్పించుటలో వారు గూడ పాలుగొనిరి. రామానుజాచార్యులుగారు నాకు వందనములు సమర్పించునప్పుడు యిట్లనిరి. "I endorse every word that fell from the lips of my friend Mr. Narayanarao" వందన సమర్పణములో నారాయణరావు నాయుడుగారు నన్ను స్తవముచేసిరి. ఆ స్తవములో ప్రతి మాటయు దన కంగీకారమేయని రామానుజాచార్యులుగారు మాటలాడిన యింగ్లీషుమాటల యర్థము. విజయనగరములోనున్న మూడుదినములు గురజాడ శ్రీరామమూర్తి పంతులుగారియింట బసచేసితిని. అప్పటికే గురజాడ శ్రీరామమూర్తిపంతులుగారు చనిపోయిరి. వారిజ్యేష్ఠకుమారుడైన దుర్గాప్రసాదరావుగారును, వారియల్లుడుగారైన కవిపుంగవ వెంకటరత్నము పంతులుగారును మిక్కిలి గౌరవముతో నాకాతిథ్యమిచ్చిరి. సభలుముగిసిన తరువాత నేను విశాఖపట్టణముపెళ్ళితిని. మారాజమహేంద్రపర పురనివాసులైన గంటి వెంకటరామయ్యగారు చల్లగాలికొరకు చాల్తేరులో నొక బంగాళా యద్దెకుపుచ్చుకొని యచటనుండిరి. గంటి లక్ష్మన్నగారును, నేనును నాలుగుదినములు వారికతిథులుగా నుంటిమి. ఆప్రయాణములలో నాతోగూడ సహాయముగ, గంటి వరహాలను ద్రావిడయువకుడు వచ్చెను. ఈతడు విశాఖపట్టణమండలవాసియైన ద్రావిడబాలుడు. 1910 వ సంవత్సరము చివరభాగమున నితడు నాకడకువచ్చి పనియేదేని నిప్పించుమని నన్నడిగెను. అప్పుడు పనియేమియు నాకడలేకపోవుటచే, మాయింట భుజించి నాకడనుండుమని చెప్పితిని. అతడంగీకరించి మాయింటికి గావలసిన బజారుపనులుచేయుచు నన్ను సభలకు టపునుహాలుకు దీసికొని పోవుట మొదలయిన పనులుచేయుచు, విశ్వాసపాత్రుడైయుండెను.

నాటకసమాజముతో నేను 1908 వ సంవత్సరము మొదలుకొని సంబంధము వదలుకొని, ప్రతిదినము టవునుహాలునకు బోవుచుంటిని. అక్కడ నాకు ముఖ్యమిత్రు యిన దామెర్ల వెంకటరమణారావుగారు, రామాప్రగడ వెంకటరామయ్యగారు, కుందూరు వెంకటరత్నముగారు, ఖెదురుమూడి రామదాసుపంతులుగారు మొదలగువారు సంభాషించుచుండెడి వారు. వీరుగాక న్యాపతి సుబ్బారావుపంతులుగారు, చిత్రపు వెంకటచలము గారు, కంచుమర్తి రామచంద్రరావుగారు మున్నగువారినిగూడ ప్రతిదినము నేను టవునుహాలులోనే గలుసుకొని మాటలాడుచుండెడివాడను. టవును హాలులో విక్టోరియా జూబిలీ రీడింగు రూమనుపేర నొక పత్రికాపఠన సంఘముండెను. దానికి సుబ్బారావుపంతులుగా రధ్యక్షులు. అందులో నేనునేక సంవత్సరములు సభ్యుడుగా నెన్నుకొనబడుచుంటిని. 1911 వ సంవత్సరము జూలై నెలలో నా "దేశమాత" పత్రిక కొకచిక్కు సంభవించెను. పత్రికా నిర్వహణమందు నాకు సహాయముచేయుటకై నాళ్ళచెరువు కృష్ణారావుగారిని నెల కిరువదియైదు రూపాయిలమీద నియమించితిననియు, నతడే పత్రికా ప్రకాశకుడుగా నుండునట్లు కలెక్టరుగారియొద్ద ప్రమాణ పత్రము దాఖలు చేయించితిననియు వ్రాసితిని. వీరేశలింగముగారు నాళ్ళ చెరువు కృష్ణారావుగారిని మొదటినుండియు నెరిగియుండుటచే నతడు నమ్మదగిన మనుష్యుడుకాడనియు, మాటిమాటికబద్ధములు చెప్పువాడనియు బలుమారులు నాతో జెప్పిరి. ఆయన చెప్పినమాట నిజమయ్యెను. పత్రికా నిర్వహణమున నా ప్రియమిత్రుడైన రాయపరపు రామమూర్తిగారు గూడ నాకు తోడుపడుచుండిరి. ముఖ్యవిషయ మేదైన వచ్చినప్పుడు నేను రామ మూర్తిగారితో నాలోచించుచుండెడివాడను. కృష్ణారావుగారి కందుచేత మనసులో నీర్ష్య బయలుదేరెను. అందుచేత నతడు ప్రతిక కేదైన హాని చేయదలచెను. అతడు జిల్లాకలెక్టరుగారి కడకు బోయి "దేశమాత" పత్రికలో దొరతనమువారికి వ్యతిరేకమైన విషయములు ప్రకటింపబడు చున్నవనియు, దనకవి గిట్టకపోవుటచే, దాను పత్రికాసంబంధము వదలుకో దలచుకొంటిననియు, దొరగారితో రహస్యముగ నేరములు చెప్పెను. ధవ శేశ్వరము మకాములో కలెక్టరుగారుండగా నేను వారిని గలుసుకొని కృష్ణారావుగారు సరిగా బనిచేయుటలేదనియు, పత్రికా ప్రకాశకుడుగా నతనిని తొలగించి నేనే యుందుననియు వారితో మనవిచేసితిని. అప్పుడు కలెక్టరుగారైన "ఎల్విన్" (Elwin) దొరగారు నాళ్ళచెరువు కృష్ణారావు

గారు నా మీద తమతోజెప్పిన సంగతులు కొన్నిటిని నాకు చెప్పిరి. కృష్ణారావుగారంతతో బోక "దేశమాత" పత్రికకు దాను ప్రకాశకుడను గానని కలెక్టరుగారికి వ్రాతమూలకమైన యర్జీయిచ్చిరి. క్రొత్తప్రకాశకుడు కలెక్టరుగారియొద్ద ప్రమాణపత్రము దాఖలుచేసినదాక పత్రిక ప్రకటింపగూడదు. నిబంధనలట్లున్నవి. అందుచేత రెండువారములు పత్రిక నిలుపుచేయబడెను.

నా మిత్రులైన చెరుపు సోమయాజులుగారు జిల్లాకలెక్టరుగారిని స్వయముగా నెరుగుదురు. అప్పుడు కలెక్టరుగా రమలాపురము తాలూకాలో మన్నంపల్లి లాకుదగ్గర మకామచేసియుండిరి. వారిని దర్శించి నేనే ప్రకాశకుడుగా ప్రమాణపత్రము దాఖలుచేయవలెనని, చెరుపు సోమయాజులుగారిని గంటి వరహాలును వెంటబెట్టుకొని, నే నమలాపురము వెళ్ళితిని. పూటకూళ్ళ యింట భుజియించి, యమలాపురమునుండి మేమన్నంపల్లి జేరునప్పటికి మధ్యాహ్నము మూడుగంటలయ్యెను. నాడు వర్షము గురియుచుండెను. కలెక్టరుగారి కాఫీపాల నిమిత్త మాపులను గట్టుమీద చెట్లకు గట్టివేసి, మునసబు కరణములు వానలోనే గట్టుమీద నిలుపబడిరి. తహసీలుదారుగారు, మేజస్ట్రీటుగారును నల్లే గొడుగులు వేసుకొని వానలో నిలువబడిరి. కలెక్టరుగారు కాలవలోనున్న యొక పడవలో (Staff Boat) క్షేమముగ గూర్చుండిరి. సోమయాజులుగారు ముందుగ దొరగారియొద్దకు బోయి నేను వచ్చితినని చెప్పి తరువాత నన్ను లోనికి గొంపోయిరి. నేను శ్రమపడి వానలో వచ్చినందుకు కలెక్టరుగారు మిక్కిలి నొచ్చుకొని, నా వచ్చినపనిని, "దేశమాత" పత్రికకు నేనే ప్రకాశకుడుగా నుందునని నేను సంతకముజేసి యిచ్చిన ప్రమాణపత్రము నంగీకరించి, నన్నుత్వరగా పంపివేసిరి. తిరిగి నే నమలాపురము వచ్చునప్పుడు, మార్గమధ్యమున మొల్లియను గ్రామమున, సోమయాజులుగారి మిత్రులైన యొకగృహస్థుని యింట భోజనముచేసి, యా రాత్రి యచటనే పండుకొని, మరునాడుదయమున వారి యింటనే పిండిపంటలతో విందారగించి, యమలాపురమునకు బయలుదేరితిమి. బండివాని తెలివితక్కువ వలన త్రోవలో నాబండి బోల్తపడెను. నాకు చిన్నదెబ్బతగిలెను. దానివలన నాకు విశేషము బాధ కలుగలేదు. అమలాపురముచేరి యచట పడవనెక్కి, మూడవనాటికి రాజమహేంద్రవరము చేరితిమి. ఇంతతో నాళ్ళచెరువు కృష్ణారావుగారికిని నాకును సంబంధము విడిపోయెను

స్వీయ చరిత్రము

పదునేడవ ప్రకరణము

నా బరంపుర ప్రయాణము

వీరేశలింగముగారు, ప్రతిసంవత్సరము వేసవికాలమున నిచ్చట తీవ్రమైన యెండ భరింపలేక, భార్యాసమేతులై బెంగుళూరు వెళ్లుచుండెడి వారు. 1911 వ సంవత్సరముగూడ నెప్పటియటుల నేప్రియలునెలలో బెంగుళూరువెళ్ళి, దంపతులు మంచి యారోగ్యస్థితిలో జూలైనెలలో మరల రాజమహేంద్రవరము వచ్చిరి. ఇక్కడగూడ వారి యారోగ్యము బాగుగనే యుండెను. బరంపురమువచ్చి రెండుమూడుపన్యాసము లీయవలసినదని కొందరు మిత్రులు నాపేర వ్రాసిరి. 1911 వ సంవత్సరము ఆగస్టు 11 వ తారీకున నేను బరంపురము వచ్చెదనని వారిపేర వ్రాసి ప్రయత్నములు చేసికొంటిని. రాజమహేంద్రవరములో నుదయమున యెనిమిది గంటలకు మెయిలుబండిలో బయలుదేరిన పక్షమున సాయంకాలమునకు బరంపురము చేరవచ్చును. అందుచేతనే నాగస్టు 11 వ తేదీ నుదయమున పెందలకడలేచి కాలకృత్యములు దీర్చుకొని భోజనముజేసి ప్రయాణమునకు సిద్ధముగ నుంటిని. అప్పుడు వీరేలింగముగారి తోటలోనుండి కామరాజు హనుమంతరావుగారు నాకడకువచ్చి, కడచినరాత్రి వీరేశలింగముగారి భార్య రాజ్యలక్ష్మమ్మగారు హఠాత్తుగ మృతినొందినదని చెప్పిరి. వెంటనే నేను ప్రయాణము మానివేసి యా దుర్వార్త తంతిమూలముగా బరంపురము మిత్రులకు దెలియపరచి, మరునాడుదయము బయలుదేరి వత్తునని వారికి వ్రాసి, ముద్రాక్షరశాలకు జని, రాజ్యలక్ష్మమ్మగారి యోగ్యతనుగూర్చియు, నామె వితంతువులకు జేసిన సేవనుగూర్చియు, నొక వ్యాసము వ్రాసియిచ్చి యామె విషయమై యొక ప్రత్యేక "దేశమాత" సంచిక ప్రకటింపుమని హితవాంద్రకు నాజ్ఞనిచ్చి, సంచిక తయారయిన తరువాత నాఫీసు మూసివేయుడని చెప్పి నేను వీరేశలింగముగారి తోటకు బోతిని. సిడుగుపంటి యా వార్త దెలిసినతోడనే పట్టణములో నానా భాగములనుండి పురజనులు

తోటలోనికి రాజొచ్చిరి. అన్ని వర్ణములవారును, స్త్రీలును, పురుషులును, ముసలివాండ్రును, పడుచువాండ్రును వందలకొలదిగవచ్చి పంతులుగారిని పరామర్శ చేయజొచ్చిరి. వీరేశలింగముగారి తోటలో నొక యాపీనినందున రాజ్యలక్ష్మమ్మగారు జున్ను వండుకొని తిని పండుకొని, నిద్రలోనే ప్రాణములు విడిచెను. లావుపాటి మనుష్యులు వార్ధక్యములో నాకస్మికముగా గుండె యాగిపోయి చనిపోవుచుందురు. రాజ్యలక్ష్మమ్మగారు లావుగనుండెడిది. అప్పటి కామెకు రమారమి యరువదిసంవత్సరముల వయస్సు. అందుచే హృదయదౌర్బల్యముచేత నాకస్మికముగ మరణించియుండును. ఆమె మేడమీద మృతినొందుటచే శవమును క్రిందికిదింపి కుర్చీలో పండుకొనబెట్టిరి. ఆమె ముఖములో జీవకళ శోలేదనియు, నెప్పటివలె కలకలలాడుచునే యున్నదనియు, జూచినవారు చెప్పిరి. సాయంకాలమున నాలుగు గంటలకు తోటలోనే యొకమూల దహనపరచిరి.

ఆగస్టు 12 వ తారీఖు సుదయమున, నేను నా స్కూలులో నుపాధ్యాయుడైన, మల్లుభొట్ల వెంకయ్యను సాయముదీసికొని, బరంపురము వెళ్ళితిని. సభాసన్నాహకులు, బరంపురం రైల్వేస్టేషనులో నన్నెదురుకొని, యూరులోనికి దీసికొనివెళ్ళి, యచ్చట న్యాయవాదియైన కోపర్గాము రామమూర్తిగారి యింట నాకు బసయేర్పరచి యచటదింపిరి. రామమూర్తిగారు మిక్కిలి సౌమ్యులు, వారు నన్ను మిక్కిలి దయాగౌరవములతో నాదరించిరి. మరునాడు బరంపురము టౌనుహాలులో గొప్పసభ జరిగెను. ఆభవన మంతయు జనులతో కిక్కిరిసి యుండెను. గ్రంథభాండారము మొదలైన విషయములను గురించి నేను పెద్ద యుపన్యాసము చేసితిని. స్థలమంతయు జనులచే నిండిపోవుటచే, గూరుచుండుటకు చోటులేక, నచట గవర్నమెంటు ప్లీడరుగారైన విలియము వెంకట్రామయ్యగారుగూడ నొకమూల గూరుచుండి, నాయుపన్యాసము వినిరని, యచట మిత్రులు చెప్పిరి. అచట పూర్వపు గవర్నమెంటు ప్లీడరుగారైన దిగుమర్తి వెంకటరామయ్యగారిని దర్శింప నేనుబోతిని. వారప్పుడు నింటలేరు. కాని తరువాత నేను తమయింటికి వచ్చినట్లు విని, వారు కడు వృద్ధులైనను, నన్నుజూచుటకు కోపర్గాము రామమూర్తిగారి యింటికివచ్చి, జూచిరి. కోపర్గాము రామమూర్తిగారు సంఘసంస్కరణ ప్రియులు. లోకసేవా పరాయణులు. నూడు దినములు నేను బరంపురములో నుండి తిరిగి రాజమహేంద్రవరము వచ్చితిని.

హితకారిణీ పాఠశాల యిన్నీసుపేటలో నద్దెయింటిలో నెలకొల్ప బడెనని యిదివరకే వ్రాసియుంటిని, దానికి స్థిరమైన భవనము గట్టించ వలె నని వీరేశలింగముగారు స్థలముకొరకు పట్టణములో ననేక భాగములు వెదకిరి, ఎట్టకేల కిప్పుడు పాఠశాలయున్న స్థలమే సత్యవోలు గున్నేశ్వర రావుగారియొద్ద క్రియమునకు దీసికొనిరి. మహోదారశీలుడైన శ్రీ పిఠా పురము మహారాజావారు, పాఠశాల భవననిర్మాణము నిమిత్తము వీరేశ లింగము గారికి గావలసిన ధనమంతయు నిచ్చిరి. ఆభవన నిర్మితికి రమా రమీ డెబ్బదివేల రూపాయలు కర్చుపడెను. ఆమహాధనమంతయు మహా రాజాగారే యిచ్చిరి. వీరేశలింగముగారు మిక్కిలి శ్రమపడి 1911 వ సంవ త్సరము నాటికి భవనము తయారుచేయించిరి. అందు ప్రవేశ మహోత్స వము జరుపుటకై, కలకత్తాలోని సిటీకాలేజి ప్రిన్సిపాలుగారైన, హేరంబ చంద్రమైత్రిగారు దయచేసిరి. 1911 వ సంవత్సరము నవంబరు పదునొ కండవ తేదీని మైత్రాగారు పాఠశాలను దెరచి ప్రవేశమహోత్సవము నడ పిరి. నేల యీనిన విధముగా జనులు వేలకొలది యాసభకు వచ్చిరి. శ్రీ పిఠాపురము మహారాజావారు, మొక్కపాటి సుబ్బారాయుడుగారు, రఘుపతి వేంకటరత్నము నాయుడుగారు నాలోచించి యాపాఠశాలకు హితకారిణీ పాఠశాలయన్న పేరు దీసివేసి, వీరేశలింగా స్తికోన్నత పాఠ శాల యని పేరు పెట్టదలచి, యావిషయమును మైత్రాగారిచేతనే సభలో వెల్లడి చేయించిరి. నాటినుండియు వీరేశలింగోన్నత పాఠశాలయను పేరుతో నది వర్ధిల్లుచున్నది. ఈపాఠశాలా ప్రవేశమహోత్సవముతో నాకేమియు సంబంధము లేకపోయినను మొట్టమొదటనది నా పాఠశాల యగుటచే నానందవశమున నేనింతవరకు వ్రాసితిని పేరావిధముగ మార్చ దలచుకున్నామని సభలో వెల్లడించకమునుపే నాతో రఘుపతి వెంకట రత్నము నాయుడుగారు రహస్యముగా జెప్పిరి.

1912 వ సంవత్సరమున కృష్ణామండల రాజకీయసభయు, సంఘ సంస్కరణ సభయు నిడదవోలులో జరిగెను. కొవ్వూరు బసివిరెడ్డిగారు సభానిర్వహణకు తగిన యేర్పాటులుజేసిరి. వీరవాసర గ్రామీణుడనగు నేనును, కృష్ణామండల వాసినేగనుక యాసభకు బోతిని. సంఘసంస్కరణ సభకు దాసు మాధవరావుగారధ్యక్షులైరి. స్త్రీ పునర్వివాహ విషయమైన తీర్మానము చర్చకు వచ్చినప్పుడు సభలో నొకడు లేచి కొంత గొడవ జేసెను. ఆవిషయమై మాటలాడుమని సభాధ్యక్షుడు నన్నుగోరుటచే, నేను

లేచి గంభీరమైన యుపన్యాసము జేసితిని, అంతలో నాసభ నిశ్శబ్దముగా నుండెను. ఆసభలకు నాశుకవిత్వ ప్రవీణులైన కొప్పరపు సోదరులు వచ్చిరి. సభలు ముగిసిన తరువాత నొకనాటి రాత్రి కొప్పరపు సోదరుల యాశు కవిత్వ నైపుణి వినవలెనని కొందరు కుతూహలపడి యొక సభజేసిరి. ఆసభకు నన్నధ్యక్షునిగా నేర్పరచి, యాశుకవిత్వమునకు నేదేని విషయ మిమ్మని, నన్ను సభాసదులు కోరిరి. నేను శకుంతలోపాఖ్యానమును నాశుపుగ చెప్పవలసినదని వారిని గోరితిని. ఆ సభలో దాసు మాధవరావు గారు, కొమరరాజు లక్ష్మణరావుగారు, వల్లూరి సూర్యనారాయణరావుగారు, తల్లాప్రగడ సూర్యనారాయణరావుగారు, మొదలగు వారనేకులుండిరి. కొప్పరపు సోదరులు మూడుగంటల కాలములో, మహావేగముగ, నాలుగు వందల పద్యములు చెప్పిరి. అందు వనవర్ణనలు, పురవర్ణనలు మొదలగు నవిగూడ గలవు. ఆ శక్తి యద్భుతశక్తియనియు, ననన్యసాధ్యమనియు నేను శ్లాఘించి సభ ముగించితిని. ఆమరునాడు నేను రాజమహేంద్రవరము వెళ్ళితిని.

1910. 1911 చ సంవత్సరములలో నేను రెండుమూడు మంచి పనులు చేసితిని అవి శ్లాఘ్యములైన ఘనకార్యములు గావుకాని, నా మనసున కవి సంతుష్టి కలుగచేయుటచే మంచికార్యములంటిని నా మిత్రు డైన గోపేటి కనకరాజుగారు, చెన్నపురి దొరతనమువారికి భాషాంతరీ కరణ పండితుడయ్యెను. (Translator to the Government of Madras) ఆ దినములు వందేమాతరం దినములు. బంగాళాదేశ విభాగము చేత, దొరతనమువారికి ఆనులకు సరిపడని దినములు. పత్రికలన్నియు దాదాపుగా దొరతనమువారికి వ్యతిరేకముగానే వ్రాయుచుండెను. అందుచేత దొరతనము వారొక క్రొత్తఫక్కి కనిపెట్టిరి. ఒక వార పత్రికకు సంవత్స రమునకు మూడురూపాయలు చందా యసుకొనుదు. దొరతనమువారే మూడువేల చందాదారులపల్ల పచ్చెడి ధనము, తొమ్మిదివేల రూపాయలు పత్రికాధిపతికిచ్చి పత్రిక ప్రచురించవలసిన వారిపేర్లు తామే యిచ్చెడివారు. ఈ పద్ధతి బంగాళాదేశములో దొరతనమువారు చేయ నారంభించిరి ఇట్టి పత్రికలో పత్రికాధిపతి దొరతనమువారి కనుకూల సంగతులేగాని విరుద్ధము లైన విషయములు వ్రాయగూడదు ఇట్టి పత్రికకు (Subsidised Paper) యనిపేరు. కనకరాజుగారు నామీద దయచేత, తాము దొరతనమువారికి వ్రాసి నా "దేశమాత" పత్రికగూడ నటువంటి పత్రికగా జేయింపవలెనని

సంకల్పించి, యది నాకిష్టమో కాదో కనుగొనమని, మోచర్ల సుందర రామయ్యగారితోను, కందుల శ్రీమన్నారాయణగారితోను చెప్పిరట, వారిరువురు వచ్చి నన్నడిగిరి పత్రిక నట్లు దొరతనము వారికిచ్చుట నాయాత్మ నమ్ముకొనుట యని భావించి, ధనమునకై బానిసగనుండుట కిష్టములేక, నాకట్టిపని యిష్టములేదని వారితో చెప్పితిని. "దరిద్రుడవైన నీవు సంవత్సరమునకు గొన్నివేల రూపాయలు వచ్చెడి యవకాశము జెడకొట్టుకొనుచున్నా"వని నా మిత్రులు నన్ను జీవాట్లు పెట్టిరి. అయినను వారి యుపదేశములు నాతల కెక్కలేదు, పత్రికా విషయమున నేను స్వతంత్రుడనై కఠినముగా విమర్శింపవలసినప్పుడు విమర్శించుట, శ్లాఘింపవలసినప్పుడు శ్లాఘించుట, మొదలైన యధికారములు కలిగియుండవలెను. కాని యెల్లప్పుడు దొరతనమువారిని శ్లాఘించుట నీచమని తలంచి నేనాలాభమునునిరాకరించితిని, రెండవమంచిపని యేమనగా "హూక్మిలన్ కంపెనీ" (Macmillan Compadny) యని పుస్తకముల వ్యాపారము జేసెడి పెద్ద కంపెనీగలదు. వారి యేజంటు దొరస్వామయ్యంగారు కాబోలు నాకడకువచ్చి, నాలుగైదు ఫారములకు తెనుగువాచికములు వ్రాసి, తమ కంపెనీకీయవలసినదని నన్నడిగిరి. తగిన సొమ్ము నిప్పించెదననిగూడ చెప్పిరి. వారికి నేనిట్లు సమాధానము చెప్పితిని. "ఆంగ్లేయులు మనదేశములోని గనులవలనను టీ కాఫీలవల్లను, రైలుబండ్లవల్లను మరి యితర సాధనములవల్లను, ధనమంతయు పట్టుకొని పోవుచున్నారు. తెనుగుదేశములో బుట్టి తెనుగు ముక్కలు నాలుగు వ్రాయనేర్చిన మనము, తెనుగు పుస్తకముల వల్ల వచ్చు లాభ మనుభవించకుండ, నడిగూడ నాంగ్లేయులకే యీవలెనా? నేనెన్నడు నింగ్లీషు కంపెనీలకు గ్రంథములు వ్రాసి యివ్వను స్వదేశీయులెవరేనిజేరి యొక కంపెనీ పెట్టిన పక్షమున వారికి వ్రాసియిచ్చెదను. లేదా నాకు నేనే వ్రాసుకొనెదను." ఆపలుకులు విని యేజంటు విస్మయపడియిట్లనెను. "అయ్యా! ఈవరకెందరినో పుస్తకములువ్రాసి యిమ్మని యడిగితిని, కాని వారు ప్రతిఫల విషయమై షరతులు పెట్టిరిగాని యీవిధముగా నెవ్వరు మాటలాడలేదు. మీ యభిప్రాయమునాకు వ్యతిరేకమైనను మిక్కిలి మంచిదే"యని పలికి వెడలిపోయెను.

1912 సంవత్సర ప్రాంతమున గుంటూరు, కృష్ణామండలములలో నాంధ్రదేశాభిమానము మిక్కుటమై ప్రత్యేక మాంధ్రరాష్ట్రి మాంధ్రులకు గావలెనని, గొప్ప యాందోళనము బయలుదేరెను. ఆయాందోళనములో

బనిజేసినవారిలో ముఖ్యులు కొండా వెంకటప్పయ్యగారు, గొల్లపూడి సీతారామయ్యగారు మున్నగువారు, వారితోపాటు ముట్నూరి కృష్ణారావుగారు, వల్లూరి సూర్యనారాయణరావుగారు మున్నగు బందరు నివాసులుగూడ బనిజేసిరి. వీరు దత్తమండలములకును, మరి యితరాంధ్రదేశ భాగములకును బోయి, యాంధ్రరాష్ట్రావశ్యకతను గురించి యుపన్యాసము లీయసాగిరి. ఆసందర్భమున శ్రీ కొండా వెంకటప్పయ్యగారు రాజమహేంద్రవరము వచ్చి, మా యింటనే బసచేసి, నన్ను గౌరవించి రెండు దినములుండి యాంధ్రోద్యమము గురించి టవును హాలులో నుపన్యసించిరి; వారి యుద్యమ విషయమై రాజమహేంద్రవర పురప్రముఖులప్పుడు దగిన సానుభూతి జూపలేదు. నామట్టుకు వారి యుద్యమము నచ్చినది. ఆంధ్రోద్యమమును గురించి మహాసభ గుంటూరు మండలములో జరుగుననియు దానికి రావలసిదనియు మా పురజనుల నాహ్వానించి వెడలిపోయిరి.

వీరేశలింగముగారి వితంతు శరణాలయములో మంగమ్మ యను నొక వితంతువుండెను ఆమెను పోతరాజు ప్రకాశరావను వానికిచ్చి పంతులుగారు వివాహముజేసిరి ఆతడు వీరేశలింగపాఠశాలలో రెండవ జన్మాష్టికు మాష్టరుగానుండెను. ఆ దంపతులు వీరేశలింగముగారి తోట లోనే కాపురముండిరి. ఆమె మిక్కిలి వినయవిధేయతలు గలిగి, రాజ్యలక్ష్మమ్మగారు చనిపోయిన తరువాత వీరేశలింగముగారి యసహాయస్థితిని జూచియు, దగ్గుచే వారు బాధపడుచుండుట జూచియు, జాలిపడి వీరేశలింగముగారికి తన శక్తికొలది నుపచారములు చేయుచుండెను. వర్షాకాలమందు వీరేశలింగముగారికి దగ్గు హెచ్చుగా వచ్చుచుండుటచే, మంగమ్మ రాత్రులు మేడమీదనే పండుకొని, వారికి మందులు మొదలగునవిచ్చి, వారికి శ్వాసకాసలవలన వచ్చు బాధ కొంత శాంతింపజేయుచుండెను. ఆ కారణమున వీరేశలింగముగారికి మంగమ్మమీద గొంత యభిమానము గలిగెను. పితృపుత్రికా సంబంధము గలిగి వీరేశలింగముగారును, మంగమ్మయును మెలగుచున్నను, వితంతు శరణాలయములోని కొందరు వితంతువులును, నచ్చటి కొందరు యువకులును నీర్ష్యగలవారై పంతులుగారి మీదను, మంగమ్మమీదను నపవాదములు బుట్టించిరి. అవి గాలివలె పట్టణములోనికి గూడ బ్రాకెను. "వినినంతనె వేగపడక వివరింపదగున్" యను నీతి వాక్యమును మరచి వినగానే దానిని వేదవాక్కుగా గొందరు విశ్వసించిరి. "గతానుగతికో లోకో నలోకః పారమార్థికః" అను సంస్కృతపు సామెత

ననుసరించి, నేను మొదటగొంత సంశయించినవాడనై పిమ్మట, బాల్యము నుండియు వీరేశలింగముగారితో గలసిమెలసి పనిచేసిన రెబ్బాప్రగడ పాపయ్యగారితోను, కనుపర్తి శ్రీరాములుగారితోను, శ్రీ న్యాపతి సుబ్బా రావు పంతులుగారితోను నేను మాటలాడి నా సంశయములను దీర్చుకొని, వీరేశలింగముగారి వయసునుబట్టియు, దేహారోగ్యమునుబట్టియు, నిష్క-ళంకమైన వారి పూర్వచారిత్రమును బట్టియు, నటువంటి యపవాదములు విశ్వసింపగూడనివనియు, నాంధ్ర దేశమునకు మహోపకారము జేసిన యా మహనీయుని మీద దిక్కు-లేని యవస్థలో నిటువంటి యపవాదములు వేయుట పాపహేతువనియు, వట్టి కృతఘ్నతయనియు, నిశ్చయించు కొంటిని నామిత్రులైన దామెర్ల వెంకటరమణారావుగారు మొదలగువారు లోకములోని వాడుకను నమ్మిరి. టంగుటూరి శ్రీరాములుగారు న్యాయ వాదిగానుండి "కార్లీలియన్" యను పక్షపత్రిక నింగ్లీషులో నా దినము లలో ప్రకటించుచుండిరి. అందలి విమర్శనములు మిక్కి-లి కఠినములై జనుల మనసులకు మిక్కి-లి కష్టములు గలిగించుచుండెను. వీరేశలింగము గారి మీది యపవాదములు నమ్మి యా పత్రికగూడ కఠినవిమర్శన వర్ష ములు గురిపించెను. ఆ పత్రిక న్యాపతి సుబ్బారావుపంతులుగారి మీదను, వీరేశలింగముగారి మీదను, మరి యితర పురప్రముఖులమీదను ధ్వజమె త్తి నిష్ఠుర విమర్శనములు వ్రాయజొచ్చెను. నాళము కృష్ణారావుగారు తెనుగున ప్రకటించుచున్న మాసపత్రికలోగూడ నిందాగర్భములైన పద్యములు ప్రకటింపబడెను. నాళము కృష్ణారావుగారు, వీరేశలింగముగారియెడ నంతకు పూర్వము మిక్కి-లి భక్తులై, వారి పేర వీరేశలింగ పుస్తక భాండాగారమని యొక భాండాగారము పెట్టి నడుపుచుండిరి. అట్టివారు గూడ వీరేశలింగముగారి మీద ధ్వజమె త్తిరి పురజనులు బహువిధము లుగా నీవిషయమై ప్రసంగింపజొచ్చిరి. వీరేశలింగ పాఠశాలలోని యుపా ధ్యాయులే గొందరు వారికి వ్యతిరేకముగా ప్రవర్తింప జొచ్చిరి.

1911 వ సంవత్సరమున శ్రీ జయంతి రామయ్య పంతులుగారు చెన్నపురమున ప్రెసిడెన్సీ మేజస్ట్రీటుగా నుండి, యాంధ్ర సారస్వతాభి వృద్ధికొరకై "ఆంధ్రసాహిత్య పరిషత్త"ను పేర నొక సంఘము స్థాపిం చిరి. దానికి శ్రీ వెంకటగిరి మహారాజాగారు, పిఠాపురము మహారాజా గారు, బొబ్బిలి మహారాజాగారు, వుయ్యూరు రాజాగారు మొదలగు మహా పురుషులు ప్రధాన పోషకులై, వేలకొలది ధనమును విరాళముగా నిచ్చిరి.

ఆ పరిషత్తుయొక్క ప్రథమవార్షికోత్సవము 1912 సంవత్సరమున చెన్న పురిలో జరిగెను. రెండవ వార్షికోత్సవము జయంతి రామయ్య పంతులు గారును, పిఠాపురము మహారాజుగారును, యీస్టరు సెలవులలో రాజ మహేంద్రవరమున జరుపదలచిరి. వ్యయమంతయు శ్రీ పిఠాపురము మహారాజావారే భరించిరి. సభానిర్వహణము జయప్రదముగా జరిపింప వలసినదని మొక్కపాటి సుబ్బారాయుడుగారు నాపేరవ్రాసిరి. అందుకు నేను వందనపూర్వకముగా నంగీకరించితిని, పిఠాపురము సంస్థానములో బనిచేయుచున్న యొక రెవిన్యూ యినస్పెక్టరును యిద్దరు జవానులను నాకు సహాయమిచ్చిరి, నేను పట్టణములో దిగుటకు జట్కాబండి నొకదానిని ప్రత్యేకముగా నుంచుకొమ్మనియు, దానిఖర్చు దామే భరింతుమనియు, మొక్కపాటి సుబ్బారాయుడుగారు నాకు వ్రాసిరి. విశాలముగా నుండుటచే వీరేశలింగము పాఠశాలలో సభ జరిపితిమి. పందిళ్ళు, పాకలు, పంట శాలలు, మొదలైనవి వేయించితిమి. కూలసిన సొమ్మంతయు రాజాగారి రెవిన్యూ యినస్పెక్టరుగారే ఖర్చుపెట్టిరి. వీరేశలింగ పాఠశాల ప్రధానో పాధ్యాయులైన ముడియము సీతారామారావుగారును, సహాయోపాధ్యాయు డైన రామాప్రగడ వెంకట రామయ్యగారును, నాకు ముఖ్యముగా సహా యులై పందిళ్ళు పాకలు వేయించి, వంటబ్రాహ్మణులను గుదిర్చి, వంటలు చేయించి, యతిథుల కేగౌరవమున లోటులేకుండ జరిపించిరి. ఆసభకు జయంతి రామయ్య పంతులుగారును, నెల్లూరుజిల్లా కలెక్టరుగారైన తడ్ల రాఘవయ్యగారును, కొచ్చిను సంస్థానపు మంత్రియైన నెమలి పట్టాభిరామా రావు గారును, సెటిల్‌మెంటు డిపార్టుమెంటులో గొప్ప పదవిలోనున్న ముట్నూరి యాదినారాయణయ్యగారును, వావిలాల వెంకట శివావధానులు గారును, శ్రీ పానుగంటి రామారాయణంగారును, వావిలికొలను సుబ్బారావు గారును, స్వయంపాకియైన వీరభద్ర పాకయాజిగారును మున్నగువారనే కులు వచ్చిరి. సభ రెండు దినములు జరిగెను. వీరేశలింగము స్కూలు మేడమీద పెద్దహాలులో సభజరిగెను. వావిలాల శివావధానులుగారు ప్రార్థన ములతో సభను ప్రారంభించిరి. శ్రీ పానుగంటి రామారాయణంగారు సభ కధ్యక్షత వహించిరి. రెండవదినమున శ్రీ కొక్కొండ వెంకటరత్నము పంతులుగారధ్యక్షతవహించిరి. దివాకర్ల తిరుపతిశాస్త్రిగారు దెనుగు వాఙ్మయ మును గురించి కొన్ని చక్కని పద్యములు చదివిరి. కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రిగారు మొదలగు పండితులుపన్యసించిరి. సభముగిసిన తరువాత రెండవ

నాడు రాత్రి సభకువచ్చిన యతిథుల వినోదార్థమై రాంజీరావను నతనిచేత, వినోదప్రదర్శనము (Magic) జేయించితిని. అదిచాల బాగుండెనని శ్రేష్ఠకుయి సంతోషించిరి. వానికేమైన బహుమతి నిచ్చిన బాగుండునని, సుబ్బారాయుడుగారిపేర వ్రాయగ, వారు, రాంజీరావున కిమ్మని పదునైదు రూపాయిలు నావద్దకు బంపగా, వానికి నేనవి వెంటనే యిచ్చివేసితిని. సభ యన్ని విధముల జయప్రదముగ జరిగినదని జయంతి రామయ్యగారు సంతోషించిరి. పెత్తనము నామీదపెట్టినందుకు, సభ నిరంతరాయముగా జరిగినందుకు, నేను ధన్యుడనని సంతోషించితిని. ఈ సభ 1913 సంవత్సరములో జరిగెను. 1914 వ సంవత్సరములో నీసభ కాకినాడలో జరుగునట్లు నిశ్చయింపబడెను.

1913 వ సంవత్సరము మే నెలలో మొట్టమొదటి యాంధ్రమహాసభ, గౌరవనీయులైన బయ్యా నరసింహేశ్వర శర్మగారి యాధిపత్యమున బాపట్లలో జరిగెను. నేనాసభకు బోయితిని. నాటియాంధ్రుల యుత్సాహము నందున ముఖ్యముగా గుంటూరు మండల వాసుల యుత్సాహమును వర్ణనాతీతము. కొండా వెంకటప్పయ్యగారు, కనగల్లి రామస్వామిగుప్తగారు, గొల్లపూడి శీతారామయ్యగారు మున్నగు దేశభక్తులు, సభానివసమున ప్రాతఃకాలమున స్నానములు చేసి, పట్టువస్త్రములుధరించి నూరంతియు భజనలు చేయుచు నూరేగివచ్చి ప్రార్థనలతో సభను ప్రారంభించిరి. సభ రెండు దినములు మిక్కిలి యుత్సాహముతో జరిగెను. రెండవనాడు పవిత్రమైన యాంధ్రోద్యమమునకు, ధనసహాయముచేయుడని హెచ్చరించుచు, నేనుపన్యసించితిని. ఆ దినములలో రైలుబండ్లు నడుపువారు కట్టుకట్టుటచేత బండ్లు సరిగా వచ్చుటలేదు. మూడవనాడు మేము రైలుస్టేషనులో నెంతో సేపు కనిపెట్టుకొని యుండగా, ననుభవములేని క్రొత్తవానిచాండ్రు నడుపుచున్న రైలుబండ్లు వచ్చెను. కొత్తవారు నడుపునపు డేమి ప్రమాదము సంభవించునోయను భయముతో బండినెక్కి, ప్రాణము లరచేత బెట్టుకొని, యెట్టకేలకు మధ్యాహ్నమునకు రాజమహేంద్రవరము జేరితిమి.

ఆ సంవత్సరము గోదావరీ మండలసభ మరల నుద్ధరింపబడి, మొదటిసారి కాకినాడలో జరిగెను. దానిని దుగ్గిరాల సూర్యప్రకాశరావు గారు పునరుద్ధరించిరి. రాజకీయసభకు గౌరవనీయులైన వి. శ్రీనివాసశాస్త్రిగారధ్యక్షత వహించిరి. సంఘ సంస్కరణసభకు బరంపురము నివాసులైన కోపర్గాము రామమూర్తిగారధ్యక్షులైరి. నేను కాకినాడబోయి

యా రెండుసభలలో పాల్గొంటిని. ఆదినములలో, పిఠాపురము మహారాజా వారు, తెనుగులో సరసమైన పద్యకావ్యములు వ్రాసినవారికి బహుమానముల నిచ్చెదమని ప్రకటించిరి. కొన్ని కావ్యము లేఁటవచ్చుచుండెను. ఆకావ్య ములను బరీక్షించుటకు కందుకూరి వీరేశలింగముగారిని, శ్రీ పానుగంటి రామరాయణంగారిని, నన్ను నేర్పరచిరి. మొదట వీరేశలింగముగారి కడకు పంపబడుచుండెను వారు చూచినతరువాత నాకడకు బంపుచుండిరి. నేను చదివిన పిమ్మట శ్రీ పానుగంటి రామరాయణంగారికి బంపుచుంటిని. మా ముగ్గురిలో నిద్దరు బాగున్నదని యెప్పుకున్న కావ్యమునకు బహుమతి యొసంగబడుచుండెను. సరసములైన కావ్యములు రాకపోవుటచే క్రమ ముగా నా పద్ధతి పరిమింపబడెను. ఆ సంవత్సరము జూలైలో కందుకూరి వీరేశలింగముగారు తెనుగులో నొక వ్యాసమువ్రాసి, ప్రకటనార్థము, నా "దేశమాత" పత్రికకు బంపిరి. దానిని నేనుప్రకటించితిని. ఆ వ్యాసము తన్నుగూర్చి వ్రాసినట్లును, తన ప్రతిష్ఠ కది భంగకరముగా నున్నట్లును దలంచి, టంగుటూరి శ్రీరాములుగారు వీరేశలింగముగారిమీద, జాయింటు మేజస్ట్రీటునొద్ద పరువునష్టమున కభియోగము (Defamation) తెచ్చిరి అప్పుడు రాజమహేంద్రవరములో తాడికొండ శీతారామయ్యగారు జాయింటు మేజస్ట్రీటుగానుండిరి. ఆయనే యీ యభియోగము విచారి చిరి. వీరేశ లింగముగారి పక్షమున ధరవాడ కృష్ణారావు పంతులుగారును, కనుపర్తి శ్రీరాములుగారును, న్యాయవాదులుగ నిలిచేసిరి. టంగుటూరి శ్రీరాములు గారు తన పక్షమున నన్నుగూడ సాక్షిగా వేసికొనిరి. వీరేశలింగముగారు నిర్దోషియని నేను నమ్మువాడననియు నా సాక్ష్యమువలన తమ కేమియు ప్రయోజనము లేదనియు, నేను స్వయముగా శ్రీరాములుగారితో చెప్పితిని. ఇతరులచేతగూడ చెప్పించితిని. అయినను వారు నన్ను విడువలేదు శ్రీరాములుగారి పక్షమున దామెర్ల వెంకటరమణరావుగారు, చిలుకూరి వీరభద్రరావుగారు, మొదలగువారు సాక్ష్యమిచ్చిరి. ఆ సాక్ష్యములు వీరేశ లింగముగారికి వ్యతిరేకముగా నుండెను. నా సాక్ష్యము వీరేశలింగముగారి కనుకూలముగా నుండెను జాయింటు మేజస్ట్రీటుగారా యభియోగమును విచారించి కొట్టివేసిరి వీరేశలింగముగారు నిర్దోషియని తీర్పులోవ్రాసిరి.

ఆ సంవత్సర మునగా 1913 వ సంవత్సరములో చెన్నపురి గవ ర్నరుగారి కార్యనిర్వాహకవర్గములో సభ్యులైన, సర్. పి. యస్. శివ స్వామయ్యగారు రాజమహేంద్రవరము వచ్చిరి. మా పట్టణమునకు కావల

సిన కొన్ని మార్పులను, వారియొద్ద విన్నవించుకొనుట కొకవిజ్ఞాపన సంఘము (Deputation) యేర్పడెను. ఆ సంఘమునకు న్యాయపతి సుబ్బా రావు పంతులుగారధ్యక్షులు. అనేక పురప్రముఖులందు సభ్యులుగానుండిరి. నేనుగూడ నందొక సభ్యుడను. బజారు (Main Road) వెడల్పు చేయు మని మే మందరము వారిని గోరితిమి. పదిలక్షల రూపాయిలు దానికి వ్యయమగుననియు, నది యప్పుడు సాధ్యముగాదనియు చెప్పిరి. నీటికుళా యిలు త్వరగ నేర్పాటుచేయింతుమని వారుచెప్పిరి. పిమ్మట వీరేశలింగము గారు, టంగుటూరి శ్రీరాములుగారి మీదను, నాళము కృష్ణారావుగారిమీదను, సత్యవోలు అప్పారావుగారి మీదను, నప్పుడు రాజమహేంద్రవరములో జాయింటు మేజస్ట్రీటుగానున్న "బార్డ్సువెల్లు" దొరగారియొద్ద పరువునష్ట మున కభియోగము దెచ్చిరి. ఏలూరునుండి మోచర్ల రామచంద్రరావుగారు వచ్చి రాజీకి ప్రయత్నముచేయగా, నాళము కృష్ణారావుగారు వారి సలహా వినలేదు అంతట జాయింటుమేజస్ట్రీటుగారు కేసు విచారణచేసి వీరి ముగ్గురిమీదను నేరస్థాపన (Charge) చేసి, యుత్తర సాక్ష్యము దెచ్చు కొమ్మనిరి. అప్పుడు నాళము కృష్ణారావుగారును, సత్యవోలు అప్పారావు గారును వీరేశలింగముగారికి క్షమార్పణలిచ్చిరి శ్రీరాములుగారిమీది యభి యోగము జరుగుచునే యుండెను. అంతట "బార్డ్సువెల్లు" దొరగారు బదిలీకాగా వారిస్థానే "స్టీవార్డు" దొరగారు వచ్చిరి మొదటినుండియు విచారణ చేయుచుని శ్రీరాములుగారు కోరిరి. శ్రీరాములుగారి పక్షమున వారి యన్నగారైన ప్రకాశముగారు వచ్చి వాదించిరి. స్టీవార్డు దొరగారు వీరేశలింగముగారి సాక్ష్యమొక్కటే బుచ్చుకొని కేసు కొట్టివేసిరి.

1914 వ సంవత్సరములో రెండవ గోదావరీమండల సభ రాజ మహేంద్రవరములో జరిగెను. దానికి మహారాజశ్రీ మోచర్ల రామచంద్ర రావు పంతులుగా రధ్యక్షులైరి. ఆదిపూడి సోమనాధరావుగారు సంఘ సంస్కరణసభ కధ్యక్షులైరి ఆ రెండు సభలలోగూడ నేను పాలుగొంటిని. అవి జయప్రదముగానే జరిగెను.

రెండవ యాంధ్రమహాసభ 1914 వ సంవత్సరములోనే బెజవాడలో జరిగెను. దానికి న్యాపతి సుబ్బారావుపంతులుగా రధ్యక్షులైరి నేనాసభకు బోయి ప్రాచీనాంధ్రకవులను గురించి మాటలాడితిని. రాజమహేంద్ర వరమునుండి వెళ్ళిన ప్రతినిధులు దాసు కేశవరావుగారి యింట బసచేసిరి. కేశవరావుగారు వారి సోదరులును మమ్ము మిక్కిలి యాదరించిరి. ఆ సంవ

త్సర మకాలవర్షము లెక్కువగ గురిసినందున సభకై యేర్పడిన శాలలో ప్రతినిధులు నిలుచుటకు వీలులేకపోయెను. సభాసదులు నిలువున నీరయి పోయిరి. ఆ ప్రళయవర్షములచేత సభలు దిన్నగ జరుగలేదు. పదిమంది జేరి యెట్లో సభ యైనదనిపించినారు. ఆ దినములలోనే సకలాంధ్రమండల గ్రంథాలయ మహాసభ బెజవాడ టపునుహాలులో జరిగెను. ఆ సభకు నన్నధ్యక్షునిగ సభాసన్నాహకు లేర్పరచిరి. ఆనాడు నా యుపన్యాసము మిక్కిలి బాగున్నదని సభాసదులు గొనియాడిరి. అది గ్రంథాలయ సర్వస్వ పత్రికలో ప్రకటింపబడెను. అట్టి యుపన్యాసము స్థిరముగ నుండెవలెనని తలంచి ప్రత్యేకపు స్తకముగా గూడ నచ్చువేసిరి 1914 వ సంవత్సరము జూను నెలలో గుంటూరుమండల సభలు వంగవోలులో జరిగెను రాజ కీయసభకు శ్రీ వింజమూరి భావనాచార్యులుగా రధ్యక్షులైరి. సంఘసంస్క రణ సభ కధ్యక్షుడుగా నన్నాహ్వానించిరి నేనును, నా మిత్రులైన చెరువు సోమయాజులుగారును, రాయవరపు రామమూర్తిగారును గలసివెళ్ళి వంగ వోలులో మైనముపాటి నరసింహముగారి యింట బసచేసితిమి. రెండుసభలును చక్కగానే జరిగెను. ఆ సంవత్సరమున నాకు శ్రీ పిఠాపురము మహారాజా వారు, నా యప్పులు దీర్చుకొనుటకు, సహజమైన యౌదార్యముతో, నా కారువేలరూపాయిలు నోటుమీద బదులిచ్చిరి దానితో గొన్నియప్పులు దీర్చుకొంటిని. అదిగాక యవసరమైన గొన్నిపుస్తకము లచ్చువేయించు టకై మరి పదునైదువందల రూపాయిలు, మరియొక నోటుమీద బదులిచ్చిరి ఆ సంవత్సరము మొత్తముమీద నాకు రాజాగారు యేడువేల నైదువందల రూపాయిలు బదులిచ్చిరి. ఆ సొమ్ము వారు నా దగ్గిర తిరిగి పుచ్చుకొనలేదు. ఇదిగాక మహారాజాగారు పంపారులు నా పాలిటి చింతా మణియై. కల్పవృక్షమై నా కవసరమైనపుడెల్ల వేలకొలది రూపాయిల నిచ్చి నా చిక్కులు బాపి నన్నుద్ధరించిరి ఇంతకు వారి నిర్హేతుకదాయమాన కటాక్షమేగాని, వారికి నేను జేసిన సేవగాని, యుపకారముగాని లేదు. భగవంతుడు వారిలో ప్రవేశించి యనుగ్రహించెను, వ్యగ్రుడనునైన నాకు వారి చేత బహుసాహాయ్యకారములు చేయించెను. మహారాజావారి యౌదార్యమును నే నెన్నటికి మరువలేను

1914 వ సంవత్సరమున చెన్నపురి గవర్నరుగారైన "పెంట్లండు" ప్రభువుగారు రాజమహేంద్రవరము వచ్చిరి. న్యాపతి సుబ్బారావు పంతులు గారు వారిని దర్శింపగా గవర్నరుగారు ప్రసంగవశమున నీపట్టణమున

నందుడైన కవి యున్నాడట బాగున్నాడాయని యడిగిరట,, ఆ వార్త సుబ్బారావు పంతులుగారు టపుసుహాలులో నాతోను నామిత్రులతో సుచెప్పిరి. నా విషయమై గుర్నరుగారి కెట్లు దెలిసెనని నా మిత్రు లాలోచిం వారం భించిరి రాజకీయములలో మిక్కిలి తీవ్రములైన యుపన్యాసములిచ్చుటచే పోలీసువారి రిపోర్టులవల్ల దెలిసెనని, కొందరూహించిరి. అదిగాదని కొంద రనిరి.

ఆ సంవత్సరము దెనుగులో గ్రామ్యభాష నుపయోగింపవలెనా గ్రాంధికభాష నుపయోగింపవలెనా యన్న సమస్య మిక్కిలి తీవ్రముగ నుండెను. పిఠాపురము మహారాజావారు గ్రాంధికభాషాభిమానులు. విశాఖ పట్టణము వ్యవహారిక భాషా దురంధరుల కాటపట్టు. అక్కడకు వెళ్ళి గ్రాంధిక భాషనుగురించి గట్టి యుపన్యాసము లీయవలసినదని మహారాజా వారు ఖర్చులిచ్చి నన్ను, పురాణ పండ మల్లయశాస్త్రిగారిని, పాసుగంటి లక్ష్మీనరసింహారావుగారిని, కూచి నరసింహముగారిని బంపిరి. అక్కడ భాషావిషయమై గొప్పసభ జరిగెను. గ్రాంధిక భాషావిషయమై మాటలాడు మని నాతో వచ్చినవారు నన్నే వేదిక నెక్కించిరి. నేనొక గంటసేపు నాకు దోచిన యుక్తులు జెప్పి ప్రమాణములు జూపి గ్రాంధికభాషా ప్రాశ స్త్యమును బలపరచుచు నుపన్యసించితిని. ఉపన్యాసమెట్లున్నదో చెప్పజా లను గాని, నామనసునకు మిక్కిలి సంతుష్టిగానుండెను. ఆంధ్రసాహిత్య పరిషత్సభ యాసంవత్సరము (1914) కాకినాడలో జరిగెను. ఆసభకు నేనును బోయితిని. ప్రథమ దినమున కిళాంబి రామానుజాచార్యులుగా రధ్య క్షత వహించిరి. రెండవనాడు శ్రీ పిఠాపురము మహారాజావారధ్యక్షత వహించిరి. ఆసభలో నేనేమియు మాటాడలేదు. బళ్ళారినుండి యాసభకు ప్రతినిధిగ వచ్చిన శంకరలింగము పిళ్ళగారు మరునటి సంవత్సర మీసభను బళ్ళారి రావలసినదని యాహ్వానించిరి.

కర్నూలు మండలమున నందియాలయను నొక చిన్న పట్టణము గలదు. అక్కడ దేశపాండ్య సుబ్బారావుగారుగారని యొక దేశాభిమాని యుండిరి. ఆయనయు నేనును ననేక సభలలో గలసికొంటిమి. ఒకసారి యాయన నాతో నిట్లనిరి. "మాపట్టణములో నొక సంఘము గలదు, మేము దానికి వార్షికోత్సవము చేయదలచుకొన్నాము. ఆసభకు మోచర్ల

రామచంద్రిరావుగా రధ్యక్షులుగను మీరుపన్యాసకులుగను రావలయును. మీకిద్దరకు నసుకూలమైన సమయములోనే సభపెట్టుకుందుము" అందుకు నేనొప్పుకొంటిని. కాని నందియాల వెళ్ళుటకు రామచంద్రరావుగారికిని నాకును నొక్కసమయముకుదురలేదు. కొన్నిమాసములు గడచెను. తుదకు దేశపాండ్య సుబ్బారావుగారు 1914 డిశంబరు మూడవవారములో సభ నేర్పాటుచేసి, యెట్లయినను వీలుచేసుకొని రమ్మని, నాకును రామచంద్ర రావుగారికిని వ్రాసిరి. వారి కోరిక ననుసరించి మే మిరువురమును నంది యాల వెళ్ళితిమి. అప్పుడు నా గుమాస్తాయైన కామరాజు వెంకటరమణ శర్మ నాతో వచ్చెను. నందియాలలో వార్షికోత్సవసభ చక్కగా జరిగెను. వారి కోరిక ప్రకారము రామచంద్రరావుగా రధ్యక్షులైరి. నే నుపన్యసించి తిని, దేశపాండ్య సుబ్బారావుగారు మిక్కిలి సంతోషించిరి. రామచంద్ర రావుగారును నేనును స్వస్థలములకు వచ్చుటకై బయలుదేరితిమి. అప్పుడు నేను రైలుబండిలో రామచంద్రరావుగారి నిట్లడిగితిని. "అయ్యా! గవర్నరు గారు రాజమహేంద్రవరము వచ్చినప్పుడు నా విషయమై సుబ్బారావు పంతులుగారి నడిగిరట, యెందుకై యుండును? రాజకీయములలోనే నిచ్చిన యుపన్యాసములను బట్టి పోలీసువారు నామీదచేసిన రిపోర్టులు జ్ఞాపకముండుటచేత గవర్నరుగారు నన్నడిగిరని గొందరనిరి. ఇదినిజమా?" అందుకు రామచంద్రరావుగారిట్లనిరి. గవర్నరుగారు మీపేరు జ్ఞాపక ముంచుకొనుట కదికారణముగాదు. పాఠశాలలో గ్రామ్యభాష నుపయో గింపవలెనా, గ్రాంధికభాష నుపయోగింపవలెనా యను సమస్య వచ్చి నప్పుడు, బయ్యా నరసింహేశ్వరశర్మగారో నేనో, గవర్నరుగారితో నిట్లంటిమి. "రాజమహేంద్రవరములో కందుకూరి వీరేశలింగముగారు, చిలకమర్తి లక్ష్మీనరసింహము గారను నంధకవియు గలరు. వారి తెనుగు శైలి సరసముగా నుండును. వారిశైలి నవలంబించుట మంచిది." అట్లు మేము చెప్పుటచేత గవర్నరుగారికి మీపేరు జ్ఞాపకి ముండియుండును కాని పోలీసువారి రిపోర్టులవల్లగాదు. ఆ పలుకులు విన్నతరువాత నాకు నిజమైన కారణము తెలిసెను.

స్వీయ చరిత్రము

పదునెనిమిదవ ప్రకరణము

దేశీయ మహాసభ నిమిత్తము చెన్నపురి ప్రయాణము

ఆ సంవత్సరము (1914) జాతీయమహాసభ (Indian National Congress) చెన్నపురిలో జరుగుట కేర్పాటుచేయబడెను. కలకత్తా నివాసులైన భూపేంద్రనాథబోసుగారధ్యక్షులైరి. సుబ్బారావు పంతులు గారు మోచర్ల రామచంద్రరావుగారు మొదలైనవారు వెళ్ళిరి. నేనును నా మిత్రులును గూడ నా సభకు వెళ్ళితిమి. ఆ దినములలోనే యావద్భారతఖండాస్థిక మహాసభ చెన్నపురిలో జరిగెను. హేరంబమైత్రగారు దాని కధ్యక్షులైరి. నారాయణగణేశ చండవర్కరుగారు, హేమచంద్రసర్కారు గారు, కృష్ణకుమార మైత్రగారు మున్నగు ప్రముఖులా యాస్థికసభకు వచ్చిరి. వారి యుపన్యాసము లతిమనోహరములై యుండెను. ఆ సభలు ప్రతిదినము నాల్గుగంటలకు జరుగుచుండెను. నేను తప్పక వాటికి ప్రతిదినము వెళ్ళుచుంటిని. ఒకనాడుదయమున, నన్నపిళ్లైవీధిలో నున్న ప్రార్థనామందిరములో, శ్రీ కృష్ణ కుమారమైత్రగా రుపాసన జేసిరి. తెల్లని గడ్డముతో నాయన మహర్షివలె నుండిరి. ఆయన యుపాసనవిని నేను ధన్యుడనైతిని. చండావర్కరుగారి యుపన్యాసములు గంభీరములై హృదయంగమములుగ నుండెను. ఆస్థికసభానంతరమున నొకనాటి రాత్రి ప్రీతిభోజనము జరిగెను. నన్ను గూడ వారాహ్వానించిరి. నేనువెళ్ళి కూరుచుండి నాప్రక్కస్థానములో నెవరుకూర్చుండిరని యడిగితిని. "నేను మీ మిత్రుడను చండావర్కరును" (I am your friend Chandavarkar) అని నాకు చండవర్కరుగారు జవాబు చెప్పిరి.

ఆ కాంగ్రెసు జరుగుచున్న దినములలోనే యాంధ్రసను హాలులో నిమ్నజాతుల యుద్ధరణమును గురించి యొక సభ జరిగెను. ఆ సభ 1914 వ సంవత్సరము డిశంబరు నెల ముప్పదియవ తేదీని జరిగెను. ఆ సభకు బొంబాయి హైకోర్టు న్యాయమూర్తియైన, నారాయణగణేశ చండా

వర్కౌరుగా రధ్యక్షులైరి. చెన్నపురి హైకోర్టు న్యాయమూర్తియైన శంకర నాయరుగారు వారి ప్రక్కనే గూర్చుండిరి. చెన్నపురి రాజధానిలో నిమ్న జాతుల గురించి యెవ్వరెవ్వ రెచ్చట నే విధముగా బనిచేయుచున్నారో తెలిసికొనుటకై యా సభ జరిగెను. ముళయాళ దేశస్తుడైన నా మిత్రు డొకడు, నేను గూడ నిమ్నజాతులను గురించి పనిచేయుచున్నానని విని, నన్ను గూడ సభలో మాటలాడుమని ప్రోత్సాహపరచెను. నేనా సభకు బోయితిని. మంగుళూరులో రంగారావుగారును. నితరస్థలములలో పని చేసిన యితరులును, వారి వారి యనుభవములను చెప్పిరి. నేను గూడ యుపన్యాసవేదిక నెక్కి 1909 లో నేను పంచములకు పాఠశాల పెట్టి నది మొదలుకొని, యప్పటివరకు నా యనుభవముల, నింగ్లీలో నిరువది నిముషములు చెప్పితిని. చిట్టచివర నే నిట్లంటిని. ("I am a blind man I did this little work I could not do more" (నేను అంధు డను. కొలదిగా కృషిచేసితిని. ఇంతకంటే చేయలేకపోతిని.) అని చెప్పి వేదికనుండి దిగబోవుచుండగా, చందావర్కరుగారులేచి నా చేయి పట్టు కొని (Shakehand Mr. Narasimham! You are not blind, we are all blind (నరసింహముగారూ: మీరు అంధులు కారు: వాస్త వంలో మేమే గ్రుడ్డివాండ్రము) అని పలికిరి. నేను వేదికదిగి నా స్థాన మున గూర్చుంటిని. న్యాపతి సుబ్బారావు పంతులుగారును, మోచర్ల రామచంద్రరావుగారును చెన్నపురిలో కాస్మపోలిటను క్లబ్బులో బనజేసిరి. నేను వారిద్దరిని చూడబోయి యిట్లంటిని. "గవర్నరుగారు రాజమహేంద్ర వరము వచ్చినప్పుడు నన్ను దలపెట్టిరి కావున, నేను వారి దర్శనము చేసిన బాగుండునా?" యని యడిగితిని. తప్పక చూడవలసినదే యని వారిరువురును పలికిరి. ఆ సమావేశము మీరే యేర్పాటుచేయుడని వారిని గోరితిని. వెంటనే రామచంద్రరావుగారు, నాకు గవర్నరుగారితో సమా వేశము నేర్పాటుచేయుమని, గవర్నరుగారి యాంతరంగిక కార్యదర్శియైన కాటెరెల్ (Cotteral) దొరగారిపేర వ్రాసిరి. వారు డిశంబరు ముప్పది యొకటవ తేదీని మధ్యాహ్నము 12 గంటలకు, నాకు గవర్నరుగారు దర్శనమిచ్చునట్లేర్పాటుచేసి, యా సంగతి రామచంద్రరావుగారికి దెలియ పరచిరి. రామచంద్రరావుగారు నాకు చెప్పిరి.

డిశంబరు ముప్పదియొకటవ తేదీని, రావుసాహేబు గంటి వెంక బ్రామయ్యగారు, కాంగ్రెసునకు వచ్చిన రాజమహేంద్రవర మిత్రులకు

విందుచేయదలచి, నన్నును బిలిచిరి. చెరువు సోమయాజులుగారును నేనును యాదినమున తొమ్మిదిగంటలకే వారియింట నుంటిమి. వెంకట్రామయ్యగా రేదో పనిమీద, నెచటికోబోయి పదునొకండు గంటలవరకు రాలేదు. గవర్నరుగారి దర్శనసమయము దాటిపోవునేమోయని భయపడి, సోమయాజులుగారిని దీసుకొని, ప్రక్కనేయున్న బయ్యా నరసింహేశ్వర శర్మగారింటికివెళ్ళి వారితో నీవిషయముచెప్పితిని. "మాయింట భోజనము చేసిన పక్షమున నా మోటారుమీద గవర్నరుగారి దర్శనమునకు బంపెద" నని శర్మగారు పట్టుబట్టిరి. నే నొప్పుకొని వారింట భోజనము చేసితిని. భోజనానంతరమున నరసింహేశ్వరశర్మగారు మోటారు నిమిత్తము చూడగా, దానిని వడుపునతడు (Driver) ముందుగ చెప్పకబోవుటచే, నింటికిబోయెను. అప్పుడు కాలాతీతమగుచున్నదని నేను తొందరపడు చుండగా, గంటి వెంకట్రామయ్యగారువచ్చి, బండి నేర్పాటుచేయుదునని మాతోచెప్పి, యాసమయమున నా పీడివెంబడి గుర్రపుబండిమీద బోవు చున్న టి. రామచంద్రయ్యరుగారి తమ్ముడైన టి. కృష్ణస్వామయ్యరుగారి బండినాపి, యా విషయమంతయుజెప్పి, తమబండి నెరువీయమని కోరిరి. ఆయన వెంటనే బండిదిగి దానిని మాకిచ్చిరి. సోమయాజులుగారిని వెంట బెట్టుకొని బండియెక్కితిని. ఆ గుర్రము మిక్కిలి చురుకైనది. అప్పటికి 11 గంటల 30 నిముషములయినది. మాబండి గవర్నరుగారి బసకు పోవునప్పటికి పదినిమిషములు తక్కువగా 12 గంటలయ్యెను మారాకగవర్నరు గారికి తెలియపరచుమని క్రిందనున్న గుమాస్తాలతో చెప్పితిని. వారు వెంటనే చీటివ్రాసి పైకిబంపిరి. అనంతరమున గవర్నరుగారి యంగరక్షకుడైన యొక దొర నాకడకువచ్చి, నన్ను మేడమీదకు దీసికొనివెళ్ళి, యొక సోఫామీద కూర్చుండబెట్టెను. అవ్వల గవర్నరుగారైన పెంట్లాండు ప్రభుపుగారు వచ్చి నాతో కరస్పర్శనముచేసి, నాప్రక్కను కూర్చుండి నాతో మాటలాడ నారంభించిరి. ఆ ప్రసంగములో నా కంటిజబ్బును గురించి యడిగి, నేను నిమ్నజాతులకొరకు బనిచేయుచున్నట్లదివరకే విన్నారుగనుక యా విషయమై కొంత ముచ్చటించి, పిమ్మట గ్రామ్యగ్రాంధిక భాషా విషయమెత్తి యావిషయమై గవర్నమెంటువారి యుత్తరపులు త్వరలోనే పడుననిచెప్పి సంభాషణలు ముగించి లోనికిబోయి, యొక యింగ్లీషు పుస్తకముచెచ్చి యది నాకిచ్చి యిట్లనిరి. "ఇది యమెరికా దేశస్థురాలైన నొక గ్రుడ్డి మూగ స్త్రీ వ్రాసిన గ్రంధము. దీనిపేరు "ఆప్టిమిజం" (Optimism)

ఆమె గొప్ప గ్రంథకర్త్రి. మన సమావేశము జ్ఞాపకముండుటకు మీకు నేనీ పుస్తకము బహుమతిగ నిచ్చుచున్నాను" అనిచెప్పి నాకు నెలవిచ్చిరి. అంగరక్షకుడు నన్నెప్పటియట్ల క్రిందికి గొంపోయి బండి నెక్కించెను. సోమయాజులుగారును నేనును జరిగిన వృత్తాంతమును నరసింహేశ్వర శర్మగారికిని, మిత్రులకునుజెప్పి, యచటనుండి జాతీయ మహాసభకుబోయి న్యాపతి సుబ్బారావు పంతులుగారిని గలుసుకొని కాంగ్రెసులో మాటలాడ వలెనని కుతూహలముగా నున్నది. ఏర్పాటు చేయగలరాయని యడిగితిని. అట్లేయని వారు సభాధ్యక్షునితో మాటలాడి, దక్షిణాఫ్రికాను గురించిన తీర్మానమును బలపరచుటకై నాపేరు పన్యాసకులపట్టికలో వేయించిరి. ఆ తీర్మానమును బంగాళాదేశస్థుడు గట్టిగా నింగ్లీషులో ప్రతిపాదించెను. తెనుగుతో నేను బలపరచితిని. ఆదినము సభలో రమారమి పదివేలమంది యుండిరి. తెనుగు దెలిసినవారు రమారమి నాలుగైదువేలుందురు. నే నుచ్చరించిన ప్రతివాక్యమునకు సభాసదులు సంతోషించి చప్పట్లుగొట్టిరి. నా కంఠధ్వని యన్నిప్రక్కలకు వినబడెను. పదినిముషములు మాటలాడి వేదికదిగి, యాదినమునగూడ నిమ్నజాతుల విషయమై యాంధ్రసను హాలులో సభ జరుగునని విని, చెరుపు సోమయాజులుగారిని, రాయవరపు రామమూర్తిని, వెంటబెట్టుకొని యచటకు బోయితిని. ఆదినమున గవర్నరుగారా సభ కధ్యక్షులు. మే ముపన్యాసవేదిక ప్రక్కనే గూరుచుంటిమి. గవర్నరుగారు వేదికనెక్కి ప్రక్కనున్న నన్నుజూచి "Hallow! Mr Narasimham, you are here" (హలో! నరసింహంగారూ మీరిక్కడున్నారా?) అని వంగి నాకు కరస్పర్శనమిచ్చి, "He is also working for the depressed classes" (ఈయనకూడ నిమ్నజాతులకై కృషి చేయుచున్నారు) యని శంకరునాయరుగారితో జెప్పిరి. 'ఔను నేనెరుగుదు నని' శంకరునాయరుగారు బదులుజెప్పిరి. కొన్ని యుపన్యాసములైన తరువాత సభ ముగిసెను. ఆ మరునాడు, 1915 వ సంవత్సరము జనవరి యొకటవతేదీ టంగుటూరి ప్రకాశముగారు తమ మిత్రులమైన మా కంద రకు విందుజేసిరి. పిమ్మట రెండుమూడు దినములలో చెన్నపురినుండి బయలుదేరి రాజమహేంద్రవరము వచ్చితిమి.

1915 వ సంవత్సరమున నాంధ్రసాహిత్యపరిషత్సభ బళ్ళారిలో జరుగుటకు నిశ్చయింపబడినదని యిదివరకే వ్రాసితిని. ఆంధ్రనాటక పితామహుడని పేరుపొందిన ధర్మవరము రామకృష్ణమాచార్యులవారిపేర,

బళ్ళారిలో నొకచిన్నసమావేశమును గట్టించి, దానిని దెరుచుటకు నన్నుర మ్మని బళ్ళారి పురజనులు ఫిబ్రవరినెలలో నాహ్వానించిరి సాహిత్యపరిషత్సభ యేప్రియలునెలలో జరుగునుగావున నేనప్పుడువచ్చి యాపనిచేయుదునని వారికి వ్రాసితిని. వారాపనియంతవరకు నిలుపుచేసిరి. సాహిత్యపరిషత్సభ నిమిత్తము రాజమహేంద్రవరమునుండి నేనును, రాయవరపు రామమూర్తియు, గంటి వరహాలును వెంటబెట్టుకొని వెళ్ళితిమి. మాతో బారు శ్రీరాపు నరసింహారావుగారుగూడ వచ్చిరి. గుంటూరు మొదలుకొని గుంటకల్లు వరకును క్రోపలో మాకు విందులుజరిగెను. నరసారావుపేటలో జిల్లామునసబుగానున్న తంజావూరు జగన్నాధరావుగారు మాకు నరసారావుపేట రైల్వేస్టేషనులో భోజనములుపెట్టించిరి. మూరైలుబండి రాత్రి నందియాలచేరునప్పటికి, నచట మిషనుహైస్కూలులో నుపాధ్యాయుడుగా నున్న ధరవాడ రామారావుగారు మారాక విని గృహమందు వంటలు చేయించి, ప్లాటుఫారముమీద మాకందరకు పిండివంటలతో భోజనములు పెట్టిరి. తెల్లవారునప్పటికి బండి గుంటకల్లు చేరెను. అక్కడ మరియొక బండినెక్కి బళ్ళారి యుదయము 10 గంటలకు చేరితిమి. చెన్నపురి శాసన నిర్మాణసభలో నప్పుడు సభ్యుడుగానున్న పి. శివరావుగారి యింట నాకు బసనేర్పాటుచేసిరి. వారి మోటారుబండి నాయుపయోగములో నుండెను. సాహిత్యపరిషత్సభ రెండుదినములు జరిగెను. ఆనెగొంది మహారాజుగారైన రంగదేపుల రాయలుగారు సభకధ్యక్షులైరి. ఆరాజుగారు శ్రీ కృష్ణదేవరాయలువారి వంశస్థులట! ఆనెగొంది తుంగభద్రాకావల నిజాముర్రాష్ట్రములో నున్నది. జయంతి రామయ్యగారు, గుమ్ములూరి వెంకటరంగారావుగారు, నెమిలి పట్టాభిరామారావుగారు, గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు మున్నగువారనేకులాసభకు వచ్చిరి. బళ్ళారి "సరసవినోదిని" నాటకసమాజమువారు మానిమిత్తము రెండునాటకములు ప్రయోగించిరి. అందొకటి రామరాజు. ఆనాటకములో శ్రీ తాడిపర్తి రాఘవాచార్యులుగారు పరాను పాత్రధరించి మిక్కిలి యద్భుతముగానటించి, నాటకాంతమున వియుపగల జరీబనారసుపట్టుశాలువ యొకటి నాకు బహుమానముగా గప్పిరి. రెండవ నాటకము కృష్ణమాచార్యులవారు రచియించిన పాదుకాపట్టాభిషేకము. అందు రాఘవాచార్యులుగారు దశరథునిపాత్రయు కృష్ణమాచార్యులవారి తమ్ముడైన గోపాలాచార్యులవారు భరతునిపాత్రయు ధరించి మిక్కిలి సొగసుగా నటించిరి. బళ్ళారి జిల్లాబోర్డు ప్రెసిడెంటుగారు గోపాలస్వామి

మొదలియారుగారును, బళ్ళారి మునిసిపలు సభాధ్యక్షుడు నెగులూరు నారాయణరావు-రును మమ్ము మిక్కిలి గౌరవించిరి. కృష్ణమాచార్యులు గారి పేరగట్టించిన భవనమును నేనొకనాడు దెరచితిని. కోలాచలము వెంకటరావుగారిని, వారితమ్ముడైన శ్రీనివాసరావుగారిని, బళ్ళారిలో దర్శించితిని. ఈ శ్రీనివాసరావుగారు తెనుగులో బహునాటకములువ్రాసిరి. గొప్ప న్యాయవాదియైన భీమారావు గారు నాకొకనాడు విందుచేసిరి. పిమ్మట పూర్వము కృష్ణదేవరాయలువారిచేత చాలింపబడి, ప్రస్తుతము పాడుపడి యున్న విజయనగరపట్టణమును, జూడవెళ్ళితిమి. అది తుంగభద్రాతీర మందున్నది. ఆపట్టణము జూచుటకు రెండుమూడుదినములుపట్టెను. ఉదయమున పట్టణముజూచి మధ్యాహ్నమునకును, మధ్యాహ్నము పట్టణముజూచి సాయంకాలమునకును తుంగభద్రదాటి మేమానెగొండె వెళ్లుచుంటిమి. ఆదినములలో శ్రీరంగదేవరాయలువారే వంటచేయించి మాకొక యాలయములో భోజనములేర్పాటుచేయించిరి. బసమాత్రము రంగదేవరాయలవారి కోటలోనే బళ్ళారినుండి నెగులూరి నారాయణరావు గారును, శంకరలింగముపిళ్ళగారును, మాతోగూడవచ్చి, మాకాస్థలము లన్నియు జూపిరి. శిథిలములైన యాదేవాలయములను, పాడుపడిన యాభవనములనుజూడ యెంతటి కఠినాత్ములకైనను గన్నులనీరువచ్చును. ఎంతో వైభవమనుభవించిన యామహానగరము కాలవశమున నట్టిదురవస్థ పాలగుట మిక్కిలి శోచనీయము. నేను తుంగభద్రలో స్నానముచేసితిని. పుట్టియను రేపుచడవనెక్కి తుంగభద్రదాటితిని. కన్నులున్నవారాదృశ్య ములు చూడదగినవి. కొన్ని శిల్పములను నేను జేతితో తడవిజూచితిని. మరలివచ్చునప్పుడు "హొస్పేట" పట్టణముగూడ జూచితిమి. పిమ్మట మేము రాజమహేంద్రవరమువచ్చితిమి.

ఆసంవత్సరము (1915) మేనెలలో నాంధ్రమహాసభ విశాఖపట్టణ ములో జరిగెను. శ్రీ పానుగంటి రామరాయణంగారధ్యక్షతవహించిరి. ఆసభకు నేనుబోయి, యది ముగిసినతరువాత, "బారువా"లో జరిగెడు గ్రంథాలయసభకు వెళ్ళితిని. త్రోవలో నన్ను, యోగి శ్రీనివాసశాస్త్రిగారు గలుసుకొనిరి. బారువా ప్రభువైన ఖడంగాగారు, మానిమిత్తము రెండెడ్ల బండి, బారువా రైలుస్టేషనునకు బంపిరి. ఆ బండి మేమెక్కినతరువాత ద్రోవలో నొకపంతెనమీదనుండి యేటిలోబడుటకు సిద్ధమయ్యెను. అప్పుడు నాగుమాస్తా కామరాజు వెంకటరమణశర్మయు, యోగి శ్రీనివాసశాస్త్రి

గారును, ముందుగా క్రిందికురికి చక్రములుబట్టుకొని బండిపడకుండనాపిరి. నాకపుడొకగండముదప్పెనని సంతసించితిని. పిమ్మట బారువాపోయి ఖడంగాగారి భవనములోజరిగిన గ్రంథాలయసభలో, నేను మాటలాడితిని. అచటనుండి నేను చత్రపురముపెళ్ళితిని. అది గంజాముమండలమునకు రాజధాని. అచట నారెండవ మేనకోడలైన వేంకటరత్నమ్మ పెనిమిటి కోట శేషగిరిరావచటనున్న జిల్లారిజిస్ట్రారుగారి యాఫీసులో, సబురిజిస్ట్రారు పదవికి, పనిచేర్చుకొనుచుండెను. వారియింట రెండుదినములుండి యచ్చటి "యాన్‌స్లో" (Anslo) హైస్కూలులో నొకయుపన్యాసమిచ్చి, యచట నుండి బరంపురము వెళ్ళితిని.

ఆ సంవత్సరము గంజాముమండలసభలు బరంపురములో జరిగెను. రాజకీయసభకు మోచర్ల రామచంద్రరావుగా రధ్యక్షులు. సంఘసంస్కరణ సభ కధ్యక్షుడుగా నన్నాహ్వానించిరి. రాజకీయసభ ముగిసినతరువాత, నాలుగవదినమున సంఘ సంస్కరణసభ జరిగెను. ఆదినమున నింతింత యనరాని యెండకాచి నిప్పులు వర్షించినట్లు గాడ్పులు వీచెను. ఆసభకు నా ప్రాతమిత్రుడైన శోంభట్ల వెంకయ్యగారు వచ్చిరి. అప్పుడాయన గోపాలపురములోని కష్టంబు సూపరెంపెండెంటుగా నుండిరి. ఆయన నన్ను గోపాలపురము రమ్మని బలవంతపెట్టిరి గాది రాఘవరావుపంతులు గారి మోటారు నెరువుపుచ్చుకొని మేము గోపాలపురము వెళ్ళితిమి. ఆయూరు సరిహద్దులకు వెళ్లునప్పటికే చల్లగాలివీచి మాకెంతో చైతన్యము కలిగించెను. ఎండచేమాడిన మా శరీరములు హాయిహాయి యని సుఖియించెను. అక్కడ జేరినతోడనే బ్రహ్మామృతమును గురించి నేనొక గంటసేపచటి జనుల కుపన్యసించితిని. ఆరాత్రి యచటనిద్రించి మరునాడు బయలుదేరి రాజమహేంద్రవరముచెళ్ళి, యచటనుండి భీమవరముచెళ్ళి యచట సభలో నొక యుపన్యాసమిచ్చి, యచటనుండి నిడమర్రు గ్రామము వెళ్ళి, యచట స్థాపింపబడిన పోతన గ్రంథాలయ వార్షికోత్సవమున సభ కధ్యక్షత వహించితిని. పోతనామాత్యుని పవిత్ర జీవితమును గురించి యుపన్యసించి, యచటనుండి బయలుదేరి పూళ్ళ గ్రామము వెళ్ళితిని. అచట సభజేసి మధ్యమ పాఠశాల నొకదానిని స్థాపించుకొమ్మని గ్రామ జనులను హెచ్చరించుచు నుపన్యసించి, మరునాడు బయలుదేరి రాజ మహేంద్రవరము జేరితిని. నడివేసవికాలములో చత్రపురమునుండి ప్రయాణముజేసి యెన్నో గ్రామములు దిరిగినప్పటికి నా దేహారోగ్యము చెడక

యెప్పటివలె నుండెను. అప్పటికి నాకు నలుబదియెనిమిదవయేడు నడచు చుండెను. నేను వేళకు మితభోజనముచేయుచు, మితభుక్కు-నై వేళకు నిద్రించుచు, నెడనెడ నుపాహారములుతినక, కాఫీ, టీలను త్రాగక తాంబూ లమునువేయక, చుట్టాల్చక, పొడుముపీల్చక, యే దురభ్యాసములులేక కాలక్షేపము చేయుటచే, యప్పుడేగాక డెబ్బదియేడవయేట నిప్పుడుగూడ నా దేహారోగ్యము సరిగానున్నదని చెప్పవచ్చును. ముసలివాండ్రకు వార్ధ క్యములో నవసరమైన సల్లపుందుసైతము నా కిప్పటికిని నవసరములేదు.

ఆ సంవత్సరము (1915) సెప్టెంబరు నెలలో కాబోలు కవిబ్రహ్మ యైన తిక్క-నసోమయాజులవారి జయంతి మహోత్సవమును జరుపదలచి నెల్లూరు పురవాసులు తత్సభకు నధ్యక్షత వహింపుమని నన్నాహ్వానిం చిరి. నా పదెనగారి కుమారుడైన రావూరి సూర్యనారాయణను నా సహా యార్థము దీసికొని, నెల్లూరు వెళ్ళితిని. తిక్క-నజయంతి మహోత్సవ సభ లక్ష్మీనరసారెడ్డి టపునుహాలులో జరిగెను. అచట గవర్నమెంటు ప్లీడరైన మైదవోలు చంగయ్యగారు మొదలైన ప్రముఖులు దయచేసిరి. విశాలమైన యా పురమందిరము జనులతో నిండిపోయెను. కవి బ్రహ్మ యెడ నాకు గల భక్తివిశేషముచేత నేను మహోపన్యాసము చేసితిని. నా ప్రాతగురువైన వేదము వెంకటాచలముగారు నెల్లూరులో నప్పుడు న్యాయవాదులుగా నున్నందున నేను చారి దర్శనము చేసితిని. వారప్పుడు "జండు" భాషలో గొప్ప కృషిచేయుచుండిరి. అది సంస్కృతమునకు సన్నిహితమైన భాషయని వారు నాకు జెప్పిరి, నెల్లూరు పురవాసులు నేను రెండవ తరగతిలో (2nd Class) ప్రయాణము చేయునట్లు ఖర్చు లిచ్చిరి. నాలుగు దినముల తరువాత నెల్లూరునుండి రాజమహేంద్రవరము వచ్చితిని.

ఆ సంవత్సరము 1915 అక్టోబరు నెలలో కర్నూలుజిల్లా సభలు నందియాలలోజరిగెను. రాజకీయసభకు గౌరవనీయులు బయ్యా నరసింహే శ్వరశర్మగా రధ్యక్షత వహించిరి. సంఘసంస్కరణ సభ కధ్యక్షుడుగా నన్నాహ్వానించిరి. నేను రావూరి సూర్యనారాయణను దీసికొని నందియాల వెళ్ళితిని. రాజకీయసభలకు గూడ నేను హాజరై నాలుగవనాడు సంఘ సంస్కరణసభ కధ్యక్షత వహించితిని. కర్నూలులో జిల్లా మునసబుగా నున్న సి. వి. కృష్ణసామయ్యరుగారు సభకు దయచేసి, ప్రత్యేకముగా నా యుపన్యాసమును వినుటకే కర్నూలునుండి తాము వచ్చితిమని, నాతో

జెప్పిరి. గుత్తినుండి పత్తికేశవపిళ్లెగారును, కర్నూలునుండి సర్వేపల్లి నరసింహారావుగారు మొదలగు ప్రముఖులనేకులు సభలకు వచ్చిరి. సభలు జయప్రదముగా జరిగెను. అయిదవదినమున నేనచట బయలుదేరి రాజమహేంద్రవరము వెళ్ళితిని. నావద్దనున్న పిల్లవాడు జీవనాధారము లేకుండుటచే జెడిపోవునని, యెంచి గంటి వరహాలును మిషనుట్రయినింగు స్కూలులో చేరిపించితిని. బోధనాభ్యసనము పూర్తియైనతరువాత నతడు మాయిల్లువిడిచి తనస్వదేశమైన విశాఖపట్టణపు జిల్లాబోయి, యచట నొక యుపాధ్యాయపదవి సంపాదించుకొని, యాఁబిడ్డలతో సుఖజీవనము చేయుచున్నాడు.

1915 వ సంవత్సరము డిశంబరునెలలో నేను హైదరాబాదు (డక్కన్) వెళ్ళవలసివచ్చెను. ఆంధ్రభాషా దేశాభిమానులైన మాడపాటి హనుమంతరావుగారు మొదలైన యచటి యాంధ్రప్రముఖులు శ్రీ కృష్ణదేవ రాయలపేర నొక గ్రంథభాండాగారము స్థాపించి, దాని వార్షికోత్సవసభ కధ్యక్షుడుగా రమ్మని నన్నాహ్వానించిరి. అప్పుడు నాదగ్గర లేఖకుడుగా నుండిన కాకర్ల కొండయ్యయను నియోగియువకుని పెంటబెట్టుకొని హైదరాబాదు వెళ్ళితిని. అచటి యాంధ్రప్రముఖులు నన్ను మిక్కిలి గౌరవించి, కీర్తిశేషులైన రావిచెట్టు రంగారావుగారి ధర్మపత్నియగు లక్ష్మీనరసమ్మగారియింట, నాకుబసయేర్పాటుచేసిరి. ఆమె యాదరణము మిక్కిలి బాగుండెను. సభ గొప్పగా జరిగెను. సభకు సరోజినీదేవిగారు, సర్. అక్బరు హైదరీగారు మున్నగువారు దయచేసిరి. రావిచెట్టి లక్ష్మీ నరసమ్మగారు సభలో నాకు గప్పవలసినదని యొకవిలువగల పట్టుశాలు వను బంపిరి. ఆ శాలువను సరోజినీదేవిగారు నామెడలోవైచిరి. సభ ముగిసినతరువాత నేనాయూరిలో రెండుదినములుండి సరోజినీదేవిగారిని, నామెభర్తయగు ముత్యాల గోవిందరాజునాయుడుగారినిజూచి, పిమ్మట సికిందరాబాదు జనులు నన్నాహ్వానింపగా నేనచటికిబోయితిని. అచ్చట సంస్కృతభాషమీదను, సంఘసంస్కరణమీదను రెండుపన్యాసములిచ్చి, తరువాత స్త్రీలకొరకు ప్రత్యేకమొకసభగావించి, యందు స్త్రీవిద్యను గురించి యుపన్యసించితిని. ఆసభకు డాక్టరు మల్లనగారి భార్య యధ్యక్షత వహించెను. ఆసభలు ముగించి నేను రాజమహేంద్రవరమువచ్చినతరువాత, పూర్వాచారపరాయణులైన వీరభద్ర పాకయాజిగారు, సికిందరాబాదులో సభలుజేసి యచటిసభలో నే జెప్పిన యభిప్రాయములను ఖండించిరని

పత్రికలలో జదివితిని. నేనచటనుండగానే నాయభిప్రాయములను ఖండించిన పక్షమున మిక్కిలి బాగుండును, ఉచితముగానుండియుండును.

ఆసంవత్సరము 1915 అక్టోబరునెలలో నారెండవమేనకోడలైన వెంకటరత్నమ్మకు జ్యేష్ఠకుమారుడు పుట్టెను. తలిదండ్రులు వానికి నాపేరు పెట్టిరి. ఈసంవత్సరమున శ్రీ పిఠాపురము మహారాజావారును, వారి దివానుగారైన మొక్కపాటి సుబ్బారాయుడుగారును, కుటుంబములతో రాజమహేంద్రవరమువచ్చిరి. మహారాజుగారు మ్యూజియమువద్దనున్న వారి బంగాళాలో బసచేసిరి. మొక్కపాటి సుబ్బారాయుడుగారి భార్యయైన సోమమ్మగారికిని, నారెండవ చెల్లెలైన యచ్చమ్మకును, చిన్నతనమునుండి వీరవాసరములో మిక్కిలి స్నేహమగుటచే వారు మాయింటనే బసచేసిరి. మహారాజావారు వచ్చుటకుముందు, వారిరాకనుగురించి సుబ్బారాయుడుగారు ముందుగా నాకు దెల్పియచేసి, వారు సెంట్రలుజెయిలు, రెండుకళాశాలలు రామమోహనస్కూలు. చవునుహాలు చూతురుగాపున తగినయేర్పాటులు చేయించవలెనని వ్రాసిరి. దానింబట్టి నేను జెయిలుసూపరెంటెండెంటుగారితోను, కళాశాలల ప్రిన్సిపాలురతోను మాటలాడి యేర్పాటులుచేసితిని. రాజాగారు నన్ను సుబ్బారాయుడుగారిని వెంటబెట్టుకొని సెంట్రలుజెయిలును రామమోహనస్కూలును జూచిరి. కళాశాలలు వారేబోయిచూచిరి. కంచుమర్తి రామచంద్రరావుగారు వారికి తోటవిమ్మ మ్యూజియములో జేసిరి. చాలమంది పురప్రముఖులువచ్చిరి. రాజుగారు వీరేశలింగపాఠశాలను కూడ జూచిరి. అక్కడ నొకసభజరుగగా దానికి శ్రీ రాజాగారధ్యక్షత వహించిరి. సభలో విద్యార్థులు వీరేశలింగముగారి ప్రహసనమొకటి ప్రదర్శించి సభాసదులను వినోదపరచిరి. నారామమోహనపాఠశాలలో నప్పటికి నూరుమంది విద్యార్థులుండిరి. ఏడుగురుపాధ్యాయులుండిరి. ఆసంవత్సరమునుండి శ్రీ రాజాగారు మాపాఠశాలకు సహాయముచేయ జొచ్చిరి ఏటేట రు 500/- లు విరాళమీయజొచ్చిరి. ఆపాఠశాలలో నొక హరిజనోపాధ్యాయుని నియమించితిని. అతనిపేరు నరసింహారావు. అతనికి నెలకు రు 15/- లు జీతమేర్పరచితిని. అతడుస్కూలుఫైనలు పరీక్షయందు గృతార్థుడయ్యెను. అతని నివాసస్థానము తణుకుతాలూకాలోని పెనుమంట్రగ్రామము. అతడు క్రైస్తవులలో గలియుటకు ప్రయత్నించెను. కారణమేమన వారు తనకిరువదియైదు రూపాయిలు జీతమిత్తురని చెప్పెను. మిషనుస్కూలు ప్రధానాచార్యులైన పోతుకూచి సుబ్బయ్యగారు

నావద్దకువచ్చి యిటులజెప్పిరి. "నరసింహారావునకు జీతము చాలదట! మీరు వానికి 25 రూపాయిలు జీతమిచ్చిన మీపాఠశాలలోనుండునట. క్రైస్తవులలో గలియుగట. అయిపురూపాయిలు మీకు దండుగయైనను వానిని పుతాంతరులలో గలియకుండచేసినఫలము మీకుదక్కును. కావున మీరు దీనికొప్పుకొనుడని నన్ను బ్రతిమాలిరి. హిందూమాతాభిమానముచేత వానిని క్రైస్తవులలో జేరకుండజేయుటకై నేను దానికొప్పుకొంటిని. కాని కొన్ని మాసములైన తరువాత నతడు పురియొక క్రైస్తవపాఠశాలలో నుపాధ్యాయుడుగజేరి క్రైస్తవులలోగలసెను. క్రైస్తవపుతగురువులచేతులలో విశేషము ధనముండునుగనుక వారిప్రకారముగ ధనమిచ్చియు, నుద్యోగములిచ్చియు, నిమ్నజాతులవారిని దగుపుతములోనికి జేర్చుకొనుచుందురు.

మా ముద్రాక్షరశాల బజారులో, వాడ్రేపువారి మేడలో నుండెను. కొన్ని కారణములచేత మేము దానిని విడువవలసిపచ్చెను. ఆర్యపురములో నొక యింటికి మా ముద్రాక్షరశాలను మార్చితిమి. మా ముద్రాక్షరశాలకు మెషీను ముద్రాయంత్రముదెచ్చి, పృద్ధిచేయవలెనని సంకల్పము గలిగెను. నాయొద్ద ధనములేదు. చిత్రపు నరసింహారావుగారు తానా యంత్రమునకు గావలసిన సొమ్ము పెట్టుబడిపెట్టెదననియు, నిద్దరముగలసి పనిచేసుకోవచ్చుననియు, చెప్పిరి. దానికి నే నొడంబడితిని. ఆ యంత్రము దెచ్చుటకై నరసింహారావుగారును, సర్యచోలు అప్పారావుగారును చెన్నపురిపోయి కొనితెచ్చిరి. పృద్ధిచెందిన యాముద్రాక్షరశాలను నార్యపురములోని యిల్లు చాలనందున నా కార్యస్థానమును నిన్నీసుపేటలో నేదేని పెద్ద భవనమునకు మార్చవలెనని తలంచితిమి అప్పుడిన్నీసుపేటలో శ్రీ విజయనగరము మహారాజాగారి మేడ కాళీగానుండెను. దానినిమిత్తమై ప్రయత్నముచేయుటకు నేను విజయనగరమువెళ్ళి గురజాడ అప్పారావుగారిని మరికొందరు ముఖ్యులను జూచితిని. వారిపల్ల నాకా కార్యసాఫల్యమగునట్లగపడలేదు. అప్పుడు విజయనగర సంస్థానమునకు మేనేజరుగా ఫౌలరు (Fowler) దొరగారుండిరి. నామిత్రుడైన చెరుపు సోమయాజులు గారికిని, దొరగారికిని గొంత పరిచయముండుటచే దొరగారియొద్దకుపోయి మాటాడి యామేడను మాకద్దెకు నిప్పింపుమని సోమయాజులుగారిని బంపితిని. ఆయన నాకు నిజమైన మిత్రుడగుటచే శ్రమపడి విజయనగరము వెళ్ళి దొరగారితో మాటాడి సంవత్సరమునకు రు. 400 లద్దెచొప్పున

మా కిప్పించిరి. అంతట మేము మా కార్యస్థానమును నిన్నీసుపేటలోనికి మార్చితిమి. మా మనోరమా ముద్రాక్షరశాలగాక యాభవనములో చిత్రపు నరసింహారావుగారి సొంతమైన వివేకవర్ధనీ ముద్రాక్షరశాలగూడ నుండెను. దానిలో వారు కోర్టుతీర్పు లచ్చువేయుచుండిరి. ఆపనియొక్క లాభనష్టములు వారివేగాని నాకు సంబంధములేదు. నా "దేశమాత" పత్రిక ప్రకటించెడు దినములలో రాజమహేంద్రవర మ్యునిసిపాలిటి వ్యవహారములు తృప్తికరముగా లేనందున, దానిని గురించి కఠిన విమర్శనలను ప్రహసనములను వ్రాయుటచేతను, మరికొన్ని యితర విమర్శనములు ప్రకటించుట చేతను, నాకు గొందరు విరోధులు బయలుదేరిరి. విశేషించి వీరేశలింగముగారి పక్షమున నే నుండుటచేత, నాకు పూర్వపరిచితులైన టంగుటూరి శ్రీరాములుగారితోను నాళము కృష్ణారావుగారితోను మాటలుపోయెను.

నాళము కృష్ణారావుగారు వీరేశలింగముగారిపేర గ్రంథ భాండాగారము స్థాపించి దానిని వీరేశలింగముగారి టపునుహాలులో ప్రార్థనమందిరము మేడమీదబెట్టిరి. ఆ గ్రంథాలయమునకు నే నధ్యక్షుడనుగా నుంటిని. వీరేశలింగముగారికిని నాళము కృష్ణారావుగారికిని గలిగిన మనస్పర్ధలచే గ్రంథాలయమునకు వీరేశలింగముగారిపేరు తీసివేయవలెనని, తత్పరిపాలక వర్గమునకు కృష్ణారావుగారికిని సంకల్పము గలిగెను. ఒకసారి వారా ప్రయత్నముచేసిరిగాని వారి సంకల్పము నెరవేరలేదు. సభ్యులలో నధిక సంఖ్యాకులు వీరేశలింగముగారి పేరుంచవలెనని కోరిరి. కాని వారు దాని కొక యుపాయ మాలోచించిరి. నేను దాని కధ్యక్షుడుగా నున్నంతకాలము వీరేశలింగముగారిపేరు తొలగించుటకు వీలులేదనినమ్మి మొదట నన్నధ్యక్ష పదవినుండి తొలగించుటకు నిశ్చయించిరి. అది సాధ్యము గాకపోయినందున వారు మరియొకయెత్తు నెత్తిరి. ఒక్కొక్క గ్రంథాలయ సభ్యుడు సంవత్సరమునకు మూడురూపాయిలు చందా నీయవలెను. ముప్పదిమంది సంవత్సరమున కీయవలసిన చందా రు. 90 లు నాళము కృష్ణారావుగారే యిచ్చి, తమ కనుకూలురైన ముప్పదిమంది క్రొత్తసభ్యులను చేర్చిరట. ప్రాతసభ్యులు గొందరును క్రొత్తసభ్యులు యీ ముప్పదిమంది గలసి గ్రంథాలయ సభచేసి, యధ్యక్షపదవినుండి నన్ను దొలగించి, నాస్థానమున శ్రీ గంటి లక్ష్మన్నగారి నధ్యక్షులుగా నేర్పరచిరి. ఆ తరువాత గ్రంథాలయమునకు వీరేశలింగముగారి పేరు దీసివేసి, దాని "ప్రజా గ్రంథాలయము" (Peoples, Library) అని పేరుపెట్టిరి. ఆకాలమున, వడ్డాది సుబ్బా

రాయుడుగారి బావమరదియైన యద్దంకి సత్యన్నారాయణ, వసురాయ గ్రంథాలయమనుపేర నొక గ్రంథాలయము స్థాపించి నడుపుచుండెను. కొంత కాలమైనతరువాత ప్రజా గ్రంథాలయమును వసురాయ గ్రంథాలయమునుగలిపి "గౌతమీ" గ్రంథాలయ మనుపేరుపెట్టి మ్యూజియము సమీపమున నొక భవనముగొని యందులో పెట్టిరి. అది యిప్పుడు మిక్కిలి వృద్ధిలోనున్నది. ఆంధ్రదేశములో నట్టి గ్రంథాలయము మరియొకటిలేదు.

1915 వ సంవత్సరములో మాపట్టణములో నొకవిశేషము జరిగెను. స్టీవర్టు దొరగారు, టంగుటూరి శ్రీరాములుగారిమీద, వీరేశలింగముగారు తెచ్చిన యభియోగము కొట్టివేసినందున, వీరేశలింగముగారు నీతిబాహ్యుడనియు, టపునుహాలులోనున్న జూబిలీ పఠనమందిరములో నట్టివాడు సభ్యుడుగా నుండతగదని,యాయనను సభ్యునిగా దొలగింపవలెనని యాలోచించి, పఠనమందిరములోనికి యీ క్రింది యారుగురు సభ్యులు నొక యర్జీవ్రాసి, జూబిలీ పఠనమందిర కార్యదర్శిగారి కిచ్చిరి. టంగుటూరి శ్రీరాములు గారు, దామెర్ల వెంకటరమణరావుగారు, వాడ్రేపు శంభులింగముగారు, నాళము కృష్ణారావుగారు, ఎర్రమిల్లి కామరాజుగారు, మాంధాత కామేశ్వర రావుగారు, ఈ యారుగురే యని జ్ఞాపకము. ఇది చాలాకాలమునాటి విషయమగుటచే పైరపాటున్న పక్షమున పాఠకమహాశయులు మన్నింతురు గాక. ఇది మహాసభలో విచారింపవలసిన విషయము గావున. జ్యూబిలీపఠనమందిర కార్యదర్శి, పఠనమందిర సభ్యుల సభ (general body meeting) గావించెను. అప్పుడు పఠనమందిరములో నూరు మంది సభ్యులుండిరి. ఎనుబదియిద్దరు సభ్యులు హాజరయిరి. వీరేశలింగముగారిమీదనిందారోపణ చేయుటయువారినిదీసివేయుటయుకృతఘ్నతయనియు, నది యకార్యమనియు నేను గట్టిగా నా సభలో వాదించితిని. దొరతనమువారి కళాశాలలో తత్త్వశాస్త్ర పండితులైన చక్రవర్తిగారు గూడ వీరేశలింగముగారి పక్షమున వాదించిరి. అర్జీ నిచ్చినవారిలో సభకు నలుగురు రాలేదు ఇద్దరు మాత్రము వచ్చిరి. పఠనమందిరములలో జారులుండవచ్చును. సురాపానప్రియులు లుండవచ్చును. అనృతవాదులుండవచ్చును, అట్టివారు మా జ్యూబిలీ పఠనమందిరములో నా కాలమున నుండిరేమో యని నా యభిప్రాయము. అట్టివారు సభ్యులుగా నుండవచ్చునుగాని, వీరేశలింగముగారివంటి పవిత్రశీలురు, దేశోపకారి, స్వార్థత్యాగి సభ్యుడుగా నుండగూడదని యర్జీనిచ్చినవారి కెట్లుదోచెనో నేనూ

హింపలేకున్నాను. వీరేశలింగముగారు, రు7000/లు ఖర్చుపెట్టి కట్టించిన టవునుహాలునుండి, యాయననే తరిమివేయుటకు సభ్యులు ప్రయత్నించుట మిక్కిలి హాస్యాస్పదముగా నున్నదని పరనమందిరాధ్యక్షులైన న్యాపతి సుబ్బారావు పంతులుగారు పలుకుచు వోటులను దీసివేసిరి. హాజరయిన యెనుబదియిద్దరు సభ్యులలో డెబ్బదియెనమండుగురు వీరేశలింగముగారి కనుకూలముగా వోట్లనిచ్చిరి. ఇద్దరు తటస్థులైరి. ఇద్దరు మాత్రము వీరేశలింగముగారికి ప్రతిరేకముగా "వోటు" చేసిరి. దీనితో వీరేశలింగము గారికి రాజమహేంద్రవరములో నెంతగౌరవము గలదో పలుకుబడిగలదో తెలిసిపోయెను.

మేము మంచి ముద్రాయంత్రము కొని తెచ్చి యిస్సీసుపేటలో మా కార్యస్థానము స్థాపించిన తరువాత, నాకు చిరకాల పరిచితుడును, నా కిరుగుపొరుగువారు నైన సందివాడ విశ్వేశ్వరరావుగారు నా కడకు వచ్చి మా ముద్రాక్షరశాలలో దనకు గూడ నొక భాగమిమ్మని యడిగిరి. దీనిలో లాభముండదు. దీనిలోనికి దిగవద్దని రాయవరపు రామమూర్తి విశ్వేశ్వరరావుగారికి సలహా చెప్పెను. ఈ విషయమై మా భాగస్వామి యైన చిత్రపు నరసింహారావుగారితో నేను చెప్పగా, విశ్వేశ్వరరావుగారిని భాగస్వామిగా జేర్చుకొనగూడదని నాతో వారు గట్టిగా జెప్పిరి. సొమ్ము పెట్టుబడికిని కార్యనిర్వహణమునకును నొకరికొకరు సహాయులుగా నుందురుగనుక విశ్వేశ్వరరావుగారిని చేర్చుకొనుట మంచిదని నేనంటిని. ఎట్టకేలకు నరసింహారావుగారు గూడ దమ పట్టువిడిచి విశ్వేశ్వరరావుగారిని మూడవ భాగస్వామిగా చేర్చుకొనిరి. అంతట మేము ముగ్గురము నొక యొడంబడిక వ్రాసుకొని రిజిస్టరు చేయించుకొంటిమి. ఆయొడంబడిక ప్రకారము సొమ్ము పెట్టుబడి నరసింహారావుగారును విశ్వేశ్వరరావుగారును పెట్టవలెను. అచ్చుకూటములో నచ్చుపని నేను దీసుకురావలెను. పనివాండ్ర చేత పనిచేయించి యచ్చుకూటమంతయు నరసింహారావుగారు మేనేజ మెంటు చేయవలెను. జమాఖర్చు లెక్కలు (Accounts) వ్రాసి సరిగా నుంచుట విశ్వేశ్వరరావుగారిపని. శ్రీ పిఠాపురము మహారాజాగారు తమ సొంతడబ్బు ఖర్చుచేసి వీరేశలింగముగారి గ్రంథములన్నియు సంపుటము లుగా నచ్చువేయించి, వీరేశలింగముగారికి బహుమతి నీయదలచిరి. అది పెద్దపని. అవి యచ్చువేయుపని నా కీయవలసినదని రాజాగారికి దరఖాస్తు పెట్టి మొక్కపాటి సుబ్బారాయుడుగారితో గూడ మాటాడితిని. మచ్చున

కొక సంపుట మచ్చువేసి పంపుడు. ఆ పనిని జూచి మీ కిచ్చెడి విషయమై యాలోచించెదమని సుబ్బారాయుడుగారు నాకు ప్రత్యుత్తరమిచ్చిరి. అట్లే నే నొక సంపుట మచ్చువేయించి వారికి బంపితిని. దానిని జూచి మహా రాజావారు పనికి మెచ్చి, మిగిలిన పనిని మా కిచ్చిరి. మొత్తముమీద మేము తొమ్మిది సంపుటము లచ్చువేసితిమి. నా "మనోరమ"యు నా "దేశ మాత"యు మాయచ్చుకూటములోనే యచ్చుపడుచుండెను. దానికినేను వేరే సొమ్ము నిచ్చుచుంటిని. నా పత్రికల నిమిత్తము, నా గుమాస్తాల నిమిత్తము మేడలో గొంతభాగము నా క్రింద సుంచుకొని, దానికి బాడిగక్రింద సొమ్ము కొంత వేరుగ నిచ్చుచుంటిని. నే దెచ్చిన పనివల్లను మొత్తము మీద మూడి సంవత్సరములకు నచ్చుకూటమునకు 10 వేల రూపాయలువచ్చెను. వీరేశలింగముగారి పనివల్ల నే 7500 రూపాయలు వచ్చెను. ఇంతలో విశ్వే శ్వరరావుగారికి జబ్బుచేసెను. ఆ కారణమున వారచ్చుకూటమునకు వచ్చు టయు లెక్కలు వ్రాయుటయు మానిరి. నరసింహారావుగారి మేనేజ మెంటు గూడ తృప్తికరముగా లేకపోయెను. నరసింహారావుగారి సొంత యచ్చుకూటముగూడ నచ్చటనేయుండుటచే వారు సొంతపనిమీద నెక్కువ శ్రద్ధవహించి యుప్పుడిపనిమీద సవతితల్లి ప్రేమ జూప నారంభించిరి. అప్పుదాయన స్వలాభపరాయణుడయ్యె ననుట నిస్సంశయము; జమాఖర్చు లెక్కలు లేకపోపుటచేతను నచ్చుపని సరిగా జరుగకపోవుట చేతను మా ముద్రాక్షరశాల క్రమముగా క్షీణదశకు వచ్చుచుండెను. సొమ్మంతయు విశ్వేశ్వరరావుగారును నరసింహారావుగారును బుచ్చు కొని యిష్టము వచ్చినట్లు కర్చుపెట్టి, యచ్చుపడిన వీరేశలింగము గారి సంపుటములలో గొన్నింటి కట్టలుకట్టించి, కొన్నింటికి కట్టిం చుట మానిరి. అచ్చుపని పూర్తిచేసి యప్పగించవలసిన భారము నాది గావున కొన్ని సంపుటములకు నా సొంతడబ్బుతో నేనే యట్టలు గట్టించ వలసివచ్చెను. విశ్వేశ్వరరావుగారికి నెమ్మదిగానున్నను నచ్చుకూటములో భాగమును మానుకొంటినని మాకు దెలియజేసిరి. నరసింహారావుగారు విశ్వేశ్వరరావుగారు పనివాండ్రకు జీతములిచ్చుట మానిరి. వీరేశలింగము గారి సంపుటములు రాజమహేంద్రవరములో మ్యూజియముకడ రాజాగారి బంగాళాలో పెట్టించవలసినదని యుత్తరువులు వచ్చినందున వాటి నచ్చట చేర్చితిని. హితకారిణీ సమాజ కార్యదర్శియైన రెబ్బాప్రగడ పాపయ్య గారు వీరేశలింగముగారి మరణానంతరమున రాజాగారి బంగాళాలోని

సంపుటములను, వీరేశలింగముగారి పాఠశాలలో బెట్టించిరి. పైపని యటుండగా నా "మనోరమ"యు, "దేశమాత"యు నచ్చుపడుటయే కష్టమయ్యెను. అందుచేత నేను 1919 వ సంవత్సరమునుండి నా పత్రికలు రెండును బ్రకటించుటమాని ముద్రాయంత్రములో భాగముగూడ నేను వదలుకొంటిని.

1916 వ సంవత్సరమున నేను రాజమహేంద్రవరము బ్యాంకులో "ఓవరుడ్రాఫ్టు" (over draft) కాతా పెట్టించుమని దరఖాస్తుచేసి కాషియరు గారైన పునుగుపాటి సుబ్బారావుగారితో మాటాడితిని. సుబ్బారావుగారి యభిమానమువలన సంవత్సరమునకు రెండువేల రూపాయిలవరకు నప్పుడప్పుడు నేను బ్యాంకులో బదులు పుచ్చుకొనవచ్చునని కాతా యేర్పడెను. నా పత్రికలకు గావలసిన కాగితములు దెచ్చి నిలువజేసికొనుటకును పత్రికా వ్యాపారము సరిగా జరుపుకొనుటకును నాకు వీలు కలిగెను. కాని బ్యాంకు వారి కిద్దరు పురుషులు జామీనుండవలసివచ్చెను. అప్పుడు వీరవాసరములో మాకున్న భూములు మొదలైన యాస్తి నేనును, మా తమ్ముడును గలసి బ్యాంకువారికి హామీ నిచ్చితిమి. ఇక రెండవవారు హామీనీయవలసివచ్చెను. అప్పుడు నా ప్రియమిత్రులు చిరపరిచితులైన కనుపర్తి శ్రీరాములుగారు దన యావదాస్తియు నా నిమిత్తమై బ్యాంకువారికి హామీనిచ్చిరి. లోకములో నటువంటి మిత్రులుండుట యరిది. ఈ దినములలో మరియొకని నిమిత్తము తన యావదాస్తిని జామీనిచ్చు సాహసు లెవరుందురు? శ్రీరాములుగారి మంచితనమునకును, పరోపకారబుద్ధికిని, నిది ప్రబలసాక్ష్యముకాదా! వారికీ వ్యవహారములో లేశమైనా దండుగలేకుండ బ్యాంకువారికి నేనీయవలసిన సొమ్మంతయు నిచ్చివేసి మా తమ్ముని యొక్కయు, శ్రీరాములుగారి యొక్కయు జామీనులు వదలించి కృతార్థుడనైతిని.

1916 వ సంవత్సరమున నాంధ్రమహాసభ కాకినాడలో జరిగెను. దానికి మోచర్ల రామచంద్రరావుగా రధ్యక్షులైరి. నేనా సభకు బోయి యేదో విషయమై మాటలాడితిని. ఆ సంవత్సరము నాలుగవ గోదావరీ మండల సభ రామచంద్రపురములో జరిగెను. అపుడు రాజకీయసభకు నెవరధ్యక్షులైరో జ్ఞాపకములేదు. సంఘసంస్కరణసభలో నధ్యక్షులు వక్తలు లేరు. సంస్కరణమును గురించి యొక యుపన్యాస మిమ్మని సభాసదులు నన్ను గోరిరి. వారికోరిక ననుసరించి, సంస్కరణావశ్యకతను గూర్చి, నేనొక పెద్ద యుపన్యాసమిచ్చితిని. ఆ సంవత్సరమున నెల్లూరులో

నాంధ్రగ్రంథాలయ మహాసభ జరిగెను. నేను నెల్లూరుకుబోయి హాజరై యా సభాకార్యక్రమమున పాలుగొంటిని. దాని కధ్యక్షులెవరయిరో జ్ఞాపకములేదు. నెల్లూరునకు సమీపములో "పొట్లపూడి" యను నొక చిన్న గ్రామము గలదు. అచట నొక చిన్న గ్రంథాలయము గలదు. ఆ గ్రామ నివాసులైన పౌణకా పట్టాభిరామరెడ్డిగారు, తమ యూరులోనున్న గ్రంథాలయ వార్షికోత్సవమున నన్నధ్యక్షత వహింపుమని కోరి నన్నుదీసికొని వెళ్ళిరి నేనా గ్రామముబోయి మా బంధువులయింట బసజేసి, గ్రంథాలయ వార్షికోత్సవము జరిపి, పిమ్మట రాజమహేంద్రవరము వచ్చితిని.

●

స్వీయ చరిత్రము

పందొమ్మిదవ ప్రకరణము

"దేశమాత" పత్రికకు చిక్కు

1917వ సంవత్సరమున "దేశమాత" పత్రికలో నేను గ్రామములో లేనప్పుడు, దొరతనమువారిని విమర్శించుచు, నొక యాక్షేపణీయమైన వ్యాసము ప్రకటింపబడెను. అందుచేత దొరతనమువారి యుత్తరువు ప్రకారము, కాకినాడ జిల్లాకలెక్టరుగారు, మా ముద్రాక్షరశాలమీద వేయి రూపాయిలు ధరావతు నీయమని యాజ్ఞాపించిరి. అప్పుడు భాగస్వాములము ముగ్గురముకూడి, యుమ్మడిమీద మారువాడివద్ద యప్పుదెచ్చి, ధరావతు చెల్లించితిమి. మూడు నాలుగేండ్ల తరువాత దొరతనమువారు మా ధరావతు మాకిచ్చివేసినందున మారువాడియప్పు పూర్తిగదీర్చివేసితిమి.

1916 వ సంవత్సరాంతమున జాతీయమహాసభ (Indian National Congress) లక్నో పట్టణమున జరిగెను. ఆసభకుబోయి తిరిగి వచ్చుచు "అనిబిసెంటు" గారు మాపట్టణములో నొకనాడాగిరి. ఏదేనొక యుపన్యాస మిమ్మని యామెను పురజనులు గోరిరి. అందుకామె నమ్మ

తించెను. ఆదినములలో మా కృత్తివెంటి నాగేశ్వరరావుగారు నాటకము లాడింపవలెనని, ప్రాతయూరిలో వడ్డిపీధిని యొక పెద్ద డేరా వేయించిరి. బిసెంటమ్మగారి సభ యాడేరాలో జరిగెను. ఆసభకచ్చట జేరిన యువకులు నన్నధ్యక్షునిగ నుండమనికోరిరి. పెద్దలెందరో నుండగ నేనధ్యక్షునిగ నుండుట భావ్యముగాదని నేను చెప్పినను వినక, సభాసదులు నేనే యుండ వలెనని పట్టుబట్టిరి. నక్కయొక్కడ దేవలోకమెక్కడ నన్నట్లు, నేనెక్కడ బిసెంటమ్మ యెక్కడ? ఐనను నేను బిసెంటమ్మను గురించి యింగ్లీషులో బహునైదు నిమిషములు మాటలాడి, పిమ్మట బిసెంటమ్మను నుపన్యాసము ప్రారంభింపమని కోరితిని. ఆమె యప్పటి రాజకీయ పరిస్థితులను గురించి యొక గంటసేపుపన్యసించి, సభాసదుల నానందాబ్ధి లోలాడించెను. ఈతరుణముందేగాదు; గౌరవనీయులైన శ్రీనివాసశాస్త్రిగారు రాజమహేంద్రవరము వచ్చి సభజేసినప్పుడు, టౌనుహాలులో న్యాయపతి సుబ్బారావుగారు నన్నే యధ్యక్షునిగ నియమించిరి. ఒకపర్యాయము స్వామి శ్రద్ధానందగారు రాజమహేంద్రవరము వచ్చి సభగావింపగా దానికి నేనధ్యక్షుడ నైతిని. బిపిను చంద్రపాలుగారు వచ్చి యుపన్యసించినప్పుడు నన్ను సభాధ్యక్షునిగ నేర్పరచిరి. పండిత సీతానాథ తత్వభూషణగారు వచ్చి టవునుహాలులో నుపన్యసించి నపుడు నన్నే యధ్యక్షునిగ జేసిరి. ఆసమయము లందు నేనింగ్లీషులోనే మాటలాడితిని.

1916 వ సంవత్సరమున పునహా నివాసులైన కార్వీపండితులు రాజమహేంద్రవరము వచ్చిరి. వారిని సన్మానించి యతిథులుగ నుంచుకొమ్మని గౌరవనీయులైన శ్రీనివాసశాస్త్రిగారు నాకు వ్రాసిరి. కార్వీగారు వితంతు వివాహము జేసుకొన్న కార్యశూరులు. వితంతు శరణాలయము స్థాపించిన లోకోపకారులు; స్త్రీలకు ప్రత్యేక విశ్వవిద్యాలయము స్థాపించిన మహనీయులు. వారిని సన్మానించి, మాయచ్చకూటమున్న మేడమీద వారికి బసనిచ్చి, మాయింటనుండి వంటకములు జేయించి తెప్పించి, వారికి బెట్టితిని. పిమ్మట వారు టవునుహాలులో సభచేసి తాము స్థాపింపదలచుకొన్న స్త్రీ విశ్వవిద్యాలయమును గురించి ప్రచారముజేయుమని మాటలాడిరి.

పూర్వము రాజమహేంద్రవరములో విజయనగరము మహారాజా వారి బాలికాపాఠశాల యొకటియుండెను. కొంతకాల మైనతరువాత మహారాజాగారు దాని నెత్తివేసిరి. అప్పుడు దొరతనమువారా పాఠశాలను దీసికొని నడుపజొచ్చిరి. ఆ పాఠశాలకు రుక్మిణి అమ్మాళ్ను నొక ద్రావిడస్త్రీ

చిరకాలము ప్రధానోపాధ్యాయురాలుగా నుండెను. 1913 వ సంవత్సర ప్రాంతమున దానిని బాలికలకు ట్రయినింగుస్కూలుగ మార్చి, మిస్ పెద్ది యను నొక యాంగ్లేయ స్త్రీని, ప్రధానోపాధ్యాయురాలుగ నియమించిరి. ఆమె పాఠశాలా పరిపాలనము తృప్తికరముగ లేకపోయెను. ట్రయినింగు కొరకు వచ్చిన పెద్దస్త్రీలను గూడ దూషించుట, చెంపకాయలు కొట్టుట, బల్లమీద నిలపబెట్టుట, మొదలగు కఠినచర్య లామె చేయజొచ్చెను. తాబే దార్లనుగూడ నవమానింపజొచ్చెను. వెనుక ప్రధానోపాధ్యాయురాలుగనున్న రుక్మిణి అమ్మాళుగారు నాకడకువచ్చి పెద్దిగారి చేష్టలగురించి పలుమా రులు మొరవెట్టుకొనెను. అంతతోబోక పెద్దిగారు పాఠములు చెప్పక తన గదిలో నెవరితోనో మాటలాడుచు గూరుచుండుచు వచ్చెను. ఈ సంగ తులు నాకు దెలియగానే నేను నా "దేశమాత" పత్రికలో నామె చర్యలు కఠినముగా విమర్శించితిని. పెద్దిగారికి మిక్కిలి కోపము వచ్చెను. ఆమె యొకసారి మా యింటికి వచ్చి "నే నాంగ్లేయ స్త్రీని, నన్ను మీ రవమాన పరచినారు, మీ మీద చార్జినిచ్చెదను జాగ్రత" యని పరుషోక్తులు పలికెను. "మీ యిష్టము వచ్చినట్లు చేయుడు నేనువ్రాసిన సంగతులన్నియు నిజము. వానిని నేను రుజువుచేసెదను." అని నేను నిర్భయముగా సమాధానము చెప్పితిని. ఆమె కోపావేశముతో లేచిపోయెను. నా మీద నామె యభియో గము మాత్రము తేలేదు. ఇది జరిగిన కొన్నాళ్ళకు బాలికా పాఠశాలా పరీక్షాధికారిణియైన "రీనియస్" దొరసానిగారు రాజమహేంద్రవరము వచ్చి యీ వృత్తాంతమంతయు విని, తనకడకు నన్నొకసారి రమ్మని, శ్రీ వల్లూరి నరసింహారాయుడుగారి చేత నాకు వర్తమాన మంపెను. ఆ మరునాడు నే నామెను గలుసుకొని మాటలాడితిని. ఆమె నాతో నిట్లని యెను. "బాలికల ట్రయినింగుస్కూలు రాజమహేంద్రవరములో మాని, కాకినాడలో బెట్టవలెనని పై యధికారుల యభిప్రాయము; నేను పట్టుబట్టి పోరాడి యీ యూరిలో బెట్టించితిని. ఈ విధముగా బాఠశాలను గురించి వ్యతిరేకాభిప్రాయములు వెల్లడింపబడిన యెడల నిచ్చటనుండి పాఠశాల యెత్తివేయబడునేమో యని భయపడుచున్నాను కాబట్టి యికముందు పెద్దిగారేవైన పొరపాటులు చేసిన పక్షమున, ముందుగ మీరు పత్రికలో వ్రాయక, నాకా సంగతులను దెలియపరచిన పక్షమున, నేను వాటిని జక్కపరచెదను." ఆ పలుకులు విని నేను వెడలివచ్చితిని. ఇది జరిగిన కొన్నా ళ్ళకు రీనియస్‌దొరసానిగారు, పెద్దిగారిని మరియొక చోటునకు మార్చి,

యామె స్థానములో వెదురుమూడి రామబాసుపంతులుగారిని నియమించిరి. అప్పటినుండియు బాలికాపాఠశాల బాగుగ జరుగజొచ్చెను.

1914, 1915 వ సంవత్సరములలో నేను జాతీయపాఠశాలకు (National School) సెక్రటరీగ నుంటిని. ఆ దినములలో నేను మట్టే సుబ్బారావుగారిని ప్రోత్సాహపరచగా, వారు పాఠశాలకు 1000 రూపాయలు విరాళమిచ్చిరి పందిరి వీరన్నగారు 1000 రూపాయల నిచ్చిరి. గంటి లక్ష్మన్నగారు 1000 రూపాయలు నిచ్చిరి. ఈ మూడువేలును మరికొంత సొమ్మును ప్రోగుచేసి, పాఠశాలా పరిపాలకసంఘమువారు పాఠశాల మిత్తము, అమీరుద్దీనుసాహేబుగారితోట క్రయమునకు దీసికొనిరి. ఆ దినములలో గాడిచర్ల రామమూర్తిగారు సహాయకార్యదర్శిగా నుండి చాలపనిజేసిరి. జాతీయపాఠశాల కప్పటికి స్థిరవసతి యేర్పడెను ఆతోటలో రెండు బంగళాలు,నూతులు గలవు. జాతీయపాఠశాల ప్రస్తుత మా బంగళా లోనే నెలకొల్పబడియున్నది.

పగలు చదువుకొను నిమ్నజాతుల పిల్లలకు రామమోహన పాఠశాల యున్నదిగదాయని, పగలు పనిచేసికొని రాత్రి తీరుబడిగానుండు పెద్ద వారలకు రాత్రి యొక పాఠశాల పెట్టితిని. దానికి "వివేకానంద" పాఠశాల యని పేరుపెట్టితిని. దానికొక పంచమునే యుపాధ్యాయునిగ నేర్పరచితిని. రామమోహన పాఠశాలతోబాటు దాననిగూడ నే నే నిర్వహించుచుంటిని. 1916 వ సంవత్సరమున, నేను కాపురమున్న యింటివారు యనగా, రాయవరపు రామమూర్తిగారు సకుటుంబముగా నలహాబాదు వెళ్ళిరి. వారితో పాటు నా భార్యయు, మా పెదచెల్లెలు యున్నపూర్ణయు, నుత్తర హిందూస్థానమువెళ్ళి, కాశీ, గయా, ప్రయాగ, ఢిల్లి, ఆగ్రా మొదలగు మహా స్థలములు జూచివచ్చిరి.

1917 వ సంవత్సరమున నాంధ్రమహాసభ నెల్లూరులో జరిగెను. దానికి దేశభక్త కొండా వెంకటప్పయ్యగా రధ్యక్షులైరి. ఆ సభ మిక్కిలి యుత్సాహముతో జరిగెను నేనా సభకు బోయితిని. దొరతనమువారు మా ముద్రాక్షరశాల విషయమై వేయిరూపాయిలు ధరావతు పుచ్చుకొన్నం దుకు తమ యనిష్టము తెలియజేయుచు నొక తీర్మానము జేసిరి. దొరతనము వారు మా వద్ద బుచ్చుకొన్న వేయిరూపాయిలు మా కాంధ్రమహాజనులు యిచ్చివేసిన బాగుండునని సభలో నొకరు ప్రతిపాదించగా భళిభళీయని యా సభాసదులు చందాలు వేసిరి. కావలసినవి 1000 రూపాయిలైయుండగా

చందాలు 1600 రూపాయిలువరకు బడెను. అందరు తరువాత సొమ్ము పంపించెదమని చెప్పిరి. కాని తరువాత రమారమి మూడువందల రూపాయిలు మాత్రమే వసూలయ్యెను.

1917 వ సంవత్సరమున అనిబిసెంటమ్మగారు స్వరాజ్యము (Home rule) నిమిత్తము ప్రయత్నముచేయుచు నామె పత్రికయైన "న్యూయిండియాలో"లో మిక్కిలి తీవ్రప్రచారము చేయసాగెను. ఆమె విమర్శమును సహింపక దొరతనమువా రామెను, నామె మిత్రులైన వాడియాగారిని, అరండేలుగారిని నీలగిరిలో నొక బంగాళాలోనుంచి (Internment) దానినుండి బయటికిపోగూడదని శాసించిరి. అప్పుడు దేశమంతటను గొప్ప సంక్షోభము బయలుదేరెను ప్రతిస్థలమునందు దొరతనమువారి చర్యను ఖండించుచు సభలుజరిగెను. ఈ దినములలో తూర్పుగోదావరి జిల్లాకలెక్టరుగారు (వారిపేరు బర్కెటుగారని నాకు జ్ఞాపకము) రాజమహేంద్రవరము వచ్చి యింగ్లీషు క్లబ్బులో బసచేసి, నన్ను దమయొద్దకు రమ్మని వర్తమాన మంపిరి. ఆమరునాడు మధ్యాహ్నము నేను వారి దర్శనము చేసితిని. వారు నన్నుజూచి లేచి కరస్పర్శనముచేసి నాయోగక్షేమమడిగి నాకంటిజబ్బు సంగతి యడిగి కడపట నిట్లనిరి "బిసెంటమ్మగారిని వారి మిత్రులను నీలగిరిలో కట్టడిలో (Internment) నుంచిరిగదా! ఆవిషయమై దేశమంతటా సభలు జరుగుచున్నవి. ఈ యూరిలోగూడ సభలు జరుపవచ్చును. మీరు పత్రికలలోను సభలలోను ప్రచారము తీవ్రముగాచేయుదురు. కాబట్టి మీరు జాగ్రత్తగా మాట్లాడవలసినదనియు జాగ్రతగ వ్రాయవలసినదనియు, మిమ్ములను హెచ్చరించుచున్నాను. మీవంటి ప్రచారకులకు హెచ్చరిక నీయవలసినదని నాకు దొరతనమువారువ్రాసిరి". ఆపలుకులునేను విని "చిత్తము" అని సెలవుగైకొని వచ్చితిని తరువాత రాజమహేంద్రవరము టవునుహాలులో సభజరిగెను. ఎంత తీవ్రముగా నేను మాటలాడవలెనో అంత తీవ్రముగా మాటలాడితిని. నాయుపన్యాస మెప్పుడును మిక్కిలి వేగవంతముగుటచే దానిని పోలీసువారు వ్రాసుకొనలేకపోవుచుండిరి. న్యాయపతి సుబ్బారావు పంతులుగారు నన్ను పలుమారులు "మిక్కిలి వేగముగ మాటాడుదురు, మీరు కొంతవేగము తగ్గింపుడ"ని పలుకుచుండెడివారు.

1917 వ సంవత్సరమున మామేనల్లుడైన పురాణపండ వెంకట దీక్షితులునకును, నాతమ్ముడు కుమారుడైన వెంకట్రావునకును నే నుపనయ

నముజేసితిని. ఆసంవత్సర మేప్రియలు నెలలో రావుబహదూరు కందుకూరి వీరేశలింగముగారికి జన్మదినమైన పదునారవ యేప్రియలు తారీఖున వారాంధ్రదేశమునకు జేసిన సేవకై వారికి బహిరంగమైన సన్మానము జేయవలెనని శ్రీ రఘుపతి వెంకటరత్నము నాయుడుగారును, మొక్కపాటి సుబ్బారాయుడుగారును సంకల్పించి, యాంగ్లేయభాషలో నొక యభినందన పత్రికనువ్రాసి యచ్చువేయించి, తాము సంతకములుచేసి రాజమహేంద్ర పుర ప్రముఖులచేత సంతకములు చేయించి పిదప నాంధ్రదేశమున ననేక స్థలము లకు దానిని టపాలోబంపి, యాంధ్ర ప్రముఖులచేత సంతకములుచేయించి దెప్పింపవలసినదనియాకాగితము నాచేతికిచ్చిరి. దానిని నేను టపాలో విజయ నగరము, విశాఖపట్టణము, గుంటూరు, బందరు మొదలైన స్థలములకంపి యాంధ్రమహాపురుషులచేత సంతకములుచేయించి దెప్పించితిని 1917 వ సంవత్సరమేప్రియలు నెల16 తారీఖున రాజమహేంద్రవరము టవునుహాలులో పౌరజన మహాసభ జరిగెను. కాకినాడనుండి వెంకటరత్నము నాయుడుగారు మరికొందరు మిత్రులు సభకు దయచేసిరి. ఆసభకు శ్రీచిత్రపు వెంకటా చలముగారధ్యక్షత వహించిరి, వల్లూరి సూర్యనారాయణరావుగారాయభి నందన పత్రిము చదివి వారికిసమర్పించిరి. ఆనాటిరాత్రి శ్రీ వేంకటరత్నము నాయుడుగారికి రైలు దాటిపోయినందున మాయింట బసచేసి నన్ను గౌరవించిరి.

నేను యింపీరియలు బ్యాంకువారియొద్ద శ్రీ కనుపర్తి శ్రీరాములుగారి యాస్థియు, నా యాస్థియు హామీయిచ్చి యప్పుడప్పుడు కొంత సొమ్ము బదులుపుచ్చుకొంటినని యీపరకే వ్రాసితిని. ఆ బదులుమొత్తము రమారమి 2,000 రూపాయిలయ్యెను. ఆ బాకీ తీర్చవలసివచ్చెను. అదిగాక రెండు పత్రికలు నడుపుటచేతను, కొన్నిపుస్తకము లచ్చువేయించుటచేతను, నాచేత పోషింపబడువలసిన జన మధికమగుటచేతను, మరికొంత ఋణ మధిక మయ్యెను. ఈ ఋణములు తీర్చుటకు నే నొక యుపాయ మూహించితిని. నా పుస్తకములయొక్క గాపీరైటు హక్కు నైదుసంవత్సరములవరకు 8,000 రూపాయిల కెవరికైన నిచ్చివేయదలచితిని. దానిని చెన్నపురవాసు లైన శ్రీ వావిళ్ళ వెంకటేశ్వరశాస్త్రిగారు విని యా సొమ్మిచ్చి యా హక్కు తాము పుచ్చుకోవలెనని నాతో నుత్తరప్రత్యుత్తరములు జరిపిరి. నేనిచ్చుటకును, వారు పుచ్చుకొనుటకును నేర్పాటులు జరిగెను. అప్పుడప్పుడు వారు నాకు రమారమి 1700 రూపాయిల విచ్చిరి. సొమ్మిచ్చుటలో వారు

మిక్కిలి యాలస్యము చేసినందుననను నాకు సొమ్ము మిక్కిలి యవసరమై నందునను వారితో నొడంబడిక చేద్దుపరచుకొని రమ్మని నా గుమాస్తాయైన సత్యవోలు అప్పారావుగారిని చెన్నపురి ఖర్చులిచ్చి పంపితిని. అతడువెళ్ళి వెంకటేశ్వరశాస్త్రిగారితో మాటాడి, యొడంబడిక రద్దుపరచి, నా యిష్టము వచ్చినవారికి నే నిచ్చుకొనునట్లు శాస్త్రిగారివల్ల వ్రాతమూలకమైన సమ్మతి బడసి తిరిగివచ్చెను. పిమ్మట రాజమహేంద్రవర పుర వర్తకశిఖామణియు నాకు చిరపరిచితుడునైన ముట్టె సుబ్బారావుగారు నాయొద్ద నా పుస్తకముల హక్కు నైదుసంవత్సరములవరకు 8,000 రూపాయిలిచ్చి గ్రహింపదలచి నందున వారితో నొడంబడిక జేసికొని దానిని రిజిస్టరుచేయించి వారివలన యా సొమ్ము పుచ్చుకొని ముందుగా బ్యాంకువారి బాకీతీర్చి హామీ యీయబడిన శ్రీరాములుగారి యాస్తిని, నా యాస్తిని విడుదలచేసితిని.

1918 వ సంవత్సరము నాకు మిక్కిలి దుఃఖకరమైన సంవత్సరము. ఏలయన, నా పుస్తకముల కాపీరైటుహక్కు పరాక్రాంతమైనదిగదా; నా పెద్దమేనకోడలైన రావూరి వెంకటసుబ్బమ్మ భర్త రామకృష్ణయ్య వైద్య పరీక్షలలో నుత్తీర్ణుడై బెజవాడలో సొంతవైద్యశాలను బెట్టుకొని యచ్చట గౌరవముండి వైద్యముచేయుచు, గౌరవమును సంపాదించుకొనుచు, సుఖముగా జీవించుచుండెను. ఆ సంవత్సరము బెజవాడలో బొబ్బలమ్మ (Plague) జాడ్యము వ్యాపించియుండెను. దానికి సంబంధించిన టీకాలు వేసుకొనకుండా రామకృష్ణయ్య 'మనకేమిభయమ'ని గర్వించి మహాపురి తగిలిన రోగులకు చికిత్సజేయ నారంభించెను. ఆకారణముచేత నతడు తీవ్ర జ్వరపీడితుడై నాలుగుదినములుమాత్రమే బాధపడి 1918 వ మార్చి 30 వ తేదీని కాలోలు బెజవాడలో మృతినొందెను. పాపమప్పటి కతని తలిదండ్రులు జీవించియుండిరి. అప్పటి కలనికి రమారమి 10 మాసముల వయసుగల యాడుపిల్ల యుండెను. ఆమెపేరు మీనాక్షి. వైద్యవృత్తిలో నారంభకుడైనందున రామకృష్ణయ్య ధనము సంపాదింపలేదు. గౌరవముగా జీవనముమాత్రము జేయుచుండెను. భార్యయు, బిడ్డయు నసహాయస్థితిలో నుండిరి. రామకృష్ణయ్యకు జబ్బుగానున్నదని విన్నతోడనే, నేను మా పెద చెల్లెలైన యన్నపూర్ణమ్మను బెజవాడ బంపితిని. మా సుబ్బమ్మ తల్లి యచ్చమ్మ నరసన్న పేటలో రెండవకూతురు దగ్గర నుండెను. మాసుబ్బమ్మ కూతురు మీనాక్షి మొదటినుండి దుర్బలశరీరము గలిగి రోగపీడితురాలై యుండెను. రాజమహేంద్రవరము వచ్చిన తరువాత మీనాక్షికి జబ్బు

హెచ్చెను. అందుచేత నామెను తల్లిని మిషనువారి యాసుపత్రిలో గొంత కాలము చికిత్స నిమిత్తముంచితిని. అందుచేత నాకు వ్యయ ప్రయాసము లధికమయ్యెను. ఆసుపత్రిలో నెంతకాల ముంచినను నామెకు రోగము నివారణ కానందున యింటికి గొనివచ్చి మరియొక వైద్యము చేయించితిని. ఎట్టకేలకు నీశ్వరానుగ్రహమువలన బాలిక జీవించి యారోగ్యవంతురా లయ్యెను. అందులో నాకు మరియొక దుఃఖము పిడుగుపాటివలె సంభవించెను. సుబ్బమ్మ తల్లియు, నా రెండవచెల్లెలైన యచ్చమ్మ కూతునకు ధైర్యముచెప్పి గాపాడుచున్న దినములలో నకస్మాత్తుగా జ్వరపీడితురాలై మూడుదినములు బాధపడి నాలుగవదినమున ననగా 1918 వ జూను 18 వ తేదీని జ్యేష్ఠశుద్ధ యేకాదశినాడు రాత్రి మృతినొందెను. చనిపోవునపు డామెకు నాలుక గొణుగుపోయినందున సరిగా మాటాడలేక నన్ను దగ్గరకు బిలిచి, "అన్నయ్యా! ఉబ్బమ్మ, ఉబ్బమ్మ యని వచ్చిరా నీమాటలతో నాకు మేనకోడలు సుబ్బమ్మ నప్పగించెను. పాపము! మా సుబ్బమ్మ యవస్థ మిక్కిలి శోచనీయమైయుండెను. నడివయసులోనుండి పేరు ప్రతిష్ఠలు, ధనము నార్జించుచున్న భర్త పోయెను. కూతురా రోగపీడితురాలు. ధనమా లేదు. రామకృష్ణయ్యకు కూతురేగాని కొడుకులు లేనందున నతని పిత్రార్జితమైన భూమిలో బిడ్డకు భాగములేకపోయెను. మాసుబ్బమ్మ తండ్రి చనిపోయినపుడెట్టి నిరాధారస్థితిలో నుండిరో నేడును నట్టి స్థితిలోనే యామె యుండెను. కడుపులోబెట్టుకొని ధైర్యముచెప్పి కాపాడవలసిన యామెతల్లి మృతినొందెను. ఆమెకు సోదరులులేరు. నేనుదప్ప నామెకు దిక్కెవ్వరునులేరు. మాతృవియోగ దుఃఖమునుండి మా సుబ్బమ్మ తేరిన తోడనో యామెకు నేను విద్యాభ్యాసము జేయించుట మంచిదని నాకు దోచెను. అంతకుముందు నా మిత్రులైన దామెర్ల వెంకటరమణారావు గారి కుమార్తెలు, వితంతువులుకాగా, వారికాయన విద్య నేర్పింపజొచ్చెను. ఆ మార్గము మంచిదని నాకు దోచెను హిందువులలో ధనములేని బాల వితంతువులు, జీవనాధారములేక యన్నవస్త్రములకై యిబ్బందిపడుచు, నే చుట్టముల యింటనో వంటచేసి, హీనకార్యములుజేసి, మిక్కిలి శ్రమ పడుచుందురు. విద్య నేర్పించినందున వారి మనసు దుఃఖమునుండి కొంత మరలును. చదువు ముగించిన తరువాత, వితంతువు లేదో యొక గౌరవమైన వృత్తివల్ల జీవింపవచ్చును. అందుచేత నా మేనగోడలికి విద్యాభ్యాసమే గర్తవ్యమని నిశ్చయించి, ముందుగా నాంధ్రప్రవేశము గలిగించుట

చుట సుంచిదని, చిన్నయసూరి "నీతిచంద్రిక", "మొల్లరామాయణము" వంటి చిన్నపద్యకావ్యములు జెప్పి పిమ్మట మహాకావ్యములు బోధించి, పిమ్మట నుభయభాషాప్రవీణ పరీక్షకు బంపదలచి, సంస్కృతము నారంభించి, మొదట గద్యపద్యాత్మకమైన విక్రమార్క చరిత్ర జెప్పి, యవ్వల "రఘువంశము", "కుమారసంభవము", "మేఘసందేశము", "భారవి" జెప్పితిని. "మాఘకావ్యము"ను మా మేనమామగారైన పురాణపండ మల్లయ్యశాస్త్రిగారియొద్ద నామె జదివెను.

1918 వ సంవత్సరము జూను నెలలోనే పీరేశలింగోన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులైన ముడియము సీతారామారావుగారిని, వెంకటరత్నము నాయుడుగారును, పీరేశలింగముగారును గలసి యాలోచించి, యేకారణము ననో యుద్యోగమునుండి తొలగించిరి. దీనికి దగిన కారణములులేవు. పాఠశాల మిక్కిలి యభివృద్ధిలోనుండెను. ఒక్కొక్కతరగతి నారేసి యేడేసి డివిజనులుగా గూడనుండెను. పాఠశాలకు నష్టములేదు సరిగదా లాభముగూడ వచ్చుచుండెను. ఆయనను దీసివేయుట యన్యాయమని నాకు దోచెను. నేను సీతారామారావుగారి కేమియు సాయము చేయలేకపోతిని. వారి స్థానమున జయంతి గంగన్నగారు ప్రధానోపాధ్యాయులుగా వచ్చిరి. సీతారామారావుగారిని తీసివేసినందులకు నేను విచారించితిని. గంగన్నగారు వచ్చినందుకు నాకు విచారములేదు; వారు వచ్చుట నాకు సంతోషమే. ఏలయన గంగన్నగారు నాకు మిత్రులు, మిక్కిలి సమర్థులు. ఇటువంటి పాఠశాలకు ప్రధానోపాధ్యాయులుగ నుండదగినవారు. దైవానుగ్రహమున సీతారామారావుగారికి దత్తమండలములలో మంచి యుద్యోగము దొరకి వెళ్లిపోయిరి.

ఆ సంవత్సర మక్టోబరునెలలో, మా నూడవచెల్లెలైన వెంకటరమణమ్మ రెండవకుమారుడగు నానందరావు సంవత్సరము వయసుగలబాలుడు; ముద్దుల మూటగట్టువాడు; నాకు మిక్కిలి ప్రియమగువాడు; దీర్ఘరోగపీడితుడై మృతినొందెను. ఆ సంవత్సరము డిశంబరునెలలో నాకు మిక్కిలి మిత్రుడును, నాయం దత్యంతాభిమానముగల మహనీయుడును, శ్రీ పిఠాపురము మహారాజావారి మంత్రియైన మొక్కపాటి సుబ్బారాయుడుగారు యిన్ఫ్లుయన్జా జ్వరముచేత బాధపడి మృతినొందిరి ఈ మరణము నాకు దుఃఖము గలుగజేసెను. ఆయన మరణవార్త నాకు శ్రీరఘుపతి వెంకటరత్నమునాయుడుగారు దెలియపరచిరి. నేను వెంటనే పిఠాపురమువెళ్ళి,

మహారాజావారిని జూచి, పరామర్శించేసితిని. తరువాత సుబ్బారాయుడుగారి మరణమునకు విషాదమును దెలుపుచు పిఠాపురము పౌరులు సభచేసిరి. ఆ సభకు వేంకటరత్నమునాయుడుగా రధ్యక్షులు. ఆ సభలో పానుగంటి లక్ష్మీనరసింహారావుగారును, నేనును మాటలాడితిమి. సుబ్బారాయుడుగారు మిక్కిలి సమర్థులు. సంస్కృతాంధ్రభాషాభిమానులు, పండిత పక్షపాతులు, ఆలాంటి మంత్రి ప్రభువులకు దొరకుటరిది.

ఈ ముద్రాక్షరశాల శ్రీ విజయనగరము మహారాజుగారి భవనమున, నిన్నీసుపేటలో నెలకొల్పితిమని యిదివరకే వ్రాసితిని. ఆ భవనము కాళీ చేయుమని వారు మాకువ్రాసిరి. మాకు ఁగిన భవనమేమియు దొరుకలేదు. అందుచే మాలో భాగస్వామియైన చిత్రపు నరసింహారావుగారి యిన్నీసుపేట భవనములోనికే మార్చితిమి. ఆ భవనములోనే యొకమూల నరసింహారావు గారి సొంతమైన వివేకవర్ధనీ ముద్రాక్షరశాలగూడ నుండెను. ఇది మాలో మాకు వివాదములకు హేతువయ్యెను. నరసింహారావుగారియొద్ద నెలకారు రూపాయలద్దె నిర్ణయించుకొని, నా "దేశమాత" కార్యస్థానమందు రెండు గదులలో బెట్టితిని.

1918 వ సంవత్సర మక్టోబరునెలలో, నా జీవితములో నొక గొప్ప విశేషము జరిగెను. లోకారాధ్యుడును, మహాకవీశ్వరుడును నైన రవీంద్ర నాథ టాగూరుగారు, కలకత్తానుండి పిఠాపురమువచ్చి, మహారాజావారి కతిథియై కోటలో బసచేసియుండిరి. అప్పుడు నేను పిఠాపురమువెళ్ళి, కవీంద్రుడైన రవీంద్రుని దర్శనముజేసితిని. ఆయన నాతో రమారమి యరగంటసేపు మాటాడిరి. నే రచించిన పద్యములు గొన్నిచదువుమని కోరి యర్థము చెప్పించుకొని వినిరి. మా సమావేశమైనపిదప కోటలో నొకసభ జరిగెను. సుబ్బారాయుడుగారు నన్నాసభ కాహ్వానముజేసిరి. టాగూరుగారు దయచేసి గూర్చుండిరి. ఏదేనొక విషయమును గురించి యుపన్యసింపుడని టాగూరుగారిని కోరవలసినదని, మొక్కపాటి సుబ్బా రాయుడుగారు నాతో జెప్పిరి. "ప్రార్థనయొక్క ప్రయోజనమేమి"? అని టాగూరుగారి నింగ్లీషులో నడిగితిని. అంతట ప్రార్థనయొక్క ప్రయో జనమునుగూర్చి ముప్పదినిముషముల కాలం టాగూరుగా రాంగ్లేయభాషలో నుపన్యసించిరి. ఉపన్యాసము ప్రారంభమైనతోడనే, రఘుపతి వేంకట రత్నమునాయుడుగారును, మహారాజుగారును దయచేసిరి. టాగూరుగారి కంఠధ్వని మిక్కిలి మధురమై, శ్రావ్యమైయుండెను. ఆ యుపన్యాసము విని

సభాసదులు మహానందమునొందిరి. రాజమహేంద్రవరము రావలసినదని టాగూరుగారిని నే గోరితిని వచ్చుట కప్పుడవకాశములేదని వారు సెల విచ్చిరి. పిమ్మట నేను రాజమహేంద్రవరము వెళ్ళితిని.

నేను వెళ్లునప్పటికి, గంజాముజిల్లాలోని పలాసా గ్రామమునుండి యొక పెద్దమనుష్యుడువచ్చి, మాయింటివద్ద యుండి పలాసాలో జరుగు వార్షికోత్సవసభ కధ్యక్షుడుగా రమ్మని నన్నుకోరిరి నా పెద్దవదెనగారి కుమారుడైన ద్విభాషి చిన్నయ్య యనునతనిని వెంటబెట్టుకొని, బయలు దేరి నేను పలాసావెళ్ళితిని. విశాఖపట్టణము దాటిన తరువాత, శ్రీకాకుళము ట్రయినింగుస్కూలు ప్రధానోపాధ్యాయుడైన, జటప్రోలు సర్వభద్రము గారు నన్ను రైలులోగలసికొని, శ్రీకాకుళము రమ్మని నన్ను బల వంతము జేసిరి. తిరిగివచ్చునప్పుడు వత్తునని నేను వాగ్దానముజేసితిని. నేను పలాసా స్టేషనులో దిగగానే, రవీంద్రనాధటాగూరుగా రాబండిలోనే కలకత్తా వెళ్లుచున్నారని తెలిసినందున, వెంటనే వారు కూరుచున్న మొదటి తరగతి బండిలోనికెక్కి వారి దర్శనము రెండవసారిచేసి ధన్యుడనైతిని. పిమ్మట పలాసావెళ్ళి యచట పురజనులు జేసిన వార్షికోత్సవసభ కధ్యక్షు డనై యుపన్యసించితిని. అప్పుడు శ్రీకాకుళములో డిప్యూటీకలెక్టరుగా నున్న జయంతి రామమూర్తి పంతులుగారా సభకువచ్చి, శ్రీకాకుళము రమ్మని నన్నుగోరిరి పలాసాసభయైన మరునాడు రాత్రి యేదోయొక నాటకము పురజనులు ప్రయోగించిరి, పిమ్మట నేను నరసన్నపేట వెళ్ళి తిని. అక్కడ నా రెండవ మేనకోడలి పెనిమిటి కోట శేషగిరిరావు సబురిజిస్ట్రారుగా నుండెను. అచట రెండు దినములుంటిని. ఆపురజనులేదో నొక యుపన్యాసమిమ్మని కోరినందున, నాయొక్క బోర్డుపాఠశాలలో సంఘ సంస్కరణమును గురించి యుపన్యసించితిని. ఆసభకాపాఠశాల ప్రధానో పాధ్యాయుడును, శ్రీ జయంతి గంగన్నగారి జ్యేష్ఠ సోదరుడునైన, బాల కృష్ణమూర్తిగా రధ్యక్షులుగ నుండిరి. అచటనుండి నేను శ్రీకాకుళము పోయి జటప్రోలు సర్వభద్రముగారింట బసచేసి, వారి పాఠశాలలో నొక యుపన్యాస మిచ్చితిని. పిమ్మట పురజనులకోరికమీద మరియొకచోట మరి యొక యుపన్యాసమిచ్చితిని. ఆసభకు శ్రీ జయంతి రామమూర్తి పంతులు గారధ్యక్షులుగ నుండిరి. ఆమరునాడు శ్రీ జయంతి రామమూర్తి పంతులు గారు మమ్ము తమయింటికి గొనిపోయి, నామెడలో కర్పూరపుదండవైచి గౌరవించి, గాన విశారదయైన తమకోడలిచేత శ్రావ్యముగ వీణాగానము

చేయించిరి. ఆమె మిక్కిలి మనోహరముగా పాడెను. శ్రీగానము వినదలచిన వారు, కులటలగానము వినుటకంటె, శిక్షగా విద్యనేర్చుకొన్న సంసారస్త్రీల గానము విని సుఖింపవచ్చునని నేనప్పు డనుకొంటిని. పిమ్మట నా మిత్రుడైన బుర్రా శంకరశాస్త్రిగారి యింట నొకపూట విందారగించి యచటనుండి రాజమహేంద్రివరము వచ్చితిని.

1918 వ సంవత్సరమున నక్టోబరు 28 వ తేదీని గాబోలు శ్రీ పోలవరము జమీందారుగారు కాకినాడలో మృతినొందిరి. అప్పుడు నాకును వారికిని మైత్రి లేకపోయినను, సహాధ్యాయుల మగుటచేతను, కొంతకాలము కలిసిమెలసి యుండుటచేతను, నేను విచారించితిని. ఆయన పోయిన పండ్రెండవ దినమున వారి భావమరదియు, వంగలపూడి సంస్థానాధిపతియునైన, శ్రీరాజా వాడ్రేవు వెంకటకృష్ణారావు బహదూరువారు, 3 నవంబరు తేదీని రాజమహేంద్రవరములో మృతినొందిరి. ఆయన నాకు మిత్రులగుటచేతను, విశేషించి మా సత్యవోలు లక్ష్మీపతిగారికి పెద్దయల్లుడగుటచేతను, వీరి మరణము నాకు మిక్కిలి విచారహేతువయ్యెను. ఇట్లు బహుబంధుమిత్రుల మరణముతో 1918 వ సంవత్సరము గతించెను.

1919 జనవరిలో మాతమ్మునికి రెండవ కుమారుడు పుట్టెను. వానికి మల్లయశాస్త్రియని పేరు పెట్టిరి. మరి వారము దినములకు అనగా ఫిబ్రవరి మొదటివారములో కోట శేషగిరిరావునకు మాయింటివద్దనే రెండవ కుమారుడు పుట్టెను. ఆపురిటిలో మా మేనకోడలు వెంకట రత్నమ్మకు మశూచికమువచ్చెను. కాని యెట్టకేలకు దైవానుగ్రహమువలన నామెయు బిడ్డయు సుఖముగ స్నానముచేసిరి. ఆపిల్లవానికి సూర్యప్రకాశమని పేరు పెట్టిరి.

ముద్రాక్షరశాలా భాగస్వాములమైన మాకు వివాదములు హెచ్చుటచే, నేను "దేశమాత" పత్రిక ప్రకటించుట యా ఫిబ్రవరినుండి మానితిని. నేనీ రెండుపత్రికలు నడుపుటచే నెన్నో గ్రంథములు రచియింపగలిగితిని. ఈపత్రికా ప్రకటన మాగిపోయిన తరువాత. గ్రంథరచనము మునుపటివలె నాకు సాగలేదు. ఆసంవత్సర మేప్రియలు నెలలో గోదావరీ మండలసభలు పిఠాపురములో జరిగెను. రాజకీయ సభకు దుగ్గిరాల సూర్యప్రకాశరావుగారధ్యక్షులైరి. సంఘసంస్కరణ సభకు నన్నధ్యక్షునిగ నాహ్వానించిరి. సభకధ్యక్ష పదవి నధిష్ఠింపుమని శ్రీ రఘుపతి వెంకటరత్నము

నాయుడుగారు కోరిరి. అధ్యక్షోపన్యాసము నేనెప్పటియట్లె యాంధ్రభాషలో జెప్పితినిగాని వ్రాయలేదు. సభలన్నిచోట్ల సలక్షణముగనే జరిగెను.

ఆ సంవత్సరము వీరేశలింగముగారు, బెంగుళూరు వెళ్ళుటమాని, యాంధ్రకవుల రెండవభాగము సవరించి వ్రాయుటకై చెన్నపురి వెళ్ళి, కొమట్లాజు లక్ష్మణరావుగారి నివాసస్థలమైన యెగంబూరు (Egmore)లో "వేదవిలాస" మను గృహమున బసచేసి యా గ్రంథమును సవరించి వ్రాయుచుండిరి. ఆంధ్రకవుల చరిత్రము మొదటిభాగము పలెనే, రెండవ భాగముగూడ, ననేక నూతనాంశములతో బయలువెడలునని మేమువ్విళ్లూరు చుంటిమి. కాని యాంధ్రదేశీయుల దురదృష్టముచేత, నమూల్యమైన యా గ్రంథము పూర్తియగు భాగ్యము పట్టలేదు. అది వ్రాయుచుండగనే వీరేశలింగము సంతులుగారికి జ్వరము తగిలెను. జ్వరము వచ్చిన నాలుగు దినములకే హెచ్చి ప్రాణముమీదికి వచ్చెను.

1919 వ సంవత్సరము మేనెల 27 వ తేదీ రాత్రి, రావుబహదూరు కందుకూరి వీరేశలింగముపంతులుగారు, చెన్నపురిలోనే వేదవిలాసమున నాంధ్రుల భాగ్యదోషమున నస్తమించిరి. ఆనాటి పగలు వారు ముద్రిత మగుచున్న "కవులచరిత్ర" రెండవభాగములోని యొక కాగితము (Proof) దిద్దుచుండిరట. జబ్బెక్కువైన తరువాత, శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావుగారు వారికడకుబోయి, మీకేవైన కోరికలున్నవాయని యడుగగా, లేవని వీరేశలింగంగారు బదులు చెప్పిరట. ఈయన యస్త మించుటచే సంఘసంస్కరణమే కొంతవరకస్తమించినదని చెప్పవచ్చును. వీరేశలింగమువంటి సంఘసంస్కర్త, యటువంటి ధైర్యశాలి, యటువంటి కార్యశూరుడు, నటువంటి స్వార్థత్యాగి, యటువంటి లోకోపకారపరాయ ణుడు, కొన్నివందల సంవత్సరములకుగాని మనదేశమున జన్మింపడని నా దృఢమైన విశ్వాసము. అనేక స్థలములలో వారి మరణమును గురించి సభలు జరిగెను. రాజమహేంద్రవరములోగూడ నొక సభ జరిగెను. రెబ్బాప్రగడ పాపయ్యగారు చెన్నపురివెళ్ళి వీరేశలింగముగారియెముకలను, బూడిదను యొక బస్తాలోవేసి తెచ్చిరి. వీరేశలింగముగారు జీవించియుండ గనే భార్య నిమిత్త మొక సమాధి గట్టించి, యామె యెముకలను నందు నిక్షేపించి, తమ నిమిత్త మొక సమాధి గట్టించుకొనిరి. పాపయ్యగారు దెచ్చిన యస్థికలను, బూడిదను వీరేశలింగముగారి సమాధిలో నిక్షేపించుటకై తోటలో నొక సభ జరిగెను. ఆ సభకు శ్రీ రఘుపతి వెంకటరత్నము

నాయుడుగారు దయచేసి యా నిక్షేపణకర్మ జరిపి మహోపన్యాసమిచ్చిరి. అప్పుడు కాళ్ళకూరి నారాయణరావుగారు జాలిగొలుపునట్లు రసవంతమైన పద్యములు జదివిరి. ఆ దినములలో వీరేశలింగముగారి సంపుటములను ధర తగ్గించి యమ్మిరి. దానివలన కొంతసొమ్ము వచ్చెను.

ఆ సంవత్సరము 1919 వ సెప్టెంబరునెలలో నేను మా వీరవాసరము వెళ్ళితిని. నాకు సంతానములేదు మా తమ్ముని కప్పటికి ముగ్గురు కుమార్తెలు, నిద్దరు కుమారులు నుండిరి. అతడు కుటుంబభార మీడలేక బాధ పడుచుండెను. అందుచేత నేను వీరవాసరములోనున్న నా పితార్జితమైన చరస్థిరాస్థులలో నావంతు సగమును, నా స్వార్జితమైన భూమియు నుచిత ముగా మా తమ్మునికి దస్తావేజు వ్రాసియిచ్చి, భీమవరమువెళ్ళి దానిని రిజిస్టరు చేయించి యిచ్చివేసితిని

ఆ సంవత్సరము డిశంబరునెలలో చెన్నపురి గవర్నరుగారైన "వెల్లింగ్డను" ప్రభువుగారు రాజమహేంద్రవరమువచ్చి, నా కోరిక మీద నారాయమోహన పాఠశాలకు దయచేసి, చూచి సంతోషించి "Mr. Narasimham! you are turning out good work" ("నరసింహముగారూ మీరు మంచి పనిచేయుచున్నారు") అని నన్ను ప్రశంసించిరి.

1920 వ సంవత్సర ప్రారంభమున శ్రీకట్టమంచి రామలింగారెడ్డిగారు రాజమహేంద్రవరము వచ్చి, నా రామమోహనపాఠశాలకు దయచేసి చూచి సంతోషించి, తాము మైసూరురాష్ట్రమున విద్యాశాఖాధికారిగ నున్నప్పుడు, నిమ్నజాత్యుద్ధరణ నిమిత్తమై తాముచేసిన పనులు గొన్నిజెప్పి, యా పద్ధతుల నిక్కడ నుపయోగించుమని నాకు సలహాజెప్పిరి. రామలింగారెడ్డిగారికిని నాకును 1898 నుండియు స్నేహము. అప్పుడు వారు విద్యార్థిగనుండి, కంచుమర్తి రామచంద్రరావుగారి యింటనున్న "విద్యాభిమానీ" సమాజములో, పింగళి సూరన్న కవిత్వమును గురించి చక్కగ నుపన్యసించిరి. వారి కాంధ్రభాషయందు మంచి పాండిత్యముగలదు. వారు సీమలో జదువుకున్నను మాతృభాషను మరచిపోలేదు. 1907 వ సంవత్సరము వేసవిలో రాజమహేంద్రవరము వచ్చి, కంచుమర్తి రామచంద్రరావుగారి యింట బసచేసి కొన్నిదినములుండిరి. నేను ప్రతిదినము మధ్యాహ్నము వారిని గలుసుకొనుచుంటిని. నా యందు వారికి నాటినుండి నేటికిని దయాభిమానములు మెండు.

1920 వ సంవత్సరము మొదలుకొని, సహాయనిరాకరణోద్యమము, మన యాంధ్రదేశమున ముఖ్యముగా రాజమహేంద్రవరమున, ప్రబలెను. ఆనేకులా యాందోళనమున బసిజేసి, చెరసాలలకు బోయిరి. త్రాగుబోతుతనము పనికిరాదని సారాగిడ్డంగుల దగ్గర నుపన్యసించి, డాక్టరు పాలకోడేటి గురుమూర్తిగారు, కందుల వీరరాఘవస్వామినాయుడు గారు, గజవిల్లి రామచంద్రరావుగారు మొట్టమొదట చెరసాలకు బోయిరి. సహాయనిరాకరణముమీద నాకు సానుభూతిగలదుగాని నే నంధుడనగుట చేతను, రోగపీడితుడనై నా పనులు నేను స్వయముగా జేసికొనలేనివాడ నగుటచేతను సాహసించి, కారాగృహమునకు వెళ్లలేదు. పాల్‌చౌకులోను, శ్రద్ధానంద ఘట్టమునందును నేను బలుమారులు సహాయనిరాకరణమును గురించి యుపన్యసించుచుంటిని. 1920 వ సంవత్సరమున జాతీయవాదుల సభ రాజమహేంద్రవరమున జరిగెను. ఆ సభయొక్క సన్మానసంఘమునకు పౌరులు నన్నధ్యక్షునిగా నేర్పరచిరి. చెన్నపురినుండి శ్రీ పేరి నారాయణమూర్తిగారు మహాసభ కధ్యక్షులుగ వచ్చిరి. తత్కాలోచితముగా నేను తీవ్రమైన యుపన్యాసము చేసితిని. సభ శ్రీ గున్నేశ్వరరావుగారి చింతామణీ నాటకశాలలో జరిగెను.

నా రెండవ మేనగోడలి పెనిమిటి శేషగిరిరావు నరసన్నపేటలో సబురిజిస్ట్రారుగా నుండెనని, యిదివరలో జెప్పితిని. అతనికి భీమవరము బదిలీయయ్యెను. అతడు కోపస్వభావుడగుటచే ననేకులు విరోధులగుచుండిరి. భీమవరము తాలూకాలోని యొకక్షత్రియుడు, పత్రము రిజిస్టరు చేయించుకొనుటకు కచ్చేరీకి వచ్చి, శేషగిరిరావు మర్యాదచేయనందున మిక్కిలి కోపించి, సబురిజిస్ట్రారు తన్ను లంచమడిగినట్లు డిప్యూటికలెక్టరు వారియొద్ద నొక యభియోగము దాఖలుచేసెను. శేషగిరిరావు లంచము పుచ్చుకోడని నేను చెప్పను. ఎక్కడనో కొందరుదప్ప తక్కిన సబురిజిస్ట్రారులందరు సొమ్ము పుచ్చుకొన్నట్లే శేషగిరిరావుగూడ సొమ్ము పుచ్చుకొనుచుండెననియే నా నమ్మకము. ఆ క్షత్రియుడు దెచ్చిన యభియోగము మాత్రము నిజమైనదిగాదు. ద్వేషముచేత జేయబడినది. శేషగిరిరావునకు సహాయము చేయుటకై నేను పలుమారులు భీమవరము వెళ్ళితిని, ఒక సారి నామిత్రులైన సోమిన కామేశ్వరరావుగారినిగూడ నాతో భీమవరము తీసుకొనివెళ్ళి, శేషగిరిరావు పక్షమున బనిచేయించితిని. డిప్యూటీ కలెక్టరుగారు శేషగిరిరావుమీద నేదో కోపముబూని కక్షవహించి

యుండుటచే, కామేశ్వరరావుగారాయన యొద్దనుండి కేసును మరియొక చోటునకు మార్పుచేయించుటకు ప్రయత్నముచేసిరి పిమ్మట నా మేన మామ కుమారుడైన పురాణపండ కామేశ్వరరావు, శేషగిరిరావు పక్షమున బందరువెళ్ళి, కేసు మరియొకచోటుకు మార్పుచేయుమని, జిల్లాకలెక్టరుగారి యొద్ద నర్జీపెట్టగా, వెంటనే నరసాపురము సబుకలెక్టరుగారియొద్దకు మార్చిరి అచట కేసు విచారణకు వచ్చునప్పటికి ఫిర్యాది చనిపోయెను. వారి పాక్షులు కొందరు చనిపోయిరి, బుజువులేదని సబుకలెక్టరుగారా కేసును కొట్టివేసిరి, పిమ్మట శేషగిరిరావు మొదటతరగతి (First grade) న్యాయవాది పరీక్షకు చదువుకోవలెనని, సంవత్సరము సెలవుపెట్టి కుటుంబమును దీసికొని చెన్నపురి వెళ్ళెను. అక్కడతడు తరగతిలో జేరి చదువుచుండగా జబ్బుజేసెను అది కొంకి పురుగుజబ్బు. చెన్నపురములో గొప్పవైద్యులన్నను శేషగిరిరావు తగిన శ్రద్ధచేయనందున రోగము హెచ్చెను. పిమ్మట నతడు 1921 వ సంవత్సరము మే 1 వ తేదీ నాటికి రాజమహేంద్రివరము మాయింటికి వచ్చెను. సాధ్యమైనంతవరకు మంచి వైద్యముచేయించితిని, కాని విధినియోగముచేత 1922 వ సంవత్సరము జూను 10 వ తేదీ శనివారమునాడు రాత్రి మృతినొందెను అప్పటికి వృద్ధుడైన యతని తండ్రి బ్రతికి యుండెను. తల్లి యంతకుముందే చని పోయెను. పోవునప్పటికి భార్యయు, నిద్దరు కుమార్తెలు, సంవత్సరము వయస్సుగలిగిన నొక కుమార్తెయు నుండిరి. కోటరామమూర్తిగారు తమ కోడలిని, మనుమలను పిఠాపురము దీసికొనివెళ్ళిరి. వారక్కడ నాలుగు సంవత్సరములుండిరి

ఆంధ్రసాహిత్యపరిషత్సభ 1922 వ సంవత్సరమున పిఠాపురములో శ్రీ మహారాజావారికోటలో జరిగెను. ఆ సంవత్సరమే శ్రీ పిఠాపురము రాజుగారికి మహారాజు బిరుదము వచ్చెను. ఆపరిషత్సభకు నేను వెళ్ళితిని, ఆసభయొక్క సన్మానసంఘమునకు మహారాజుగారే యధ్యక్షులు. మహా సభకు శ్రీ పానుగంటి లక్ష్మీనరసింహారావుగారధ్యక్షులైరి. మహారాజుగారి సన్మానసంఘాధ్యక్షోపన్యాసము వారి భాషాపాండిత్యమును వెల్లడిచేయు చుండెను. పానుగంటి లక్ష్మీనరసింహారావుగారి యధ్యక్షోపన్యాసము మిక్కిలి చమత్కారముగా నుండెను. శ్రీరాజా పానుగంటి రామారాయణం గారును, జయంతి రామయ్యగారును, సభకు దయచేసిరి. సభ మిక్కిలి జయప్రదముగా జరిగెను. అంతవైభవముగా మరి యేపరిషత్సభయు

జరుగలేదు. ఆసంవత్సరము శ్రీరఘుపతి వేంకటరత్నమునాయుడుగారి షష్టిపూర్త్యుత్సవము పిఠాపురముకోటలో జరిగెను. అది శ్రీ మహారాజా వారే చేయించుటచే నిరుపమానముగా జరిగెను. సభ కోటలో జరిగెను. చెన్నపురినుండి కందసామిచెట్టిగారువచ్చి సభకధ్యక్షత వహించిరి. అనేక సమాజములవారు నాయుడుగారి కభినందన పత్రములు సమర్పించిరి. చెన్నపురినుండివచ్చి, చింతగుంట రాఘవరావుగారింగ్లీషులో, నాయుడు గారినిగురించి ఉపన్యసించిరి. నేను దెనుగులో నుపన్యసించితిని.

నాకు 1911 వ సంవత్సరము మొదలుకొని క్రొత్తరోగము బయలు దేరెను. అండవృద్ధియై నాకుచాలబాధకలుగుచుండెను. తరుచుగా జ్వరము వచ్చుచుండెను. నడుచుటకు మిక్కిలి కష్టముగానుండెను. అది శస్త్ర వైద్యముచేతగాని, నివారణగాదని వైద్యులు చెప్పుటచే, శ్రీ పిఠాపురము మహారాజాగారు మిక్కిలి దయాళురై శస్త్రవైద్యము జేయింతుమని నెలవిచ్చి, ముందుగ వైద్యులతో మాటాడిరమ్మని, 100 రూపాయిలు నాకిచ్చి, 1922 వ సంవత్సరము నవంబరునెలలో నన్ను చెన్నపురికి పంపించిరి. మాకు మిక్కిలి మిత్రులైన గంటి లక్ష్మన్నగారు హైకోర్టులో న్యాయవాదిగానున్నందున, వారిబలవంతముచే వారియింటనే భోజనము చేయుచు, మా మేనమామకుమారుడు పురాణపండ కామేశ్వరరావొంటరిగా నుండుటచే, నతనియింట బసచేసి, పదునై దుదినములుంటిని. శస్త్రవైద్యులలో నగ్రగణ్యుడైన డాక్టరు రంగాచారిగారిచేత నాశరీరము బరీక్ష చేయించుకొంటిని. అయన పరీక్షించి "ప్రస్తుతము మీరు నీరసముగానున్నారు. రెండుమాసముల తరువాత శస్త్రచికిత్సచేసెద"నని తెలవిచ్చి నన్ను బంపిరి.

1922 వ సంవత్సరమున నా మేనకోడలు రాపూరి వెంకటసుబ్బమ్మకు మనశ్చాంచల్యము గలిగెను. కలకత్తానుండి మందు దెప్పించి యిచ్చితిని. ఆమెకు రెండుమాసముల తరువాత మనసు కుదుటపడెను. పిమ్మట నామె యెప్పటియట్ల సంస్కృతాంధ్రములు జదువ నారంభించెను. ఒకసారి శ్రీ రఘుపతి వేంకటరత్నము నాయుడుగారును, నేనును గూర్చుండి మాట్లాడుచుండగా వారు నా సంసారస్థితియడిగిరి. నేనిట్లంటిని. "నెలజీతము నాకు లేకపోవుటచే నాకు మహారాజుగా రెంతధన మిచ్చినను నా గ్రంధములవల్ల నాకెంత ధనమువచ్చినను, నే నిబ్బందింపడుచునే యుందును. నామీద ననేకులాధారపడియున్నారు గనుక నాకు నెలకు రు. 125

ఖర్చున్నది." పిమ్మట నాయుడుగారు పిఠాపురము వెళ్ళిరి. వారివల్ల నాస్థితి వినికాబోలు శ్రీ పిఠాపురము మహారాజావారు పరమ దయాళురై నాకు నెలకు సూటయిరువదియైదు రూపాయిలిప్పుట కేర్పాటుచేసిరి. మహా దాలయైన యా నుహారాజుగారి యౌదార్యమేమని కొనియాడుదును? నాపలన వారికేవిధమైన ప్రయోజనము లేకపోయినను వ్యర్థుడనైన నాకు నా యింటిదగ్గర గూర్చుండబెట్టి యెవరంత సొమ్మిత్తురు? ఆ మహారాజు గారి కా మహారాజుగారే సాటి. అట్టి ప్రభువరేణ్యుని మరియొకరిని పేర్కొనగలమా? ఆ యౌదార్య మాయనకేచెల్లును. ఆయన దానమిచ్చినా యేనుగుపాడి. అప్పటినుండి నేను మిక్కిలి సుఖపడజొచ్చితిని. 1923 వ సంవత్సరమున మార్చినెలలో మా తమ్ముడు పెద్దకూతునకు రెండవ కూతునకు వివాహములు పిఠాపురములోచేసెను. ఆ వివాహములనిమిత్తమై నాకు శ్రీ మహారాజావారు వేయిరూపాయిల నిచ్చిరి. మరియొకవిధముగా, నేను మరి నాలుగువందల రూపాయిలు సంపాదించి, మొత్తము రు 1400 వివాహముల నిమిత్తమై మా రమ్మున కిచ్చితిని. అప్పటికి నా భార్యకు నగలేమియులేవు. అయినను నామె కోపగింపక వివాహములకు నాతో గూడ పిఠాపురముపచ్చి యైదుదినములు సంతోషముగా గడపెను నా సగ మాస్థియు నా తమ్మునకు నేను వ్రాసి యిచ్చునప్పుడుగూడ నామె గోపింప లేదు. 1906 వ సంవత్సరమున "ఎంపైర్ ఆఫ్ యిండియా" (Empire of India) భీమా కంపెనీలో నేను రు. 2000/- కు భీమా చేయించి నా యనంతర మాసొమ్ము నాభార్య కిచ్చునట్లుగా వ్రాసితిని. ఏటేట దెబ్బది యెనిమిది రూపాయిలు నేనా కంపెనీకి చెల్లించవలయును. అట్లు 1918 వ సంవత్సరము వరకు నేటేట సొమ్ము చెల్లించి యెట్టకేలకు చెల్లించలేక 1919 వ సంవత్సరములో మానివేసితిని. ఇది వినిగూడ నాభార్య గోపింప లేదు.

1922 వ సంవత్సరము వరకు, నా రామమోహన పాఠశాలను, వివేకానంద పాఠశాలను నెట్టెబోనడపి యాపై నడపలేక గుడివాడ గ్రామ నివాసులును, దేశసేవా పరాయణులును, నిమ్నజాత్యుద్ధరణాసక్తులు నైన శ్రీ గూడూరి రామచంద్రరావుగారి కప్పగించితిని. ఆయన గాంధీగారి శిష్యులు; జాతీయవాదులు. నేను గుర్రమెంటువారివల్ల యా పాఠశాలను గురించి గ్రాంటులను పుచ్చుకొనుచుంటిని. రామచంద్రరావుగారికి సర్కారు వల్ల గ్రాంటు పుచ్చుకొనుట కిష్టములేదు. అందుచేత రామచంద్రరావు

గారు పాఠశాలలను జాతీయపాఠశాలలగా మార్చి దొరతనమువారి సంబంధము వదలుకొనిరి. ఆ సంబంధము వదలుకొనగానే వెనుకటి పిల్లలు మానివేసిరి క్రొత్తపిల్లలు చేరలేదు. కొంతకాలమునకు రెండుపాఠశాలలు కృశించి నశించెను. ఇవే గాదు.

రాజమహేంద్రవరములో నిమ్నజాతులకు పాఠశాలలు పెట్టుటకై యొక సంఘ మేర్పడెను. ఆ సంఘముహరు రాజమహేంద్రవరము చుట్టు పట్ల 10 స్థలములలో పాఠశాలలు స్థాపించి. చందాలపల్లను గవర్న మెంటు గ్రాంటులపల్లను, వాటిని నడుపుచుండిరి. ఆ సంఘమునకు నేన ధ్యక్షుడను. తల్లాప్రగడ ప్రకాశరాయుడుగారు కార్యదర్శి. పాలకోడేటి గురుమూర్తిగారు, జయంతి గంగన్నగారు మొదలగువారుసభ్యులు. వాటిని జాతీయపాఠశాలలగా మార్చి, గ్రాంటులు పుచ్చుకొనుట మానవలెనని, గురుమూర్తిగారొక తీర్మానము నుపపాదించిరి. వద్దని నేను వాదించితిని. నా మాట చెల్ల లేదు. సభ్యులు గురుమూర్తిగారి తీర్మానమునే యొప్పు కొనిరి. ఆ పాఠశాలలు క్రమముగ క్షీణించి నశించెను.

నా రాముమోహన పాఠశాల సోచమువుకున్న వెంకన్నయను పంచమ బాలుడు, మునిసిపలుస్కూలులోజేరి స్కూలుఫయినలు పరీక్షయందు కృతార్థుడయ్యెను. అపుడు వెంకటగిరవాడగుటచే నున్నతవిద్య చెప్పించిన బాగుండునని రఘుపతి వెంకటరత్నము నాయుడుగారిపేర వ్రాసితిని వారు మహారాజావారిలో మాటలాడి యా బాలుని కాకినాడ కళాశాలలో జేర్పించి, బి. యే, పరకు విద్యచెప్పించిరి. ఆపుడు పట్టపరీక్షనిచ్చుడై దొరతనమువారి కొలుపున పనిచేసించి, యిప్పుడు నేలము జిల్లాలో డిప్యూటీ తహసీలు దారుగనున్నాడు. అతడు తన కుమారునకు లక్ష్మీనరసింహమని నా పేరు బెట్టుకొనెను. ఇతడేగాదు. మార్కండేయులను చురియొకహరిజనుడు తనకుమారునకు నాపేరే బెట్టికొనెను. ఇంతటికో నిమ్నజాతుల విషయమై నేజేసినపని సమాప్తమయ్యెను.

బంగాళాదేశస్థుడైన రమేశచంద్రదత్తుగారు ఋగ్వేదము బెంగాలీ భాషలోనికి రచ్చుచూచేసిరి. అట్లే ఋగ్వేదమునాంధ్రీకరింపవలెనని సంకల్పించితిని. కొందరి మిత్రుల సహాయమున నేను ఋగ్వేదవాఙ్మయమును దెప్పించి, పండితులనుబెట్టి, వారికి జీతములిచ్చి, ఋగ్వేదముచదివి, గుమాస్తానుపెట్టి, రచూరమి యొక మండలమును దెనిగించి, కొంత భాగమును ప్రకటించితిని. కాని నేనాప్రయత్నములో సంపూర్ణముగా

కృతకృత్యుడనుగా లేకపోతిని. అది ద్రవ్యైకసాధ్యమగుటచే నావంటివానికి సులభముగాదని విడిచిపెట్టితిని.

1924 వ సంవత్సరమున మా మూడవ చెల్లెలు పెనిమిటియైన, పురాణపండ వెంకన్న, తనకుమారునియొక్కయు కుమార్తెయొక్కయు వివాహములవిషయమై నాతోనాలోచించుటకు మాయింటికివచ్చెను. వచ్చిన మూడుదినములలోపుగానే యొకనాటిరాత్రి భోజనముచేసి, యెప్పటివలె నారోగ్యముగానుండి పండుకొని, నిద్రపోయి రాత్రి యొంటిగంటకు మేలుకొని, మంచితీర్థముత్రాగి, వెంటనే స్మారకముదెలియక పడిపోయెను. అది యేమిరోగమో మాకుదెలియలేదు. డాక్టరు కారుమూరి వీరభద్రస్వామిగారి చేత యింజక్షనుగూడ జేయించితిని. ప్రయోజనములేకపోయెను. తలలో నేదో రక్తనాళము పగిలిపోయి (Cerebral Hemerage) యుండుననివై ద్యులూహించిరి. 1924 వ సంవత్సరము డిశంబరు 4 తేదీకిసరియైన రక్తాక్షి సంవత్సరమార్గశిర శుద్ధాష్టమి నాడుదయమున నైదుగంటలకు, స్వర్గస్థుడయ్యెను. అతడు దృఢకాయుడు, మహాబలశాలి. అతనికి జబ్బు చేసిమంచమెక్కినను నారుమాసములు లంఘనములుచేయుటకుసామర్థ్యము గలవాడు, అంతబలశాలి యంత హఠాత్తుగ చనిపోవుననియె వ్వరను కొనలేదు.

నాకు మిత్రులైన తల్లాప్రగడ చలపతిరావుగారు, రెబ్బాప్రగడ పాపయ్యగారుగూడ, నీ 1924 వ సంవత్సరముననే మృతినొందిరి. నా మూడవ చెల్లెలు కొమార్తెయైన కామేశ్వరికి వివాహము చేయవలసిన యీడువచ్చెను. ఆబిడ్డ 1913 వ సంవత్సరము డిశంబరునెలలో మా యింటనే జన్మించెను. మా బావమరది మృతినొందుటచే నతని కుటుంబభారము నాపైబడెను. అతనియాస్థి ఋణగ్రస్థమైపోయెను. అతని కుమార్తెకును కుమారునకును వివాహములు నేనే చేయవలసివచ్చెను. మాకు దగ్గర బంధువుడు పొన్నపల్లి వెంకట లక్ష్మీనరసింహారావు, వీరేశలింగోన్నత పాఠశాలలో స్కూలుఫైనలు పరీక్షయం దుత్తీర్ణుడై, పిమ్మట విశాఖపట్టణములోని యింజనీరింగు కళాశాలలో నోవరుసీరు బరీక్షకుజదివి కృతార్థుడై, యా దినములలో నిజాము రాజ్యమునం దుద్యోగములో నుండెను. నా మూడవ మేనకోడలు కామేశ్వరిని వానికిచ్చి వివాహముచేయ సంకల్పించితిని. నా పదెనగారి కుమార్తె యనగా రాపూరి సీతయ్యగారి నాలుగవ కుమార్తెయగు రామాయమ్మను, బాల్యమునుండియు నాభార్య మిక్కిలి

గారాబముతో పెంచెను. ఆబాలిక 1912 వ సంవత్సరము నవంబరులో జన్మించెను. నా మేనల్లుడైన పురాణపండ వెంకట దీక్షితులునకు వివాహము చేయదలచితిమి. ఈ రెండు వివాహములు 1925 వ సంవత్సరము మార్చినెల 14 వ తేదీని నే గాపురమున్న రాయవరపు వారింటనే జేసితిని. ఆ వివాహము రెండవరోజున నాకు మూర్ఛాచకము గనబడెను. వృద్ధదశలో మూర్ఛాచకము వచ్చిన బ్రతుకుట కష్టము. అయినను దైవానుగ్రహమున నేను జీవించితిని. అప్పుడు నావద్దనున్న సొమ్ము చాలకపోయెను. నంది పాడ విశ్వేశ్వరశాస్త్రిగారియొద్ద రు. 200/-లు బదులు చేయవలసివచ్చెను. ఆయన నా కిరుగుపొరుగువాడయ్యు, చిరకాలపరిచితుడయ్యు, మున్ను నా యచ్చుకూటములో భాగస్వామియయ్యు, మొగము నెరుగని మారువాడి వలె, నెల యొకటికి నూటికి రు. 1-14-0 లు వడ్డీచొప్పున నోటు వ్రాయించుకొని యిచ్చెను. ఆబాకీ తీర్చుటకు నాకు చాలకాలము పట్టెను. చివర కాయన నామీద వ్యాజ్యముపేసెను. ఎట్లో కష్టపడి చిల్లిగవ్వయైన మానుమని కోరకుండ వారిబాకీ తీర్చితిని.

1923 వ సంవత్సరము డిశంబరు నెలలో కాకినాడ పట్టణమున జాతీయమహాసభ (Indian National Congress) జరిగెను. ఇటువంటి సన్నాహములు చేయుటకు గూడ నాంధ్రులు దగినవారే యని యామహాసభ వల్ల స్పష్టమయ్యెను. కాకినాడ పురవాసులు లక్షరూపాయలు ప్రోగుచేసి మిక్కిలి జయప్రదముగా సభ జరిపిరి. మహారాజశ్రీ కొండా వెంకటప్పయ్యగారు సన్మానసంఘాధ్యక్షులుగా నేర్పరుపబడిరి. సన్మానసంఘము వారు సన్నాహ్వానించి టిక్కెట్టు బంపిరి. నేను నా పరివారమును, నాబాల్యమిత్రుడైన రాపాక కొస్తుభముగారి యింట బసచేసితిమి. ఆయన మాకాతిథ్యమిచ్చి గౌరవించెను. మహమ్మదాలీ సాహెబుగారు కాంగ్రెసున కధ్యక్షులు. ఆ సభకుబోయి మహామహులైన దేశనాయకుల యుపన్యాసములు వింటిని.

1917 వ సంవత్సరమున వావిళ్ళవారికి నా గ్రంథముల కాపీరైటు హక్కు నైదు సంవత్సరములవరకు నిమ్మటకై కొంత వ్యవహారము జరిపితిని. వారు నాకు రు 1700 లనిచ్చి, తక్కినసొమ్ము సరిగనీయక పోవుటచే, వారితో వ్యవహారము వదలుకొంటినని, యిదివరలో వ్రాసితిని. ఆ సొమ్ము నేను వారికి తీర్చనందున వావిళ్ళవారు నా మీద చెన్నపురము హైకోర్టులో వ్యాజ్యము వేసిరి. ఆ డిక్రి రాజమహేంద్రవరము జిల్లాకోర్టుకు

పంపబడెను. దేవత శ్రీగాయమూ ర్తిగారు వావిళ్ళవారి పక్షమున న్యాయ వాదిగ బనిచేసిరి. రాజమహేంద్రవరము వచ్చినది మొదలు నా యెడ నత్యంతాభిమానముగలిగి, నాకు బలువిధములతోడుపడుచుండిన, శ్రీసోమిన కామేశ్వరరావుగారు నా పక్షమున న్యాయవాదిగ బనిచేసిరి. వారు మిక్కిలి పట్టుదలతో పనిచేయకపోయిన పక్షమున నే నా వ్యాజ్యములో మిక్కిలి చిక్కులు పడియుందును. పిమ్మట నేను వావిళ్ళవారికి కొంత రొక్కు మిచ్చియు, గొన్నిపుస్తకము లెడిషను లచ్చుచేసి కొనుటకు కొంతకాలము వరకు హక్కునిచ్చియు, మొత్తముమీద వారిఋణము పూ ర్తిగదీర్చితిని.

1925 వ సంవత్సర మేప్రియలు నెలలో నొక విశేషము జరిగెను. వీరేశలింగముగారి జన్మదినోత్సవము జరుపబడెను. ఆ సభ టవును హాలులో శ్రీ రాయసము వెంకటశివుడుగారి యధ్యక్షతక్రింద జరిగెను. శ్రీ కఘుపతి వేంకటరత్నము నాయుడు గారాంగ్లభాషలో నుపన్యసించిరి. అంతకుముందు వీరేశలింగముగారిమీద దోషారోపణజేసి, వారికిపునఃకష్టము గలిగించిన, నాళము కృష్ణారావుగారు వీరేశలింగముగారి మీద దాము చేసిన దోషారోపణలకు జింతించుచు, దమ యనుతాపమును, పద్య రూపములుగావ్రాసి యచ్చువేయించి యా సభలో జదివిరి. అప్పటికైన నను వారికి బశ్చాత్తాపము గలిగినందుకు నేనును నాయుడుగారును దక్కిన మిత్రులును సంతసించితిమి.

●

స్వీ య చ రి త్ర ము

ఇ రు వ ది య వ ప్ర క ర ణ ము

ష ష్టి పూ ర్తి

1926 వ సంవత్సరమున నొకనాటి సాయంకాలమున, నేను టవునుహాలులో గూర్చుండగా నా మిత్రులైన వేమూరి విశ్వనాధశర్మగారక్కడకువచ్చి, "మీ కరువదియేండ్లప్పటికి నిండు"నని, నన్నడిగిరి. 1927 వ సంవత్సరము సెప్టెంబరు 26 వ తేదీకి నా కరువదియేండ్లు నిండు

నని చెప్పితిని. పిమ్మట వారు చెన్నపురివెళ్ళి, శ్రీ మునగాల రాజాగారిని గలుసుకొని, మన మందరము లక్ష్మీనరసింహముగారికి షష్ఠిపూర్తి చేయ వలెనని వారితో జెప్పిరట: మునగాల రాజాగారు మిక్కిలి సంతోషించి, శర్మగారితోగలిసి, రఘుపతి వేంకటరత్నము నాయుడుగారిదగ్గరకు వెళ్ళి రట. అప్పుడాయన చెన్నపురి విశ్వవిద్యాలయమున కుపాధ్యక్షులుగ నచ్చ టనే యుండిరి. వారును వీరి సలహా నంగీకరించిరట. పిమ్మట విశ్వనాధ శర్మగారు, రాజమహేంద్రవరమువచ్చి, షష్ఠిపూర్తి సంఘ మొకదాని నేర్ప రచి, దానికి శ్రీ న్యాపతి సుబ్బారావు పంతులుగా రధ్యక్షులుగను, పాల కోడేటి గురుమూర్తిగారిని గార్యదర్శిగాను, నేర్పరిచిరి. "కర్పూరమంజరి" మొదటిభాగము 1907 వ సంవత్సరములో ప్రాసి యప్పటినుండియు రెండవభాగము వ్రాయలేదు. పూర్వమొకసారి శ్రీ పిఠాపురము మహారాజా వారు, మొక్కపాటి సుబ్బారాయుడుగారు జీవించియున్నప్పుడే, "ప్రహ్లాద" నాటకము రసవంతముగా వ్రాయమని నాతోజెప్పిరి. నేను దాని కొప్పు కొంటినిగాని వ్రాయలేదు. విశ్వనాధశర్మగారు నాతో నొకసారి "కర్పూర మంజరి" రెండవభాగమును, "ప్రహ్లాద" నాటకమును మరియు వ్రాయ వలసిన గ్రంధము లేవైన యున్నపక్షమున, వాటిని షష్ఠిపూర్త్యుత్సవము లోపుగ వ్రాయవలసినదని నాతోజెప్పిరి. గ్రంధములు వ్రాయుటకు నాకు లేఖకునిగా, కామరాజు వెంకటరమణ శర్మగారినిచ్చి, యాయన జీతము నెలకు ముప్పదిరూపాయల చొప్పున, షష్ఠిపూర్తి సంఘమువారే యిచ్చు చుండిరి. నేను గ్రంధములను వ్రాయుట కారంభించితిని. అంతకుమున్నే "భాస"నాటకములలోని"మధ్యమవ్యాయోగము"ను, "స్వప్నవాసవదత్త"ను నాంధ్రీకరించి ప్రచురించితిని, "భాస" నాటకముల నన్నింటిని దెనుగుచేయ వలెనని నాకు మొదటినుండియు గుతూహలము గలదు. నా గ్రంధము లన్నియు షష్ఠిపూర్తి సంఘమువారు 10 సంపుటములుగా ముద్రింపించ దలచిరి. అవి యీ క్రిందివిధముగా నున్నవి.

మొదటిసంపుటము "దేశమాత"లోను మనోరమలోను నేను ప్రకటించిన హాస్యములు చాలవరకు నిందుగలవు. 2, 3, 4, 5, సంపుటము లలో నారచించిన నవలలన్నియుగలవు. ఆరవసంపుటములో నేను స్వక పోలకల్పితముగ రచియించిన నాటకములుగలవు. 7 వ సంపుటములో నేనాంధ్రీకరించిన నాటకములు చాలగలవు. కర్ణభారము నభిషేకనాటకము దక్కదక్కిన "భాస" నాటకములన్నియు దెనిగించి నేనీసంపుటములలో

గూర్చితిని. 8 వ సంపుటములో నేవ్రాసిన "సిద్ధార్థచరిత్ర" మొదలైన జీవచరిత్రలుగలవు 9 వ సంపుటమున "భాగవతకథామంజరి" "భారత కథామంజరి" "వినోదములు" 2 భాగములు "చమత్కారమంజరి" 2 భాగములు గలవు. 10 వ సంపుటమున "రాజస్థానకథావళి" 1, 2, భాగములు, "రఘుకులచరిత్ర" "ప్రచ్ఛన్నపాండవము"గలవు. సుబ్బారావుపంతులు గారు షష్టిపూర్తిసంఘమునకధ్యక్షులుగనుండుటయేగాక, యాంధ్రదేశములో నున్న యన్ని జిల్లాలలోని ప్రముఖులగు పెద్దమనుష్యులకు, షష్టిపూర్తి సంఘములో సభ్యులుగనుండుమనివ్రాసి, లిఖితపూర్వకమైన వారి సమ్మతులుదెప్పించి, వారినందుచేర్చిరి. ఆషష్టిపూర్తిసంఘములో సభ్యులిరువది తొమ్మండుగురు, వారిపేళ్ళివి.

(1) రఘుపతి వెంకటరత్నము నాయుడుగారు, చెన్నపురి. (2) కట్టమంచి రామలింగారెడ్డిగారు, బెజవాడ. (3) కిళాంబి రామానుజాచార్యులుగారు, విజయగరము. (4) జయంతి రామయ్యగారు, తొత్తరమూడి (5) సర్వేపల్లి రాధాకృష్ణయ్యగారు, కలకత్తా. (6) వేపా రామేశంగారు, చెన్నపురి. (7) ముత్తా వెంకటసుబ్బారావుగారు, చెన్నపురి. (8) నాయని వెంకటరంగారావుగారు, మునగాలరాజాగారు. (9) మంత్రిప్రగడ భుజంగరావుగారు, లక్కవరంరాజాగారు. (10) వాసిరెడ్డి దుర్గాసదాశివేశ్వరప్రసాదుగారు, జయంతిపురంరాజాగారు. (11) కాశీనాధుని నాగేశ్వరరావుగారు, చెన్నపట్టణము. (12) వావిళ్ళ వెంకటేశ్వరశాస్త్రిగారు, చెన్నపురి. (13) చింతలపాటి నరసింహరాజుగారు, విశాఖపట్టణము (14) భూపతిరాజు వెంకటపతిరాజుగారు, విశాఖపట్టణము. (15) మోచర్ల రామచంద్రరావుగారు, ఏలూరు. (16) వరదా కామేశ్వరరావుగారు, (పూండి) గంజాంజిల్లా. (17) వరహగిరి వెంకటజోగయ్యగారు, బరంపురం. (18) కొమ్మిరెడ్డి సూర్యనారాయణమూర్తిగారు, కాకినాడ. (19) కొండా వెంకటప్పయ్యగారు, గుంటూరు. (20) బి. పెరుమాళ్ళనాయుడుగారు, కందుకూరు. (21) రాయసం వెంకటశివుడుగారు, నెల్లూరు. (22) అల్లాడ కృష్ణస్వామయ్యరుగారు, చెన్నపురి. (23) సామి వెంకటాచలంచెట్టిగారు, చెన్నపురి. (24) గంటి లక్ష్మన్నగారు, చెన్నపట్టణము. (25) టి. రాఘవాచార్యులుగారు, బళ్ళారి. (26) టి. శివశంకరముగారు, పెనుకొండ. (27) మాడపాటి హనుమంతరావుగారు, హైదరాబాదు. (28) పాలకోడేటి గురుమూర్తిగారు, రాజమహేంద్రవరం. కార్యదర్శి. (29) న్యాపతి సుబ్బారావుపంతులుగారు,

రాజమహేంద్రచరము. అధ్యక్షులు. ఓక్క- రాజమహేంద్రవర పురవాసులే యీ యుత్సవముజేసినట్లుగాకుండ దేశమందరు జేసిరని తెలియుటకై సుబ్బారావుపంతులుగారును గురుమూర్తిగారును దేశములో నానాభాగము లందున్న ప్రముఖులకువ్రాసి వారి యనుజ్ఞబడసిరి. ఈసంపుటములన్నియు రాజమహేంద్రవరములో సుజనరంజనీ ముద్రాక్షరశాలాధిపతియైన పోతాప్రగడ శేషగిరిరావుగారు ముద్రించుట కంగీకరించిరి. 10 సంపుటములకు కావలసిన కాగితము షష్ఠిపూర్తి సంఘమువారిచ్చునట్లును, ముద్రణమైన తరువాత ముద్రణమునకై నసొమ్ము సంఘమువారిచ్చునట్లును, సంఘమువారును శేషగిరిరావుగారు నొడంబడికచేసికొనిరి. కాగితముల నిమిత్తమై సంఘమువారికి శ్రీ మునగాలరాజాగారగు నాయని వెంకట రంగారావుబహదూరువారు రు 500/- లు పెట్టుబడిపెట్టిరి. పుయ్యూరు జమీందారుగారగు శ్రీ వెంకటాద్రిఅప్పారావుబహద్దరువారు రు 150/- లు పంపిరి. 10 సంపుటముల ఖరీదిరువదియైదురూపాయిలు. చందాదారుల నిమిత్తము విశ్వనాధశర్మగారును, గురుమూర్తిగారును నరసాపురము, భీమవరము, ఏలూరు, గుంటూరు మొదలగుననేకస్థలములకరిగి తిరిగి శ్రమ పడి చందాదారులనుచేర్చిరి. సంపుటములకట్టలిక్క-డ చక్క-గకట్టరని, యచ్చుపడినపుస్తకములను చెన్నపురిబంపి యట్టలుగట్టించి దెప్పించిరి. నాప్రాతయు,ముద్రణమును 1927 సెప్టెంబరులోపుగ గాలేదు. 1927 సెప్టెంబరు 26వ తేదీకి నాకరువదియేండ్లునిండెను. తెనుగుతిథులప్రకారము ప్రభవసంవత్సర భాద్రపద బ ౧౪ నాటికి నాకరువదియేండ్లునిండెను. ఆరెండుతిథులనాటికి ముద్రణము ముగియనందున బహిరంగమైన షష్ఠి పూర్త్యుత్సవము సంఘమువారు జేయలేదు. ముద్రణము పూర్తియైన తరువాత యా యుత్సవము జేయవలెనని శర్మగారి సంకల్పము.

అయినను భాద్రపద బ ౧౪ నాడు నా స్వజనము నాకభ్యంగనము చేయించి బంధుమిత్రులకు భోజనములుపెట్టి గృహమందుత్సవము జేసిరి. ఆనాడు కాకినాడ నుండి వి. పి. రాజునాయుడుగారువచ్చి, మా యింట నాయారోగ్యము నిమిత్తమై దైవప్రార్థనములు సలిపిరి. రాజమహేంద్ర వరములోని మిత్రులు గొందరు నాకా దినమున బుస్తకముల బహుమాన మంపిరి. శ్రీమతి బత్తుల కామాక్షమ్మగారు నాకొక విలువగల పట్టు పంచను, నాభార్య కొక పట్టుచీరయు, బహుమానము జేసిరి. సంపుట ముల ముద్రణము ముగియునప్పటికి 1927వ సంవత్సరముగడచి 1928వ

సంవత్సరము వచ్చెను. కాబట్టి షష్టిపూర్తి మహోత్సవము బహిరంగముగ 1928 వ సంవత్సరము మార్చి 11 వ తారీఖున టపునుహాలు వెనుకనున్న యావరణలో జరిగెను. అప్పటికి ప్రభవ సంవత్సరము గడచిపోలేదు. నేను ప్రభవ సంవత్సరములో జన్మించితిని. కావున మాసము భేదించినను ప్రభవ సంవత్సరములోనే ఈ యుత్సవము జరిగెను. చెన్నపురి నుండి శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావుగారువచ్చి సభ కధ్యక్షత వహించిరి. హైదరాబాదు (డక్కను) నుండి శ్రీ మునగాలరాజాగారగు నాయని వెంకటరంగారావుగారు దయచేసిరి. ఏలూరునుండి శ్రీ మోచర్ల రామచంద్ర రావుగారు దయచేసిరి. బందరునుండి శ్రీ పురాణం సూరిశాస్త్రిగారు వచ్చిరి. కాకినాడనుండి శ్రీ పిఠాపురము రాజాగారి కళాశాలా ప్రధానాచార్యులైన డాక్టరు వేమూరి రామకృష్ణారావుగారు దయచేసిరి ఆ దినమున నుదయమున శ్రీ వేమూరి విశ్వనాధశర్మగారు నాకును నా మిత్రులకును విందు చేసిరి. గురుమూర్తిగారింటివద్ద మధ్యాహ్నము 3 గంటలకు నాకు నా మిత్రులతోగలిపి ఛాయాచిత్రము(Photo)దీసిరి. ఆనాడు మోటారుబండిలో నన్ను గూరుచుండబెట్టి మంగళవాద్యములతో నూరేగించిరి కారులో నా కొక ప్రక్క న్యాపతి సుబ్బారావు పంతులుగారును, రెండవ ప్రక్క శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులుగారును గూరుచుండిరి. మోటారు వెంబడి శ్రీ మునగాల రాజాగారును, మోచర్ల రామచంద్రరావుగారును, వేమూరి విశ్వనాధశర్మగారును, పాలకోడేటి గురుమూర్తిగారును, వేమూరి రామకృష్ణారావుగారును, మరియు కొందరు పురప్రముఖులును, పైయూళ్ళ నుండి వచ్చిన మిత్రులును నడచివచ్చిరి. సభ జరుగు టపునుహాలులో నుండు వెనుకప్రక్క యావరణమంతయు జనులతో నిండెను. శ్రీవేమూరి రామకృష్ణారావుగారు సభా ప్రారంభమున దైవప్రార్థనములు సలిపిరి. సభకు రాజాలని జయంతి రామయ్య పంతులుగారు మొదలగు మిత్రులు బంపిన జాబులును, శ్రీ పిఠాపురము మహారాజాగారు సభకు రాజాల నందున వారి సానుభూతిని దెలుపుచు నంపిన తంతివార్తయు జదువ బడెను.

శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులుగారు తమ యధ్యక్షోపన్యాసములో నా నవలలనుగూర్చియు, నా నాటక రచనలనుగూర్చియు, నా వక్తృత్వమునుగూర్చియు నెంతో ప్రశంసించి మాటాడిరి. పురాణము సూరిశాస్త్రిగారు నన్నుగురించి కొంతసేపు మాటాడిరి. శ్రీ వడ్డాది సుబ్బా

రాయుడుగారు, శ్రీ వారణాసి సూర్యనారాయణశాస్త్రిగారు, అడవి శంకర రావుగారు, పొన్నాడ కృష్ణమూర్తిగారు, వేదుల సత్యన్నారాయణగారు, విద్వాన్ రావూరి వెంకటసుబ్బమ్మగారు సమయోచితముగ పద్యములు వ్రాసి సభలో చదివిరి. ఎర్రగుంటల జనార్దనమ్మగారు కొంతసేపు మాటాడిరి. పాలకోడేటి గురుమూర్తిగారు (కార్యదర్శి) షష్ఠిపూర్తి సంఘము యొక్క నివేదికను జదివిరి. శ్రీ మునగాల రాజాగారు హైదరాబాదు నుండి దెచ్చిన విలువగల రెండు శాలువలను నాకుగప్పి యభినందన పత్రమును స్వయముగా జదివి యద్దమమర్పబడిన యొక చట్రములో బెట్టిన యచ్చుపత్రికను నాకిచ్చిరి. ఆ సమయముననే యందమైన యట్టలు గట్టిన 10 సంపుటములు చక్కని నగిషీపెట్టెలోబెట్టి దానినినాకు సంఘము వారు బహూమానమిచ్చిరి. ఈ షష్ఠిపూర్తి సందర్భమున విశ్వనాధశర్మ గారు చేసినకృషి యమూల్యము. వారికిని మునగాల రాజాగారికిని, న్యాపతి సుబ్బారావు పంతులుగారికిని, పాలకోడేటి గురుమూర్తిగారికిని, నేను మిక్కిలి కృతజ్ఞుడను. రాజమహేంద్రవరమున షష్ఠిపూర్తి మహోత్సవము జరుగుటకదియే ప్రథమము. అది జయప్రదముగా జరిగెనని నా మిత్రుల యభిప్రాయము.

నా మేనకోడలు సుబ్బమ్మ 1925 వ సంవత్సరమున నుభయభాషా ప్రవీణ పరీక్షకు దరఖాస్తుచేసి పరీక్షకు వెళ్లెను. కాని యా సంవత్సరము గృతార్థురాలుగాక తప్పిపోయెను. అయినను బాలికా పాఠశాలాధికారిణి యైన "రొజోరియా" దొరసానిగారు పరీక్షలో మరుచటి సంవత్సరము మా మేనగోడలు సిద్ధిపొందునట్టి షరతుమీద, నామెను విశాఖపట్నము లోని మేరీరాణి బాలికా పాఠశాలలో, నాంధ్రోపాధ్యాయురాలినిగ నియమించిరి.

1926 వ సంవత్సరమున సాహిత్య పరిషద్వార్షికసభ కాకినాడలో జరిగెను. ఆసభకు నే నధ్యక్షుడుగ నెన్నుకొనబడితిని. నాకును ప్రతినిధుల కును మంత్రిప్రగడవారి సత్రములో బసయిచ్చిరి. అన్నదాన సమాజ భవనములో సభజరిగెను. దివానుబహద్దరు కొమ్మిరెడ్డి సూర్యనారాయణమూర్తి నాయుడుగారు సన్మానసంఘమున కధ్యక్షులై ప్రతినిధులకు స్వాగతమిచ్చిరి. ఆ సభకు శ్రీ గిడుగు రామమూర్తిగారుగూడ దయచేసిరి. నా ప్రారంభోపన్యాసమును నే నెప్పటియట్లు యాశుధారగా జెప్పితినిగాని వ్రాసి జదువ లేదు. పిమ్మట కొంత వ్రాసిపంపగా నప్పటి సాహిత్య పరిషత్పత్రికలో

బ్రచురింపబడెను. వ్యావహారిక భాషావాదులైన గిడుగు రామమూర్తి పంతులుగారికిని నాకును కొంత చర్చజరిగెను. రామమూర్తిగారు సభలో పాలుగొనక సభనుండి వెడలిపోయిరి. సభ సలక్షణముగానే జరిగెను.

1927 వ సంవత్సరమున సాహిత్య పరిషద్వార్షికసభ మరల కాకినాడలోనే జరిగెను. ఆ సన్మానసంఘమునకు శ్రీ మునుకుట్ల యజ్ఞేశ్వర రామయ్యగారు అధ్యక్షులై ప్రతినిధులకు స్వాగతమిచ్చిరి. ఆ మహాసభకు పుణ్యాత్ములు రాజాగారైన శ్రీ వెంకటాద్రి అప్పారావుగారు అధ్యక్షులైరి. ఆసభకు నేనునుబోయి పాలుగొంటిని. ఆసభకు శ్రీ పిఠాపురము మహారాజావారుగూడ దయచేసిరి. ఆసంవత్సరమంతయు నేను నా షష్టిపూర్తికి వ్రాయవలసిన గ్రంథములను వ్రాయుచుంటిని.

1928 వ సంవత్సరమున నొక విశేషము జరిగెను. టంగుటూరి శ్రీరాములుగారి రెండవ కుమారుడైన లక్ష్మీనారాయణకు జబ్బుచేసి ప్రాణముమీదికి వచ్చెను. 1913 వ సంవత్సరమున నేను వీరేశలింగము గారి పక్షమున సాక్ష్యమిచ్చినదిమొదలు శ్రీరాములుగారు నాతో మాటాడుట మానిరి. నేను కాపురమున్న కారణమున శ్రీరాములుగారు తన తోడల్లుడైన రాయవరపు రామమూర్తిగారియింటికి వచ్చుటమానిరి. అట్లున్నను నేను వారిపై ద్వేషముబూనక వారి కుమారుని కెక్కువ జబ్బుగానున్నప్పుడు పిల్లవానిని జూచుటకై నాతమ్ముడు కృష్ణమూర్తిని నా మేనల్లుడు పురాణపండ వెంకట దీక్షితులని వెంటదీసుకొని శ్రీరాములుగారియింటికి బోయితిని. ఆ జబ్బుగానున్న బాలుడు విభవసంవత్సర చైత్ర శు ౯ అనగా, శ్రీరామనవమినాటి యుదయమున, మృతినొందెను. ఏ సందేహమునులేక నా మేనల్లుడు పురాణపండ వెంకట దీక్షితులను శవమును మోయుటకై నియోగించితిని మిడమిడగాలుచున్న యెండలో పాదములు పొక్కులెక్కినను నా మేనల్లుడా పనిజేసి, శవదహనము పూర్తియైనదాకనుండి, సాయంకాలము మూడు గంటలగుసరికి యింటికి వచ్చెను. శ్రీరాములుగారి కుటుంబములోని జనుల నోదార్చుటకు మా తమ్ముని నియోగించితిని. మా తమ్ముడు వారినోదార్చి స్నానములు జేయించి వారికందరకు వంటజేసిపెట్టి వారి భోజనములైనపిమ్మట రాత్రి కింటికి వచ్చెను.

ఆ సంవత్సరము జూలై నెలలో (1928) అనంతపురము రావలసినదని నా కాహ్వానమంపిరి. వీరేశలింగోన్నత పాఠశాలలో వ్యాయామో

పాధ్యాయుడుగా నున్న మల్లుభొట్ల వెంకయ్యను దీసికొని, యనంత పురము వెళ్ళితిని. అక్కడ వారు నాకు మిక్కిలి యాదరాభిమానములు జూపి గౌరవించిరి. నేను కళాశాలలో నొక యుపన్యాసమును, టపును హాలులో నొక యుపన్యాసము నిచ్చితిని. అచ్చట నిరంతరము చల్లగాలి వీచుచుండును. అచటి విద్యార్థులు "వరవిక్రయ"మను నాటకమును ప్రయోగించి, దానికి నన్నాహ్వానించిరి. కళాశాలా ప్రధానాచార్యులు, యన్.ఆర్. కృష్ణమ్మగారు వారి గుర్రపుబండిమీద నన్ను నాటకమునకు దీసికొని పోయిరి. రాజమహేంద్రనివాసులైన మిత్రులనేకు లచట నుద్యోగములలో నుండిరి. ప్రయాగ వెంకటరామశాస్త్రిగారును, చిలుకూరి నారాయణరావు గారును, దామెర్ల వెంకటరావుగారును, కర్రా వెంకటరావుగారును, కేశరాజు సత్యనారాయణగారును, నొకరినిమించి యొకరు పిండివంటలతో నాకు విందులు చేసిరి కాలేజి విద్యార్థి లొకనాటిరాత్రి నాకు హాస్టలులో విందుచేసిరి. యన్. ఆర్. కృష్ణమ్మగారు గూడ విందులో పాలుగొనిరి. నేను దేశభట్ల లక్ష్మీనరసింహముగారి యింటనే బసచేసితిని. వారు భార్యా భర్తలు నన్ను మిక్కిలి గౌరవించి సకలోపచారములుజేసి, నాయునికి సౌఖ్యప్రదముగా జేసిరి. కడపటి దినమున హాస్టలు విద్యార్థులు నాకొక "టీ" పార్టీ నిచ్చిరి. అందుపాధ్యాయులు విద్యార్థులు గూడ పాలుగొనిరి. ఆ దినముననే నేను వారందరి కడను సెలవు గైకొని మల్లుభొట్ల వెంకయ్యను దీసికొని బయలుదేరితిని. నా మిత్రులైన యుపాధ్యాయులును విద్యార్థులును, రైలుస్టేషనువరకు సాగనంపి యచట నాకు నూరు రూపాయలను బహూమానముగా నిచ్చిరి. రైలెక్కి గుంటకల్లు చేరితిని. గుంటకల్లు చేరగానే కడుపులో గుడగుడ శబ్దము బయలుదేరెను. అనంతపురమున జరిగిన విందులలో నేను మితముగా భుజించినను, నాకా స్వల్పాహారమే యజీర్ణము జేసెను. రైలుబండిలోనే యజీర్ణ విరేచనములు ప్రారంభమయ్యెను. త్రోవలో నందియాలలోను, మార్కాపురములోను విళూచి జాడ్యము విశేషముగా వ్యాపించియుండెను. నాది గూడ విళూచి జాడ్యమని తలంచి రైల్వేయధికారులు నన్ను రైలు దింపివేయుదురేమో యని నేను సందేహించితిని కాని దోకులు కాళ్లుతీతలు లేవుగనుక విళూచి గాదని నాలో నేను నిశ్చయించుకొంటిని. దొడ్డికి వెళ్ళివచ్చి పండుకొను టయేగాని మంచినీళ్లుగాని యాహారముగాని నేను త్రింగలేదు. రెండు

దినము లిట్లుపవసించిన తరువాతనే యౌషధమక్కరలేకయే నాకు రోగము గుదిరెను. నేను సురక్షితముగా రాజమహేంద్రవరము జేరితిని.

1928 ఆగస్టునెలలో నాబాల్యమిత్రుడైన, టంగుటూరి ప్రకాశముగారి పెద్దకుమారునకు, విజయనగరములో వివాహముచేయుటకు నిశ్చయింపబడెను. కవిపురపు వెంకటరత్నము పంతులుగారి రెండవకుమార్తెయు, గురజాడ శ్రీరామమూర్తిపంతులుగారి దౌహిత్రియునైన యహల్యను, ప్రకాశముగారి పెద్దకుమారుడైన నరసింహమునకిచ్చి వివాహముజేసిరి. ప్రకాశముగారికి నేను ముఖ్యమిత్రుడనగుటచే వివాహమునకు రమ్మని నన్ను బలవంతపెట్టి దీసుకొనిపోయిరి. నామేనల్లుడు పురాణపండ వెంకట దీక్షితులు నావెంటవచ్చెను. ప్రకాశముగారు, వారిభార్య, ఆయన తమ్ముడు టంగుటూరి శ్రీరాములుగారు, నేను రెండవతరగతిలో ప్రయాణము జేసితిమి. అంతకుముందు 15 వ సంవత్సరములనుండి నాతోమాటాడుట మానిన, టంగుటూరి శ్రీరాములుగారు నన్ను బలుకరించి, నాతోమాటాడుట ప్రారంభించిరి. వారికి నామీద హటాత్తుగ నంతదయయెట్లుగలిగెనో నేనెరుగను. విజయనగరములో ప్రకాశముగారికి కుమారున కేక రాత్రి వివాహము జరిగెను. మరునాడు ప్రకాశముగారును, నేనును, రాజకీయ పరిస్థితులను గురించి బహిరంగసభలో నుపన్యసించితిమి. ఆమరునాడు రాజమహేంద్రవరమునకు బయలుదేరి వెళ్ళితిమి. సెప్టెంబరునెలలో నేను గుంటూరుజిల్లాలోని వేటపాలెము వెళ్ళితిని. ఊటహరు సుబ్బరాయశ్రేష్ఠి యను నొక వైశ్యశిఖామణి యచట నొక గ్రంథభాండాగారము స్థాపించి, దానికేటేట వార్షికోత్సవముజేయుచు నన్నాయేడధ్యక్షునిగరమ్మని యాహ్వానించిరి. నాతమ్ముని జ్యేష్ఠకుమారుడైన వెంకట్రావును దీనికొనిపోతిని. సభ రెండుదినములు చక్కగ జరిగెను. సుబ్బరాయశ్రేష్ఠిగారాగ్రంథభాండాగారమునకు బహువిధముల తోడ్పడుచు దానిని వృద్ధిచేయుచుండిరి.

ఆసంవత్సరమునగా 1928 లో బ్రహ్మసమాజ శతవార్షికోత్సవము వచ్చెను. కాకినాడలో రఘుపతి వేంకటరత్నమునాయుడుగారు శ్రీ పిఠాపురము మహారాజావారి సహాయమున గొప్ప యుత్సవములుజేయించిరి. నేను కాకినాడబోయి యాయుత్సవములలో గొంతపాలుగొంటిని. ఆసంవత్సరము నవంబరునెలలో నాకు మిక్కిలి జబ్బుచేసెను. అమితమైన వికారము, వమనములు, నెడతెగని యెక్కిళ్లు, నాజబ్బులో పొడజూపెను. నాభార్యయు, నాకుటుంబములోనివారును, నావిషయమై నిరాశ

పడిరి. ఇరువురింగ్లీషు వైద్యులు నాకు వైద్యముచేసిరి. కాని తగ్గలేదు. నేను వారిసలహామీదనే వారివైద్యముమాని యాయుర్వేద వైద్యశిఖామణియు, నాకు పరిచితుడును, పండిత గోపాలాచార్యులుగారి శిష్యుడు నైన బ్రహ్మశ్రీ చావలి రామమూర్తిశాస్త్రిగారియొద్ద మందుపుచ్చుకొంటిని. వారి చికిత్సవలన నారోగము నివారణమయ్యెను. వారు నాయొద్ద ధనమేమియు స్వీకరింపకయే నాకు బలుమారులు వైద్యము జేసినందులకు కృతజ్ఞుడను.

నా పెద్దమేనకోడలు రావూరి వెంకటసుబ్బమ్మ విశాఖపట్టణములో నున్న మేరీ పాఠశాలలో పనిచేయుచునే యుభయభాషాప్రవీణ పరీక్షలో గృతార్థురాలై 1928 వ సంవత్సరమున జరిగిన యాంధ్ర విశ్వవిద్యాపీఠ పట్టప్రదానసభకు (Convocation) హాజరై, యుభయభాషాప్రవీణ పట్టము గ్రహించెను. ఆంధ్ర విశ్వవిద్యాపీఠమున నుభయభాషాప్రవీణ పట్టము గైకొన్న ప్రథమస్త్రీ యీమెయే. తరువాత స్త్రీలు పెక్కండ్రు తత్పరీక్షయందు గృతార్థతనొందిరిగాని, ప్రథమయువతి నా మేనకోడలగుటచే నా పరిశ్రమ ఫలించినదని నేను గర్వముతో సంతసించితిని.

నాతమ్ముని పెద్దకుమారుడు వెంకట్రాపు పిఠాపురము హైస్కూలులో జదివి మూడు సంవత్సరములు స్కూలుఫైనలు పరీక్షలో దప్పెను. వానిని దీసుకొనివచ్చి రాజమహేంద్రవరములో జదివించితిని. అతడు 1928 వ సంవత్సరమున స్కూలుఫైనలు పరీక్షయం దుత్తీర్ణుడయ్యెను. ఆ సంవత్సరము జూలై నెలలో వాని నింటరుమీడియటు తరగతిలో రాజమహేంద్రవర కళాశాలతో జేర్పించితిని. ఆ సంవత్సరమందే పుయ్యూరు రాజాగారగు శ్రీ వెంకటాద్రప్పారావు బహద్దరుగారు నూజీవీడులో గట్టించిన యున్నత పాఠశాలాభవనమునకు గృహప్రవేశమహోత్సవమునకు, నన్నాహ్వానముచేసిరి. నేను నూజీవీడువెళ్ళి పాఠశాలా ప్రధానోపాధ్యాయులైన జీడిగుంట సత్యన్నారాయణగారింట బసచేసితిని. అచట నేను రెండుపన్యాసములిచ్చితిని. శ్రీ రాజాగారు నన్ను కోటలోనికి దీసుకొనిపోయి రు. 116 ల నిచ్చిరి. ఆ తరువాతగూడ వారు నాకు గొంత ధనసహాయముజేసిరి.

1925 వ సంవత్సరమున బ్రహ్మసమాజ శతవార్షికోత్సవ సందర్భమున, బిపినచంద్ర పాలుగారు రాజమహేంద్రవరమువచ్చి, బ్రహ్మ

మతమునుగూర్చియు రామమోహనరాయలువారిని గూర్చియు, తవును హాలునకు వెనుకప్రక్కనున్న యావరణలో రెండుసభలు జేసిరి. ఆరెండు బహిరంగసభలకు మాయూరు ప్రార్థన సమాజమువారు నన్నే యధ్యక్షునిగ నెన్నుకొనిరి. రెండు సభలలోను నే నాంగ్లేయభాషలో మాటాడితిని. ఈ సంవత్సరమున 1929 వ సంవత్సరమే నవంబరునెలలో నా పెద్ద మేనకోడలు తనకుమార్తె మీనాక్షియొక్క వివాహముజేసెను. ఆపిల్ల కపుడు 13 సంవత్సరములు వయసు. ఇదివరలో పిఠాపుర సంస్థానమునం దాస్థాన కవీశ్వరుడుగనుండి చనిపోయిన వేదుల రామకృష్ణశాస్త్రిగారి కుమారుడు రామచంద్రకీర్తికినిచ్చి, యా పిల్లను వివాహముజేసితిమి. వివాహము మాయింటనే జరిగెను. కాని నా మేనకోడలి కీ వివాహము నిమిత్తము నేనేమియు ధనసహాయము చేయలేదు. ఆమె తన సొంత సొమ్ము ఖర్చుచేసికొని కూతువివాహముజేసెను. ఆ వరునకు శ్రీ పిఠాపురము మహారాజావారు ఆనర్సు పరీక్షయం దుత్తీర్ణుడగువరకు విశాఖ పట్టణములో జదివించిరి. ఆ రామచంద్రకీర్తి యిపుడు కాకినాడలో రాజా గారి కళాశాలలో నుపాధ్యాయుడుగ నున్నాడు. ఆ సంవత్సరము డిశంబరు నెలలో నా రెండవ మేనకోడలు కోట వెంకటరత్నమ్మ తన కుమార్తె సరస్వతికి పిఠాపురములో వివాహముచేసెను. వరుడు గొల్లప్రోలు నివాసు లైన అల్లంరాజు లక్ష్మీపతిగారి కుమారుడు వెంకట్రావు. ఆమెయు తనసొంత సొమ్ముతోనే తన కూతువివాహము జేసుకొనెను. నేనావివాహమునకు నాభార్యను దీసికొని పిఠాపురము వెళ్ళితిని. ఈ పెండ్లి నుండి తిరిగివచ్చిన తరువాత యీపూరుపాలెములో జరిగిన యాంధ్రాస్తిక మహాసభకు, నామేన ల్లుడు పురాణపండ వెంకటదీక్షితులను దీసుకొనివెళ్ళితిని. ఆసభకు రఘుపతి వెంకటరత్నమునాయుడుగారు, వేమూరి రామకృష్ణారావుగారును, కోకా వెంకటసుబ్బారావున్నాయుడుగారును, పెద్దాడ రామస్వామిగారును, కొండపల్లి కళ్యాణస్వామిగారును సకుటుంబముగా వచ్చిరి. నాభి జగన్నాధరావుగారా సభకధ్యక్షులు.

స్వీయ చరిత్రము

ఇరువదియొకటవ ప్రకరణము

భార్యావియోగము

1930 వ సంవత్సరము ఫిబ్రవరినెలలో నేను గూడూరు వెళ్ళవలసివచ్చెను. కారణమేమన, నావదినగారి యల్లుడు పెరుమాళ్ళ కోటయ్య యను నతడు, సెంట్రలుజెయిలులో నుపాధ్యాయుడుగ నుండెను. నాయుడుపేటనుండి వచ్చిన ఖయిదీ కత డుత్తరము వ్రాసిపెట్టెనన్న నేరముమోపి, గూడూరు కలెక్టరుగారియొద్ద నతనిమీద జెయిలు యధికారు లభియోగము దెచ్చిరి. అన్యాయమైన కేసని నే నభిప్రాయపడితిని. అతనికి సహాయము చేయుటకు, నేను, నా గుమాస్తా కామరాజు వెంకటరమణశర్మగారిని దీసుకొని, గూడూరు వెళ్ళితిని ఆ కేసు వెంకటగిరిలో విచారింపబడెను. వాయిదానాటికి కోటయ్యకు సహాయముచేయుటకు చెన్నపురినుండి నామేన మామ కుమారుడు పురాణపండ కామేశ్వరిరావు వకీలుగా వచ్చెను. సబ్‌కలెక్టరుగారు కేసు విచారించి కోటయ్య నిర్దోషియని కేసు కొట్టివేసిరి.

1930 వ జూను 13 వ తేదీని, అనగా ప్రమోదూత సంవత్సర జ్యేష్ఠ బ॥ శనివారమునాడు దయమున రమారమీ యెనిమిదిగంటల కాకస్మికముగా గుండెలలో బోటువచ్చి, నా భార్య స్వర్గాయమ్మ స్వర్గస్థురాలయ్యెను. ఆ వెనుకటి దినమునగూడ సిట్లె గుండెలలో బోటువచ్చి క్రిందపడగా, శిరసుమీద గాయము తగిలెను. దానికి వెంటనే చికిత్స చేయబడెను. శనివారము నాడామె యెప్పటివలె లేచి, కాలకృత్యములు దీర్చుకొని, కాఫీ పుచ్చుకొని, తరువాత తినవలెనని కొన్నిమామిడిపండ్లు తన మంచముక్రింద బెట్టుకొని, మాటాడుచు పండుకొనెను. అంతలో గుండెలలో నొప్పి పుట్టెను. మంచముమీద పండుకొని బాధపడుచుండగా నామిత్రుడును, వైద్యుడునైన చామకూరి వెంకటస్వామినాయుడుగారు చేయిజూచి నాడి కనబడుటలేదనిరి. ఆ మాట వినగానే యామె కపుడు స్మృతియుండుటచే క్రిందికిదిగి నేలమీద పండుకొనెను. మంచితీర్థము నిమ్మని యడిగి త్రాగి,

నా పెదచెల్లెలైన యన్నపూర్ణమ్మ దెచ్చిన తలగడా మీదనే చేయిపెట్టుకొని పరుండి మరియొక పదునైదు నిమిషములలో ప్రాణములు విడచెను. ఆమె నాతో ముప్పదిరెండు వర్షములు గాపురముజేసెను. నా యింట నెందరో బంధువులు, వారములుచేసికొని తిను విద్యార్థులును. జాలమంది యుండినను, నా భార్య విసుగుకొనక, చికాకుపడక, మడికట్టుకొని వంట జేసి యందరను నిష్పక్షపాతముగ భోజనములుపెట్టి యాదరించుచుండెను. ఆమె మరణముచేత నే నసహాయుడనైతిని.

ఆ సంవత్సరము (1930) మార్చినెలలోనే నా తమ్ముడు కృష్ణ మూర్తి కుటుంబముతోవచ్చి మా యింట ప్రవేశించెను. నా దురదృష్టము చేత కుటుంబముమీద కుటుంబమువచ్చి నా మీద పడుచుండెను. నా భార్య మృతినొందిన రోజున, నా తమ్ముడు కృష్ణమూర్తియు, నా మేనల్లుడు పురాణపండవెంకటదీక్షితులునుగూడ గ్రామములోలేరు. అదివరకు నాభార్యకు ఛాయాపటము లేనందున శవమునకు ఛాయాచిత్రము దీయించిరి. నాభార్యకు రెండవయప్ప కుమారుడును, బాల్యమునుండియు నామెయొద్దనే పెరిగి జదువుకొన్నవాడునునైన, రావూరి సూర్యనారాయణ యగ్నిహోత్రము దీసికొని కోటిలింగాలవద్ద నామె కంత్యక్రియలు జేసెను. మరునాటికి మా తమ్ముడువచ్చి కర్మచేయ నారంభించెను. నా భార్యపోయిన దినమున శ్రీ పిఠాపురము రావునుగారు, నా మిత్రులునైన కోకా వెంకటసుబ్బారావు నాయుడుగారు రాజమహేంద్రవరమేదో పనిమీద వచ్చినందున యీవార్త విని, మాయింటికి వచ్చి నన్ను పరామర్శచేసి, నాకేబది రూపాయలు బదులిచ్చి, తరువాత వారింటికిపోయిన పిమ్మట మరికొంత సొమ్ముగూడ నాకు బంపిరి.

శ్రీ రఘుపతి వెంకటరత్నము నాయుడుగారికి షష్టి పూర్తియైనది మొదలుకొని, వారి శిష్యులందరు నేపేట మహోర్వసమినాడు, వారికి జన్మ దినోత్సవము చేయుచుండిరి. నాయుడుగారి మిత్రులలో నెవరినో యొకరి నా జన్మదినోత్సవసభ కధ్యక్షులుగా బిలుచుచుండిరి 1930 వ సంవత్సరమున జరిగిన జన్మదినోత్సవసభకు సధ్యక్షుడుగా రమ్మని సుబ్బారావు నాయుడుగారు నన్నాహ్వానించిరి. నేను వెళ్ళి యధ్యక్షత వహించి సభ జరిపితిని. ఆనాడు జయంతి గంగన్నగారు, కూచి నరసింహముగారు, వెంకటరత్నము నాయుడుగారిని గురించి చక్కగ మాటాడిరి.

చెన్నపురిలో యిండియన్ పబ్లిషింగుహౌస్ (Indian publishing Company) అను గ్రంథప్రకటన సంఘముండెను. వారు తమకు కొన్ని తెనుగు వాచకములు వ్రాసి యిమ్మని నన్ను గోరిరి. వాచకమొకటికి రు 500/- లు నాకిచ్చి గుమాస్తా జీతము వారు భరించునట్లు మేమొడంబడిక జేసికొంటిమి. వివేకవాచకములను పేర మొదటిభాగము మొదలై దవ భాగము వరకు, నయిదు భాగములు వ్రాసియిచ్చితిని. ఒడంబడిక ప్రకారము నాకు వారాసొమ్మిచ్చిరి. ఈ సంఘముతో నే నొడంబడిక చేసి కొనుట 1929 లోనో 1930 లోనో నాకు జ్ఞాపకములేదు. కాని 1932 వ సంవత్సరములోపుగా వాచకము లన్నియు పూర్తిజేసి యిచ్చితిని.

1930 వ సంవత్సరము డిశంబరునెలలో రెండవయాంధ్రాస్తిక మహాసభ పిఠాపురములో జరిగెను. కోకా వెంకటసుబ్బారావునాయుడుగారు ముందు సంవత్సరము పిఠాపురము రమ్మని, గత సంవత్సరమే యాహ్వానము జేసిరి. దానికి ఖర్చులన్నియు మహారాజుగారే భరించిరని వింటిని. వెంకట సుబ్బారావు నాయుడుగారే సన్మానసంఘమున కధ్యక్షులైరి. ఆసభకు డాక్టరు వేమూరి రామకృష్ణారావుగా రధ్యక్షులుగ నెన్నుకొనబడిరి. నేనా సభకు బోయి ప్రహ్లాదుని భక్తినిగురించి మాట్లాడితిని. రఘుపతి వెంకట రత్నము నాయుడుగారు మొదలగు పెద్దలు చాలమంది వచ్చిరి. ఆదినముల లోనే నా పెద్దమేనకోడలికి విశాఖపట్టణము క్వీన్సుమేరీ బాలికా పాఠశాల నుండి, రాజమహేంద్రవరములోని దొరతనమువారి బాలికోన్నత పాఠశాలకు బదిలీయయ్యెను. నాటనుండియు నామె రాజమహేంద్రవరము దొరతనమువారి బాలికోన్నత పాఠశాలలోనే దెనుగు పండితురాలుగ పనిచేయుచున్నది.

1931 వ సంవత్సర మక్టోబరు నెలలో శ్రీ పిఠాపురరము మహారాజావారికి రజతోత్సవము (Silver jubilee) జరిగెను. వారు సంస్థాన పరిపాలన మారంభించి యిరువది సంవత్సరములగుటచే నీమహోత్సవము జరిగెను. కాకినాడ నుండియు. నితర స్థలములనుండియు ననేకులు దయ చేసిరి. ఆహ్వానము రాగానే వెళ్ళితిని, ఆసమయమున మహారాజాగారికి బహుసమాజములవారును బహుసంఘముల వారును నభివందన పత్రములు సమర్పించిరి. ఆసంవత్సరము నవంబరునుండి నాపరిస్థితి కొంతమారెను. ఎట్లన శ్రీ మహారాజావారు నాకు నెలకు రు 125 లు యిచ్చుచుండిరిగదా; ఆ నవంబరునుండి నాకు వారు నెలకు రు 60 లు మాత్రమే యీయ

నారంభించిరి ఇందుకు గారణమేమన, 1916వ సంవత్సరమున నా మిత్రుడు రాయవరపు రామమూర్తి మహారాజావారిచేత తనకు నాలుగువేల రూపాయిలు ఋణ మిప్పింపుమని నన్నుగోరెను. నేను పిఠాపురమువెళ్ళి మొక్కపాటి సుబ్బారాయుడుగారితో నీ విషయమై మాటాడితిని. సుబ్బా రాయుడుగారా విషయమై మహారాజాగారి యభిప్రాయమును దెలిసికొని నాతో నిట్లనిరి. "మహారాజావారు మీ మిత్రునకు బదులీయుట కొప్పుకొనిరి గాని, వా రెరుగనివారితో వ్యవహారములు చేయుట వారి కిష్టములేదు. కాబట్టి మీరే మహారాజావారికా సొమ్మునకు నోటు వ్రాసియిచ్చి, సొమ్ము దీసుకొని మీరు మీ మిత్రునకిచ్చి మీ మిత్రునివల్ల నా సొమ్ము మీరే వసూలు జేసి మహారాజాగారి కీయవలెను." అట్లు చేయుటకు సమ్మతించి నేనా సొమ్ముదీసికొని నా మిత్రుడు రాయవరపు రామమూర్తి కిచ్చితిని. కాని నా మిత్రుడు నాకా సొమ్ము తీర్చలేకపోయెను. క్రమముగా నతనియాస్తి ఋణగ్రస్తమై యన్యాక్రాంతమయ్యెను. అప్పటినుండియు మహారాజావారికి మూడేండ్ల కొకసారి యసలుపాయిదాలు గలిపి నోటువ్రాసి యిచ్చుచుంటిని. సొమ్ము మహారాజావారికి జేరనందున బాకీ తీరుమానమునకై మహారాజావా రొక యేర్పాటుజేసిరి నాకు వారు నెలనెలకు నిచ్చుజీతము నూటయిరువది యైదు రూపాయిలలోను, నరువదిరూపాయిలు మాత్రము నాకిచ్చి తక్కిన యరువదియైదురూపాయిలు బాకీ తీరుమానముక్రింద మినహాయించవలసిన దని మహారాజావా రుత్తరువుజేసిరి. ఆ ప్రకారము జరుగజొచ్చెను. డబ్బు తగ్గినదిగాని నా కుటుంబములోని జనము తగ్గలేదు. ముసుపటి జనమునకు దోడుగా మా తమ్ముని కుటుంబమువచ్చి నామీద పడెను. మా చెల్లెలు పెనిమిటి పోవుటచే వారికుటుంబము నామీదబడెను. నాపెదతమ్ముని కుమారుడు ప్రథమసంవత్సరమునందే యింటరుమీడియటు పరీక్షయందు గృతార్థుడగుటచే వానిని, బి. ఏ తరగతిలో 1930వ సంవత్సరములో జేర్పించితిని. వానికి స్కూలుజీతము, పుస్తకములు మొదలగువానికి సొమ్ము నేను భరించవలసియుండెను. అందుచేత సొమ్ముచాలక మరల గిజగిజ తన్ను కొనవలసివచ్చెను. కొన్నిమాసముల తరువాత నా తమ్ముడు వేరుండెను. అయినను వాని కుటుంబవ్యయము నేనే భరింపవలసియుండెను. నాకుటుంబములో నప్పుడు నా చెల్లెలు, నామెకొడుకు, కోడలు, నేను, వేదుల కామేశ్వరరావను బాలుడు నుంటిమి. కామేశ్వరరావును గురించి యొక మాట చెప్పవలెను ఇతడు నా వదినగారి దౌహిత్రుడు. అతడు పుట్టిన

దినముననే యశోదమ్మ 1914 వ సంవత్సరము నవంబరునెలలో మృతి నొందెను. అందుచేత నా భార్య తల్లిలేని యా పిల్లలపైన జాలిగొని ప్రేమతో బెంచెను నా భార్య పోయినను వాడు నాదగ్గరనే యుండెను. 1931 వ సంవత్సరమున నా మూడవ మేనల్లుడు పెనుమిటి పొన్నపల్లి వెంకట లక్ష్మీనరసింహారావునకు విశాఖపట్టణము యి జనీరుగారి యాఫీసులో పని ఖాయపడి, ధవళేశ్వరము బదిలీకాబడెను. అప్పటినుండియు నతడు ధవళేశ్వరములో యింజనీరింగు ఆఫీసులో పనిచేయుచున్నాడు.

ఈ 1931 వ సంవత్సరము డిశంబరులో నాంధ్రాస్తికమహాసభ నెల్లూరులో జరిగెను. అప్పుడక్కడ నుద్యోగములోనున్న కంభంపాటి రామశాస్త్రిగారు నెల్లూరు పురవాసులను ప్రోత్సాహపరచి సభజేయించిరి. పెద్దాడ రామస్వామిగారా సభకధ్యక్షులు. నేనాసభకు బోయితిని. "దుకృష్ కరణే" యను విషయమునుగురించి మాటాడితిని. నిమ్నజాత్యుద్ధరణ గురించి ప్రత్యేకమహాసభ జరిగెను. నేను దాని కధ్యక్షుడను. నా యుపన్యాసము మిక్కిలి బాగున్నదని వేమూరి రామకృష్ణారావుగారు మెచ్చుకొనిరి. ఈ డిశంబరు 18 వ తేదిని నా మేనల్లుడు వెంకటదీక్షితులునకు కుమారుడు పుట్టెను. వానికి నా పేరు పెట్టిరి.

నాకు 1932 వ సంవత్సరములో కొన్నిచిక్కులు కలుగుటచే, తాలూకాబోర్డుల ప్రెసిడెంటులతో, నా పుస్తకములు లైబ్రరీ పుస్తకములుగా వేయించుకోవలెనని విశాఖపట్టణముజిల్లా బోయితిని విశాఖపట్టణ మెప్పుకుబోయినను నేను సామాన్యముగా శ్రీ ప్రభల లక్ష్మీనరసింహము గారి యింట బసచేయుచుండెడివాడను. ఆయన గొప్పవకీలు. వేదాధ్యయన సంపన్నుడు. సంస్కృతాంధ్రభాషాభిమాని. మంచివక్త. అతిథుల సభ్యా గతుల మిక్కిలి దయతో నాదరించుచుండెడివాడు. ధర్మాత్ముడు. విశాఖ పట్టణమునుండి నాకు పూర్వపరిచితులైన శ్రీ జయపురం మహారాజుగారైన విక్రమదేవవర్మగారిని జూచుటకు జయపురము వెళ్ళితిని. జయపురములో నేను కాళిదాసుని గురించి యుపన్యసించితిని. ఆ సభకు శ్రీ విక్రమదేవ వర్మగారధ్యక్షత వహించిరి. నాకు శ్రీ విక్రమదేవవర్మగారు, రు 100 లు ఖర్చులక్రింద నొసంగిరి. సాలూరులో రెండుపన్యాసములిచ్చితిని. త్రోవలో పార్వతీపురమువెళ్ళి. నా పూర్వమిత్రులైన యాచంట సాంఖ్యాయన శర్మగారిని జూచి వారికతిథినై వారియింట రెండు దినములుండి విజయ

నగరము వెళ్ళితిని. అక్కడ కవిపురపు వెంకటరత్నముగారి యింట బసచేసితిని. ఆయన గురజాడ శ్రీరామమూర్తిగారి యల్లుడు.

శ్రీ కిళాంబి రామానుజాచారిగారి పుత్రుడును, విజయనగరము మునిసిపల్ సంఘాధ్యక్షుడునైన శ్రీ రంగాచార్యులుగారొక సభచేయించి, యా సభలో నన్ను గౌరవించి, మిక్కిలి చక్కని నగిషీ చెక్కిన వెండి సజ్జలో రు 116లు బోసి, యాసొమ్మును, సజ్జను నాకు బహూమాన మొసంగిరి. అచ్చటనుండి విశాఖపట్టణము వెళ్ళితిని. అక్కడ శ్రీ గురజాడ శ్రీరామమూర్తిగారి జ్యేష్ఠకుమారుడు దుర్గాప్రసాదరావుగారు న్యాయవాదిగ నుండిరి. నేను ప్రభలవారి యింట నుండగ, దుర్గాప్రసాదరావుగారు బల వంత పెట్టి దమయింటికి తీసుకొనిపోయి, నన్ను మిక్కిలి యాదరించి, వారి యింటనే నన్ను నిలుపుకొనిరి నేనాయూరులో మూడో నాలుగో యుపన్యాసము లిచ్చితిని. ఆ పురజనులు నా యుపన్యాసములకు సంత సించి, టవునుహాలులో సభచేసి, యాసభకు ప్రభల లక్ష్మీనరసింహముగారి నధ్యక్షులుగజేసి, నా కభినందన పత్రము సమర్పించి, రు 116 లు బహూ మానము జేసిరి. ఆసభలో శ్రీ ప్రభల లక్ష్మీనరసింహంగారు నన్నుగూర్చి యుపన్యసించుచు యాసభవారు నాకు "సాహిత్యచక్రవర్తి" యను బిరుద మొసగినట్లు చెప్పిరి. వారికి నేను సమాధానముగా నుపన్యసించుచు నేనా బిరుదున కర్హుడనుగానని చెప్పితిని. బిరుదములు పుచ్చుకొనుట నాకిష్టము లేదు. బిరుదములు మనుష్యుని గర్వప్రమత్తుని జేయునని నాయభిప్రా యము. అందుచేతనే శ్రీ బుర్రా శేషగిరిరావుగారు "ఆరాను" యూని వర్శిటీకి వ్రాసి డాక్టరను బిరుదము నాకు దెప్పించి యాపట్టానాకు బంపించి నప్పటికిని, నా బిరుదము నెప్పుడు నేనుపయోగించుకొనలేదు. పిమ్మట నచ్చటనుండి యనకాపల్లికిని, బిమ్మట చోడవరమునకు, నవ్వల నరిసీపట్ట ణమునకు వెళ్ళి, యాయాపురజనుల ప్రేరణముచేత నుపన్యాసము లిచ్చి తిని. వారందరు నన్నభినందించి ధనరూపముగా బహూమానము లిచ్చిరి. తాలూకా బోర్డుల ప్రెసిడెంటు లెవరును నా పుస్తకములను పాఠశాలలో గాని లైబ్రరీలలోగాని పెట్టి నాకుపకారము చేయలేదు. కాని మొత్తము మీద నాకీయాత్రలో నైదువందల రూపాయలు బహూమానరూపములుగా వచ్చెను. ఈ ప్రయాణములలో నావెంబడి నా గుమాస్తాయైన కామరాజు వెంకట రమణశర్మ వచ్చెను. ఈ తూర్పుమండలములలో నేను రెండు మాసములు తిరిగినను, రొంపయైన పట్టక దేహారోగ్యము యెప్పటియట్లుం

డెను. ఆసంవత్సరము 1932 ఏప్రియలులో నేనింటికి వచ్చితిని. ఈ మే నెలలో మాతమ్ముని కుమారుడు వెంకట్రావును దీసుకొని చెన్నపట్ట ణము వెళ్ళితిని. నామేనమామ కుమారుడు పురాణపండ కామేశ్వరరావు గృహమందు బసనేసితిమి. ఆ దినములలో రఘుపతి వెంకటరత్నము నాయుడుగారు చెన్నపట్టణములో డన్‌మూరుహౌసులో నుండిరి. వేమూరి రామకృష్ణారావుగారుకూడ వారివద్దనుండిరి. నేను తరుచు వారిని దర్శించు చుంటిని. నేనచట సుమారొక నెలదినము లుంటిని. ఆదినములలో కుమార స్వామి నాయుడు కంపెనీవారికి నాలుగైదు ఫారములకు తెనుగువాచక ములు వ్రాసియిచ్చుటకు వారితోనే నొడంబడిక చేసుకొంటిని. జూను నెలలో రాజమహేంద్రవరము వచ్చితిని.

1932 వ సంవత్సరము రెండవభాగమున రాజమహేంద్రవరములో రెండు పండిత సన్మానములు జరిగెను. ఒకటి శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి గారికి "కవిగండపెండేరము" వేయబడిన యుత్సవము. ఆ యుత్సవము గౌతమీ గ్రంథాలయావరణములో జరిగెను. ఆ యుత్సవమునకు వెళ్ళ వలెనన్న యుద్దేశము నాకులేమగాని, కృష్ణమూర్తిశాస్త్రిగారు స్వయముగా వచ్చి బిలుచుటచేతను, పెకుమళ్ళ యచ్యుతరావుగారి బలవంతముచేతను, నేను వెళ్ళితిని కాని నే నా సభలో పాలుగొనలేదు. ఆ యుత్సవమునకు వ్యతిరేకముగా నెవరో తీవ్రమైన వ్యాసమొకటి వ్రాసి "చిల" యని సంత కముజేసి ప్రకటించిరి "చిల" యనగ నేనే యని చాలమంది భ్రమపడిరి. కాని యది నేను వ్రాయలేదు. అది యెవరు వ్రాసిరో నిలుకడమీద నిజము లోకులకును శాస్త్రిగారికినిగూడ దెలిసెను. ఆ యుపన్యాసము వ్రాసినవారు పత్రికలో ప్రకటింపక మునుపే, ఆ యుత్సవమునాటి మధ్యాహ్నము 12 గంటలకు, నా కందునట్లు టపాలో నాకొక వ్రాతప్రతిబంపి, దావి నా సాయంకాలము సభలో జదువుమని నాకొక యుత్తరముగూడ వ్రాసిరి. ఆ వ్రాతప్రతి వెంటనే జదివించుకొని వింటిని. దానిమీదగూడ పత్రికలో వలెనే "చిల" యని సంతకముండెను. సభలో దానింజదువుట యనుచిత మైన పనియని నేను జదివింపలేదు. సభకు నేను వెళ్ళదలచుకొనలేదని వ్రాసితిని. యేలయన; శాస్త్రిగారికిని నాకును జిరకాలమునుండి మనస్పర్ధలు గలవు. వారి పత్రికలలో మా నాటకసమాజమును విమర్శన మనుపేరుపెట్టి మిక్కిలి దూషించిరి. నా "ప్రసన్నయాదవ" నాటకమును, "గయో పాఖ్యాన" నాటకమును వారి "కళావతీ" పత్రికలోను "కృష్ణపత్రిక"

(బందరు)లోను విమర్శన యని పేరుపెట్టి దూషించిరి. నేను నా "దేశ మాత"లో "వెట్టిపప్పీయము"ని యొక ప్రహసనము వ్రాయగా, నది తన భారతముమీద వ్రాసితినని భ్రమపడి, నన్ను దూషించుచు నొక ప్రహసనము వ్రాసి, శాస్త్రిగారు ప్రకటించిరి. ఆయన భారతము రచియించుచున్నందు కాయనను బహూకరించుటకై కొంతమంది సంతకములుజేసి, నోటీసు లచ్చువేసి పంచిపెట్టి, టవునుహాలులో నొక సభ జేసిరి. ఆ సభకు చిత్రపు వెంకటాచలముగా రధ్యక్షత వహించిగి. శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారికి బంధువులైన శ్రీపాద లక్ష్మీపతిశాస్త్రిగారును, శ్రీపాద పాపయ్యశాస్త్రిగారును, మరికొందరును శాస్త్రిగారి భారతమును పొగడుచు మాటాడిరి. ఆ సభకు నేను బోయితిని. కాని శాస్త్రిగారి కనుకూలముగాగాని, వ్యతిరేకముగాగాని మాటాడలేదు. పిమ్మట నా "దేశమాత" పత్రికలో సభను గురించి విమర్శించితిని. వారిని నే నెంతమాత్రము దూషించలేదు కవిత్రయము వారు రసవంతముగా నాంధ్రీకరించిన భారతమునే శాస్త్రిగారు మరల నాంధ్రీ కరించిరి. కాని యిటువంటి సభజేసి బహూకరించుటకు వారుజేసిన ఘనకార్యమేమియులేదని నేను వ్రాసితిని. సంస్కృతమునుండి తెనిగింప వలసిన గ్రంథము లనేకము లుండగా బూర్వపుకవులు మిక్కిలి చక్కగా రసవంతముగా రచియించిన భారతముఁడగా మరల వీరేల యా భారతమునే యాంధ్రీకరింపవలెనని నేనావిమర్శనములో వ్రాసితిని. అదిగాక, వీరి భారతము కవిత్రయమువారి భారతమంత రసవంతముగా లేదనిగూడ, విమర్శించితిని. ఆ కోపముచేత కృష్ణమూర్తిశాస్త్రిగారును, మరికొందరును నా "గయోపాఖ్యాన" విమర్శనమునకై టవునుహాలులో నొకసభపెట్టి, దానికి శ్రీ చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారిని బిలిపించిరి. వెంకట శాస్త్రిగారు చమత్కారముగా మాటాడిరేగాని, నన్ను దూషించలేదని వింటిని. పిమ్మట టవునుహాలులో సభపెట్టించినవారే, నాళమువారి సత్రములో నొకసభపెట్టించి, కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రిగారి నధ్యక్షులుగా నేర్పరచి నా "గయోపాఖ్యానము" ను విమర్శించుటకై, చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారిని మరల బిలిచిరి. వెంకటశాస్త్రిగారు నన్ను దూషింప లేదుసరిగదా తప్పులెల్లవారికి నుండుననిచెప్పి నా కవిత్వమును మెచ్చిరట. నాటిసభలో విద్యార్థులు మొదలయిన వారు కొందరు, సభలో నుపన్య సించువారికి వ్యతిరేకముగా నల్లరిచేసిరట. 1901 వ సంవత్సరము మొదలుకొని నాకును శాస్త్రిగారికిని సంబంధ మీ విధముగా నుండెను.

అందుచేతనే, నేను, వారి "గండపెండేర" సభకు బోవుట కిష్టము లేదని వ్రాసితిని. కాని శాస్త్రిగారు స్వయముగావచ్చి, వేకుమళ్ళ యచ్యుత రావుగారు బలవంతముజేసిన పెంటనే, క్రోధము చిరకాలముంచుకొను టుచితముగానియు, సాధులక్షణముగాదనియు, నేననుకొని సభకుబోతిని. సభలో నేనేమియు పాలుగొనలేదు రెండవది వడ్డాది సుబ్బారాయుడుగారి సన్మానము. సుబ్బారాయుడుగారు చిరకాలమునుండి బహునాటకములను కావ్యములను రచియించి మాతృభాషాసేవ చేయుచున్నను వారికి దగిన సన్మానము జరుగలేదు. ఆ కొరత తీర్చుటకై పాలకోడేటి గురుమూర్తి గారును, నేనును వారికొక సన్మానము చేయించవలెనని తలపెట్టితిమి. ఆ సన్మాన సభా సన్నాహము గురుమూర్తిగారు చేసిరి సభ టపునుహాలులో జరిగెను ఆంధ్రవిశ్వవిద్యాలయమున కుపాధ్యక్షులుగానున్న సర్వేపల్లి రాధా కృష్ణయ్యగారు సభ కధ్యక్షులుగ నుండిరి. అనేకులు సుబ్బారాయుడుగారిని గురించి మాటాడిరి. వారిని గురించి నేనుగూడ మాటాడితిని. సభ సలక్షణముగా జరిగెను. ఆ సంవత్సరమే (1932) నా తమ్ముని జ్యేష్ఠ కుమారుడైన వెంకట్రావునకు నొక కుమారుడు గలిగెను. వానికిగూడా నా పేరే పెట్టిరి.

1932 వ సంవత్సరము సుహానవమినాటికి రఘుపతి వెంకటరత్నము నాయుడుగారికి డెబ్బది సంవత్సరములు నిండెను. వారికి జన్మదినోత్సవ సభ పిఠాపురములో జరిగెను. ఆ సభకు కలకత్తానుండి శ్రీ సీతానాధ తత్వ భూషణగారువచ్చి ప్రార్థనాదికములు జరిపిరి. ఆ సభకు నేనుబోయి పాలు గొంటిని. అచటనుండి తత్వభూషణగారు రాజమహేంద్రవరము వచ్చిరి. రెండుసభలు జరిగెను. సభలకు నే నధ్యక్షుడను. వా రుపన్యాసకులు.

ఈ 1932 వ డిశంబరులో నాంధ్రాస్తిక మహాసభ మచిలీపట్టణ ములో జరిగెను. ఆసభకు శ్రీ పాలావరుల లక్ష్మీనారాయణగారు అధ్యక్షులైరి. శ్రీ రఘుపతి వెంకటరత్నమునాయుడుగా రనారోగ్యముగా నుండుటచే గత సంవత్సరము నెల్లూరుగాని రాలేదు. బందరుగాని రాలేదు. తక్కిన బ్రహ్మమతస్థులు చాలమంది వచ్చిరి నేను వెంకట్రావును దీసుకొని బందరుసభకుబోయి "తృణమ"ను విషయమును గురించి సుమారొక గంటకాల ముపన్యసించి తిని. ఈ యుపన్యాసము మిక్కిలి బాగున్నదని నా మిత్రులు డాక్టరు వేమూరి రామకృష్ణారావుగారును, తదితరులును చాల ప్రశంసించిరి.

1933 వ సంవత్సర ప్రారంభమున శ్రీ న్యాపతి సుబ్బారావుపంతులు గారికి రాజమహేంద్రవరములో గొప్పసన్మానము జరిగెను. చెన్నపురి శాసన నిర్మాణసభలో నారు సంవత్సరములును, గవర్నరు జనరలుగారి శాసననిర్మాణసభలో 3 సంవత్సరములును సభ్యుడుగానుండి, దేశీయమహా సభకు 3 సంవత్సరములు కార్యదర్శిగానుండి, సుబ్బారావుపంతులుగారు హిందూదేశమునకు జేసిన యపారసేవను గుర్తించి, రాజమహేంద్రవర పురజనులు పంతులుగారికి తమ కృతజ్ఞతను దెల్పుటకీ సభగావించి సన్మా నముజేసిరి. ఆ సభకు శ్రీ చిర్రావూరి యజ్ఞేశ్వరచింతామణి (C. Y Chintamani) గారు ప్రయాగ (Allahabad) నుండి వచ్చి యధ్యక్షత వహించిరి శ్రీ చింతామణిగారికి సుబ్బారావుపంతులుగారియెడ మిక్కిలి గౌరవమును, భక్తియును గలవు. ఆ సభకు రాజాలనందున రైటానరుబుల్ శ్రీనివాస శాస్త్రిగారు, సర్. పి. యస్. శివస్వామి అయ్యరుగారు మొదలగు దేశ నాయకులు రాజాలనందున, తమ సానుభూతిని దెలుపుచు జాబులువ్రాసిరి. బందరునుండి వావిలాల వెంకట శివావధానులుగారును, గుంటూరునుండి కొండా వెంకటప్పయ్యగారు మొదలగు నాంధ్రనాయకులుగూడ దయచేసి సభలో పాలుగొనిరి. ఆ సభలో నాకు పంతులుగారియెడగల భక్తియు, గౌరవమును వెల్లడియగునట్లు చాలసేపు మాటాడితిని. వెంకటప్పయ్య గారు, శివావధానులుగారు గూడ మాటాడిరి. ఈ సభాసన్నాహమంతయు శ్రీ పాలకోడేటి గురుమూర్తిగారు చేసిరి. ఈ సభ రెండుదినములు హిందూ సమాజభవనములో జరిగెను పురజను లమితోత్సాహముతో హాజరై పాలు గొనిరి. చింతామణిగారి యుపన్యాసములు మిక్కిలి గంభీరములై, రస వంతములై, జనాకర్షకములైయుండెను.

ఆంధ్రసాహిత్య పరిషత్సభ 1933 వ సంవత్సర మేప్రియలు నెలలో రాజమహేంద్రవరములో చేయ సంకల్పించిరి. ఒకరిద్దరు రాజ మహేంద్ర పురవాసులు సభ రాజమహేంద్రివరములో జేయుమనియు తామందుకు తోడుపడుదుమనియు జయంతి రామయ్యగారితో జెప్పి మార్చి నెలలో శక్యముగాదని చెప్పిరట. అప్పుడు రామయ్యగారు సాహిత్యపరిషత్తు నకు మేనేజరైనక్రొత్తపల్లి సూర్యారావుగారిని నావద్దకు బంపిరి. సూర్యారావు గారు నాతో మాట్లాడిరి "సభ నీపురజనులు జరుపలేనిపక్షమున జయంతి రామయ్యగారే నూరో నూటయేబది రూపాయిలో తమ సొంతసొమ్ము ఖర్చుపెట్టి నీయూరనే సభచేయించ దలచుకున్నారు." ఆమాటలు విని

నే నిట్లంటిని "ఇది రామయ్యగారింట వడుగా! పెండ్లియా! ఆయన సొంత సొమ్మేల ఖర్చుపెట్టవలెను? ఆయన సొంతసొమ్ము ఖర్చుపెట్టుట రాజమహేంద్రవరమున కప్రతిష్ఠ. కావున నీసభ రాజమహేంద్రపురజనులే చేయవలెను. ఆపూచీ నేను పడియెదను". అని చెప్పి సూర్యారావుగారివి బంపితి. ఈవిషయమై నేను హిందూసమాజములో మద్దాల వెంకటచలం గారితోను, పాలకోడేటి గురుమూర్తిగారితోను చెప్పగా, వారు నాతో నేకీభవించి పురమువెంట దిరిగి రమారమి రు 150/- లు, ప్రోగుచేసిరి. ఆసొమ్ముతో పరిషత్సభ మిక్కిలి జయప్రదముగా జరిగెను. అతిథులకు బసలు భోజనములు నాళమువారి సత్రములో నేర్పాటుచేయబడెను సభలు చింతామణీ నాటకశాలలో జరిగెను. సన్మానస ఘమునకు శ్రీ రాజా కాండ్రేగుల శ్రీనివాస జగన్నాధరావు పంతులుగారును, మహాసభకు శ్రీ వడ్డాది సుబ్బారాయుడు గారును నధ్యక్షులైరి సుబ్బారాయుడుగారు తమ యుపన్యాసమును వ్రాసి జదివిరి. పండితులు చాలమందివచ్చిరి.

1933 వ సంవత్సరమున నేను "భానుని" "యభిషేక" నాటక మును దెనిగించితిని. షష్ఠిపూర్తినాటికి గ్రంధమును దెనిగింపలేదు. 1932 లో యాంధ్రాస్తిక మహాసభ బందరులో జరిగినప్పుడు, మరుచటి సంవత్సరము రాజమహేంద్రివరము రావలసినదని, నేనే బిలిచితిని. శ్రీ రఘుపతి వెంకటరత్నము నాయుడుగారు దేహారోగ్యము బాగులేక, శ్రీ సోమిన కామేశ్వరరావుగారియొద్ద నౌషధము పుచ్చుకొనుటకై, యాసంవత్సరమక్టోబరు మొదలుకొని రాజమహేంద్రవరములో పిఠాపురము మహారాజావారి బంగళాలో నుండిరి. సెప్టెంబరునెలలో రామమోహనరాయ జయంతి కాకినాడలో శ్రీ నాయుడుగారు మహావైభవముతో జరిపించిరి. ఆ యుత్సవ దినములలో బ్రహ్మమందిరము, మహారాజావారి కళాశాల మొదలగు ముఖ్యస్థలములు విద్యుద్దీపములతో మిక్కిలి శృంగారముగా నలంకరింపబడెను. బీదల కన్నదానము జరిగెను. బ్రహ్మమతస్థు లనేకు లనేక స్థలములనుండివచ్చి పాలుగొని యుపన్యాసము లిచ్చిరి. ఆ సందర్భ మున నేనును కాకినాడవెళ్ళి, రామమోహనరాయల జీవితమును గురించి యుపన్యసించితిని. అంతకుమున్నే నేను రచియించిన "కృపాంభోనిధి" యను భక్తిరస ప్రధానమైన నిర్గుణపరబ్రహ్మస్తవ పద్యకావ్యమును రామ మోహనరాయలవారి జయంత్యుత్సవ సందర్భమున బ్రకటించితిని. దానిని శ్రీ రఘుపతి వెంకటరత్నమునాయుడుగా రచ్చువేయించిరి. 1933 వ సంవ

త్సరమున జరిగిన యాంధ్రాస్తిక మహాసభయొక్క సన్మానసంఘమునకు నాయుడుగారు మున్నగువారు నన్నధ్యక్షునిగ నేర్పరచిరి కంభంపాటి రామశాస్త్రిగారిని, ముత్తంగి జగ్గారావుగారిని సన్మానసంఘమునకు కార్యదర్శులుగా నేర్పాటుచేసిరి. పేరునకు నేను సన్మాన సంఘాధ్యక్షుడ నన్నమాటయేగాని, సొమ్మునంతయు కార్యదర్శులే ప్రోగుచేసి సభను జయప్రదముగా జరిపిరి. మహాసభ వీరేశలింగోన్నత పాఠశాలలో జరిగెను. ప్రతినిధుల బసలు భోజనములుగూడ నచటనే యేర్పాటు చేయబడెను. నా సన్మాన సంఘాధ్యక్షోపన్యాసమును నేనువ్రాసి నా మిత్రులు జయంతి గంగన్నగారిచేత సభలో జదివించితిని శ్రీ కొండపల్లి కల్యాణస్వామి గారు సభ కధ్యక్షులు. రఘుపతి వెంకటరత్నమునాయుడుగారు, కోకా వెంకటసుబ్బారావుగారు, తదితర స్థలములనుండి యనేకమంది ప్రముఖులును యాసభకు విచ్చేసిరి. ఈ 1933 వ సంవత్సరమున శ్రీ న్యాపతి సుబ్బారావుపంతులుగారు హిందూసమాజములో నన్నొక గౌరవసభ్యునిగా జేర్చుకొనిరి. అప్పటినుండియు, నేను ప్రతిదినము సాయంకాలము హిందూ సమాజమునకుబోయి, యచటజేరు మిత్రులతో గాలక్షేపముజేసి యానందించుచుంటిని. సుబ్బారావుపంతులుగారు ప్రతిదిన మచటికి వచ్చుచుండెడి వారు. చిత్రపు వెంకటాచలము పంతులుగారు కదుపులో నేదో నొప్పిచే బాధపడి, 1333 వ సంవత్సరము డిశంబరు 27 వ తేదీని చనిపోయిరి. వారి మరణమునకు విషాదమును దెలుపుటకై పురజనులు టవునుహాలులో నొకసభ నేర్పాటుచేసి. యా సభకు నన్నధ్యక్షునిజేసిరి. వెంకటచలముగారు మిక్కిలి సజ్జనులు; స్నేహపాత్రులు. వారి మరణమువలన రాజమహేంద్ర వరమునకు మిక్కిలి లోటు గలిగినదని నేను చెప్పితిని. ఆ దినములలోనే విశలాక్షమ్మ పంతులుగారును, నేనుగుప్తాగారును గూడ మృతినొందిరి. వారి మరణమునుగూర్చిగూడ విషాదము తెలియపరచుటకై నా యధ్యక్షత క్రింద పురజనులు సభలు గావించిరి.

ఈ 1933 లోనే నా మిత్రులైన రాయవరపు రామమూర్తికి నేదో జబ్బుజేసెను. దానికి జికిత్సచేయించుకొనుటకై యతడు కాకినాడవెళ్లెను. కాని యతను యెన్నిమందులు పుచ్చుకొన్నను రోగము హెచ్చెనేగాని తగ్గలేదు. జూను నెలలో నతనికి మిక్కిలి యెక్కువగానున్నదని విని, నేను కాకినాడ వెళ్ళితిని. నేను కాకినాడ చేరిన తరువాతకూడ కొన్నిదినము లతడు వ్యాధిచేత బాధపడి, జూను 21 వ తేదీ యుదయమున 5 గంటలకు

మృతినొందెను. ఇతనికి నేను చిన్నతనమున నింటియొద్ద పాఠములు చెప్పుటచే మాకిరువురకును మైత్రిగలసెను. మామేనమామగారు రాజమహేంద్రవరమునుండి వెళ్ళిపోయిన తరువాత నేనొక్కడనే యుండుటచే కొంతకాలము వీరి యింటనే యుంటిని. రామమూర్తి మరణము నాకు మిక్కిలి విషాదము గలిగించెను.

1934 వ సంవత్సరము జూలై నెలలో శ్రీ రఘుపతి వెంకట రత్నము నాయుడుగారు కాకినాడ కళాశాలనుండి మా తమ్ముని కుమారుడు వెంకటరావును. టైఫాయిడు గుకు బ పిరి ఈ 1934 సెప్టెంబరులోనో యక్టోబరులోనో, గుంటూరు జిల్లాలోని కనగాల గ్రామములోని గ్రంథభాండాగార వార్షికోత్సవమునకు, సభ్యత్వ వహించవలెనని కోరుచు నన్నాహ్వానించిరి. నా మేనల్లుడు పురాణపండ వెంకటదీక్షితులను దీసికొని నేనాయూరుపోయి సభజరిపించితిని. ఆసభకు నా మిత్రులు రాయసం వెంకటశివుడుగారు కూడ దయచేసి సభలో నుపన్యసించిరి. అచటనుండి నేను వెంకటశివుడుగారితో గలిసి గుంటూరు వెళ్ళి. యచట వారింట నే నాలుగైదు దినములుంటిని. అచట క్రిష్టియను కాలేజి భవనములో కాళిదాసునుగూర్చి యొక్క యుపన్యాసము రమారమి 2 గంటల సేపు చెప్పితిని. తరువాత నచట ప్రార్థనసమాజములో నొకనాడును, స్త్రీల సమాజములో నొకనాడును, నుపన్యాసమిచ్చితిని. పిమ్మట రాజమహేంద్ర వరము వెళ్ళితిని.

ఆంధ్రాస్థికమహాసభ యా సంవత్సరము మాధవరములో జరిగెను. ఆ సభకు శ్రీమతి జ్ఞానాంబగా రధ్యక్షతవహించి చక్కని యుపన్యాస మిచ్చిరి. కుగ్రామమైనను తమ్మిసెట్టి వీరన్నగారి కృషిచేత సభ సలక్షణముగానే జరిగెను. నేనా సభకు బోయి బ్రహ్మమతమును గురించి మాటాడితిని. వేంకటరత్నమునాయుడుగారు మొదలగు బ్రహ్మమతస్థులు చాల మంది వచ్చిరి. నరసాపురమువాసులు తమ గ్రామమువచ్చి నన్ను కొన్ని యుపన్యాసము లిమ్మని కోరినందున, నేను 1935 వ సంవత్సర ప్రారంభమున నరసాపురముబోయి కొన్ని యుపన్యాసములు చేసితిని. అప్పుడక్కడ న్యాయవాదిగానున్న భమిడిపాటి సత్యన్నారాయణగారి యింట బసచేసితిని. ఆ యూరిలో మూడో నాలుగో యుపన్యాసములిచ్చితిని. నా మిత్రుడైన చేబియ్యము వెంకట్రామయ్యగారి కుమారుడు బుచ్చబ్బాయి రాజమోలులో న్యాయవాదిగా నుండెను. అతని జూచుటకై నరసాపురమునుండి రాజమోలు

వెళ్ళితిని. ఆ పురజనులు నన్ను విడిచిపెట్టక కొన్నియుపన్యాసము లిమ్మని కోరిరి. వారి కోరిక ననుసరించి నాలుగైదుపన్యాసము లచట నిచ్చితిని. అప్పు డమలాపురములో గూడా హరిశ్చంద్రుడుగారు న్యాయవాదిగనుండిరి. అతనిని జూచి చాలకాలమైనందున యతనిని చూచుట కమలాపురము వెళ్ళితిని. నే నతనిని బాల్యమునుండియు నెరుగుదును. వారియింట బస చేసి, కొన్నిదినములుండి యా పురజనుల కోరికమీద నచటకొన్ని యుప న్యాసము లిచ్చితిని. అమలాపురములోను, రాజమోలులోను, నరసాపురము లోను, నాయుపన్యాసములు విని నాకు కొంతధనము సభలలో బహుమాన ములుగా నిచ్చుచుండిరి ఈ సంవత్సరమందే యేలూరులోనున్న వెంక ట్రామ అండుకో వారితో మాటలాడవలసి యుండుటచే నే నేలూరు వెళ్ళి తిని. అప్పుడక్కడ నా మిత్రుడు తల్లాప్రగడ చలపతిరావుగారి కుమారుడు నరసింహారావు న్యాయవాదిగానుండెను. ఆతని బలవంతముమీద నేను వారియింటనే మూడు మాసములుంటిని. ఆ పట్టణమున వివిధస్థలములలో నే నారుపన్యాసము లిచ్చితిని. శ్రీ పార్థి రాఘవేంద్రరావుపంతులుగారును, నేను గలిసి, పాఠశాలలలోని క్రిందితరగతులకు వెంకట్రామ అండుకోవారి కారువాచకములు వ్రాసి యిచ్చుటకు నిర్ణయించుకొంటిమి. పిమ్మట రాజ మహేంద్రవరము వచ్చి వాచకములు వ్రాయుట కారంభించితిని.

ఆంధ్రా స్త్రిక మహాసభ 1935 వ సంవత్సరము డిశంబరులో శ్రీ తల్లా ప్రగడ ప్రకాశరాయుడుగారి యాధిపత్యమున రామచంద్రపురములో జరి గెను. చెన్నాప్రగడ భానుమూర్తిగారి కుమారుడు సుబ్బారావుగారు రామ చంద్రపురములో వైద్యులుగ నుండిరి. వారియింట బసచేసి సభలకు హాజ రగుచుంటిని. ఒకనాటి సాయంకాలము నేను సభలో విశ్వరూప సందర్శన మును గురించి మాటాడితిని.

నా రెండవ మేనకోడలు తన యిద్దరు కుమారులు స్కూలుఫైనలు పరీక్షయం దుత్తీర్ణులైనందున, వారిని కళాశాలలో జదివించుటకు కాకినాడ టోయి, యచట రెండుసంవత్సరములు గాపురముండెను. ఆమెకు కాకి నాడలో మిక్కిలి జబ్బుచేసెను. ఆమెకు ప్రాణముమీదికి వచ్చినదని నాకు తంతివార్తరాగా, నేను కాకినాడవెళ్ళి యామెకు నిమ్మళించినదాక నే నచ్చట నుంటిని. ఆ దినములలోనే నాకు చిరమిత్రులైన కోకా వెంకటసుబ్బారావు నాయుడుగారికి పిఠాపురములో షష్టిపూర్త్యుత్సవము జరిగెను. పిఠాపుర సంస్థానపు రైతులును, సంస్థానపు టుద్యోగస్తులును ఈ యుత్సవమును

మహావైభవముతో జేసిరి. ఆ మహాసభకు శ్రీ కనకపల్లి రంగనాయకులు నాయుడుగా రధ్యక్షతి వహించిరి. ఆహ్వానము రాగానే నా సభకుబోయి సుబ్బారావునాయుడుగారి సాహుర్యమును, రాజభక్తిని, సంఘసంస్కరణాభిమానమును బ్రశంసించుచు మాటాడితిని. నేను కాకినాడలో నున్నకాలములోనే బెజవాడ వాస్తవ్యులైన నిడుముక్కుల సుబ్బారావుగారువచ్చి, నా "గయోపాఖ్యానము"ను సినిమా ఫిల్ము దీయించుకొనుటకు హక్కునిమ్మని యడుగగా నేను దానికి ప్రతిఫలము రు. 500/-లు బుచ్చుకొని, గయోపాఖాన్యము ఫిలిము దీసికొనుహక్కును మాత్రము వారి కిచ్చితిని. అదిగాక నా గయోపాఖ్యాన నాటకమును రంగస్థలమున బ్రదర్శించుహక్కుతనకే యుండునట్లిమ్మని యడుగగా కొంతసొమ్మును బుచ్చుకొని మూడేండ్ల వరకును నట్టి హక్కు వారి కిచ్చితిని. కాని వారు నా గయోపాఖ్యానము ఫిలిము నిప్పటికిని దీయించలేదు.

ఆంధ్రాస్తిక మహాసభ 1936 వ సంవత్సరము డిశంబరులో అనకాపల్లి గ్రామములో జరిగెను. నాకు దీరికిలేకపోవుటచే నేనాసభకు వెళ్ళలేదు. ఆసంవత్సరము నందే పూర్వము నాచే వివేకవాచకములు వ్రాయించుకొన్న "ఇండియన్ పబ్లిషింగు హౌసు" వారు మొదటి తరగతి మొదలైదు వరకు వాచకములు వ్రాసియిమ్మని నన్నడిగిరి. ప్రతిఫలముగా నేను రు 2000/- లు వారివలన గ్రహించి వాచకములను 1937 వ సంవత్సరము డిశంబరులోపుగా వ్రాసి యిచ్చితిని. ఆకంపెనివారా వాచకములకు సదాశివ వాచకములని పేరు పెట్టుకొనిరి.

1937 వ సంవత్సరము ఆంధ్రాస్తిక మహాసభ డిశంబరులో కాకినాడలో జరుగునట్లు నిర్ణయింపబడెను. కాని యట్లు జరుగక మరుచటి సంవత్సర మాయూరనే ఫిబ్రవరిలో జరిగెను. దానికి శ్రీ రఘుపతి వెంకట రత్నము నాయుడుగా రధ్యక్షులైరి. ఆసభకు నేను బోయి "మరణము"ను విషయము మీద మాటాడితిని. ఆసంవత్సరమే కాకినాడలో జీవకారుణ్య మహాసభ జరిగెను. ఆసభసన్నాహకులు నన్నధ్యక్షునిగ నాహ్వానించిరి. నేను బోయి యధ్యక్షుడుగనుండి సభజరిపితిని. ఆసభకు హైదరాబాదు నుండియు, చెన్నపురి నుండియు, యితరస్థలముల నుండియు ననేక ప్రతినిధులు వచ్చిరి.

1937 వ సంవత్సరము మార్చినెలలో నామేనల్లుడు పురాణపండ వెంకట దీక్షితునకు రెండవ కుమారుడు గలిగెను. ఆ పిల్లవానికి దీక్షితులు

తన తండ్రియైన వెంకన్నగారి పేరుపెట్టెను. ఆసంవత్సరముననే రఘుపతి వెంకటరత్నంనాయుడుగారు హితకారిణీ సమాజాధ్యక్ష పదవి వదలుకొనిరి. వదలుకోవలదని సభలో తీర్మానముజేసి వారిని బ్రతిమాలినను వారంగీకరింపక మానుకొనిరి. వీరేశలింగముగారు చనిపోయినది మొదలుకొని నాయుడుగా రధ్యక్షులుగను, నేనుపాధ్యక్షుడుగాను నుంటిమి. నాయుడుగారు మానుకొనగానే పాలకోడేటి గురుమూర్తిగారు మొదలగువారు నన్నధ్యక్షునిగ నెన్నుకొనిరి. 1936 వ సంవత్సరమున చెన్నపురి శాసననిర్మాణ సభ్యత్వముల కెన్నికలు జరిగెను. ఆ ఎన్నికలలో గెలిచి ప్రకాశము పంతులుగారు సభ్యుడై పిమ్మట రెవిన్యూమంత్రి యయ్యెను. ఆమహా పదవిలో నుండి వారు రాజమహేంద్రవరము వచ్చిరి. వారిని గౌరవించుటకై పాఠశాలలో నొక మహాసభ జరిగెను. ఆసభకు నన్నధ్యక్షులుగ జేసిరి. ప్రకాశముగారు నాకు బాల్యమిత్రుడగుటచేత పురజనులు నన్నిట్లు గౌరవించిరి. ఆసభానంతరము పాలకోడేటి గురుమూర్తిగారు ప్రకాశముగారికి విందుజేసిరి. ఆవిందుకు నన్నును, న్యాయపతి సుబ్బారావు పంతులుగారిని, మరికొందరు పురప్రముఖులను గూడ నాహ్వానించిరి.

కాకినాడలోనున్న "స్కూప్‌అడుకో"యను వారి ముద్రాక్షరశాలలో గొన్ని పుస్తకము లచ్చువేయించితిని. కాగితములు పెట్టుబడి వారేపెట్టి కొన్ని పుస్తకము లచ్చువేసిరి. అచ్చుఖర్చునకు, కాగితముఖర్చునకు వారు నామీద వ్యాజ్యముదెచ్చిరి అది నామీద డిక్రీ చేయబడెను. ఆ వ్యవహారము పూర్తియగుసరికి చాలకాలముపట్టెను. ఆ వ్యవహారములో నాకు మిత్రుడైన దర్భా వెంకట శివరామదాసుగారు మిక్కిలి శ్రద్ధతో నాపక్షమున బనిచేసిరి. దానికి ప్రతిఫలముగా వారికి నేనేమియు నీయలేదు. వారి ప్రయత్నమువల్లనే నేను స్కూపులాండుకోవారితో రాజీపడి రాజీప్రకారము సొమ్మంతయు దీర్చివేసితిని. ఈవిషయములో దాసుగారు నాకుజేసిన యుపకారము మరువజాలను. నేను పూర్వము గాపురముండిన రాయవరపువారియిల్లు, ఋణగ్రస్థమై వేలము వేయబడినందున నే నాయిల్లువిడిచి, యాయింటికి వెనుక ప్రక్కనున్న చిన్నయింటిలో 1938 ఏప్రియలు నెలలో ప్రవేశించితిని.

1937 వ సంవత్సరము కడపట శ్రీ వడ్డాది సుబ్బారాయుడుగారికి సహస్రమానజీవితోత్సవము జరిగెను. ఆ యుత్సవము జరుగుటకు నేను మిక్కిలి ప్రయత్నముజేసితిని. అందులో చెరుకువాడ వెంకట్రామయ్యగారు మిక్కిలి సహాయముజేసిరి. ఆసమయమున సుబ్బారాయుడుగారికి రాగిపలక

మీద నభినందనపత్రమును జెక్కించి, దానికి వెండిపూతబెట్టించి సమర్పించితిమి. ఈగౌరవమునకు సుబ్బారాయుడుగారు మిక్కిలి సంతసించిరి. 1938 వ సంవత్సరమున వారముదినములు పక్షవాతముచే బాధపడి, మార్చి నెల మొదటివారములో సుబ్బారాయుడుగారు స్వర్గస్థులైరి. ఆయనయెడల నాకు మిక్కిలి గౌరవముగలదు. ఆయనశవమువెంట స్మశానమునకుబోయి నాకడపటిగౌరవము జూపితిని.

1938 వ సంవత్సరమాగస్టులో మాతమ్ముడు తన నాలుగవ కుమార్తె యైన కృష్ణవేణికి వివాహముజేసెను. అప్పుడు నాదగ్గర ధనములేనందున నేనేమియు రొక్కరూపకముగా సహాయచేయలేదు. వరుడు వేదుల నారాయణశాస్త్రిగారి కుమారుడు సత్యనారాయణశాస్త్రి.

1938 వ సంవత్సరము 21 ఆగస్టు తారీఖున నామేనల్లుడు పురాణపండ వెంకటదీక్షితులునకు నాడుపిల్ల పుట్టెను. అతని రెండవకుమారుడు కడుపులో బల్లపెరిగి మాసముర్రోజులు బాధపడి, ఆగస్టు 25 వ తేదీ మధ్యాహ్నము మృతినొందెను. అప్పటి కా బాలుడు 17 మాసములు వయసు గలవాడు. పాపము తల్లి పచ్చిబాలింతరాలు. దుఃఖపడుటకైన వీలులేకపోయెను. ఆ సంవత్సరమే సెప్టెంబరు నెలలో మా తమ్ముని భార్య రామలక్ష్మమ్మ నాలుగుదినములు బాధపడి, సెప్టెంబరు 9 తారీఖునకు సరియగు, భాద్రపద శు ౧౩ నాడుదయమున చనిపోయెను. ఆమె కష్టుడు 48 సంవత్సరముల వయసు. ఆమె మా మేనమామగారు పురాణపండ మల్లయశాస్త్రిగారి కుమార్తె. ఆమె పోవునప్పటి కామె కెనమండుగురు పిల్లలు. ఆమె తల్లి చెన్నపురిలో రెండవ కుమారునియొద్ద పక్షవాతముచే బాధపడుచు జీవించియుండెను. అది మిక్కిలి శోచనీయము. మా మరదలు మిక్కిలి సుగుణవతి. ఆమె యోపిక మిక్కిలి ప్రశంసనీయము. ఆ మరణము మా కుటుంబమునకు గొప్పలోపము. నా వలెనే నాతమ్ముడు గూడ కళత్రహీనుడగుట మిక్కిలి విచారకరము. 1938 సెప్టెంబరు 25 వ తారీఖు మొదలుకొని 10 దినములు నేను జబ్బుపడితిని. దైవానుగ్రహమువలన నెమ్మదిగా నుండెను. వడ్డాది సుబ్బారాయుడుగారు జీవించియుండగా నా ఛాయాపటమును టవునుహాలులో పెట్టించవలెనని వారి కభిలాషగా నుండెడిది. వారు చనిపోయిన తరువాత సుబ్బారాయుడుగారి ప్రియశిష్యుడును, నాకు మిత్రుడునైన శ్రీ చెరుకువాడ వెంకట్రామయ్యగారును, ముడుంబై శ్రీ రామాచార్యులుగారును తగు ప్రయత్నముజేసి

సుబ్బారాయుడుగారి యభిలాష దీర్చవలెనని శ్రమపడి ధనము పోగుచేసి, చామకూర భాష్యకారులు నాయుడుగారిచేత నా ఛాయాపటమును (Oil-Painting) వ్రాయించిరి. అది ది 30—10—1938 తేదీని టవునుహాలులో ప్రతిష్ఠింపబడెను.

ఆ దినమున టవునుహాలావరణములో గొప్ప సభ జరిగెను. ఆ సభకు కాకినాడ కళాశాలా ప్రధానాచార్యులును, నా మిత్రులు నైన, శ్రీ పెద్దాడ రామస్వామిగా రధ్యక్షత వహించిరి. టవునుహాలు పరిపాలక సంఘాధ్యక్షులైన న్యాపతి సుబ్బారావు పంతులుగారు నా ఛాయాపట మును టవునుహాలులో బెట్టుటకు దమ యంగీకారమును దెలుపుచు, సభలో నన్ను గురించి మాటాడిరి. తరువాత శ్రీ భమిడిపాటి కామేశ్వర రావుగారు నా గ్రంథము లన్నిటిమీదను ననుకూలమైన యొక పెద్ద విమ ర్శనమును వ్రాసి చదివిరి. ఆ సభలోనే మార్కండేయుడను హరిజను డిట్లు మాట్లాడెను. "లక్ష్మీనరసింహముగారు నాకును నా సంఘమునకును జేసిన యుపకారమునకు నా కుమారునకు లక్ష్మీనరసింహమని పేరు పెట్టు కొంటి"నని చెప్పి, యా బాలుని సభాసదులకు చూపెను. ఈ సభ నా షష్ఠి పూర్తి సభ కంటె వైభవముగా జరిగినదని వేమూరి విశ్వనాధశర్మగారు నాతో ననిరి. శ్రీ తాళ్ళూరి రామచంద్రరావుగారు పద్యములు వ్రాసి జదివిరి. ఇంకను ననేకులుపన్యాసము లిచ్చిరి. భాష్యకారులు నాయుడుగారు ఛాయా పటము మిక్కిలి బాగున్నదని సభాసదులు మెచ్చిరి. శ్రీ పిఠాపురము మహారాజాగారు భాష్యకారులు నాయుడుగారికి సంవత్సరమునకు రు500/- వేతనమిచ్చి, బొంబాయిలోని చిత్రకళాశాలకు బంపి నాలుగు సంవత్సర ములు చిత్రలేఖనము నేర్పించిరి. ఆ దినమున నా మిత్రులైన రఘుపతి వెంకటరత్నమునా రొక వెండి గిన్నెయు, వెండిపళ్ళెరమును చేయించి, కాకినాడ నుండి బహుమానముగ నాకు పంపిరి. మా యూరి వైశ్యశ్రేష్ఠు లలో నొకరైన తట్ట శీతారామయ్యగారొక శాలువనుగప్పిరి. డాక్టరు బెజవాడ వెంకటస్వామి నాయుడుగారు బంగారపుటుంగరమును నా వ్రేలికి దొడిగిరి. ఇచట నొక విశేషము వ్రాయవలెను.

కీర్తిశేషులైన కల్లూరి వెంకటరామశాస్త్రిగారి జీవితము వ్రాయవల సినదని, వారి రెండవ కుమారుడైన రామచంద్రమూర్తిగారు నన్నుగోరిరి. వ్రాయుటకు నే నంగీకరించితిని. తండ్రిగారు వ్రాసిన గ్రంథములను, మరి యితర సాధనసామగ్రులను రామచంద్రమూర్తిగారు నాకిచ్చిరి. తీరుబడిలేక

వ్రాయుటకు నేను కొంత యాలస్యముచేసినందున, నేను వ్రాయననుకొని, రామచంద్రమూర్తిగారు నాకిచ్చిన కాగితములు మొదలైనవి తీసుకొని, వాటిని చిలుకూరి వీరభద్రరావుగారికిచ్చి వారిచేత తండ్రిగారి జీవితము వ్రాయించిరి. వీరభద్రరావుగారు చాల పెద్దగ్రంథమువ్రాసి, యందు వెంకట రామశాస్త్రిగారికిని, శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారికిని, జరిగిన వివాద విషయ మెత్తుకొని, కృష్ణమూర్తిశాస్త్రిగారిని గురించి కొన్ని యనవసర వాక్యములు వ్రాసిరి. అవి తమ ప్రతిష్ఠకు భంగకరముగానున్నవనియెంచి, వ్రాసినందుకు వీరభద్రరావుగారిమీదిను, వ్రాయించినందుకు రామచంద్ర మూర్తిగారిమీదను, పరువునష్టమునకు కృష్ణమూర్తిశాస్త్రిగారు క్రిమినలు ఛార్జినిచ్చిరి తండ్రిగారి జీవితమును వ్రాయమని నన్ను కోరినపుడు రామ చంద్రమూర్తిగారు కృష్ణమూర్తిశాస్త్రిగారిని దూషింపుమని నాతో నెన్నడు చెప్పలేదు. ఆ యభియోగమును మొదటితరగతి మేజస్ట్రీటుగారు (First class Magistrate) విచారించిరి. రామచంద్రమూర్తిగారు నన్ను తమ పక్షమున సాక్ష్యము వేసుకొనిరి. కృష్ణమూర్తిశాస్త్రిగారిని దూషింపుమని రామచంద్రమూర్తిగారు నాతో నెన్నడు చెప్పలేదని నేను సాక్ష్యమిచ్చితిని. ఆ యభియోగ ఫలిత మేమనగా, వీరభద్రరావుగారికి రు. 200/- లు జరి మానా విధింపబడెను. రామచంద్రమూర్తిగా రేశిక్షలేకయే బయటపడిరి,

1938 వ సంవత్సరము డిశంబరు 8 వ తేదీని నా దేహారోగ్యము నిమిత్తము నా మేనల్లుడు పురాణపండ వెంకట దీక్షితులును దీసుకొని చెన్నపురిబోయి, నా మేనమామ కుమారుడైన పురాణపండ కామేశ్వర రావుగారి గృహమందు బసచేసితిమి. శ్రీ రఘుపతి వెంకటరత్నము నాయుడుగారు తమ కన్నులు జబ్బుగానున్నందున చికిత్సచేయించుకొనుచు నా దినములలో చెన్నపురిలో నుండిరి. నేను పలుమారులు వారి దర్శనము చేసితిని. వారినేగాక నా పూర్వమిత్రులైన గంటి లక్ష్మన్నగారిని, బులుసు సాంబమూర్తిగారిని, టంగుటూరి ప్రకాశముగారిని, మంత్రిప్రగడ నరసిం హంగారిని, కోకా సాంబశివరావు నాయుడుగారిని, సూరతు వీరాస్వామి నాయుడుగారిని, సర్. కూర్మా వెంకటరెడ్డి నాయుడుగారిని, పిళ్ళారిసెట్టి నారాయణరావునాయుడుగారిని మరికొందరిని జూచెడి యవకాశము గలిగి నది. ఒకనాటి శాసననిర్మాణసభకువెళ్ళి, జమీందారి బిల్లునుగురించి ప్రకా శము పంతులుగారియొక్కయు, రాజగోపాలాచారిగారియొక్కయు, నుప

న్యాసములను మరియు నా బిల్లుమీద నితర ప్రముఖులుచేసిన చర్చయు వింటిని.

చెన్నపురిలోని యాంధ్రులందరు నొక సంఘముగాగూడి, యాంధ్ర మహాసభ యనుపేర నొకసభ స్థాపించి నడుపుచుండిరి. దాని నదివరకున్న జార్జిటవును నుండి, 1939 జనవరిలో విక్టోరియా టవునుహాలు భవనము లోనికిమార్చిరి. ఆ నూతన గృహప్రవేశ సందర్భమున గొప్పసభ జరిగెను. నాటిసభకు చెన్నపురిలోని యాంధ్రులందరు వచ్చిరి బులుసు సాంబ మూర్తిగా రాహ్వానింపగా నేనా సభకు బోయితిని. ఆ దినమున సభలో శ్రీ పిఠాపురము మహారాజాగారు, శ్రీ బొబ్బిలి మహారాజాగారు, మంత్రి ప్రగడ నరసింహముగారు, సర్. కె. వి. రెడ్డినాయుడుగారు, న్యాయ మూర్తి వెంకటరమణరావుగారు, మంత్రి గోపాలరెడ్డిగారు, వెంకటస్వామి నాయుడుగారు, గద్దె రంగయ్యనాయుడుగారు మొదలగు ప్రముఖులందరు, నాంధ్రుల గొప్పతనమునుగూర్చియు, నట్టిమహాసభయొక్క యావశ్యకతను గూర్చియు మాటాడిరి.

ఈసభయైన కొన్నిదినములకాంధ్రమహాసభవారు, జనవరి 29 వ తేదీని, నన్ను సగౌరవముగా రావించి స్వాగతమిచ్చి తెనుగులో నొక యభినందనపత్రమును సమర్పించిరి. ఆసందర్భమున నన్నుప్రశంసించుచు, నాటిసభాధ్యక్షులైన బులుసు సాంబమూర్తిగారును, సర్. కె. వి. రెడ్డి నాయుడుగారును, శతావధాని దోమా వెంకటస్వామిగుప్తగారును, తాడిపర్తి రాఘవాచార్యులుగారును, వాసా సూర్యనారాయణశాస్త్రిగారును, దేవులపల్లి కృష్ణశాస్త్రిగారును, కృత్తివెంటి సుబ్బారావుగారును మరికొందరు ప్రముఖులును మాటాడిరి. ఆంధ్రమహాసభవారు నాడు నాకొక పట్టుశాలువను కప్పిరి. ఆనాడే నన్నాంధ్రమహాసభలో గౌరవసభ్యునిగా చేర్చుకొన్నట్లు నాటిసభకేగాక యాంధ్రమహాసభకే శాశ్వతాధ్యక్షులైన బులుసు సాంబ మూర్తిగారు ప్రకటించిరి.

ఆదినములలోనే రేడియో కార్యస్థానమువారు నన్నాహ్వానించి రేడియోలో నొకయుపన్యాసమిమ్మని కోరిరి. "ఆంధ్రభాషయందలి వచన రచన" గురించి నే నాశుధారగ నిరువదినిముషములు మాటాడితిని. అది తాత్కాలికముగాకుండ ఎలక్ట్రికలురికార్డు (Electrical Record) తీసి కొనిరి. 1939 ఫిబ్రవరి మొదటివారములో నాకు నెలనెలకు మునుపిచ్చు రు 60/- ల జీతము తగ్గించి, యప్పటినుండి నెలకు రు 30/- లు మాత్రమే

యివ్వబడునని, పిఠాపురము మహారాజావారి కార్యస్థానమునుండి నాకు హుకుముపచ్చెను. ఆసంవత్సరమేప్రియలు 8 వ తేదీని బయలుదేరి 9 వ తేదీ నుదయము రాజమహేంద్రవరముపచ్చితిని.

శ్రీ రఘుపతి వెంకటరత్నమునాయుడుగారు చెన్నపురిలో తమ కంటిజబ్బు కుదురసందున నచ్చట లాభములేదని కాకినాడవచ్చి, యచ్చట మరిరెండుమాసములు బాధపడి, మే 26 వ తేదీ రాత్రి చనిపోయిరి. ఆవార్త నాకుతెలియగానే మరునాడుదయమున బయలుదేరి కాకినాడవెళ్ళి, యామహాత్ముని యంత్యక్రియలలో పాలుగొంటిని. వారు పోయినచోట శిష్యులు ప్రార్థనలుజేసి, పిమ్మట బ్రహ్మమందిరమువద్ద ప్రార్థనముచేసి, శవము ననాథశరణాలయమువద్దకు గొంపోయి, యచట ప్రార్థనలుసలిపి, యూరేగింపుచు రుద్రభూమిచేర్చిరి. నేను కూడ వెళ్ళితిని. చాలమంది జనులు వచ్చిరి. రుద్రభూమికడకు శ్రీ దురిశేటి శేషగిరిరావుగారు, శ్రీ లక్కరాజు సుబ్బారావుగారు, చావలి రామసోమయాజులుగారు మొదలగు పురప్రముఖులుపచ్చిరి. అచట డాక్టరు వేమూరి రామకృష్ణారావుగారు, పెద్దాడ రామస్వామిగారు, లక్కరాజు సుబ్బారావుగారు, చావలి రామసోమయాజులుగారు, నేనును నాయుడుగారి పరిశుద్ధజీవనమునుగురించి యుపన్యసించితిమి. కోకా వెంకటసుబ్బారావునాయుడుగారు శవముతలక్రింద హారతికర్పూరముపెట్టి పుత్రునివలె నగ్నిసంస్కారముజేసిరి. రెండుగంటలలో నాయుడుగారి శరీరము భస్మావశేషమయ్యెను.

ఆమరునాడు నేను రాజమహేంద్రవరము పచ్చితిని. నేనువ్రాసిన "మహాపురుషముక్తావళి"యను వచనగ్రంథమును పాఠ్యపుస్తక నిర్ణయ సంఘమువారిచే నామోదింపబడినట్లు 1939 మే 16 వ తేదీ గెజిటులో ప్రకటింపబడెను. ఈసంవత్సరమున నాయుడుగారికి ప్రియశిష్యుడును, నాయుడుగారితరువాత కాకినాడ కళాశాలా ప్రధానాచార్యుడును, నాజన్మ బ్రహ్మచారియు, మహావిద్వాంసుడునైన డాక్టరు వేమూరి రామకృష్ణారావు గారు, నవంబరునెలలో బందరు పట్టణమున మృతినొందిరి. ఆయన నాకు చిరమిత్రుడగుటచేతను, నా కన్న చిన్నవాడయ్యు గుణవృద్ధుడగుటచేతను, నాయనమరణముగూడ నాకు విచారముగలుగజేసెను. పండితుడును, గుణసంపన్నుడును, మహాకవియు, నందుచేత శ్రీ పిఠాపురము మహారాజావారి కాప్తుడును, నాకు బంధువునైన, ఓలేటి వెంకటరామశాస్త్రిగారు కూడ నీ సంవత్సరమే మరణించిరి.

పాలావఝులలక్ష్మీనారాయణగారు సకుటుంబముగాబ్రహ్మమతస్థుడై, యనేక బ్రహ్మమతగ్రంథములువ్రాసి, 1935 వ సంవత్సరమున నరసాపుర ములో చనిపోయిరి. నరసాపురవాసులు లక్ష్మీనారాయణగారి ఛాయాపట మును దీయించి, టౌనులరుహైస్కూలులో దానిని ప్రతిష్టించి, దానిని బహిష్కరణముచేయుటకురమ్మని నన్నాహ్వానించిరి. 1940 మార్చి 17 వ తేదీని నేనాపనిచేయుటకు నాతమ్మునికుమారుడు మల్లయ్యశాస్త్రిని వెంట బెట్టుకొని నరసాపురము వెళ్ళితిని. ఆయుత్సవము నిమిత్తమే పెద్దాడ రామస్వామిగారు నరసాపురము దయచేసిరి. మార్చి 17 సాయంకాలము టౌనులరుహైస్కూలు భవనములో సభజరిగెను. ఆసభకు నేనధ్యక్షుడనై లక్ష్మీనారాయణగారి సుగుణసంపద నభినందించుచు వారి ఛాయాపటమును బహిష్కరణముచేసితిని. పెద్దాడ రామస్వామిగారును, మరికొందరు నరసాపురవాసులునుగూడ, లక్ష్మీనారాయణగారివిషయమై మాటాడిరి. నరసాపురమునకు నాలుగైదుమైళ్ళదూరములో మత్స్యపురియను గ్రామ మున్నది. అక్కడ మాకు జ్ఞాతులుగొందరున్నారు. వారిలో నొకడు చిలకమర్తి నరసింహమనునతడు నన్ను మత్స్యపురిరమ్మని తీసుకొని పోయెను. ఆగ్రామవాసులు నన్ను టంజాములో గూర్చుండబెట్టి, బ్యాండు మేళముతో నూరేగించి, జనార్దనస్వామివారి యాలయమునకు గొంపోయి, యచట నొకసభచేసి యేదేని యొకయుపన్యాసమిమ్మని నన్నుగోరిరి. ఆంధ్రవాఙ్మయమునుగురించి నేనుపన్యసించితిని. పిమ్మట నచటనుండి నరసాపురమువెళ్ళి, కాళిదాసునిగురించి యొకయున్యాసమిచ్చితిని. అచటనే రెండవ యుపన్యాసము పండితరాయలవారినిగురించి యిచ్చితిని. అచ్చట నుండి పాలకొల్లువెళ్ళి, నాలుగో యైదో యుపన్యాసములిచ్చితిని. అచట నుండి రాజోలుమీదుగా నమలాపురమువెళ్ళి, గూడా సత్యహరిశ్చంద్రుడుగారి యింట బసచేసితిని. అప్పుడు శ్రీరామనవమి యుత్సవములు జరుగు చుండెను. పురజనులు కోరగా శ్రీరాముని గుణగణములనుగురించి యుపన్యసించితిని. ఆంధ్ర విశ్వవిద్యాపీఠమువారు శ్రీజయంతి రామయ్య పంతులుగారికికాప్రపూర్ణబిరుదమిచ్చినందుననమలాపురవాసులువారినిసన్మా నించుటకై ముక్తేశ్వరమునుండివారినిరావించియొకసభజేసి, యాసభకునన్ను ధ్యక్షునిగనుంచిరి. రామయ్యపంతులుగారు చేసిన భాషాసేవ నుగ్గడించుచు యుపన్యసించితిని. ఆపురవాసులు మరికొందరుగూడ వారినిగూర్చి మాటా డిరి. ఆ పురవాసులు నాకు గొంతధనము బహుమానముజేసి బంపిరి, అచటి

నుండి బయలుదేరి భవశేశ్వరములో మా మూడవ మేనగోడలి పెనిమిటి పొన్నపల్లి వెంకట లక్ష్మీనరసింహారావుగారి యింట గొన్నిదినముండి, పిమ్మట రాజమహేంద్రవరము వెళ్ళితిని. అప్పటికి రాజమహేంద్రవరములో "హితకారిణీ" సమాజపరిస్థితులు మారెను. ఆ సమాజమునకు నే నధ్యక్షుడుగాను, పెద్దాడ సుందర శివరావుగారు కార్యదర్శిగాను, నుంటిమి. ఆయన కార్యదర్శిగా నున్నకాలమున, శ్రమపడి, చెన్నపురి,కాకినాడ మొదలగు ననేకస్థలములలో దిరిగి, సొమ్ము ప్రోగుచేసి వీరేశలింగముగారి శిలావిగ్రహమును జేయించి, యిన్స్టిసుపేటలో వీరేశలింగోన్నత పాఠశాల కెదురుగా, రాచబాటమీద దానినిప్రతిష్ఠించిరి. అప్పుడు గొప్పసభ జరిగెను. ఆ సభకు "మోడరన్ రెవ్యూ" (Moderen Review) పత్రికాధిపతియైన రామానంద చటర్జిగారు కలకత్తానుండివచ్చి, యధ్యక్షతవహించిరి. ఆసభలో నేను దెనుగున మాటాడితిని. పెద్దాడ సుందర శివరావుగారి కుమార్తె కామేశ్వరమ్మగా రింగ్లీషులో మాటాడిరి. మరికొందరుగూడ మాటాడిరి. సుందర శివరావుగారు కార్యదర్శిగానున్నకాలమున వీరేశలింగముగారి తోట శిస్తు యేడాదికి రు. 1600/-ల వరకు పెరిగెను. వితంతు శరణాలయమునకు, క్రొవ్విడి శేషవెంకటకాశీపతిగారిని మేనేజరుగనుంచి, శరణాలయమును, తోటను, సుందర శివరావుగారు చక్కగ నడుపుచుండిరి. శరణాలయములో వితంతు వివాహములు జరుగుచుండెను. ఇట్లుండగా నే నధ్యక్షుడుగానున్న మూడు సంవత్సరములకాలము ముగిసెను. క్రొత్త యధ్యక్షుని యెన్నుకొనవలసి వచ్చెను. సుందర శివరావుగారు తమ కార్యదర్శిపదవిని వదలుకొనిరి. వారిస్థానమున శ్రీ రెబ్బాప్రగడ సుబ్బరామయ్యగారిని కార్యదర్శిగా నెన్నుకొనిరి. అధ్యక్షునిగా శ్రీ కనుపర్తి శ్రీరాములుగారినెన్నుకొనిరి. సమాజసభ్యులలో అధికారవాంఛలు, పరస్పర ద్వేషములు, నసూయలు పెరిగెను. వీరేశలింగముగారు, రఘుపతి వెంకటరత్నము నాయుడుగారు వేసిన పద్ధతులనుమీరి, సమాజము వేరుగ వర్తింపజొచ్చెను. అనుష్ఠానిక బ్రహ్మమతస్థుడును, విద్యాధికుడును, సజ్జనుడునునైన కంభంపాటి రామశాస్త్రిగారిని, హితకారిణీ సమాజసభ్యులు కార్యనిర్వాహకవర్గములో నుండకుండ చేసిరి. సంఘసంస్కరణముమీదను, బ్రహ్మమతముమీదను, నభిమానము లేనివారు సభ్యులైరి. ఆ పరిస్థితులలో, నేను సభ్యుడుగానుండి చేయవలసిన పనేమియు లేకపోవుటచే, నా యాపజ్జీవసభ్యత్వమును వదలు

కొని, హితకారిణీ సమాజముతో 1940 వ సంవత్సర మాగష్టునెలలో సంబంధము వదలుకొంటిని. కుందూరి వెంకటరత్నముగారు పూర్వము వీరేశలింగోన్నత పాఠశాలలో చాలకాలము సహాయోపాధ్యాయుడుగ నుండిరి. అందుచేత వారు పాఠశాలా పరిపాలక సంఘములో సభ్యులుగా నుండగూడదని, శ్రీ రఘుపతి వేంకటరత్నం నాయుడుగారు స్పష్టముగా చెప్పిరి. దానికివ్యతిరేకముగా వెంకటరత్నముగారిని పాఠశాలా పరిపాలక సంఘములో సభ్యునిగా జేయుటయేగాక, దానికి కార్యదర్శిగాగూడ జేసిరి. వెంకటరత్నముగారు పాఠశాలా సంఘముపైమీద వ్యాజ్యముపేసి కోర్టు కెక్కించిరి. ఇటువంటి పరిస్థితులలో నేను పాఠశాలా పరిపాలక సంఘములోగాని, హితకారిణీ సమాజములోగాని సభ్యుడుగా లేనందుకు సంతసించుచున్నాను.

1940 సెప్టెంబరులో రామమోహనరాయలవారి వార్షికోత్సవమునకు రమ్మని నాకు నాహ్వానము యేలూరునుండి వచ్చెను. నే నేలూరు వెళ్ళి యా యుత్సవమున కధ్యక్షుడనై యుపన్యసించితిని ఆ సభ జరిగిన మరునాడే నా జన్మదినమైనందున నా పురవాసులు నా డెబ్బదినాలుగవ జన్మదినోత్సవముజేసి నన్ను గౌరవించిరి.

1941 జనవరి 6 తేదీ నాడుదయమున నే నొక పనిమీద కాకినాడ పోతిని. ఆ క్రిందటి దినము సాయంకాలము శ్రీ న్యాపతి సుబ్బారావు పంతులుగారు రాజమహేంద్రవరములో పరమపదించిరి. ఆ వార్త నాకు తెలియకుండగనే, నేను కాకినాడ వెళ్ళితిని. ఆ సమయమునకు, రాజమహేంద్రవరమున నుండి వారికి నా కడపటి గౌరవము జూపలేకపోతినని మిక్కిలి విచారించితిని. వారికి నా మీద దయ మెండు. కాని కాకినాడలో సుబ్బారావుపంతులుగారి మరణమును గురించి విషాదము తెలుపుటకై పురజనులు టవునుహాలులో నొక సభ జేసిరి. ఆ సభలో నేను పంతులుగారిని గురించి మాటాడి తృప్తిచెందితిని. నే నక్కడ నున్నప్పుడే శ్రీ జయంతి రామయ్య పంతులుగారు ముక్తేశ్వరములో ఫిబ్రవరి 9 తేదీని మృతినొందిరి. వారి మరణమును గూర్చి విషాదము దెలుపుటకై పుర మందిరములో సభ జరిగెను. ఆ సభ కధ్యక్షుడనైతిని. శ్రీ దుగ్గిరాల సూర్యప్రకాశరావు పంతులుగారు మరికొందరుకూడ మాటాడిరి. కాకినాడలో నేనున్న కాలములో నీశ్వర పుస్తకభాండాగారములో రెండుపన్యాసము లిచ్చితిని. పిమ్మట రాజమహేంద్రవరమువచ్చి, వేసవికాలములో గొంత

సౌఖ్యముగా నుండునని, నా పెద్ద మేనగోడలియింట దానవాయిపేటలో నెలదినములుంటిని.

ఆ సంవత్సరము జూను నెలలో నేను పూర్వముండెడి బసవిడిచి యార్యపురము మారితిని. ఆర్యపురములో నుండగా గలిగిన యుద్ధభయము వల్ల 1942 ఏప్రియలు 8వ తేదీని బయలుదేరి, పడమటిగోదావరిజిల్లా తణుకు తాలూకాలోని కాకరపర్రుగ్రామముపెళ్ళితిని. ఆయూరిలోనున్న నా పెద్దవదిన గారి కుమార్తయిన ద్విభాషి చిన్నయ్య, కనకయ్య యను సోదరుల యింట గాపురముంటిని. వారు నాకు సకల సౌకర్యములు జేసిరి. కాకరపర్రు గ్రామవాసులు నన్ను సన్మానింపదలచి యొక సభ చేసిరి. నన్ను మేనాలో గూర్చుండబెట్టి వేదపండితులు స్వస్తిచెప్పుచు, ప్రతి గుమ్మముకడ హారతు లిచ్చుచు, బి. ఏ., యమ్ ఏ., పరీక్షలయం దుత్తీర్ణులైన యువకులు, బోయీలచే మోయింపక, తామే మేనాను మోయుచు, సభకు గొంపోయిరి. ఆ సభకు శ్రీ చర్ల భాష్యకారశాస్త్రిగారు, వేదుల వెంకటశాస్త్రిగారు, మొదలగు పండితులువచ్చిరి. కాకరపర్తి వెంకటశాస్త్రిగా రాసభకధ్యక్షత వహించిరి. కొందరు నామీద పద్యములు రచియించి చదివిరి. కాకరపర్తి సత్యనారాయణగారు మొదలగు యువకులుకొందరు ప్రశంసాపూర్వకముగా నన్నుగురించి మాటాడిరి. కట్టకడపటసభలో నాకరువదిరెండురూపాయిలు బహూమానముచేసిరి. కాకరపర్తిగ్రామము నాయత్తవారిగ్రామమగుటచే, "ఆలివంకవారలా ప్తబంధువులన్నట్లు" నాభార్యవంక వారందరితో గలిసి, యాగ్రామస్థులు నన్నీవిధముగ గౌరవించినందున మిక్కిలిసంతసించితిని.

●

స్వ యి చ రి త్ర ము

చ ర మ ప్ర క ర ణ ము

కృ త జ్ఞ త

1942 వ సంవత్సరము ఏప్రియలు నెలలో, నేనురాజమహేంద్ర వరమునుండి కాకరపట్టు వచ్చితిని. 1943 వ సంవత్సరము మార్చినెల వరకు నేను ద్విభాష్యం చిన్నయ్యగారింట కాపురముండి యది యిరుకుగ

నున్నందున యా మార్చినెలలో మరియొక గృహమద్దెకు దీసుకొని, యందు ప్రవేసించితిని. ఈ 43 వ సంవత్సరాంతమున నాంధ్రవిశ్వవిద్యాపీఠమువారు నాకు 'కళాప్రపూర్ణ' బిరుదొసంగిరి. ఆపట్టము నందుకొనుటకు నేను స్వయముగ గుంటూరు వెళ్ళదలచితిని. గాని నా దేహారోగ్యము సరిగలేనందున వెళ్ళలేకపోతిని. చెన్నపురి గవర్నరుగారధ్యక్షులై యాసభ జరిపి, నేనా సభలో హాజరులేకుండగనే యా బిరుదు నాకొసంగిరి. అత్తరి జయపురము మహారాజుగారైన శ్రీ శ్రీ శ్రీ విక్రమదేవవర్మ మహారాజుగారు నామీది యభిమానముచేత నాకు బంపుమని విలువగలిగిన యొక జరీశాలువ విద్యాపీఠము రిజిస్ట్రారుగారైన శ్రీ కూర్మా గోపాలస్వామిగారికిచ్చిరట. ఆయన యా శాలువను, బిరుదపట్టమును, టపాలో నాకు బంపిరి. వాటిని నేను కృతజ్ఞతాపూర్వకముగ నందుకొంటిని.

రాజమహేంద్రవరనివాసులైన శ్రీకర్రా మావుళ్ళయ్యగారు, యమ్. వి. క్రిష్ణయ్యనాయుడుగారు, అంగర నారాయణరావుగారు, తిమ్మరాజు వెంకట శివరావుగారును గలసి, మరికొందరి మిత్రుల ప్రోత్సాహముచేతను, సహాయమువల్లను, నాయందలి భక్తిగౌరవములచేత సుప్రసిద్ధమైన నటకులను బిలిపించి నే రచియించిన గయోపాఖ్యాన నాటకమును ప్రదర్శించి దానివల్ల వచ్చిన ధనమును వ్యయములు పోగా మిగిలినమొత్తమును తమయొద్ద నిలువయుంచి 1943 డిశంబరు మొదలుకొని నెలకు నలుబదిరూపాయలు చొప్పున బంపుచున్నారు.

ఆ నాటకప్రదర్శనమునాటిరాత్రి మహాసభలో తూర్పుగోదావరిజిల్లా మోరి గ్రామనివాసులైన శ్రీ కుందెం సత్యనారాయణగారను నొక యుదారశీలుడు ముందుకువచ్చి "బ్రహ్మశ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహముగారు జీవించినంతకాలము వారికి నెలయొకటికి పదిరూపాయలు బంపుదు"నని వాగ్దానము జేసిరట. సత్యసంధులైన యా సత్యనాయణగారు ప్రతినెలకు నయిదారు తారీఖులలోపుననే పంపి ప్రతిజ్ఞాపాలనము చేయుచున్నారు.

1943 వ సంవత్సరమునందే పడమటి గోదావరిజిల్లా పెనుకొండ గ్రామనివాసులైన జవ్వాది లక్ష్మయ్యనాయుడుగారు తమ గ్రామమున శ్రీశ్రీశ్రీ విక్రమదేవవర్మగారి యాధిపత్యమున జరిగిన యొక మహాసభకు నన్నుగూడ నాహ్వానించిరి. నేనాసభకు వారు బంపిన మోటారుమీద వెళ్ళితిని. నాటిసభలో శ్రీ లక్ష్మయ్యనాయుడుగారు నెలకు పదిరూపాయల

వంతున యావజ్జీవము బంపుదుమని వాగ్దానముజేసిరి. ఆ వాగ్దానము ప్రకారము వారు నాకు బంపుచున్నారు. ఈవిధముగ నేను కాలక్షేపము జేయుచు నీ గ్రంథమును సమాప్తము చేయగలిగితిని. నేనుజేసిన స్వల్పదేశసేవను, భాషాసేవను గుర్తించి యాంధ్రదేశస్థులలో గొందరు నాయందభిమానము గలిగి చేయుచున్న యీ సహాయమునకు వారికెంతయు కృతజ్ఞుడను.

1944 వ సంవత్సరమున రాజమహేంద్రవర నివాసులును శ్రీన్యాపతి సుబ్బారావుపంతులుగారి కుమారులును నైన శ్రీ న్యాపతి కామేశ్వరరావు పంతులుగారు తమ తండ్రిగారిపేర నేనిరువదియైదువందలకు వ్రాసియిచ్చిన ప్రామిసరీనోటు, ఒకటిపాయియైనను నావల్ల పుచ్చుకొనకుండ నోటు చెల్లువ్రాసి నాకు బంపివేసిరి. ఆహాహా! ఎంత యౌదార్యము, యెంత యభిమానము, యెంత త్యాగము! నా కృతజ్ఞత దెలియజేయుటకు మాటలు చాలవు. ఈ కామేశ్వరరావుగారికే గాక తమ తండ్రిగారైన శ్రీ న్యాపతి సుబ్బారావుపంతులుగారికి గూడ నాయందత్యంతాభిమానమే కాబట్టి యీ కామేశ్వరరావుగారికి నాయందభిమానము వంశక్రమాగతమైనదే.

కృ త జ్ఞ త

సామాన్యగృహస్థులయ్యు ధనవ్యయమునకు వెనుకదీయక ధనము ఖర్చుపెట్టి నాచే నీ గ్రంథము వ్రాయించిన శ్రీ విస్సా అప్పారావుగారికిని, శ్రీ రాయసము వెంకటశివుడుగారికిని, వేలకొలది ధనము వెచ్చబెట్టి గ్రంథ మచ్చువేయించి యాంధ్రమహాజనుల కొసంగిన ఆంధ్రాభ్యుదయ రచయితల సంఘమువారికిని, మొదటినుండియు ననేకవిధముల నాకు సహాయముజేసిన మహానీయులకును, నా కన్నతల్లియైన యాంధ్రదేశమునకును, డెబ్బదియెని మిది వత్సరములు నాకు దీర్ఘాయురారోగ్యముల నిచ్చి నాచే నీ గ్రంథమును వ్రాయించిన జగత్పితయైన పరమేశ్వరునకును, కృతజ్ఞతాపూర్వక వందన సహస్రములర్పించి విరమించుచున్నాను.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

స్వీ య చ రి త్ర ము స మా ప్త ము.

సింహావలోకనము

నా జీవితకాలములో నాంధ్రదేశమునందు నెన్నో మార్పులు జరిగినవి. నా చిన్నతనమునందు కందుకూరి వీరేశలింగముగారు సంఘ సంస్కరణ మారంభించిరి. ఆయన మొట్టమొదట నుద్యోగస్తులు లంచ ములు పుచ్చుకొనకుండ జేయవలయుననియు, వివాహాది శుభకార్యములలో భోగముమేళములు పెట్టకుండ జేయవలయుననియు, మగపెండ్లివారు దురాశచే నాడుపెండ్లివారిని గొప్పకట్నములు తెమ్మని బాధించకుండ జేయ వలయుననియు, నుద్యోగస్తులు, ప్లీడరులు భోగమువాండ్ర నుంచుకొనకుండ జేయవలయుననియు, సంకల్పించి, పిమ్మట వితంతు వివాహముల నారం భించిరి. ఈ సంకల్పములలో వీరేశలింగముగారు చాలవరకు కృతార్థులైరి. ఒక గవర్నమెంటు ప్లీడరుయొక్కయు, నొక డిస్ట్రిక్టుమునసబుయొక్కయు నాత్మహత్యలతో లంచగొండుల సంఖ్య కొంతకాలము చాలవరకుతగ్గినది.

పూర్వకాల మాంగ్లేయ విద్యరాని యుద్యోగస్తులే లంచగొండులుగ నుండెడివారు. ఆంగ్లేయ విద్యనేర్చినవారికి గొప్ప యుద్యోగములిచ్చిన పక్షమున లంచగొండితనము చాలవరకు తగ్గిపోవునని జిల్లాకలెక్టరులు, జిల్లాజడ్జీలు మొదలగువా రాంగ్లేయవిద్య నేర్చినవారికే నుద్యోగములనీయ నారంభించిరి. కాని వారుకూడ వెనుకటివారి దారినేత్రొక్కి, రెండుచేతుల లంచముల నందుకొన నారంభించిరి. ధన మెంతవారినైన భ్రమపెట్టును గదా! శాస్త్రమెంత జదివినప్పటికి దుర్జనుడు సజ్జనుడుకాడు. మైనాక పర్వ తము లక్షలకొలది యేండ్లు సముద్రములోనున్నను లేశమైన మెత్తపడ లేదు. అట్లే దుర్జనుడు బహుశాస్త్ర పారంగతుడైనను మంచివాడు కానే రడు. ఆవిషయమై దేశస్థితి యించుమించుగ మునుపటివలెనేయున్నది. కోర్టులలో బనియుండి పనము వెళ్ళినపక్షమున, యెక్కడనో ముగ్గురు నలుగురుతప్ప తక్కినవారందరు చేయి జాపువారే. వీరందరు పరీక్షల యందు గృతార్థులైనవారే! దీని ముఖ్యకారణము దారిద్ర్యమేయని నా యభి ప్రాయము. గుమాస్తాలకు కుటుంబముపెరిగి ఖర్చు లెక్కువైనవి. దానికి దోడుగ జీతములు తక్కువ. రాజబంధువు లగుటచేకాబోలు నాంగ్లేయు లకు ప్రతిశాఖలోను జీతములెక్కువ. మనవారికిగూడ నధికారులు తగిన జీతము లిచ్చినపక్షమున లంచగొండితనములు మనదేశములో నిర్మూలన

మగును. అంతవరకు నిది ప్రతిశాఖలోను నుండెడిదే. గృహమందు తండులములు లేనపుడు గుమాస్తా లంచములుపట్టక, తప్పుడువ్రాతలు వ్రాయక, దారాపుత్రులను మాడ్చి చంపునా? కష్టస్థితిలో నీతిమంతులై యుండుట దుర్లభము. ఇక భోగముమేళములమాట జూతము.

వివాహాది శుభకార్యములలో నాంగ్లేయ విద్యాభ్యాసముజేసిన యుద్యోగస్తులు, న్యాయవాదులు భోగముమేళముపెట్టుటమానిరి ఇప్పటికిని మిక్కిలి పల్లెటూళ్ళయందును, వైశ్యులు మొదలైనవారి యిండ్లయందును భోగముమేళము లేనిపక్షమున శోభస్కరముగాదనియు, నలుగురు జేర రనియు వేశ్యలకాదరణము జరుగుచున్నది. ఈ వేశ్యా నిరసనమును గురించి వీరేశలింగముగారేగాక, రఘుపతి వెంకటరత్నముగారును కృషి జేసిరి. వారితో నేనును మహోపన్యాసములుచేసియు, పత్రికలలో వ్రాసియు, పనిచేసితిని. మేము చేసినపనికి ఫలితములు కనపడినందుకు సంతసించు చున్నాను.

వివాహముల యందలి కట్నములు లేకుండ చేయవలెనని వీరేశ లింగము పంతులుగారు చాల శ్రమ పడిరి. వారితోబాటు నేనును మొదటి నుండియు యేకీభవించుచున్నాను. కాని యీ విషయమై యెంత రెంత ప్రయత్నము జేసినను మంచి ఫలితములు కనబడలేదు. విద్యావంతులీ విషయమున ముందంజవేసి, మార్గదర్శకు లౌదురని మే మాశించితిమి. గాని మా యాశ నిరాశయైనది. విద్యావంతులైనకొలది పెండ్లికొడుకుల కును, వారి తలిదండ్రులకును, ధనాకారోగము క్రమక్రమముగ హెచ్చినది. అది చికిత్సకు సాధ్యమగునట్లు తోచదు. గొడ్లను కటికివాని కమ్ముకొన్నట్లు తండ్రి కన్నకూతును ముసలివానికో మూర్ఖునకో దరిద్రునకో కొన్ని వందల రూపాయల కమ్ముకొనుట యెంత పాడుపనియో పిల్లవానికి కట్నము పుచ్చుకొనుట గూడ నంత పాడుపనియే. ఈ విషయమై చాల కాలము బహువిధములుగ పత్రికలలో వ్రాసియు, వేదికలపైనుండి యుప న్యాసము లిచ్చియు, ప్రబోధము జేసితిమి. కాని యది బూడిదలోబోసిన పన్నీరైనది. వివాహముల విషయమై యాడుపిల్లల తలిదండ్రులు తమ పుత్రికలకు మంచి వరులను దేవలెనని ఋణములనుజేసి, యవి దీర్చలేక, గృహారామక్షేత్రములను విక్రయించుకొని, దరిద్రావస్థల పాలగుచున్నారు. ఆడ పెండ్లివారు తమకు గులాములని మనసులో మగ పెండ్లివారు భావించి, యాడుపెండ్లివారి కొంపలు బందిపోటు దొంగలవలె దోచు

కొనుచున్నారు. ఈ దురభ్యాస మడుగంటినగాని దేశము బాగుపడదు. విద్యావంతులైన యువకులు గొందరు బయలుదేరి, యాడుపెండ్లివారు కట్నము లిచ్చెదమని చెప్పినను, తలిదండ్రులు తీసికొనుటకు బలవంత పెట్టినను, ధైర్యముబూని వారి మాట నిరాకరించి. నీతిమంతులై కట్నములు, కానుకలు, లాంచనములు దీసికొనకుండ వివాహము చేసికొన్న పక్షమున నీ దురాచారము తుదముట్టును. దేశాభిమానము గలవారట్టి యువకులను దగినట్లు ప్రోత్సాహపరచి, యట్టి వివాహములనే ప్రశంసింప వలెను. పిల్ల నమ్ముకొన్నవాని నెంతనీచముగ మనము జూచుచున్నామో, కట్నము బుచ్చుకొన్న తండ్రిని గూడ నంత నీచముగ జూచి నిరసింప వలెను. కట్నము దీసికొనుట గౌరవమని భావించుట దేశములో నశింప వలెను. అది నీచమనియు, నవనీతి యనియు, జనులలో భావమేర్పడ వలెను ఇది పూర్వ మగ్రజాతులలోనే యుండెడిది. గాని క్రమముగ నంటువ్యాధివలె నన్ని జాతులలోనికి వ్యాపించినది. ఇది ముఖ్యముగ వైశ్యులలోను, కమ్మవారిలోను, హెచ్చుగనున్నది. దీనికి కారణము, వారు మిక్కిలి ధనవంతులగుట. ధనమున్నపక్షమున, ధర్మకార్యములుజేసి సంస్థల నేర్పరచి జేయవలసిన పనులెన్నియేని గలవు. అంతియేగాని యది వరకే భాగ్యవంతుడై ధనముతో తులతూగుచున్న పెండ్లి కొడుకులకు వివాహకాలమున మంగళస్నానములతోబాటు కనకాభిషేకముచేయుట శ్రేయస్కరముగాదు. గుణవంతుడైన మరియొక బీదపెండ్లికొడుకునుదెచ్చి యాధనమతనికి కట్నముగనిచ్చి, పిల్లనిచ్చినపక్షమున నట్టిదంపతులు చిర సౌఖ్యమునందుదురు.

సంఘసంస్కరణములో వితంతువివాహము మిక్కిలి ముఖ్యమైనది. ఈ యుత్కృష్టకార్యమునిమిత్తమై వీరేశలింగముగారు తమ యావజ్జీవము ధారపోసిరి. ఈ సంస్కరణములో వీరేశలింగముగారిభార్య రాజ్యలక్ష్మమ్మగారు సర్వవిధముల భర్తకు తోడుపడి, సహధర్మచారిణీయను మాట సార్థకముజేసినది. ఆమె తోడ్పాటులేనిపక్షమున వీరేశలింగముగారా కార్యమున కృతకృత్యులుగాకపోయియుందురు. పండితులు, పామరులు, బంధువులు, మిత్రులు, వేయేల—దేశస్థులందరు ప్రతిరేకభావముజూపినను జందూమారుతముల కించుకేనియు గదలని హిమాలయపర్వతమువలె ధైర్యముబూనినిలిచి స్వాములవారి యాంక్షలకు, కులమువారి నిరాదరణమునకు, వెరుపక పంతులుగారు నిరాటంకముగ తాముపూనినపని కొనసాగించిరి.

వివాహముకంటె ముఖ్యమైనది వితంతుశరణాలయస్థాపనము. వితంతువుల దుర్దశదొలగించుటకీశరణాలయమును వారుస్థాపించిరి. ఈశరణాలయ నిర్వహణమునందు నేనును వారికించుక తోడ్పడితిని. నాయెడవారికి మిక్కిలి గౌరవమును, దయయునుండెడివి.

వితంతువివాహములు పంతులుగారు జీవించినకాలమున జరిగినట్లు నేడంత విజృంభణముగ జరుగుటలేదు. వివాహములు విశేషముగ జరుగవలెనన్న వితంతుబాలికల తలిదండ్రులు సామాన్యవివాహములవలెనే తమయిండ్లలో వివాహములు చేయవలెను. మనయువకులుగూడ కట్నములకు, కానుకలకు నాశపడక, స్వార్థత్యాగముజేసి గుణవతులు, విద్యావతులు, సద్వంశజాతలునైన బాలవితంతువులను వివాహమాడవలెను.

వీరేశలింగమువారివంటి ధైర్యవంతులు దేశమున బయలుదేరి యీ సంస్కరణమును జేపట్టిన నది దేశమంతటను వ్యాపించును. వీరేశలింగముగారు వారియనుచరులు కష్టపడి యెంతప్రబోధముజేసినను సంఘమింకను గాఢనిద్రనుండి మేలుకొనలేదు. ఈ కుంభకర్ణనిద్రనుండి సంఘమును మేలుకొలుపుట కష్టసాధ్యముగ దోచుచున్నది. ప్రౌఢవివాహములు జేసినపక్షమున బాలవితంతువులసంఖ్య కొంతవరకు క్షీణమగునేమోయని తోచుచున్నది. కాని యీ విషయమునగూడా సంఘము ముందంజవేయుట లేదు. తలిదండ్రులు రజస్వలలైనపిల్లలకు రజస్వలలుగాలేదని బొంకులు బొంకి, వివాహములుచేయుచున్నారుగాని, ధైర్యముబూని సత్యముపలుకుట లేదు. ఈవిషయమున బ్రాహ్మణ, వైశ్యులకంటె క్షత్రియులు, శూద్రులు ప్రశంసనీయులు. వారికులాచారము చిన్నబిడ్డలకే వివాహనులు చేయుమని వారిని నిర్బంధించుటలేదు. పూర్వకాలమున బ్రాహ్మణులలోగూడ రజస్వలలైన కన్యకలకే వివాహములు జరిగినట్లు పురాణములలోను, కావ్య, నాటకములలోను స్పష్టముగ వ్రాయబడియున్నది.

ప్రాచీనకాలమునుండియు హిందూసంఘముననెన్నో సంస్కరణములుజరిగినట్లు మన మతగ్రంథములలోనుండినను, వాటిని లెక్కసేయక, మహాపండితులుసయితము, పామరులట్లె మూఢవిశ్వాసములకులోనై, "గతానుగతికో లోకోనలోకః పారమార్థికః" యను లోకోక్తినిబట్టి వారు జేయుచున్నారనివీరు, వీరుజేయుచున్నారనివారు జనులు వెనుకటి పుంతనే బోవుచున్నారు. సంఘసంస్కరణవిషయమున మునుపటివలె ప్రబోధము గూడలేదు. పూర్వము రాజకీయవిషయమున నేటేట జిల్లాసభలు జరుగు

చుండెడివి. ఆసభలతోపాటు సంఘసంస్కరణ సభలుగూడ జరుగు చుండెడివి. కొంతకాలమునుండి రాజకీయసభ లంతరించినవి. వానితో పాటు సంస్కరణ సభలుగూడ మటుమాయమైనవి. రాజకీయసభల మాటటుండగ సంఘసంస్కరణసభలు ప్రతి మండలములోనున్న నాయకులు ప్రతి సంవత్సరముజరిపి ప్రబోధముజేసిన బాగుండును. రాజకీయ విషయములు దొరతనమువారి యధీనములోనివి. సాంఘికవిషయములు మనచేతిలో నున్నవేగనుక, మనమే వాటిని చక్కపరుచుకోవలెను.

మ త స్థి తి

1828 వ సంవత్సరమున రాజారామమోహనరాయలు బంగాళాదేశమున బ్రహ్మసమాజమతము స్థాపించెను. ఆగాలి దక్షిణముగ వీచినందున నేకేశ్వరారాధనముజేయింపదలచి వీరేశలింగముగారు 1878లో నొకప్రార్థన సమాజమును రాజమహేంద్రవరమున స్థాపించిరి. కొందరయువకులాయన చుట్టునుచేరి ప్రతివారము పరబ్రహ్మమునుగూర్చి నిర్గుణముగ ప్రార్థనములు చేయజొచ్చిరి.బ్రహ్మమతవ్యాప్తికై బంగాళాదేశమునుండి బిపినచంద్రపాలు, శివనాధశాస్త్రి మొదలగువా రాంధ్రదేశమువచ్చి బ్రహ్మమతమునుగూర్చి ప్రబోధముజేసిరి. క్రమముగ వీరేశలింగముగారికా సిద్ధాంతములు రుచించినందున వారు 1906 వ సంవత్సరమున ననుష్ఠానిక బ్రహ్మమతస్థులైరి. అనగ యజ్ఞోపవీతమునుత్యజించుట, కర్మలుమానుట, జాతిభేదము పాటింపకుండుట. కొందరయువకులు వారిమార్గము ననుసరించిరి. నాటనుండి బ్రహ్మసమాజము వెలసినది. వీరికిదోడుగ శ్రీ రఘుపతి వేంకటరత్నము నాయుడుగారుకూడ బ్రహ్మమతావలంబకులై కాకినాడలోని కళాశాల కధ్యక్షులుగవచ్చి యచ్చటగూడ బ్రహ్మసమాజబీజములునాటిరి. అది కొంత కాలమచట వృద్ధిపొందెను. ఆంధ్రదేశములో పెక్కు ప్రార్థనసమాజములు స్థాపింపబడెను. వీరేశలింగముగారును, నాయుడుగారును గతించినతరువాత బ్రహ్మమతము క్షీణించుచున్నది. మనదేశములోనున్న బ్రహ్మమతస్థులను వ్రేళ్ళమీద లెక్కపెట్టవచ్చును. ఎందుచేతనో మనదేశమున బ్రహ్మమత వృక్షమేపుగబెరుగలేదు. అది మనదేశ విరుద్ధమైనమతము గాకపోయినను, మహర్షి సమ్మతమై యుపనిషన్మతమైనను పూర్వము బౌద్ధమత, జైనమతములకు స్థానమిచ్చిన యాంధ్రదేశము నేడీపరిశుద్ధాస్తికమతమునకు నాశ్రయమియ్యకపోవుట మిక్కిలి శోచనీయము. నాకీమతమునం దత్యంతాభిమా

నముగలదు. ఈ మత మవలంబించినవారికి మూఢవిశ్వాసములుండవు. బంగాళాదేశమునందిది బాగుగవ్యాపించినది.

రాధాస్వామి మతము మనదేశమున నెక్కువగ వ్యాపించుచున్నది. దాని యందు నా కెంతమాత్రము విశ్వాసములేదు. కాని వారు చేయుచున్న పరిశ్రమలు మాత్రము మిక్కిలి శ్లాఘాపాత్రములు.

ఆర్యసమాజ మతము మన యాంధ్రదేశమున నించుమించుగ లేనే లేదని చెప్పవచ్చును.

దివ్యజ్ఞాన సమాజములుమట్టుకు మన యాంధ్రదేశమున నెల్ల యడల నున్నవి. దివ్యజ్ఞానసమాజ మొక మతముగాదు. దానిసిద్ధాంతము లుదారభావములు గలిగియున్నవి. నాకు దానియందును విశ్వాసములేదు. చిన్ననాడు నేనొకసారి కొందరు మిత్రుల ప్రోత్సాహముచేత దివ్యజ్ఞాన సమాజికుడనై తినిగాని తరువాత మానుకొంటిని.

నిమ్నజాత్యుద్ధరణము

గొప్ప సమస్యలలో నిదియొకటి. మన హిందూదేశములో నిమ్న జాతులవారు రమారమి యారుకోట్లమంది యున్నారు. వీరి యవస్థ పశువుల యవస్థకన్న దీనముగ నున్నది. వీరి సంఖ్య క్రమక్రమముగ తగ్గుచున్నది. ఏమన నొకవంక క్రైస్తవులు, మరియొకవంక మహమ్మదీయులు, వారినిజేరదీసి తమతమ మతములలో గలుపుకొనుచున్నారు. దీనికు త్తరవాదు లెవరన్న నగ్రజాతులమని విఱ్ఱవీగుచున్న బ్రహ్మ, క్షత్రియ, వైశ్య, శూద్రులే. ఈ వర్ణములవారు పంచములు మొదలైన నిమ్నజాతులచేత తపకు గావలసిన సేవలన్నియు జేయించుకొని, వారిని యిండ్లకు రానీయక దరికి చేరనీయక యంటరానివారనియు, చెప్పరానివారనియు, వారికసహ్యములై నపేళ్లు పెట్టి హీనముగ జూచుచున్నారు. పశువులు మన యింట నుండవచ్చును. కుక్కలుండవచ్చును. కాని పంచములుమట్టుకు మన గృహావరణములోనికి రాగూడదు. వారు మన పశువులను మేపవచ్చును. కాని మనము నోరు విచ్చి వారితో మాటలనైన నాడజాలము. వారు భగవంతునిచే సృష్టింపబడిన మనుష్యులే యనియు, నగ్రవర్ణములవారి కున్నట్లే వారికి గూడ తృప్తిపాసలు, సుఖదుఃఖములు గలవనియు మన వారు తలంపరు. తలంచిన పక్షమున వారి నాశీతిగ నుంచుదురా?

మనదేశములో ధనవంతులు లేకపోలేదు, విజ్ఞానవంతులు లేకపోలేదు. వేలకొలది ధనము వెచ్చించి పేరు, ప్రతిష్ఠలకై సత్రములు, సావడులుగట్టించి, సంతర్పణములు సమారాధనలు చేయింతురుగాని, మూలపల్లి యవస్థనుజూచి దానిని బాగుచేయుటకై ప్రయత్నించువారు లేరుగదా! వారుండుపల్లెలు గ్రామమునకు వెలుపలనుండి దుర్గంధ భూయిష్టములై, హేయములై, మానవులు వసించుటకు వీలుగనుండవని యెవ్వరెరుంగరు? మనదేశమున ననేక పండితులుగలరు వారిలో ననేకులు భగవద్గీత జదివి యుందురు. అందు శ్రీకృష్ణ భగవానుడు చెప్పిన యీక్రింది శ్లోకమును వారు పలుమారు పఠించియే యుందురు.

శ్లో॥ విద్యా వినయ సంపన్నే
బ్రాహ్మణే గవి హస్తిని
శుని చైవశ్వపాకేచ
పండితా స్సమదర్శినః॥

దీనికి తిక్కన సోమయాజి మహాభారతమునందు పద్యమిట్లు వ్రాసినాడు.

చ॥ వినయము విద్యయుం గలుగు విప్రునియందును గోవునందు నొ
ప్పు నెరయు హస్తియందు నొక పోకకుబోవని కుక్కయందు దా
ని నడచితెచ్చి వండి తిను నీచపు మాలనియందు తుల్యద
ర్శనులు తదంతరాత్ముని నిరంజనునిం గను పండితోత్తముల్॥

భగవద్గీతా పారాయణము జేయునట్టియు, పంచమవేదమైన భారతము చదువునట్టియు, వినునట్టియు సగ్రజాతులవారందరు పై శ్లోకమును నోటితో పఠించుటయేగాని మనసునకు పట్టించుకొనరు. హిందువులందరి చేత భగవంతుడని సేవింపబడుచున్న శ్రీకృష్ణ భగవానునిమాటలయందే మనవారికి లక్ష్యము లేనప్పుడు నిమ్నజాతుల నుద్ధరింపుదోయని మొర వెట్టు నీనాటి నవనాగరికులమాటయందు లక్ష్యముండునా?

హిందూదేశమందలి యితరభాగములందువలెనే మన యాంధ్ర దేశమునగూడ నీ సమస్య జనుల నాకర్షించినది. శ్రీ పిఠాపురము మహారాజుగారు పంచమ బాలబాలికలకై రెండు వసతిగృహము లేర్పరచి, యన్నవస్త్రములిచ్చి, విద్యాబుద్ధులు గరపి, చాలకాలము పోషించిరి. వారి కళాశాలలోను, పాఠశాలలోను జీతములేకుండ పంచములకు జదువు

చెప్పించుచున్నారు. శ్రీ వీరేశలింగముగారుకూడ పంచమ బాలురకు తమ పాఠశాలలో నుచితముగ విద్య చెప్పించిరి. రఘుపతి వేంకటరత్నము నాయుడుగారుకూడ నీ సమస్యయందు మిక్కిలి యభిమానము గలవారు.

ఈ సమస్య నాకు మిక్కిలి యిష్టమైనది. ఉడుతభక్తిగ నేను గూడ పంచమోద్ధరణము గూర్చి పనిజేసితిని. 1909 వ సంవత్సరము "రామమోహన" పాఠశాల యను పేర నొక పాఠశాల స్థాపించితిని. మొదట పదిమంది విద్యార్థులే చేరినను, క్రమముగ నది నూటయేబదిమంది విద్యార్థులతో నిండియుండెను. ఏడుగురుపాధ్యాయులు బనిజేసిరి. విద్యార్థుల కుచితముగ పుస్తకములిచ్చి, నుచితముగ జదువుచెప్పించితిని. ఆ దినములలో నా పుస్తకములవల్ల నాకు మంచిరాబడి వచ్చుచుండినందున, నా స్వంత ధనముతోనే పాఠశాలను నిర్వహించుచుంటిని. శ్రీ పిఠాపురము మహారాజావారు గూడ దీనికి కొన్నివందల రూపాయలు సహాయముజేసిరి. ఈవిధముగ నే నా పాఠశాలను వ్యయప్రయాసలకోర్చి పదమూడు సంవత్సరములు నడిపి, నా స్వంతసొమ్ము మూడువేలరూపాయలు ఖర్చుపెట్టి, చిట్టచివరకు దానిని వదలుకొంటిని. నే నీ పాఠశాల నారంభింపక ముందు మన యాంధ్రదేశమున మరియెవరును నిమ్నజాతుల నిమిత్తమై ప్రత్యేకముగ పాఠశాలను పెట్టలేదు. ఇటీవల బోర్డువారు వారి నిమిత్తమై పాఠశాలల నచ్చటచ్చట బెట్టుచున్నారు.

భాగ్యవంతులు తమ ధనమును దేవాలయములక్రింద సత్రములక్రింద ఖర్చుపెట్టక, ఈ సమస్యను తీసుకొని నిమ్నజాత్యుద్ధరణము కొరకై వినియోగించిన మన దేశమునకు, మన జాతికి నెంతో మేలుకలుగును. ఆ జాతులవారు క్రైస్తవ, మహమ్మదీయులలో కలియకుందురు గనుక సనాతనమై యతి పవిత్రమైన మన హిందూమతము వృద్ధిపొందును.

స్త్రీ విద్య

విద్య పురుషుల కెంత యవసరమో స్త్రీలకుగూడ నంత యవసరమే యని నా యభిప్రాయము. భరతఖండము మిక్కిలి యెక్కువ నాగరికతగల దశలో నున్నకాలమున, హిందూస్త్రీలు విద్యావతులై యుండిరని, మన పురాణాది గ్రంథములు వేనోళ్ళ చాటుచున్నవి. వేదమంత్రములు రచియించినవారిలో కొందరు స్త్రీలు గూడ గలరు. వేదాంత విద్యాపారంగతులై, బ్రహ్మవేత్తలలో నగ్రగణ్యులై, జనకమహారాజునకు గురువై,

యాతనిచేత పలుమన్ననలు బడసిన యాజ్ఞవల్క్య మహాముని తో, జనక భూపాలుని సభలో గార్గియను నొకా నొక స్త్రీ రత్నము, వేదాంత విద్యా వాదముజేసి యా ముని ని పెక్కు-చిక్కు-లు పెట్టెను. స్త్రీలకు బ్రహ్మవిద్యాధి కారములేదని తెలియక వాదింతురు గాని, పురాణబ్రహ్మవాదియైన యాజ్ఞ వల్క్యమహాముని యే, తన ప్రియ భార్యయైన మైత్రేయికి, బ్రహ్మవిద్యోప దేశముచేసెనని, బృహదారణ్యకోపనిషత్తులో స్పష్టముగ చెప్పబడియున్నది. కావ్యనాట కాలంకారాది గ్రంథములలో గూడ స్త్రీలు పాండిత్యము సంపా దించి పేరువడసినట్లు మన గ్రంథములవల్ల దెలియుచున్నది. కాని కాలక్రమమున నేమికారణమునను స్త్రీలకు మనవారు మును పటి యున్నత స్థానము తప్పించి, వారి నధోగతిపాలు జేసిరి. ఈ యధఃపతనములో స్త్రీలకు విద్యాభ్యాసముగూడ తగదని మనపెద్దలు శాసించిరి. బాలికా పాఠశాలలకు యాడుబిడ్డలను బంపుటయే యరుదై పోయెను. గత శతాబ్దముయొక్క మధ్యభాగమునుండి యాంగ్లేయ విద్యా వంతులై నవారు తమ బిడ్డలను బాలికా పాఠశాలకు పంపదొడగిరి. అప్పుడు మనవారు మేలుకొని పూర్వకాలమునుండి మనలోనున్న స్త్రీవిద్య యవ సరమని పాశ్చాత్యులవలన మనవారు గ్రహింపవలసినంతటి దురవస్థ పట్టినది. స్త్రీ విద్యావిషయమున వీరేశలింగముగారు మిక్కి-లి కృషిచేసిరి. బాలికలకు పాఠశాలలు స్థాపించిరి. వారినిమి త్తమై సులభమైన గ్రంథములు వ్రాసిరి. ఈ మ యున్నత పాఠశాలలో బాలికల కుచితముగ విద్యచెప్పునట్లు శాసించిరి. వారును వారి యనుచరులును చేసిన కృషినిబట్టి స్త్రీవిద్య గౌరవనీయమైనదేగాని నింద్యముగాదని దేశస్థులలో సదభిప్రాయము బాలపరకేర్పడినది. దీనినిబట్టి యాంగ్లేయవిద్యయే ప్రధానమని నేదలంచి నట్లు మీ రభిప్రాయపడగూడదు. సంస్కృతాంధ్రములు మన బాలికలకు చెప్పించినను నా కిష్టమే. స్త్రీలు వీటియందున్నతవిద్యావతులగుట మిక్కి-లి శ్రేష్ఠమని నా యభిప్రాయము. ఆంగ్లేయవిద్య నేర్చుకొని మన పురుషులలో చాలమంది దేశాభిమానము, భాషాభిమానము, జాత్యభి మానము మరచి, మన కట్టుబాటులను పద్ధతులనురోసి, మద్యపానాది దుర భ్యాసముల కలవాటుపడి భ్రష్టులగుచున్నారు. స్త్రీలు లోకజ్ఞానముకొరకు నాంగ్లేయవిద్య నభ్యసింపవచ్చునుగాని, వారి యాచార వ్యవహారముల నవలంబించుట గర్హ్యమని నా యభిప్రాయము. స్త్రీ లేవిషయమున బని చేసినను మన భారతజాతి కట్టుబాటులను విసర్జింపక, వాటి ననుసరించి

కాలానుగుణముగ పనిచేయుట కర్తవ్యము. అరవభాషలో నవయారను నామెయు, నాంధ్రమున మొల్లయు, తరిగొండ వెంకమ్మయు, చక్కని కవిత్వముజెప్పి ప్రఖ్యాతిగాంచిరి. ఈనాటి మన యాంధ్ర స్త్రీలుగూడ వారి మార్గము ననుసరించుట శ్రేయస్కరము. ఈవిషయమున నా స్వవిషయము కొంత వ్రాయవలసి వచ్చినందులకు క్షమించవలెను. నా మేనకోడలైన శ్రీమతి రావూరి వెంకటసుబ్బమ్మ యిరువది రెండేండ్ల వయసున తన భర్తను గోలుపోయెను. అప్పటికామె కొక కుమార్తెగలదు. వారిరువురను నాయొద్ద నుంచుకొని నా యాశయము ననుసరించి యామెకు సంస్కృతాంధ్రములు చెప్పితిని. మిక్కిలి శ్రద్ధాభక్తులతో నామె విద్య కరచి, యుభయభాషాప్రవీణలో గృతార్థురాలై, 1928 వ సంవత్సరమున నాంధ్ర విశ్వవిద్యాపీఠమునొక్క పట్టమునుపొందెను. ఆంధ్ర విశ్వవిద్యాపీఠమున నీపట్టమునుపొందిన మొదటి స్త్రీ నామేనకోడలే యైనందుకు నేను సంతోషించుటయేగాక గర్వించుచున్నాను ఆమె యిప్పుడు రాజమహేంద్రవరమున దొరతనమువారి బాలికాపాఠశాలలో నాంధ్ర పండితురాలై నెలకు రువదిరూపాయలు వేతనముదీసికొనుచున్నది. స్త్రీవిద్యా విషయమున నాకు మొదటినుండియు నభిమానముగలదని దెలియజేయుటకు మరియొక్క యుదాహరణము చెప్పుచున్నాను. నే కాపురమున్న యింటి యజమానునియొక్క మఱదలు నిమిషకవి సీతాయమ్మయను నామె దురదృష్టమున బాల్యమునందే భర్తను గోలుపోయి, తనసోదరి యింటికివచ్చి యుండి తెనుగు తనకుజెప్పమని కోరినందున నేనామెకు నాంధ్రము జెప్పితిని. ఆమెచదివి పాండిత్యము సంపాదించి పెద్దతరగతులకుగూడ పాఠములు చెప్పగలిగిన సామర్థ్యము సంపాదించెను. నారెండవ మేనకోడలు కోట వెంకటరత్నమ్మగూడ భారత, భాగవతాదిగ్రంథములు చక్కగ చదువగలదు. ఆమెకుగూడ నేను గొంతప్రవేశము గలిగించితిని.

లలితకళలు

ఇందు ముఖ్యమైనది గానము. గానమునకు దక్షిణదేశము మిక్కిలి ప్రసిద్ధము. ఆంధ్రదేశమున గొప్ప గాయకులు మిక్కిలి యరుదుగనున్నారు. గానకళానిధియైన త్యాగరాజు తెనుగువాడెయైనను ద్రవిడదేశమున గాపురముండుటచేత గానరసమంతయు దక్షిణాత్యులకే పట్టినది. ఆంధ్రదేశమున నెవరియింటనైనను శుభకార్యము జరుగునపుడు దాక్షిణాత్య

గాయకులనే బిలిపించుచున్నారు. ఇది మిక్కిలి శోచనీయము. ఆ పాత మధురమైన గానరసము గ్రోలుటలో మనవారు వెనుకబడియుండుట మిక్కిలి విచారకరముగదా! ధనవంతులు దేశమున గానపాఠశాలలను నెలకొలిపి, యీ కళను మిక్కిలి యభివృద్ధిచేయుదురుగాక. మనము వారి పాండిత్యముజూచి దక్షిణాత్యులను బిలిపించుకొన్నచో దాక్షిణాత్యులు గానసభలనిమిత్తమై యాంధ్రగాయకులను పిలుపించుకొనవలసినంతటి యుత్తమస్థితి మన యాంధ్రదేశమునకు రావలెను. ఆ సుదినముకొరకు మనమెదురుచూచి సరియగు మార్గమున పనిచేయవలెను.

ఈ లలితకళలలో రెండవది చిత్రలేఖనము. ఇందు మన యాంధ్రులు కొంత ప్రజ్ఞను సంపాదించి పేరు వడయుచున్నారు. ఐనను, ఇది ప్రారంభ దశయందే యున్నది. ఇంకను బహువిధములుగ వృద్ధిపొందవలెను. శిల్పమునందుగూడ దాక్షిణాత్యులే మనవారికంటె నధికులు. ఏయన నచటనున్న యాలయములమీదను, యాలయములలోను గల శిల్పము భరతఖండమునందెచ్చటనులేదు. ఇది పాశ్చాత్యులనుగూడ నాశ్చర్య రసమున మగ్నముజేయుచున్నది. ఈ విషయమున నాంధ్రదేశములో శిల్పము లేనేలేదని చెప్పవలయును. ఇందు మన యాంధ్రులు దేశములోని నితరభాగములకుబోయి శిల్పకళను నేర్చుకొని, ప్రజ్ఞాధికులై, మన యాంధ్ర దేశమున నీ కళలను వృద్ధిపొందించుటకు ప్రయత్నములు చేయవలెను.

నాట్యకళ:—ఇది కులటా వృత్తివల్ల జీవించు వేశ్యల పాలగుటచే గాబోలు ప్రజలకు దీనియందు గౌరవాదరములులేవు. ఇదియు బ్రశస్తమైన కళలలో నొకటి. శుంగవంశస్థుడైన యగ్నిమిత్రమహారాజు తన ప్రియురాలైన యిరావతికిని, దనయింట నుండిన మాళవికకును, హరదత్తగణదాసులనెడు నాట్యాచార్యులచేత నాట్యము నేర్పించినట్లు, కాళిదాసమహాకవి తన మాళవికాగ్నిమిత్ర నాటకములో వర్ణించియున్నాడు. ఇదిగాక విరాటుడు యుక్తవయస్కురాలైన తన కూతురుత్తరకు బృహన్నలచేత నాట్యము నేర్పించినట్లు మహాభారతములో నున్నది. దీనినింబట్టి మగవారుగూడ నీ విద్యను నేర్చుకొన్నట్లు, రాజులు తమ యంతఃపుర స్త్రీలకు నేర్పించినట్లును స్థిరపడుచున్నది. ఈ విద్య నేర్పినవారు పూర్వము కూచిపూడి భాగవతులలో నెక్కువగ నుండెడివారు. ఇప్పుడుకూడ కొందరున్నారు. నాట్యాభినయమునం దభిరుచిగల యాంధ్రులీ విద్య తమ చిన్న పిల్లలకు నేర్పించిన బాగుండును. కళవృద్ధి పొందును.

భాషాసంస్కరణము

రమారమి ముప్పది సంవత్సరముల క్రిందట గ్రంథములలోగూడ వ్యాకరణ విరుద్ధమైన వ్యావహారికభాషనే వాడవలయునని యొకవాదము బయలుదేరినది. ఈ వాదము లేవదీసినవారు, మహారాజ శ్రీ గిడుగు రామమూర్తి పంతులుగారును, గురజాడ అప్పారావు పంతులుగారును. ఇందు రామమూర్తిపంతులుగారు సంస్కృతాంధ్రభాషలయందు గొప్ప పండితులు. వారివాదముతో నేనేకీభవింపకపోయినను వారియెడ నాకత్యంత గౌరవాభిమానములుగలవు. వ్యావహారిక భాషయను మారుపేరుపెట్టి, గ్రామ్యమునే గ్రంథములో వాడుట నాకెంతమాత్ర మిష్టములేదు. అట్లు వాడుట భాషను నాశనముచేయుటగాని, వృద్ధిచేయుటగాదని నాదృఢవిశ్వాసము. వారి యనుచరులనుని పేరుపెట్టుకొని కొందరు మిక్కిలి యశ్లీలములు, నసభ్యములు, హేయములు నైన గ్రంథములు వ్రాయుచున్నారు. భాష మాటయటుండగ మన సాంప్రదాయములకు విరుద్ధములైన వ్రాతలు వ్రాయుచున్నారు. సీత, సావిత్రి మొదలగు మహా పతివ్రతలకు గూడ దోషములారోపించి గ్రంథములలో వ్రాయుచున్నారు. దీనినిబట్టి మన భాషయు, పవిత్రాశయములు, నెంతటి దుస్థితిలోనికి వచ్చినవో గ్రహింప వచ్చును. ఇందు కుదాహరణములు గావలసినవారు నామిత్రులు బ్రహ్మశ్రీ కాశీభట్ల సుబ్బయ్యశాస్త్రిగారు వ్రాసిన "సాహిత్యకళ" యను గ్రంథము చూడవచ్చును. వ్యావహారిక భాష సులభముగ నందరకు దెలియునని వారు వాదింతురు. వేమన సలక్షణమైన భాషలో వ్రాసినను నామహాత్ముని కవిత్వ మెల్లరకుం దెలియుటలేదా? అంతకంటె సులభముగ కవిత్వము జెప్పగల కవి మరియొకడుగలడా? శ్రీ వీరేశలింగముగారికంటె వచనము సులభముగ వ్రాయగలవారు మరియొకరు గలరా? ఆయన సలక్షణమైన భాషను చాడిరిగదా? కావున వ్యావహారికభాష గ్రంథములలో వాడగూడ దని నేను త్రికరణశుద్ధిగ నొక్కి చెప్పుచున్నాను.

రాజకీయ సంస్కరణము

1905 వ సంవత్సరము మొదలుకొని రాజకీయసంక్షోభను దేశములో జరుగుచున్నది. స్వరాజ్యసంపాదనము దీనిముఖ్యోద్దేశము. ఇందు మన యాంధ్రదేశముగూడ పాల్గొన్నది. విదేశవస్తు బహిష్కారము, స్వదేశవస్తు ప్రోత్సాహము స్వరాజ్యసంపాదనకు సాధనములుగ మన

పెద్ద లేర్పాటుచేసినారు. స్వదేశవస్తువు కొంతవరకు వాడబడుచున్నది. కాని యీకృషి యింకను చాలదు. వస్త్రమేగాక యితర వస్తువులుగూడ స్వదేశమం దుత్పత్తియైనవే వాడుట శ్రేయస్కరము. ఇంచుమించుగ సమస్తవస్తువులకు మనము విదేశీయులపై నాధారపడుట లజ్జాకరము. ఈవిధముగ బ్రతుకుచున్నజాతి ప్రపంచమున మరియొకటి లేదని నా నమ్మకము. గాఢ దేశాభిమానమున్న పక్షమున స్వదేశవస్తు ప్రోత్సాహము విశేషముగ జరుగును. ఇది మనవారి కుండవలసినంత లేదు. అది దృఢముగనున్న పక్షమున మనదేశములో నొక్క విదేశస్తువు ఖర్చుపడునా? అట్టివ్యాపారము జేయువారు తమ యంగళ్లు కట్టిపెట్టుకొని పోరా?

ఆంధ్రులు గొప్పజాతివారు. వారల పూర్వచరిత్రము మిక్కిలి ప్రసిద్ధమైనది. ఆంధ్రవంశపురాజులు మగధరాజ్యమునుజయించి నాలుగువందల సంవత్సరము లవిచ్ఛిన్నముగ పరిపాలించిరి. పల్నాటివీరులయొక్కయు, బొబ్బిలి మొగలగు వెలమసంస్థానములయందలి స్త్రీపురుషులయొక్కయు తేజము శౌర్యము జగత్ప్రసిద్ధములుగదా. దేశాభివృద్ధి పొందవలెనన్న తీవ్ర దేశాభిమానము, స్వార్థత్యాగము స్త్రీలనక పురుషులనక యూబాల గోపాలమునకుండవలసినదే. దేశాభిమానమే మన మతముగనుండవలెను. దేశ మాతృపూజయే ప్రత్యాంధ్రుడు నీమముగ నాచరించవలెను. ప్రతి గృహము దేశమాతృదేవత యాలయముగ నుండవలెను. గృహ యజమానుడు దాని యర్చకుడు. దీనికి దేశములో నైకమత్యము విశేషముగ నుండవలెను. "ఐకమత్యము" అను పంచాక్షరీ మహామంత్రము ప్రతి మానవుడు పునశ్చరణముజేసి యాచరింపవలెను. బ్రాహ్మణ బ్రాహ్మణేతర సమస్య రూపుమాసిపోవలెను. హిందూ-మహమ్మదీయ సమస్యగూడ నసిసిపోవలెను. అందరము భారతమాతయొక్క యనుంగుబిడ్డలమేయన్న భావము ప్రబలవలెను. విశ్వమానవ సౌభ్రాతృత్వము నుపన్యాసముల వల్లను, గ్రంథములవల్లను సమర్థులైనవారు దేశమునకు ప్రబోధము చేయవలెను. హిందువులు, మహమ్మదీయులు బ్రాహ్మణులు, బ్రాహ్మణేతరులు, నిమ్నజాతులు వేఱుకొలది యేండ్లనుండి, యిక్కడనే పుట్టి యిక్కడనే బెరిగి, యిక్కడ గాలి పీల్చి, యిక్కడ నీరుద్రావి యిక్కడి పాడిపంట లనుభవించి, భారతమాతృస్తన్యపానముజేసి యిచ్చటనే వర్ధిల్లిరి. పరస్పర ద్వేషములు వినాశకారకములుగాని, శ్రేయోదాయకములుగావు. పేదసాదలను భేదముండకూడదు. శ్రీరాముడెవరు?

బ్రాహ్మణేతరుడు గాడా ? వారలను భగవంతుడని యన్ని వర్ణములవారు పూజించుటలేదా ? పన్నిద్దరాళ్వార్లలో బెక్కండ్రు బ్రాహ్మణేతరులులేరా ? వారిని దేవతార్చన పెట్టెలోనుంచుకొని పూజించుటలేదా ? భారతము బ్రాహ్మణేతరులైన పాండవుల చరిత్ర మేగదా ? దానికి పంచమవేదమని పేరు పెట్టి దానిని బ్రాహ్మణులు పారాయణము జేయుటలేదా ? విశ్వామిత్రుడు బ్రాహ్మణేతరుడుగాడా ? మహాపవిత్రమైన గాయత్రీమంత్ర మతడుగాదా నిర్మించినది. వేదవ్యాసుడెవరు ? పల్లెదానికొడుకు. ఆతడే పంచమవేద రచయిత. అతడే నాలుగువేదములు విభజించెను. అతడే పదునెనిమిది పురాణములు రచియించెను. ఆతడే బ్రహ్మజ్ఞాన గర్భితములైన బ్రహ్మ సూత్రములు రచియించెను. వాటినన్నిటిని బ్రాహ్మణాదులు శిరసావహించుటలేదా ? బ్రాహ్మణేతరు లెవరు ? బ్రాహ్మణులెవ్వరు ? చలికి, వానకు, నెండకు, లెక్కసేయక నేలదున్ని పంటలు పండించి మన కన్నముపెట్టిన వారెవరు ? బ్రాహ్మణేతర సోదరులుగాదా ? ఒక కుటుంబములోనివారు తలకొక పనినిబూని కుటుంబరక్షణము జేసికొన్నట్లు దేశమునందలి యన్ని జాతులవారు తలకొక పరిశ్రమను బూని దేశరక్షణము జేయవలదా ? అది మనకర్తవ్యముగాదా ? జ్ఞానముగల మనుష్యులు హీనమైన పశువులు, కుక్కలువలె కొట్లాడుకొనుట, కాట్లాడుకొనుట ధర్మమా ? జంతువులకు మనకు భేదముండవలదా ? ఐకమత్యము సర్వార్థ సాధకము. ఐకమత్య ముండుటచేతనే గదా గాలి కెగిరిపోవు గడ్డిపోచలు వెంటిగ నల్లబడి మదపుటేనుగును బంధింపగలవు ? ఐకమత్యముచేతనేగదా చిన్నిచిన్ని మర్రియాకులు గుమిగూడి, గలసియుండి, బ్రహ్మాండమంతను దగ్ధముచేయ గల సూర్యతాపము నడ్డుకొని, క్రిందనున్న ప్రాణికోటికి నీడనొసగి, సౌఖ్య మొందజేయుచున్నవి; పరమాణువులు పర్వతముగ గూడి జంయూమారు తము నెదుర్కొని చలియింపక నిలిచియున్నవి.

★

ప్రజాశక్తి ప్రెస్, బెజవాడ.